శ్రీరస్తు.

మార్కండేయపురాణము.

మారన కవిప్రణీతము.

చెన్నపురి:

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారిచేఁ

ప్రకటితము.

1927

All Rights Reserved

PRINTED BY
V. RAMASWAMY SASTRULU & SON
AT THE 'VAVILLA' PRESS, MADRAS.—1927

విషయసూచిక.

విషయము.			పుటసంఖ్య.
ప్రస్తావన	...	...	i-xii
పీఠిక	...	...	1
కథాప్రారంభము	..	...	7
భారతప్రశంస	...	...	7
జైమిని మార్కండేయమునిని గొన్ని ప్రశ్నముల నడుగుట ...		...	8
మార్కండేయుఁడు జైమినికి ద్రోణచరిత్రము చెప్పుట ...		...	8
తపముఁ జెఱుపవచ్చిన వపు వనునచ్చరను దుర్వాసుఁడు పక్షివగు మని శపించుట.			9
వపు వనునచ్చర చరిత్రము	...	...	10
గరుడవంశ్యుఁ డగుకంకుఁడు విద్యుద్రూపుఁ డనురాక్షసునిచేఁ జచ్చుట ...			10
కంధరవిద్యుద్రూపులయుద్ధము	...	...	10
కంధరుఁడు విద్యుద్రూపునిఁ జంపి తత్పత్నిం బడయుట ...		...	11
కంధరునివలన విద్యుద్రూపపత్ని యగుమదనికయందు వపువు జనించుట.			11
భారతయుద్ధమున తార్క్షి కడుపు చెఱి గ్రుడ్లు పడుట	...	...	11
ధర్మపక్షులయొద్దకు శమీకముని వచ్చి వానిం బెంపఁ గొనిపోవుట		...	11
ధర్మపక్షులు శమీకునకుఁ దమవృత్తాంత మెఱిఁగించుట		...	13
జైమిని ధర్మపక్షులయొద్ద కేఁగుట	...	...	16
జైమిని ధర్మపక్షుల భారతార్థములఁ బ్రశ్నించుట	...	...	16
శ్రీనారాయణవ్యూహచతుష్టయవివరణము	...	...	17
పాంచాలీభర్తృపంచకవివరణము	...	...	18
ఇంద్రుఁడే పాండవరూపంబున నైదువిధంబు లగుట	...	...	19
బలరామబ్రహ్మహత్యాప్రాయశ్చిత్త ప్రకారము	...	...	19
రైవతోద్యానవర్ణనము	...	...	20
బలరాముఁడు ప్రత్యుత్థానము చేయమి నలిగి సూతుం జంపుట		...	20
బలరాముని తీర్థయాత్ర	...	...	21
హరిశ్చంద్రోపాఖ్యానము	...	...	21
వేఁట కేఁగినహరిశ్చంద్రుఁడు విశ్వామిత్రుదరి కరుగుట ...		...	21
హరిశ్చంద్రుఁడు విశ్వామిత్రునకు సకలరాజ్యము నొసంగుట		...	23
సమస్తము విడిచి వెడలుహరిశ్చంద్రునిం గని పురజనులు దుఃఖించుట		...	24
విశ్వామిత్రుఁడు హరిశ్చంద్రుని ధర్షించుట	...	...	25
విశ్వామిత్రునిశాపమున విశ్వేదేవతలు ద్రౌపదేయులై జనించుట		...	26
హరిశ్చంద్రుఁడు కాశి కేఁగుట	...	...	26

విషయము.		పుటసంఖ్య.
రాజు కాశియందుఁ గౌశికు నిర్బంధమునం జింతాకులుం డగుట	...	26
హరిశ్చంద్రుఁ డంగడివీథిని భార్యాపుత్రుల నమ్ముట	...	28
హరిశ్చంద్రుఁడు దన్నమ్ముకొనుట	... ...	29
కొనవచ్చిన చండాలునకును హరిశ్చంద్రునకు జైనసంవాదము	...	30
చండాలదాస్యమునకై కౌశికహరిశ్చంద్రసంవాదము	... ...	30
హరిశ్చంద్రుఁడు శ్మశానవాసము చేయుట	... ...	31
హరిశ్చంద్రుఁడు శ్మశానమునఁ గల గాంచుట	.. ...	31
మృతపుత్రులైన చంద్రమతీహరిశ్చంద్రులు శ్మశానమున దుఃఖించుట	...	33
హరిశ్చంద్రునొద్దకు సకలదేవతలు వచ్చి తత్పుత్రుఁ బ్రతికించుట	...	35
స్వర్గప్రయాణవిషయమై ధర్మేంద్రహరిశ్చంద్రుల సంవాదము	...	36
అయోధ్యాపురజనులతో హరిశ్చంద్రుఁడు స్వర్గమున కరుగుట	...	37
ఆడి బక యుద్ధవృత్తాంతము	... ...	39
వసిష్ఠవిశ్వామిత్రు లన్యోన్యశాపముల నాడేలును గొంగయుంబై పోరుట	...	39
బ్రహ్మదేవుఁ డాడిబకయుద్ధము మాన్పుట	... ...	40
ఫలశ్రుతి	... ...	41
జడోపాఖ్యానము	... ...	41
జడుఁడు తనతండ్రి కుత్పాంతివిధము నెఱింగించుట	... ...	42
మనుజకుభాశుభకర్మభోగవివరణము	... ...	42
రౌరవనరకవర్ణనము	... ...	43
జంతూత్పత్తిప్రకారము	... ...	44
నరకవిధములు	... ...	45
మహారౌరవనరకము	... ...	45
తమోనరకము	... ...	46
నికృంతననరకము	... ...	46
అప్రతిష్ఠనరకము	... ...	46
అసిపత్త్రవననరకము	... ...	46
తప్తకుంభనరకము	... ...	46
అమిత కర్దమ నరకము	... ...	47
జనక యమకింకరులసంవాదము	... ...	47
విదేహరా జడిగిన ప్రశ్నము	... ...	47
వైదేహునకు యమకింకరుఁడు వెవ్వేఱుగ నారకులం జూపుట	...	48
జంతువులకు జన్మాంతరపాపములకుఁ దగుజన్మముల వివరము	...	50
నారకులు రాజును బ్రార్థించుట	... ...	52
యమభటధర్మేంద్ర వైదేహసంవాదము	... ...	53

విషయము. పుటసంఖ్య.

జనకుఁడు తండ్రికిఁ గర్తవ్యముఁ జెప్పుట 54
కౌశికుం డను విప్రుని భార్యయొక్క పాతివ్రత్యమహిమము ... 55
పతివ్రతాశాపమువలన సూర్యోదయములేక లోకములు తల్లడిల్లుట ... 57
అనసూయకును కౌశికపత్నికిని జరిగిన సంవాదము 57
బ్రహ్మవిష్ణురుద్రాంశముల సోమదత్తాత్రేయ దుర్వాసులవతరించుట ... 60
దత్తాత్రేయుని తపశ్చర్యాదిమహిమ 60
కార్తవీర్యార్జునవృత్తాంతము 61
గర్గకార్తవీర్యసంవాదము 61
దేవతలకు దత్తాత్రేయునకు జైనసంవాదము 62
దైత్యులు దత్తాత్రేయదారాపహరణంబున నశించుట 63
లక్ష్మీనివాసస్థానఫలవివరణము 63
కార్తవీర్యుఁడు దత్తాత్రేయు సేవించి యిష్టార్థములం బడయుట ... 64
అలర్కచరిత్రము, ఋతధ్వజుఁ డను నామాంతరముగల కువలయాశ్వునివృత్తాంత
మారంభించుట 65
శత్రుజిత్తుతో గాలవుఁడు స్వాశ్రమపీడఁ జెప్పుట 67
వరాహముం దఱుముచుఁ గువలయాశ్వుండు బిలముఁ జొచ్చుట ... 68
బిలమున నొకబాలికయుఁ గువలయాశ్వుండు నొండొరు మోహించుట ... 69
కుండల యనుసఖి కువలయాశ్వునితో మదాలసావృత్తాంతము చెప్పుట ... 70
కుండలతోఁ గువలయాశ్వుఁడు దనవృత్తాంతముఁ జెప్పుట ... 71
మదాలసావివాహము 72
కుండల తపమొనర్చి దివ్యగతి కేఁగుట 73
మదాలసం దెచ్చునపుడు మార్గమునఁ గువలయాశ్వునకు రాక్షసులతోడియుద్ధము 73
మదాలసాయుతుఁడగు కువలయాశ్వునిఁ దండ్రి గని యానందించుట ... 74
తాళకేతునిమాయచే మదాలస మృతినొందుట 78
శత్రుజిత్తుఁడుఁ దత్పత్నియు వైరాగ్యము నొందుట 79
కువలయాశ్వుఁడు మదాలసమరణము విని దుఃఖించుట 80
కువలయాశ్వుఁ డన్యభార్యాపరిగ్రహణముసేయ నని ప్రతిన పట్టుట ... 81
అశ్వతరుఁడు సరస్వతిని గుఱించి తపముచేయుట ... 81
అశ్వతరునకు సరస్వతి గానప్రావీణ్య మొసఁగుట 82
కైలాసమున శివుఁ డశ్వతరునిపాటకు మెచ్చి వర మొసంగుట ... 82
నాగకుమారులతోఁ గువలయాశ్వుఁడు నాగలోకమున కరుగుట ... 83
నాగేంద్రుఁడు కువలయాశ్వుని గౌరవించుట 84
అశ్వతరకువలయాశ్వులసల్లాపము 85
నాగేంద్రుఁడు కువలయాశ్వునకు మదాలస నొసంగుట 86

విషయము.	పుటసంఖ్య.
మదాలస పుత్త్రులఁ గనుట	87
మదాలస తనపుత్త్రులకుఁ దత్త్వోపదేశము చేయుట	87
మదాలస యలర్కుఁ డనుపుత్త్రునకుఁ గర్మమార్గము నుపదేశించుట ...	89
వర్ణాశ్రమధర్మనిరూపణము	91
గృహస్థధర్మనిరూపణము	92
త్రయీధేను వర్ణనము, ఆయాదేవతలకు బలిహరణవిధియు ...	92
అతిథిపూజావిధానము	93
నిత్యనైమిత్తికాదిక శ్రాద్ధనిరూపణము	94
ఏకోద్దిష్ట శ్రాద్ధనిరూపణము	94
సప్తపురుష లేపభాగాదినిర్ణయము	95
శ్రాద్ధకాలము	95
శ్రాద్ధమున నిమంత్రణీయులు	95
శ్రాద్ధమున ననిమంత్రణీయులు	96
శ్రాద్ధాచరణవిధానము	96
శ్రాద్ధమునందు వర్జ్యావర్జ్యద్రవ్యములు	97
పితృగీతలు	98
కామ్యశ్రాద్ధములు	99
సదాచారప్రకారము	99
పాత్రాదిశుద్ధి	103
బ్రాహ్మణాదుల యాశౌచప్రకారము	104
అలర్కుఁడు రాజ్యభోగము ననుభవించుట	104
మదాలస యలర్కునికొక యుంగరం బిచ్చి హితోపదేశము సేయుట...	105
అలర్కుఁడు రాజ్యము సేయుట	105
అలర్కదత్తాత్రేయసంవాదము	107
అలర్కుని యాత్మవివేకము	108
అలర్కునికి దత్తాత్రేయుం డుపదేశించిన యోగమార్గము... ...	109
ప్రాణాయామాదిలక్షణము	109
యోగవిఘ్నకార్యములు	111
యోగిధర్మములు	112
మరణసూచకము లగుస్వప్నకాద్యరిష్టములు	113
బ్రహ్మప్రాప్త్యుపాయము	114
అలర్క సుబాహు కాశిరాజసంవాదము	115
కాశీరాజునకు సుబాహుండు చెప్పిన స్వాగమన కారణములు ...	116
అడవి నలర్కునకు యోగాతిశయమున వైరాగ్యము ...	117

విషయము.			పుటసంఖ్య.
క్రోష్టికి మార్కండేయసంవాదము	...	...	121
క్రోష్టికి మార్కండేయుఁడు చెప్పిన మహదాదిభూతసర్గము		...	121
బ్రహ్మజన్మము	...	...	122
చతుర్యుగమన్వంతరకాలసంఖ్యలు	...	...	123
సురనరతిర్యగాదినవవిధసర్గములు	...	...	124
బ్రహ్మావయవములనుండి ప్రజలయుత్పత్తిప్రకారము		...	124
మనుష్యదంపతి వర్ణగుణక్రియాదులు	...	...	125
పట్టణగ్రామఘోషాదిపరిమాణము	...	...	126
గ్రామ్యారణ్యౌషధులు	...	...	127
బ్రాహ్మణాదులస్థానములు	...	...	127
ఏకాదశరుద్రసర్గము	...	...	128
స్వాయంభువమనుసంభవము	...	...	128
దక్షసర్గము	...	...	128
దుస్సహోత్పత్తి	...	...	129
బ్రహ్మ దుస్సహున కాహారాదుల నేర్పఱచుట	...	...	129
దుస్సహసంతాన దురాచారప్రకారము	...	...	131
రుద్రసర్గము	...	...	133
భృగ్వాదిసంతతి	...	...	134
మనుద్వీపవర్షాధిపతులవివరణము	...	...	134
జంబూద్వీపవర్ణనము	...	...	136
మేరువుచతుర్దిశలయందు పర్వతాదులు	...	...	138
గంగావతరణము	...	...	139
భారతవర్ష విషయము	...	...	140
శ్రీకూర్మసంస్థానవర్ణనము	...	...	141
భద్రాశ్వవర్ష వర్ణనము	...	...	142
కేతుమాలవర్ష వర్ణనము	...	...	143
కురువర్ష వర్ణనము	...	...	143
కింపురుషవర్ష వర్ణనము	...	...	143
హరివర్ష వర్ణనము	...	...	144
ఇలావృతవర్ష వర్ణనము	...	...	144
రమ్యకవర్ష వర్ణనము	...	...	144
హిరణ్మయవర్ష వర్ణనము	...	...	144
స్వారోచిష మనుచరిత్రము	...	...	145
సిద్ధప్రసాదమునఁ బ్రవరుఁ డనువిప్రుఁడు హిమవంతమున కేఁగుట		...	144

విషయము.	పుటసంఖ్య.
ప్రవర వరూథినీ సంవాదము	146
ప్రవరుఁ డగ్ని ప్రసాదంబున నిజగృహంబునఁ జేరుట	148
ప్రవర విరహము సహింపఁజాలక వరూథిని విలపించుట ...	150
కలి యను గంధర్వుఁడు ప్రవరవేషుఁడై వరూథినిని మోసగించుట ...	151
స్వరోచిర్జననము	152
ఇందీవరాక్షమనోరమాశాపవిమోచనము	152
ఇందీవరాక్షుఁడు శాపవిముక్తుఁడై స్వరోచితో నిజశాప కారణము సెప్పుట	154
స్వరోచి యిందీవరాక్షుని కూఁతు రగుమనోరమను బెండ్లియాడుట ...	154
మనోరమసఖులకు శాపవిముక్తి	155
విభావరీ కళావతులు స్వరోచికిఁ దమవృత్తాంతము చెప్పుట ...	155
స్వరోచి కళావతీ విభావరులఁ బెండ్లియాడుట	156
స్వరోచింగురించి కలహంసీచక్రవాకీసంవాదము	156
స్వరోచింగురించి మృగదంశకులసంవాదము	157
స్వరోచికి మువ్వురుపుత్త్రులు పుట్టుట	158
స్వారోచిషమను జననము	158
స్వరోచి పరలోకగతుం డగుట	159
స్వారోచిష మన్వంతరంబున దేవేంద్రాద్యధికారిపురుషుల వివరణము...	160
పద్మాదినిధి మహిమానువర్ణనము	160
ఉత్తమమన్వంతర మహిమాభివర్ణనము	162
ఉత్తముఁడు ప్రతికూల యగుతనభార్య నడవి కంపుట	163
ఉత్తముఁడు రాక్షసాపహృత యగు బ్రాహ్మణుని భార్యను దెచ్చి యిచ్చుట...	163
ఉత్తముఁడు త్రికాలజ్ఞమునివలన బహుళావృత్తాంతము దెలియుంగుట ...	167
సుశర్మ చేసిన సారస్వతేష్టిచే నందయను నాగకన్య మూఁగతనము మానుట	170
ఉత్తమ మనుజననము	171
తామసమన్వంతర మహిమానువర్ణనము	171
సురాష్ట్రునికి మృగి చెప్పిన తనపూర్వజన్మవృత్తాంతము	173
తామసమను మహిమాభివర్ణనము	174
రైవతమన్వంతరమహిమాభివర్ణనము	175
ఋతవద్గర్గులసంవాదము	176
ప్రముచదుర్గమ సంవాదము	177
ప్రముచునకు రేవతికిని సంవాదము	177
రేవతీదుర్గమవివాహము	178
రైవతమను జననము	178
రైవతమన్వంతరమున నింద్రాదులవివరణము	179

విషయము. ... పుటసంఖ్య

చాక్షుషమను జన్మవృత్తాంతము 179
చాక్షుషమన్వంతర మహిమాను వర్ణనము 179
గురుపుత్రు సానందునకును సంవాదము 180
చాక్షుషుండు మనువగుటయు; ఆమన్వంతరమున దేవేంద్రాదుల వివరణము 181
వైవస్వతమను మహిమానువర్ణనము 182
యమునికి ఛాయాసంజ్ఞ శాపమిచ్చుట 183
సావర్ణి మన్వంతరమహిమాభివర్ణనము 186
సప్తశతీప్రారంభము 189
సురథునకు సమాధి యనువైశ్యునికి సంవాదము 190
సురథసమాధులకు మేధస్సనుమహాముని చెప్పినమహామాయాప్రభావము ... 192
మధుకైటభులవలన వెఱచి బ్రహ్మయొనర్చిన యోగనిద్రాస్తుతి ... 193
విష్ణునకును మధుకైటభులకును యుద్ధము 194
తపము చేయుదితికి సుపార్శ్వమహర్షి శాప మిచ్చుట 194
బ్రహ్మయనుగ్రహమున దితికిమహిషాసురజననము 195
దేవతలచే మహిషాసురుని దౌర్జన్యంబు విని శివకేశవులు కోపించుట ... 195
హరిహరాదుల తేజఃపుంజములవలన నావిర్భవించిన దేవికి దేవతలు యుద్ధోప
కరణము లిచ్చుట 196
మహిషాసురసేనాపతులగు చక్షురాదులకు దేవికిని యుద్ధము ... 198
చక్షురుడు మొదలగు మహిషాసురసేనాపతుల సంహారము 199
దేవి మహిషాసురుని వధించుట 200
సురలొనర్చిన మహిషాసుర మర్దనీస్తుతి 201
శుంభనిశుంభులుపుట్టి విజృంభించుట 203
దేవతలుచేసిన దేవీస్తుతి 203
కాళికాగౌరీకాయకోశమునుండి యావిర్భవించి గౌర్యాజ్ఞచే హిమవంతంబున కేగుట 204
హిమవత్పర్వతంబున చండముండులు దేవిం గాంచుట 204
శుంభునియొద్ద చండముండుల దుర్మంత్రము 204
దేవియెదుట సుగ్రీవుండనుశుంభదూత చెప్పిన రాయబారము ... 205
దేవి ధూమ్రలోచనుని వానిసైన్యమును సంహరించుట 206
కాళి చండముండుల ఖండించుట 207
శుంభనిశుంభులు యుద్ధసన్నద్ధులగుట 208
సప్తమాతృక లావిర్భవించుట 209
చండికాదేవి సమర సన్నద్ధయై రాక్షససైన్యమును చెండాడుట ... 209
శాంభవి నిశుంభుని వధించుట 211
శాంభవి శుంభుని జంపుట 213

విషయము.			పుటసంఖ్య.
దేవతలు నారాయణిని స్తుతించుట	...	...	215
దేవతలకు దేవి తనభవిష్య దవతారములఁ జెప్పుట	...	...	217
సప్తశతీపఠన ఫలశ్రుతి	...	...	218
దక్షసావర్ణి మన్వాదివర్ణనము	...	...	222
రౌచ్యమను జన్మప్రకారము	...	...	223
పితృరుచి సంవాదము	...	...	223
తపః ప్రసన్నుఁడైన బ్రహ్మవలన రుచి యిష్టార్థములఁ బడయుట		...	225
రుచి దేవతల స్తుతించుట	...	...	225
పితృదేవతలు రుచికి వర మిచ్చుట	...	...	226
రుచి మాలినియను కన్యకం బెండ్లాడుట	...	...	226
రుచికి మాలినియందు రౌచ్యమనువు పుట్టుట	...	...	227
భౌత్యమను జన్మప్రకారము	...	...	227
గురువునగ్ని నశించుటచే శాంతి యనునతఁడు చింతాకులుండగుట		...	227
శాంతియగ్నిదేవుని స్తుతించుట	...	...	228
అగ్నిదేవుఁడు సంతుష్టుఁడై శాంతికి వరమిచ్చుట	...	...	229
భూతి శాంతికృత్యమునకు సంతోషించుట	...	...	229
భౌత్యమను జననము	...	...	230
భౌత్యమన్వంతరమునందలి యింద్రాదులవివరణము	...	...	230
మహారాజ వంశవర్ణనము	...	...	230
సూర్యుని జన్మప్రకారము	...	...	231
బ్రహ్మ సూర్యునిఁ బ్రార్థించుట	...	...	232
బ్రహ్మకృతసురాసురనరతిర్యగాదిసృష్టిప్రకారము	...	...	232
అదితి సూర్యుని స్తుతించుట	...	...	233
సూర్యుఁ డదితికిఁ బ్రసన్నుఁడై వరమిచ్చుట	...	...	234
మార్తాండుని యావిర్భావము తద్దర్శనమున దైత్యదానవులు భస్మమగుటయు			234
కురుదేశమునఁ దపనతాపిత యై సంజ్ఞ బడబారూపమునదపము జేయుట...			236
విశ్వకర్మ సూర్యతేజము నల్పము చేయుట	...	...	236
బ్రహ్మాదులు సూర్యుని స్తుతించుట	...	...	236
చెక్కినసూర్యుని తేజముచే శూలాదులు నిర్మించుటయు,నాసత్యరేవంతులుపుట్టుటయు			238
రాజ్యవర్ధనరాజు చరిత్రము	...	...	238
మానినీరాజ్యవర్ధనసంవాదము	...	...	239
రాజ్యవర్ధనభూపతికిఁ బౌరులకును సంవాదము	...	...	240
రాజ్యవర్ధనుని యాయుర్వృద్ధికై పౌరులు సూర్యు నారాధించుట		...	240
బ్రాహ్మణబృందము సూర్యుని స్తుతించుట	...	...	241

విషయము.	పుటసంఖ్య.
ఆదిత్యునివలనఁ బౌరజను లిష్టార్థముల బడయుట	242
రాజ్యవర్ధనునికి మానినికి నాయుర్వృద్ధి నిమిత్తముగు సంవాదము ...	242
భాస్కరు నారాధించి రాజ్యవర్ధనుఁడు తనజనులను దీర్ఘాయుష్మంతులఁ జేయుట	243
వైవస్వతమను సంతతికథాప్రారంభము	244
వృషధ్రుఁడు గోవును జంపుటచే శాపము కలుగుట	245
కన్యకై నాభాగునకును వైశ్యునకును సంవాదము	246
తండ్రియానతి నిరాకరించి నాభాగుఁడు కోమటికన్నియం బెండ్లాడుట ...	247
పరివ్రాజుఁడను ముని దృష్టనాభాగులయొద్ద ముసిగించుట... ...	248
వైశ్యకన్యం బెండ్లాడుటచే నాభాగుఁడు వైశ్యుఁడగుట... ...	248
నీపుఁడను రాజర్షివలన భనందనుఁ డస్త్రములెల్ల నార్జించి చేసిన శత్రువధాదికము	248
నాభాగునితో సుప్రభ చెప్పిన తనజనకుని పూర్వజన్మవృత్తాంతము ...	249
నలుని శాపాగ్నిదగ్ధుఁ గావించి యాచించుసుదేవునిఁ బ్రమతి రక్షించుట	250
నాభాగునికి సుప్రభ చెప్పిన తనపూర్వజన్మవృత్తాంతము... ...	250
విదూరథునితో సువ్రతుఁడను ముని చెప్పిన కుజంభముసలవృత్తాంతము ...	252
కుజంభునివధింపనేఁగిన విదూరథసుతులచట బద్ధులగుట	253
వత్సంధ్రుండు కుజంభుని వధించుట	253
వత్సంధ్రుఁడు విదూరథపుత్రిక యగుముదావతిని బెండ్లాడుట ...	254
వత్సంధ్రసంతతి	257
ఖనిత్ర చరిత్రము	258
విశ్వవేది దుర్మంత్రమువలన శౌరి మొదలగువారు నశించుట ...	259
తమ్ములు మొదలగువారు నశించుటచే దుఃఖితుఁడై ఖనిత్రుఁడు దివికేఁగుట...	260
క్షుపచరితము	261
వివింశపుత్రుఁడగు ఖనిత్రుని చరిత్రము	262
ఖనిత్రమృగసంవాదము	262
కరంధముఁ డను నామాంతరముగల బాలాశ్వునివృత్తాంతము ..	265
బలాశ్వునకు వీర యనుదానియందు అవేక్షితుఁడు పుట్టుట ...	266
అవేక్షితుని బెక్కురాజకన్యలు వరించుట	266
అవేక్షితుఁడు విశాలాస్వయంవరమున నెదిర్చి రాజుల నోడించుట ...	267
పరాజితులగు రాజు లవేక్షితునితో యుద్ధసన్నద్ధులగుట	267
శత్రురాజులు నవేక్షితుఁడును స్వయంవరనిమిత్తము ద్వంద్వయుద్ధము చేయుట	267
అధర్మయుద్ధమునఁ బరరాజు లవేక్షితునకు బంధాదు లొనరించుట ...	268
కరంధముఁడు భార్యాప్రేరితుఁడై యవేక్షితు విడిపించుట ...	269
వివాహనిమిత్తము వైశాలినివిశాలకరంధమావేక్షితుల సంవాదము ...	270
వైశాలిని యరణ్యమునఁ దపము సేయుట	271

విషయము.			పుటసంఖ్య.
దేవదూత వైశాలిని మరణోద్యమమును నివారించుట	...	...	272
కిమిచ్ఛకవ్రత మహిమన నవీక్షితునకుఁ బెండ్లిపూని పుట్టించుట		...	272
దృఢకేశుంజంపి యడవియం దవీక్షితుండు వైశాలిని బ్రోచుట		...	273
దేవత లవీక్షితునకు వరమొసంగుట	...	...	275
వైశాలిని యవీక్షితునకు నిజవృత్తాంతముఁ జెప్పుట	...	...	275
అవీక్షితునితో వైశాలిని నాగలోకవృత్తాంతము చెప్పుట		...	276
గంధర్వుఁ డవీక్షితునకు వైశాలినీ జన్మరహస్యము దెలుపుట		...	277
వైశాలిన్యవీక్షితుల వివాహము	...	...	277
వైశాలినియుం నవీక్షితుఁడును గంధర్వలోకమునకేఁగి విహరించుట		...	277
మరుత్తు జననము	...	...	278
పుత్రాదులతో నవీక్షితుఁడు నిజనగరమున కేఁగి తండ్రిఁ దనుపుట		...	279
కరంధముఁడు మరుత్తునకుఁ బట్టాభిషేక మొనర్చియడవి కేఁగుట		...	280
మరుత్తచక్రవర్తి చరిత్ర	...	...	281
మరుత్తునితో ముని చెప్పిన నాయనమ్మ సందేశము	...	...	281
మరుత్తుఁడు సంవర్తాస్త్రముచే నాగలోకముఁ దపింపఁజేయుట		...	282
భామినివాక్యమున నవీక్షితుఁడు పాముల రక్షింపఁ బ్రతిజ్ఞచేయుట		...	284
పాములకై మరుత్తావీక్షితుల సంవాదము	...	...	284
ఫలశ్రుతి	...	...	287

ప్రస్తావన.

ఈమార్కండేయపురాణము వ్రాసినకవి మారన. ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు. తిక్కనామాత్యునికుమారుఁడు. ఉభయకవిమిత్రుఁడు. కవిచూడామణి యగుతిక్కనసోమయాజిశిష్యుఁడు. తనమార్కండేయపురాణము నీకవివర్యుఁడు కాకతీయవంశభూషణుఁ డగుప్రతాపరుద్రచక్రవర్తియొద్ద సేనాని యగుగన్నయ్యకుఁ గృతియొసంగెను. ఈగన్నయ నియోగి యనియు, రామాయణము మడికిసింగనవలనఁ గృతినొందిన కందనమంత్రికిఁ దాత యనియు, రావుబహాదూరు వీరేశలింగము పంతులుగారు కవులచరిత్రమున వ్రాసియున్నారు. చిలుకూరివీరభద్రరావుగా రాంధ్రులచరిత్రము రెండవభాగములో గన్నమంత్రి కమ్మసేనాని యని వ్రాసియున్నారు. మార్కండేయపురాణములోనికృత్యాది యీయుభయుల నిర్ధారణమునకు వ్యతిరేకముగ నున్నది.

మ. అమలంబుల్ ద్విజరాజవర్ధనము మర్యాదాన్వితంబుల్ గుణో
త్తమరత్నంబు లనంతభోగమహిమోదారంబు గాంభీర్యధు
ర్యము శ్రీజన్మగృహంబు నై శుభయుతం బై యాచతుర్థాన్వయం
బమృతాంభోనిధిమాడ్కి నుర్విఁ గడుఁబొల్పారుఁ జనస్తుత్య మై.

(పీఠిక. ప. 29.)

ఆ. ఆచతుర్థకులసుధాంబుధి నుదయించె
నమితకాంతిచంద్రుఁ డవనిధరణ
దిగ్గజేంద్రమును వితీర్ణిమందారంబు
దుల్లసైన్యవిభుఁడు మహితకీర్తి.

(పీఠిక. ప. 30.)

పై పద్యములవలనఁ గృతిపతి యగుగన్నయసేనాని శూద్రుఁడని మాత్ర

ము తేలుచున్నది. కమ్మసేనాని యనియు, నియోగియనియు వాకొనుటకాధారము లున్నటులఁదోఁపదు.

మఱియు నీగన్నయసేనానిని, వీరేశలింగము పంతులుగారు, వీరభద్రరావుపంతులుగారు సమముగ గన్నమంత్రి యని వ్యవహరించిరి. ఇతనికి మంత్రి యనువిశేషణ మున్నటుల గ్రంథాధారములు లేవు. చూడుఁడు.

శ్రీగన్నసైన్యాధిపున్	(పీఠిక. ప. 2.)	గన్నసైన్యవిభుఁడు	(పీఠిక. ప. 39.)
గన్నరథినీపాలున్	(పీఠిక. ప. 3.)	గన్నరథినీపతికిన్	(పీఠిక ప. 46.)

కమ్మదొర యనియు నియోగి యనియుఁ గృతికర్తను వ్యవహరించుట యెట్లు భ్రాంతియో మంత్రి యని పేర్కొనుటయు నటులె భ్రాంతి.

గన్నయసేనానిశాసనములు నిజాముమండలమున మేము శోధించినంతలో నెచ్చటను లభింపలేదు కావున ప్రకృతకథకుఁ జరిత్రాంశములు మార్కండేయపురాణమునుండి యార్జింతము. గన్నవిభుఁడు సేనానాయకత్వము రాజచిహ్నములు ప్రతాపరుద్రుని పరాక్రమముచే మెప్పించి యార్జించినటుల నీపద్యమువలనఁ దెల్లమగుచున్నది.

చ. ఎలమిఁ బ్రతాపరుద్రమనుజేంద్రునిచేఁ బడసెన్ బ్రవీణుఁడై
గెలిచియుఁ శౌర్యలీల రిపుకోటి రణావనిఁ గీటడంచియుం
బలరిపుతుల్యవిక్రముఁడు నాగయగన్నవిభుండు తేజమున్
విలసితరాజచిహ్నములు విశ్రుతలక్ష్మియు నాయకత్వమున్. (పీఠిక ప. 40.)

దీనింబట్టి ప్రతాపరుద్రచక్రవర్తి రాజ్యపాలనమునకు వచ్చిన పిమ్మట(అనఁగా: మధ్యవయస్సున) గన్నయ సేనానాయకపదవి నొందియుండును. కృతి నటుపిమ్మట స్వీకరించియుండును ప్రతాపరుద్రుఁడు 1295 (క్రీ. శ.) మొదలు 1321 వఱకుఁ బాలించుటచే గన్నయ కృతి నందినకాలము రమారమి 1310 ప్రాంతములలో నని యూహింపనగు.

గన్నయవంశము పరాక్రమభూషిత మైనది. ఇతనితాత మల్ల విభుఁడు సేనానాయకుఁడు. తండ్రి కాకతీయగణపతి యనుంగుతలవరి యగుమేచయకు నల్లుఁడు. తాను ప్రతాపరుద్రునిసేనాని. తమ్ముఁడు ఎల్లయ్య రాజనీతిజ్ఞుఁడు. కడసారితమ్ముఁడు మేచయ ప్రతాపరుద్రుని సేనాని మహాధికారి అప్పుఁడు ఇట్టి పవిత్రవంశసంజాతుఁ డగుగన్నయ కృతి స్వీకరింప వాంఛించుట మారనయంతకవి కృతి యొసంగుటయుఁ ద్రిలింగభాషాసుకృతము.

కృత్యాదియందలి "ప్రతాపరుద్రదేవ సామ్రాజ్యవర్ధన స్థిరవినీతి కరణ కుశలుఁడు. అనువాక్యముచే గన్న సేనాని ప్రతాపరుద్రుని చెంత రాజకీయ కార్యధురంధరుఁ డనియు కాకతిప్రోతలాధీశకటకపాలుఁడు అను వాక్యముచే గన్న సేనాపతి ఏకశిలానగరపరిపాలకుఁ డనియుఁ దెలి యును. గన్నయ్య సేనాని జీవితమును బరాక్రమాదికమును దెలుపు శాసనములు లేవనఁజాలము నిజామురాష్ట్రమునందలి యాంధ్రభాగ మునఁ గాకతీయుల సేనానాయకులు నెలకొల్పిన శాసనములు వేలకొలఁది గలవు. వాఙ్మయసేవాధురంధరుఁడగు గన్న సేనాని శాసనము లింత వఱకు లభింపకుంట సంతాపకరము.

మార్కండేయపురాణము కృత్యాది, ఆశ్వాసాంతపద్యములు చూడ గన్నయసేనాని రూపవంతుఁ డనియుఁ బరాక్రమశాలి యనియుఁ బ్రభుభక్తిపరాయణుఁ డనియుఁ దేలుచున్నది. అంతియ కాక—

ఉ. వారవిలాసినీవదనవారిజమిత్ర! సమగ్రవిద్విష
ద్భూరుహవీతిహోత్ర! గుణభూషణభూషితగాత్ర! నిర్మలా
చారపవిత్ర! సూరిజనచైత్ర! వివర్ధితగోత్ర! భూమిజం
కేదుమాకేళిలాలసితకీర్తిరమేశ్వర భూజితేశ్వరా. (ఆ7. 285.)

పై పద్యమువలన గన్నయసేనాని వారవధూలంపటుఁ డని తెలి

యుచున్నది. ఇందులకు లక్ష్యము మఱికొన్ని విశేషణములు మారన వాడియున్నాఁడు. చూడుఁడు.

భామినీచిత్తధామా; భామినీపంచబాణా; మారాస్త్రదళితచేతో, నారీజనసుప్రసన్న; ప్రౌఢస్త్రీమకరాంకా; కామినీభద్ర; బాలాగలికేళీ పాంచాలా;

గన్నసేనానియందు వారస్త్రీలోలత్వ మున్నటుల పైవిశేషములతో బలపఱుచవచ్చును. మనసేనానికిఁ బాలకుఁ డగుప్రతాపరుద్రచక్రవర్తియు వారకాంతాలోలుఁ డని వల్లభామాత్యుని క్రీడాభిరామము వాకొనుచున్నది.

శా. ద్వీపాంతంబున నుండి వచ్చితివె భూదేవ! 'ప్రశాంతం మహా
పాపం' శర్వజగత్ప్రసిద్ధుమనో బాణాసనామ్నాయవి
ద్యోపాధ్యాయుప్రతాపరుద్రధరణీగోపాల త్తగోష్ఠీప్రతి
ష్ఠాపారీణ నెఱుంగ వయ్యోదవు మాచల్దేవివారాంగనన్. (క్రీడాభిరామము)

కాకతీయులరాజ్యవిజృంభణకాలమందు పలువురు సేనానాయకులు తలవరులు దేవళములు కట్టించి కృతులు స్వీకరించి దానము లొనర్చి స్థిరకాయు లైరి. వారివారిపవిత్రజీవితాదర్శములు నేఁటికిఁ గనుమాయకున్నవి.

మారనకవి.

ఇతఁడు తిక్కనసోమయాజిపుత్త్రుఁ డని కొందఱు అనుచున్నారు. ఇది సమంజసము కాదు. గురునామము పితృనామము నొకటిగనుంటచేఁ గలిగినభ్రాంతియే యిది.

గద్య. "శ్రీమదుభయకవిమిత్ర తిక్కనసోమయాజిప్రసాదలబ్ధసరస్వతీపాత్ర తిక్కనామాత్యపుత్త్ర"

ఇట్లు గద్యలో మారనకవి జనకుఁ డగుతిక్కనామాత్యుని వేఱుగను గురుఁ డగుతిక్కనసోమయాజిని వేఱుగను వాకొని యున్నాఁడు.

ఇతఁ డింక నేమేని గ్రంథము లొనరించినటుల దెలియరాదు. కవి యొక్క పవిత్ర మగుజన్మస్థానము నేని తెలిసికొన నాధారములు లేవు. కవిస్తుతిలో నీతఁడు నన్నయ్యను తిక్కనసోమయాజిని మాత్రమే స్తుతి చేయుటచే నెఱ్ఱాప్రగడభారతభాగము వ్యాప్తికి రానిభాగమున నీకవి యున్నటు లూహింపవచ్చును. మారన గొప్పలాక్షణికకవి. కవిత్వము సరళముగ శ్రావ్యముగ దేశీయములతో నిండియుండును. రసపోషణసంవిధానమున నీకవి తనలేఖినిని మనోభావప్రకటనమునకే నియోగించుచుండును. మొత్తముమీఁద నీకవి కథాంశములఁ గ్లుప్తముసల్పి సముచితము లగువర్ణనలకుఁ దా వొసంగి కావ్యనిర్మాణ మొనరించుటలో మిగుల నేర్పుగలవాఁడు. వర్ణనాంశములకంటె కథాంశములకే యీ కవి విలువ గలతనకావ్యమునఁ దావొసంగును. ఈయంశమునను ఈతఁడు తిక్కనసోమయాజిశిష్యుఁ డని చెప్పఁదగినవాఁడె.

వివిధన్యాయాధ్యాత్మికకథాబంధుర మగునీపురాణమున నెటులో నీలు గలిగించికొని తనసహజకవితాధారతో నాయికల దివ్యస్వరూపములు సాత్వికశృంగారరసముతో నీకవి మనోహరముగఁ జిత్రించియున్నాఁడు. ప్రతిబింబము లిటు లుండ మాతృక లెటు లుండునో యను భ్రాంతి యీయనకవిత్వ మెల్లరకుఁ గలిగించుచుండును. చూడుఁడు.

శృంగారము:—

ఉ. ఆననమోముచెన్ను శశియందును బంకరుహంబునందు లే
దానయనప్రభాతి మదనాస్త్రములందు మెఱుంగులందు లే
దానును మేనికాంతి లతికావలియందుఁ బసిండియందు లే
దానలినాయతాక్షి లలితాకృతి నామదిఁ బాయనేర్చునే. (ఆ. 2. 161)

సీ. మెఱయుఁ గ్రొమ్మెఱుఁగులమించును మెలఁతగా మీనకేతనుఁడు నిర్మించినట్లు
చారుశృంగారరసముచేత నింతిగా నించువిల్తుండు చిత్రించినట్లు
నవకల్పలతికల నవకంబు నాతిగా శ్రీనందనుఁడు సంతరించినట్లు
నిండారుచందురునిను పారునునుఁగాంతిఁ జెలువుగా మరుఁడు సృజించినట్లు

తే. విస్మయంబైన లావణ్యవిలసనమునఁ
బొలుచునమ్మదాలసఁ జూచి భూపసుతుఁడు
విగతలజ్జుఁడై నసుఁబాసి వెలఁది యెందుఁ
బోయి తనుచు రాదటఁ జేరఁబోవుటయును. (ఆ. 3. 93.)

ఇట్లే శృంగారరసము నీకవి సర్వాంగవర్ణనము లొనరింపక భారతకవుల మార్గము ననుసరించెను. ధారాళముగ నీకవికవితాధార తిక్కన సోమయాజి భారతకవిత్వమునకుఁ బోలిక కలదిగఁ గన్పట్టును. వర్ణనాంశములయందు ముఖ్యముగ సోమయాజిభారతభాగముల మనసున నుంచికొని వ్రాసినటుల నుభయగ్రంథములు సమగ్రముగ శోధించినఁ దోఁపక పోదు. నిదర్శనము చూడుఁడు.

సీ. చంచులఁ జిగురాకుఁ జించి యాడుచు నలి, చెలఁగిచ్చగండుకోయిలలసొంపు
నలరుఁ దేనియఁ గ్రోలి యెలయుసోలంబున, మఱియు తేఁటులనును మ్రోఁతయింపుఁ
దమిపండ్లరస మాని తమలోనఁ బలుకుచుఁ బల్కురాచిల్కలపదుపురంగు
గొలఁకులఁ గెలఁకులఁ గూడి క్రీడించుచుం, దెదునంచతండంబునదబెడంగు
తే. దరగఁ దేలుచుఁ బూదీఁగఁ దగులువడుచు
వచ్చుచిఱుగాలిసోఁకున కిచ్చ మెచ్చి
తగిలి కొనియాడుచును వినతయును గద్రు
వయును మున్నిటిచేరువవనమునందు. (తిక్కనసోమయాజి. భారతము.)

సీ. విరులగుత్తులమీఁద గురువులు వాఱుచు ముద్దిచ్చుతేఁటులమొరపములకుఁ
జిగురుజొంపములలోఁ జిట్టుముట్టాడుచుఁ గెరలుకోయిలలనుస్వరములకును
నెలమావిలతలపైఁ గలఁ గొనఁ దారుచుఁ బెలఁగుచిల్కలకల్కిపలుకులకును
నలరులనెత్తావి నెలమిగాఁ జిలుకుచు నుడియుమందానిలుసొంపునకును
తే. గళవళించుచు గొందమ్మికొలఁకులందుఁ
గెలియొనరించు జక్కవమేటిలీలఁ
గోర్కులంతంతకును నెడఁ గొనలు నిగుడ
మదనమార్గణవిదళితహృదయ యగుచు. (ఆ. 5. 7.)

ఇట్లు పరిశోధించినఁ దిక్కనసోమయాజి పద్యములపోలిక గలపద్యములు మార్కండేయపురాణమునఁ గలవు. దీనిచే గురునికవిత్వముపై శిష్యున కెంత యాదర మున్నది గ్రహింపవచ్చును. నన్నయభట్టారకుఁడు మొదలు శ్రీనాథకవివఱకుఁ గలమహాకవుల గ్రంథములలో సామాన్యముగ గురుస్తుతి కానరాదు. ఇది యాకాలమున ననుచారముగ లేదని తోఁచుచున్నది. గురుస్తుతి అల్లసాని పెద్దనాఁటనుండి యథేచ్ఛగ గ్రంథములలోఁ జలిపి రని యూహింపవచ్చును. ఈమార్గమున కల్లసానిపెద్దనకుఁ ద్రోవఁ జూపినవాఁడు మనమారనకవియే. ఒకగురుస్తుతికే కాదు. స్వారోచిషమనుసంభవకథాదాతయు నూతనభావప్రదాతయు నీతఁడే. అల్లసానికవి మార్కండేయపురాణమునందుఁ బ్రమాణభావముఁగలవాఁ డని యాతనిపద్యరచనవలన స్పష్టపడుచున్నది.

ఉ. ఈసుకుమారుఁ డెవ్వఁడొకొ యిందుల కెందులనుండి వచ్చెనో
భాసురరూపకాంతి జితభావజచంద్రుఁ డితండు రాగలీ
లాసరసత్వ మొప్పఁ గడులాలసుఁడై నను జూచె నేని నేఁ
జేసినపుణ్య మెవ్వరును జేయరు కాముని దక్క. నేలుదున్. (మార్కండేయ)

ఉ. ఎక్కడివాఁడొ యక్షతనయేందువసంతజయంతకంతులన్
జక్కఁదనంబునన్ గెలువఁజాలెడువాఁడు మహీసురాన్వయం
బెక్కడ యాతనూవిభవ మెక్కడ యేలని బంటుగా మరున్
దక్కఁగొనంగ రాదె యకటా నను వీఁడు పరిగ్రహించినన్. (మనుచరిత్రము.)

గీ. అనఘ! మందార విద్యాధరాత్మజన్మ, నే విభావసి యనుదాననెలమి నీకు
నెల్లభూతభాషలు మది నెఱుఁగునట్టి, విద్యయును నన్ను నిచ్చెద వేగఁ గొనుము.
(మార్కండేయపురాణము.)

గీ. అనఘ! మందారవిద్యాధరాత్మభవను, నను విభావసి యండ్రు గంధర్వవరులు
తెలిసియుండుదు నిమ్మహీతలమునందుఁ, బరగు మృగపక్షిజాతులభాష లెల్ల.
(మనుచరిత్రము)

పై నుదాహరించినపోలికలచేఁ బెద్దనకవియు మారనయందుఁ బ్రమాణభావము కలవాఁ డని యూహింపవచ్చును. ప్రౌఢకవిమల్లన తనరుక్మాంగదచరిత్రమున వర్ణించిన యమలోకవర్ణనము కూడ మార్కండేయపురాణములోని ద్వితీయాశ్వాసమునుండి సంగ్రహింపఁబడిన దని వివిధాధారములచే స్థాపింపవచ్చును. వ్యాసము విస్తరమగు నని సూచించితిమి. శంకరకవి హరిశ్చంద్రోపాఖ్యానము, మట్ల అనంతభూపాలుని బహుళాశ్వచరిత్రము, పెద్దనమనుచరిత్రము, నీమార్కండేయపురాణమునుండి గ్రహింపఁబడినకథాభాగములు గలవని తెలియుచున్నది. శంకరకవి హరిశ్చంద్రకథకు నీపురాణమందలికథకు వ్యత్యాస మెక్కుడుకలదు. మార్కండేయపురాణములోని హరిశ్చంద్రకథ ననుసరించి సంస్కృతమునఁ జండకౌశిక మనునాటకము వ్రాయఁబడినది. సమష్టిమీఁద నీనాటకము మార్కండేయపురాణకథ కెక్కుడుమార్పుఁ గల దన వీలుండదు. శంకరకథకంటె నీపూర్వకథయే సందర్భశుద్ధిగ నున్నది. శంకరకవి హరిశ్చంద్రచరిత్రములోని కంటె మార్కండేయపురాణ హరిశ్చంద్రకథలోని విశ్వామిత్రపాత్రము చక్కఁగఁ బోషింపఁబడి యున్నది. ఇది రసికు లెఱుంగనిది కాదు.

మార్కండేయపురాణము.

బ్రాహ్మ, పాద్మ, వైష్ణవ, శైవ, భాగవత,నారదీయ,మార్కండేయ ఆగ్నేయ, భవిష్య, బ్రహ్మకైవర్త, లైంగ, వారాహ, స్కాంద, వామన, కౌర్మ, మాత్స్య, గారుడ, బ్రహ్మాండము లనుపదునెనిమిదిపురాణములలో మార్కండేయపురాణ మేడవది.నిరుపమ మగునిష్ఠతో మార్కండేయుఁడు తప మాచరించుతఱి వ్యాసమహర్షిశిష్యుఁడును విద్యానిపుణుఁడు నగుజైమిని యాతనిదర్శించి ''సర్వలోకరక్షాధురంధరుఁడు శ్రీవిష్ణువు మనుష్యత్వ మేల నొందె? పాండవపంచకమునకు ద్రౌపది యొక్కతె యెట్లు కుటుంబినియయ్యె? బలరామునకుఁ దీర్థయాత్రల

కరుగుతటి బ్రహ్మహత్య యెట్లు ప్రాప్తించె? పాండవేయు లగు ద్రౌపదీతనయులు గృహస్థాశ్రమ మవలంబింపకమున్న యేలగతించిరి? ఈసందియములు భారతము పఠించుటచే నాకుఁ గలిగినవి. వీనిం దీర్పు"మన మార్కండేయుఁడు "మాకిదియనుష్ఠానకాలము గాన వింధ్యపర్వతమున ధర్మపక్షులుగలరు. వారివలన నీసంశయము తీఱు"నన జైమిని యట్లు వింధ్యానగవాసు లగుఁ బక్షులఁ బ్రశ్నింప నాల్గవ ప్రశ్నకుఁ బ్రత్యుత్తరముగ హరిశ్చంద్ర చరిత్రము వాక్రుచ్చిరి జైమిని మఱల ధర్మపక్షులను డాసి జీవులగర్భజన్మకర్మానుభవాదులం గుఱించి ప్రశ్నింపఁ బితాపుత్రసంవాద మనునుపాఖ్యాన మారంభించి క్రమముగఁ బిండోత్పత్తి జననమరణములు నరకాదిగతులు కీటకపక్షిగర్దభాదిజన్మంబులు మదాలసాపుత్త్రుం డైనయలర్కునకు దత్తాత్రేయుఁడు బ్రహ్మవిద్య నుపదేశించుట లోనగువిశేషములు వాకొన జైమిని యాశ్చర్యమంది క్రమ్మఱ సృష్ట్యాదులం గూర్చి ప్రశ్నింప మార్కండేయుండు క్రోష్టికి నుపదేశించిన తెఱంగున సృష్టిప్రళయములను స్వాయంభువ, స్వారోచిష, ఉత్తమ, తామస, రైవత, చాక్షుష, వైవస్వతు లను భూతవర్తమానమనువుల యంతరమును జెప్పిరి. సురథుఁ డనురాజు రాజ్యభ్రష్టుఁ డై మృగయామిషంబున మేధోమహాముని యాశ్రమసమీపముఁ జేరి సమానచింతుఁ డగు సమాధి యను వైశ్యుని గలసికొని పరస్పరసుఖప్రశ్నల ముగించికొని తమ యవస్థలఁ దన్మునికి విన్నవించి దేవ్యుపాసనముచే నుత్తమగతిఁ బడసిరను కథయు, దక్షసావర్ణి, బ్రహ్మసావర్ణి, రుద్రసావర్ణి, రౌచ్య, భౌత్యలను రాఁగలమనువుల జన్మాదివృత్తాంతము సూర్యప్రభావమున కుదాహరణముగ రాజ్యవర్ధనచరిత్రము, వైవస్వతమనుసంతతిజాతు లగు పృషధ్ర, నాభాగ, వత్సంధ్ర, ఖనిత్ర, క్షుప, కరంధ, మావేక్షిత మరుత్తచరిత్రములను ధర్మపక్షులు జైమినికిఁ దెలిపిరి. మారన మూలమునుండి యింతవఱకె యాంధ్రీకరణ మొనరించెను. మరుత్తునిపుత్త్రుఁ డగు

నరిష్యంతునియొక్కయుఁ బౌత్రుఁ డగుదమునియొక్కయుఁ గథల మారనకవి తెలిఁగింపలేదు.

మొత్తమున మారనకవి యాంధ్రీకరణము భారతాంధ్రీకరణముకంటె మూలమునకుఁ జేరువగ నుండును. ఆవిషయ ముభయగ్రంథములఁ బఠించిన ద్యోతకము కాఁగలదు. మారనకవి భావోద్రేకము గల చోటుల నతివ్యాప్తిగఁ గథల కందనివర్ణన వ్రాయువాఁడు కాఁడు. గాన నీతనికథాప్రణాళిక శ్లాఘనీయముగ నున్నది. ప్రౌఢకవిమల్లన రుక్మాంగదచరిత్రములో మారనకవి నరకవర్ణనము నే యనుసరించుటయు, నల్లసాని పెద్దనార్యుఁడు మనుచరిత్రమున మార్కండేయపురాణము ననుసరించుటయు నీకవివర్యుఁడు కవిజనసంభావ్యకవితావిభాసురుఁ డని తెలుపును. మారన కవితాచాకచక్యము, కథాకల్పనము, భావనాప్రదీపనముఁ గాంచఁదలంచిన, ద్వితీయాశ్వాసమునందలి కౌశికునిభార్యపాతివ్రత్యమహిమముఁ బఠించినఁ జాలును. వర్ణనాసందర్భమునఁ బాత్రపోషణమున మారన యసాధారణుఁడు. మారన కథాభాగములోని దుఃఖరసపద్యములు భారతస్త్రీపర్వములోని తిక్కనసోమయాజి పద్యములకు గురుశిష్యన్యాయముఁ జూపును. పరిశీలింపుఁడు.

చ. ఉరగముచేతఁ జచ్చినతనూద్భవునిం గని శోకవేదనా
పరవశయున్ వికీర్ణకచభారయు నుద్గతబాష్పపూరయున్
గరతలతాడితాస్యయును గద్గదికావికలార్తనాదయున్
జరణవిపర్యయాపగతసత్వరయానయు నై పొరిం బొరిన్.

లోహితాస్యునిఁ గాంచినప్పటిహరిశ్చంద్రగేహినిస్థితి మారనకవి యెంతశ్రావ్యముగ నెంతనైజముగ నెంతప్రత్యక్షముగ నెంతతాద్రూప్యము వాకొనెనో పరిశీలించిన రసజ్ఞులకు మారనకవి కవితాపీఠమున నెట్టియుత్తమస్థాన మలంకరింపఁదగువాఁడో తెలుపఁ బనియుండదు.

ఉ. పోరనఁ బొంగి శోకరసపూరము నిర్భరబాష్పపూరము
ల్వారక కన్గవం దొఱఁగ వాతెఱలాలలు గ్రమ్ముదేఱ హా
హారవముల్ సెలంగ విరియంబడి వేనలి ధూళిఁ గ్రుంగ న
య్యారటమిం బట్టిఁ జేర్చుకొనుచుం గోమలి మేదినిఁ జేతులూఁదుచున్.

ఈపద్యపటమునఁ జిత్రితలైన హరిశ్చంద్రగేహినుల నంతరంగ దృష్టితోఁ బరిశీలించినఁ దత్కాలోచితసహజస్థితులు కనులముందు నటించినటు లుండును. "కంఠస్తంభితబాష్పవృత్తికలుషః చింతాజడం దర్శనం" అను నభిజ్ఞానశాకుంతలములోని కణ్వవచనమునకు "శోకరసపూరము నిర్భరబాష్పపూరముల్ వారకకన్గవందొరఁగ" యను మారనకవివచనము మెఱుంగుఁబెట్టుచున్నది. కావ్యోచితము లగుసుగుణము లీమారనకవిగ్రంథమున నెన్నియో గలవు. కవిజనసమాదరణీయము లగు నీసుగుణముల వాకొనుటకంటెఁ బాఠకలోకమునకే యాభారము వదలుట యుక్తము.

సరస్వతిపత్రికలో నీగ్రంథము తొలుత ముద్రింపఁబడినది. దాని నాధారముచేసికొని ముద్రించుటచేఁ బూర్వముద్రిత ప్రతియందుఁ గొన్నిదోషములు పడినవి. తాళపత్రగ్రంథసహాయమునను బదునాల్గవశతాబ్దము నాఁటి యాంధ్రభాషానియమముల ననుసరించియుఁ గవ్యభిప్రాయానుసారములగు పాఠములను గ్రహించి ముద్రణస్ఖాలిత్యములు ఇతరదోషములు సవరించి ప్రతిని ద్వితీయముద్రణమునకు శ్రమమీఁద సిద్ధపఱుపఁగలిగితిమి. పరగ యనుపదము సార్ధబిందుకమని శబ్దరత్నాకరకారు లొక యుదాహరణము మార్కండేయపురాణము నుండి యొసంగియున్నారు. ఆ యుదాహరణ పద్యభాగ మీగ్రంథమునఁ గానరాదు శాసనములందు ఇతరకవుల ప్రయోగమునందు పరగపదము బిందురహితముగాఁ గనుపట్టుచుంటచే నిందారూపమునే తీసికొంటిమి. ఎఱ్ఱాప్రగడ హరివంశములు బ్రదుకు అనుపదము రెండుతా

వులఁ బ్రాసలోఁ బ్రయోగించెను. మారన యొకచోటఁ బ్రయోగించెను. పూర్వకవులలోఁ బలువురు బ్రదుకు అనురూపమును దీసికొనియున్నారు బ్రతుకు ఆధునికరూపము. కాన సర్వత్ర బ్రదుకు అనియేయుంచితిమి ఇటులె యాధునికపరిశోధకుల మతము ననుసరించి కొన్నిచోటుల స్వల్ప సంస్కరణములఁ గావించితిమి. గుణదోషములు పాఠకులు గ్రహింపఁగలరు.

నందిగామ
1-7-27.

ఇట్లు, భాషాసేవకులు,
శేషాద్రిరమణకవులు, శతావధానులు.

శ్రీరస్తు.

మార్కండేయపురాణము.

పీఠిక.

విష్ణుస్తుతి.

శ్రీతరుణీముఖోజ్జ్వలశశిద్యుతియు న్పృథుకౌస్తుభార్కబా
లాతపదీప్తియు న్నిజభుజాంతరరమ్యనభస్థలి న్బరి
స్ఫీతవిచిత్రభాతి విలసిల్లఁగ నొప్పురమావరుండు సం
ప్రీతిఁ గృతార్థుఁ జేయుతను శ్రీనిధి నాగయగన్నధీనిధిన్. 1

శివస్తుతి.

మ. కరుణాసాంద్రపయఃప్రపూర్ణమును రంగద్దోస్తరంగంబుఁ బ్ర
స్ఫురదాకల్పభుజంగమాంబుచరమున్ శుంభజ్జటావిద్రుమో
త్కరము న్గాంతిసుధోదయంబు నగు నుద్యచ్ఛంకరాకారవా
ర్ధి రమావర్ధనుఁ జేయుఁ గాత సుగుణున్ శ్రీగన్నసైన్యాధిపున్. 2

బ్రహ్మస్తుతి.

మ. హరినాభీకమలంబు జన్మసదనం బై వేదము ల్పల్కు లై
తరుణీరత్నము వాణి పత్ని యయి విద్య ల్భూషణశ్రేణి యై
చరభూతాచరభూతజాలము లొగి న్సంతాన మై యెంతయు
న్బరగ న్బొల్చువిరించి గన్నరథినీపాలు న్సుఖి న్జేయుతన్. 3

విష్వక్సేనస్తుతి.

శా. రంగద్గండతటీసమగ్రమదధారాగంధలోభభ్రమ
ద్భృంగీమంజులగీతి వీనుల కతిప్రీతిం గడ ల్కొల్ప స
ర్వాంగంబు ల్పులకాంకితంబుగఁ గడు న్హ్లాదాత్ముఁ డై యొప్పు న
త్తుంగాంగు న్గజవక్త్రు మాతు నభివక్త్రుం గాఁ బ్రశంసించెదన్. 4

సరస్వతీస్తుతి.

ఉ. ఆరయ నొక్కభంగిగ రహస్యపుఁజోటను రాజసన్నిధిన్
సూరిసభాంతరంబులను జొప్పడి తప్పక గద్యపద్యముల్
దోరలు పేర్చినట్లు మదిఁ దోఁపఁగఁ జేయుట సంతతంబు నా
భారము కాదె వీని కనుభారతి మాకుఁ బ్రసన్న యయ్యెడున్. 5

వ. అని సకలభువనప్రధానదేవతాప్రార్థనంబుఁ జేసి. 6

వ్యాసస్తుతి.

మ. వివిధామ్నాయలతాలవాలధిషణావిఖ్యాతవిజ్ఞానదీ
పవిభాలోకితలోకవర్తనుఁ గృపాపారంగతు న్సాంఖ్యయో
గవిదు న్భారతసంహితావిరచనాకల్పు న్దపోనిత్యు సా
త్యవతేయుం గృతకృత్యుఁ గొల్చెద మునీంద్రస్తుత్యు నత్యుత్తమున్. 7

వాల్మీకిస్తుతి.

మ. కవిలోకాద్యుని హృద్యపద్యకవితాకల్పుం ద్రిలోకీజన
శ్రవణానందనరామకీర్తనకథాసందర్భదక్షు న్మని
ప్రవరు న్భవ్యతపఃప్రభావవిభవప్రఖ్యాతు వాల్మీకిఁ ద
త్త్వవిదు న్నిర్మలసత్త్వు సంతతము సద్భక్తిం బ్రశంసించెదన్. 8

నన్నయభట్టస్తుతి.

ఉ. సారకథాసుధారస మజస్రము నాగళపూరితంబుగా
నారఁగఁ గ్రోలుచు న్జనులు హర్షరసాంబుధిఁ దేలునట్లుగా
భారతసంహిత న్మను ద్రిపర్వము లెవ్వఁ డొనర్చె నట్టివి
ద్యారమణీయు నాంధ్రకవితాగురు నన్నయభట్టుఁ గొల్చెదన్. 9

తిక్కనకవిస్తుతి.

చ. ఉభయకవిత్వతత్త్వవిభవోజ్జ్వలు సంవిహితాధ్వరక్రియా
ప్రభు బుధబంధు భూరిగుణబంధురు భారతసంహితాకథా
విభుఁ బరతత్త్వబోధను నవీనపరాశరసూను సంతత
త్రిభువనకీర్తనీయయశుఁ దిక్కకవీంద్రుని గొల్తు నర్థితోన్. 10

వ. అని సకలభువనప్రసిద్ధులైన పురాతనాద్యతనకవివరులం బ్రశంసించి తత్ప్రసాదప్ర
వర్ధమానసరససాహిత్యసౌరభసంవాసితం బగుమదీయహృదయసరోరుహంబునంద
పూర్వకావ్యరచనాకుతూహలమధులిహంబు విహరించుచున్న సమయంబున. 11

కావ్యకరణబీజము.

సీ. తనసముజ్జ్వలమూర్తి జనలోచనాంభోజములకు మార్తాండునిమూర్తి గాఁగ
దనసయోపార్జితధనమున కర్థిహస్తములు నిక్షేపణస్థలులు గాఁగ

దనభూరితరతేజ మనుపమనిజవంశభవనంబునకుఁ బ్రదీపంబు గాఁగఁ
దనవినిర్మలయశంబునకు దిశాతటంబులు దృఢశాసనశిలలు గాఁగ

తే. ప్రకటగుణగణసంపదఁ బరగుచున్న, ధన్యుఁ డధికపుణ్యుండు ప్రతాపరుద్ర
దేవసామ్రాజ్యవర్ధనస్థిరవినీతి, కరణకుశలుండు నాగయగన్నవిభుఁడు. 12

వ. ఒక్కనాఁడు వేదవేదాంగపారగు లైనధారుణీసురులును సమస్తశాస్త్రవిదు లైనవిద్వాంసులును వివిధపురాణప్రవీణు లైనపౌరాణికులును సరససాహిత్యవిద్యావిశారదు లైనకవివరులును బరివేష్టింప రమ్యహర్మ్యతలంబున సుఖోపవిష్టుండై యిష్టకథావినోదంబుల నుండి నన్ను రావించి యుచితప్రియసత్కారంబు లొనర్చి సంభావించి యిట్లనియె.

శా. పాండిత్యం బమరం బురాణముల ము న్బౌరాణికు ల్చెప్పఁగా
విందు న్వింతలు గావు నూతనకథావిస్తారమై యోగ్యమై
చండాఘోత్కరహారి యై పరమవిజ్ఞానాశ్రయం బైనమా
ర్కండేయాఖ్యమహాపురాణము వినం గౌతూహలం బయ్యెడిన్. 14

వ. అని మఱియును. 15

శా. తర్కింపంగ నశక్య మైనవితతోద్యద్దీప్తిజాలంబుచే
నర్కుం డెట్లు వెలుంగు నట్లు బహుపుణ్యశ్రేణికావ్యాప్తి సం
పర్కస్ఫూర్తి నఘాంధకారము లడంపం జాలి లోకంబున
న్మార్కండేయపురాణరత్న మమరు న్మాంగళ్యసంపాది యై. 16

ఉ. కావునఁ దత్పురాణము ప్రకాశితసారకథామృతం బొగిం
ద్రావి జగజ్జనంబు లలర న్రచియింపు తెనుంగున న్వచః
శ్రీవిభవంబు పెంపు విలసిల్లఁగఁ గోవిదు లిచ్చ మెచ్చి సం
భావన సేయఁ జారుగుణభాస్వర! మారయసత్కవీశ్వరా!. 17

మ. ఇతఁ డిమ్మేదిని నెంత ధన్యుఁడగునే? యి ట్లొప్పునే? యాతలం
పతిసూక్ష్మం బతినిర్మలం బతిహితం బత్యంతధర్మార్థసం
గత మీదివ్యపురాణరత్నమును మార్కండేయ మేఁ జెప్పఁ గాం
చితిఁ బుణ్యాత్ముఁడ నైతి జన్మము ఫలించె న్లోకసంభావ్యమై. 18

వ. అని యత్యంతప్రమోదంబునం గొనియాడి. 19

క. నానాగమార్థజలముల, నానాఖ్యానకతరంగనాదంబుల నా
నానయధర్మోక్తిమణులఁ, దా నొప్పి సుధాబ్ధిమాడ్కిఁ దనరెడుదానిన్. 20

తే. సర్గమన్వంతరప్రతిసర్గములును, సకలనృపవంశవంశానుచరితములును
ననఁగ నెంతయు నొప్పునీయైదులక్షణములఁ బొలుపొంది సఫలయం దమరుదాని.

సీ. నిఖిలకల్మషపంకనిర్మోచనస్ఫూర్తి నమరసరిద్వారి ననుకరించి
బహుళతరాజ్ఞానతుహినవిర్వాపణప్రౌఢి నర్కప్రభాభాతిఁ దాల్చి

వితతచతుర్వర్గవిపులఫలాలంకృతస్థితి మందారతరువుఁ బోలి
సారకథాసాంద్రచంద్రికాసంపదఁ బూర్ణేందుమండలస్ఫురణ నొంది

తే. యఖిలవిబుధసభాపర్వ మై జగజ్జ, నావళికిఁ గర్ణపర్వమై యధికపుణ్య
యోగివాంఛితపర్వ మై యొప్పుదాని, హరిగుణోజ్జ్వలమణినిధి యైనదాని. 22

క. ఇమ్మార్కండేయపురా,ణ మ్మఖిలహితమ్ము గాఁగ నానేర్పుగలిన్
నెమ్మి విరచించెదం బ,ద్యమ్ముల గద్యముల భవదుదాత్తానుమతిన్. 23

వ. అని విద్వజ్జనానుగ్రహంబు వడసి సుగుణసుందరుండును ధృతిమందరుండును సిత
యశోవిలసితసురగిరికందరుండును బలికార్యధురంధరుండును నీతియుగంధరుండును
నిర్వికారుండును బ్రతాపరుద్రకటాక్షవీక్షాపేక్షపరాక్రమప్రకారుండును నిరహం
కారుండును నైనయాగన్నరథినీశ్వరుం గృతీశ్వరుం గావించి తదీయవంశావళివర్ణనం
బొనరించెద నది యెట్లనిన. 24

కృతిపతివంశావళి.

క. శ్రీమంగళమందిరవ, క్షోమణికిరణచ్ఛటాభిశోభితుఁడు ఘన
శ్యామలకోమలవపురభి, రాముఁడు నగువిష్ణునాభిరాజీవమునన్. 25

తే. ఆగమంబులు నాలుగు నాననములఁ, బ్రణవమాత్మసనాతన బ్రహ్మతేజ
మున మొదలుగ విరించి సముద్భవించి, భువననిర్మాణకర్మనైపుణి వహించె. 26

క. ఆరాజీవజముఖజా, హారుపదంబుల జనించి రొగి బ్రాహ్మణధా
త్రీరమణవైశ్యశూద్రులు, భూరిగుణోన్నతు లగణ్యపుణ్యచరిత్రుల్. 27

వ. ఇట్లావిర్భవించిన చతుర్వర్ణంబులయందు. 28

మ. అమలంబు న్ద్విజరాజవర్ధనము మర్యాదాన్వితంబున్ గుణో
త్తమరత్నంబు ననంతభోగమహిమోదారంబు గాంభీర్యధు
ర్యము శ్రీజన్మగృహంబు నై శుభయుతం బై యాచతుర్థాన్వయం
బమృతాంభోనిధిమాడ్కి నుర్విఁ గడుఁ బొల్పారు సజ్జనస్తుత్య మై. 29

ఆ. ఆచతుర్థకులసుధాంబుధి నుదయించె, నమితకాంతిచంద్రుఁ డవనిభరణ
దిగ్గజేంద్రమును వితీర్ణిమందారంబు, మల్లసైన్యవిభుఁడు మహితకీర్తి. 30

క. ఆమల్లచమూవల్లభు, భామకు సౌభాగ్యనీతిభాసురకాంతి
శ్రీమహితకుఁ బోలాంబకు, నేమనుజాంగనలు సాటియే గుణమహిమన్ ? 31

ఉ. ఆరమణీయదంపతుల కన్వయరత్నము బంధులోకమం
దారము ధైర్యమందర ముదాత్తదయానిధి దానధర్మవి
ద్యారసికుండు నాగవిభుఁ డంచితభాగ్యపరుండు పుట్టెఁ బెం
పార శచీపురందరుల కర్థి జయంతుఁడు పుట్టినట్టుగన్. 32

తే. అట్లు జన్మించి లావణ్య మగ్గలించి, యంగములు తొంగలింప బాల్యమున మెఱసి
నాగరథినీశ్వరుఁడు మదనాభిరేఖ, నొప్పె నసమాననవయౌవనోదయమున. 33

క. కులరత్నాకరచంద్రుం, డలఘుఁడు నాగాంకుఁ డన్వయస్థితికొఱకుం
గులశీలరూపగుణములు, గలకన్నియఁ బరిణయంబుగాఁ దలఁచి మదిన్. 34

సీ. ఏరాజు రాజుల నెల్ల జయించి మున్నేట్టికిఁ బట్టె దోర్విక్రమముల
నేరాజు సేతుసీహాద్రిమధ్యోర్వి నేకపట్టణలీల నేలి వ్రాలె
నేరాజు నిజకీర్తి నెనిమిదిదిశల నుల్లాసంబు నొంద నలంకరించె
నేరాజు తనతేజ మీజగంబునకు నఖండైకవిభవంబుగా నొనర్చె

తే. నట్టికాకతిగణపతిక్ష్మాధినాథు, ననుఁగుఁదలవరి ధర్మాత్ముఁ డధికపుణ్యుఁ
డయిన మేచయనాయకుప్రియతనూజ, నతులశుభలక్షణస్ఫురితామలాంగి. 35

చ. శివుఁ డగజాత రాఘవుఁడు సీతఁ గిరీటి సుభద్రఁ బెంపు సొం
పు వెలయఁ బ్రీతిఁ బెండ్లి యగుపోల్కిని నాగచమూవిభుండు భూ
రివిభవ ముల్లసిల్లఁగ వరించె సమంచితరూపకాంతిభా
గ్యవిభవగౌరవాదిసుగుణానుకృతాంబిక మల్లమాంబికన్. 36

శా. ఆమల్లాంబకు నాగశౌరికి విశిష్టాచారు లుద్యద్గుణ
స్తోమాకల్పు లనల్పకీర్తిపరు లస్తోకస్థిరశ్రీయుతుల్
ధీమంతు ల్సుతు లుద్భవించి రొగిఁ గౌంతేయప్రభావోన్నతుల్
రామప్రఖ్యులు వహ్నితేజులు జగత్ప్రఖ్యాతశౌర్యోదయుల్. 37

వ. అం దగ్రజుండు. 38

సీ. తనసుందరాకృతిఁ గని వెఱఁగందిన వనిత లంగజునొప్పఁ దనువుఁ జేయఁ
దనకళాచతురత్వమున కద్భుతంబందు బుధులు భోజునినేర్పు పొల్లు సేయఁ
దననయాభిజ్ఞత వినినప్రాజ్ఞులు దివిజేశునితద్జ్ఞతయేపు దింపఁ
దనయాశ్రయంబున మనుబంధుమిత్రవర్గము కల్పతరువునాశ్రయముఁ దెగడ

తే. నెగడి జగమున నెంతయుఁ బొగడు వడసెఁ, గాకతిక్ష్మాతలాధీశకటకపాలుఁ
డమలసితకీర్తి ధనలోలుఁ డన్వయాబ్జ, షండదినవల్లభుఁడు గన్నసైన్యవిభుఁడు. 39

చ. ఎలమిఁ బ్రతాపరుద్రమనుజేంద్రునిచేఁ బడసెం బ్రవీణుఁడై
కొలిచియుఁ శౌర్యలీల రిపుకోటి రణావనిఁ గీటడంచియు
న్బలరిపుతుల్యవిక్రముఁడు నాగయగన్నవిభుండు తేజముల్
విలసితరాజ్యచిహ్నములు విశ్రుతలక్ష్మియుఁ నాయకత్వమున్. 40

చ. తదనుజుఁ డన్వయాంబుధిసుధాకరుఁ డెల్లయసైన్యనాథుఁడున్
మదపరిపంథిసింధురసమాజవిదారణసింహ మంగనా

హృదయసరోజషట్పద మహీనగుణోజ్జ్వలరత్నభూషణా
స్పదశుభమూర్తి సద్వినయసంపదసొంపున నొప్పు నెంతయున్. 41

చ. నయవినయాభిరాముఁ డగునాగయగన్ననికూర్మితమ్ముఁ డ
న్వయనవరత్నదీపము దివాకరతేజుఁడు రాజనీతిని
శ్చయనిపుణుండు నిర్మలవిచారవివేకపరాయణుండు మే
చయరథినీశుఁ డుజ్జ్వలయశస్స్ఫురణం బొగడొందె నిద్ధరన్. 42

సీ. ఆశాగజేంద్రకర్ణానిలంబునఁ దనప్రకటప్రతాపాగ్ని ప్రజ్వరిల్ల
దిగ్వధూదరహాసదీప్తులతోఁ దనసితకీర్తిచంద్రిక లెచ్చెలిమి సేయ
సకలమహీపాలసరసిజాకరములఁ దనజయశ్రీవినోదంబు సలుపఁ
దతరిపుమకుటరత్నప్రభాబాలాతపంబునఁ దనపదాబ్జంబు లలరఁ

తే. దనరుఁ జలమర్తిగండప్రతాపరుద్ర, మనుజవిభునకు సేనానియును మహాధి
కారియును నాప్తుఁడును నై పొగడ్త కెక్కె, మేరుధీరుఁడు నాగయ మేచశౌరి. 43

షష్ఠ్యంతములు.

క. అనుపమవిజయశ్రీఁ గడుఁ, దనరారెడునట్టియనుఁగుదమ్ము లిరువురున్
దనయుభయభుజంబులు గా, ఘనవిభవస్ఫూర్తి నొప్పుగన్నవిభునకున్. 44

క. ధన్యునకు ధనదసదృశవ, దాన్యున కతిమాన్యునకు బుధప్రజనుతసౌ
జన్యునకు ఘనవిభవప, ర్జన్యునకు న్సకలజగదసామాన్యునకున్. 45

క. పతిహితనీతివివేకాం, చితమతికి ననేకకార్యశిల్పనవబృహ
స్పతికి నిజభుజకృపాణ, ప్రతిహతరిపుతతికి గన్నరథినీపతికిన్. 46

ప్రథమాశ్వాసము.

కథాప్రారంభము.

వ. పరమకల్యాణపరంపరాభివృద్ధిగా నారచియింపం బూనినయిమ్మహాపురాణంబునకుఁ గథాక్రమం బెట్టిదనినఁ బల్లవితకుసుమితఫలితవివిధవల్లీవేల్లితమాకందచందనమందారాదినానామహీజరాజివిరాజితంబును, దరులతాశిఖరవిహారత్కలకంఠశుకకులకలకలస్వనమనోహరంబును, ననవరతహోమధూమశ్యామలితవ్యోమమండలంబును, ననవచ్ఛిన్నాధ్యయనరవబధిరితదిగంతరాళంబును, ననుదినప్రవర్ధమానమహాధ్వరోత్సవసమాగతశతమఖప్రముఖనిఖిలనిలింపనివహాలంకృతంబును, సమిత్కుసుమకందమూలఫలాహరణాగమనార్థపరస్పరాహ్వానమునికుమారకోలాహలవిలసితంబును, శాస్త్రపురాణేతిహాసకథాకథనచతురతాపసోత్తమపరిషదభిరామంబును, బరమపావనంబును నైన తపోవనంబునందు. 1

క. నిరుపమనిష్ఠాపరుఁడై, పరమతప మొనర్చుచున్నభార్గవవంశో
త్తరు నిర్మలచారిత్రు, న్నమరపూజ్యుఁ గృపావిధేయు మార్కండేయున్. 2

క. కానఁ జనుదెంచి సత్యవతీనందనశిష్యుఁ డధికతేజోనిధి వి
ద్యానిపుణుఁడు జైమిని విన, యానతుఁడై యిట్టులనియె నధికప్రీతిన్. 3

భారతప్రశంస.

చ. వినుము మునీంద్ర! వేదనిధి విష్ణునిభుండు పరాశరాత్మజుం
డనఘయశుండు సర్వనిగమార్థయుతంబును సర్వధర్మసా
ధనమును సర్వశాస్త్రకలితంబును సర్వకథాభిశోభితం
బును నగుభారతంబు కృతపుణ్యుఁ డొనర్చె సవిస్తరంబుగన్. 4

తే. మానుగా నింద్రియంబులలోన మనసు, సురలలోన ముకుందుండు నరులలోన
బ్రాహ్మణుఁడుఁ బోలె నెక్కుడై భారతంబు, వెలయుసకలదివ్యపురాణవితతిలోన.

క. జలపూరము పాండవకథ, జలరుహనివహములు విదితసరసాఖ్యానం
బులు మృదుపదములు హంసంబులు మేదిని భారతాఖ్యఁ బొలుచుకొలనికిన్. 6

తే. వ్యాసవాగ్జలపూర్ణయు నాగమప్ల, వావతీర్ణయు బహుకుతర్కావనీజ
హారిణియు నైనభారతోదారతటిని, యదరి దురితరజోరాశి నడఁచుచుండు. 7

తే. ఒనర బహువిశేషంబుల నుల్లసిల్లు, నట్టిభారతాఖ్యానంబునందు గూఢ
తరము లైనసమంచితార్థంబు లెఱుఁగఁ, దలఁచి వచ్చితి నీకడ కలుషచరిత!. 8

జైమిని మార్కండేయమునిని గొన్నిప్రశ్నముల నడుగుట.

వ. నిఖిలభువనోత్పత్తిస్థితిలయకారణుండును త్రిగుణరహితుండును సర్వవ్యాపకుండును నైనపురుషోత్తముం డేమి నిమిత్తంబున మనుష్యత్వంబు నొందెఁ? బరమపుణ్యులైన పాండవు లేవురకు ద్రౌపది యొక్కతె యెట్లగ్రమహిషియయ్యె? మహాబలుండైనబలభద్రునకుఁ దీర్థంబున కరుగునవసరంబున బ్రహ్మహత్య యెట్లు వాటిల్లె? దాని కతండు ప్రాయశ్చిత్తం బెత్తెఱంగునఁ జేసెఁ? బాండవేయనందను లైనద్రౌపదేయులు కృతదారపరిగ్రహులు గాక యనాథులుం బోలె నేల మృతిఁ బొంది? రింతయుఁ సవిస్తరంబుగా నెఱిఁగింప నీవ యర్హుండ వనిన నమ్మహాముని జైమిని కి ట్లనియె. 9

క. అమరఁగ నీయడిగినయర్థములను జెప్పంగఁ బెద్దతడ వయ్యెడు సం
యమివర్య! నియమవిధులకు, సమయం బరుదెంచె మాకుఁ జనఁగా వలయున్. 10

వ. నీకు నీయర్థంబు లవశ్యంబు నెఱుంగవలయు నేని. 11

క. అండజపతులు దృఢాగమ, పాండిత్యులు ద్రోణసుతులు భవ్యులు పింగా
క్షుండును విరాటుఁడును వృత్రుండును సుముఖుండు నన జతుర్ముఖసదృశుల్. 12

తే. ప్రవిమలజ్ఞానవంతులు పరమశాంతు, లఖిలభాషావిశారదు లధికమతులు
సకలశాస్త్రపురాణనిశ్చయసమర్థు, లమితతేజులు సతతసమాధిరతులు. 13

క. ఉన్నారు వింధ్యనగమున, నన్నలువురు నడిగినట్టియర్థంబును వి
ద్వన్నుతగుణ! యెఱిఁగింతురు, క్రన్నన చను మన్న నతఁడు గడువిస్మితుఁ డై. 14

తే. ఇట్టినిర్మలవాక్సిద్ధి యిట్టియెఱుక, యిట్టిమహిమ యాపులుఁగుల కెట్లు గలిగె?
ద్రోణుఁ డన నెవ్వఁ? డట్టిపుత్త్రుల మహాత్ముఁ, డెట్లు వడసె నతఁడు? చెప్పు మేర్పడంగ.

మార్కండేయుఁడు జైమినికి ద్రోణచరిత్రము చెప్పుట.

సీ. అనిన మార్కండేయుఁ డను విను చెప్పెద ననిమిషవల్లభుఁ డప్సరోంగ
నలు గీతనృత్యము ల్సలుపంగ నిజనందనంబున నున్నెడ నారదుండు
వచ్చిన నతనికిఁ జెచ్చెర నాసనాద్యుపచారములు ప్రియం బొనరఁ జేసి
యిదె రంభ మేనక యిదె యూర్వశి ఘృతాచి యిదె తిలోత్తమ నీకు నీలతాంగు
తే. లందు మెచ్చొనరించు నేయతివనృత్త?, మనిన నీయచ్చరలలోన హావభావ
విలసనోత్కృష్ట నని మది విఱ్ఱవీఁగు, నేవెలఁది దానినృత్యంబ యింపు మాకు. 16

క. అని ముని పల్కిన నయ్యంగనలకు నిజరూపవిభవకాంతిచతురతా
ద్యనుపమగుణములఁ దమలో, ననఘా! యే నేన యెక్కు డనువా దయ్యెన్. 17

తే. వాసవుం డంత వారలవాదు మాన్చి, యిమ్మునీంద్రుడు మీలోన నేలతాంగి
నధికగుణవతిగాఁ జెప్ప నదియె యెక్కు, డనిన నారదముని యిట్టు లనియె నపుడు.

తే. మంచుమలమీఁదఁ దపము గావించుచున్న, యనఘుదుర్వాసమునిపుంగవునిఁ గలంపఁ
జాలు నేయింతి దనవిలాసప్రశస్తి, నదియె పో యెక్కు డనిన భయంబు గదిరి. 19

క. ఆనతముఖులై యొకపలు, కైనను బలుకంగ నోడి యందఱు నున్నం
దా నిట్లను వపు వను నొక, మానిని మునివంకఁ గాంచి మదవతి యగుటన్. 20

చ. పలుకులు వేయు నేల మునిపాలక! నాదగురూపమంజువా
గ్విలసనలీల నమ్మునివివేక మడంచెదఁ దాల్మిఁ జించెదన్
గలఁచెద డెందముం దపము గర్వము మాన్పెద నే మనంబునం
దలఁచిన రుద్రు నైన ఘటదాసునిఁ జేయుదుఁ గామునింటికిన్. 21

తపముఁ జెఱుపవచ్చిన వపు వనునచ్చరను దుర్వాసుఁడు పక్షి వగుమని శపించుట.

మ. అని గర్వోక్తులు వేడ్కఁ బల్కి వెస నయ్యబ్జాక్షి దృగ్ధీధితుల్
దనుకంగాఁ జని కాంచె నంత హిమవంతంబున్ లసన్నూత్నర
త్ననితాంతద్యుతిపుంజరంజితదిగంతంబున్ లతాంతోల్లస
ద్ఘనరేఖాంచితసానుమంతము మదుద్దంతిస్ఫురత్ప్రాంతమున్. 22

వ. కని తదీయసుందరకందరంబునందు. 23

క. మలయానిలమృదులీలా, చలితతరులతాప్రసూనసౌరభమాలా
కలితమధుమత్తమధుకర, విలసనమున నొప్పువనము వెలఁదుక సొచ్చెన్. 24

క. చొచ్చి మునీశ్వరుఁ డున్నెడ, యచ్చోటికిఁ గ్రోశమాత్ర మగుట యెఱిఁగి చం
చచ్చూతలతాంతరమున, విచ్చలవిడిఁ జంద్రకాంతవేదికమీఁదన్. 25

తే. ఎలమిఁ గూర్చుండి యెలుఁగెత్తి యింపు మిగుల, వట్టిమ్రాఁకులు చివుళులు వెట్ట నతివ
పాడెఁ బాడిన విని యాతపసి కలంగి, వెఱఁగుపడి యంతయును మది నెఱిఁగి కనలి.

వ. రయంబున వచ్చి రూపగుణగర్వోన్మత్తచిత్తయైనయత్తలోదరిం జూచి. 27

శా. దుర్వాసుం డతికోపవిస్ఫురితవక్త్రుం డై యనున్ దానితో
గర్వాంధ్యంబున మత్తపంబునకు విఘ్నం బాచరింపంగ నా
గీర్వాణాధిపుతోడఁ బూనితి కదుం గీ డేల లేకుండు? నీ
గర్వం బంతయు నుజ్జగించి విహగాకారంబునం బుంశ్చలీ!. 28

తే. విహగరాడ్వంశమందు నావిర్భవించి, ధరణితలమున షోడశాబ్దములు నిలిచి
సుతుల నలువురఁ గని తుది సునిశితాస్త్రహతి శరీరము విడిచి పొ మ్మమరపురికి. 29

క. నావచన మమోఘం బని, దేవతరంగిణికి నశఁడు దిగ్గనఁ జనియె
న్నావుడు జైమిని యి ట్లను, నావసితజనిప్రకార మానతి యీవే. 30

వపు వసునచ్చరచరిత్రము.

వ. అనిన మార్కండేయుం డంతయుం జెప్పెద నాకర్ణింపు మరిష్టనేమిపుత్త్రుం డైనగరు
డునికి†సాంపాతి పుట్టె నతనికి శూరుం డతనికి సుపార్శ్వుం డతనికిఁ గుంభి యతనికిఁ
బ్రలోలుపుఁడును బ్రభవించి రా ప్రలోలుపుఁడు కంకుఁడు కంధరుండు నన నిరు
వురుకొడుకులం బడసె నాకంకుం డొకనాఁడు విహారార్థంబు కైలాసంబునకరిగి
యందొక్కరమణీయశిలాతలంబున మధుపానమత్తుండై భార్యయుం దాను నేకతంబై
యున్నవాని విద్యుద్రూపుం డనుదానవుండు గని డాయం బోయినం గరం బలిగి
వాఁ డి ట్లనియె. 31

గరుడవంశ్యుఁ డగుకంకుఁడు విద్యుద్రూపుఁ డను రాక్షసునిచేఁ జచ్చుట.

క. స్త్రీయును బురుషుఁడు నేకత, మై యున్నెడఁ జూచి యెట్టియధముండైనన్
డాయఁగ వచ్చునె యిట్లి, స్సీ యటు పొమ్మనినఁ గోపజృంభితుఁ డగుచున్. 32

క. అడవులు గొండలు నీకని, పడసినవే యేల యిట్లు వదరెద? వనుచుం
గడు నలిగి కంకు మెడఁ దెగ, నడిచెను రక్కసుఁడు భీకరాసికరుం డై. 33

క. అంత నటఁ గంధరుఁడు దా, నింతయు విని యడలు గనలు నెదఁ గూరంగా
నెంతయు రయమున నరిగి య, నంతరవిధు లగ్రజునకు నచ్చటఁ జేసెన్. 34

ఉ. చేసి మహోగ్రకోపశిఖి చిత్తమున న్నెగయంగ నుత్పత
ద్భాసురపక్షమారుతము పర్వతకోటిఁ జలింపఁజేయ ని
శ్వాసమహానిలక్షుభితసాగరుఁ డై వెసఁ గంధరుండు కై
లాసనగేంద్రకందరములన్ దనుజాధము రోసి యొక్కెడన్. 35

కంధరవిద్యుద్రూపులయుద్ధము.

కవిరాజవిరాజితము. కనుఁగొని యోరి దురాత్మ! మహాత్ముని గంకు మదగ్రజు నుగ్రుఁడవై
చనునె వధింపఁగ? వచ్చితి నే నిదె శౌర్య మెలర్పఁగ మార్కొన ర
మ్మని చెదఁ గాలుని ప్రోలికి నిన్ను రయమ్మున నంచు నదల్చుచు డా
సినఁ గని రక్కసుఁ డాజ్యము వోసినచిచ్చుక్రియం గడు మండె వెసన్. 36

మానిని. కన్నుల నిప్పులు రాలఁగ నిట్టను గర్వమున న్విహగాధమ! నీ
యన్నకు మృత్యువు నన్ను నెఱుంగవె ప్రాణము లిప్పుడు వ్రాలెద నం
చున్నతశాతకృపాణము ద్రిప్పుచు నుగ్రతఁ దాఁకిన నిద్దఱకున్
గ్రన్నన శక్రసుపర్ణులకయ్యముకైవడి ఘోరరణం బొదవెన్. 37

తే. పక్షిపక్షంబు వీక్షించి రాక్షసుండు, గిట్ట ఖడ్గంబు వైచిన బిట్టు నెగసి
యొడిసి ఖగపతి దానిఁ బంచాగ్రశక్తి, గరుడుఁ డురగంబుఁ బట్టినకరణిఁ బట్టె. 38

† లిఖితపుస్తకములందు గరుఁడదు అనికలదు.

కందరుఁడు విద్యుద్ద్రాపునిఁ జంపి తత్పత్నిం బడయుట.

క. కడువడిఁ గాళ్ళం జేతులఁ, బొడిబొడిగాఁ బ్రామి చెలఁగి భూరిబలం బే
ర్పడ నక్కద్రొక్కి రక్కసు, బెడిదంబుగ నవయవములు పెఱికి వధించెన్. 39

తే. అంత నాదైత్యపతిప్రియకాంత యయిన, మేనకాత్మజ మదనిక మిక్కుటంపు
భీతి నీభార్య నయ్యెదఁ బ్రీతి నాకు, శరణ మగు మన్న నగుచుఁ గందరుఁడు వొంగి.

వ. ఆసుందరిం దోడ్కొని చని నిజమందిరంబున కరిగె నంత నిజేచ్ఛానురూపరూప
ధారిణియగుటం జేసి. 41

కందరునివలన విద్యుద్ద్రాపపత్నియగు మదనికయందు వపువు జనించుట.

క. ఆధవళవిలోచన పులుఁ, గై ధవునిం బ్రీతుఁ జేసె నాదుర్వాసక
క్రోధానలమున సెరిసిన, యాధవళాబ్జాక్షి పుత్త్రియై జనియించెన్. 42

వ. దానికిఁ గందరుఁడు తార్క్షి యనునామం బొసరించె నంత. 43

క. పరమముని మంధపాలుఁడు, జరితారిప్రముఖు లైనశార్ఙ్గేయుల న
ల్వురఁ బడసె సుతుల నం దుద్ధురగుణుఁ డగుపిన్నకొడుకు ద్రోణుఁడు తార్క్షిన్. 44

వ. ధర్మపత్నిగ నంగీకరించె నవ్విహంగాంగనయుఁ గతిపయకాలంబునకు గర్భిణియై మూఁ
డు నెలలపదియేనుదివసంబులు చన్న సమయంబునం బాండవకౌరవులు భండనం బొనరిం
చుచున్న నొక్కనాఁడు విధివశంబునం గురుక్షేత్రంబున కరిగి నిరంతరనిశితవివిధవిశి
ఖపరిచ్ఛన్నాంబరం బైనయమ్మహాయుద్ధమధ్యంబునం బరిభ్రమించుచున్నంత. 45

భారతయుద్ధమునఁ దార్క్షి కడుపు దెగి గ్రుడ్లుపడుట.

సీ. భగదత్తుగజముపై ఫల్గునుం డేసిన పటుభల్లమునఁ జేసి పక్షివనిత
కడుపుతో ద్రెవ్వినఁ గర్భచ్యుతంబులై కమనీయశశిబింబకాంతి నొప్పు
నండము ల్నాలు గొయ్యన సాంద్రతద్రక్తపంకముపై దూదిఁ బడువడువునఁ
బడినతోడనె తెగిపడి సుప్రతీకంబు పార్శ్వమహాఘంట పటురయమున

తే. భవన మయ్యెను వానికి భాగ్యమహిమఁ, బతగియును నంత దివ్యరూపమునఁ జనియె
భారతాజి చెల్లినఁ గురుప్రభుఁడు భీష్ము, పాల సకలధర్మములు తత్పరత వినఁగ. 46

ధర్మపక్షులయొద్దకు శమీకమునివచ్చి వానిం బెంపఁ గొనిపోవుట.

వ. అయ్యెడకు శమీకుం డనుముని శిష్యసమేతుం డై వచ్చి. 47

క. జిలిబిలియెలుఁగులు ఘంటా, నిలయములోఁ జెలఁగుటయుఁ మునిప్రభుఁ డచ్చో
నిలిచి చెవి యొడ్డి విని శిష్యులు దానుం బట్టి గంట యొయ్యన యెత్తెన్. 48

వ. అశ్లోత్తి. 49

తే. అమరు రేయెండపిండుల కవయవములు, మొలచినట్లు తేజస్ఫూర్తి వెలుఁగుచున్న
విహగశిశువుల విజ్ఞానవిమలమతులఁ, గని మునీంద్రుఁడు విస్మయమున మునింగి. 50

క. అక్కట! యీసమరతలం, బెక్కడ? నీయండజంబు లెక్కడ? నీహా
రెక్కడ? నీఘంటాశ్రయ, మెక్కడ? దైవంబుఘటన యే మన వచ్చున్? 51

వ. అని శిష్యులం జూచి తొల్లి యాదిత్యులకు నోడి దైత్యులు మరణభయంబునఁ
బాఱిన భార్గవుండు వారల నుద్దేశించి చెప్పినవాక్యంబులు వినుండు. 52

చ. సురలకు నోడి పాఱకుఁడు సొంపఱి రాక్షసులార! పాఱిన
న్మరణము దప్పునే యచట? మానుగ ధాత యొనర్చినట్టి పెం
దెరువు మొఱంగ నెవ్వరికిఁ దీరునె? యూఱడి యేల? శౌర్యము
న్జిరతరకీర్తియు న్జెడఁగఁ జేయక కయ్యము సేయుఁ డుక్కునన్. 53

తే. సమర మొనరించినంతనే చావు రాదు, పాఱిపోయినయంతనే బ్రతుకు రాదు
జీవితంబును మరణంబు దైవకల్పితములు వానికి ముదమందఁ దలఁక వలదు. 54

ఉ. కొందఱు తీవ్రశస్త్రహతిఁ గొందఱు దుస్తరరోగబాధలన్
గొందఱు నీరు ద్రావునెడఁ గొందఱు భోజనకార్యవేళలన్
గొందఱు యోగముక్తు లయి కొందఱు నిష్ఠఁ దపం బొనర్చుచున్
గొందఱు కాంతల న్గవయుకోర్కులఁ జత్తు రనేకభంగులన్. 55

వ. మరణభయంబున కిది నిమిత్తం బని నిరూపింప రాదు. 56

క. దైవంబు చక్కఁజూచిన, నేవిధమునఁ గీడు వొంద దెయ్యెడ నున్నన్
దైవంబు తప్పఁ జూచిన, నే విధమున మేలు వొంద దెయ్యెడ నున్నన్. 57

వ. అని భార్గవుండు దెలిపినం దెలిసి యారాక్షసులు మరణభయంబు విడిచి రణపరాయ
ణులై రమ్మహాత్ముండు చెప్పినవాక్యంబులయర్థం బిట్టివిషమసమరస్థలంబునం బడి
బ్రతికినయివ్విహంగంబులచేత నిట్లు సత్యప్రదర్శితం బగునె! యివి సామాన్యపక్షులు
గావు విప్రజాతు లగుట సందేహంబు లేదు సరగున నకులశ్యేనమార్జాలమూషకాదుల
వలనిభయంబు లేకుండ నతిప్రయత్నంబున వీని రక్షింపవలయు నొయ్యన నెత్తికొని
రం డని యమ్మునీంద్రుండు శిష్యులం బనిచి నిజాశ్రమంబున కరిగి వానికి సముచితస్థా
నంబున సంవిధానం బాచరించి యనుదినంబును బయఃఫలాదివివిధాహారంబులం
బోషణం బొనరించుచుండ మాసమాత్రంబునం బ్రవర్ధిల్లి యొక్కనాఁడు. 58

మహాస్రగ్ధర. జవసత్వస్ఫూర్తు లొప్ప న్సకలమునిజనాశ్చర్యసంపాదలీలా
ప్రవణంబై పక్షిజాలప్రవరము లెగసె న్పర్వతంబు ల్చలింపన్
రవిలోకాద్యూర్ధ్వలోకప్రతతిఁగడవ సంరంభ మేపారఁగా ని
య్యవనీచక్రంబు సూక్ష్మం బయి తమకు రథాంగాకృతిం దోఁచు చుండన్. 59

ఆ. అట్టు లెగసి మగుడ నరుదెంచి యమ్ముని,నాథునకుఁ బ్రదక్షిణంబు చేసి
భక్తిఁ బాదములకుఁ బ్రణమిల్లి విహగకు,మారు లిట్టు లనిరి మనము లలర. 60

క. మరణము దప్పించి మముం, గరుణ మెయిం బెంచి తిట్లు గారామున నీ
వరయఁగఁ ద్రాతవు తండ్రివి, గురుఁడవు మా కేడుగడయుఁ గుణరత్ననిధీ! 61

ఉ. తల్లి మొగంబు గాన కటు తండ్రికి దవ్వయి గంటలోఁ గడుం
దల్లడ మంది పుర్వులవిధంబున వందురుచున్న మమ్ము ను
త్ఫుల్లదయామతి న్విగతదుఃఖులఁ జేసితి గానఁ బెంపు సం
ధిల్లఁగ మాకుఁ బ్రాణములు దేహములం గలిగె న్మునీశ్వరా! 62

ఉ. ఎన్నఁడు వృద్ధిఁ బొందు నివి యెన్నఁడు రూపు వహించుఁ బొల్చు నిం
కెన్నఁడు నల్గడం జెలఁగి యేడ్తెఱఁ బాఱుచు నుండు నామెయిం
జెన్నుగ నెన్నఁ డాటమెయిఁ జెందిన తెక్కలధూళి నించు నే
నెన్నఁడు చూడఁ గాంతు నొకొ యింతరుశాఖలఁ గేళి సల్పఁగాన్. 63

తే. అనుచు నర్మిలియును గరుణాతిశయము, నగ్గలింపఁగ నీవు మ మ్మరసి పెనిచి
తనఘ యేము ప్రబుద్ధుల మైతి మింక, నేమి పనులు చేయుదుము మునీంద్ర! చెపుమ.

క. అని ప్రస్ఫుటవాక్యము లి, ట్లొనరఁగఁ బలుకుటయుఁ వెఱఁగు నొంది పులకముల్
తనువున నెసఁగఁ గుతూహల, మునఁ బక్షుల కిట్టు లనియె మునివరుఁ డెలమిన్. 65

క. ఎవ్వనిశాపంబున మీ, రివ్వికృతిం బొందినార లేది కతము మీ
కివ్వాగ్విభవము కలుగుట, కివ్విధ మంతయునుఁ జెప్పుఁ డేర్పడ మాకున్. 66

ధర్మపక్షులు శమీకునకుఁ దమవృత్తాంత మెఱిఁగించుట.

చ. అనవుడుఁ బక్షు లిట్టు లను నమ్మునివల్లభుతో నతిప్రియం
బున విపులుండు నాఁ గలఁడు పుణ్యుఁడు సంయమిసత్తముండు ద
త్తనయులు సత్తపోధను లుదాత్తగుణు ల్సుకృశుండు తుంబురుం
డును సుకృశుండు మాపిత గడు స్వినయంబున నేము దండ్రికిన్. 67

వ. శుశ్రూషణం బొనరించు చుండ నొక్కనాఁడు వృద్ధశ్రవుండు మాతండ్రి సత్య
వ్రతనిష్ఠ యరయం దలంచి వృద్ధవిహంగం బై చనుదెంచి యి ట్లనియె. 68

సీ. విను మునివల్లభ! వింధ్యశృంగమున నే నుండంగ నడరినచండపవన
వాతి భగ్నపక్షుండ నై పడి మూర్ఛిల్లి యెనిమిదిదినముల కిపుడు దెలిసి
యుదరాగ్ని కోని కాల నోర్వంగఁ జాల కతిథి నైతి నాహారతృప్తిఁ జేసి
ప్రాణము ల్గావవే యనవుడు నీ కిష్ట మెయ్యది పెట్టెద నెఱుఁగఁ జెప్పు

ఆ. మనినఁ బక్షి యడిగె మనుజమాంసము దాని, కాత్మ నతఁడు రోసి యకట క్రూర
హృదయుఁడవు గదయ్య! హింసార్జితాహార, మదుగఁ దగునె నను విహంగనాథ!

క. ఇది రూపం బిది ప్రాయం, బిది నీపడియెడునవస్థ యింకైన శమం
బొదవఁగ వలదే మనమున, నది దుష్టాత్ములకు సేవయస్సునఁ గలుగున్. 70

వ. నీ వెట్టివాఁడ వై తేమి? నీకుం బ్రతిశ్రుతంబు చేసినయశనం బవశ్యంబును బెట్టెద
నని నిశ్చయించి. 71

మత్తకోకిల. ఏమి చెప్పుదు మేము నీకు? మునీంద్ర! యప్పుడు తండ్రి మ
మ్మామిషంబుగ నాఖగంబున కామతింపఁ దలంచి తాఁ
బ్రేమవంతుఁడు వోలె క్షుద్రతఁ బిల్చి యెంతయు మాగుణ
స్తోమముం గొనియాడి యిట్లను దుష్టనిష్ఠురభాషలన్. 72

తే. పరమపూజ్యుఁడు తండ్రియుఁ గురుఁడుఁ గాని,యొరుఁడు గాఁడనితలఁపు మీకొదవెనేని
బొంకు గాకుండ నాపల్కు పూని సేయుఁ, డనిన మే మట్ల చేసెద మంటి మనుఁడు.

క. ఇందు భవత్తనువులఁ గల, కండలు నెత్తురును వేగ కమియంగా నీ
యండజపతి కానంద మ,ఖండముగా క్షుత్తృషావికారము లడఁగన్. 74

వ. అనిన మరణభయంబున వడవడ వడంకుచుఁ దల్లడిల్లి యే మి ట్లంటిమి. 75

క. ఎట్టిట్లు పలికి తీ విది? యెట్టొనరింపంగ వచ్చు నీపని? దేహం
బెట్టొకని దేహమునకై, నెట్టన యీవచ్చుఁ? దండ్రి! నిక్కము చెపుమా. 76

తే. దేవ పితృ ఋషిఋణములు తీర్చి యధిక, భక్తిఁ బరిచర్య సేయుచుఁ బరగితండ్రి
కరుణ బ్రతికి యుండెడువాఁడు గాని యనఘ,వినుశరీరప్రదుండును దనయుఁ డగునె.

తే. ప్రాణములు గల్గ శుభములు పడయవచ్చు, ధర్మములు సేయ నగుఁ గానఁ దన్నుఁ గీడు
చెంద కుండంగ నరుఁడు రక్షించుకొనుట, ధర్మమని చెప్పుదురు ధర్మతత్త్వవిదులు.

వ. అది కారణంబుగా మేము నీచెప్పినయప్పని సేయ మనినం గోపించి తామ్రనయ
నుండై మాతండ్రి మమ్ముఁ దిర్యగ్యోనిజాతుల రగుఁ డని శపించి తనసత్యవ్రతంబు
పరిపాలింపం దలంచి యప్పులుఁగుఱేనియాననం బాలోకించి మదీయదేహంబు నీ
కాహారంబుగా సమర్పించితి శుచి వై సేవింపు మనుటయు విస్మితుం డగుచు నవ్వి
హంగపురుహూతుం డి ట్లనియె. 79

తే. యోగబల మూఁది దేహంబు నుజ్జగింపు, జీవుఁ డొడలిలో నున్న భక్షింప ననిన
నక్షణమ యోగసంయుక్తుఁ డయ్యె ముని త,దీయనిశ్చయ మెఱిఁగి యద్దేవవిభుఁడు.

మ. తనరూపంబు ధరించి యిట్లను మునీంద్రా! బుద్ధి సంమోద మం
దను బక్ష్యాకృతిఁ బొంది నీహృదయతాత్పర్యం బెఱుంగంగ వ
చ్చిన నాతప్పు సహింపు చేసెద భవచ్చిత్తేప్సితం బెద్ది చె
ప్పు నిను న్సంతతసత్యపాలనమునం బుణ్యుండు గాఁ గాంచితిన్. 81

ఆ. నేఁడు మొదలు గాఁగ నీకు నైంద్రజ్ఞాన, మావహిల్లు విఘ్న మడఁగి పోవుఁ
దపమునందు విమలధర్మమునందును, నని సురేంద్రుఁ డరిగె నంత నేము. 82

వ. మాతండ్రి యెదిరికిం జని. 83

మ. శిరము ల్వ్రీలఁగ మ్రొక్కి చెన్నుదురుల న్జేతు ల్మోగిం జేర్చి దై
న్యరసం బాస్యములందు వెల్లిగొన సర్వాంగంబులుం గంపముల్
బొరయం గుత్తుక లెండ నీరెలుఁగులం బుణ్యాత్మ! మ మ్మీయెడ
న్మరణోపాయభయంబు మన్నిగొనియె న్మాతప్పు సైరింపవే. 84

వ. అని మఱియు ని ట్లంటిమి. 85

ఆ. చర్మమాంసశల్యసంఘాత మైరక్త, పూరపూర్ణ మైనపొల్ల యొడలి
యందుఁ జేయు వేడ్క యనఘ! యకర్తవ్య, మట్టివేడ్క యిప్పు డయ్యె మాకు. 86

వ. ఏ మన నెంతవార మవధరింపుము. 87

ఆ. కడిఁదిశత్రులైన కామాదు లలజడి, పాలు పఱుప నవశభావ మొంది
మోహసాగరమున మునుఁగుచున్నది లోక, మత్తెఱంగు విను మహానుభావ! 88

వ. ప్రవిమలజ్ఞానప్రాకారంబును శల్యకీలకంబును జర్మకుడ్యంబును రక్తమాంసానులేపనంబును నానాస్నాయువేష్టనంబును మహామాయాముఖంబును నైనయట్టిపురంబునకుఁ బురుషుండు రాజు ఆరాజునకు మనోబుద్ధులు పరస్పరవిరోధు లైనమంత్రులు కామక్రోధలోభమోహంబు లత్యంతబలవంతులైన శత్రువులు ఈనలువురు శత్రులు చోరకుండ నన్నరపతి దనవీటివాకిళ్లు పదిలంబుగా సంవృతంబు చేసికొనియె నేని దాను నిరాతంకుండును సమాధిస్వాస్థ్యబలసంపన్నుండును బరమానురాగుండునగు నవ్వాకిళ్లు గట్ట నసమర్థుం డయ్యె నేనిం గామమహాశత్రుఁడు నేత్రాదిపంచద్వారప్రవిష్టుం డై సర్వంబును వ్యాపించు నతనివెనుకన యమ్మువ్వురుపగతురుం బ్రవేశింతు రన్నలువురుం గూడి యింద్రియంబులతోడను మనంబులతోడను గాఢాశ్లేషంబొనరించి వాని నన్నింటి నవ్వాకిళ్ళనుం దమవశంబు గా నొనర్చికొని దురాసదులై యక్కోటయూరలం ద్రోచి యయ్యమాత్యులం గీటడఁగించి యంతయుం దారయై వర్తింతు రంతనమ్మహీకాంతుండు మంత్రిరహితుండు విగతపరివారుండు నై నశించు నివ్విధంబునం గామాదిశత్రులు మనుష్యస్మృతినాశకు లగుటం జేసి యేము మోహాపహృతచిత్తులమై ప్రాణలోభంబున నెఱుక చెడి బుద్ధి వోనిడిచి యపరాధంబుఁ జేసితిమి మాకుఁ బ్రసన్నుండ వై నీయిచ్చిన శాపంబు గ్రమ్మరించి తామసి యైనకష్టగతిం బొందకుండ మమ్ము రక్షింపవే యనిన నమ్మహాత్ముం డి ట్లనియె. 89

ఉ. నావచనం బమోఘ మెడ నవ్వుచుఁ బల్కినఁ దప్ప దెన్నఁడున్
దైవకృతంబు మానుషహతం బగు నెట్లు? తనూజులార! దుః
ఖావహ మైనపక్షిభవ మైనను నిర్మలబోధ మెప్పుడున్
మీవిమలాంతరంగముల నిత్యముగాఁగ ననుగ్రహించితిన్. 90

క. ధరణీప్రజాను పాలన, పరిణతి సదవననిరూఢి బహువిధధర్మో
ద్ధరణరతి స్సతోర్వన్నతిఁ, బరగుఁ దృతీయ యగుమూర్తి ప్రద్యుమ్నాఖ్యన్. 114

తే. బహుళజలమధ్యమునఁ బెనుబాఁపపాన్పు, పై రజశ్శక్తి గైకొని పవ్వళించి
లీల నఖిలలోకములు గల్పించు వినయ, ధుర్య నారాయణాఖ్యచతుర్థమూర్తి. 115

వ. ఈనాలుగుమూర్తులందుఁ బ్రద్యుమ్నమూర్తి యైనదేవుండు పరమసాత్త్వికుండు సకలధర్మకుశలుండు భక్తజనలోలుండు జగదవనశీలుండు నపారకృపావిశాలుండు నగుటంజేసి సురగణరంజనంబు నసురగణభంజనంబు నిగమనికరరక్షాఖేలనంబు ధర్మపరిపాలనంబు నొనరించుచు నొక్కమాటు వరాహనరసింహవామనాదిరూపంబులు గైకొని ధరణి ధరియించి హిరణ్యాక్షు సంహరించి హిరణ్యకశిపు హరించి బలిన ణంచి జగంబులయలజడి యడంచు మఱియుం దేవమనుష్యతిర్యగ్యోనులం దుపేంద్ర రామతిమికమఠరూపంబుల నావిర్భవించి లోకరక్షణోపాయపరాయణుండై వర్తించుట గారణంబుగా భూభారసంహారార్థంబు మనుష్యత్వంబు నొందె నని చెప్పి యప్పక్షివరులు పాంచాలీభర్తల ప్రకారంబు విను మని యి ట్లనిరి. 116

పాంచాలీభర్తృపంచకవివరణము.

సీ. శతమఖుచేఁ దనసుతుఁడు మృతుం డైన విని విశ్వకర్మయుం విపులకోప
వేగుఁ డై లోకము ల్వెనఁగ మద్ద్రోహిని దునుమఁగ నోపినతనయుం నిపుడు
పడసెద నాతపోబలమున నని పల్కి భీమరయంబున బెరసి యొక్క
జడవహ్నిలోపలఁ జయ్యన వ్రేల్చిన వికృతఘోరాననవిస్ఫురద్భ

తే. యంకరోజ్జ్వలమూర్తి వృత్రాసురుండు, పుట్టె నతనికిఁ దైజసస్ఫూర్తిఁ గలుగ
సప్తమునులను బంపి తత్సంధిఁ జేసి, వేల్పుఱేఁ డొక్క వెంట నవ్విప్రుఁ జంపె.

వ. అంత. 118

క. ఆహత్యఁ జేసి యింద్రుని, దేహబలము వోయి వాయుదేవుని గూడె
న్మాహాత్మ్యశ్రీ మడఁగె విప్ర, ద్రోహంబున నెట్టిఁ డైన దురితముఁ బొందున్. 119

క. ఆసమయంబునను నహల్యాసక్తుం డగుట నింద్రుఁ డగ్గౌతముచే
గాసి పడి నైజతేజముఁ, బాసి వికృతి నొంది నష్టబలుఁడై యుండెన్. 120

చ. తదవసరంబున న్సకలదైత్యులు దానవులు న్మదంబునం
త్రిదశవిభు న్జయింపఁగ మదిం దలపోసి మఖాదిధర్మసం
పద లణఁగింపఁ బూని బహుపార్థివవంశములందుఁ బుట్టి రు
ర్వి దలరి భూరిభారవహవిహ్వల యై చనియె న్సురాద్రికిన్. 121

మ. చని యింద్రాదిసుపర్వులం గని మనస్తాపంబు దీపింప ని
ట్లనె నద్దేవి మనుష్యలోకమున నత్యంతోగ్రతేజోఘనుల్

దనుజుల్ పుట్టినవా రనేకనృపులై తత్సేన లక్షోహిణుల్
వినుఁడే నోర్వఁగఁ జాల మీక తగు నావ్రేఁ గంతయుం బాపఁగాన్. 122

ఇంద్రుఁడే పాండవరూపంబున నైదువిధము లగుట.

క. అని చెప్పిన నయ్యమరులు, విని యందఱు నపుడు ధరణివ్రేఁగుడుపఁగ న
త్యనుపమనిజతేజోంశము, లానరం బుట్టించి రుర్వి నుర్వీనాథా! 123

తే. అమరపతి నిజతేజ మేనంశములుగఁ, జేసి తా భూమరుజ్జలశిఖినభముల
శక్తు లూఁది ధర్మజ భీమ సవ్యసాచి, నకుల సహదేవు లనియెడినామములను. 124

మాలిని. అసురదమనలీలాయత్తకౌతూహలుం డై
మసలక భువిఁ గుంతీమాద్రులం దుద్భవించెన్
వసుధభరము మాన్ప న్వాసవుం డిట్లు తేజో
విసరపిహితమూర్తు ల్విస్ఫురింప న్మునీంద్రా! 125

క. పెక్కొడళులు పేరులు ని, ట్లక్కజముగఁ దాల్చి పుట్టినట్టిమహేంద్రుం
డొక్కండ కాక ద్రౌపది, కెక్కుడివా రరయ భర్త లేవురు చెపుమా. 126

వ. అని విహంగవల్లభులు ద్రౌపది యేవురకు నేకవల్లభ యైన తెఱం గెఱింగించి బలదేవు
నికిఁ బాటిల్లినబ్రహ్మహత్యాప్రాయశ్చిత్తప్రకారంబులు చెప్పెదము విను మని యి
ట్లనిరి. 127

బలరామబ్రహ్మహత్యాప్రాయశ్చిత్తప్రకారము.

క. కౌరవపాండవసమర, ప్రారంభం బెఱిఁగి రాముఁ డచ్చోటికిఁ దా
ద్వారవతినుండి వచ్చె వి,చారదశాసంమిళితనిజస్వాంతుం డై. 128

ఉత్సాహ. హరికిఁ బ్రియుఁడు నరుఁడు గాన హరి దొఱంగఁ డన్నరున్
హరిఁ దొఱంగి యేను గౌరవాధినాథుఁ గూడ నె
ట్లరుగ నేర్తుఁ బాండుతనయులందు నిల్చి కౌరవే
శ్వరుని శిష్యు నెట్లు వారు చంపఁ జూతు నక్కటా!. 129

ఉత్సాహ. వారు వీరు నాకు బాంధవమున నొక్కరూప యె
వ్వారిఁ గూడ నొల్ల బంధువర్గము ల్చలంబున
న్పోరఁ జూడఁ జాలఁ దీర్థములకుఁ బోయెద న్వగం
గూరుచుండ నేల యని ముకుందునకుఁ బ్రియంబునన్. 130

వ. అంతయుఁ జెఱింగించి హలధరుండు వీడ్కొని నిజపురంబునకుం జని మఱునాఁడు
తీర్థసేవ సేయువాఁడై నిశ్చయించి. 131

క. వివిధము లగుమధురసములు, చవి గొనుచుం దనియఁ ద్రావి సంఘూర్ణితచి
త్తవికారజనితమదర, క్తవిలోచనభయదవక్త్రకములుం దగుచున్. 132

ఉ. ఆవిభుఁ డొక్కకేల ముసలాయుధముం బెఱకేల రోహిణీ
దేవికరంబు పట్టికొని దేహరుచు ల్వెలుఁగంగ నంగన
ల్వేవురు గొల్వ రా సమదలీల మదాంధగజంబుచాడ్పునన్
రైవతశైలసానువనరమ్యతలంబునఁ గ్రీడ సల్పుచున్. 133

రైవతోద్యానవర్ణనము.

సీ. ఎనసి యొండొంటితో ననఁగి పెనంగెడు నవలతాతరుమిథునములసొబఁగు
సహకారపల్లవాస్వాదనక్రీడలు సలుపుకోకిలదంపతులబెడంగు
పాలయలుకలను దెల్పుచు నటించుచుఁ గ్రాలు విటకులటాళులవిలసనంబు
సరసదాడిమఫలాస్వాదనలీలలఁ గరమొప్పుశుకవధూవరులచెన్ను
తే. హంసవరటామనోజ్ఞవిహారవిభ్ర, మములఁ గొమరారుకమలషండములఖాతి
నర్థిఁ జూచుచు హాలధరుం డల్లనల్ల, నేఁగి యొక్కెడ నొకపొదరింటిలోన. 134

బలరాముఁడు ప్రత్యుత్థానముచేయమి నలిగి సూతుం జంపుట.

సీ. ఉన్నతాసనమున నుండి సూతుం డను పౌరాణికుఁడు సెప్ప బహుపురాణ
కథ లర్థి వినుచున్నకణ్వభరద్వాజకుశికాత్రికుత్సాదిగోత్రజాతు
లగుభూసురుల డాయ నరిగినఁ గనుఁగొని యమ్మహామతు లితఁ డధికశీధు
పానమదోన్మత్తుఁ డైనవాఁ డని భీతి దిగ్గన లేచి యాతిథ్యపూజ
తే. లొనరఁ జేసిరి సూతుఁ డయ్యున్నతాస, నమ్ము దిగ కున్నఁ జూచి మనమ్ము గ్రోధ
రంజితమ్ముగ నతనిశిరమ్ముఁ జేతి, గుదియఁ బగులంగ నొకవేటు గొనియె సీరి. 135

వ. ఇట్లు సంకర్షణగదాఘాతంబునం గతప్రాణుం డై పౌరాణికుండు బ్రహ్మదప్రాప్తుం
డయ్యె నంత. 136

ఉ. చచ్చినసూతుఁ జూచి యతిసంభ్రమకంపితచిత్తులై మును
ల్విచ్చి జటాజినావలులు వీడఁగ నల్గడఁ బాఱి రంతఁ దాఁ
తెచ్చెర బుద్ధికిం దెలివిఁ జెందిన రాముఁడు వెచ్చ నూర్చుచు
న్వచ్చునె బ్రహ్మహత్య బలవంతపుఁగర్మము ద్రిప్పి తెచ్చెనే? 137

చ. కరుణ యొకింత లేక యవుఁ గా దనునట్టితలంపు లేక భూ
సురుఁ డనుశంక లేక యిటు సూతుని నేఁ దెగఁ జూతునే సురా
పరిణతదుర్మదాంధ్యమునఁ బాపముఁ జేసితి దేహ మెల్ల నె
త్తురుఁబోల వల్చుచున్నయది దుస్తరపాతకసంక్రమమ్మునన్. 138

వ. అనుచు బలభద్రుండు పశ్చాత్తాపంబునం జిత్తం బుత్తలం బొంద నప్పుడు. 139

బలరామునితీర్థయాత్ర.

క. ఈదుష్కర్మం బంతయు, నేదఁగ నెల్లెడల దీని నెఱిఁగించుచు నే
వేదవిహితవిధినియతి, న్ద్వాదశసంవత్సరవ్రతముఁ జరియింతున్. 140

వ. అని నిశ్చయించి రేవతీప్రభృతియువతీజనంబుల వీడ్కొల్పి విధ్యుక్తప్రకారంబునం బ్రలంబఘ్నుండు ప్రతిలోమంబుగా సరస్వతీపుణ్యతీర్థంబు లాడం జనియె నని చెప్పి యప్పక్షివరులు ద్రౌపదేయకథాప్రకారంబు చెప్పం దలంచి యి ట్లనిరి తొల్లి త్రేతాయుగంబునందు. 141

హరిశ్చంద్రోపాఖ్యానము.

సీ. ఎవ్వనిమాహాత్మ్య. మెప్పుడు వేదము ల్చెలఁగి సుస్తోత్రము ల్సేయుచుండు
నెవ్వనిశాసనం బేడుదీవులరాజులకు శిరోభూషణలక్ష్మి నొందు
నెవ్వనిరక్ష మహేంద్రాదిసురలకుఁ బెట్టనికోట యై పెంపుదాల్చు
నెవ్వనిసత్కీర్తి యీయజాండం బెంత యంతయుఁ దాన యై యతిశయిల్లు
తే. నట్టిమహితగుణాభరణాభిరామ, మూర్తి ప్రత్యర్థినృపసమవర్తి పరమ
పూజ్యసామ్రాజ్యవైభవస్ఫూర్తి నిత్య, సత్యవర్తి హరిశ్చంద్రచక్రవర్తి. 142

మ. ధరణీచక్ర మవక్రవిక్రమకళాదర్పం బెలర్పంగ నే
ర్పరి యై నిర్మలసత్యధర్మనియతిం బాలించె దుర్భిక్ష డం
బరదుఃఖంబులు జారచోరభయ మున్మాదజ్వరవ్యాధి దు
ర్మరణాదు ల్ప్రభవింప కుండఁ బ్రజ ధర్మప్రీతి వర్తింపఁగన్. 143

క. ధనరూపబలంబుల న,త్యనుపమవిద్యాతపోమహత్త్వంబుల భూ
జనులకు నొదవదు మద మ, జ్జననాయకుసత్యధర్మశాసనమహిమన్. 144

వేఁట కేఁగినహరిశ్చంద్రుఁడు విశ్వామిత్రు దరి కరుగుట.

వ. ఇట్లు సత్యవ్రతగరిష్ఠుండును ధర్మకర్మవరిష్ఠుండును నైనయారాజర్షి ప్రజాపాలనంబు సేయుచు నొక్కనాఁ డరణ్యంబున కరిగి మృగయావినోదంబులం దగిలి చని చని ముందట నొక్కయెడ. 145

తే. మమ్ము రక్షింపు మని పలుమాఱుఁ గూయుఁ, నాఁడుకూయి వీతెంచిన నానరవరుఁ
డోడకోడకుఁ డేనుండ నొకఁడు మిమ్ము,నకట! యన్యాయవృత్తిమై నలఁపఁ గలఁడె.

క. ఇదె వచ్చెద వెఱవకుఁడీ, మది నంచును వేఁట యుడిగి మనుజేంద్రుఁడు శి
ష్టదయాళుత్వంబున దు,ష్టదమనకుతుకంబు నదరఁ జనుసమయమునన్. 147

క. ప్రారంభంబుల కెల్లను, నారయ విఘ్నము లొనర్చునావిఘ్నేశుం
డారోదనము తెఱఁగు మున్నారసి తా నచట నునికి నప్పుడు మదిలోన్. 148

మ. జితనం బారఁ దపోమహత్త్వమున విశ్వామిత్రుఁ డిట్టియ్యెడన్
సతతాభ్యాసకుతూహలాగ్ర్యనియతిన్ సాధింపఁగా విద్య లా
తతతీవ్రార్తిభయంబున న్దలఁకి యత్యంతంబు వాపోయెడిన్
ధృతి నీరాజును నోడకుం డనుచు నేతెంచెం గతం బేమియో. 149

వ. అని యూహించి. 150

తరువోజ. ఈరాజుఁ బ్రేరించి యీమునిరాజు, నెద నొవ్వఁ బలికించి యీతని క్రోధ
మారంగఁ జేసెద నంత నీవిద్య, లలజడిఁ బడ కేఁగు నని నిశ్చయించి
యీరాజుమది సొచ్చె నావిఘ్నరాజు, హా యని మఱియును నాయేడ్పు లెలుఁగు
లారాజు సైఁపక యతితీవ్రకోప,వాసభీషణవక్త్రుఁ డై యిట్టు లనియె. 151

చ. వెలుఁగుమహాప్రతాపశిఖివేఁడిమి దిక్కుల నించుచున్న నా
కొలఁది యెఱుంగ కెవ్వఁ డొకొ ఘోరపుఁజిచ్చటు చీరఁ గట్టెడి
న్దలరక యిట్టిదుర్మదు నధర్మపరు న్దురితాత్ముఁ జండదోః
కలితధనుర్విముక్తపటుకాండనిఖండితగాత్రుఁ జేసెదన్. 152

క. అని బెట్టదల్చుచును డాసినరాజుకఠోరవాక్యశిలలు చెవులఁ దాఁ
కిన నమ్ముని పెనుగోపమ్మున నుండెను విద్య లడఁగి పోయెం గినుకన్. 153

వ. అట్లు డాసి యారా జాక్రందించునంగనలం గానక. 154

క. విశ్వామిత్రుని నుద్య, ద్వైశ్వానరసదృశమూర్తివైభవు సాధా
త్రీశ్వరుఁడు బిట్టు గని చల, దశ్వత్థదళంబుభంగి సంగము వణఁకన్. 155

క. మ్రొక్కిన నోరి! దురాత్మక!, యెక్కడ వచ్చె? దటు నిలువు మీ వనుడుఁ గడు
న్దక్కి వినయమున మఱియును, మ్రొక్కుచు నిట్లనియె రాజముఖ్యుఁడు భీతిన్.

చ. అలుగకు మయ్య! యోమునిజనాగ్రణి! తప్పొకయింత లేదు నా
వలన నరేంద్రధర్మ మగువాక్యమ పల్కితిఁ జిత్తగింపు మ
స్ఖలితము గాఁగ నిచ్చుటయుఁ గాచుటయు న్విలు చేఁత బట్టి ని
శ్చలత రణంబు సేయుటయు శాస్త్రమతస్థితి రాజధర్మముల్. 157

వ. అనినం గుశికకులసంభవుం డిట్లనియె. 158

తే. ఎవ్వరికి నిత్తు గాతు నీ వెట్టివారి, రాజ యెవ్వరితో బవరంబు సేయు
దనిన విప్రుల కిత్తు భయార్తజనులఁ, గాతు శత్రులతోడ సంగర మొనర్తు. 159

మ. అనినం గాధితనూజుఁ డీవిహితధర్మాచారము ల్సల్పు దే
ని నరేంద్రోత్తమ! యేను బ్రాహ్మణుఁడఁ గానే రాజసూయాధ్వరం

బునకుం జాలినయంతసొమ్మొసఁగుమా భూదేవతాకోటికి
దనియ దక్షిణ లిచ్చి యజ్ఞ మమరేంద్రప్రీతి గాఁ జేసెదన్. 160

క. అని మునిపతి వేఁడిన న, మ్మనుజపతి భయంబు దక్కి మగుడను జన్మిం
చినవానిఁగా ముదంబునఁ, దనుఁ దలఁచుచు హర్షమయసుధామగ్నుం డై. 161

చ. వినుము మునీంద్ర! దక్షిణకు విత్తము చాలినయంత మున్న యి
చ్చినయదిగా నెఱుంగు మెద శ్రీయును రాజ్యము ధాత్రియుం బురం
బును ధనరాసులు న్సతియుఁ బుత్త్రుఁడు ధర్మచయంబు నేను నీ
ధనములె యిందు నీయభిమతం బగు నెయ్యది వేఁడు నాఘుడున్. 162

శా. నీవే యిచ్చినఁ గా దన న్గొనియెద న్వీరాగ్రణీ! ధర్మము
న్నీవు న్భార్యయుఁ బుత్త్రకుండు వెలిగా నీసర్వసామ్రాజ్యల
క్ష్మీవాల్లభ్యము మాకు ని మ్మనిన నిచ్చె న్నిర్వికారానన
శ్రీవిభ్రాజితమూర్తియై సమధికప్రీతి న్హరిశ్చంద్రుఁడున్. 163

హరిశ్చంద్రుఁడు విశ్వామిత్రునకు సకలరాజ్యము నొసంగుట.

వ. ఇట్లిచ్చి యమ్మునిశార్దూలుం డోడ్కొని పురంబున కరిగి యపరిమితకరితురగరథ
పదాతిబహుళంబును మంత్రిపురోహితదండనాథవారసీమంతినీవివిధవిభూతివిలసనం
బును నగణితమణికనకకలధౌతాదిసమస్తవస్తుపరిపూర్ణభాండాగారసముదయాభిరా
మంబును నైనసకలమహీరాజ్యలక్ష్మీవిభవం బంతయు సమర్పించినం బరిగ్రహించి
యయ్యుగ్రతేజుం డారాజుఁ జూచి. 164

క. పుడమియు నొడమియు రాజ్యముఁ, గడువేడుక నిచ్చితేనిఁ గైకొంటిమి పెం
పడరంగను స్వామ్యం బల, వడునే నీ పున్న మాకుఁ బార్థివముఖ్యా! 165

తే. వెడలి పొ మ్మేల మాటలు వేయుం? రాజ్య, మేకముఖము గాకున్న మా కెట్లు చెల్లు?
. వినుము రాజ! సూదికి రెండుమొనలు గలవె, యింకఁ దడసిన నిన్ను సహింప నవని.

తే. పిడుగుకంటెను దద్దయుఁ బెడిదమైన, యప్పలుకు కర్ణరంధ్రమ్ము లవియ నాత్మ
పఱియలుగఁ దాఁకుటయు వెఱ చఱిచి విభుఁడు, చిత్రరూపమ్మువిధమునఁ జేష్ట దక్కి.

వ. ఒక్కముహూర్తంబునకుం దెలివొంది మునిశాపభయంబునం గళవళించి యించుక
యుఁ దడయ శంకించి జలనివాసంబునం దపోనిష్ఠ నున్నవసిష్ఠుం దలంచి తనదిక్కు
లేమికిం బొక్కుచు సత్యైకనిశ్చయంబున సమస్తంబును బరిత్యజించి యప్పుడు.

సీ. సురుచిరకిరణవిస్ఫురణంబు డింది యెంతయు మాఁగువడినమార్తాండుపగిది
భాసురరత్నసత్ప్రభలు వాసిన విన్ననౌరోహణశిలోచ్చయంబుమాడ్కి
విలసితతారకవిభవంబు చెడి కడుఁ బాడఱి యున్ననభంబుకరణి
ప్రవిమలకుసుమసంపద యెల్ల నుడివోయి రూపు దక్కినమహీరుహముభంగి

తే. నొందఁ గోటీరహారకేయూరకంక, ణాదిమణిభూషణోత్కర మపనయించి
యొప్పు పొలివోయి దీనత నుండె బంధు, జనులచూడ్కులు కమర నజ్జనవిభుండు.

వ. ఇట్లు వర్జితాశేషవిభూషణుండై తరువల్కలంబులు ధరించి యన్నరేంద్రుండు శైబ్య యైనధర్మపత్నియుఁ దనయుండునుం దాను నిలు వెడలుసమయంబున నమ్మునికుంజరుం డతని కడ్డంబు వచ్చి. 170

సీ. క్రతుదక్షిణకుఁ బ్రతిశ్రుతము చేసినయర్థ మీక నీ వెక్కడి కేఁగె దనుచు
నిఖిలరాజ్యంబును నీక యిచ్చినవాఁడ దేహత్రయము నాకుఁ ద్రిక్కి యున్న
దింతియ సొమ్మిప్పు డేమియుఁ బెద్దలేదనుటయుఁ నలిగి సంయమి ధనమున
కెన్నినాళ్లైడ గొనియెదు చెప్పు మంతలో నవరింప కుండిన శాప మిత్తు

తే. ననిన వడవడ వడఁకుచు నతఁడు మ్రొక్కి, యొక్కనెల సైఁపవే కృప యుల్లసిల్ల
నంత నీయప్పు దీర్చెద శాంతిఁ బొందు,మనిన ముని ప్రీతి దీవించి యరుగు మనియె.

శా. ఆరాజేంద్రుఁడు గాల్నడ న్వెడలెఁ దో నాలుం దనూజుండు నే
తేరన్ శోకము మూర్తమైనయటు లార్తిం బొందె మో మెత్తకే
వ్వారిం జూడక తల్లడంబున సుహృద్వర్గంబు లుల్లంబులం
దారం గూరిన తీవ్రదుఃఖముల హాహారావము ల్సేయఁగన్. 172

ఆ. ఇట్లు వెడలి యమ్మహీనాథుఁ డరుగంగ, నపుడు పౌరజనము లంత తెఱఁగు
నెఱిఁగి మీఁద మిన్ను విఱిగి కూలినయట్టి, కరణి గుండె లవిసి కళవళించి. 173

వ. ఆరాజు నాలోకించి. 174

సమస్తము విడిచి వెడలుహరిశ్చంద్రునిం గని పురజనులు దుఃఖించుట.

సీ. కాంచనాలంకృతిఁ గర మొప్పి నీమ్రోల నేతెంచుగజఘట లెందుఁ బోయెఁ?
కనకకింకిణులచెల్వునఁ గ్రాలుతురగంబు లేల నీకెలఁకుల నేఁగు దేవు?
రత్నోజ్జ్వలము లైనరథములు నీపజ్జ వడిఁ జను దేర కెక్కడ నడంగె?
వివిధాయుధస్ఫూర్తి వెలుఁగుకాల్వురమొత్త మేల నీతో రాక యేమి యయ్యె?

తే. రమ్యభూషణదివ్యాంబరములు దొఱఁగి, నారచీరలు గట్టి యనాథవృత్తి
నాలుఁ గొడుకును వెంట రా నరుగునట్టి, యెడరు వాటిల్లెనే మేదినీశ! నీకు. 175

క. అని పురపురఁ బొక్కుచుఁ బుర, జనములు పురి వెడలి రాజసత్తమువెనుకం
జని యంతంతకునుం బై, కొనుశోకానలమునందుఁ గుందుచు మఱియున్. 176

సీ. పొలుచునీరాజ్యవిభూతి వ్రేఁగయ్యెనే దైవంబుకంటికి ధరణినాథ!
చక్రంబు పనిసేయ నడిసిన్ననీపెంపు బూద్దబొట్టయ్యెనే భూరికీర్తి!

యాదిగర్భేశ్వరి యగునీమహాదేవి యింతకు నోఁచెనే యిద్ధచరిత!
గోమునఁ బెరిఁగినయీముద్దుపట్టిభాగ్యం బిట్టి దయ్యెనే యధికపుణ్య!
తే. హా! మహారాజ! రాజసూయాధ్వరేశ!, హా! హరిశ్చంద్ర! నిత్యసత్యాభిరామ!
హా! దృఢైశ్వర్య! శౌర్యజితారిలోక!, హా! సమస్తలోకేశ! దయారమేశ! 176

వ. అనుచు నంతకంతకు నతిశయిల్లుసెవ్వగలపెల్లున నుల్లంబులు పల్లటిల్ల నందంద క్రమ్ము నశ్రుజలంబులవెల్లి మునింగి మొగంబులు దీనంబు లగుచుండ నొండొండ యడరుగద్గదికం జేసి వికలంబు లై యాక్రందనారావంబులు చెలంగ నంగంబు లవశత్వంబు నొంది యొరగ నప్పురజనంబు లెల్ల నమ్మహావిభు డాయం బోయి. 177

క. ధరణీశ్వరులకు ధర్మం, బరయంగాఁ బ్రజలయార్తి యణఁచుటయె కదా
ధరణీశ్వర! యే మార్తిం, బరితాపముఁ బొందఁ జనుట పాడియె నీకున్. 178

ఉ. ఊరక యేల పోయెదు? నృపోత్తమ! దీనుల మమ్ముఁ జూడవే
కారుణికాగ్రగణ్యుఁడవు గావె? ముహూర్తము నిల్చి నీముఖాం
భోరుహవిభ్రమంబు దని వోవఁగఁ గ్రోలి మదీయలోచనో
దారమధువ్రతాళి ముద మందెడునట్టులుగా నొనర్పవే. 179

ఆ. మార్గజనితరేణుమలిన మై నీముఖాం,భోజ మింకఁ జాలఁ బొలుపు దఱిఁగి
వాడి తొంటియంత చూడఁగా నొప్పక, యుండు నేఁగ వలవ దుజ్జ్వలాంగ! 180

చ. అని కరుణంబుగాఁ బురజనావలి పల్కుచు రాఁ దదీయవా
క్యనిచయశృంఖలం దవిలి యమ్మెయిఁ బోవఁగఁ గాళ్లు లాడమి
న్మనుజవిభుండు శోకరసమగ్నత మార్గముక్రేవ నిల్చిన
న్గనుఁగొని కౌశికుం డలిగి కన్నుల నిప్పులు రాల నిట్లనున్. 181

విశ్వామిత్రుఁడు హరిశ్చంద్రుని ధర్షించుట.

తే. ఇస్సిరో! దురాచారుని హీనసత్య, వచను ని న్నేమిచెప్ప? నా కుచితవృత్తి
నిచ్చి రాజ్యము క్రమ్మఱఁ బుచ్చుకొనఁగఁ, దలఁచి నీవండ గొనియెదు నిలిచి యిచట.

చ. అనినఁ జలించుచు న్నృపతి యంగనకే లొకచేఁ దెమల్చి వే
చనఁ జన నేమి చెప్ప మునిచంద్రము? చేతిప్రచండదండ మె
త్తి నయ మొకింత లేక సుదతీతిలకంబుకృశాంగవల్లి నే
సె నిభము దొండ మెత్తి మదజృంభిత మై లత వ్రేయుచాడ్పునన్. 183

తే. దాని కత్యంతశోకాగ్నితప్తుఁ డగుచు, నరిగెఁ గాని యించుకయు నొండాడఁడయ్యె
నధిపుఁ డప్పుడు విశ్వాఖ్యు లైనవేల్పు, లేపు రమ్మునిసరంభ మెల్లఁ జూచి. 184

ఉ. అక్కుటిలంబు డెందములయందు జనింపఁగ వచ్చి యక్కటా!
యిక్కమలాక్షి సాధ్వి నిటు లేటికి మోఁదెదుఁ జేతికోల? నిం

కెక్కుడిపుణ్యలోకముల కేఁగెడు నిమ్ముని సత్యనిష్ఠఁ బెం
పెక్కినయన్నరేశ్వరుని నేమిటి కిష్టయిఁ గాసి పెట్టెడిన్. 185

విశ్వామిత్రునిశాపమున విశ్వేదేవతలు ద్రౌపదేయులై జనించుట.

వ. అనిన నప్పలుకులు విని విశ్వామిత్రుండు రోషారుణితలోచనుండై యవ్విశ్వనామ
దేవతలఁ జూచి మనుష్యపక్షపాతంబున నన్ను ధిక్కరించితిరి మనుష్యులు గం డని
శపియించి తోన ప్రసన్నత్వంబు గైకొని మీకు సంతానంబు నుర్వినుండకుండవల
యుం గావున మీరు బ్రహ్మచారులై కామక్రోధలోభమోహమదమత్సరంబులం
బొరయక యల్పకాలంబున శరీరంబులు విడిచి దేవభావంబులు గైకొం డని యను
గ్రహించె నది కారణంబుగ విశ్వేదేవులు ద్రౌపదిగర్భంబునఁ బాండునందను లేవు
రకు నుద్భవించి వివాహంబులు లేక దీర్ఘాయుష్యులు గాక చచ్చి రని చెప్పి యప్ప
క్షివరులు భవత్ప్రశ్నంబు లన్నింటికి నుత్తరంబులు చెప్పితి మింక నేమి వినవలతు
చెప్పు మనిన జైమిని యి ట్లనియె. 186

తే. అమ్మహారాజు దుస్సహ మైనయట్టి, దుఃఖములఁ బొంది యక్కటా! తుది సుఖంబు
లనుభవించెనె యెప్పటియట్ల? వినఁగ, వేడ్క యయ్యెడుఁ దత్కథావిధముఁ జెపుఁడ.

చ. అనవుడుఁ బక్షు లిట్టు లని రమ్మునివల్లభుతోడ గాధినం
దనుపటురౌద్రవృత్తి గని తల్లడ మంది పురీజనంబు లె
ల్లను దరియింప రానివగల న్దరసిల్లుచు నప్డు క్రమ్మఱం
జని రటు లార్తుఁ డై నృపతిసత్తముఁ డాలు సుతుండుఁ దోడ రాన్. 188

హరిశ్చంద్రుఁడు కాశి కేఁగుట.

చ. తొలఁగనిసత్యధర్మములు తోడుగఁ దాలిమి యూఁది దుఃఖ మ
న్జలనిధిఁ గూలుచు న్వివిధశైలములు న్నదులు న్మహావనం
బులును నతిక్రమించి యట భూవరుఁ డీశనివాసము న్మహీ
తిలకము సర్వమంగళము దివ్యము ముక్తిపదంబు నై భువిన్. 189

క. కర మొప్పెడుకాశీపుర,వరముఁ బ్రవేశించునెడ నవారితతేజ
స్స్ఫురణోగ్రుఁ గౌశికుం గని, ధరణీశుఁడు మ్రొక్కుటయు నతం డి ట్లనియెన్.

రాజు కాశియందుఁ గౌశికునిర్బంధమునం జింతాకులుం డగుట.

తే. నీవు నుడివిననెల నిండె నేఁటితోడ, నేది మాసొమ్ము తెమ్ము మహీతలేశ!
యనిన నింకను దినమునం దర్ధమున్న,యది సహింపు మునీంద్ర! నీ వంతదాఁక.

క. అనవుఁడు నౌఁగా కని యమ్మునిపతి వోవుటయుం రాజముఖ్యుఁడు చేతో
వననిధి పిండలిపింపఁగ, ఘనచింతామంథరంబు గలపఁగ మదిలోన్. 192

సీ. ఈమునీంద్రున కర్థ మీరెండుజాముల కెక్కడ నపరింతు? నెందుఁ జొత్తు?
నెదురు దీర్పఁగ బంధు లెచ్చటఁ గల రిప్పు? డెవ్వరి నడుగుదు హీనవృత్తి?
నెట్టు దట్టుదుఁ బ్రాణ? మేదెస పోదు? నే నెయ్యడ నడఁగుదు నింక? నకట!
నెలమితో విప్రున కిచ్చెద నని పల్కి యూ కున్నఁ గ్రిమిజన్మ మిపుడ వచ్చు
తే. నేమి సేయుదు?ననుచు నరేంద్రుఁ డలఁత, నొరియుచును మోము వ్రాల్చిననింతియేడ్పు
గొలుఁగులోఁ గన్నుఁగవ నశ్రు లొలుక జీవి,తేశుఁ గనుఁగొని సుదతి తా నిట్టు లనియె.
తే. ధీరమతి నీవు నిట్లు చింతింపఁ దగునె?, సత్యపాలన మొనరింపు సత్యహీనుఁ
డైనపురుషుదేహము దా శ్మశానతుల్య, మధిప! మేటిధర్మంబు సత్యంబ యండ్రు.
క. ఒనరఁగ హయమేధము లే, డొనరించితి రాజసూయ ముజ్జ్వలవిభవ
మ్మునఁ జేసితి సంతానమ్మును బడసితి సుకృతి నీవు పుణ్యచరిత్రా! 195
వ. అనుచు నిట్టూర్పు లందంద సందడింపఁ గన్నీరు గడలుకొన గద్గదికానిరుద్ధకంఠి యగుచు దండంబున సుడివడుతలం పెట్టకేలకు వెలువరించుకొని యమ్మహాదేవి యిట్లనియె. 196
తే. పుత్రలబ్ధిఁ గృతార్థులు వొలుతు రర్వఁ, గాన నన్నిప్పు డమ్మి యక్కౌశికునకు
ధనము వెట్టి సత్యమ్మును మనిపికొనుము, బొంకుకంటెను జావైనఁ బొంక మనఘ!
క. అని చుఱచుఱఁ గొఱవిం జూఁ,డిన క్రియ సతి పలుకుటయును డెంద మవిసి య
జ్జనపతి పిడు గడిచినవిధ,మున మేదిని మునిఁగి పడియె మూర్ఛాగతుఁడై. 198
చ. పడి తెలివొంది లేచి పొరి బాష్పజలంబులు మేను కప్పఁగాఁ
బడఁతుకఁ జూచి నీవు మృదుభాషిణి వక్కట! యింత కోర్చి న
న్నడజడి పెట్టుమాట యిటు లాడఁగఁ గూడునె? హా! యవాచ్యము
ల్విడువు లతాంగి! యంచుఁ బటువేదనఁ గ్రమ్మఱ వ్రాలె మేదినిన్. 199
మ. పతి మూర్ఛాగతుఁ డైనఁ జూచి సతి బాష్పచ్ఛన్నవక్త్రాబ్జ యై
ధృతి యొక్కింతయు లేక హా విడిచి యార్తి న్హా! మహారాజ! హా
చతురంభోధిపరీతభూభువనభాస్వద్బాహుఖడ్గాగ్రచూ
ర్ణితవీరారిశరీరభూషితధరిత్రీభాగ! హా! వల్లభా! 200
తే. హా! హరిశ్చంద్ర! కనకపర్యంకతలము, నందుఁ బొందుసేయంగ మే యకట! చెనఁటి
నేలఁ గూలినయది నేఁడు నీచదైవ, మిట్టిదశఁ దెచ్చె దివిజేంద్రభోగ! 201
వ. అని విలపించుచు నమ్మహాదేవి భర్తృదుఃఖభారపీడితయై సొలసి నేల వ్రాలె నట్లు తల్లియుఁ దండ్రియు నెవ్వరు దిక్కు లేక నిశ్చేష్టితులై పడి యున్నం గనుంగొని తదీయనందనుం డగుబాలుండు. 202

క. కన్నుల బాష్పము లురలఁగ, నన్నరవరుఁ జేర నరిగి యతిదైన్యముతో
నన్నన్న! యాఁకలయ్యెడి, నన్నము నా కిపుడు పెట్టు మని యడుగుటయున్.

ఆ. కాలకల్పుఁ డైనకౌశికుఁ డేతెంచి, శిశిరవారి వారి నేదదేర్చి
యేల నేలఁ బడఁగ లే లెమ్ము నృప! యాఁగ, రానియప్పు వగల నీన కున్నె? 204

క. అని యూఱడించి యేదీ, ధనము? ధరణినాథ! ధర్మతాత్పర్యము నీ
మనమునఁ గలదేని రయం, బునఁ బెట్టుము సత్యనిష్ఠఁ బొందుము నెమ్మిన్. 205

క. సత్యమున నున్న దీధర, సత్యమున వెలుంగుఁ దరణి సత్యమున నె తా
నిత్య మయి స్వర్గ మమరును, సత్యము ధర్మములలోఁ బ్రశస్తం బనఘా!. 206

తే. వినుము తుల నిడి యెత్తుచో వేయితురగ, మేధములకంటె సత్యంబు మిగులఁదూఁగెఁ
గాన సత్యయుక్తుండవు గమ్ము సొమ్ము, దెమ్ము మమ్ము రమ్మనకు నీ దెసకు నింక. 207

ఉ. క్రూరుఁడ వీ వనార్యుఁడవు కొంకవు బొంకఁగ నిట్టినీయెడం
గారణ మేమి మాకు నధికప్రియవాక్యము లాడు చుండ నం
భోరుహమిత్రుఁ డస్తగిరిఁ బొందెడుఁ బైకము చక్కఁబెట్టకి
ట్లూరక యున్న నిత్తుఁ గడునుగ్రపుశాపము నీకు భూవరా! 208

చ. అని ముని యేఁగినం గడుభయమ్మునఁ దల్లడమందునాథుఁ జూ
చి నరవరేణ్య! నన్ను నెడ సేయక యమ్మి ఋణమ్ము దీర్పు కౌ
ధనుఁ డగుచున్న కౌశికునిదారుణశాపముపాలు గాకుమీ
యని పలుమాఱు వేఁడుకొనునంగనమాటకు రాజు పొక్కుచున్. 209

క. మనమున రోఁతయు నొడఁబా, టును బెనఁగొని మిక్కుటంపుడోలాయనముం
బెనుపఁగ నన్నృతభయంబును, మునిశాపభయంబు వనట ముంప వికలుఁడై. 210

ఆ. ఎట్టకేల కమ్మహీవిభుండు మనమునఁ, దెగువఁ జేసి మగువమొగముఁ జూచి
యకట! నిర్దయాత్ములైననృశంసులఁ, బోల నేల నాకుఁ బోవ వచ్చు? 211

క. నిను నమ్ముకొనియెదం బద, వనరుహదళనేత్ర! యనుచు వారాణసి చొ
చ్చి నరేంద్రుఁడు బాష్పంబులు, గనుఁగవ వెల్లిగొన నెలుఁగు గదలుకొనంగన్.

హరిశ్చంద్రుఁ డంగడివీథిని భార్యాపుత్త్రుల నమ్ముట.

సీ. ఓపురజనులార! నాపత్ని నమ్మెద నే దాసిగా వెల యెఱిఁగి పెట్టి
కొనుఁడు న న్నెవ్వఁడవని యడిగెద రేని నే నృశంసుండను దానవుండ
నతిపాపకర్ముఁడ నాలి నమ్ముకొనంగ నరుగుదెంచినకఠినాత్మకుండ
నను చుండ నొక్కబ్రాహ్మణవృద్ధు చనుదెంచి మత్ప్రియాంగన సుకుమారి పనికిఁ

ఆ. జాల దిచ్చె దేని చయ్యన వెలఁ జెప్పు, వరవు డెట్లు మాకు వలయు ననిన

విభుఁడు విపులదుఃఖవేదనఁ బలుక నో, రాక యున్న నంత నాద్విజుండు. 213

ఆ. తగినయంతధనము దాన యన్నరనాథు, వల్కలముల ముడిచివైచి యొడిసి
పెలుచ నాలతాంగి పెడఁబాయఁ దలవట్టి, యీడ్చె నీడ్వ నేడ్పు లెలుఁగులొద.

ఆ. విడువవయ్య తండ్రి ! తడయక వచ్చెద !, వీఁడె నన్నుఁ జూచి వెగచి వెగచి
కొడుకు దద్ద వెగడు పడి యేడ్చుచున్నాఁడు, బుజ్జగింతు ననుచుఁ బుత్త్రుఁ గాంచి.

క. అన్నన్న ! నన్ను ముట్టకు, మన్న ! నృపతనూజ ! దాసి నచటి ననుచుఁ బైఁ
గన్నీరు వెల్లి గొనఁగా, నున్న జననికొంగు బాలుఁ డుడుగక పట్టెన్. 216

తే. పట్టి విడువక యేడ్చినఁ బట్టి తల్లి, పెట్టి పోఁ జాల కర్మిలి పెద్ద యడలి
విప్రుఁ గనుఁగొని వీనిని విలువవయ్య !, గోవుతోడన వత్సముఁ గొనువిధమున. 217

వ. అని యద్దేవి యత్యంతదీనానన యై ప్రార్థించిన నతండు శాస్త్రవిదులు పురుషునకుఁ బెక్కువేలుమాడలు నంగనకు నర్థంబునుం జెప్పుదురు గావున నిక్కుమారునకు వేనవేలుమాడలు గొను మని యన్నరపతి కిచ్చి యయ్యిరువుర నీడ్చుకొని పోవం గనుంగొని నిట్టూర్పు లందంద సందడింప విపులవేదనాధూయమానమానసుం డగుచు నమ్మానవేంద్రుండు. 218

చ. అనిలుఁడు నర్కుఁడు న్శశియుం నైనను గానరు మున్ను దన్ను న
త్యనుపమరాజ్యభోగమహిమాతిశయంబున నట్టికాంత నేఁ
డినకులరత్న మై వెలుఁగునిట్టిసుతుండును దాను నాకతం
బున వరవృందనంబునకుఁ బోయెనె యొగతిఁ బోదు దైవమా ! 219

మ. అని దుఃఖింపఁగఁ గౌశికుం డచటి కుద్యద్వేగుఁ డై వచ్చినన్
జననాథుం డిదె సొమ్ము కొమ్మనిన నాస్వల్పార్థముం జూచి కో
పనుఁ డై యంతట దక్షిణాధనము సంపన్నంబుగాఁ జేసితే
నను గారించెద వేల ? యింకఁ దడ వైనన్ శాప మిత్తుం జుమీ ! 220

ఆ. ప్రొద్దు జాము తక్కుపోయి నే వచ్చెద, వేయుఁ జెప్ప నేల ? వేగ కొఱఁత
ధనము పెట్టవలయు నని యప్పు డిచ్చిన, ధనము గొని యతండు చనియెఁ జనిన.

హరిశ్చంద్రుఁడు దన్నమ్ముకొనుట.

ఉ. ఆనరనాథుఁ డప్పుడు భయమ్మున శోకము నగ్గలింపఁగాఁ
దా నెద నాత్మవిక్రయము దక్క ధనంబున కేయుపాయముం
గానక నిశ్చయించి యధికధ్వని నిట్లను నన్ను నమ్మెద
న్నానుగ నెవ్వ రైనను ధనం బిటు దెండు గొనుండు నావుడున్. 222

వ. అయ్యవసరంబున ధర్ముండు రయంబున. 223

మ. నిడుమోముం గుఱుగేలు గుండకడుపు న్నీలత్వము న్మిట్టలు
న్గడుదీర్ఘంబులు నైనదంతములు పింగశ్మశ్రుకేశంబులు
న్జెడుగుంగంపును గల్గి హేయ మగునీచీభావముం దాల్చి తా
జడక ల్గట్టి నికృష్టయష్టికరుఁ డై చండాలవేషంబుతోన్. 224

కొనవచ్చినచండాలునకును హరిశ్చంద్రునకునైన సంవాదము.

క. ఇల గోలఁ దట్టుచు న్సం, బళి సంబళి యనుచుఁ గ్రందుపడుజనములకు
న్దొలఁగుచు నొదుఁగుచు నాథా, తలపతికడ కరుగుదెంచి తా నిట్లనియెన్. 225

సీ. నేను జండాలుఁడ నృపవర! పురమున వీరవిఖ్యాతుఁడ ధీర! వినుము
చంపఁగఁ దగువారిఁ జంపెడివాఁడఁ జచ్చినవారిమొగములచీర లెప్పుడుఁ
గొనియెడివాఁడ నెక్కుడుసొమ్ము గలవాఁడ నెంతయర్థంబైన నిచ్చి నిన్ను
విలిచెదఁ జెప్పుమా వెల యన్న నారాజు మాలను సేవించి మనుటకంటెఁ

తే. గౌశికోగ్రశాపాగ్నిచేఁ గ్రాఁగి పోవు, టైన మేలని తలఁప నమ్మౌని యరుగు
దెంచి నృపుఁ జూచి నాయప్పుదీర్ప రాదె, యధికధనము నీకిచ్చు వీఁ డనిన విభుఁడు.

చండాలదాస్యమునకై కౌశికహరిశ్చంద్రసంవాదము.

క. ఇనవంశంబునఁ బుట్టిన, మనుజేంద్రుఁడ నఖిలలోకమాన్యుఁడఁ గొఱమా
లినమాలని నకట! తపో, ధనసత్తమ! యేను గొలువఁ దగునే? చెప్పుమా. 227

మ. కరుణం జూడుము కావు మిప్పుడు త్రిలోకస్తుత్య! చండాలసం
కరదోషంబును బొంద కుండఁగ ననుం గైకొమ్ము నీబంటుగాఁ
బరిశిష్టం బగుసొమ్ము నాకు వెలగా భావింపు మంచు న్మునీ
శ్వరుపాదంబులు పట్టెఁ జేతుల హరిశ్చంద్రుండు దైన్యంబునన్. 228

ఉ. అక్కట! యేమి సెప్పఁ గఠినాత్ముఁ డమ్ముని యిట్టు లార్తుఁడై
మ్రొక్కినరాజుఁ గన్గొని యమోఘముగా ననుఁ గొల్చి బంటవై
దక్కితి గాన మాలనికి దక్కఁగ నమ్మితి నేను నిన్ను వీఁ
డక్కఱ దీఱ నిచ్చు నొక యర్బుదవిత్తము నాకు నావుడున్. 229

ఉ. మాలఁడు వొంగి యమ్మునికి మానుగ నర్థ మిచ్చి పట్టె భూ
పాలుని నంటఁ గట్టి యకృపామతిఁ గొంకక చేతికోలఁ బై
తో లెగయంగ వ్రేసి వెసఁ దోడ్కొని పల్లెకుఁ బోయె నేరికిం
గాలవశంబునం గలుగుకర్మఫలంబులు దప్ప నేర్చునే? 230

వ. ఇట్లమ్మహారాజు కాలవశంబునం జండాలపక్కణగతుం డై దురంతదుఃఖార్ణవంబునం
దేలుచుం దనమనంబున నిజజీవితేశ్వరిం దలంచి. 231

క. బాలునిదీనం బగుమో, మాలోకించుచును శైబ్య యత్యంతార్తిం
దూలి తనదాస్య ముడుపం, జాలుదు నని నన్నుఁ దలఁచు సతతము నకటా! 232

క. నాపాటెఱుంగ దింతయుఁ, నాపుత్త్రుఁడు ననుచుఁ బొక్కు నత్యంతపరీ
తాపంబు నొందు మాలని, చేపడుటకుఁ దేరుఁ బెంపుఁ జెడిపోవుటకున్. 233

వ. ఇవ్విధంబున హరిశ్చంద్రుండు నిరంతరఖేదసానలదందహ్యమానమానసుం డగుచుండ నొక్కనాఁ డతనితో నాచండాలుండు నీకుఁ గాటికాపరితనం బిచ్చితి నందుఁ బుట్టినధనంబునందు రాజునకు నాఱవభాగంబును నాకు మూఁడుపాళ్లనుం బెట్టి నీవు రెండంశంబులు గొని బ్రతుకు మని నియమించి పంచిన మహాప్రసాదం బని వారణసీపురంబుదక్షిణంబునకుం జని. 234

హరిశ్చంద్రుఁడు శ్మశానవాసము చేయుట.

సీ. శవదహనోద్భూతసంతతధూమంబు బహువిధదుర్గంధబంధురంబు
కేశచితాభస్మకీకసకీర్ణంబు బేతాళడాకినీభూతచితము
వాయసగృధ్రగోమాయుసంకలకలంబు మేదోవసామాంసమేదురంబు
మృతబంధుశోకార్తసతతహాహారవ మమితకపాలపిండాన్నసాంద్ర
తే. ముజ్జ్వలాగ్నిశిఖావృతవ్యోమభాగ, మగుచు నత్యంతవిస్తార మైనభీక
రశ్మశానమ్ము గని యద్ధరావిభుండు, దానిఁ దఱియంగఁ జని యందుఁ దా వసించి.

ఉ. కాలియ పట్టినట్లు గడుఁ గంది కృశుం డయి పీడి వెండ్రుక
ల్దూలఁగ లాంఛనధ్వజముతో లగుడంబు తగ న్ధరించి ప్రే
తాలయ మెల్లఁ ద్రిమ్మరుచు నాయతు లన్నియుఁ గొంచు రాజు పె
న్మాలతనంబు నొందెఁ గొఱమాలినదైవముచెయ్ది నక్కటా! 236

సీ. ప్రాణంబుతోడ జన్మాంతరంబును బొందె నిట్లు హరిశ్చంద్రుఁ డేమి చెప్పఁ?
బీనుంగులకుఁ బెట్టుపిండము లుడుచుచు మేదోవసామాంసమిళితపంక
ముల నెప్పుడును బ్రుంగు చొలికి బూడిదలలోఁ బొరలుచుఁ గట్టినబొంతగప్పు
చొడలిదుర్గంధంబు సుడియంగ వడిని జుగుప్స రూపంబు గైకొన్నమాడ్కి
ఆ. సతినికృష్టవృత్తి నార్తుఁడై సుతసతీ, సుహృదమాత్యబంధుసుఖవియోగ
వేదనానలమున వేఁగుచు నమ్మెయి, నుండ నెలలు పదియు రెండు నిండె. 237

హరిశ్చంద్రుఁడు శ్మశానమునఁ గల గాంచుట.

వ. అంత నొక్కనాఁ డమ్మహీపతి పరేతనికేతనంబున నిద్రించి యత్యద్భుతం బైన కలఁ గాంచె నెట్టనినఁ దాను జండాలికాగర్భంబున నుద్భవించి సప్తవర్షవయస్కుండై యొక్క శ్మశానంబున మృతసంస్కారమాల్యాహరణాధికారంబున నుండం గొందఱు విప్రు లొక్కశవంబు గొనివచ్చి దహనవేతనంబునకై తనచేతం బరాభూతి నొంది

కోపించి ఘోరనరకంబునం బడు మని శపించిన నప్పుడు కాలకింకరులు దన్నుం బట్టుకొనిపోయి తప్తసికతానలప్రదేశంబుల నడిచియుఁ బొడిచియుఁ గాల్చియుఁ ద్రేల్చియుఁ గండలు గోసియు నూనియ నుడికించియుఁ బురీషకూపంబుల ముంచియు ననేకక్రూరదండంబులు దండింపం బూయశోణితంబులు ద్రావుచు నొక్కొక్కదినంబు శతవత్సరంబులుగా వత్సరద్వయం బధికదుఃఖంబు లనుభవించి నారకభావోత్సార్యమాణుండై క్రమ్మఱ మహీతలంబునం బడి ఖర శునక హస్తి వానర చ్ఛాగ బిడాల కంక గృధ్ర మత్స్య కూర్మాదినానాకుయోనులం బుట్టి సార్థవాయనంబు తీవ్రవేదనలపాలై యెప్పటిరాజస్థితి వడసి జూదంబున నాలిని గొడుకును రాజ్యంబును గోలుపడి యేకాకియై యడవుల కరిగి సింహంబుబారిం బాఱి శరభంబుచేత రక్షితుఁడై దానిచేత నతిపీడితుం డగుచు భార్యానందనులం దలంచి వందురి తిరుగుచు నొక్కయెడ నయ్యిరువురుఁ దమ్ము రక్షింపు మని తన్నుం జేరొక్కని పిలుచు నెలుంగులు విని డాయం బోయి వారలం గానక పరిభ్రమించు చుండం బదియేనుదివసంబులు గొఱంతగాఁ బండ్రెండేఁడులు నిండినతఱి విశ్వామిత్రుచే నంత వృత్తాంతంబు నెఱింగి జముండు తనకడకు రప్పించి యిది యెల్లఁ గౌశికరోషంబున నయ్యె దానం జేసి భవన్నందనుండు మృత్యుగతుం డగుం బదంపడి పరమశుభంబు గలుగు దుఃఖశేషంబుగుడువ మనుష్యలోకంబునకు బొమ్మని త్రోయించిన నంతరిక్షంబున నుండి నేలంగూలినవాఁడై బిట్టు మేల్కాంచి. 238

క. కడు భీతియు బెగ్గలమును, నడరఁగ నిది యొక్కకల మహాద్భుత మేని
య్యేడుమలు పండ్రెండేఁడులు, పడితినొ! కలయో! నిజంబొ! భ్రమయో! యకటా!.

క. ఈదుఃఖము సుఖ మయ్యెడు, నాదుఃఖములకును నగ్గమైతిమి విధిచే
నీదుస్స్వప్నమునెపమున, నీదుర్దశకంటె నింక నేదస యగునో?. 240

తే. అనుచు నెంతయుఁ దలరి యమ్మనుజవిభుఁడు, మోడ్పుఁగేలు శిరంబున మోపి వేల్పు
లార! యెప్పుడు నేకీడు చేరకుండఁ, గరుణ నను బుత్రు నింతిని గావరయ్య!.

క. అని పలికి నృపతి శవవే, తనకారణమునను నంత దలఁపును జెడి భా
ర్యను బుత్రు మఱచి ప్రేతస, దనసంచరణంబునందుఁ దత్పరుఁ డయ్యెన్. 242

వ. అంత నమ్మహీవల్లభువల్లభ యొక్కనాఁడు. 243

చ. ఉరగముచేతఁ జచ్చినతనూభవునిం గొని శోకవేదనా
పరవశయు న్వికీర్ణకచభారయు నుద్గతబాష్పపూరయు
న్గరతలతాడితాస్యయును గద్గదికావికలార్తనాదయు
న్జరణవిపర్యయాపగతసత్వరయానయునై పొరిం బొరిన్. 244

వ. ఏడ్చుచుం బరేతనికేతనంబున కేతెంచి యక్కుమారు నొక్కయెడ నిడి కూర్చుండి.

మృతపుత్త్రులైన చంద్రమతీహరిశ్చంద్రులు శ్మశానమున దుఃఖించుట.

ఉ. పోరనఁ బొంగి శోకరసపూరము నిర్భరబాష్పపూరము
ల్వారఁగ కన్గవం దొరఁగ వాతెఱ లాలలు గ్రమ్ముదేర హా
హారవము ల్సెలంగ విరియంబడి వేనలి ధూళి గ్రుంగ న
ప్పూరిమిపట్టిఁ బేర్కొనుచుఁ గోమలి మేదినిఁ జేతు లూఁదుచున్. 245

సీ. బహువిధంబులఁ బ్రలాపం బొనర్చుచు నేడ్చుసతియేడ్పు విని డాయఁ జని విభుండు
కార్చిచ్చు సోఁకినఁ గంది మ్లానత్వంబుఁ బ్రాపించునీవియసూను నొంది
యున్నట్టివనితఁ దమత్సంగమున నున్నయహివిషవ్యపగతప్రాణుఁ డైన
సూనునిఁ జూచి యించుకయు నెఱుంగక యబ్బాలుశుభలక్షణావలులకుఁ

తే. చోద్యపడియేనరేంద్రునిసుతుఁడొ వీఁడు?, కాలుఁ డెటు మ్రింగనోపెనిఁగరుణమాలి?
యనుచు మదిలోనఁదలఁచియాఘనుఁడు హోహొ, తాస్యుఁడింతకునింతప్రాయంపువాఁడు.

తే. వాఁడు గాఁడు గదా బలవంతుఁడైన, యంతకునిదారిఁ బడి యిటు లైనవాఁడు
నాఁగ నద్దేవి మఱియును నానావిధములఁ, గొడుకుఁబనవుచునాథుఁ బేర్కొనుచు నడలి.

క. అక్కట! దైవము రాజ్యము, దక్కొని యాలిం దనూజుఁ దెగ నమ్మంగా
నెక్కొలిపి హరిశ్చంద్రుని, నిక్కడఁ గాడ్పఱిచె నింక నేగతిఁ బోదున్? 248

చ. అని పలుక న్విభుండు విని యప్పుడు దా నది వారల న్నిజాం
గనయు సుతుండు గా నెఱిఁగి గ్రక్కునఁ జేష్ట యడంగి కూలె నే
ల నతని నాథుఁగా నెఱిఁగి లాలలు వా దొరఁగంగఁ దీవ్రశో
దన మొనరించుచుం బడియెఁ దామరసానన మూర్ఛ గప్పినన్. 249

వ. ఇట్లు మూర్ఛిల్లి యిరువురు గొంతవడికి నొక్కటఁ దెలి వొంది రంత నన్నరేం
ద్రుఁడు నందనుం గనుంగొని. 250

చ. అలరుమొగంబుతోడఁ గడు నర్మిలి నా కెదు రేల రావు చే
తులు పచరించుచుం దనువుధూళి మెయిం దొరయంగ నేల న
న్నెలమిని గౌఁగిలించుకొన వింతయుఁ దీ పెసలార మంజులో
క్తులచవి యేల నాచెవులకుం జవిఁ జూపవు నీవు పుత్త్రకా! 251

చ. అనుచుఁ దనూజు నెత్తికొని యక్కునఁ జక్కఁగఁ జేర్చి మోము మో
మునఁ గదియించి బాష్పజలము ల్వారిఁ బెల్లుగ నించి యేడ్చు హా!
యని యకటా! కుమార! తెగ నమ్మితిఁ బాపము వేసి చీర య
మ్మినయటు లిట్టు నిస్వాదకి మ్రింగునె దైవము క్రూరసర్పమై. 252

క. నీ విటుగాఁ జూచియు నా జీవ మెటుల నున్నయది చిత్తమ్మున మో
హావేశము తండ్రులకు స్వభావము సుమ్మిట్లు సుతులపై సుగుణనిధీ! 253

తే. కలయ నస్మలి నెరయు నీ నెమ్మొగంబు, ఘనభుజంగవిషవ్యాప్తి గాఢవాతి
రాహుకబళితరోహిణీరమణుమాడ్కి, నుండఁ గనుఁగొని యే నెట్లు నుండుఁ గుఱ్ఱ.

వ. అనుచు నత్యంతశోకాగ్నిసంతప్తుం డై మహీతలంబునం బడిన నద్దేవి కొడుకువలని శోకంబు విడిచి జీవితేశ్వరుజుగుప్సితం బైనచండాలభావంబుఁ జూచి విస్మయంబు నను తాపంబును దైన్యంబును గా నిట్లనియె. 255

తే. పొడువు నిడుదయు నై కడుఁ బొలుచునితని
ముక్కు తుద యంతయును గడు నొక్కువడియెఁ
గుసుమముకుళసన్నిభరదాంకురము లింత
కంది యొవ్వెడు నే దైవఘటన యకట! 256

క. దేవసమానుం డగునీ, భూవిభునకు సకలరాజపుంగవునకు ని
ట్లేవపుఁజండాలత్వముఁ, గావించినదైవమునకుఁ గరుణయుఁ గలదే. 257

క. కరితురగరథపదాతులుఁ, గర మమర సితాతపత్రకాంచనమయచా
మరములు పొడగాన మహీశ్వర! యెక్కడ నడఁగె నీదువైభవ మెల్లన్? 258

సీ. రవి డాఁచి చూడంగ నవునట్టినీమేన నొదుగుమాలిన్యంబు గదిరి యుండ
శత్రుభీకర మైనశాతాసి నమరునీకేల నీచపుబరిగోల యుండ
లలితమకుటదీప్తిఁ బొలుచునీశిరమున శవసమర్పితమాల్యసమితి యుండ
విమలదివ్యాంబరావృతి నొప్పునీకటిఁ గుత్సితం బగుబొంతకోక యుండఁ

తే. జేసె నే దైవ మానతక్షితిపశేఖ,రప్రభాజాలసతతవిరాజమాన
చరణకమలసుందర! హరిశ్చంద్ర! సకల, బుధమనఃకైరవాకరపూర్ణచంద్ర!. 259

క. విలసితమణిహర్మ్యస్థల,ములఁ దగ విహరించునీకు భూతపిశాచా
కులశవధూపవృతాంబర,తల మగుప్రేతాలయంబు ధామం బయ్యెన్. 260

తే. అనుచు నత్యంతమోహశోకార్తి నొంది, నాథు మెడ వట్టికొని యేడ్చె నలినవదన
యకట! కల యిట్లు నిక్కల యగునె? యనుచుఁ, బనవె విభుఁ డెట్టికలగంటి పార్థివేంద్ర!

వ. అక్కులఫలం బిట్టిద యయ్యోనేని ధర్మసహాయత్వంబు లేదు గాక నిక్కంబును మనకు దేవబ్రాహ్మణప్రసాదంబును సత్యధర్మజ్ఞానానృశంస్యంబులును గలిగినయ ట్టైన నీయట్టి పరమధార్మికుండు రాజ్యపరిభ్రంశంబు నొంది యీదురవస్థం బడునే? యని దుఃఖిత యగునద్దేవికి నన్నరపతి దనకన్నకలతెఱం గంతయు నెఱింగించి యయ్యింతివలనం బుత్త్రమరణప్రకారం బెల్ల నేర్పడ విని నిట్టూర్పులు నిగుడ నత్యంతసంతాపాంత రంగుండై శైబ్య నాలోకించి వంశకరుం డైన యీ యొక్కశిశువును దైవగతిం బోవ

వగలకుం గొలు వగుచుఁ గుందం జాల వీనియొదలితోడన యనలంబునం బడియెద న
న్నేలినచండాలునియనుజ్ఞ లేకున్న నింకొక్కపుట్టువున నైన వానికి బంట
నయ్యెద నీదుర్మరణంబునం జేసి యనేకఘోరనరకంబు లైనను ననుభవించెద దాన
యజనయాజనగురుపూజనంబు లొనరించినవాఁడ నైతినేని పరలోకంబున నైన మన
మెప్పటియట్ల కూడి యుండెదము వినుము నగియును నే నెన్నండును బొంకు పలుక
నా కిదియ నిశ్చయంబు నీకు ననుజ్ఞ యిచ్చితి నీ వరిగి యమ్మహీదేవు దేవునిం బోలె
నారాధింపు మని పలికిన నపు డయ్యింతి గరం బలఁగి యిట్లనియె. 262

తే. కొడుకు నీవును జిచ్చునఁ బడఁగఁ జూచి, యేను జీవంబుతో నుందునే నరేంద్ర?
నాకలోకసుఖం బైన నరక మైన, ననుభవింతును నీతోడ నరుగుదెంతు. 263

క. అనవుడు నొడఁబడి విభుఁ డిం, ధనములు సొదగా నొనర్చి దానిపయిఁ దనూ
జుని నిడి భార్యయుఁ దన పిఱుఁ, దన నిలువం గేలు మొగిచి తత్పరమతియై. 264

హరిశ్చంద్రునొద్దకు సకలదేవతలు వచ్చి తత్సుతుఁ బ్రతికించుట.

సీ. స్మితమధురానన శ్రీరమ్యు ధవళవిశాలాక్షు రుచిరకపోలఫలకు
రమణీయనాసాభిరాముని శ్రీవర్ణకర్ణుఁ దామ్రాధరకాంతిసుభగు
నాజానులంబ మహాబాహుపరిఘు విస్తీర్ణదృఢోరస్కు సింహమధ్యు
ఘనతరకటిచక్రుఁ గమనీయజంఘుని శోభనాంభోరుహస్ఫురితచరణు

తే. హారకేయూరమణిమకుటాదివివిధ, దివ్యభూషణదీప్తి దేదీప్యమాను
శంఖచక్రగదాపద్మశార్ఙ్గముసల, ఖడ్గవనమాలికాచిహ్ను ఘనసవర్ణు. 265

క. నారాయణుఁ బీతాంబరు, శ్రీరమణీరమణు భక్తచింతామణి దు
ర్వారవిపద్ద్విపకుంభవి, దారణనిపుణాభిధానదైవతసింహున్. 266

సీ. తలఁచుచు నున్నయాధరణీశునొద్దకు ధర్ముండు మొదలుగాఁ దక్షణంబ
వాసవప్రభృతిగీర్వాణు లంభోరుహభవుఁడును సకలదిక్పతులు నాగ
గరుడగంధర్వకిన్నరసిద్ధసాధ్యులు విశ్వులు రుద్రులు నశ్విబుధులు
మఱియును గలయట్టిమానసీయామరు లాకౌశికుఁడు వచ్చి రపుడు ధర్ముఁ

తే. డోహరిశ్చంద్ర! సాహస ముడుగుమయ్య,! నీతితిక్షాతపస్సత్యనిష్ఠ కేను
మెచ్చి వచ్చితి సుర లెల్ల వచ్చినారు, వీర యని చూపె నప్పుడు వేల్పుఱేఁడు. 267

ఆ. కుసుమవృష్టితోన కురియించె నపమృత్యు
హరణనిపుణ యైనయమృతవృష్టిఁ
ఖుదమి తేనిముద్దుఁగొడుకుపై నభమున
దివ్యతూర్యరవము దివురుచుండె. 268

క. అద్భుతము పోఁకిన వారా, కొమరుఁడు దొల్లింటికంటెఁ గోమలియై తనుకాం
తి మెఱయ నిద్ర దెలిసి వేగను మేల్కొనునట్లు లేచి కడు నొప్పారెన్. 269

ఉ. జనవిభుఁ డంత విస్మయరసంబునఁ దేలుచుఁ దాను నింతియుం
దనయునిఁ గౌఁగిలించుకొని తద్దయు నొప్పిరి సమ్మదంబు పెం
పొనరఁగ దేవతామహిమ నుజ్జ్వలకాంతియు దివ్యమాల్యలే
పనధవళాంబరాభరణభాతియు మేనుల నగ్గలింపఁగాన్. 270

స్వర్గప్రయాణవిషయమై ధర్మేంద్రహరిశ్చంద్రులసంవాదము.

వ. అప్పు డమరేంద్రుఁడు హరిశ్చంద్రున కిట్లనియె. 271

ఉ. నరుల కగమ్యమై వెలుఁగునాకము నీ కభిగమ్య మయ్యె నీ
నిరుపమసత్యధర్మమహనీయత శాశ్వతదివ్యభోగముల్
దొరకొనియె న్నరేశ్వర! సుతుండును భార్యయు నీవు నూత్నర
త్నరుచిరసద్విమానము ముదమ్మున నెక్కుఁడు రండు నావుడున్. 272

తే. అమరనాథ! చండాలదాస్యంబు గలుగు
నాకు నాకంబునకు నెట్లు రాక గలుగు?
ననిన నిట్లను ధర్ముండు విను నరేంద్ర!
యేను జూవె చండాలతఁ బూని నీకు. 273

వ. అవశ్యభావి యైనదుఃఖంబు భోక్తవ్యం బగుట నిట్లు చేసితి భవత్సుకృతలబ్ధంబు లైన
దివ్యభోగంబు లనుభవింపు మనిన హరిశ్చంద్రుం డింద్రున కిట్లనియె. 274

క. అనిమిషవల్లభ! విను నీ, కొనరించెద భక్తి మ్రొక్కి యొకవిన్నప మే
ననిశము శోకాతురులై, ననుఁ బాయఁగఁ జాల కున్న నాపురజనులన్. 275

క. హితుల ననన్యశరణ్యుల, నతిభక్తుల విడిచి వచ్చునమరావతి నా
మతి రుచియింపదు గావున, శతమఖ! యే రాను నీవు సనుము మహాత్మా! 276

క. అరయంగ బ్రహ్మహత్యయు, గురుహతి వనితావధమును గోవధమును నాఁ
బరగుదురితములు నాశ్రితుఁ, బరిత్యజించుటయు నొక్కభంగియ యెందున్. 277

క. నాతోడఁ గూడ సురపురి, కేతెంతురు వారు లొండె నేఁగుదుఁ బౌర
వ్రాతముతో నే నొండె సు,ఖేతర మగునరకమున కహీనచరిత్రా! 278

వ. అనిన నింద్రుండు హరిశ్చంద్రున కిట్లనియె. 279

తే. వినుము పుణ్యపాపంబులు వేఱువేఱ, నుండు భిన్నంబులై మానవోత్కరముల
కెట్లు సంఘాతభోగ్యత్వ మీవు గోర, దమరపురమున కనిన ని ట్లనియె నృపతి. 280

ఆ. ఘనకుటుంబు లైన జనులపెంపున రాజ్య
మనుభవించి నృపతి యధ్వరంబు
లొగి నొనర్చుఁ గాన యుంపకారు లైనట్టి
జనుల కెట్టియెడలఁ జనదు విడువ. 281

అయోధ్యాపురజనులతో హరిశ్చంద్రుఁడు స్వర్గమున కరుగుట.

వ. కావున నజ్జనంబులకు సామాన్యదానజపతపఃఫలంబులను బహుకాలోపభోగ్యంబు లైనమదీయపుణ్యకర్మఫలంబులను వారు నేనుం గూడి భవత్ప్రసాదంబునం ద్రిదివం బున నొక్కదివసం బైన ననుభవించెద మనిన ననిమిషవల్లభుం డతనితో నీయభిమ తం బెట్లట్ల చేసెద నని పలికె ధర్ముండును విశ్వామిత్రుండును బ్రసన్నచిత్తులై దానికొడంబడి రంత చాతుర్వర్ణ్యజనసమృద్ధం బైనయయోధ్యానగరంబున కరిగి పురుహూతుం డప్పురజనంబుల నెల్లం బిలిచి యత్యంతదుర్లభం బైనదివిజభవనంబు ధర్మదేవతాప్రసాదంబున మీకు సులభం బయ్యె నాకలోకంబుననుండి మహీతలం బుదాఁక ననేకకోటివిమానంబులు సోపానంబులై యున్నవి. మీ రిమ్మార్గంబునం జనుదెం డనినం బ్రహృష్టహృదయులై యప్పుణ్యులు పుత్రకళత్రభృత్యసమేతం బడుగడుగునకు విమానంబు లెక్కికొనుచుం ద్రివిష్టపంబునకుం బోవం దొడంగిరి. హరిశ్చంద్రుండును సురమునిగణంబులతోడ లోహితాశ్వకుమారున కభిషేకపట్ట బంధంబు లొనరించి యాత్మీయాఖిలరాజ్యపదస్థుంగావించి ప్రమోదంబున సమస్త జనంబులం దోడ్కొని దివంబున కరిగె నని చెప్పి. 282

మ. సమకూర్చు న్వివిధార్థసంపదలు భాస్వద్రాజ్యము న్దివ్యభో
గము భార్యాసుతలాభము న్సకలమాంగల్యంబుల న్సామన
స్యము దీర్ఘాయువుఁ బ్రీతి చిత్తముల నొంపారు న్హరిశ్చంద్రును
త్తమచారిత్రము విన్న మానవులకు న్దైవప్రసాదంబునన్. 283

ఆశ్వాసాంతము.

చ. నిరుపమనీతిసార! మహనీయగుణోజ్జ్వలరత్నహార! మం
దరగిరిధీర! రూపజితదర్పకవీర! విలాసినీమనో
హర! మహనీయసంతతవిహార! వినిర్మలసద్విచార! వి
స్ఫురితయశోలసత్కనకభూధరకందర! శౌర్యమందిరా!. 284

క. బాలారతికేళీపాంచాలా! మృదుమధురహితవచనవాచాలా
భూలోకభరితసుగుణవిశాలా! సూరిజననికరసఫలరసాలా! 285

మాలిని. అహితనగబిడౌజా! యన్వయాంభోధిరాజా!
సహజసుకృతబీజా! చాతురీనవ్యభోజా!
మిహిరసదృశతేజా! మేదినీకల్పభూజా!
మహితగుణసమాజా! మల్లమాంబాతనూజా! 286

గద్యము. ఇది శ్రీమదుభయకవిమిత్ర తిక్కనసోమయాజిప్రసాదలబ్ధసరస్వతీపాత్ర తిక్కనామాత్యపుత్ర మారయనామధేయప్రణీతం బైనమార్కండేయపురాణంబునందు జైమిని మార్కండేయునికడ కరుగుదెంచుటయు నతనికి నమ్మహామునీంద్రుండు పరమజ్ఞానచక్షులైన పక్షులఁజన్నప్రకారం బెఱింగించుటయు నాపక్షులు జైమినికి భారతకథాశ్రయంబు లగునాలుగుప్రశ్నంబులకు నుత్తరంబులు చెప్పుటయు హరిశ్చంద్రోపాఖ్యానంబును నన్నది ప్రథమాశ్వాసము.

శ్రీరస్తు.

మార్కండేయపురాణము

ద్వితీయాశ్వాసము.

శ్రీమత్ప్రతాపరుద్రమ
హామండలనాయకమండలావనదక్షా!
శ్రీమందిరభుజవక్షా!
రామారతినాథ! సన్నరథినీనాథా! 1

ఆడిబకయుద్ధవృత్తాంతము.

వ. పరమజ్ఞానచక్షు లైనపక్షు లాజైమిని కిట్లనియె హరిశ్చంద్రుం డొనరించినరాజసూయంబునిమిత్తంబునం బ్రజానాశనకారణం బై ప్రవర్తిల్లినయాడిబకయుద్ధంబు తెఱం గెఱింగించెద వినుము గంగాప్రవాహమధ్యంబునం దపోనిష్ఠం బండ్రెండు వత్సరంబు లుండి వెడలి వచ్చి. 2

క. ఘనుఁడు వసిష్ఠమునీంద్రుఁడు, వినియె హరిశ్చంద్రవిభుఁడు విశ్వామిత్రో
గ్రనికారంబున నిర్విధమున నెంతయు ఘోరదుఃఖములఁ బడు టెల్లన్. 3

ఆ. విని నితాంతదుఃఖవేదనానలశిఖా, వలియుఁ దీవ్రకోపవహ్నిశిఖలు
నొక్కమాట యెగసి యుల్లంబులో నగ్గ, లింప మోము జేవురింప నపుడు. 4

వ. అమ్మునీంద్రుండు విశ్వామిత్రు నుద్దేశించి యి ట్లనియె. 5

ఆ. అతఁడు మత్తనూజశతముఁ జంపిననాఁడు, పుట్ట దన్నరేంద్రుఁ బెట్టినట్టి
వివిధబాధ లెల్ల విన్న నామనమున, నేఁడు పుట్టినట్టివాఁడియలుక. 6

వ. అని పలికి యక్షణంబ. 7

వసిష్ఠవిశ్వామిత్రు లన్యోన్యశాపముల నాడేలును గొంగయు నై పోరుట.

క. బక మై యుండెద వని కౌశికు నతఁడు శపించె విని వసిష్ఠునకుం గౌ
శికుఁడును నాడే లగుమని, ప్రకటక్రోధమున నిచ్చెఁ బ్రతిశాపంబున్. 8

వ. అట్లన్యోన్యాకారంబుల నయ్యిరువురును మూఁడువేలుం దొంబదియాఱు యోజనం
బులపొడవైన బకంబును ద్విసహస్రయోజనోత్సేధం బైన యాడేలును నై యంతంత
రోషంబునం జేసి. 9

స్రగ్ధర. పత్త్రప్రోద్ధూతవాతప్రబలరయమున న్పర్వతశ్రేణి దూలన్
గాత్రోద్యత్సాంద్రదీప్తుల్ గగనము దిశలు న్గప్పుచుండంగఁ జంచ
న్నేత్రప్రాంతంబులం దగ్నికణము లురల న్వ్రేఁక నొండొంటిఁ దాఁకె
న్పత్త్రిద్వంద్వంబు లోకప్రకరము దలర న్స్వైరవాటోపలీలన్. 10

వ. ఇట్లు తాఁకి. 11

సీ. తామ్రలోచనసముద్ధతవిస్ఫులింగపాతములను దమముఖాగ్రములు గమర
సునిశితచండచంచుప్రహారములఁ బరస్పరపృథులపార్శ్వములు వ్రయ్య
నతిదీర్ఘదృఢచరణాహననముల నన్యోన్యశిరస్స్థలు లగలి పగుల
ఘనతరపక్షతాడనముల నితరేతరస్థిరాంగములు జర్జరితములుగ

తే. ధరణిధరములు గూలఁగ ధరణి వణఁక, జలధు లుప్పొంగి కడవ గట్టులను సకల
భువనసంక్షోభముగఁ జలంబున బలంబు, డిగక నలువుమైఁ బోరె నాడియుం బకంబు.

వ. ఇవ్విధంబున నవ్విహంగంబులు పోరుచుండ. 13

తే. పర్వతంబులు విఱిగి పైఁబడినఁ గొన్ని, వనధి వెల్లువ గట్టిన మునిఁగి కొన్ని
యవనితలచలనోగ్రరయమునఁ గొన్ని, గాఁగఁ బ్రాణులెల్లను బరిక్షయము నొందె.

వ. అంత. 15

బ్రహ్మదేవుఁ డాడిబకయుద్ధము మాన్పుట.

చ. అతులితపక్షిపక్షపవనాహతపర్వతపాతభీతికం
పితజనహాకృతిధ్వనులపెల్లున నెంతయుఁ లోక మాకులీ
కృత మగుచుండఁ దద్విషమకిల్బిషశాంతివిధాయి యై ప్రజా
పతి చనుదెంచె నమ్మహితపక్షులయొద్దకు వేల్పుమూఁకతోన్. 16

వ. చనుదెంచి. 17

క. మునులార! మీకుఁ దగునే, యని సేయఁగ? వలవ దుడుగుఁ డఖిలహితముగా
ననినను మానక యని రణ, మొనరింపఁ దదీయవికృతు లూహించి వెసన్. 18

వ. పరమేష్ఠి వారలతిర్యక్త్వం బపనయించె నంతం బూర్వప్రకారాకారు లై నిలిచిన
కౌశికవసిష్ఠులం జూచి యద్దేవుండు మీ కీవిరోధంబు హరిశ్చంద్రునిరాజసూయవిపా
కంబునఁ బ్రజాక్షయం బగుటకుం గారణం బై పుట్టె విశ్వామిత్రుండును నమ్మహాత్మునకు
నెగ్గు సేసినవాఁడు గాఁడు నాకలోకప్రాప్తికై యుపకారం బొనరించెఁ గావున మీరు

తపోవిఘ్నమూలం బైనరోషంబు విడువుం డనిన నమ్మహామును లట్ల కా కెఱింగి
యక్షీణక్షమావంతు లై యుండొరులం గౌఁగిలించుకొనిరి విరించియు నిజనివాసం
బున కరిగె వారును దమతమతపోవనంబున కరిగి రని చెప్పి. 19

ఫలశ్రుతి.

క. ఆదిబకసాంపరాయము, వేడుకఁ జెప్పినను వినిన విఘ్నము లడఁగున్
రూఢిగఁ బాయుం బాపము, లీడితజయసిద్ధి గలుగు నెపుడు నరులకున్. 20

క. అని చెప్పిన విని జైమిని, మనమున ప్రమోదమునఁ దేల మఱియును దా ని
ట్లనియెఁ గుతూహలంబును, వినయంబును బెనఁగొనంగ విహగంబులకున్. 21

జడోపాఖ్యానము.

సీ. భూతవర్గంబుసంభూతిస్థితిప్రళయంబు లెట్టివి? జంతు వంగబాధ
నొందుచు నెట్లుండు నుదరంబులోఁ? దల్లి భుజియించుగురుతరభోజ్యనిచయ
మెల్ల జీర్ణంబుగా నెట్లు గ్రాఁగఁడు? ప్రాణి పుట్టి యెట్టులు వృద్ధిఁ బొందుఁ? జచ్చు
నెడ నిజజ్ఞానంబు నెట్లు దొఱఁగుఁ? జచ్చి యొచ్చట నుండి యహీనపుణ్య
తే. పాపఫలములు గుడుచు? నేర్పడఁగఁ జెప్పఁ, డీరహస్య మంతయు నాకు మీర లనినఁ
బక్షు లిట్లను విను మొక బ్రాహ్మణుండు, భార్గవాఖ్యుండు నిజపుత్త్రుఁ బరమశాంతు.
సీ. అతివిమలాకారు సుతు నుపనీతునిఁ గావించి యి ట్లను గారవమునఁ
గోరి భిక్షాశి వై గురుప్రీతి బ్రహ్మచర్యముఁ దాల్చి వేదంబు లభ్యసింపు
మఱి గృహస్థుండ వై మఖచయం బొనరించి బహుళసంతానంబుఁ బడయుము మనఘ!
యటమీఁద వనవాసి వై ఫలమూలశాకాహారవిధిఁ దప మాచరింపు
తే. తుది సమస్తంబు విడిచి విదూరమోహ, మతివినిర్జితేంద్రియుండ వై యతివి గమ్ము
గడఁక నని యెంత చెప్పిన జడుఁడువోలె, నొక్కపలుకు పలుక కతఁ డూర కుండె.

క. జనకుండు దన్నుఁ బ్రేమం,బునఁ బెక్కువిధముల మఱియు బోధించిన నా
జనకునిఁ గనుగొని నవ్వుచుఁ, దనయుం డి ట్లనియె వినుము తండ్రీ! తెలియన్. 24
సీ. ఏను నీయుపదేశ మింతయుఁ జేసితి మును పెక్కుమాఱులు వినుతశాస్త్ర
బహువిధాఖ్యానశిల్పము లభ్యసించితిఁ బంచదశసహస్రభవము లెఱుఁగ
నయ్యెడు నిపుడు నా కందు నానాక్లేశసుఖములఁ బొందియు సుతకళత్ర
శత్రుమిత్రవియోగసంప్రయోగంబు లంగీకరించితి విన్మనేకమాతృ
ఆ. తతులచన్నుఁబాలు ద్రాపితి బాలయై, వనజరావికారజనితబాధ
లతినికృష్టవృత్తి ననుభవించితి గర్భ, జన్మదుఃఖమరణసమితిఁ బడితి. 25
మ. సకలక్లేశసుఖానుభూతి నిటు లీసంసారచక్రంబున
న్వికలస్వాంతుఁడ నై భ్రమించుచుఁ దుదిన్ నీ కిప్డు జన్మించితి

స్ఫీతజ్ఞానసమన్వితుండ వయి కర్మభ్రాంతి నేఁ బొంద వే
దకళాభ్యాసము లింక నేమిటికి? విద్వన్ముఖ్య! యూహింపుమా. 26

తే. వినుము తండ్రి! యేర్పడఁ ద్రయీవిహితధర్మ,మరయఁ గింపాకఫలముల ట్లశుభభరితము
పరమపదము మోక్షమ్ము తత్ప్రాప్తిఁ గోరు, నాకు నేటికిఁ గర్మకాననముఁ జొరఁగ.

వ. అనిన విని వెఱఁగుపడి తండ్రి యి ట్లనియె. 28

తే. ఏటిమాట లాడెదు గుణ్ణ! యెఱుక నీకు, నెక్కడిది? మున్ను జడభావ మేమికతన
నొదవెనీ ప్రబుద్ధతయున్నయునికి నెచటఁ,గంటి?యిదిశాపవిక్రృతియొ కాకనిజమొ!.

తరల. అనినఁ దండ్రికిఁ బుత్త్రుఁ డిట్లను నర్థితోఁ దొలుబామునం
దనఘ! విప్రుఁడ బ్రహ్మవిద్యఁ బరాయణత్వముఁ బొంది పెం
పొనర నేను గురుండ నై కరమొప్పుశిష్యులు తత్త్వవి
ద్ఘనులు గా నొనరించి యొక్కయుదాత్తపుణ్యవశంబునన్. 30

వ. ఏకాంతశీలుండ నై యజ్ఞానాకృష్టభావుండ నగుటం జేసి ప్రమాదంబునం గాలంబు ప్రాప్తం బైనం ద్రయీధర్మంబులకుం బడయరానిజాతిస్మరణజ్ఞానంబు శిష్యులకుం బరమజ్ఞానదానంబుఁ జేసినఫలంబున నాకీభవంబున సంభవించె నిప్పుడు పూర్వయోగాభ్యాసంబునఁ జిత్తంబు నిర్మలత్వంబు నొంది యున్నయది యింక వివిక్తప్రదేశంబున నిలిచి నైష్ఠికుండ నై మోక్షార్థము యత్నించెద. నీకు సంశయం బెయ్యది దాని నడుగుము చెప్పి ఋణవిముక్తుండ నయ్యెద ననిన భార్గవుండు. 31

ఆ. అనఘ! నీవు మమ్ము నడిగినయట్టుల, యడిగె నడుగుటయును నతఁడు వేడ్క
యొనఁగ నీయనుజ్ఞ నెఱిఁగింతు నుత్క్రాంతి, విధము మున్నుగాఁగ వినుము తండ్రి!.

జడుఁడు దనతండ్రి కుత్క్రాంతివిధము నెఱిఁగించుట.

క. మానవులకుఁ జనుకాలం, బైనం బెనువెచ్చ మేన ననిలక్షుభితం
బై నెగయుం బవియుం మర్మ, స్థానము లూర్ధ్వగతి నయ్యుదానుఁడు నడుచున్. 33

తే. కట్టు విణ్మూత్రములు పొంగుఁ గడుపు పెదవు,లెండుఁ గుత్తుకతడియాఱు నెలుఁగు డిందు
మార్పు లెడతెగుఁ గన్నుల నొందు వికృతి, నెక్కుపుట్టును నాలుక వెగడు గదురు.

వ. అట్టియవస్థయందు. 35

మనుజశుభాశుభకర్మభోగవివరణము.

సీ. తోయాన్నదానపరాయణుం డగువాఁడు వేదసారహితుఁడై విడుచు నొడలు
శ్రద్ధధానుఁడు నిత్యసత్యవ్రతుండును భూసురగురుపూజ్యపూజకుండు
విను కామసంరంభవిద్వేషములఁ జేసి ధర్మంబు దప్పనినిర్మలుండు
ననసూయుఁడును హ్రీసమన్వితుఁడును సుఖమృతిఁ బొందుదురు శీతవితతహా

తే. తామసంబులఁ బొరయక ద్రవిణదాన, పరుఁడు జ్ఞానప్రదాయి దీపప్రదాత
యును శరీరము దొఱఁగుదు రొగిన పలికి, నట్లు చేయువాఁ డొందు శుభ మైనచావు.

ఆ. అన్నదాత గానియతఁడు క్షుద్బాధ న, గారదాహకారి యారటమున
నన్నృత మాడుసాక్షియును వేదదూషక, జనుఁడు మోహపరతఁ జత్తు రపుడు. 37

ఉ. దారుణనేత్రులు న్వికటదంష్ట్రులు ముద్గరపాశహస్తులుఁ
ఘోరతరాననస్ఫురితకోపులు నై యమదూత లానరు
ఘోరిపఁ గాంచి మైవడఁకఁ జేష్టలు వైకృత మందఁ బల్కుచు
న్నోరును గన్నులుం దెఱచు నుక్కుట మై వెగ దగ్గలింపఁగన్. 38

ఆ. తల్లిఁ దండ్రి నాలిఁ దనయులఁ దోఁబుట్టు, వులను దలఁచి పిలువ నెలుఁగు రాక
తల్లడమునఁ గేలఁ దడవుఁ బ్రాణంబులు, వెడలుటయును నొడలు విడుచు నరుఁడు.

వ. విడిచి మాతాపితృసంభవంబు గాక నిజకర్మంబున నావిర్భవించినవయోరూపప్రమా
ణంబులం బూర్వశరీరంబునట్టిద యైనయాతనాదేహంబున దేహి ప్రవేశించుటయుం
గాలకింకరు లతిరయంబున. 40

సీ. ఘనదీర్ఘదారుణకాలపాశంబులఁ గినుకతో వడిఁ బెడకేలు గట్టి
యత్యంతభయదంబు లగునినుగుదియల నఱవంగ నొడలెల్ల మఱుఁగ మోఁది
యెండఁ గాలిన నేల నెసఁగుపెన్మంటలఁ గాళులు వొక్కంగఁ గండ్లు ముండ్లు
క్రొవ్వాఁడి కొయ్యలు గుట్టలు పుట్టలు నైనదుష్పథమున నఘుమయాత్మ

ఆ. నీడ్చికొనుచు యామ్య లేఁగుదు ర్నక్కలు, గలసి యతనిఁ దినఁగఁ గడురయమునఁ
గూడు నీరు నిల్లు గొడుగు చెప్పులు దాన, మిచ్చినతఁడు పోవఁ డట్టిత్రోవ. 41

క. విను దేహి బంధు లిక్కడఁ, దనదేహముఁ గాల్పఁ దాపతప్తుం డగుచు
న్జనుఁ బండ్రెండుదినంబుల, ననేకదుఃఖాయనముల యమపురమునకున్. 42

వ. అట్లరుగుచు. 43

ఆ. బంధుజనులు సేయుబహుతిలోదకపిండ, విహితవివిధదానవిధుల భూమి
శయనముఖ్యమహితసద్వ్రతంబుల మృష్ట, భోజనములఁ దృప్తిఁ బొందు చుండు.

క. విను పండ్రెండవదినమునఁ, దనబాంధవు లాచరించుతైలాభ్యంగం
బున నంగసౌఖ్యసంవా, హనమున నద్దేహి యలరు నాప్యాయితుఁ డై. 45

రౌరవనరకవర్ణనము.

వ. అంతం బదుమూఁడవుదినంబున నద్దేహి కింకరాకృష్యమాణుం డై తల్లడిల్లుచు. 46

శా. నీలాభ్రాంజనపుంజవర్ణు నరుణోన్నిద్రాంబకోదగ్రు నా
భీలస్ఫీతనిశాతదంష్ట్రు భ్రుకుటీభీమాస్యు నానారుజా

కాలోగ్రాంతకమృత్యువందితు యముం గాంచు న్గదాదండపా
శాలోకస్ఫురణాభయంకరమహాహస్తుం గరాళాంగునిన్. 47

వ. అయ్యముండును సద్దురాత్ముల నుపలక్షించి గతి నిర్దేశించిన నతండు. 48

సీ. ద్విసహస్రయోజనవిస్తారమును జానుదఘ్నంబు నైనగర్తమునుండి
యనలకణంబులు గనగనఁ గనలంగ దారుణం బైనయాకారవంబు
నడుమఁ గింకరులచే పడువంగఁబడి వడి నొఱలుచు నలుఁగడఁ బఱవఁ జరణ
యుగము నీఱగుచును మగుడంగ మొలచుచు నుండ హాహాకృతు లడుగ కదర

ఆ. ఘోరదుఃఖ మొకయహోరాత్ర మస్మేయి, ననుభవించి యంత నచటు వాయ
వేయియోజనముల వెడలుపు గలవహ్ని, యందు బిట్టు పైతు రతని నెత్తి. 49

క. బహునరకంబుల మఱియును, బహుదుఃఖము లొంది యతఁడు బహుకాలమున
న్మహిఁకిఁ జనుదెంచి క్రిమిముఖ, బహుయోనులఁ బుట్టి క్షీణపాపుం డగుచున్. 50

వ. మనుష్యత్వంబు నొంది సకలహీనజాతులకును జనించి శూద్రవైశ్యక్షత్రియబ్రాహ్మ
ణత్వంబులం బొంది సుకృతఫలంబున నారోహిణి యైనదేవగతిం బడయు మఱియుఁ
బుణ్యాపరుం డైననరుండు యమశాసనంబున దివ్యాంబరాభరణమాల్యానులేపనాభి
రాముండును దివ్యవిమానారూఢుండును నై నాకంబున కరిగి కిన్నరగంధర్వగీతా
కర్ణనాప్సరోనృత్తాలోకనప్రముదితహృదయుం డగుచు దివ్యసుఖంబు లనుభవించి
పుణ్యావసానంబున నవరోహిణి యైనమనుష్యగతిం బ్రాపించు నని యిట్లు మర్త్యుల
మరణప్రకారంబును శుభాశుభకర్మభోగంబులుం జెప్పి జంతూత్పత్తిప్రకారంబు విను
మని కొడుకు తండ్రి కిట్లనియె. 51

జంతూత్పత్తిప్రకారము.

క. సలిలఋతుపుష్పరసంబును, బలిరేతోబీజ మందఁ బరలోకసమా
గతుఁ డయినయట్టిజీవుం, డతిరయమున వాయుభూతుఁ డై యం దొలయున్. 52

వ. ఇట్లు శుక్లశోణితద్వయంబున జీవసంక్రమణంబు సుస్థిరత్వంబు నొందిన. 53

క. కలలము బుద్బుదమును నై, బలసి కరుడు గట్టు దానఁ బంచాంగములున్
మొలచును దాన నుపాంగం, బులు నన్ని క్రమక్రమమునఁ బుట్టు మహాత్మా! 54

ఆ. సహజకఠినకోశసంవృద్ధితోడన, చాల వృద్ధి నొందు నాళికేర
ఫలముమాడ్కిఁ గోశపంజరంబున జంతు, వుండి దానితోన యొలయు వృద్ధి. 55

వ. అట్లు సకలావయవసంపూర్ణుం డై. 56

సీ. ఒకయంగుటంబుపై నొకయంగుటము మోపి జానుపార్శ్వముల హస్తములు సేర్చి
యంగుళు ల్జానులయగ్రంబులం దిడి కనుఁగవ జానులవెనుక నూఁది

నాసిక జానులనడుమఁ బొందించి పిక్కలు రెండుఱెట్టలు గదియ హత్తి
చాల నొదిఁగి యిట్లు జానుమధ్యంబునఁ గడు నిరోధంబునఁ గడుపులోన
తే. నుండుననలంబు గాఠిన్య మొందఁ జేయఁ, దల్లి గొనునన్నపానము ల్తనువుఁ బెనుప
నతులవిజ్ఞానసంపద నతిశయిల్లఁ, బుణ్యపాపాశ్రయత్వంబుఁ బొందు శిశువు. 57

వ. అంతం దొమ్మిదవనెల నైనను బదియవమాసంబున నైనను బ్రాజాపత్యమారుతప్రేరితుం డై యధోముఖత్వంబు నొందె. 58

చ. భ్రమఁ గడుఁ దల్లడిల్లుచును బైకొనువాయువు తాఁకున న్శరీ
రము నలియంగ వేదనభరంబు గరం బలయింపఁ బుట్టి మూ
ర్ఛ మునిఁగి బాహ్యమారుతము చల్లఁదనంబునఁ దేఱఁ జాలఁ బూ
ర్వమహితబోధ మెల్లఁ జెడ వైష్ణవమాయ భజించి క్రక్కునన్. 59

శా. మాయావేశమున న్విమోహరసనిర్మగ్నాత్ముఁ డై బాల్యదుః
ఖాయత్తుండును యౌవనోద్ధతవికారావిష్టుఁడు న్వృద్ధతా
హేయప్రాప్తుఁడు నై పునర్మృతిభవానేకత్వదుఃఖాకులుం
డై యుండుర్ నరుఁ డిట్లు సంసరణచక్రాక్రాంతివిభ్రాంతుఁ డై. 60

వ. అని వెండియుం. 61

సీ. జననిగర్భంబుఁ జొచ్చినయది యాదిగా నీమనుష్యత సుఖ మింత లేదు
స్వర్గంబు పుణ్యసంక్షయపాతనభయాన్వితము గాన దుఃఖప్రదంబ యదియుం
నరకంబు ఘోరదుస్తరతీవ్రయాతనాలం బగుట వేఱె చెప్ప నేల?
పశుపక్షిమృగక్రిమిప్రముఖతిర్యగ్జంతుచయత వాటిల్లు దుస్తరము మనకు
తే. నిట్లు గావునఁ బరికించి యెందు సౌఖ్య, మించు కంతయు లేకున్న నెఱిఁగి కాదె
యిపుడు నైష్కర్మ్యనిష్ఠ వహించి బుద్ధిఁ, బరిహరించితి నేఁ ద్రయీసరణి తండ్రి!

క. అనినను దండ్రి తనూజున, కను రౌరవనరకభంగి యంతయు వింటి
న్విన వలయు నరకవిధములు, వినిపింపుము మొదలుకొని వివేకనిరూఢా! 63

నరకవిధములు.

వ. అని యడిగినం బుత్రుండు దండ్రీ! నరకమ్ముల కెల్లను రౌరవంబు మొదలినరకంబు దానివిధంబుఁ జెప్పితిఁ దక్కిననరకంబుల తెఱంగులు నెఱింగించెద. 64

మహారౌరవనరకము.

సీ. విను చతుఃపంచయోజనవిస్తృతమ్మును దామ్రమయము నైనదారుణాగ్ని
తప్త మై విద్యుదుద్దామప్రభాజాలదేదీప్యమాన మై తేఱి చూడ
రాక యత్యంతభైరవ మగుచుండు మహారౌరవం బందు యమునిభటులు
కాళ్లుసేతులం బట్టి కట్టి వైచినఁ బడి వృకములు బకములు వృశ్చికమశ

తే. క్రిములు గాకు లులూకము ల్గ్రద్దలు దిన, నఱచుచును దప్పార్తు లై యతులదుఃఖ
మనుభవించి వెడలుదురు హేయమాయఁ, దాద్గతం బైనదురితంబు లడఁచి నరులు. 65

తమోనరకము.

మ. అతిఘోరంబు తమోభిధాననరకం బందుండి దుష్కర్ము లు
గ్రతమశ్శీతనిరుద్ధు లై యొఱలుచు న్గంపించుచుఁ క్షుత్తృషా
హతి వాపోవుచు శైశిరానిలవిభిన్నాన్యోన్యదేహోత్థశో
ణితమద్యంబులు ద్రావుచు న్నిరయవహ్నిం గాంతు రేణస్థితిన్. 66

నికృంతననరకము.

చ. అరుదు నికృంతనాఖ్య నరకం బది యందుఁ గులాలచక్రము
ల్దిరుగుచు నుండు వానిపయిఁ దెచ్చి యఘాత్ములఁ బెట్టి కాలకిం
కరు లొగిఁ గాలపాశములఁ గాళ్లనుండి శిరంబుదాఁక భీ
కరముగఁ ద్రెంచు చుందురు ఖండము లెప్పటిరూపు దాల్పఁగన్. 67

అప్రతిష్ఠనరకము.

తే. అప్రతిష్ఠాఖ్యనరకంబునందు దుష్ట, నరునిఁ ద్రిప్పుదు రొగి రాటనములఁ గట్టి
పెక్కువేలేండ్లు నెత్తురు గ్రక్కు లోచ, నములఁ ద్రేవులు నురలి వక్త్రముల వ్రేల. 68

అసిపత్త్రవననరకము.

సీ. అసిపత్త్రవననిరయంబు సహస్రయోజనవిస్తరము పటుజ్వలనమయము
దానిమధ్యమున శీతలమును నసిరూపదలఫలకలితంబు బలవదుగ్ర
సారమేయాయుతస్వనసంకులమును నై పెనుపొంది యొకమహావనము వోలుచుఁ
బాపు లాబహిరగ్నిఁ బడి తనువులు గ్రాఁగి వనము డాయఁగఁ జని యనిలహతిని
తే. రాలునాకులకాఁకున వ్రస్సి యొడళు, లవనిఁ గూలంగఁ గుక్కలు కవిసి కఱవ
బహువిధంబుల నలుగులపడుదు రింకఁ, దప్తకుంభంబుదారుణత్వంబు వినుము. 69

తప్తకుంభనరకము.

క. ఉడుకక యనలము మండఁగ, నుడుకుచు నూనియలు నిండి యున్నకడవల
న్వడి దుష్కర్ములఁ గింకరు, లిడుదురు దలక్రిందు గాఁగ నెత్తి యఱవఁగన్. 70
చ. తలలును బొమ్ములు న్పగుల దందడి శోణితమజ్జతోయము
ల్గలయఁగఁ జర్మమాంసములు గ్రక్కున ముద్దలు గట్టఁ జేరఁ గ్ర
ద్దలు పడిఁ బీఁకఁ గింకరులు దవ్వులఁ ద్రిప్పఁగఁ బ్రాణవాయువు
ల్వెలువడ కుండఁ బాపులను వేఁతురు దారుణతైలవహ్నులన్. 71

వ. తండ్రీ! యవధరింపు మఱి సప్తమజన్మంబున వైశ్యుండ నై పుట్టి యొక్కనాఁడు.

అమితకర్దమనరకము.

తే. అర్థి నీఱులు ద్రావఁగ నరుగుగొఁగ, ఱంబు నాఁగినయట్టియఘుంబుపేర్మి
నమితకర్దమ మనునిరయమున బ్రుంగి, యనుపముక్కులపులుఁగు లనేకభంగి. 73

తే. ఏఁప నాఁకలి నీరువ ట్టెసఁగ నోర, నుడుగ కెప్పుడు నెత్తురు వడియ నార్తి
రొదవ నూఱు నేఁబదియేఁడు లుండ నొక్క, నాఁడు దనుగాలి వీఁచె నానందమడర.

వ. వీచినం గరంభవాలుకానరకంబునం దున్నయందఱు నేనునుం బరమప్రమోదంబు
నొంది యమ్మందానిలంబు రాకకు వెఱఁగుపడి యద్దిక్కు గనుంగొనునప్పుడు ప్రచండ
దండహస్తుం డైనదండధరుకింకరుండు ప్రదర్శితమార్గుం డగుచు నిందు నిందు రమ్మని
తోడ్తేర నొకపురుషరత్నం బరుగుదెంచి తీవ్రయాతనాపీడితు లగుచున్నయన్నారకుల
నాలోకించి కరుణాభరితాంతరంగుం డై యేము వినుచుండఁ గింకరున కిట్లనియె. 75

జనకయమకింకరులసంవాదము.

మ. వినుతక్షత్త్రచరిత్రుఁ డైనజనకోర్వీనాథవంశంబునం
దొనరం బుట్టి విపశ్చిదాహ్వయుఁడ నై యుద్ధంబులన్ శత్రుభం
జనము న్నిర్జరరంజనంబు బహుయజ్ఞక్రీడలన్ బర్వభూ
జనల న్భక్తిఁ బితృప్రమోదమును రక్షన్ బ్రజాహర్షమున్. 76

శా. ప్రీతిం బాయక సేయుచు న్పరధనస్త్రీరాగదూరుండ నై
యాతిథ్యక్రియ నప్రమత్తమతి నై యత్యంతధర్మస్పృహా
స్వీతస్వాంతుఁడ నైననాకు నకటా! యెం దేది యిచ్చోటి కి
ట్లేతేరం గత మేమి యెట్టిదురితం బేఁ జేసితిం జెప్పవే. 77

వ. అనినం గింకరుండు నీచేసినపాపంబు గొంతఁ గలదు చెప్పెద వినుము. 78

తే. నీమహాదేవి వైదగ్ధి నెమ్మిఁ బుష్పవతియు శుచియు నై యుండ నవ్వనిత మొఱఁగి
భావజాసక్తి రెండవభామయైన, కైకకడ నుండి తిష్టభోగములఁ దగిలి. 79

క. ఋతుకాలంబున విను కుల, సతికిం బతివలన శుక్లసంప్రాప్తి ప్రజా
పతి గోరు హోమకాలా, హుతి యతిసంప్రీతిఁ గోరు హుతవహుమాడ్కిన్. 80

క. ఋతువు విఫలంబు సేయుటఁ, బితృఋణదోషంబుఁ బొంది పృథ్వీశ యను
ష్ఠిత మగు నిచ్చోటికి వచ్చితి వీ వొండొకయఘుంబు సెందదు నిన్నున్. 81

తే. ఇంకఁ బుణ్యంబు భోగింప నేఁగుదెమ్ము, పార్థివేశ్వర! యనిన నబ్భటునితోడ
నీవు గొనిపోవ వచ్చెద నెచటికైన, నంత యొకటి నిన్నడిగెద నర్థిఁ జెపుమ. 82

విదేహరా జడిగినప్రశ్నము.

తే. ఎట్టికర్మంబు లొనరించి యిట్టి ఘోర, నరకదుఃఖానుభవముల నొందియున్న
వారు వీ రెల్ల నెఱిఁగింప వలయు ననిన, నవనిపతితోడఁ గింకరుఁ డనియెఁ దండ్రి

క. విను తల్లియు నిడినయన్నం, బును బోలెం జేసినట్టిపుణ్యము పాపం
బును మానవులకు నేవిధ, మునఁ గుడువక పోవుఁ గర్మములు ప్రబలంబుల్. 84

తే. ఉత్సవంబులమీఁదనె యుత్సవములు, పొందుచుందురు కెప్పుడుఁ బుణ్యనరులు
పాపకరులకుఁ బైపయి నాపదలు మ, హాభయంబులు చావులు నడరుచుండు. 85

క. తెరువున నారక యరుగఁగ, నురగకరివ్యాఘ్రతస్కరోద్భటభయము
ల్దారకొనుఁ బాపులకడ నివి, దొరకొనుఁ గుడువంగఁ గట్టఁ దొడఁ బుణ్యులకున్.

తే. అఘ మొకింత యొనర్చిన నది యొకప్పుడు, గాలములుఁ గొల్లునాటిదుఃఖములు దెచ్చు
నొదుగఁ జేసినఁ దలమేరు మొదలు గాఁగఁ, గలుగు తెవులుల వేదనకుదలుకొలుపు. 87

క. ఎంతెంత సేసెఁ బుణ్యం, బంతంతయె సుఖము నిచ్చు నది నరునకుఁ దా
నెంతెంత సేసెఁ బాపం, బంతంతయు దుఃఖ మిచ్చు నవి తలితోడన్. 88

వ. కావునం బుణ్యపాపోద్భవంబు లైనసుఖదుఃఖంబు లవశ్యభోక్తవ్యంబు లగుటం జేసి యీనారకు లిందఱు నరకదుఃఖానుభవంబులం దమచేసినపాపంబులు వొలియించి స్వర్గంబునం బుణ్యఫలంబులు భోగింతు రని చెప్పి యమానుచరుం డారాజుతో నీ వడిగిన యిజ్జసంబుల పాపంబులతెఱం గెఱింగించెద. 89

వైదేహునకు యమకింకరుఁడు వేర్వేఱుగ నారకులం జూపుట.

చ. ఖరతరవజ్రతుండములు కన్నుల నొల్వఁగ నార్తి నొందుచు
న్బరవనితాధనావళులపైఁ దమకంబునఁ జూడ్కు లిడ్డదు
ష్పురుషు లఖర్వదుఃఖములఁ బొందుదు రెన్ని నిమేషము ల్పారిం
బోరి మును సూచి రద్దములు భూవర! యన్నియు నీక్షణవ్యథన్. 90

వ. తోడ్తోన మొలచునాలుకలు నెఱకత్తులం దఱుగ నొఱలుచున్నవీరలు గదా శిష్యులకు నసచ్ఛాస్త్రోపదేశములు చేసినవారు శాస్త్రంబులయందు ధర్మంబు లొండు తెఱంగునం జెప్పినవారు నసద్వాదంబు లాడినవారు దేవగురుద్విజామ్నాయదూషణంబు లొన రించువారును. 91

క. అలుకం బితృమాతృతనూ, జుల భార్యాపతుల సఖులఁ జుట్టల గురుశి
ష్యుల భ్రాతల భేదించిన, ఖలులను గోసెదరు వ్రయ్యఁ గరపత్త్రములన్. 92

తే. వ్యజనచందనోశీరాపహారకులను, సాధుహృదయప్రమోదనిషేధకులను
బరుల కుపతాప మొనరించుప్రల్లదులను, నిదె కరంభవాలుకను వ్రేల్చెదరు చూడు.

మాలిని. ఒక్కనిచేత నిమంత్రితుఁడై మఱియొక్కని శ్రాద్ధమునందు మదిన్
స్రుక్కక పోయి భుజించినవిప్రునిఁ జూడు ఖగంబులు చీరెడుఁ బెం
పెక్కినసాధుజనంబులమర్మము లెప్పుడుఁ దూఱఁగ నాడుఖలుల్
ద్రొక్కి ఖగంబులు ముక్కున నంగము దూఁటులు పుచ్చుచు నున్న వాఁగన్. 94

సీ. క్రొండీనినాలుక రెండుగాఁ జీలెను నలభాగంబుఁ జూడు మవనినాథ!
ప్రాయమాత్ర పురీషపూర్ణగర్తంబున మునుఁగుచున్నాఁ డధోముఖత నొంది
జననీజనకగురుజనుల కవజ్ఞఁ జేసినదుర్మదాంధుండు వినుము దేవ
తాతిథిపితృవహ్నిభూతపక్షిప్రజాభాగ్యగతభృత్యజనావళులకు
తే. నిడక యన్నంబు మును దాన కుడిచినట్టి, పాపకర్ముండు పర్వతప్రతిమతనుఁడు
సూచిసూక్ష్మముఖుండు నై క్షుత్ప్రపీడ, నొంది చీము బంకయుం దానుచున్నవాఁడు.
తే. ఒక్కబంతిన విప్రున కొరున కైన, విషమగతిఁ గూడిడునతండు విష్ఠ గుడుచు
యాత్ర తనతోన వచ్చినయతని కన్న, మిడక భుజియించి శ్లేష్మంబు గుడుచునితఁడు.
ఉ. ఎంగిలితోడ గోవును మహీసురవహ్నుల నంటినట్టియా
వెంగలికేలు కుండశిఖ వేమఱుఁ గాల్చెద రట్లు కైరవా
ప్తుం గమలాప్తుఁ జుక్కలను బోలఁగఁ జూచినవారికన్నులం
దింగిల మిడ్డవా రదె నరేశ్వర! కర్మఫలంబు దప్పునే? 98
మ. జననిం దండ్రి సహోదరుం జెలియలిన్ జ్ఞాతి న్గురు న్వృద్ధు వి
ప్రుని గోవు న్శిశు నల్కఁ దన్నినయతిక్రూరాత్మపాదంబుల
న్ఘనతీవ్రానలతప్తశృంఖల నొగి న్గాఢంబుగాఁ గట్టి ప
ట్టిన వాఁడుం దొడబంటినిప్పుకలలో డిందు న్మహీవల్లభా!. 99
సీ. ఛాగమాంసము పాయసము పులగంబును నాదిగా దేవయోగ్యాన్నచయముఁ
దగినసంస్కృతి సేయ కొగి భుజించినవాని నవనిపైఁ బడవైచి యంగకంబు
నదె మునిపండ్లఁ జీఁకెద రంతకునిభటు ల్దేవతాగమగురుద్విజుల నింద
సేయ వినినవారిచెవుల సూదులు గాల్చి యొండొండ కూర్కొనుచున్నవారు
తే. క్రోధలోభాత్ములై రచ్చకొట్టమును సురాలయంబును బ్రపయును గూలఁ ద్రోచి
నతనితి త్రొల్చెదరు లోభులైనసకల, సుకృతవిక్రయం నుఱిచెద రున్నదు మధిప!
క. ము న్నొకని కిచ్చి యొరునకుఁ, గన్నియ మఱి యిచ్చినట్టికష్టుఁడు శస్త్ర
చ్ఛిన్నాంగుం డై తేలుచు, నున్నాఁ డదె క్షారనది ననూనార్తి మెయిన్. 100
సీ. తెగి మాత్ర మర్కగోద్విజులకు నెదురుగా నాచరించినతుచ్ఛునట్లు కాక
ములు నోటఁ బొడుచు రాముక్కులఁ బ్రేవులు గఱవున నాలిని గన్నప్రజల
విడిచి తా నొక్కఁడు కడుపుఁ బ్రోచికొనినఖలునిపం డ్లన్నియుఁ దులిచి యొదలు
దఱిగి కండలు నోరఁ దుఱిగెద రదె భీతి శరణంబుఁ జొచ్చినవరుని లంచ
తే. మగ్గితోఁ గొని యొప్పించినట్టియధము, నధికదారుణతరఘటీయంత్రపీడ
నలఁచు చున్నవా రంతయుం యమునిభటులు, చూచితే పాపఫలములసొంపు లధిప!

క. ఇల్లడ గొని యాఁచికొనిన, బల్లిదు లగు ఋణియఁ గట్టఁబడి కీటకము
ల్వెల్లఁగఁ దేళ్లుం గాకులు, తల్లడ పెట్టంగ నొఱలెదరు నో రెందన్. 102

తరల. తనువు లెంతయు వ్రస్సి నెత్తురు ధారలై తొరఁగంగ ని
య్యనుపముండులబూరువు ల్వెస నెక్కఁ ద్రోవఁగఁ జీలువా
ర్మనుజనాథ! పరాంగనాకుచమండలీపరిరంభణం
బును దివాసురతంబు చేసినభూరిపాపపరాయణుల్. 103

క. మనుజేశ్వర! విను శ్రాద్ధం, బునఁ దమలోఁ దారు గలసి భోజన మొనరిం
చినభూసురు లొండొరులవ, దనలాలలు రక్తములును ద్రావుట కంటే? 104

క. చెలులును నతిథియు నిజభృత్యులు చూడఁగ సురుచిరాన్న మొక్కఁడు వడి ని
ష్ఠులఁ గుడిచినవరుఁ డిదె ని, ష్వులు మ్రింగెదు వృకనికాయములు వీఁపు దినన్.

చ. అనఘ! కృతఘ్నుఁ డైనమనుజాధముఁ డోలిన తప్తకుంభ వే
దనలఁ గరంభవాలుకలతాపముల న్బహుయంత్రపీడనం
బున నసిపత్త్రఖండనసముద్ధురయాతనఁ గాలసూత్రకృం
తనకృతతీవ్రదుఃఖమునఁ దక్కఁడు నిష్కృతి వీని కెన్నఁడో? 106

చ. వినుము పసిండి మ్రుచ్చిలుట విప్రునిఁ జంపుట కల్లు ద్రావు టే
పున గురుపత్నిఁ జెందుట ప్రభూతతరాఘము లెందు వీనిఁ జే
సినవరుఁ డుండుఁ జుట్టుఁ జెనుచిచ్చిడి పెక్కుసహస్రవర్షము
ల్ఘనముగఁ గాల్పఁ బుట్టు భువిఁ గ్రమ్మఱఁ గుష్ఠమహాక్షయాంగుఁ డై. 107

తే. చచ్చి మఱియును నరకాగ్ని వెచ్చి మగుడఁ, బుట్టు క్షయకుష్ఠబాధలఁ బొందు మాన
వేంద్ర! కల్పంబుతుదిదాఁక నిట్లు తిరుగు, చుండుఁ బాతకి యైనయాతండు వినుము.

వ. ఇమ్మహాపాతకంబులకంటె నుపపాతకంబులు కొంత దక్కువ కాన వాని నొనరించిన వారు మహాపాతకు లనుభవించుదుఃఖంబులకంటెఁ గొంత తక్కువ లైనదుఃఖంబు లనుభవింతురు. 109

క. అని చెప్పి కింకరుం డి, ట్లను సంక్షేపమున నిజ్జనావళు లొనరిం
చినపాపములవిధమును ద, దనుగుణబహునరకతీవ్రయాతనలు నొగిన్. 110

జంతువులకు జన్మాంతరపాపములకుఁ దగుజన్మములవివరము.

క. నరవర! చెప్పితిఁ జెప్పెద, నరకంబులు వదలి పోయి నరులు ధరిత్రిం
దురితానురూపయోనులఁ, బరువడిఁ బుట్టెడివిధంబు ప్రవ్యక్తముగాన్. 111

క. పతితునిచే భూదేవుఁడు, ప్రతిగ్రహము గొనిన గర్దభం బగుఁ గ్రిమియై
క్రిమిఁ బుట్టు యాజకత్వం, బతనికి నొనరించినట్టియధముం డధిపా! 112

సీ. ఒజ్జకుఁ గైతవ మొనరించినతఁడు తదంగనాజనముల నఱిమినతఁడు
శునకంబు గర్దభంబుచు నగుదురు తల్లిదండ్రులకు నవజ్ఞ దనరఁ జేసి

శారిక యై పుట్టువారికి వ్రాల్పిద యదరించి కచ్ఛప మై జనించు
జనుఁడు త న్నేలినాతనియింటఁ గుడుచుచు నతనిశత్రులఁ గొల్చునతఁడు క్రోఁతి
తే. యగు నరేంద్ర! యిల్లడధన మడఁచికొన్న, వాఁడు గార్దభత్వమును విశ్వాసహర్త
మీనతయుఁ నసూయాగ్రస్తమానసుండు, కంకభావము దాల్చును గ్రమముతోడ.

క. గొలుచుయవలు సెనగలు మినుములు తిల లావలుఁ గుళుత్థములు మ్రుచ్చిలినన్
లలి భ్రాతృసతిని బఱిపినఁ, గలుగును బకజన్మ మట్టికష్టనరునకున్. 114

వ. మిత్రక్షత్రియాచార్యభార్యాభిగామి సూకరత్వంబు నొందు యజ్ఞదానవివాహవిఘ్నకర్తయుఁ గన్యాపునర్దానకారియుఁ గ్రిమిత్వంబు నొందుదురు దేవతాపిత్రతిథిబ్రాహ్మణులకు నన్నంబు మున్నిడక కుడిచినపురుషుండు కాకం బగు వృషలీపతి యైన విప్రుండును బరగృహంబున నుండుగృహపతియుఁ గట్టియలోఁ బూరువులై పుట్టుదురు పితృసమానుం డైనయగ్రజు నవమానించినవాఁడు క్రౌంచయోనిజాతుం డగు మృగంబుల నడిచి పీపునంజాడు నమలినయతం డంధుండును బంగుండును నై యావిర్భవించు ద్విజాంగనాసంగమంబున శూద్రుండు క్రిమి యై జన్మించు నం దపత్యంబు వడసె నేని కాష్ఠగతకీటంబును సూకరంబును గ్రిమియునుం జండాలుండు నై యావిర్భవించు. 115

తే. క్రిమియుఁ గీటకమును బతంగమును వృశ్చి,కమ్ము మత్స్యంబు నొగిన కూర్మమ్ము పుల్క
సుండు నై పుట్టు భువిఁ గృతఘ్నుండు నరు న,శస్త్రవహుఁ జంపి గర్దభజాతుఁ డగును.

క. స్త్రీవృద్ధబాలహంతలు, భూవర! క్రిమియోనియందుఁ బుట్టుదు రశనా
శావిలత నరుఁడు మ్రుచ్చిలి, కావించినకుడుపు మక్షికాత్వముఁ దెచ్చున్. 117

వ. మఱియును భోజనవిషయవిశేషచౌర్యదోషంబులు వినుము చెప్పెద నన్నచోరుండు మార్జాలం బగుఁ దిలపిణ్యాకమిశ్రాన్నతస్కరుండు మూషకం బగు ఘృతాపహారి నకులం బగు మత్స్యమాంసహర్త కాకం బగు మేషమాంసమలిమ్లుచుండు డేగ యగు లవణంబు మ్రుచ్చిలికొన్నవాఁడు చిమ్మట యగు మధుస్తేనుండు కూసీఁగ యగు నూనియ మ్రుచ్చిలి గబ్బిల మగు హవిష్యంబులు దొంగిలినవాఁడు బల్లి యగు దుగ్ధంబు లపహరించినవాఁడు కొక్కెర యగుఁ బెరుఁగు మ్రుచ్చిలినవాఁడు క్రిమి యగుఁ గాంస్యరజతహేమమయంబు లగుభాండంబు లపహరించినవారు వరుసన హారీతంబును గపోతంబును గ్రిమియును నగుదురు మఱియును మనుష్యుండు ధూపద్రవ్యంబులు గొని చీమ యగుఁ గూర్పుండ నర్హ్వంబు లగువానిం గొని తిత్తిరిపక్షి యగుఁ బొత్తిచీర గొని పసిఁడిపురు వగు వెలిపట్టు గొనిన శార్ఙ్గం బగుఁ గార్పాసంబుఁ గొనిన బకం బగు రక్తపరిధానంబుఁ గొని జీవంజీవకం బగుఁ బలువన్నెలచీరలు గొని మయూరం బగుఁ

చందనాదిసుగంధద్రవ్యంబు గొని చుంచెలుక యగు మాంసంబు గొని కుందేలగు ఫలంబులు గొని నపుంసకుం డగుఁ గాష్ఠంబులు గొని ఘుణకీటకం బగుఁ బుష్పంబులు గొని దరిద్రుం డగు తెక్కిపోవం దగినట్టివి గొని పంగుం డగు శాకంబులు గొని పచ్చపులుఁ గగు జలంబులు గొనినఁ జాతకం బగు భూమిని గోవును రత్నసువర్ణాది పదార్థములను గొని రౌరవాదినరకంబులం బడి వెడలి తృణలతాగుల్మభూరుహత్వంబులం బొంది క్రిమియుఁ గీటంబును బతంగంబును జలచరంబును మృగంబును గోవునుం జండాలుండును బధిరాంధపంగుత్వవికలుండును గుష్ఠక్షయముఖాక్షిగుదరోగపీడితుండును నపస్మారియు నై తుది శూద్రత్వంబు నొందు నని చెప్పి కింకరుండు. 118

క. వెలుఁగుచు నుండ సమిద్ధ, జ్వలనంబున హోమ మొనరఁ జలుపనివాఁ డాఁ
కలి చెడి నిరంతరము న,త్యలఘుతరాజీర్ణబాధ నలఁదురు చుండున్. 119

చ. పరుసనిపల్కులం బరులఁ బల్కుట మర్మము నాట నాడుట
ల్నరులకు నెగ్గు సేఁత కృపణత్వ మశౌచము దేవదూషణం
బొరులధనంబు గొంట కృప నొందమి యల్క కృతఘ్నభావ మీ
నిరయముఁ బాసి పోయి ధరణిం బ్రభవించినవారిచిహ్నముల్. 120

మ. గురుదేవర్షిపితృప్రపూజనము సద్గోష్ఠీప్రియత్వంబు సు
స్థిరసత్యోక్తి సమస్తభూతదయ మైత్రీసాధుసాంగత్యముల్
పరలోకాభ్యుదయక్రియారతి శ్రుతిప్రామాణ్యసందర్శనం
బరయ న్స్వర్గముఁ బాసి పుట్టినమనుష్యశ్రేణిసంజ్ఞల్ నృపా! 121

చ. తమతమచేతల న్నరకతాపముఁ బొందుచు నున్నవీరిపా
పము లోగిఁ దోఁచినట్లు జనపాలక! చెప్పితి వింటి వీవు ను
గ్రమయినకుత్సితంపునరకంబును జూచితి చాలు నింకఁ బో
దము చను మమ్ము నావుడు నతం డరుగంగ నుపక్రమించినన్. 122

నారకులు రాజును బ్రార్థించుట.

చ. కనుఁగొని యాతనోగ్రనరకస్థజనంబు లెలుంగు లెత్తి యో
మనుజవరేణ్య! పుణ్యగుణమండన! తావకదేహదివ్యగం
ధనిబిడమారుతంబు పరితాపభరం బడఁగించి మాకు నిం
పొనరఁగఁ జేయుచున్నయది యొక్కముహూర్తము నిల్వవే దయన్. 123

మ. అని ప్రార్థించిన నవ్విభుండు విని యత్యంతానుకంపాత్ముఁ డై
యనిరయుం గింకరుఁ జోద నిజ్జనుల కిట్లాహ్లాదముం జేయ నో

పినపుణ్యం బది యెద్ది చేసితి నొకో ప్రీతిం బురాజన్మమం
దనఘా! దాని నెఱుంగ నాకుఁ జెపుమా యన్న స్ఫుటుం డిట్లనున్. 124

మ. పితృదేవాతిథిపోష్యవర్గ మొగి మున్ప్రీతి న్భుజింపం దదం
చితశిష్టాన్నమున న్నిరంతరముఁ దుష్టిం బొందుచు న్విశ్రుత
క్రతువు ల్చేసినపుణ్యమూర్తి వగుట న్రాజేంద్ర! యుష్మత్తనూ
ద్గతగంధానిల మిప్డు నారకులకు న్గావించె నాహ్లాదమున్. 125

వ. అనిన నన్నరేంద్రుండు. 126

ఉ. ఇట్టిద యయ్యెనేని విను మే నొకచోటికి రాను నిశ్చయం
బిట్టిద నిల్తు నిక్కడన యిందఱు నాకతన న్సుఖింప ని
ష్పట్టున నున్కి నాకమున బ్రహ్మపదంబున నున్కి నాకు న
న్నిట్టుల మైనయక్కటిక నీనరకార్తుల కిచ్చి తక్కితిన్. 127

వ. అని వెండియు. 128

క. అతిభీతి శరణుఁ జొచ్చిన, ప్రతిపక్షుని నైనఁ గరుణ రక్షింపనిదు
ర్మతి బ్రదుకు గాల్ప నేత,త్క్రతుదానఫలంబు లిహపరములకుఁ గొఱయే. 129

ఉ. ఆతురబాలవృద్ధవనితాదులయార్తులు సూచి యేరికి
న్రాతిక్రియ న్మనంబు కఠినం బగువారు మనుష్యులే దయా
ఘాతకు లైనరాక్షసులు గాక తలంపఁగ నట్లు గానఁ దీ
వ్రాతతయాతనావిధురు లై వెగ డొందెడువీరిసన్నిధిన్. 130

వ. ఏతదీయహితంబుగా నిల్చితి. 131

తే. అనలతాపదుర్గంధక్షుదాదు లందఁ, గలుగునీతీవ్రనరకదుఃఖములఁ బడుట
నాకసౌఖ్యంబుకంటెను నాకు మేలు,గాఁ దలంచెదఁ బరహితకరణబుద్ధి. 132

క. పెక్కండ్రకు సుఖ మగు నే, నొక్కఁడ నే నరకదుఃఖ మొందుచు నిచ్చోఁ
జిక్కుదు నే నిట్టియెఱవు, దక్కుదు నే యరుగు మీవు తడయక యింకన్. 133

యమభటధర్మేంద్రవైదేహసంవాదము.

క. అనుటయుఁ గింకరుఁ డిట్లను, జననాయక! వీరు ధర్మశక్రులు నినుఁ దో
డ్కొనిపో వచ్చి రవశ్యముఁ, జనుదేరఁగ వలయు రమ్ము సయ్యన ననినన్. 134

వ. ఊరక యున్నయన్నరేంద్రునకు ధర్ముం డిట్లనియె. 135

క. నరవర! నీసమ్యగుపా,సనకుం బ్రీతుండ నైతి స్వర్గమ్మునకుం
గొనిపోయెద ర మ్మెక్కుము, గనకవిమానంబుఁ దడయఁగా నేమిటికిన్. 136

ఉత్సాహ. అనుడు నతఁడు ధర్ముతో మహాత్మ మమ్ముఁ గావవే
యనుచు శరణు వేఁడుయాతనార్తజనుల వీడి రా

ననిన వజ్రి వీ రఘాత్ము లగుట నరకవాసు లై
రనఘ! నీవు పుణ్యపరుఁడ వమరపురికిఁ దగుదు రాన్. 137

వ. అనిన న న్నరేంద్రుం డింద్రధర్ములతో నా చేసినపుణ్యంబులుగొలంది మీ రానతీయ
వలయు ననిన ధర్ముం డి ట్లనియె. 138

ఉ. తారలలెక్క గాఁగ సికతాతతిలెక్క పయోధి శీకరా
పారములెక్క భూరిబహుజంతుచయంబులలెక్క వారిము
ద్ధారలలెక్కయు ట్టగణితం బగునీసుకృతంబు భూప! యి
న్నారకులందుఁ బుట్టెఁ ఘృణామతి లక్షగుణంబు లయ్యెడిన్. 139

వ. అని చెప్పిన నప్పుణ్యపరుం డింద్రునిం జూచి మహాత్మా! యట్లైన మదీయసుకృత
ప్రాప్తి నిన్నారకజనంబులకు నరకమోక్షంబు గావింప వేయని ప్రార్థించుటయును. 140

చ. అనిమిషవల్లభుం డిటుల నయ్యెడు నీసుకృతంబు పెంపుసొం
పున నిటు సూచితే నరకము ల్వెస వెల్వడి పోవుచున్నవా
రనఘ! యఘాత్ము లెల్ల నని యందఱఁ జూపి లతాంతవృష్టి య
జ్జనపతిపైఁ దగం గురిసె సాధ్యులు సిద్ధులు చోద్య మందఁగాన్. 141

ఆ. అట్లు చూపి యింద్రుఁ డన్నరేంద్రుని విమా, నాధిరూఢుఁ జేసి యమరసద్మ
మునకుఁ బ్రీతిఁ దోడుకొని పోయె ధర్ముండు, దాను సురగణములు దన్నుఁ గొలువ.

వ. అట్లు విపశ్చిన్మహీవల్లభుకారుణ్యంబున నరకంబులవలనం బరిచ్యుతు లై యన్నారక
జనంబు లందఱుం దమతమకర్మంబులకు ననురూపంబు లైనజన్మంబులం బొంది రేనును
నరకవిముక్తుండ నై జన్మాంతరంబు నొందితి నాయెఱింగినతెఱంగున నరకంబుల
విధంబు లిట్లు నీకు నేర్పడం జెప్పితి నింక నేమి చెప్పవలయు నడుగు మనిన భార్గ
వుండు కొడుకున కి ట్లనియె. 143

క. కర మేవం బగుసంసృతి, పరివర్తన మెల్ల నెఱుకపడఁ జెప్పితి నా
కరయఁగఁ గర్తవ్యము చె, చ్చెర నెయ్యది దాని నీవ చెప్పు కుమారా!. 144

జడుఁడు తండ్రికిఁ గర్తవ్యముఁ జెప్పుట.

వ. అనిన నతండు దండ్రి కి ట్లనియె. 145

సీ. నామాట మనమున నమ్మి చేసెద వేనిఁ జెప్పెద నేర్పడ శీలధుర్య!
విను గృహస్థత్వంబు విడిచి వానప్రస్థధర్మంబు విధివిహితంబు గాఁగఁ
జలిపి తపస్సిద్ధి సంపత్తి నొంది యగ్నిపరిగ్రహం బంత నపనయించి
యేకాంతమున నుండి యేసంగమునఁ బడ కాత్మునిఁ దనయాత్మయందు నునిచి

తే. ద్వంద్వముల నోర్చి నిర్జితత్వమున నింద్రి, యార్థసంగతి యుడిపి భిక్షాశి వగుచు
నత్కైకహేతువును దుఃఖాపహమును, నధికసుఖదంబు నగుయోగ మభ్యసింపు.

వ. అనినఁ గొడుకునకుఁ దండ్రి యిట్లనియె. 147

సీ. భవభానుతీవ్రతాపంబున నెరియుచున్నన్బ్రహ్మబోధాంబుపూరమునఁ దేల్చి
దారుణావిద్యాహిదష్టు నన్ బ్రతికింపు మధ్యాత్మతత్త్వవాక్యామృతమున
సంసారమమతారుజాక్లిష్టు నను సుఖాయత్తుఁ గావింపు విద్యౌషధమున
మాయాంధకారనిర్మగ్ను నన్నిర్మలజ్ఞానదీపస్ఫురచ్చక్షుఁ జేయు

తే. మిట్టికర్మబంధమ్ముల నెల్లఁ బాసి, యఖిలదుఃఖములను ద్రోచి యాత్మ మగుడఁ
బుట్టకుండెడు తెరువునఁ బెట్టునట్టి, యోగ మాపు నా కెఱిఁగింపు యోగివర్య!. 148

వ. అనినం బుత్త్రుం డి ట్లనియె. 149

క. దత్తాత్రేయుఁ దలర్పఁగ, నుత్తమ మగునట్టియాత్మయోగముఁ జెప్పెం
జిత్తం బలరఁగ దాని ను,దాత్తగుణా! నీకుఁ జెప్పెద న్విను తెలియన్. 150

కౌశికుం డనువిప్రునిభార్యయొక్క పాతివ్రత్యమహిమము.

ఆ. అనిన భార్గవుండు తనయ! దత్తాత్రేయుఁ, డేమహాత్ముపుత్త్రుఁ? డెద్ది యోగ
మయ్యలర్కుఁ డతని నడిగె! నాథవ్యాని, కెట్లు సెప్పె నాతఁ డెఱుఁగఁ జెపుమ.

వ. అని యడిగిన నక్కుమారుం డి ట్లనియె. 152

ఉ. దానగజేంద్రభూధరకదంబతురంగతరంగసంకులాం
తానికురుంబరత్నమహితం బయి లక్ష్మికిఁ బుట్టినిల్లనం
గా నభిరామమై భువనగౌరవవైభవయుక్తమై ప్రతి
ష్ఠానపురంబు వొల్చు విలసన్మహిమ న్జలరాశిచాడ్పునన్. 153

వ. అప్పురంబునఁ గౌశికుం డను విప్రుండు పూర్వజన్మపాపఫలంబునం జేసి. 154

చ. కరచరణాంగుళుల్ మొఱిఁగి గాత్రము తద్దయుఁ గ్రస్సి చీము నె
త్తురు దొరఁగంగఁ బెన్మఱికి దుస్సహమై సుడియంగ ఘర్ఘర
స్వర మెసఁగంగ నీఁగ లనిశంబును జుమ్మని మూఁగుచుండ హే
యరసము మూర్తమైనయటు లాతతకుష్ఠరుజాభిభూతుఁ డై. 155

చ. అలఁదురు చుండఁగా నతనియంగన పుణ్యచరిత్ర సాధ్వి స
త్కులజ పతివ్రతాచరణకోవిద రూపగుణాభిరామ ని
ర్మలినలతాంగి యాత్మవిభు మాతుగ దైవముగా మనంబున
న్దలఁచుచు నిత్యభక్తిపరత న్జను లెల్లను బ్రీతి సేయఁగన్. 156

చ. ఉడుగక నాథుమైఁ దొరఁగుచుండెడు నెత్తురుఁ జీముఁ బల్మఱుం
గడుగుచు నూనియం దలయఁ గాళ్లను జేతులఁ దోమి తోమి యిం
పడరఁగ నీళ్ల లార్చుచుఁ బ్రియంబునఁ జీరలు దాన కట్టుచుం
గుడుపుచుఁ గామభోగములఁ గోరులి యాతనిఁ బ్రీతుఁ జేయుచున్. 157

క. అతఁ డెంత యలిగి తిట్టిన, మతిఁ గింకిరి పడక యెప్పుడు మాటాడక యా
నత యగుచు నప్పతివ్రత, యతని నతిశ్రేష్ఠుఁ గాఁగ నాత్మఁ దలఁచుచున్. 158
వ. ఆరాధించు చుండ నొక్కనాఁ డమ్మహీదేవుండు నిజాంగన కిట్లనియె. 159
క. ఏ నొకగణికారత్నము, మానుగఁ గనుఁగొంటి రాజమార్గంబున సా
ధ్వీ! నేఁడు వేడ్క యడరెడు, దానిగృహంబునకు నన్నుఁ దగఁ గొని పొమ్మా. 160
ఉ. ఆనగుమోముచెన్ను శశియందును బంకరుహంబునందు లే
దానయనప్రభాతి మదనాస్త్రములందు మెఱుంగులందు లే
దానును మేనికాంతి లతికావలియందుఁ బసిండియందు లే
దానలినాయతాక్షిలలితాకృతి నామదిఁ బాయ నేర్చునే? 161
సీ. మెఱుఁగారు లేఁదీఁగ మెచ్చనియత్తన్వి తనులతచెల్వంబు గనుఁగొనంగఁ
గలకంఠములయెలుంగులయేపు దీపించు నలపొత్తిముద్దుఁబల్కులు వినంగఁ
గనకకుంభంబులకాంతి గైకొననియాకాంతచన్గవ బిగ్గఁ గౌఁగిలింపఁ
జిగురుటాకులనునుజిగినొంపు దెగడునచ్చపలాక్షికెమ్మోవి చవి గొనంగఁ
ఆ. చిత్త మెదపులివుటఁ జిడిముడి పడియెదు, నీవు ధర్మతత్త్వనిపుణహృదయ
వాలకాంగి నన్ను ననురక్తిమైఁ గూర్చు, మన్మథాగ్ని నేను మ్రంద కుండ. 162
క. ఇనుఁ డస్తమించెఁ జీకటి, యును మొగులును నడ్డగించె నుగ్మలి నాకుం
జన శక్తిలేదు దర్పకు, ననర్గళాస్త్రములు నెఱఁకు లాడెడుఁ దోడ్తోన్. 163
చ. అని మదనాతురుం డగునిజాధిపుచెప్పినమాట యేర్పడ
న్విని వినయమ్ము భక్తియు వివేకముఁ బ్రీతియు నగ్గలింప న
వ్వనిత కడున్బ్రయత్నమున వల్వ దృఢంబుగఁ గట్టి లంజెకు
న్ధన మొదువంగఁ బుచ్చికొని నాథుని మూఁపునఁ దాల్చి చెచ్చెరన్. 164
చ. తఱచయి నీలనీరదవితానముపైఁ బయిఁ గప్పి యెంతయు
న్నెఱవఁగ నేలయు న్దిశలు నింగియు నిండఁగఁ బర్వి చాలఁ గ్రి
క్కిఱిసినదిమ్మచీకటి నిశేశ్వరుకోర్కి యొనర్చువేడ్క న
త్తెఱవ గృహంబు వెల్వడి యతిత్వరితంబుగ నేఁగుచుండఁగన్. 165
వ. మార్గంబుక్రేవ నొక్కచోట. 166
ఆ. మ్రుచ్చుగాఁ దలంచి చెచ్చెర నారెకు, ల్పట్టి తెచ్చి కొఱఁతఁ బెట్టిరట్టి
మహితపుణ్యుఁ డైనమాండవ్యుఁ డనుద్విజో, త్తముని యెడమమూఁపు దాఁకె బెట్టు.
తే. తాఁకుటయు మేను గదలి వేదనభరంబు
క్రొత్త యగుటయు నమ్మునీంద్రుండు గనలి
నన్ను నిట్లు నొప్పించినజడుఁడు సూర్యుఁ
డుదయమగుటయు మరణంబు నొందుఁగాత. 168

పతివ్రతాశాపమువలన సూర్యోదయము లేక లోకములు తల్లడిల్లుట.

చ. అని మునిశాప మిచ్చుటయు నావనితామణి శోకతప్తయై
యినుఁ డుదయింప మత్పతికి నెగ్గు ఘటిల్లెడు నట్ల యేని న
య్యినుఁ డుదయింప కుండు నిఁక నేను పతివ్రత నైన నన్న న
య్యినుఁ డుదయింప నోడె విను మిట్టిద సుమ్ము సతీప్రభావముల్. 169

వ. అంతం ద్రియామ బహుయామయై వర్తింపం దొడంగిన జగంబులు సంక్షుభితంబు
లయ్యె నప్పుడు సుర లెల్ల భయంబున సురజ్యేష్ఠుం గానం జని యప్పతివ్రతమహాను
భావంబు లెఱింగించి యి ట్లనిరి. 170

సీ. ఆదిత్యునుదయాస్తమయములు లేకున్కిఁ జేసి కాలంబులు సిక్కువడియె
ననుదినస్నానసంధ్యాజపహోమాదివివిధకర్మంబులు విరతిఁ బొందె
వేదాధ్యయనములు విధివిహితస్వధాస్వాహాదు లాగి నిలుపంగఁబడియె
నిత్యనైమిత్తికకృత్యము ల్క్రతుసురాతిథిపూజ లడఁగె ధాత్రీతలమున
తే. నెలమి నేము హవిర్భాగములు పరిగ్రహించి యాప్యాయనముఁ బొంది యాప్తితార్థ
ములును సస్యసమృద్ధియు వెలయ నరుల, కొసఁగుటలు దప్పె జగముల కొదవె బెగడు.

వ. లోకవ్యవహారంబులు విచ్ఛిన్నంబు లయ్యె నింక దివసోత్పత్తి యేవిధంబున నగు నని
విన్నవించిన విరించి కరుణించి యి ట్లనియె వినుఁ డాపతివ్రతమాహాత్మ్యంబు పతివ్రత
చేతనే కాని చక్కంబడదు గావునఁ బరమపతివ్రతయుఁ దపస్వినియు నైనయత్రి
భార్య ననసూయ నిక్కార్యంబు సక్కంబెట్టు మని ప్రార్థింపుఁ డనిన నమరు లప్పు
ణ్యవతికడ కరిగి బహువిధంబులఁ బ్రార్థించి. 172

చ. అతులితనిత్యసత్యవతి యైనపతివ్రతయాజ్ఞ నయ్యహ
ర్పతి యుదయింపమిం గడు విపద్దశఁ జేర్పడి నిన్నుఁ గాన వ
చ్చితిమి దినంబు మాకు దయసేయుము తొల్లిటియట్లు కాఁగ సం
స్తుతసుచరిత్ర యన్న ననసూయ సురావలిఁ జూచి యి ట్లనున్. 173

చ. అనుపమ మాపతివ్రతమహత్త్వము దాని నధఃకరింప రా
దనిమిషులార! చెప్పెద నుపాయముచేతఁ దదీయుఁ డైనభ
ర్తను జెడకుండఁ జేయుదు యథాస్థితి నుండఁగ నే నొనర్చెద
న్దిన మనిశం గరం బలరి దేవత లట్టుల సేయఁ బూనినన్. 174

అనసూయకును కౌశికపత్నికిని జరిగినసంవాదము.

వ. అనసూయాదేవియుం దేవగణసహిత యై యాపతివ్రతారత్నంబుసదనంబున కరిగి
దానిసేమం బడిగి యి ట్లనియె. 175

క. దేవతలకంటె నధికుం, గా వల్లభు మదిఁ దలంచి కళ్యాణీ! సం
భావింతె యతనివదన, శ్రీవిభవము సూచి సంతసిల్లుదె యెపుడున్. 176

క. పతిశుశ్రూషణమున నే, సతులఫల ప్రాప్త నైతి నభిమతఫలముల్
పతిశుశ్రూషానియతిని, సతతముఁ బడయంగ వచ్చు సతులకు సాధ్వీ! 177

మ. వ్రతముల్ మంత్రజపోపవాసములు తీర్థస్నానముల్ యజ్ఞదా
నతపఃకర్మము లాచరించుచును నానాభంగుల న్నిత్యము
న్పతి యాయాసనసహిష్ణుఁడై కడఁగి సంపాదించుపుణ్యంబులో
సతి శుశ్రూషలఁ గైకొను న్సగముఁ దా సాఁబాలు ధర్మస్థితిన్. 178

తే. స్త్రీజనంబుల కుపవాసతీర్థదాన, దేవపూజావ్రతాదుల తెరువు వలదు
పతిసమారాధనవ్రతపరతఁ జేసి, సుగతి వారికిఁ దంగేటిజున్ను సుమ్ము. 179

ఉ. నీ పతిధన్యురాలవు వినీతవు పుణ్యచరిత్ర వెంతయుం
దైవముకంటె నెక్కుడుగఁ దత్పరతం బతి గారవింతు పూ
జావినయోపచారముల సంతతముం బరితుష్టుఁ జేయుం దీ
భూవలయంబున న్సతులు పోలరు నిన్నుఁ బతివ్రతామణీ! 180

చ. అని యిటు లత్రిపత్ని ప్రియ మారఁగఁ బల్కినపల్కు కౌశికాం
గన విని ప్రీతిఁ జిత్తము వికాసము నొందఁగ నీయనుగ్రహం
బునఁ గృతకృత్య నై యమరపుంగవదర్శనయోగ్య నైతి న
న్ననిశము భర్తృభక్తినియతాత్మికగా నొనరింపు భామినీ! 181

క. అని పలికె యాపతి మదీ, యనిలయమున కేఁగుదెంచి యత్యాదరణం
బున నీవు నీకు నే నే, పని సేయుదు నర్థిఁ జెప్పు భవ్యచరిత్రా! 182

వ. అని యడిగిన నప్పతివ్రతకు ననసూయ యిట్లనియె. 183

తే. ఇనుఁడు నీయాజ్ఞ నుదయింప కునికి నిపుడు, సృష్టిఁ జీకటి గవియుటఁ జేసి తలఁకి
నిన్నుఁ బ్రార్థింపు మని సుర ల్నన్ను వేఁడి, కొనిన వచ్చితి నీకడ కనఘచరిత!. 184

వ. వినుము దివాభావంబున నిఖిలకర్మనాశనంబును గర్మనాశనంబునం ద్రివిష్టపవాసు
లకుం బుష్టిహీనతయు దాన ననావృష్టియు నగు ననావృష్టిదోషంబున జగంబు నశి
యించుం గావున నీవు దేవహితార్థంబు గాఁ బూర్వప్రకారంబునం బ్రభాకరవర్త
నంబు చెల్ల ననుగ్రహించి లోకంబు లుద్ధరింపు మనిన నప్పతివ్రత యిట్లనియె. 185

క. మాండవ్యుఁడు మద్వల్లభుఁ, జండాంశుఁడు వొడుచుటయును జాఁ గలఁ డని తాఁ
జండతరశాప మిచ్చుటఁ, జండాంశునిపొడుపు నా కసమ్మత మతివా! 186

తే. అనిన ననసూయ యిట్లను విను పతివ్ర, తాంగనలపెంపు నాచేత నతిశయిల్లు
మగువ! నీపతి మృతుఁడైన మగుడ నతనిఁ, జిరతరాయుస్సమేతునిఁ జేయుదాన.

తే. అనినఁ బ్రియమంది యాతపస్విని కరాంబుజములు మొగిడించి భక్తిచిత్తమునఁ దనర
నోదివాకర! నిత్యసత్యోజ్జ్వలాత్మ!, దినమణీ! వేగ నుదయింపు మనియె ననిన.

సీ. చుక్కలదీప్తివిస్ఫురణంబు చవి గొని మిన్ను లేఁగెంపున మెఱుఁగు వెట్టె
ఘనతమఃపుంజంబు గనుకనిఁ బోఁ దోలి దిక్కులఁ దేజంబు దీటు కొల్పి
కైరవాకరములగర్వంబు కబళించి కమలషండములకుఁ గాంతి యొసఁగి
తలకొన్నతుహినంబుదర్ప మడంగించి చక్రవాకముల కుత్సవ మొనర్చి

తే. తనసముజ్జ్వలదీప్తివితాన మడరి, యఖిలజనులకు ననురాగ మావహింప
చెలిమిననసూయ మహితార్ఘ్య మెత్తిమ్రొక్క, నుదయగిరి శిఖరంబున నొప్పె నినుఁడు.

వ. పదిరాత్రుల కిట్లు ప్రభాకరుం డుదయించుటయు. 190

క. మునివరునితీవ్రశాపం,బునఁ బ్రాణవిముక్తుఁ డై విభుఁడు వ్రాలిన మే
దినిఁ బడకుండ నతని న,వ్వనితామణి పొదివి పట్టె వగ మదిఁ గదురన్. 191

వ. అట్లు మృతుఁ డైన నయ్యత్రికళత్రం బప్పరమపతివ్రతం గనుంగొని. 192

క. మతి నొక్కింతయు వగవకు, పతిశుశ్రూషాతపంబుబలమున నే నీ
పతి నిదె మగుడం బడసెద, నతిరయమునఁ జూడు శుభగుణాన్వితమూర్తిన్. 193

వ. అని పలికి. 194

చ. అనుపమరూపశీలవిజయాదిగుణంబుల నాదుభర్తతో
నెన యొరు నేను గాన నను నీదృఢసత్యము పేర్మి నీద్విజుం
డనయము లబ్ధజీవుఁడు నిరామయుఁడు న్వృథయావనుండు నై
వనితయుఁ దాను గూడి శతవత్సరము ల్సుఖియించు చుండెడున్. 195

తే. మనముఁ బలుకును జెయ్యు సమత్వ మొందఁ, బతికి శుశ్రూష సతతంబు భక్తిఁ జేయుం
దాన నే నైతి నేని యీధరణిసుతుఁడు,ప్రాణయుతుఁడు గావుతమని పల్కుటయును.

ఉ. ఆవసుధామరుండు విగతామయుఁడు న్నవయావనుండు తే
జోవిభవాధికుండు నతిసుందరుఁడు న్స్మరసన్నిభుండు నై
రా వెస నుత్థితుం డగుడు దైవతసంఘము మెచ్చి సమ్మద
శ్రీ విధిఁ బుష్పవృష్టిఁ గురిసె న్మొరసె న్దివి దేవదుందుభుల్. 197

వ. అప్పుడు బ్రహ్మవిష్ణుమహేశ్వరప్రభృతిదేవత లనసూయతో నికార్యంబు చక్కం
బెట్టుటం జేసి నీవలన నేము సంతుష్టి నొందితిమి వరం బిచ్చెద మడుగు మనవుడు నాకుం
బ్రజాపతిశ్రీపతిపశుపతులు పరమయోగ్యు లైనపుత్త్రు లై పుట్టవలయు ననిన నత్తప
స్వినికి నద్దేవత లావరం బొసంగి నిజస్థానంబుల కరిగి రనసూయయు నిజనివాసంబు
నకుం జనె నంతఁ గొంతకాలంబునకు బుతుమతియు శుచిస్నాతయు మనోహరాకృ
తియు నై యున్ననిజాంగనం గనుంగొని యత్రి యంగజాయత్తుం డై దానిం గలసిన

నతనిశుక్లం బప్పుడతి గర్భంబునం బడునెడం బవనుండు పార్శ్వంబులకు నూర్ధ్వం
బునకుం గా నాకేతంబు మూఁడుపాళ్లు గావించుటయు రెండంశంబు లప్పుణ్యవతి
యుదరంబునం బ్రవేశించె నయ్యూర్ధ్వగతం బైనభాగంబునం జేసి యమ్మునీంద్రు
నేత్రంబునందు. 198

బ్రహ్మవిష్ణురుద్రాంశముల సోమదత్తాత్రేయదుర్వాసు లవతరించుట.

క. అతులరజస్స్ఫురితుం డై, శతధృతిసదృశుఁ డయి పుట్టెఁ జంద్రుఁడు తనుదీ
ధితులు వెలుఁగంగ లలిత, స్థితి నోషధు లెలమిఁ బొంద క్షితిజను లలరన్. 199

వ. అప్పుడు దిశలు పదియు నయ్యమృతకరునిం జేకొని పెనిచె నంత. 200

క. దత్తాత్రేయుం డనఁ బురుషోత్తముఁ డనసూయ కర్థి నుదయం బయ్యెన్
జిత్తం బలరఁగ సత్త్వాయత్తుఁడు యోగియును దైత్యహరతేజుఁడు నై. 201

వ. తదనంతరంబ హైహయుం డనురా జనసూయాగర్భనిరోధంబు గావించిన నెఱింగి వాని నిర్దగ్ధుం జేయం దలంచి దుఃఖామర్షసమన్వితుం డగుచు గర్భవాసంబున నేడు దినంబు లుండి దుర్వాసుం డనునామంబున రుద్రుండు తమోగుణోద్రిక్తుం డై యవతరించి తల్లిదండ్రులం బరిత్యజించి యున్మత్తాఖ్యం బగునుత్తమవ్రతంబు ధరియించి ధరిత్రిం బరిభ్రమించుచుండె నివ్విధంబున నత్రికళత్రంబు పురుషత్రయాంశంబు లైనపుత్త్రులం బడసి కృతార్థత్వంబు నొందె నంతం బరమయోగి యైనదత్తాత్రేయుండు.

దత్తాత్రేయునితపశ్చర్యాదిమహిమ.

క. అనిశంబు మునికుమారులు, దనుఁ బరివేష్టించి తిరుగఁ దా నిస్సంగ
త్వనిరూఢిఁ గోరి చని యొక, వనజాకరమున మునింగె వా రరుగుటకై. 203

తే. అట్లు మునిఁగినఁ గనుఁగొని యక్కుమారు, లతని విడిచి పోఁ జాలక యర్థితోడ
దివ్యశతహాయనములు దత్తీరభూమి, నుండి రుండిన నెఱిఁగి యయ్యోగివరుఁడు. 204

శా. ఏణీలోచనఁ బూర్ణచంద్రవదన న్హేమప్రభాంగిన్ ఘన
శ్రోణీమండలఁ బీనబంధురకుచ న్రోలంబపుంజోల్లస
ద్వేణిం బల్లవకోమలాంఘ్రియుగళ న్దివ్యాంగన న్లోకక
ళ్యాణిం గైకొని యప్పయోరుహవనం బయ్యోగి లీలాగతిన్. 205

క. వెలువడియెఁ గామినీజన, కలితుం డగుతన్నుఁ జూచి కడు రోసి కుమా
రులు విడిచి పోదు రనియెడు, తలఁపున నట్లైన వారు దను విడువమికిన్. 206

వ. మఱియు నయ్యోగీశ్వరుండు. 207

ఉ. ఆలలితాంగి నర్థిఁ దనయంకతలంబున నుంచి కామలీ
లాలసభావుఁ డై తగిలి యాసవ మాదటఁ దాను నించియు

గ్రోలుచు నట్టె పాడుచును గూరినభూరిమదంబుసొంపునం
దేలుచు నున్నఁ జూచి మునిదేవకుమారులు రోసి క్రక్కునన్. 208

క. ఆయోగీశ్వరుని విడిచి, పోయిరి మూఢు లయి వినుము పుణ్యులు యోగ
శ్రీయుతులు వారలకు సరి, యై యుండును హవ్యసేవనాసవసేవల్. 209

క. ఆడుట పాడుట పడఁతులఁ, గూడుట యాసవరసంబు గ్రోలుట యోగ
క్రీడలు గావున యోగుల, నేడిరవులఁ జేర పథము లేక్రియ నున్నన్. 210

క. అనిలుఁడు చండాలస్పర్శనమున విను మశుచి గానిచందంబున యో
గనిపుణుఁ డస్పృశ్యస్పర్శనమునఁ దా నశుచి గాఁ డసంగుం డగుటన్. 211

వ. కావున నమ్మహాయోగి యయ్యంగనయుం దానును మదిరారసం బానుచు మోక్ష
కాంక్షు లగుయోగిజనులచేత విచింత్యమానుం డగుచు నాంతరం బగుతపం బాచరించు
చుండె నంతఁ గొంతకాలంబునకుఁ గృతవీర్యుం డనుమహీపతి పరలోకగతుం డైన
నతనితనయుం డర్జునుండు నిజాభిషేకార్థం బరుగుదెంచిన మంత్రిపురోహితపౌర
జనంబులం జూచి నరకోత్తరం బైనయీరాజ్యంబు నేఁ జేయ నొల్ల వినుండు. 212

కార్తవీర్యార్జునవృత్తాంతము.

సీ. పరనృపతస్కరబాధలు లేకుండఁ దమ్ముఁ గాచుటకునై ధరణిపతికి
ద్వాదశాంశధనంబు వాణిజ్యపరులు గోపాలకర్షకులు షడ్భాగగవ్య
ధాన్యంబు లిత్తురు తప్పక యజ్ఞనాపలుల రక్షింపఁగ వలనులేక
యవనితలేశ్వరుం డప్పాలు లూరక హరియించి దస్యునియట్ల ఘోర
తే. నరకమునఁ బడు భూవహనమున కిప్పుడే నశక్తుండఁ గావున నే వనమున
కరిగి తప మాచరించి యధ్యాత్మయోగ, సిద్ధిఁ బొందెద నని యర్థిఁ జెప్పుటయును.

గర్గకార్తవీర్యసంవాదము.

తే. అతనిమనమునందలినిశ్చయం బెఱింగి, గర్గుఁ డనుమంత్రి యిట్లనుఁ గరము నెమ్మిఁ
దపము సేయంగ నీ విట్లు విపినమునకుఁ, జనియె దేనియుఁ జెప్పెద మనుజనాథ!.

క. హరి దత్తాత్రేయుం డన, ధరణి నవతరించి యోగతత్పరుఁడును ని
ర్జరమునిసేవితుఁడును నై, పరగుచు నున్నాఁ డతని నుపాసింపు నృపా! 215

క. అనిమిషపతి యసురులచేఁ, దనరాజ్యముఁ గోలుపోయి తా నయ్యోగీం
ద్రుని నారాధించి మగుడ, దనుజుల నిర్జించి నిజపదస్థితి నొందెన్. 216

వ. అనిన నర్జునుం డి ట్లనియె. 217

ఆ. అసురవరులచేత నమరేశ్వరుం డెట్లు, గోలుపోయెఁ దనవిశాలలక్ష్మి
నమ్మునీంద్రు నెట్టు లారాధనము సేసె, మగుడ నెట్లు రాజ్యమహిమ వడసె. 218

వ. అని యడిగినం గార్తవీర్యార్జునునకు గర్గుం డిట్లనియె. 219

శా. జంభాదిప్రకటాసురప్రకరము ల్శక్రాదిదేవాలియుం
న్శుంభద్విక్రమకేళిలీల లెసఁగ న్సోమించి యేకాబ్దము
జ్జృంభోత్సాహము లుల్లసిల్లఁగ జయశ్రీలోలత న్పోర సం
రంభం బేది నిలింపు లోడి రసురవ్రాతాస్త్రభిన్నాంగులై. 220

తే. అమరు లట్లోడి వాలఖిల్యాదిమునులుఁ, దారు గురునిపాలికిఁ జని దైత్యవరుల
నోర్పు తెఱఁగు విచారించు చుండ వారి, కెలమి మిగుల బృహస్పతి యిట్టు లనియె.

మాలిని. అతివికృతచరిత్రుం డత్రిపుత్త్రుండు యోగ
స్థితినిరతుఁడు దత్తాత్రేయుఁ డవ్విష్ణుమూర్తి
న్సతతము నతిభక్తి న్వత్సలుంగా భజింపుం
డతఁ డసురకులఘ్నోద్యద్వరం బిచ్చు మీకున్. 222

దేవతలకు దత్తాత్రేయునకు సైనసంవాదము.

సీ. అనుడు దివౌకసు లతిరయంబున నేఁగి కిన్నరగంధర్వగీయమాను
లక్ష్మీసమన్వితు లలితాంగుఁ దేజస్సముజ్జ్వలు నమ్మహాయోగిఁ గాంచి
యతిభక్తితో మ్రొక్కి యాసవతోయాదు లడిగిన నిచ్చుచు నమ్మహాత్ముఁ
దరిగినతోడనె యరుగుచు నిలిచిన యెడఁ దారు నిలుచుచు నెలమి మిగుల

ఆ. ననుదినంబుఁ దగిలి యారాధనము సేయ, నమరవరులఁ జూచి యతఁడు నన్ను
నేమి గోరి మీర లిట్లు సేవించెద, రనిన వార లిట్టు లనిరి ప్రీతి. 223

చ. బలువిడి మూఁడులోకములు బాహుబలంబున జంభుఁ డాదిగాఁ
గలదితినందను ల్గొనిన గర్వ మడంగి భవత్పదాంబుజం
బులు గొలువంగ వచ్చితిమి భూరిగుణాకర! యమ్మహాసురా
వలిఁ బోలయించి మాకుఁ ద్రిదివస్థితిఁ గ్రమ్మఱఁ జేయవే దయన్. 224

వ. అనిన దత్తాత్రేయుం డిట్లనియె. 225

శా. మద్యాసక్తుఁడ నంగనారతుఁడఁ గర్మభ్రంశనోచ్ఛిష్టుఁడ
న్నాద్యద్దైత్యవినాశశక్తిగలదే నా? కన్న నద్దేవత
ల్విద్యాక్షాళనశుద్ధమానసుఁడ వావిష్ణుండ వాద్యుండ వీ
యుద్యత్పుణ్యచరిత్ర యిందిర మహాయోగీంద్రచూడామణీ! 226

వ. నీవు సత్యజ్ఞానానందస్వరూపుండవు నీకు విధినిషేధంబు లెక్కడియవి? యనిన నమ్మ
హాయోగి నగుచు నది యట్టిద మీరు నాయున్న రూ పెఱింగి యారాధించితిరి. భవ
దభిమతం బిప్పుడ యొనరించెద దానవుల నెలయించికొని రం డద్దురాత్ములు మదీయ

దృష్టిపాతంబున నపగతప్రాభవు లై నశింతు రనిన నాదిత్యు లత్యంతరయంబునం జని
దైత్యులం బోరికిఁ బిలిచిన. 227

క. చెలఁగుచు భుజబలదర్పో, జ్జ్వలు లై తలపడినరాక్షసప్రవరులతో
త్తల కోహటించి దేవత, లలజడిఁ జని రత్రిపుత్త్రునాశ్రమమునకున్. 228

తే. అవ్విధంబున నని నోడి యధికభీతిఁ, జనిన దివిజుల వెనుకొని దనుజు లరిగి
కనిరి మదిరామదాలసు ననుపమాన, దివ్యతేజు దత్తాత్రేయు భవ్యమూర్తి. 229

వ. కని మఱియును. 230

దైత్యులు దత్తాత్రేయదారాపహరణంబున నశించుట.

ఉ. ఆముని వామపార్శ్వమున యందు వెలుంగుచున్నలక్ష్మిఁ ద
ద్భామిని నిందుబింబముఖిఁ బద్మవిలోచనఁ జారుభూషణ
శ్రీమహిమాభిరామఁ గని చిత్తజబాణవిభిన్నచిత్తు లై
ప్రేమ మెలర్ప దైత్యులు హరింపఁగఁ గోరిరి దాని నందఱున్. 231

వ. అట్లు కోరి దనుజు లద్దివిజులవెనుకం జనక నిలిచి. 232

క. స్త్రీరత్నంబు త్రిలోకీ, సారం బిది మనకు నిపుడు సమకూరెఁ గృతా
ర్థారంభుల మైతి మనుచు, నారక్కసు లంగజార్తు లై యాలక్ష్మిన్. 233

ఆ. పట్టి శిబికమీఁదఁ బెట్టి శిరంబుల, మోచికొని చనంగ మునివరుండు
సురలఁ జూచి నగుచు సిరి దానవులతల, కెక్కె వృద్ధిఁ బొందుఁ డింక మీఱ. 234

వ. అది యెట్లనిన వినుండు. 235

లక్ష్మీనివాసస్థానఫలవివరణము.

క. మేనం బురుషుని సప్త, స్థానంబులు గడచి తలకుఁ జని సిరి విడుచు
న్వాని ననిన ననిమిషు లా, స్థానమ్ములు తత్ఫలములు జననుత! చెపుమా. 236

వ. అని యడిగిన నమ్మునివరుండు. 237

సీ. పురుషునిపదములఁ బొంది యిందిర శుభమందిరస్థితి కటిమండలమున
నుండి మాణిక్యవస్త్రాన్నతత్త్వము గుహ్యమునఁ జెంది భార్యాప్రమోదలీల
క్రోడాంగమున నెలకొని సుతబహువృద్ధి హృదయంబు నొంది యభీష్టసిద్ధి
గళమున వసియించి కంఠభూషణలబ్ధి వదనాబ్జమున నిల్చి మృదుతరాన్న

తే. మంజువాక్యకవిత్వసమగ్రకాంతి, మహిమ గలుగంగఁ జేయుఁ దా మస్తకమున
కరిగెనేని రయంబున నతని విడిచి, యతిముదంబున నన్యుని నాశ్రయించు. 238

వ. కావున శిరోగత యగుటం జేసి లక్ష్మి యద్దానవులం బరిత్యజించెఁ బరదారాభిలాషం

బున దగ్ధపుణ్యు లైనయద్దురాత్ముల నేను తేజోబలైశ్వర్యహీనులం గావించితి మీరు భయంబు దక్కి యారక్కసుల నుక్కడంపుఁ డనుటయు. 239

ఆ. సురలు చెలఁగి యేయుసునిశితశరముల, జంభముఖనిలింపశత్రుకోటి
నమసె లక్ష్మి యెగసి చనుదెంచి యాత్రేయుఁ, నొందె హర్షలీల నొంది యపుడు.

క. అమరేంద్రాద్యమరులు సంప్రమదు లగుచు నమ్మునీంద్రుఁ బ్రస్తుతులఁ బ్రణా
మముల నలరించి వైభవ, మమరఁగ నాకమున కరిగి రవనీనాథా! 241

క. అమరేంద్రు నట్లు నీవును, నమలినతరభక్తియుక్తి నాదత్తాత్రే
యమునీంద్రుఁ గొల్చి భూవర!, యమితైశ్వర్యంబు వడయు మని చెప్పుటయున్.

కార్తవీర్యుఁడు దత్తాత్రేయు సేవించి యిష్టార్థములఁబడయుట.

వ. గర్గునివచనంబులు విని కార్తవీర్యుం డయ్యోగీంద్రు కడ కరిగి నమస్కరించి యనుదినంబును బాదసంవాహనంబులను మద్యమాంసవివిధాహారసమర్పణంబులను జందనకర్పూరకస్తూరికాదిసమస్తవస్తుప్రదానంబులను దదుచ్ఛిష్టావసేవనంబులను నతని చిత్తంబు కృపాయత్తంబుగా నారాధించుచుండ నమ్మునివరుండు దనయపానపవనజనితం బగుననలంబున నమ్మహీభుజాభుజద్వయంబు దగ్ధంబు గావించిన మఱియు నతం డత్యంతభక్తిం బరిచర్య యొనర్చుచుండం గనుంగొని యిట్లనియె. 243

శా. కాంతాసక్తుఁడ మద్యపానరతుఁడం గష్టప్రచారుండ న
త్యంతప్రీతి భజించె దేమిటికి నన్నన్న న్మహీనాయకుం
డంతశ్శుద్ధుఁడ వీ వసంగుడవు విద్యావిస్ఫురన్మూర్తి వీ
కాంతారత్నము పద్మవాస త్రిజగత్కళ్యాణి యోగీశ్వరా. 244

క. నీ వరయఁగ విష్ణుండవు, నావుడు ముని సంతసిల్లి నాతత్త్వము స
ద్భావమున నెఱిఁగి కొలిచితి, గావున వర మిత్తు నడుగు కామ్యయశోర్థీ!. 245

మ. అనిన న్సమ్మద మంది యర్జునుఁడు వేహస్తంబులు న్స్వామిపా
లనసామర్థ్యము ఘోరసంగరజయోల్లాసంబు నిష్టార్థము
ల్దనుఁ జేర్కొన్న జనాళి గాంచుటయు సద్ధర్మైకతాత్పర్యము
న్ఘనసామ్రాజ్యమహావిభూతియును వేడ్కన్ వేఁడె నాసంయమిన్! 246

వ. మఱియు శైలాకాశజలభూమిపాతాళంబులయందు మదీయరథగతి యకుంఠిత గావలయు ననవుడు నమ్మహాయోగీంద్రుం డతనికి నవ్వరంబు లన్నియు నొసంగి మత్ప్రసాదంబునం జక్రవర్తిత్వంబు నొందు మని యనుగ్రహించినం గృతార్థుండై సహస్రబాహుం డమ్మునీంద్రునకు నమస్కరించి వీడ్కొని నిజపురంబునకుం జని రాజ్యాభి

షేక మాంగళ్యంబు నంగీకరించి దత్తాత్రేయప్రసాదంబున నభివృద్ధి నొంది భుజబలై శ్వర్యసంపన్నుండ నై వచ్చితి నేను దక్క నెవ్వఁ డాయుధంబులు ధరియించినను వాఁడు దస్యుండునుంబోలె నా చేతవధ్యుం డగు నని చాటించినం దదీయరాష్ట్రంబునం దొక్కరుండును శస్త్రహస్తుండు లేకుండె నంత. 247

ఆ. భూమిపాలకుండు గ్రామపాలకుఁడు గోపాలకుండు విప్రపాలకుండు
క్షేత్రపాలకుఁడు నశేషతపోధనపాలకుండు నగుచుఁ బార్థివుండు. 248

క. బహుయజ్ఞంబులు సేయుచు, మహనీయాహవవిహారమహితుం డగుచు
న్విహితతపం బొనరించుచు, సహస్రబాహార్జునుఁడు ప్రజాపాలనమున్. 249

వ. చేయుచున్న నతనియత్యంతసమృద్ధిఁ జూచి యాంగిరసుం డనుమునివరుండు. 250

క. నానాయజ్ఞంబుల బహుదానంబుల సతతభూరితపముల రణకే
ళీనైపుణముల నర్జును, నేనృపతులు పోల నేర్తురే? యని పొగడెన్. 251

క. ఏదినమున వరము వడసె, నాదత్తాత్రేయుచేత నానరనాథుం
డాదినమునఁ దత్పూజన, మాదరమునఁ జేయుఁ దాను నవనీజనులున్. 252

వ. అని చెప్పి జడుండు తండ్రీ! దత్తాత్రేయుజన్మప్రకారంబును దదీయమాహాత్మ్యంబును జెప్పితి నింక నలర్కుండు పుట్టినవిధంబును రాజర్షి యైనయమ్మహాత్మునికి నయ్యోగీంద్రుండు చెప్పినయోగంబును జెప్పెద నాకర్ణింపుము. 253

అలర్కచరిత్రము.

ఋతధ్వజుఁ డనునామాంతరముగల కువలయాశ్వుని వృత్తాంత మారంభించుట.

తే. శత్రుఁ డెవ్వఁడు సేయుయజ్ఞముల సోమపాన మొనరించి సంతోషభరితుఁ డయ్యె
నట్టిశత్రుజిన్నామధరాధినాథు, సుతుఁడు సద్గుణయుతుఁడు విశ్రుతయశుండు.

క. లావణ్యాశ్విసమానుఁడు, ధీవిభవామరగురుండు దీపితభుజశౌ
ర్యావష్టంభసురేంద్రుఁడు, శ్రీవిలసితమూర్తి పుణ్యశీలుఁడు జగతిన్. 255

తే. రాచకొడుకులు దాను నారాసుతుండు, వేడ్కతోఁ గూడి బహువిధవిహరణములు
సలుపుచుండఁ గృతార్థులై సకలవిప్ర, రాజవైశ్యకుమారులు రమణతోడ. 256

వ. అక్కుమారునికడ కరుగుదేరం దొడంగి రంత నొక్కనాఁ డహిలోకంబుననుండి.

చ. తరుణులు రూపవంతులు సుదర్శను లశ్వతరాత్మజన్ములా
నరపతిపుత్రుతో విహరణం బొనరించుకుతూహలంబునన్
ధరణిసురాకృతు ల్వెలయఁ దాల్చి ఫణీంద్రకుమారులేఁగుదెం
చి రిరువు రిద్ధతేజులు విశిష్టజనస్తవనీయవర్తనుల్. 258

ఆ. అట్లు వచ్చి భూసురాత్మజవైశ్యకు,మారవరులతో విహారలీల
లర్థిఁ జెలువు మిన్నయహిరాజతనయులఁ, గాంచి నృపసుతుండు గారవమున. 259

క. నెచ్చెలులంగాఁ గైకొని, మచ్చిక వెలయంగ నక్కుమారులు దాను
న్నిచ్చలు వివిధవిహారము,లచ్చుపడ న్జలుపుచు న్ప్రియం బలరారన్. 260

మ. పొలుపుగ మజ్జనాంబరవిభూషణచందనమాల్యభోజనా
దిలలితభోగలీలల సుదీర్ణరసాన్వితగీతవాద్యవి
ద్యల బహుకావ్యనాటకకటాక్షవినోదముల న్గజాశ్వశి
క్షల వివిధాస్త్రశస్త్రనయశాస్త్రపరిశ్రమనైపుణంబులన్. 231

క. పరిహాసవచనరచనల, సరసకళాభ్యసనముల నజస్రము మైత్రీ
పరిణతి వెలయఁగను ఫణీ,శ్వరతనయులతోడఁ గూడి వారని వేడ్కన్. 262

తే. తగిలి ప్రొద్దులు పుచ్చుచు ధరణినాథ, తనయుఁ డధికప్రమోదతత్పరత నొందె
నర్థిఁ బాఁపకొమాళ్ళను నతనితోడి, యాట లుల్లంబులకుఁ బ్రీతి యావహింప. 263

వ. పగలు వినోదించి రాత్రి రసాతలంబున కరుగుచు నివ్విధంబున ననుదినంబును వర్తిం
పుచుండ నొక్కనాఁ డశ్వతరుండు పుత్త్రులం గనుంగొని. 264

క. మనుజభువనంబునం దె, వ్వనితోడం గూడి యాడువాంఛానిరతి
న్జనియెద రేఁ బాతాళం,బునఁ బెక్కుదినంబు లేనిఁ బొడగాన మిమున్. 265

సీ. అని తండ్రి యడిగిన నయ్యహిదారకు ల్మ్రొక్కి కరంబులు మోడ్చి వినయ
మెలరార ని ట్లని రిలశత్రుజిన్మహీధవునిసుతుండు ఋతధ్వజుండు
రూపవంతుం డార్జవోపేతుఁ డతులశౌర్యాభరణుండు ప్రియంవదుండు
విద్యావిదుఁడు బుద్ధివినయాభిమానలజ్జాన్వితుం డధికసఖ్యప్రియుండు
ఆ. వేడ్క నతఁ డొనర్చువివిధోపచారవి,న్యాసముల మనంబు లలరుచుండు
మాకు నిందు నొందులోకంబునందును, నంతప్రీతి పుట్ట దహికులేంద్ర. 266

వ. అని చెప్పిన నయ్యహికులేశ్వరుం డనురాగిల్లి. 267

క. అరయఁగ నెవ్వనిపుత్త్రుఁడు, పరోక్షమున నిట్లు పొగడఁబడు సతతము స
త్పురుషులచే నమితగుణో,త్తరుఁ డై యాతండు ధన్యతముఁడు తలంపన్. 268

తే. చెలులు పగతురు నెవ్వనిచెలితనంబు, కలితనంబు గీర్తింతురు కడఁగి యెపుడు
నట్టిపుత్త్రునిచే సుగుణాఢ్యులార, పుత్త్రవంతుఁడు నాఁ బెంపుఁ బొందుఁ దండ్రి.

క. ఉపకారపరుఁడు మైత్రీ, నిపుణుఁడు గుణయుతుఁడు నైననృపతనయునకున్
విపులతరప్రీతి న్ప్ర,త్యుపకారోత్సవము మీరు నొనరించితిరే? 270

చ. మనసదనంబునం గలసమంచిత కాంచనరత్నవస్తువా
హనము లశంకత న్నృపవరాత్మజుచిత్త మెలర్పఁగాఁ దగం
గొని చని యిందు జీవితము కుచ్చితమై చనుఁ బుత్రులార! యా
మ్మి నుపకృతిప్రవీణుఁ డగుమిత్రునకుం బ్రియ మాచరింపమిన్. 271

తరల. అనినఁ బుత్రులు తండ్రితోడఁ గృతార్థుఁ డాతఁడు వానికి
న్వీను ప్రియంబొనరింప శక్యమె! వేల్పు టేనికి నైన నా
తని కిలం గలయట్టిరత్నవితానవస్తుచయంబు వా
హనము లీయురగాలయంబునయందు లే వహివల్లభా! 272

ఆ. జ్ఞాన మతనియంద కాని లే దన్యుల, యందుఁ బ్రాహ్మజనుల కైన నతఁడు
సంశయంబు లెల్లఁ జయ్యనఁ బాపంగఁ, జాలినట్టిసత్త్వశాలి సుమ్ము. 273

వ. ఆతనికిం జేయవలయుకార్యం బొక్కటి గల దది హరిహరహిరణ్యగర్భాదులకుం దక్కఁ దక్కినవారి కసాధ్యం బనిన నశ్వతరోరగేశ్వరుం డట్టియసాధ్యం బైనకార్యం బెయ్యది దాని నెఱుంగ వలయునని మఱియు ని ట్లనియె. 274

క. ఇది సాధ్య మగు నసాధ్యం, బిది యనఁగా నేల కార్య మీడితధిషణా
స్పదు లై తగ నొనరించిన, నది సిద్ధిం బొందు నిశ్చలారంభునకున్. 245

క. అమరత్వం బమరేశ, త్వ మమరపూజ్యత్వ మనుపదంబులు వరుస
న్నమధికతమవిహితోద్యో, గమునన యవి తమ్ముఁ బొందఁ గాంతురు మనుజుల్. 276

ఆ. అరుగకుండెనేని గరుడఁ డైనను నొక్క, యడుగు నరుగ లేఁడు కడఁగి చీమ
యైన నరుగఁ దొడఁగెనేని యనేకస, హస్రయోజనమ్ము లరుగు చుండు. 277

క. భువి యెక్కడ దివి యెక్కడ, ధ్రువుఁ డీభువినుండి కాదె ధ్రువ మగుపదమున్
దివిఁ బడసెం గావున స, ద్వ్యవసాయికిఁ బడయరానియదియును గలదే. 278

శత్రుజిత్తుతో గాలవుఁడు స్వాశ్రమపీడఁ జెప్పుట.

వ. అని యశ్వతరుం డక్కుమారులకుం జేయవలయు నసాధ్యకార్యం బెయ్యది వాని నెఱిఁగింపుఁ డనిన నప్పాఁపఱేనికిఁ దదీయసూను లాఋతధ్వజుండు మాకుం జెప్పిన తెఱంగున నతనివృత్తాంతం బంతయు నీకుం జెప్పెద మవధరింపుము గాలవుం డను మునివరుం డొక్కతురగోత్తమంబు గొని శత్రుజిత్తుకడ కరుగుదెంచి నరేంద్రా! మదాశ్రమంబు చొచ్చి సింహసింధురశార్దూలాదివనచరాకారంబులు ధరియించి యొక్కరాక్షసుండు మానవ్రతపరుండ నై తపం బాచరించుచున్ననాకు మనశ్చలనంబుగా నిచ్చలు విఘ్నంబు లాచరించు చున్నదానవుం గోపానలంబున భస్మంబు గావింప సమర్థుండ నయ్యును దపోవ్యయంబున కోర్వక యేను దుఃఖించి నభంబు

చూచి నిట్టూర్పు నిగిడించిన నయ్యంబరతలమునుండి వచ్చి యాయశ్వంబు నాయెదుర
నిలువంబడిన నాకాశవాణి యి ట్లనియె. 279

చ. రవి యొనఁగె న్మునీశ్వర! తురంగము నీ కిది సత్త్వసంపద
న్గువలయ మెల్ల క్రేళ్ళిడిన గ్రుమ్మరు నీళులఁ బర్వతంబుల
న్దివి నతలంబున న్సకలదిక్కులఁ జిక్కు నెమర్ప కెందునుం
దవు లొకయింత లేక సతతంబుఁ జరించు నముల్లసద్గతిన్. 280

వ. కువలయసంచారసామర్థ్యంబునఁ జేసి. 281

ఆ. కువలయం బనంగఁ గువలయాంబున నలి, ఖ్యాతి నమరు నీహయంబు నెక్కి
మునివరేణ్య! నిన్ను ననిశమ్ము గారించు, కిల్బిషాత్ము నసురఁ గీటడంచు. 282

క. ఘనుఁ డైనశత్రుజిన్నృపు, తనయుండు ఋతధ్వజుండు తడయక దీని
న్గొని చని విక్రమతేజో, ధనుఁ డగునాతనికి నిమ్ము తద్దయు నెమ్మిన్. 283

వ. అని చెప్పిన హర్షించి యాతురంగరత్నంబు దెచ్చి నీకు నివేదించితి నాతపంబునకు
విఘ్నంబు నొనరించునక్తంచరు సమయించుటకై కుమారుని నియోగించి ధర్మరక్షణం
బాచరింపు మనవుడు నన్నరేంద్రుం డమ్మునివచనం బాచరించి. 284

తే. పరమకౌతుకమంగళస్ఫురితుఁ బుత్త్రు, నత్తురంగంబు నెక్కించి యనిచి పుచ్చె
నమ్మునీంద్రునితోఁ గూడ నతఁడు నక్కుమారుఁ దోడ్కొని తనయాశ్రమమున కరిగె.

✤ వరాహముం దఱుముచుఁ గువలయాశ్వుండు బిలముఁ జొచ్చుట. ✤

క. అనిన భుజగేంద్రుఁ డి ట్లను, జననాథకుమారుఁ డట్లు చని యేమి యొన
ర్చెను నటఁ జెపుఁ డేతత్కథ, విన విస్మయ మనుడు నురగవిభునకుఁ బుత్త్రుల్. 286

చ. అనుపమశౌర్యుఁ డాకువలయాశ్వకుమారుఁడు గాలవాశ్రమం
బునఁ గలసంయమీశ్వరులఁ బ్రోల్వగఁ గాచుచు సర్వవిఘ్నశాం
తినిపుణుఁ డై యజస్రము నతిప్రమదంబున నుండె నున్నయ
ద్దనుజపతిపుత్త్రుఁ గాలవునిఁ జంపఁ గడంగి మదంబుసొంపునన్. 287

సీ. రాక్షసుఁ డుగ్రవరాహరూపము దాల్చి ఘురఘురధ్వనుల నంబరము పగులఁ
గన్నుల విస్ఫులింగములు రాలంగను జరణఘట్టనమున ధరణి వణఁకఁ
జనుదేర మునిశిష్యసమితి గనుంగొని యాక్రోశ మొనరించి రన్నరేంద్ర
సుతుఁడు బాణాసనస్ఫురితపాణియు హయారూఢుఁడు నై కడుఁ గ్రూర మైన

తే. యర్ధచంద్రబాణము గొని యతిరయమునఁ, గదిసి యప్పంది నేసిన నదియు నొచ్చి
తిరిగి భయమున వనములు గిరులు గడచి, చనఁ దొడంగె నవ్వీరుఁడు వెనుకొనంగ.

వ. అట్లు సహస్రయోజనంబులు చని యవ్వారాహంబు తిమిరపటలపరివృతం బైనభూవివరంబునం బాతాళంబునకు దిగంబడినం గువలయాశ్వుండును వెనుకన యతలంబునకు డిగ్గి యాక్రోడంబుం బొడగానక నిరంతరప్రభావిభాసితం బగునొక్కరమణీయప్రదేశంబునందు. 289

బిలమున నొకబాలికయుఁ గువలయాశ్వుండు నొండొరుమోహించుట.

చ. అనుపమరత్నకాంచనసమంచితనిర్మలహర్మ్యపంక్తుల
న్ఘనతరదీప్తవప్రమణికాంతుల నున్నతదేవతానికే
తనఖచితాబ్జరాగమణిదామములం గడుఁ దేజరిల్లి య
య్యనిమిషనాథువీటి కెన యై యతలంబు వెలుంగఁ జేయుచున్. 290

తే. పొలుచుసౌవర్ణపురిఁ గని భూపసుతుఁడు
మెచ్చి వర్ణించుచును దానిఁ జొచ్చి యందు
మిడుక మానిసి గాన కశ్వుడు మనంబు
కరము విస్మయ మందంగఁ దిరిగి తిరిగి. 291

తే. కడు రయంబునఁ జనునొక్కకాంతఁ గాంచి, తన్వి యెటఁబోయె దెవ్వరిదాన? వనిన
మగువయూరక చనియొక్కమాడు వెక్కు,టయును నొక్కెడఁ గ్రక్కునహాయముగట్టె.

క. మనమున శంకింపక చ,య్యవఁ దానును దానిపజ్జ నాహర్మ్యం బె
క్కెన్నృపసుతుఁడు మణిమయకాం,చనపర్యంకమున నున్నచంద్రనిభాస్యన్. 293

సీ. ఏకాంతమునఁ దనయిచ్చఁ గ్రీడింప దర్పకుఁ బాసి వచ్చినరతి యనంగఁ
బాతాళవిహరణకౌతూహలమున నేతెంచినజలధీశుదేవి యనఁగ
భాసురాకారసంపదసొంపు దాల్చిన లలితోరగాలయలక్ష్మి యనఁగ
రుచిరతరాంగనారూపంబు గైకొన్న శృంగారరసమయశ్రీ యనంగ

తే. నసమలావణ్యభాతిఁ బొల్పారుకుసుమ, కోమలాంగి నున్నతకుచకుంభలలిత
నసితవికసితోత్పలతులితాక్షి నొక్క, కన్యకామణి నృపసూతి గాంచె నెలమి. 294

చ. తనమది కాముబాణములతాఁకున నెంతయుం సంచలింపఁగా
ననిమిషలోచనుం డయి ప్రియం బెసలారఁగఁ జూచి మెచ్చుచు
న్జనపతినందనుం డిది రసాతలదేవతయో సుధాంశునం
గనయొ భుజంగరాజవరకన్యక యో ఖచరేంద్రకాంతయో. 295

వ. అని వితర్కించుచు నక్కుమారుం డాసుందరీరత్నంబుసౌందర్యంబునం దాసక్తుండయ్యె నంత. 296

చ. అమరకుమారసన్నిభుని నానృపనందను బెట్టు గాంచి సం
భ్రమము భయంబు విస్మయము రాగము లజ్జయు నొక్కమాఱు చి
త్తము గబళించినం దలరి తల్పము దిగ్గన డిగ్గి పోయి ప
ద్మముఖ మనోజుఁ డార్వ సఖిమాటున నిల్చెఁ బ్రకంపితాంగి యై. 297

చ. నిలిచి కుమారుమూర్తిపయి నెక్కొనుచూడ్కులఁ గ్రమ్మఱింప వే
డ్కలు గురియింపఁ గోర్కు లొగిఁ గప్పిన నేరక చిక్కుపాటునం
దలరి మనంబులోన ధృతి దర్పకవీరునియేయుపువ్వుఁదూఁ
పులఁ దొరివోయినం గలఁగి పొల్తుక యెంతయు వీతలజ్జయై. 298

తే. తనవిలోచనమధుకరద్వయము గరము, దమకమున నక్కుమారు సౌందర్యమధువుఁ
గ్రోలికొనఁగ మెచ్చులు మదిఁ గీలుకొనఁగ, నంబుజాస్య శిరఃకంప మావహిల్ల. 299

క. ఈరమణీయకుమారుఁడు, మారుఁడొ యక్షాధిపతికుమారుఁడొ పౌలో
మీరమణకుమారుఁడొ రుచి, రోరగనాయకకుమారుఁడో తలపోయన్. 300

వ. అని తలంచుచు నమ్మగువ మదనాతిరేకంబున వెచ్చనూర్చి మూర్ఛపోయి పడినఁ
దదీయవయస్య శిశిరజలసేచన మృదువ్యజనవీజనంబుల దానిసేద దీర్చినంజూచి కువ
లయాశ్వుం డిట్లనియె. 301

క. అతివా నీ విమ్మెయి మూర్ఛిత వగుటకు నేమికతము చెప్పు మనుడు నా
సతి లజ్జాదైన్యసమన్వితలలితాపాంగదృష్టి నెచ్చెలిఁ జూచెన్. 302

తే. చూచుటయు రాజనందనుఁజూచి బోటి, యిట్లనియె నిన్నుఁ జూచి యీయిందువదన
పారవశ్యంబు నొందినకారణంబు, దీనివృత్తాంతమును విను దేటపడఁగ. 303

కుండల యనుసఖి కువలయాశ్వునితో మదాలసా వృత్తాంతము చెప్పుట.

సీ. విశ్వావసుం డన వెలసినగంధర్వ రాజుతనూజ యీరాజవదన
పేరు మదాలస యారామమునఁ గేలి యొనరించు చుండఁగ నొక్కనాఁడు
పాతాళపతి యైనపాతాళకేతుఁ డన్పాపపురక్కసుఁ డేపు మిగిలి
మాయాబలమున నిమ్మానినిఁ గొనివచ్చి యిచ్చట నునిచి యీపచ్చరేయి
ఆ. నవమి తా వరింతు నని నిశ్చయముఁ జేసి, యుత్సవంబుతోడ నున్నవాఁడు
వాఁడు దగినవరుఁడె వనజాయతాక్షికి, నకట శ్రుతికి శూద్రుఁ డర్హుఁ డగునె. 304

చ. దనుజునిఁ బొంద రోసి వనితామణి పోయినరేయిఁ జావఁ జూ
చినఁ గృపపెంపున స్సురభి చెప్పెఁ దలోదరి భర్త గాఁడు నీ

కు నసుర మర్త్యలోకమునకు జ్జనిన న్వడి వీని నెవ్వఁ డే
యుం నతఁడు సుమ్ము భర్త యగు నూఁడు మింతయుం శీఘ్ర మయ్యెడిన్. 305

వ. అని చెప్పిన నిప్పడంతి మరణవ్యవసాయనివృత్త యయ్యె నేనీతలోదరిచెలిత్తియను
గుండల యనుదాన వింధ్యవంతునికూతురఁ బుష్కరశాలిభార్య నతండు శంభుండను
రాక్షసుచేత మృతుం డైనం బరలోకార్థపుణ్యతీర్థంబులకు దివ్యగతి నరుగుచునొక్క
చోట సూకరాకారుం డైనపాతాళకేతుండు మునిజనత్రాణపరాయణుం డైనయొక్క
రాజకుమారునిచేత నేటువడి పఱతేరం గనుంగొని యత్తెఱం గరయం దలంచి వాని
వెనుక నే మరలి యిచటి కరుదెంచితి నిమ్మెచ్చకంటి మూర్ఛకుం గారణం
బాకర్ణింపుము. 306

తే. చూడ్కులకుఁ జిత్తమున కింపు సొం పొనర్చు
చున్నమన్మథమూర్తి వీ వుండ నింక
నసుర నేసిన యన్యుని కాల నగుదు
నొక్కొ యని తల్లడంబున నువిద సొగసె. 307

వ. అని చెప్పి కుండల వెండియుం. 308

ఉ. అక్కట యాలతాంగి హృదయంబున నీదెస మూర్తి యెంత యుం
స్నొక్కని యున్న దాసురభి నిక్కము రక్కసు నేసినట్టివాఁ
డిక్కమలాక్షిభర్త యని యేర్పడఁ జెప్పెఁ గుమార దైవ మీ
చిక్కులఁ బెట్టి నెవ్వగలఁ జేప్పడఁ జేయఁ దలంచెనో సఖన్. 309

తే. కాంత పుట్టినకోలె దుఃఖము లె గుడిచె, దీనికి వివాహ మయినఁ బృథ్వీతలేంద్ర
మరణ మయినట్టిపతిని గ్రమ్మఱను బొంద, నలయ కే నుగ్రమగుతప మాచరింతు. 310

కుండలతోఁ గువలయాశ్వుఁడు దనవృత్తాంతముఁ జెప్పుట.

సీ. అని చెప్పి కుండలయనఘుసీవెవ్వండ వేప్రయోజనమున కిందు రాక
గీర్వాణదైత్యగంధర్వచారణకిన్న రోరగపతులలో నొక్కరుండ
వే మానుషాగతి నిట వచ్చి తీమూర్తి మానుషి యన రాదు మాకుఁ జెపుమ
నావుడు శత్రుజిన్నరనాథపుత్త్రుఁడ జనకుపంపున మునిజనులఁ గావ

ఆ. నరుగుదెంచి గాలవాశ్రమంబున నుండ, నసుర యొకఁడు పంది యై రయమున
వచ్చి యర్ధచంద్రవత్సాయకమున నా,చేత నొచ్చి తిరిగి భీతి నొంది. 311

ఆ. హయముదోలుకొని రయంబున నే వెను
కొనఁగ నెట్టొ కఱచి క్రోడ మొక్క
బొఱియఁ జొచ్చి యతలమునకు డిగ్గుటయును
దోన జొచ్చి దానిఁ గాన కిచట. 312

వ. సాంద్రతమఃపుంజంబునం బరిభ్రమించుచు వచ్చి తేజోవిరాజితంబు నిష్పురుషంబైనయిప్పురంబుఁ జొచ్చి నిన్నుం గని నేను బిలిచిన నదత్తప్రతివచన వైన నీవెనుకన చనుదెంచి యీహర్మ్యతలం బెక్కితి నిది యిట్టిద కాని. 313

క. విను కుండల నీచెప్పిన, యనిమిషముఖ్యప్రవరులయం దెవ్వఁడఁ గా
నను మాన ముడుగు మనుజుఁడ,ననిమిషముఖు లెల్లఁ బూజ్యు లనిశము నాకున్. 314

చ. అన విని యమ్మదాలస సహర్షసలజ్జసవిస్మయేక్షణం
బు నిగుడ నిశ్చలత్వమునఁ బొంది ముఖాబ్జము చూచుచుండె న
చ్చిన కృప పెంపున స్సురభి చెప్పినయంతయుం నిట్టు నిక్క మై
యొనరిన దైవలీల యొకఁ డోపునె త్రోవఁగ నెందుఁ గుండలా. 315

వ. అని పలికె నంతఁ గుండల కువలయాశ్వుం జూచి. 316

మ. ధరణీనాథకుమార! యాసురభిచేత న్విన్నధన్యుం డవీ
వరయంగా నగు దీలతాంగిమది యన్యాసంగి గా నేర్చు నే
యొరుఁ డుద్యద్భుజవిక్రమోజ్జ్వలుఁడె నీ వాక్రందనుం దక్క ని
ర్భరలీల న్శరవిద్ధుఁ జేసి యొగువ న్పాతాళకేతు న్మహిన్. 317

ఉ. కావున నర్కదీప్తి శశిఁ గాంతి గుణాఢ్యుని భూతి పొందున
ట్లీవనజాయతాక్షి నిను నిం పెసలారఁగఁ బొంది యుత్సవ
శ్రీ విలసిల్లునట్లుగ వరింపుము సద్విధిపూర్వకంబుగా
నావుడు రాజసూనుఁ డెలనవ్వు మొగంబు నలంకరింపఁగన్. 318

మదాలసావివాహము.

ఆ. అట్లు కాక యనుడు నపుడు మదాలసా, పితృకులైకగురుని హితుని భక్తి
తోడ నాత్మఁ దలఁచెఁ దుంబురుఁ గుండల, యాక్షణంబ యతఁడు నరుగుదెంచి.

వ. సముచితంబు లగుమంగళాచారంబు లొనరించి. 320

చ. అనలము ప్రజ్వలించి విహితాగమతంత్రము లాచరించి పెం
పొనరఁగ మంత్రయుక్త మగుహోమము మున్నొనరించి తుంబురుం
డనఘుఁడు సేయఁగాఁ గువలయాశ్వుఁడు పెండిలి యయ్యెఁ బ్రీతి న
త్యనుపమరూపయౌవనమదాలసమానస నమ్మదాలసన్. 321

వ. ఇట్లయ్యిరువురకుఁ బరమోత్సవంబునం బరిణయంబు చేసి తుంబురుండు నిజతపోవనంబున కరిగెఁ గుండలయును దీర్ఘంబు లాడఁ జను కుతూహలంబున వినయావనతయై కువలయాశ్వున కిట్లనియె. 322

కుండలతప మొనర్చి దివ్యగతి కేఁగుట.

క. చతురుండవు నయధర్మా, న్వితుఁడవు సద్బుద్ధి వెట్టి నీకు ననఘ! పం
డితజను లైనను నేరరు, హిత ముపదేశింప నేర్తురే యిలనాగల్. 323

క. ఐనను నెచ్చెలిఁ దన మది, నూనిన చెయ్యమునఁ జేసి యుండుగ బుద్ధు
ల్నా నేర్చినట్లు సెప్పెద, మానుగ మీ కేను వినుఁడు మగువయు నీవున్. 324

సీ. పతి ప్రయత్నంబుతో భార్య భరించుచుఁ గీడొంద కుండ రక్షింప వలయు
నవిరోధవృత్తి ధర్మార్థకామములు భార్యానుకూలతఁ బతి కలుగు నిల్లు
భార్యావిహీనతఁ బతికి వర్గత్రితయంబులో నొక్కటి యయిన లేదు
దేవపితృతిథిపూజావిధు లొనరింప భార్యయ పతికి సుపాశ్రయంబు
తే. మగఁడు వెలిగాఁగ సతికి ధర్మంబు ధనము
గామమును మున్న లభ్యము ల్గావు గాన
దంపతులు పరస్పరవశతాప్రమోద
మగ్నమానసు లై కూడి మనుట యొప్పు. 325

వ. అని బహుప్రకారంబుల భర్తృభార్యాధర్మంబులు చెప్పి. 326

క. మనుజేంద్రతనయ! నీవును, వనితారత్నంబుఁ గూడి వైభవలీలన్
ధనతనయాయుర్యుతు లై, మనుఁ డని దీవించి యక్కుమారుని వెలమిన్. 327

వ. వీడుకొని మదాలసం గౌఁగిలించుకొని కుండల దివ్యగతిం జనియె నంత. 328

మదాలసం దెచ్చునపుడు మార్గమునఁ గువలయాశ్వునకు రాక్షసులతోడి యుద్ధము.

శా. ధీరోదాత్తుఁడు శత్రుజిత్తనయుఁ డద్దివ్యాశ్వముం దాను నా
నీరేజాక్షియు నెక్కి యయ్యతలము న్నిశ్శంకత న్వెల్వడం
బ్రారంభించినఁ గాంచి కొంద ఱసుర ల్పాతాళకేతుండు పెం
పారం దెచ్చినకన్య వీఁ డొకఁడు శౌర్యస్ఫూర్తిఁ గొం చేఁగెడున్. 329

క. అని యాక్రోశించుచు వెసఁ, జని చెప్పిన దనుజవిభుఁడు సంధ్యారుణలో
చనదంతతాడనోగ్రా, స్యనితాంతామర్షభీషణాకారుం డై. 330

వ. రయంబున వెలువడి. 331

చ. వెలుఁగుచు దైత్యసేనలు విశృంఖలవిక్రమలీల నేచి యు
జ్జ్వలవివిధాస్త్రశస్త్రరుచిజాలము పర్వఁ గపుం గదంక యుం

గల నడుమంగ దానవుఁ డకంపితుఁడై చనురాజనందను
న్నిలు నిలు మంచుఁ గూడఁ జని నిష్ఠుర నాద మెలర్ప నార్చుచున్. 332

ఆ. చుట్టు ముట్టి వివిధసునిశితాస్త్రములు మైఁ, గురిసెఁ గదిసి యసురకోటియును ర
యమునఁ దీవ్రసాయకాసిగదాశూల, తతుల నన్నరేంద్రతనయుఁ గప్పె. 333

ఆ. అట్లు దనుజవీరు లరవాయి గొనక త
న్భూరిశస్త్రవృష్టిఁ బొదువుటయును
నలఁతి నగవుతోడి యలుక మోమున తోఁక
చెలు వొనర్ప శత్రుజిత్సుతుండు. 334

క. గుణంబు సారించి మార్గణంబులు నిగిడించి. 335

శా. దైతేయప్రవిముక్తదారుణగదాదండాసినానాయుధ
వ్రాతంబు ల్విలసత్తదాభరణవర్మశ్రేణియుం జూర్ణమై
పాతాళైకనికేతనాంతరమునం బర్వంగఁ జేసె న్వెసన్
జాతామర్షత నక్కుమారుఁడు రణోత్సాహంబు దీపింపఁగన్. 336

సీ. చేసి సముల్లాసహాసభాసురతరవక్త్రుఁడై యుజ్జ్వలత్వాష్ట్రబాణ
మసురవీరులమీఁద నతఁ డేసె నేసినఁ దజ్జాతదారుణదహనశిఖలఁ
గాలి చర్మాస్థికపాలముల్ చటచటధ్వనులతో నెంతయుఁ ద్రస్సి తోరఁగఁ
గపిలమునీశ్వరువిపులకోపాగ్ని సాగరులు రయంబునఁ గ్రాఁగినట్లు

తే. దగ్ధు లయిరి దానవులు పాతాళకేతుఁ, డాదిగా నొక్కఁ డ్రెల్లిడి నంత విజయ
లక్ష్మిఁ గైకొని యమ్మదాలసయుఁ దాను, దనపురంబున కరిగె ఋతధ్వజుండు. 337

మదాలసాయుతుఁ డగుకువలయాశ్వునిఁ దండ్రి గని యానందించుట.

వ. అరిగి పరమభక్తిం దండ్రిచరణంబులకు నమస్కరించి తాను వరాహంబు నేయం
టయు దానిపజ్జఁ పాతాళలోకంబున కరుగుటయుఁ గుండలంగనుటయు మదాలసం
బరిణయంబగుటయుఁ బాతాళకేతుప్రభృతిదైత్యులం జంపుటయు విన్నవించినం
బ్రమదాశ్రుకణకలితలోచనుండును బులకితశరీరుండును నగుచు నన్నరేశ్వరుండు
గువలయాశ్వుం గ్రుచ్చిలించుకొని. 338

ఉ. నెట్టన సన్మునీశ్వరులు నిర్భయభావముఁ బొంద దైత్యులం
గిట్టి వధించి ధర్మమును గీర్తియు శౌర్యముఁ దేజము న్సొగల్
ముట్టఁగఁ జేసి వంశము వెలుంగ జగంబులఁ బేరు గన్న నీ
యట్టిసుపుత్త్రుఁ గాంచుటఁ గృతార్థుఁడ నైతిఁ గుమార! యెంతయున్. 339

సీ. తండ్రిచే సంపాదితము లైనధనయశంబులు ప్రతాపము [illegible]
దప్పక వర్తించుతనయుఁడు మధ్యముం డాత్మీయసత్త్వసామగ్రిఁ జేసి
తండ్రిమాహాత్మ్యంబు దద్దయుఁ దనరార నొనరించునందనుం డుత్తముండు
తండ్రిసద్గుణసముదయము ద్రుంగుడు వడ నెలఁగుపుత్త్రుఁడు హీనుఁ డలఘుశౌర్య

తే. తాన వెలయుమనుష్యుఁ డుత్తముఁడు పితృపి
తామహులచేత వెలయు నాతండు జగతి
మధ్యముఁడు మాతచేతను మాతృబంధు
గణము చేత వెలయువాఁడు గష్టతరుఁడు. 340

శా. పాతాళంబు వలీలఁ జొచ్చి విలసద్బాహాబలస్ఫూర్తిపై
దైతేయప్రకరంబు గీటడఁచి గంధర్వాత్మజం దెచ్చితీ
వేతన్మాత్రుఁడవే భవత్సదృశు లే యేరాజులుం బుత్త్ర! నీ
చేతం బెంపు వహించె వంశము యశశ్శ్రీవృద్ధి నేఁ బొందితిన్. 341

వ. అని యతని నందందఁ గౌఁగిలించుకొని యాయురైశ్వర్యపుత్త్రధనవంతుండ వగు
మని దీవించి వీడుకొల్పిన నభ్యంతరావాసంబున కరిగి మదాలసాసహితంబుగఁ గుమా
రుండు తల్లికి మ్రొక్కి బంధుజనానందకరుం డగుచుండె నని నాగకుమారు లశ్వత
రునికిం జెప్పిరని జడుండు తండ్రికిం జెప్పినవిధం బేర్పడం జెప్పి మఱియును. 342

ఆశ్వాసాంతము.

తరల. శమధురంధర! శంఖకంధర! సౌమ్యనీతియుగంధరా!
కమలలోచన! కావ్యసూచన! కమ్రకాంతివిలోచనా!
విమలవిగ్రహ! విమతనిగ్రహ! విష్ణుభక్తిపరిగ్రహా!
సమరభీకర! సద్గుణాకర! చారుకాంతిసుధాకరా. 343

క. లోకాలోకనగేంద్రగ!, హాకేలీలోల! కిన్నరామరమిథునా
నీకోపగీయమాన!, శ్లోకోత్తేజఃప్రదీపశోభితచరణా! 344

మాలిని. వితరణరవిపుత్త్రా! వీరలక్ష్మీకళత్రా!
సతతశుభచరిత్రా! సజ్జనస్తోత్రపాత్రా!
కృతవిలసితపూర్తీ! కీర్తిధర్మప్రవర్తీ!
ప్రతిభటసమవర్తీ! భామినీహృద్యమూర్తీ! 345

గద్యము. ఇది శ్రీమదుభయకవిమిత్త్ర తిక్కనసోమయాజి ప్రసాదలబ్ధసరస్వతీపాత్త్ర
తిక్కనామాత్య పుత్త్ర మారయనామధేయ ప్రణీతం బైనమార్కండేయమహాపురా

ణంబున నాడిబకయుద్ధంబును జడోపాఖ్యానంబును నరకప్రకారంబును విపశ్చిదాఖ్యానంబును పతివ్రతాఖ్యానంబును దత్తాత్రేయజన్మంబును జంభాసురవధంబును కార్తవీర్య చరిత్రంబును కువలయాశ్వనాగకుమారులసఖ్యంబును నాగకుమారులశ్వతరునికిం గువలయాశ్వుండు పాతాళంబున కరుగుదెంచి మదాలసను వివాహంబై పాతాళకేతుప్రభృతిదైత్యులం జంపి నిజపురంబున కరిగినవిధంబుఁ జెప్పుటయు నన్నది ద్వితీయాశ్వాసము.

శ్రీ ర స్తు.

మార్కండేయపురాణము

తృ తీ యా శ్వా స ము.

మదజనదభవాన్వయ
తామరసవనార్క! మహితధర్మవితర్కా!
సామహితమితవచనరచ
నామోదితలబ్ధవర్ణ! నాగయకర్ణా! 1

వ. పరమజ్ఞానచక్షు లైనపక్షు లాజైమిని కి ట్లనిరి జడుండు తండ్రీ యశ్వతరుండు మదాలసాకువలయాశ్వులు పదంపడి యెట్లు వర్తించి రని యడిగిన నతనికిం గొడుకు లి ట్లనిరి. 2

ఉ. అత్తకు మామకు న్వినయంబుగ నిచ్చలు భక్తి మ్రొక్కుచు
జ్జిత్త మెలర్పఁ బంపుఁ దగఁ జేయుచుఁ దాను ప్రియుండు వేడ్కమైఁ
జిత్తజభోగరాగములఁ జేసి మనంబులఁ గౌతుకంబు ద
ళ్కొత్తఁగ నమ్మదాలస మదోత్కటలీల ననేకభంగులన్. 3

శా. లీలోద్యానముల న్మదాలసమరాళీకేళిరమ్యాబ్జినీ
కూలస్ఫాటికమండలంబుల లతాకుంజంబులన్ రత్నరు
గ్జాలాలంకృతకృత్రిమాద్రివిలసత్సానుప్రదేశంబుల
జ్జాల న్వేడ్క వినోదము ల్సలుపుచు న్సాంద్రానురాగంబునన్. 4

వ. అభిమతసుఖంబు లనుభవించుచు నుండె నంత నొక్కనాఁడు శత్రుజితుండు పుత్త్రున కి ట్లనియె. 5

ఉ. పాపపురక్కసు ల్గలరు పల్వురు దద్భయ మంద కుండఁగాఁ
దాపసకోటి గాచునది ధర్మువు గావున శౌర్య మొప్ప నీ
వీవయి వాహనోత్తమము నెక్కి కుమారవరేణ్యా! నిచ్చలు
న్దీవిని సంచరింపు ధరణి న్ధరణీసురరక్షణార్థమై. 6

తాళకేతునిమాయచే మదాలస మృతినొందుట.

వ. అని పనిచినం గువలయాశ్వుండు పూర్వాహ్ణంబునం గువలయంబుం గలయం దిరిగి
యరుగుదెంచి తండ్రికి మ్రొక్కుచు మదాలసామనోహరవిహారంబులం దవిలి దివస
శేషంబును రాత్రియుం సుఖయించుచు ననుదినంబును నివ్విఘ్నంబునం జరియించుచుండి
యొక్కనాఁడు పాతాళకేతునితమ్ముండు తాళకేతుం డనుదైతేయుండు పూర్వవై
రంబు దలంచి యమునానదీతీరంబున మాయామయం బగునాశ్రమంబు గావించి
కొని మునివేషంబున నున్నవానిం గనియె నంత వాఁడును నక్కుమారునిం జేర
నరిగి యి ట్లనియె. 7

ఉ. వీరకుమార! యేను నిను వేఁడెదఁ బ్రార్థన సల్పుమయ్య పెం
పార మఖుం బొనర్పఁగఁ బ్రియంబడి దక్షిణ లేమి వచ్చితి
న్గారవ మొప్ప నీమహితకంఠవిభూషణ మిమ్ము నాకు ర
క్షారతి పూని యేమఱక కావు మదాశ్రమముం గృపామతిన్. 8

తే. అంత నేను జలంబులయందు మునిఁగి, సకలభూప్రజావృద్ధిహేతుకము లైన
మహితవైదికవారుణమంత్రవిధుల, వరుణు నభిమంత్రితునిఁ జేసి వత్తు ననిన. 9

తే. కపటమునికి నతఁడు మ్రొక్కి కంఠభూషణం బొసఁగి యేను భవదాశ్రమంబుపొంత
నుండఁగా విఘ్న మొనరింప నొక్కరుని!, రాదు విహితకృత్యము సల్పి రమ్ము పొమ్ము.

తే. అనిన యమునాజలంబులయందుఁ గ్రుంకి, యసురమాయాబలంబున నక్కుమారు
పురమునకుఁ బోయి రాజమందిరముఁ జొచ్చి, మొగముపై శోకదైన్యముల్ముసుఁగువడఁగ.

వ. ఎల్లవారికి కాలింగించుచు మదాలసకడకుం జని డగ్గుత్తిక వెట్టుచు. 12

ఉ. అక్కట యేమి సెప్పుదు మదాశ్రమభూమి ఋతధ్వజుండు పెం
పెక్కినవిక్రమంబున మునీశ్వరరక్షణకేళి నుండఁగా
రక్కసుఁ డొక్కరుండు గడు రౌద్రమునం జనుదెంచి తాఁకి పే
రుక్కున నొక్కశూలమున నుగ్రతఁ జీరినఁ గూలె మేదినిన్. 13

వ. అట్లు గూలి. 14

తే. మరణవేళను దనకంఠమాల దీసి, నిచ్చె నా కింక దాఁపఁగ నేల? వినుము
శూద్రతాపసు ల్గొంద ఱచ్చోట నుండి, యగ్నికార్యంబు లొనరించి రతని కపుడు.

తే. ఎసఁగుహాహారవం బేడ్పు లెలుఁగు గాఁగ, నశ్రుజలపూరితాననమైనకువల
యాశ్వరత్నంబు గొనిపోయె నద్దురాత్ముఁ, డింతయును నేమి సెప్పుదు నేను దల్లి!

క. ఏ నింతపాపకర్ముఁడ, నో నాముందఱన యింతయును నొనరింపం
గా నాకుఁ జూడ వలసె, న్మానిని! యింకేది తగవు? నడుపుముదానిన్. 17

తే. హృదయమునకు నమ్మిక యగునివ్విభూష, ణంబు గైకొందుఁ గాకిది బాతుఁ దపసి
కేల యనుచు నచ్చట నైచి తాళకేతుఁ, డరుగుటయుఁ జెల్లజనులును నార్తిఁ బొందె.

ఉ. హా! యని యేడ్చుచు న్వివశులై విలపింపఁగ దేవు లక్ష్మహీ
నాయకుఁడు న్సుమారునిగుణంబులు పేర్కొనుచుం బ్రలాపము
ల్సేయఁగ నవ్విభూషణము చేరి మదాలస ప్రాణవాయువు
ల్వోయి ప్రచండవాతహతపుష్పలతాకృతిఁ గూలె మేదినిన్. 19

క. అంతటఁ బురజనసదనా, భ్యంతరముల నెల్ల నేడ్పు లడరెను ధరణీ
కాంతునిగృహమున నెట్టు దు, రంతాక్రందనము లడరె నట్టుల పెల్లై. 20

క. పతిమరణశోకతాపా, హతి విగతప్రాణయై మదాలస వజ్రా
హతిఁ బడినమణిశలాకా, కృతి నేలం బడినఁ జూచి క్షితిపతి మదిలోన్. 21

శత్రుజిత్తుఁడు దత్పత్నియు వైరాగ్యము నొందుట.

వ. ధైర్యం బవలంబించి పరిజనుల నవలోకించి యిట్లనియె. 22

తే. అధ్రువంపుసంసారంబునందుఁ గల్గు, నఖిలసంబంధములయనిత్యత దలంప
మనకు నాఱడి యిట్లు రోదనము చేత, తగవు గాదని చూడెదఁ దత్త్వయుక్తి. 23

క. మఱి నొక్కించుకయును నే, సుతునకుఁ గోడలికి నేని శోకించెద నే
కృతకృత్యత్వంబున వి, శ్రుతు లగునయ్యిరువురును నశోచ్యులు మనకున్. 24

వ. అది యెట్లనిన. 25

ఉ. నావచనంబున న్స్వనిజనస్థిరరక్షణనిత్యతత్పరుం
డై వెస నేఁగి యామునులకై సమరావని వీరకేళికై
నేవపుదేహము న్విడిచి యెంతయు ధాత్రిఁ గృతార్థుఁ డైనపు
ణ్యావహమూర్తి యాకువలయాశ్వుఁ డశోచ్యుఁడు గాక శోచ్యుఁడే. 26

క. జననిసతీత్వము వంశం, బున విమలత్వమును దనదుభుజవీర్యము నా
తనయుం డిటు వెలయించునె, యని విప్రార్థంబు కాఁగఁ బ్రాణచ్యుతుఁ డై. 27

చ. పతి మృతి విన్నమాత్ర నిజభావము దద్గత మైనఁ దాన సు
వ్రత యిటు ప్రాణము ల్విడిచి గ్రక్కున భర్తను గూడెఁ గా శుభ
స్థితి మెయిఁ జన్నయీసతివిచిత్రచరిత్రము దుఃఖహేతు వే
పతిఁ గదవంగ దైవతము భామల కెందును గల్గ నేర్చునే? 28

ఆ. మగఁడు లేక యింట మలమల మఱుఁగుచు, నీలతాంగి యుండె నేనిఁ జూచి
మనకు నఖిలబంధుజనులకు నొక్కనాఁ, డైన శోకవహ్ని యాఱు టెట్లు? 29

క. పురుషవిహీన లయినయా, తరుణుల దైన్యముల కడలఁ దగుఁ గాక మది

త్పురుషానుమరణపుణ్యో, త్తర యగునీసాధ్వి వగవఁ దగియెడునదియే ? 30

వ. అని శత్రుజిత్తుండు పలికినపలుకులం బుత్త్రమరణప్రకారం బెఱింగి కువలయాశ్వ
జనని జనితహర్షయై పతిం జూచి యిట్లనియె. 31

చ. మనమున భీతిగోద్విజసమాజముఁ గావఁగఁ బూని యాజి న
స్త్రనిచయదారితాంగు లయి చచ్చువినిర్మలధర్మకర్మఠుల్
మనుజులు గాక రోగముల న్మ్రంది గృహంబులయందు బంధు లే
డ్వ నిలుగుకష్టులు న్నరులె వారలతల్లులు తల్లులే మహిన్. 32

ఆ. ఉగ్రవైరివిజయి యొండె మృతుం డొండె, నాజిభూమి నెప్పు డగుఁ దనూజుఁ
డపుడు గర్భదుఃఖ మతివకు సఫలతఁ, బొందు నని తలంతు భూపవర్య. 33

వ. అని పలికె నంత నన్నరేంద్రుండు గంధర్వరాజనందన నలంకరించి యుచితప్రకా
రంబునం బురంబు వెలువడం గొని చని సంస్కరించి కృతస్నానుం డై కొడుకునకుఁ
గోడలికి నుదకకర్మంబు లాచరించి వీటికిం జనియె నటఁ దాలకేతుండును యమునా
జలంబులు వెలువడి కువలయాశ్వునికడ కరిగి మహాపురుషా ! నీవలనం గృతార్థుండ
నైతి నీ విచ్చటం గదల కునికిం జేసి మదభిలషితం బంతయుసాధితం బయ్యె వేం
చేయుం మనిన నతనికి నమస్కరించి వీడుకొని యక్కుమారుండు. 34

క. అసమానసౌకుమార్యో, ల్లసితమృదుతనూలతావిలాసమదభరా
లస యై కర మమరుమదా, లసఁ గనుఁగొనునతికుతూహలం బెలరారన్. 35

వ. కువలయాశ్వంబు నెక్కి రయంబునం జని. 36

కువలయాశ్వుఁడు మదాలసమరణము విని దుఃఖించుట.

సీ. అపగతాలంకార మై యపహృష్టజనావళీవిరళ మై యప్రవర్తి
తాతోద్యవాద్య మై యవ్విధంబున నున్న పురవరంబు కుమారవరుఁడు సొచ్చి
తనరాక కద్భుతంబును నతి మోదంబు, నొంది చెలంగుచు నొండొరులను
నెలమి నాలింగనంబులు సేయుచును బ్రీతిఁ జేర దీవింపుచుఁ బౌరు లెల్లఁ

తే. బొదివికొని రాఁగ మందిరంబునకుఁ జనిన, దల్లిదండ్రులు సకలబాంధవులు నధిక
హర్షవిస్మయమగ్ను లై యతనిఁ జక్కఁ, గౌఁగిలించి రాశీర్వచఃశతు లగుచు. 37

వ. అక్కుమారుండు వారలసంభ్రమచేష్టితంబులు చూచి విస్మితుం డగుచుఁ దండ్రికి
మ్రొక్కి యది యేమి యని యడిగిన నతండు గొడుకున కంతవృత్తాంతంబును
దేటపడం జెప్పుటయును. 38

చ. చెవులకు శూల మై యెదకుఁ జిచ్చయి తాఁకి మదాలసామృతి
శ్రవణము వేదనం బెనుప రాజకుమారుఁడు తల్లిదండ్రు లా

ద్ద విపులశోకలజ్జలకుఁ దావలమై వదనంబు వ్రాల్చి ని
ల్చె నెఱఁగుపాటు నొంది కడుఁ జేష్ట యడంగి విషణ్ణమూర్తి యై. 39

వ. అటు నిలిచి యంతర్గతంబున. 40

క. ఆవెలఁదుక నామృతి విని, జీవము వెసఁ దొఱఁగి చనియెఁ జేడియమరణం
బే వినియుం నున్నవాఁడను, జీవముతో నింతకఠినచిత్తుఁడు గలఁడే? 41

వ. అనుచు నందంద నిట్టూర్పులు సందడింప డెందంబు గొందలంబు నొంద నన్నరేంద్ర
నందనుండు వెండియుం. 42

సీ. ఎలనాఁగఁ జేర్కొని యేడ్చెద నందునే మముబోంట్లకును నిది మానహాని
పడఁతి కిచ్చెదఁ దనుప్రాణంబు లందునేఁ దనువు ప్రాణంబులు తండ్రిసొమ్ము
మునివృత్తి నడవికిఁ జనియెద నందునే జనకుఁడు నన్నేల చనఁగ నిచ్చు?
నుడిగి మడిఁగి మాని యుండెద నందునే నొవ్వనివారికి నవ్వుఁ బుట్టుఁ

తే. ప్రాణములు నాకు నిచ్చినపడఁతిసదుప, కృతికి నేర్తునె ప్రత్యుపకృతి యొనర్ప?
భామినీభోగసౌఖ్యము ల్పరిహరించి, విరతి నొందెదఁ గా కింక వేయునేల. 43

వ. అని తలంచి మదాలసకుం దిలోదకప్రదానంబును ననంతరక్రియాకలాపంబును నిర్వ
ర్తించి ఋతధ్వజుం డెల్లవారును విన ని ట్లనియె. 44

కువలయాశ్వుఁ డన్యభార్యపరిగ్రహణము సేయనని ప్రతిన పట్టుట.

తే. నాకునీజన్మమున సుగుణైకభద్ర, యగుమదాలస యొక్కర్త యాలు గాని
యన్యభార్యాపరిగ్రహ మాచరింప, నింక సత్యంబు పలికితి నే వినుండు. 45

వ. అని ప్రతిజ్ఞ చేసి ఋతధ్వజుం డంగనావిషయభోగసుఖంబు లన్నియుఁ బరిత్యజించి
తుల్యవయోరూపగుణసంపన్ను లైనసఖులతోడం గూడి క్రీడించుచున్నవాఁ డతనికి
మదాలసం దెచ్చి యిచ్చుటయ పరమకార్యం బది యీశ్వరాదులకుం జేయ రా
దనిన నితరులకు శక్యంబు గామి చెప్ప నేః యనినం గొడుకులకు నశ్వతరుండు
నవ్వుచు ని ట్లనియె. 46

తే. జనులు మున్నై పెక్కు యశక్యమని మనంబులోపల స్రుక్కి కార్యంబునందుఁ
బూని యుద్యోగ మొనరింప రేని యెట్లు, దానిసఫలతాఫలతలు దారు గంద్రు. 47

క. తనపౌరుషంబు వదలక, మనుజుఁడు కార్యం బొనర్ప మానుగ దైవం
బునయందుఁ బౌరుషమునం,దును దత్ఫలసిద్ధి దోఁచుఁ దుల్యస్థితితోన్. 48

అశ్వతరుఁడు సరస్వతిని గుఱించి తపముచేయుట.

వ. కావునం దత్కార్యంబునకు యత్నంబు నేసెద నని తనయులకుం జెప్పి యప్పుడ
హిమవంతంబున కరిగి యురగేశ్వరుండు ప్లక్షావతరణం బను తీర్థంబునం దపోయుక్తుం

డై సకలవాఙ్మయస్వరూప యైనసరస్వతిం దనహృదయకమలంబున నిలిపికొని కరకమ
లంబులు మొగిచి యి ట్లనియె. 49

క. దారువునం దనలంబును, ధారిణిఁ బరమాణువులును దద్దయు నున్న
ట్లారాధనీయమూర్తివి, భారతి! నీయందు నుండు బ్రహ్మము జగమున్. 50

క. ఆరయ నీ నెల వగునోం,కారము మాత్రాత్రయమునఁ గాదే యుండు
న్భారతి! సదసన్మయ మగు, సారాసారద్వయంబు సంపన్నం బై. 51

అశ్వతరునకు సరస్వతి గానప్రావీణ్య మొసఁగుట.

వ. దేవీ! యనిర్దేశ్యస్వభావంబును బ్రణవార్థమాత్రాశ్రితంబును వికారరహితంబును దాలుదంతోష్ఠపుటజిహ్వావ్యాపారదూరంబును సాంఖ్యవేదాంతోక్తంబును నాదిమధ్యాంతరహితంబును నై వెలుంగు పరంజ్యోతి నీస్వరూపం బిట్టి దని నిరూపింప నెవరికి శక్యంబు నిత్యంబులు ననిత్యంబులు స్థూలంబులు సూక్ష్మంబులు నైనబహువిధపదార్థంబులు నీవలన నుద్భవిల్లు నీస్వరవ్యంజనంబులం జేసి సమస్తంబు సంవ్యాప్తం బై యుండు నీమహామహిమ యవాఙ్మానసగోచరం బని యనేకప్రకారంబులం బ్రస్తుతించినం బ్రసన్నయై సరస్వతి యశ్వతరునిం గనుంగొని పరలోకప్రాప్తుండైన నీయనుజుండు కంబళుండు చనుదెంచి తొల్లిటియట్ల నీకు సహాయుండు గా వరం బిచ్చితి నింక నీకభిమతం బెయ్యది? యడుగు మనిన నతండు దేవీ! కంబళునకు నాకు సప్తస్వరమహితమధురగీతవిద్యావిశారదత్వంబు ప్రసాదింప వలయు ననిన వాగ్దేవి యవ్వరం బొసంగి మత్ప్రసాదంబున మీరు స్వర్గమర్త్యపాతాళంబులయం దెవ్వరికంటె నధికులయిన గాయకుల రగుఁ డని యంతర్ధానంబు చేసినం బదతాళస్వరాదిలక్ష్యలక్షణం బంతయు నప్పుడ తమ కవగతం బగుటయు నయ్యన్నయుం దమ్ముండును బరమానురాగంబునం దేలుచుఁ గైలాసంబున కరిగి. 52

కైలాసమున శివుఁ డశ్వతరునిపాటకు మెచ్చి వర మొసంగుట.

స్రగ్ధర. శ్రుతికాంతావక్త్రపద్మస్ఫురితబహువిధస్తోత్రసవ్యార్థజాలో
ద్గతవైచిత్రీనిమగ్నాత్మకు సురమునిగంధర్వవిద్యాధరేంద్రా
ర్చితపాదాంభోజుఁ గాంతీశితృదళకతదృక్ఛ్రీపతిబ్రహ్మసేవా
సతతప్రేమాత్మ చేతోజనితఘనదయాశాలిఁ జంద్రార్ధమాళిన్. 53

మ. కని భక్తిం బ్రణమిల్లి పన్నగపతు ల్గాతూహలం బెంతయు
న్దనరంగా నధిక ప్రయత్నమున నిత్యంబు న్గడు న్జేరి రే
పును మధ్యాహ్నమునప్డు సంజలను మాపుం గొల్చి యప్పార్వతీ
శునిఁ గీర్తించుచు నింపుఁ బెంపు నెదలో సొంపారఁగాఁ బాడుచున్. 54

క. అహిపతు లారాధన మిట్లు, బహుకాలము సేయ వారిపాటకుఁ గడు మె
చ్చి హరుం డడుగుఁడు వరము, లహీనముగ నిత్తు ననిన ననురాగముతోన్. 55

తే. అశ్వతరుఁడు తమ్ముండును నధికభక్తి, నమ్మహాదేవునకు మ్రొక్కి యమరవంద్య
దేవదేవ త్రిలోచన త్రిపురమథన, యిందుశేఖర దయ వర మిచ్చె దేని. 56

వ. అవధరింపుము మరణప్రాప్త యైనకువలయాశ్వకుమారునికులప్రమద మదాలస తన పూర్వవయోరూపకాంతివిలసనమ్ములతో నా కిప్పుడ పుత్త్రి యై పుట్టి జాతిస్మరయుఁ బరమయోగినియును యోగిమాతయును గావలయు ననిన భవుండును మత్ప్రసాదం బున నట్ల యయ్యెడు నీవు నిజపురంబునకుఁ జని నియతుండ వై పితృప్రియంబుగా శ్రాద్ధంబొనరించి మధ్యమపిండం బుపయోగించి మదాలసాజననకామధ్యానపరుండ వగుచుండ నీమధ్యమఫణంబున నాసుమధ్య యుద్భవించు నని వరం బిచ్చిన హర్షించి భుజగేశ్వరుండు భుజగకుండలునకు నమస్కరించి రసాతలంబున కరిగి తత్ప్రకారం బున నాగంధర్వరాజనందనం బడసి యెవ్వరు నెఱుంగకుండ నంతర్గృహంబున నంగ నాజనరక్షితం గావించి యొక్కనాఁడు కొడుకుల కి ట్లనియె. 57

నాగకుమారులతోఁ గువలయాశ్వుఁడు నాగలోకమున కరుగుట.

క. మనుజేంద్రసుతున కుపకృతి, యొనరింపఁగ వలయు నంటి రొనరించితిరే
చని నాకడ కేలా తోడ్కొని రా రొక నాఁడు నట్టిగుణరత్ననిధిన్. 58

క. అని ఫణిపతి పలికినఁ ద, త్తనయులు మఱి తద్దయును ముదంబు దనరఁగాఁ
జని యిష్టాలాపమ్ముల, యనంతరమ వేడ్కఁ గువలయాశ్వునితోడన్. 59

క. శ్రీయుత నీవు ప్రియమున, న్మాయింటికి రాఁగ వలయు నావుడు మాయి
ల్మీయిల్లని వేఱడ మిట్లు, సేయుదురే యిది సఖిత్వశీలము తెఱఁగే. 60

వ. అనిన నురగకుమారు లి ట్లనిరి. 61

క. వినుము ఋతధ్వజ! యించుక, యును సందేహంబు వల దహో! యిట్టిద మా
మనమును వేఱుగఁ దలఁపము, నిను మాజనకుండు గరము నెమ్మిం జూడన్. 62

చ. మనమునఁ గౌతుకం బడర మానుగఁ దోడ్కొని తేరఁ బంచిన
న్జనసుత! యేము వచ్చితిమి నావుడు దిగ్గన లేచి రాజనం
దనుఁ డటు లైన సంతయును ధన్యుఁడ నైతిఁ బోదండు లెండు మీ
రనుచుఁ గరంబు లెత్తి తనయాదలఁ జేర్చుచు భక్తియుక్తుఁ డై. 63

క. మీతండ్రియ మాతండ్రి వి, నీతిని మీయట్ల నేను నెమ్మి నతనికి
న్ప్రీతి యొనరింపఁ దగుదును, వీతకళంకాత్ములార! వేయును నేలా? 64

తే. తండ్రి పిలువఁ బంచిన నేను దడయ వెఱతు, నమ్మహాత్మునియడుగులయాన యనుచు
నపుడ కదలి కాల్నడఁ గుతూహల మెలర్ప, నక్కుమారులుఁ దానున్నృపాత్మజుండు.

తే. పురము వెడలి గోమతి యనుపుణ్యతటిని, నడుము కొని చని యారాజనందనుండు
దీనియావలిదెస నొకో ద్విజకుమార, వరులయూ రని యడుగంగ వారు నేరి. 66

క. ఇరుగేలు పట్టి తదనం,తరమున వివరమున డిగి ఋతధ్వజుఁ గొనిపో
యిరి పాతాళమునకు న,చ్చెరువుగ నిజమూర్తు లెలమిఁ జేకొని యంతన్. 67

క. ఫణముల మణిస్వస్తికల,క్షణరుచిరాంగు లగువారిఁ గనుఁగొని పుల్లే
క్షణుఁడై యతఁ డాహా బ్రాహ్మణులకె మీర లది లెస్స యని కడు నగుచున్. 68

క. ప్రమదరసమగ్నుఁ డగున, క్కుమరునికిని నశ్వతరునికొడుకులు తమతం
డ్రి మహోరగేంద్రుఁ డనియును, నమరసికరమాన్యుఁ డనియు నతిగుణుఁ డనియున్.

వ. చెప్పి తమవృత్తాంతం బంతయు నెఱింగించి తోడ్కొని చనిన నక్కుమారుండును మణిమయాభరణకిరణస్ఫురితకుమారతరుణజరఠోరగసముదయసంకులంబును హారకేయూరనూపురాదినానావిధభూషణభూషితావయవోపశోభిత నాగనితంబినీనికురుంబాలంకృతంబును నై తారకానికరాభిరామం బైనయంబరతలంబునుం బోలె నభిరమ్యం బగుపాతాళభువనంబుఁ జూచుచుం బ్రతిగృహంబునఁ జెలంగు వీణావేణుస్వనానుగతంబు లైనగీతంబులును మృదుమృదంగపణవాదివాద్యంబులు నాకర్ణింపుచుం జని యయ్యురగేంద్రుమందిరంబుఁ బ్రవేశించి నిజప్రియవయస్యులు గానిపింప దివ్యమాల్యాంబరాభరణశోభితుండును వజ్రవైడూర్యఖచితకాంచనాసనాసీనుండును భుజంగమాంగనాకరకలితచారుచామీకరచామరవ్యజనవీజ్యమానుండును నై వెలుంగుచున్నపన్నగేశ్వరుం గని తచ్చరణంబులకుం బ్రణామంబు సేసిన నతండు కువలయాశ్వుం గౌఁగిలించుకొని మూర్ధఘ్రాణంబు చేసి దీవించి యుచితాసనంబున నునిచి యి ట్లనియె. 70

నాగేంద్రుఁడు కువలయాశ్వుని గౌరవించుట.

తే. నిరుపమానతేజుఁడ వైననీగుణముల, కెలమి నొందుచు నుండుదు నెపుడు నేను
సద్గుణునిజీవితము జనశ్లాఘనీయ, మనఘ! గుణవిహీనుండు సప్రాణశవము. 71

క. తనయుండు తల్లిదండ్రుల, కనుపమసద్గుణసమృద్ధి నానందకరుం
డును రిపులకు హృదయజ్వర, మును నైమను టొప్పు జన్మమునకు ఫలముగాన్. 72

క. పరదూషణములు సేయక, దరిద్రు లగువారియందు దయ గలిగి విప
త్పరిపీడితులకు దిక్కై, పరగెడుపురుషుండు సుగుణబంధురుఁ డెందున్. 73

చ. అని ప్రియమారఁగాఁ బలికి యానృపసూతియుఁ దాను నాత్మనం
దనులును గూడి యొక్కట ముదంబున మజ్జనభోజనాదిని

త్యనియతకృత్యము ల్సలిపి యంత నభీష్టకథాప్రసంగలీ
మన మలరంగఁ జేయుచుఁ గుమారునకు న్భుజగేంద్రుఁ డిట్లనున్. 74

అశ్వతర కువలయాశ్వసల్లాపము.

తే. భద్రమూర్తి మాయింటి కభ్యాగతుఁడవు, గానఁ బూజింపవలయు ని న్నాదరమునఁ
గొడుకు తండ్రి నశంకత నడుగునట్లు, లడుగు నన్ను నీ కభిమత మైనధనము. 75

వ. అనినం గువలయాశ్వుండు దేవా! మదీయసదనంబున సువర్ణాదిసమస్తవస్తువులు సంపన్నంబులు సకలభూవల్లభుం డగుమాతండ్రి గలపదివేలేండ్లకు నాకేమిటం గొఱంత లేదు పాతాళాధిపతి వైననీకారుణ్యంబునకు భాజనంబ నైతి నట్టినే నింక నేమి యడుగువాఁడ నని వెండియుం. 76

చ. జనకభుజావనీజములచల్లనినీడ వసించి యుండునం
దనులు జగంబున న్సుఖులు తండ్రి మృతుం డయి చన్నఁ బిన్ననాఁ
డ నిజకుటుంబభారము గడంగి వహించుచుఁ దీవ్రదుఃఖవే
దనఁ బడువా రపుణ్యులు విధాతృనిచేఁత భుజంగమేశ్వరా! 77

వ. కావున. 78

తే. తండ్రికృపఁదృణప్రాయము ల్ధనము లకట, గొఱఁత లే దర్థులకుఁ బెట్టఁ గుడువఁ గట్టఁ
బొలుచుయౌవనారోగ్యము ల్గలవు మున్న, యిట్టినాకు వేఁడంగ నిం కేమి వలయు.

క. అనిన భుజంగమవిభుఁ డి, ట్లను మణికనకాదు లొల్ల వై తేని మనం
బున కొండెద్ది ప్రియము దా, నిన యడుగుము ప్రీతి నిత్తు నీకుఁ గుమారా. 80

చ. అనుడు నతండు ని న్గని కృతార్థుఁడ నైతిఁ బవిత్ర మయ్యె నీ
తనువునఁ బొంది నాయొడలు తావకపాదరజంబు మచ్ఛిరం
బునకు విభూషణం బగుటఁ బూర్ణము సర్వము నైన నిచ్చె దే
ని నహికులేంద్ర! నా కొసఁగు నిర్మలధర్మమతిస్థిరత్వమున్. 81

చ. అనుపమరత్నకాంచనగృహాసనవాహనవస్త్రమాల్యచం
దనరుచిరాన్నపానవసితాతనయాదిసమస్తసంపద
ల్దనరినయట్టిధర్మముఫలంబులు గావున నిన్ను వేఁడెద
న్ఘనతరధర్మతత్పరత నావుడు నయ్యురగేంద్రుఁ డిట్లనున్. 82

తే. నీవు గోరినయట్టుల నీదుహృదయ, మధికధర్మాన్వితం బగు ననుదినంబు
నైన మేదినిఁ బడయంగ రానివస్తు, వనఘ! యొకటి నాచే నెట్లుఁ గొనఁగ వలయు.

వ. అని ప్రార్థించుటయుఁ గువలయాశ్వకుమారుఁ డురగకుమారులయాననం బాలోకిం
చిన నతనియభిప్రాయం బెఱింగి యయ్యిరువురు తండ్రిచరణంబులకుం బ్రణమిల్లి
దేవ! నీ వితని కభిమతం బైనదానిం బ్రసాదించెద వేని నవధరింపుము. 84

మ. అసురాపాదితమాయఁ జేసి తనకై ప్రాణచ్యుతిం బొంది చ
న్నసతిం దన్వి మదాలస న్దలఁచుచు న్సక్తాత్ముఁ డై యీనరేం
ద్రసుతుం డొండొకభార్య నొల్లక ఫణీంద్రా! యున్నవాఁ డమ్మదా
లసఁ గారుణ్యము సేయు మీతనికి నుల్లాసంబు సంధిల్లఁగన్. 85

వ. అనిన నశ్వతరుండు కువలయాశ్వు నాలోకించి. 86

క. చచ్చినవారి మగుడఁ దే, వచ్చునె కలలోన నొండె వారి న్గాన
న్వచ్చునొకో మాయ నొండెను, జెచ్చెరఁ జూపు నగుఁ గాక చిత్రస్ఫూర్తిన్. 87

చ. అనవుడు నక్కుమారుఁడు ప్రియాంగనఁ గన్గొనువేడ్క ద్రిప్పఁగా
ల్పిన ధృతిపొందు వాసి మదిఁ జేర్చినప్రేమము సిగ్గు నుత్తరిం
చిన వినయావనమ్రుఁ డయి చేతులు మోడ్చుచు మాయతన్వియై
నను దయఁ జూపవే భుజగనాయక! నాకు వెస న్మదాలసన్. 88

ఆ. అనుడు మాయరూపు గనుఁగొనఁ బ్రియమేని, చూడు మనుచు దందశూకవిభుఁడు
తాను దాచి యున్నతరలాక్షి నమ్మదా,లస నుదాత్తగుణవిలాసవతిని. 89

నాగేంద్రుఁడు కువలయాశ్వునకు మదాలసనొసంగుట.

వ. ఉరగాంగనలం బిలిచి యక్కుమారుముందటికి మదాలస రప్పించి యురగేశ్వరుండు.

క. మాయఁ బ్రకటించుచును వెడ, మాయపుమంత్రములు రిత్త మంత్రించుచు భూ
నాయకనందన గనుఁగొను, మా యామదిరాక్షి నీమదాలస యగునే. 91

వ. అనిన నతండు. 92

సీ. మెఱయు క్రొమ్మెఱుఁగులమించును మెలఁతగా మీనకేతనుఁడు నిర్మించినట్లు
చారుశృంగారరసము తేట సింతిగా నించువిల్తుండు చిత్రించినట్లు
నవకల్పలతికల నవకంబు నాతిగా శ్రీనందనుఁడు సంతరించినట్లు
నిండారుచందురునినుపారునునుఁగాంతిఁ జెలువగా మరుఁడు సృజించినట్లు

తే. విస్మయం బైనలావణ్యవిలసనమునఁ, బొలుచునమ్మదాలసఁ జూచి భూపసుతుఁడు
విగతలజ్జుఁ డైనను బాసి వెలఁది యెందుఁ,బోయితనుచునాదటఁ జేరఁబోవుటయును.

వ. ఫణీశ్వరుఁ డతని వారింపుచు. 94

క. మాయారూపము ముట్టిన, మాయం బగుఁ గాన నృపకుమారక! నీ వీ
మాయారూపము ముట్టకు, మీ యనవుడు మోహవశత నిల నతఁ డొఱగెన్. 95

క. ధరణిజలానలమరుదం, బరచేష్టం దోఁచునీ ప్రపంచం బెల్ల
న్బరికింప మాయ యగుట, న్దరుణియు మాయ యని యశ్వతరుఁ డిట్లు సూపెన్. 96

వ. అంత నతని మూర్ఛఁ దేర్చి యూఱడించి యురగేశ్వరుండు గంధర్వరాజనందనం
బడసిన తెఱం గెల్ల నెఱింగించినం గువలయాశ్వుండు విస్మయహర్ష మగ్నుండగుచు

నభివందనం బాచరించి సముచితంబుగా వీడ్కొని తలంచినయంతన యరుగుదెంచినకువలయాశ్వంబు నక్కువలయగంధియుం దాను నెక్కి నిజపురంబున కరిగి తండ్రిచరణంబులకుం బ్రణమిల్లి మదాలసాపునరుద్భవప్రకారం బేర్పడం జెప్పి జననీప్రభృతి బంధుజనంబులకుం బరమానందం బొనరించె నాసుందరియును శ్వశురాది గురుజనంబులకు మ్రొక్కి సంభాషణసంభావనాశ్లేషంబుల సుహృజ్జనులం బ్రమోద భరితులం గావించి యెప్పటియట్ల వర్తించుచు. 97

క. ప్రియము చెలంగ మదాలస, ప్రియకరణిం హర్మ్యవనగిరిస్థలములఁ ద
ద్దయుఁ గామభోగపుణ్య, క్షయ మెఱఁ గోరుచు రమించె సద్భావమునన్. 98

వ. అంత. 99

శా. శత్రుక్షత్రలతాలవిత్రపటుదోశ్శౌర్యాఢ్యుఁడై శత్రుజి
ద్ధాత్రీనాథుఁడు పెద్దకాల మిటు లీధాత్రీతలం బిద్ధచా
రిత్రం బొప్పఁగ నేలి నిర్జరపరశ్రీలోలతం బన్నుఁ ద
త్పుత్త్రుం డుత్తముఁ డాఋతధ్వజుఁడు దాఁ బూనె న్ధరాభారమున్. 100

మదాలస పుత్త్రులఁ గనుట.

క. అంత మదాలస గాంచె ని, తాంతోజ్జ్వలతేజుఁ డైనతనయు నతనికి
న్సంతసమున జనకుఁడు వి, క్రాంతుం డనుపేరు పెట్టె గారవ మెసఁగన్. 101

వ. దానికి భృత్యామాత్యజనంబులు సంతసిల్లిరి మదాలస నవ్వుచుం గనక పర్యంకతలంబున నుత్తానశాయి యై యవిస్వరంబుగ నేడ్చుకొమరుకును ముద్దాడునదియుఁ బోలె ని ట్లనియె. 102

మదాలస తనపుత్త్రులకు తత్త్వోపదేశము చేయుట.

సీ. నీవు నిర్మలుఁడవు నీ కెక్కడిది పేరు భావింపు మది కల్పనావికార
మొడలు నీయదియును నీవొడలివాఁడవుగామి యెఱుఁగు మేడ్వకుము నీయేడ్పు తెలుఁగు
భూమ్యాదినివహంబుఁ బొంది విశ్వజ మైన శబ్దంబు గాని నీస్వనము గాదు
హానివృద్ధులఁ బొరయవు నీవు భోజ్యాన్నపానభోక్తవు గావు గానఁ గుఱ్ఱ
తే. యితఁడు తండ్రి తల్లి యిది యేను దనయుండ, వీరు హితులు నాకు వీరహితులు
నీధనంబు నాది యే నియ్య ననుపల్కు, లుడుగు మయ్య! భేద ముడిగి యుండు. 103

ఆ. పుణ్యపాపకర్మపుంజనిబద్ధ మై, తొడిగినకుబుసంబువడువు దాల్చ
జీర్ణ మగుచునుండుచెనఁటిదేహంబున, యందు నీవు మమతఁ బొంద వలదు. 104

వ. అని మఱియుం మదాలస బహుప్రకారంబుల దేహజీవాత్మతత్త్వరూపంబు లాలాపపథంబున నుపదేశింప ననుదినప్రవర్ధమానుం డగునబ్బాలుండు బలంబును బుద్ధియు

నానాటికిం బ్రవృద్ధిం బొందినట్టు తల్లివచనంబులంజేసి విమలజ్ఞానం బంత కంతకు నతిశయిల్లుచుండం బెరిఁగి పరమయోగియై గృహస్థత్వంబు విడిచి చనియెం దదనంతరంబ యిరువురుకొడుకు లుదయించిన వారికిం గ్రమంబున నన్నరేంద్రుండు సుబాహుండు శత్రుమర్దనుండు నని నామంబు లొనరించిన నగుచు నమ్మగువ యయ్యిద్దఱు నందనుల జెప్పటియట్ల యోగవిద్యావిదగ్ధులుగాఁ బ్రబోధించె నంత నయ్యింతికి నాలవపుత్రుండు పుట్టుటయును. 105

క. బాలునికిఁ బేరిడఁగ భూ, పాలుఁడు వచ్చిన నిజాస్యపద్మము వికచ
శ్రీలసితముగ మదాలస, యాలాపము సేయఁ జూచి యతఁ డిట్లనియెన్. 106

మ. రమణీ పుత్రుల కర్థి నే నిడినవిక్రాంతాదినామంబు లె
ల్ల మది న్మెచ్చవు నీవు రాజతనయాలంకారము ల్గావొకో
విమతక్ష్మావరకోటిచిత్తముల కుద్వేగంబు గల్పింపవో
యమితైశ్వర్యము సేయవో నగఁ గతం బం చెద్ది యూహింపఁగన్. 107

ఉ. నేరనివార మేము రమణీ! యిటు పెట్టితి మర్థిఁ బేళ్లు నీ
నేరిమి చూడ నీసుతుని నిర్మలినామ్వయుఁ జేయుమా ప్రియం
బారఁగ నన్ను నింతి! భవదాజ్ఞ నొనర్చెద నేను వీనికిం
బేరిల వీఁడలర్కుఁ డనఁ బెంపు వహించు నరేంద్ర! నావుడున్. 108

క. ఆద్ధరణీశుఁడు నవ్వుచు, బుద్ధివివేకములఁ గరము ప్రోడ విటు లసం
బద్ధ మలర్కుం డనుపే, రిద్ధచరిత! యెట్లు పెట్టి! తిది సార్థకమే? 109

తే. అనిన నయ్యోగిమాత యిట్లనియె నధిప!, యవధరింపు మసద్వ్యవహారమునకు
నై యొనర్తురు గాక యామ్నాయము సార్థ, ముగ నొనర్పఁగ వచ్చు పురుషునకును.

క. నీపెట్టినపేళ్లును విను, నాపెట్టినపేరు వోలె నరవర! సర్వ
వ్యాపి యగుపురుషునికి న, ర్థోపేతత్వంబుఁ బొంది యూహింపంగన్. 111

వ. అది యెట్లనిన. 112

సీ. ఒకచోటినుండి వేఱొకచోటి కరుగుట క్రాంతి నాఁజను నిట్టిక్రాంతి లేక
సర్వగతుండును సర్వాత్ముఁడును సర్వభూతేశుఁడును నగుపురుషునకును
విక్రాంతుఁ డనుపేరు విపులార్థవంతమో వ్యర్థమో యిది నీవ యవధరింపు
నిరవయవుం డైన నిత్యునకు సుబాహు నామం బొనర్చిన నగవు దాదా

తే. యెల్లజీవంబులందును నేకభావ, మై వెలుఁగునాత్మునకు నెవ్వఁ డహితుఁడు హితుఁ
డనఁగ నెవఁ? డెట్టు శత్రుమర్దనసమాఖ్య, కర్థగతి యిందుఁ జెప్పుమా పార్థివేంద్ర!

క. తనయోద్దేశంబున నీ, వొనరించినపేళు లర్థయుక్తములే ని
త్యనిరాలంబజ్యోతికి, సనాతనుం డైనయట్టిసర్వాత్మునకున్. 114

వ. కావున. 115

క. వ్యవహారార్థపునామము, లతనీ! నిరర్థకంబు లవుటకు నొడఁబా
టవు నేని యలర్కాఖ్యయుం, దవుఁ గైకొను మపురుషార్థ మనకుము దానిన్. 116

వ. అని పరమార్థవాదిని యగుదేవితేశ్వరి చెప్పిన విని మహామతి యైనఋతధ్వజుండు దానికి నొడంబడియె నంత నక్కాంతాతిలకంబు పూర్వనందనుల బోధించినట్టులఁ బరమబ్రహ్మబోధకంబు లగువాక్యంబుల నయ్యలర్కుఁ బోధింపం దొడంగినం గువలయాశ్వుం డద్దేవి నాలోకించి. 117

ఉ. ఎక్కడి బ్రహ్మబోధ? యిది యేటికి వీనికి? నెంత కెట్టిదే
యక్కట! పుత్త్రరత్నముల నాఁడి బోధ్యలఁ జేసి పుచ్చి తే
చిక్కునఁ బెట్టి తింక నటు సేయకు మీసుతుబుద్ధి శ్రద్ధతో
నెక్కొన ధర్మమార్గమున నిల్పుము దెల్పుము రాజధర్మముల్. 118

వ. అని మఱియును. 119

❀ మదాలస యలర్కుఁ డనుపుత్త్రునకుఁ గర్మమార్గ ముపదేశించుట. ❀

క. విను పుణ్యాపుణ్యంబుల, ననిమిషతిర్యక్త్వయుక్త లగుపితరులకు
న్మనుజుఁడు దృప్తయును క్షుధయును, దనుకఁగ నీఁ డుదకపిండదానక్రియలన్. 120

ఆ. అతిథిబంధుదేవపితృపిశాచప్రేత, యక్షమనుజభూతపక్షికీట
కముల కెల్ల విహితకర్మరతుం డైన, యతఁడు సూవె యాశ్రయంబు ధరణి! 121

క. కావున మత్సుతుఁ దన్వీ! కావింపుము రాజధర్మకర్మాన్వితుఁగా
నావుడుఁ బలికంపున న, ద్దేవి యలర్కునకుఁ గర్మదీక్ష యొనర్పన్. 122

వ. తలఁచి యనుదినంబును నబ్బాలుని ముద్దాడుచు. 123

ఉ. ధన్యుఁడ వైతి పుత్త్ర! వసుధాతల మెల్ల నకంటకంబుగా
నన్యనరేంద్రభీకరకరాసిసమంచితదోర్బలక్రియా
మాన్యత యొప్ప నేలి యసమానయశోవిభవంబు నొంది ప
ర్జన్యపురోపభోగబహుసౌఖ్యము లందఁగ నీవు గాంచుటన్. 124

శా. క్షత్త్రాచారముఁ దప్పఁ ద్రొక్కకుము రాజ్యశ్రీ దలిర్ప న్సుహృ
న్మిత్రవ్రాతముఁ బ్రోవు ముజ్జ్వలకృపాణీవిస్ఫురత్పాణివై
శత్త్రుశ్రేణి జయింపు క్షోణిసురరక్షాప్రాప్తి వాటింపు స
త్పాత్రత్యాగ మొనర్పు యజ్ఞములు పుత్త్రా! సేయుము మర్త్యస్థలిన్. 125

తరువోజ. అనురాగమున నోలలార్పు బాంధవుల, ననఘ! శైశవవిహారాలాపలీలఁ
బను లెల్లఁ జేయుచు భక్తి మీతండ్రిఁ, బరితుష్టుఁ గావింపు బాల్యంబుమీఁద

మనసిజసుఖకేళి మగువలఁ దేల్చు, మహనీయయౌవనమదవిభ్రమమున
వనమున మునివృత్తి వార్ధకమందు, వర్తింపు వనవాసివర్గంబు లలర. 126

వ. అని జనని బోధింపుచుఁ బెనుపం బెరిఁగి కృతోపనయనుండును మహాప్రాజ్ఞుండును నైయలర్కుం డయ్యంబచరణంబులకుం బ్రణమిల్లి తల్లీ! యైహికాముష్మికసుఖార్థం బెయ్యది కర్తవ్యంబు నా కెఱింగింపు మనిన నద్దేవి యి ట్లనియె. 127

సీ. పట్టభద్రుం డైనపార్థివేంద్రునకుఁ గర్తవ్యంబు ముదు ప్రజారంజనంబు
స్వవ్యసనములఁ జనదు సక్తుండుగా నేమఱి వలదు దన్నెపుడు రిపుల
వలన మంత్రము వెలిఁ జిలుక నిచ్చుట చెట్ట తనవారు దానును దానఁ జెదుదు
రహితులు హితులును నగుట యెఱుంగఁగ వలయు మంత్రుల బుద్ధిబలము మెఱసి

ఆ. చరులఁ బనిచి వైరిచరుల రోయించుట, నెమ్మనమున నెఱిఁగి నమ్మకునికి
కార్యయోగమునకుఁ గా శత్రు నైనను, నమ్మినట్ల రయునికి నయవిధంబు. 128

స్రగ్విణి. స్థానవృద్ధిక్షయజ్ఞానసంపన్నుఁడు, న్దానషాడ్గుణ్యమంత్రప్రవీణుండు నై
మానవేంద్రుండు గామ్యవ్యపేతాత్మకుం, డైన నిర్జించు ఘోరాజి వీరారులన్. 129

క. విను పక్షం దగుకుత్సిత, జననాథునిఁ జెఱుచుకడిఁదిశత్రులు సుమ్మీ
జననుత! కామముఁ గ్రోధ,మ్మును లోభము మదము మానమును హర్షంబున్. 130

వ. కామంబునఁ బాండుండు, క్రోధంబున ననుహ్రాదాత్మజులు, లోభంబున నైలుండు, మదంబున వేనుండు, మానంబున నహుషుండు, హర్షంబునఁ బురంజయుండును హతు లగుటయుఁ గామాదులచేత నిర్జితుండు గాక మరుత్తుండు లోకోత్తరుం డగుటయు నెఱింగికొని ధైర్యధురంధరుం డైనధరణీశ్వరుండు కామాదిషడ్దోషంబులఁ బరిహరింప వలయుం. 131

క. నరనాయకుండు మధుకర, పరభృతకలహంసబర్హిపన్నగబకసూ
కరచరణాయుధబాలుర, చరితమ్ములు గఱవ వలయు జననుతచరితా. 132

తే. ఉడుగ కెప్పుడు నొనరింపు చుండవలయు, నృపతి కీటకక్రియఁ బ్రతినృపతియందుఁ
దఱి యెఱింగి పిపీలికోత్కరముచేష్టఁ, జూపునది నీతికోవిదు లొప్పదయ్యపడఁగ. 133

క. విను మవనీపాలనక, ర్మనియుక్తుం డైనరాజు మహిలో సంక్రం
దనభాస్కరయమచంద్రప, వనరూపము లైదు దాల్ప వలయుం దఱితోన్. 134

ఆ. మహితవర్షదానమహిమ నాలుగునెల, లింకఁ దను పొనర్చు నింద్రుకరణి
నెనఁగ నడుగువారి కొసఁగి మన్ననఁ బ్రజ, ముదముఁ బొందఁ జేయునది విభుండు.

క. ఎనిమిదినెలలును నల్లనఁ, దనకరముల భూరసంబు దఱుఁగం గొనుభా
నునిక్రియ సూక్ష్మోపాయం, బున నరి గొన వలయు నృపతి భూప్రజచేతన్. 136

క. విమతులఁ బ్రియులం గాల, క్రమమునఁ దెగఁ జూచుయమునికరణిం దా దో
షము లరసి ప్రియాప్రియులను, సముఁడై దండింప వలయు జనపతి పుత్రా. 137

చ. తమతమవర్ణధర్మములు దప్పి కుమార్గమున జ్జరించుదు
ష్టమనుజవర్గముం దగినశాంతి యొనర్చుచు నైజధర్మమా
ర్గమునఁ జరింపఁ జేయుమహికాంతుఁడు వారలపుణ్యసంపద
న్సమధికలీల నొంది దివి సౌఖ్యముఁ బొందఁగఁ గాంచుఁ బుత్రకా. 138

క. వర్ణాశ్రమధర్మంబులు, పూర్ణము లై యుండు నేనృపునిరాష్ట్రమునన్
స్వర్ణదివిజసంగమ సౌఖ్యార్ణవమునఁ దేలఁ గాంచు నానృపుఁ డనఘా. 139

క. నరుల నిజకర్మములఁ ద, త్పరులం గావించు ధరణిపాలుఁడు దా న
న్నరులసుకృతములలోన, న్బరువడిఁ గొనుచుండు షష్ఠభాగము పుత్రా. 140

వర్ణాశ్రమధర్మనిరూపణము.

క. అని చెప్పిన విని సుతుఁ డి, ట్లను వింటిని రాజనీతు లన్నియు జలజా
నన వర్ణాశ్రమధర్మము, లొనరఁగ నెఱిఁగింపు నాకు నుత్తమచరితా. 141

వ. అని యడిగినం గొడుకునకుఁ దల్లి యి ట్లను వినుము దానాధ్యయనయజ్ఞంబు లను త్రివిధకర్మంబులు బ్రాహ్మణక్షత్రియవైశ్యులుమువ్వురకు ధర్మంబులు శూద్రునకు దానద్విజాతిశుశ్రూషలు ధర్మంబులు మఱియు బ్రాహ్మణునకు యాజనాధ్యాపనోత్తమప్రతిగ్రహంబులు క్షత్రియునకు ధాత్రీపాలనశస్త్రజీవిత్వంబులు వైశ్యునకుఁ గృషివాణిజ్యగోరక్షణంబులు శూద్రునకు సేవయు జీవిక లివి వర్ణధర్మంబు లాశ్రమధర్మంబు లాకర్ణింపుము. 142

మ. ఉపనీతుం డయి బ్రహ్మచారి వినయం బొప్ప న్గురుం జేరి భ
క్తిపరుం డై పను లెల్లఁ జేయుచు సకృద్భిక్షాశియు న్స్వాంతుఁడు
న్విపులప్రీతియుతుండు నై సతతము న్వేదత్రయాభ్యాసవా
క్యపటుత్వంబు భజించి సల్పఁ దగు నయ్యాద్యాశ్రమాచారమున్. 143

ఆ. అనఘ బ్రహ్మచారి కవలియాశ్రమముల, కరుగుచోట వినుము వరుస వలన
దిష్ట మైనయట్టి దేయాశ్రమం బైనఁ, జేకొనంగఁ దగు విశిష్టచరిత! 144

శా. దారస్వీకృతియు న్దయాభిరతియు న్ధర్మార్జితార్థక్రియా
స్ఫారత్వంబును దేవపిత్రతిథిపూజాస్థైర్యము న్దీనదా
సీరాజీసుతబాంధవాతురజనశ్రేణీసమృద్ధాన్నస
త్కారోదారతయు న్గణింప గృహికి న్ధర్మంబు లుద్యన్మతిన్. 145

మ. వనితాపుత్త్రసుహృజ్జనావలులపై వైరాగ్య ముల్లంబున
న్దరం గానకు నేఁగి వల్కలజటాధారుండు సద్బ్రహ్మచ
ర్యనిరూఢుండును గందమూలఫలశాకాహారసంతృప్తుఁడు
న్ఘనబోధామలినాత్మకుం డగుచు వానప్రస్థుఁ డుండు న్సుతా! 146

మ. మతికాలుష్య మడంచి యింద్రియముల న్దరించి కామాదిశ
త్రుతతిం ద్రుంచి యసంగుఁడు న్సతతసంతుష్టుండు నారంభవ
ర్జితుఁడు న్నిర్మలుఁడు న్సమాధిపరుఁడు న్జిత్సంప్రబుద్ధుండు నై
యతి శోభిల్లు నిరంతరంబు విమలైకాంతప్రదేశస్థితిన్. 147

తే. నాలుగాశ్రమములయందు నోలి నుండు, వారిధర్మంబు లెల్లను వరుస నీకు
కెఱుఁగఁ జెప్పితిఁ జెప్పెద నింక వినుము, సర్వవర్ణాశ్రమార్హ్వలసద్గుణములు. 148

క. క్షమయుం నకార్పణ్యము శౌచము ననసూయయును నానృశంస్యము సంతో
షమును నహింసయుఁ విను సత్యము నెనిమిది వలయుం గుణము లఖిలజనులకున్. 149

సీ. సంక్షేపమున నిట్లు సర్వవర్ణాశ్రమ ధర్మము ల్సెప్పితి తనయ! వినుము
తమతమధర్మము ల్దప్పి దుర్మార్గులై దురితంబు లొనరించునరుల ధారి
ణీశుండు దండింప కెడ నుపేక్షించినఁ బోలియు నిష్టాపూర్తపుణ్యఫలము
లతనికిఁ గావున నతులప్రయత్నుఁడు, రుం డయి సర్వవర్ణులను రాజు

తే. విహితదండం బొనర్చుచు విమలధర్మ, కర్మపరులుగ సతతంబుఁ గావ వలయు
ననిన విని తల్లి కతివినయమున మ్రొక్కి, యయ్యలర్కుండుమఱియునిట్లనియెఁదండ్రి!

గృహస్థధర్మనిరూపణము.

తే. జనుల కుపకారముగ గృహస్థునికిఁ జేయఁ
దగిన దెయ్యది విడువంగఁ దగిన దద్ది?
తనకు సతతంబు నొనరింపఁ దగినయట్టి
దేది? యనుచు మదాలస యిట్టు లనియె. 151

చ. అనఘ! గృహస్థధర్మపరుఁ డైననరుండు త్రిలోకపోషకుం
డనుపమపుణ్యమూర్తి యతఁ డాతనిసంతతధర్మసంపద
న్మునిపితృదేవభూతగణముం గ్రిమికీటకపక్షిసంఘము
న్మనుఁ గనుఁగొంచు నుండుదురు మానక యర్థులు వానివక్త్రమున్. 152

త్రయీధేనువర్ణనము ఆయాదేవతలకు బలిహరణవిధియు.

వ. ఇట్టిగృహస్థునకుం జేయఁదగినధర్మంబు వినుము సకలలోకాధారభూతయుం బుగ్వే
దాపరభాగయుం యజుర్మధ్యయుం సామవక్త్రయు నిష్టాపూర్తవిషాణయుం సాధు
సూక్తరోమయుం శాంతిపుష్టికశకృన్మూత్రయుం నైనత్రయీనామధేనువునకుం జతు స్తనం

బలు స్వాహాకారస్వధాకారవషట్కారహంతకారంబు లన బరగు వానిచే దేవపితృ
మునిమనుజవర్గంబులకు స్వాధ్యాయనం బనుదినంబును నాచరింప వలయు నట్లు
సేయనిపురుషుండు దామిస్రనరకంబునం బడు మఱియు గృహస్థుండు నిత్యంబును
శుచిస్నాతుం డై దేవర్షిపితృతర్పణంబు లొనరించి సుమనోగంధధూపదీపంబుల
దేవతలం బూజించి గృహమధ్యంబున బ్రహ్మకీశానదిశయందు విశ్వేదేవతలకు ధన్వం
తరికిం బూర్వదక్షిణపశ్చిమోత్తరంబుల నింద్రయమవరుణసోములకు గృహద్వార
దేశంబున ధాతకు విధాతకు గృహాంగణంబున నాదిత్యునకు నాకాశంబున దైత్య
ప్రేతభూతంబులకు యామ్యాభిముఖుం డై పితరులకును బలు లొసంగి నామపూర్వ
కంబుగాం దదాచమనార్థంబు జలంబు లిచ్చి పీడుకొలిపి యిట్లు గృహవిధానంబున
నఖిలభూతతృప్తి గావించి వైశ్వదేవంబు చేసి. 153

అతిథిపూజావిధానము.

క. విను దివసాష్టమభాగంబున సదనద్వారమునకుఁ బోయి కడుఁ బ్రియం
బున నతిథి నరయ వలయుం, దనయ తదర్చనకు నెనయె ధర్మువు లెందున్. 154

వ. అట్లరసి మిత్రుండు నేకగ్రామవాసియుం గానివాని. 155

మ. అతిథిం గాలసమాగతు న్ననఘుక్షుత్తార్తుం బథిశ్రాంతు నా
తతమార్గోత్థితధూళిధూసరితగాత్రస్వేదబిందూత్కరా
న్వితు నజ్ఞాతకులాభిధానుఁ గని యవ్విప్రు న్మహాత్ముం బ్రజా
పతిగా నాత్మఁ దలంచుచు న్సుముఖుఁ డై భక్తి న్ప్రియత్నంబునన్. 156

క. అతనికులశీలవిద్యా, స్థితు లడుగక యెంతవికృతదేహుం డైన
న్మతి విష్ణునిఁ గాఁ దలఁచుచు, నతిముదమునఁ బూజ సేయునది నిజభక్తిన్. 157

క. అతిథికిఁ బెట్టక కుడిచిన, యతికష్టుఁడు దురితభోక్త యంద్రు మునీంద్రు
ల్పతతపురీషాశనుఁ డై, యతఁ డుండును మీఁదిభవమునందుఁ గుమారా! 158

తే. ఎలమి నెవ్వనిగృహమున కేఁగుదెంచి, యఫలితాశుఁ డై క్రమ్మఱు నట్టియతిథి
తనదుదుష్కృతమాగృహస్థునకు నిచ్చి,యతనిసుకృతమంతయుఁ గొనియరుగుఁబుత్ర!

ఆ. కాన నతిథిఁ గదవఁ గా దంబుశాకదానమున నైన నతనిఁ బ్రముదితాత్ముఁ
గా నొనర్ప వలయుఁ గడుకొని నిజశక్తిఁ,తోడ వినుము ధర్మధుర్యహృదయ. 160

వ. అని చెప్పిన. 161

క. ఒనరింప వలయు శ్రాద్ధం, బనువాసరమును దగంగ నన్నంబున నై
నను నుదకంబున నైనను, దనయ పితృప్రియము గాఁగఁ దద్దయు భక్తిన్. 162

తే. భిక్ష యొకకడియంత యాభిక్ష లనఘ, నాలు గగ్ర మయ్యగ్రము ల్నాల్గు హంత
కార మిం దది యైనను గలిమిలోడ, నదరి విప్రున కిడకము న్గుడువ రాదు. 163

చ. నిజవిభవానురూపముగ నెమ్మి యెలర్ప గృహస్థుఁ డిమ్మెయిన్
ద్విజవికలాంగబాలగురువృద్ధసుహృజ్జనకోటి కన్నదా
నజనితతృప్తి పొందఁగ ననారతము న్దగ నాచరించుచు
న్నిజగదభీష్టదస్థితిఁ బ్రదీప్తుఁడు గావలయు న్గుణోజ్జ్వలా! 164

తే. జ్ఞాతి శ్రీమంతుఁ డగునిజజ్ఞాతిఁ జేరి, యుండు గరంబు దరిద్రుఁ డై యుండె నేని
నతఁడు చేసినదురితంబు లనుభవించు, ననఘ శ్రీమంతుఁ డతనిఁ దా నరయ కునికి.

క. విను పగటియటుల సుత మా,పును గృహి విధ్యుక్తకర్మములు సలుపుచు నా
సనశయనభోజనాదుల, ననఘా పూజింపవలయు నతిథిఁ బ్రియమునన్. 166

చ. తనర గృహస్థతాభరముఁ దాల్చి చరించుచునుండునమ్మహా
త్మునికి ననేకభూరిశుభము ల్దగ నెప్పుడు నిచ్చు దేవతా
మునిపితృబాంధవాతిథిసమూహములు న్పశుపక్షికీటకా
దినిఖిలభూతకోటియును దృప్తి యతం డొనరించుట న్సుతా! 167

వ. ఈయర్థంబున నత్రి చెప్పినవాక్యంబు లాకర్ణింపుము. 168

క. తనసదనంబునఁ గల ధన,మున ఫలమూలాన్నశాకముల నెయ్యది యై
నను మును విధివంతముగా, నొనరింపక చనదు గృహికి నుపయోగింపన్. 169

నిత్యనైమిత్తికాదికశ్రాద్ధనిరూపణము.

సీ. అని వెండియును నమ్మదాలస యనుఁ ద్రివిధంబు లై యుండు శ్రాద్ధక్రమములు
పరవర నిత్యంబు నైమిత్తికము నిత్యనైమిత్తికంబు ననంగ నోలి
నందు నిత్యము పంచయజ్ఞాశ్రితం బైన యది సుతోదయవివాహాదిభద్ర
వేళలయందుఁ గావింపఁగా బడునది వినుము నైమిత్తిక మనఁగఁ బరగు

తే. నరయఁ బర్వప్రభృతితిథులందుఁ జేయు, నదియ యా నిత్యనైమిత్తికాఖ్య మంద్రు
విస్తరింతు నైమిత్తికవిధులు మఱియు, నాదువాక్యము లెల్ల మనస్కరింపు. 170

క. తనయోదయాదివేళలఁ, దనరంగాఁ జేయునాభ్యుదయికశ్రాద్ధం
బునఁ బితరులు నాందీముఖు, లనునభిధానమునఁ బూజ్యుఁ లగుదురు పుత్రా. 171

క. ధరణీసురయుగ్మములను, వరియించి ప్రదక్షిణముగ వారిని భక్తి
స్థిరుఁ డై యజమానుఁడు త,త్పరత న్శుభవృద్ధిపూజ దగు నొనరింపన్. 172

క. విను దధియవమిళితాన్నం,బునఁ బిండము లిడఁగ వలయుఁ బూర్వముఖుం డొం
డె నుదఙ్ముఖుఁ డొండెను నై, చనును సదగ్నికరణవిధి సంపాదింపన్. 173

ఏకోద్దిష్టశ్రాద్ధనిరూపణము.

వ. ఇది యాభ్యుదయికప్రకారం బింక నౌర్ధ్వదైహికం బైనయేకోద్దిష్టశ్రాద్ధంబువిధం
బాకర్ణింపుము. 174

సీ. మృతుఁ డైనయతనికి సుతుఁ డతిభక్తితోఁ బ్రతిమాసమును విధియుతము గాఁగ
దద్దివసమున శ్రాద్ధం బొనరించుచు నబ్దంబు పరిపూర్ణ మైనఁ జేయు
నది సపిండీకరణాహ్వయశ్రాద్ధంబు ప్రేతత్వమును బాసి పితృత నొందు
నతఁ డంత నేఁటేఁట మృతిదినంబున శ్రాద్ధమొనరింప వలయుఁ శాస్త్రోక్తభంగి
తే. ననఘ యట్ల యేకోద్దిష్ట మంగనలకు, విను సపిండీకరణము నందనులు లేని
యతివలకుఁ గాను కార్యము మృతిదినంబు, నందు వారి కేకోద్దిష్ట మర్హ మండ్రు.

సప్తపురుషలేపభాగాదినిర్ణయము.

క. అనఘ సపిండీకరణం, బొనరించుడుఁ బిండలుప్తి నొందుచు యజమా
నునిమూఁడవతాత రయం,బునఁ గలయుం జూవె లేపభుక్పితృగుణమున్. 176

వ. పితయుఁ బితామహుండును బ్రపితామహుండు నను మువ్వురు పిండసంబంధులు ప్రపితామహునితండ్రిస్థుండి యటమువ్వురు లేపసంబంధులు శ్రాద్ధకర్త యైనయజమానుం డేడవువాఁ డిట్లుసంబంధంబు సాప్తపౌరుష మని మునులు సెప్పుదురు మఱియు వినుము యజమానునియన్వయంబునం దావిర్భవించి యనేకగతులం బొంది యున్న పూర్వులు నజాతదంతు లగుబాలురు నసంస్కృతు లయోగ్యులు నాదిగాఁ గలవారెల్లను నతం డొనరించుశ్రాద్ధంబులయందు జలాన్నవికరణంబులఁ జేసి యాప్యాయితు లగుదురు సమ్యక్ఛ్రాద్ధపరుం డైననరునికులంబునం బ్రభవించినవాని కొక్కరునికిం జెట్టలేదు కావున శాకోదకంబుల నైన నిత్యనైమిత్తికశ్రాద్ధంబు లవశ్యంబునాచరింపవలయుఁ దదీయకాలంబు లాకర్ణింపుము. 177

శ్రాద్ధకాలము.

క. విమలశ్రద్ధాన్వితుఁ డై, యమవసలం దెల్ల నట్ల యష్టకలందుం
గ్రమమునఁ బితృవరుల కవశ్యముఁ జేయఁగ వలయుఁ సుతుఁడు శ్రాద్ధము పుత్రా!
వ. ఇష్టశ్రాద్ధకాలంబు వినుము. 179
మ. రవిచంద్రగ్రహణాయనంబులకు సంక్రాంతి న్వ్యతీపాత న
ర్హవిశిష్టావని దేవతానివహసంప్రాప్తి న్లసద్ద్రవ్యవై
భవవేళం దనజన్మతారగ్రహదౌర్బల్యంబు వాటింప నం
దు విధిప్రోక్తముశ్రాద్ధకర్మ మనఘా! దుస్స్వప్నముం గాంచినన్. 180

శ్రాద్ధమున నిమంత్రణీయులు

సీ. యోగీశ్వరుండు నత్యుత్తమశ్రోత్రియుండును జ్యేష్ఠసామగుండును సమస్త
వేదవేదాంగకవిదుఁడు దౌహిత్రుండు నల్లుండు ననఘుపంచాగ్నికర్మ
నిష్ఠాపరుఁడు తపోనిరతుండు పితృభక్తిపరుఁడు సంబంధియుఁ బాంధవుండు
మామయుఁ దనమేనమామయుఁ భాగినేయుండు ఋత్విజుఁడు శిష్యుండు మఱియు

ఆ. నధికమంత్రజపపరాయణులును సదా, చారపరులు వినుము శ్రాద్ధమునకు
నర్హులైనయట్టియవనీసురోత్తము, లండ్రు బుధులు గుణగణాభిరామ! 181

శ్రాద్ధమున ననిమంత్రణీయులు.

క. అవకీర్ణి రోగిఁ బౌన, ర్భవు భృతకాధ్యాపకుని నిరాకృతి వేదా
గ్నివిహీను వైద్యు గురుపితృ, వివర్జకుని ముచ్చు సోమవిక్రయిఁ బిశునున్. 182

తే. శ్యావదంతు హీనాతిరిక్తాంగు షంఢుఁ, గుండు గోళకు వృషలీపుఁ గునఖిఁ గుష్ఠిఁ
గన్యకావిక్రయి వికర్ము నన్య శ్రాద్ధ,ములను వర్జింతు రార్యులు పుత్ర! వినుము. 183

తే. దైవకార్యంబునందుఁ బిత్ర్యంబునందు, సద్ద్విజన్ములఁ బూర్వవాసరమునందు
నధికనియతి నిమంత్రించునది కుమార! వారు నియమస్థులై యుండవలయుఁ గాన.

శ్రాద్ధాచరణవిధానము.

ఉ. శ్రాద్ధమున న్భుజించినధరాసురముఖ్యుఁడు భక్తియుక్తుఁడై
శ్రాద్ధము పెట్టినాతఁడును రాత్రి భుజింపఁగ రాదు గామసం
బద్ధమనస్కుఁడై తిరిగి భామలఁ గూడినఁ దత్పితృవ్రజం
బిద్ధగుణాఢ్య! యుండు నెలయెల్లను రేతమున న్మునుంగుచున్. 185

మాలిని. కావున విప్రుని మున్ను నిమంత్రణగౌరవయుక్తునిఁ జేయుట మే
ల్భావజుచేఁ బడి భామను గూడినబ్రాహ్మణు మాని గృహస్థుఁడు భూ
దేవుని గాదట భిక్షుకుఁడై చనుదెంచినవానికి నైనను సం
భావన భోజన మారఁగ బెట్టిన భద్రగుణా! పితృతృప్తి యగున్. 186

వ. పితృదేవతలకు శుక్లపక్షముకంటెఁ గృష్ణపక్షంబు ప్రియం బైనయట్లు పూర్వా
హ్ణంబుకంటె నపరాహ్ణం బభిమతం బగుటం జేసి. 187

క. కుతపసమాగతసద్ద్విజ, తతియం దొగి విశ్వదేవతల కిరువురను
బితృదేవతలకు మువ్వుర, నతిభక్తి నొనర్పవలయు నధికశ్రద్ధన్. 188

సీ. అటు గాక దైవపిత్ర్యములకు నొకఁ డొకఁ డైనను నగు శక్తి కనుగుణముగఁ
దద్విధంబునను మాతామహాదులకును విశ్వదేవతలకు నిశ్చయము
నొనరించునది వేఱ యని చెప్పుదురు గొంద ఱట్లిరుదెఱఁగుల నేర్పఱించి
ప్రాగుదఙ్ముఖులుగాఁ గ్రమమున విశ్వదేవతలను నొగిఁ బిత్ర్యవరుల నునిచి

ఆ. సప్రదక్షిణంబు నప్రదక్షిణముగ, మంత్రయుతసమస్తతంత్రములను
నధికభక్తితోడ నా రెండుదెఱఁగుల, వారలకును జలిపి గారవమున. 189

ఆ. ఇష్టభోజనంబు లిడి కర్త సిద్ధార్థ, ములును దిలలు నచటఁ గలయఁ జల్లి
దైత్యహారిమంత్రతత్పరుఁడై తత్త, దుచితవిధుల నెల్ల నొనర సలిపి. 190

క. వారలు భుజించినయనంతరంబ తదుచ్ఛిష్టసన్నిధిం గుశాస్తరణంబులందు. 191

ఆ. ఎలమి నుభయపక్షములవారలకు భక్తి, వేఱువేఱ పిండవిధి యొనర్చి
వారితిలలతోడ వారికి వారికి, వలయుఁ బిత్ర్యతీర్థకలన మనఘ! 192

క. తదుచితకృత్యము లన్నియుఁ, విదితములుగఁ జేసి కర్త విప్రుల కెల్లన్
స్వదమున దక్షిణ యిడి తా, సదనద్వారంబుదాఁకఁ జని వారి నొగిన్. 193

ఆ. వీడుకొలిపి వచ్చి విహితనిత్యక్రియా, జాత మెల్లఁ జలిపి సకలమిత్ర
బంధుజనులుఁ దానుఁ బత్నిఁ బ్రియంబునఁ, గుడుచునది విశిష్టగుణవరేణ్య. 194

వ. ఇట్లు గృహస్థుండు సమాహితుండై మహీసురులకుం బరితోషంబుగా శ్రాద్ధంబుఁ
జేయవలయునది యని చెప్పి మఱియును. 195

తే. శ్రాద్ధములయందు విను పవిత్రములు మూఁడు, కుతపకాలంబు తిలలును గూఁతుకొడుకు
ననఘ! దాతృభోక్తలకు వర్జ్యములు మూఁడు, తెరువు నడుచుట కినుక వేగిర మనంగ.

ఆ. రజతపాత్రచయము రజతకీర్తనమును, రజతదర్శనంబు రజతకథయు
ననఘ!రజతదానమును బితృకోటికి, శ్రాద్ధవేళఁ గడుఁ బ్రశస్తమండ్రు. 197

శ్రాద్ధమునందు వర్జ్యావర్జ్యద్రవ్యములు.

వ. అని చెప్పిన మదాలస మఱియు నలర్కున కిట్లనుఁ బితృదేవతలకుం బ్రీతిగా నిడ
వలయు నవియు నుడుగ వలయునవియు నెఱింగించెద నాకర్ణింపుము. 198

క. వినుతగుణ! హవిష్యాన్నం, బున నొక నెల మత్స్యమాంసమున రెండునెలల్
విను లేడిమాంసమునఁ బిత, లొనరఁగ మూన్నెలలు తృప్తి నొందుదురు గడున్.

తే. శశముపిశితంబు పక్షిమాంసంబు పంది, యామిషము మేఁటపలలంబు నధిక మైన
తృప్తి యొనరించు నొగిఁ బితృదేవతలకు, నెలమి నాలుగు నేను నా ఱేడునెలలు.

వ. ఇఱ్ఱిమాంసం బష్టమాసంబులు దుప్పిమాంసంబు నవమాసంబులు గురుపోతుమాంసంబు
దశమాసంబులు తగరుమాంసం బేకాదశమాసంబులు గోవుపాలును బాయసంబును
బండ్రెండుమాసంబులు పితృదేవతలకుఁ దృప్తియొనరించు మఱియుం గాలశాకంబును
దేనియయుఁ గయాశ్రాద్ధంబును వారికి ననంతకాలతృప్తి వహించు. 201

క. తిలలు యవలు గోధూమం, బులు గొఱ్ఱలు కోవిదారములు ముద్గము లా
వలు కందులు మినుములు గడుఁ, బొలుపగు నివి కరము యోగ్యములు పితృతతికిన్.

తే. శ్రాద్ధకర్మంబునందు వర్జ్యములు వినుము, పెండలంబును దోస పలాండు వుల్లి
యానుగ మ్మింగువలసందియలు విచార,సార ప్రత్యక్షలవణమసూరములును. 203

క. కన్నియ కుంకువకును జే, కొన్నధనము పతితువలనఁ గొన్నధనము ద
ర్పోన్నతి వాదజయమునం, గొన్నధనము శ్రాద్ధమునకుఁ గుత్సితము లిలన్. 204

తే. రాత్రిఁ దెచ్చిననీరు దుర్గంధ ఫేన, పూరితం బగునీరును బొక్కనీరు
సూర్యుఁ డంటనికూపంబునీరు ననఘ, గోవు తృప్తిఁ బొందనినీరు కుత్సితములు. 205
వ. అజావిమృగీమహిష్యుష్ట్రలదుగ్ధంబులును నీనినపదిదినంబులలోనియావుపాలును వర్జించునది. 206
ఆ. కోడి యూరఁబంది కుక్క నపుంసకుఁ, డసురగణము శ్రాద్ధహాని సేయుఁ
గాన మఱుపునందుఁ గావించునది రక్ష, గాఁగ దిలలు ధరణిఁ గలయఁ జల్లి. 207
క. పతితులు సూతకులు రుజా, న్వితులు మలిను లంటి రేని విను ద్రవ్యము వ
ర్జ్యత నొందు రజస్వలయు, పతినింద్యము శ్రాద్ధవేళయందుఁ గుమారా. 208
సీ. విను కేశకీటకాన్వితము వస్త్రానిలాహతము దుర్గంధసంయుతమును శున
కాదినిరీక్షితం బైనది పర్యుషితము నివి యెల్ల వర్జ్యములు సుమ్ము
పాటించి భక్తితోఁ బాత్రములందు యోగ్యములును జపులును నైనయట్టి
యాహారములు వెట్టునది పితృకోటికి నవి వారి కర్హంబు లై ఫలించు
ఆ. నతులయోగధరులు పితృవరు ల్గానఁ ద, దర్థముగ మహాత్ము లైన యోగి
జనులఁ బ్రీతితోడ శ్రాద్ధకర్మమునందుఁ, బూజసేయవలయుఁ బుత్ర! వినుము. 209
తే. భవ్యవిప్రసహస్రంబు పజ్క్తి నొక్క, యోగి యగ్రాసనస్థుఁ డై యుండె నేని
యతఁడు దాతనుభోక్తల నంబుపూర, గతులఁ బోతంబువిధమునఁ గడవఁ బెట్టు.

పితృగీతలు.

వ. ఈయర్థంబునం దొల్లి యైలుం డనుమహీపతికిం బితృదేవతలు చెప్పినగీతలు బ్రహ్మ
వాదులచేత వినంబడు వాని వినుము. 211
ఉ. ఎన్నఁడు పుట్టు నొక్కొ సుతుఁ డెవ్వని కైనను మత్కులంబునం
జెన్నగఁ బిండసంస్కృతి విశిష్టతరం బగుయోగిభుక్తశి
ష్టాన్నమునం బొనర్చుసుగుణాన్వితుఁ డంచును గౌతుకంబున
న్నన్నుతకీర్తిధుర్య! పితృసంఘము గోరుచు నుండు నెప్పుడున్. 212
సీ. గయఁ బిండ మొండెను ఖడ్గమాంసం బొండెఁ గాలశాకం బొండె గవ్య మొండెఁ
దగఁ దిలాఢ్యం బగుద్రవ్యచయం బొండె భాద్రపదాపరపక్షమునఁ ద్ర
యోదశి మఘుమధుయుతము పాయస మొండె మద్వంశజుఁ డొకండు మాకు నిడఁడె
కాని చనఁ గాంచెద మినలోకమున కేము నని కోరుఁ బితృకోటి యట్లు గాన
తే. నర్థిఁ దృప్తులఁ గావించునది సమగ్ర, పూజనంబులఁ బితరులఁ బుత్ర! వారు
తృప్తి వసురుద్రులకును నాదిత్యులకును, జేయుదురు తారకాగ్రహశ్రేణులకును.

క. పితృగణము శ్రాద్ధసంత, ర్పిత మై మనుజులకు నిచ్చు శ్రీవిద్యాయు
స్సుతబహుధనసామ్రాజ్య, స్థితులును స్వర్గాపవర్గదివ్యసుఖములున్. 214

వ. అని చెప్పి యయ్యోగిమాత తిథినక్షత్రంబులయం దొనర్చు కామ్యశ్రాద్ధఫలంబులు
చెప్పం దలంచి యి ట్లనియె. 215

కామ్యశ్రాద్ధములు.

సీ. విను మాదిదినమున విత్తంబు విదియను ద్విపదచయంబు తృతీయ నిష్ట
వరము చతుర్థియం దరివినాశనము పంచమి లక్ష్మి షష్ఠిఁ బూజ్యత్వమహిమ
సప్తమి నొగి సర్వసైన్యాధిపత్య మష్టమి నభివృద్ధి నవమి వధూస
మాగతి దశమిఁ గామ్యార్థసంపత్తి యేకాదశి నగణితవేదసిద్ధి
తే. జయము ద్వాదశి నాయూరైశ్వర్యపుష్టి, కీర్తి మేధాప్రజాస్ఫూర్తి కేరలుఁ గామ్య
దేవదినమునఁ బితృదేవతావళులకు, శ్రాద్ధములు భక్తి నొనరించుజనుల కెపుడు. 216

క. తరుణవయస్కులఁ జచ్చిన, నరులకు శస్త్రమృతు లైననరులకుఁ దనయుల్
నరవర! శ్రాద్ధము భక్తి, స్ఫురణమతిం జేయ వలయు భూతదినమునన్. 217

క. పితృవరుల కమావాస్య ని, యతమానసుఁ డై యతిప్రయత్నముతో నం
చితశ్రాద్ధం బొనరించిన, యతఁ డభిమతసిద్ధిఁ బొందు నమరతఁ బడయున్. 218

సీ. స్వర్గసౌఖ్యము పుత్త్రసంపద తేజంబు శౌర్యంబు సుక్షేత్రచయము పుష్టి
సుతలబ్ధి వంశముఖ్యత సుభగత్వంబు ప్రకటవిశ్రాణనాపత్యమహిమ
శ్రేష్ఠత సంతానసిద్ధి వాణిజ్యలాభము విశిష్టత సార్వభౌమపదవి
యాధిపత్య మనామయమ్ము యశ మ్మశోకత పుణ్యలోకంబు కనక మాగ
తే. మాప్తి వైద్యప్రసిద్ధి యజావివృద్ధి, వనిత రజత మశ్వము లాయు వనఘ కలుగుఁ
గృత్తికాద్యష్టవింశతికీర్త్యతార, లందు శ్రాద్ధంబు నొగిఁ జేయునార్యతతికి. 219

వ. కావునఁ గామ్యశ్రాద్ధంబు లీనక్షత్రంబులం జేయునది యిట్లు గృహస్థుండు హవ్య
కవ్యంబుల దేవపితృగణంబులు రుచిరాన్నపానంబుల నతిథిబాంధవభృత్యభిక్షుభూత
పశుపిపీలికాదులను బరితుష్టి నొందించుచు సదాచారపరుండు గావలయునని నల
ర్కుం డాచారప్రకారం బెట్టి దెలింగింపు మనవుడు మదాలస యి ట్లనియె. 220

సదాచారప్రకారము.

క. ఆచారము వలయు గృహిక, సాచారుం డిందుఁ బరమునందును రెంట
న్నీచత్వంబున నొందు స, దాచారపరుండు పూజ్యుఁ డగు విమలమతీ!. 221

క. దానము దపమును యజ్ఞము, మానుగ సఫలత్వ మొందు మహితాచారా
మానునకు సదాచారవి, హీనునకు విఫలత నొందు నిద్ధవిచారా!. 222

క. కావున నాచారంబు నీ, కావహ మట్లగుట నీవు నవహితమతివై
కావింపు దత్స్వరూపము, శ్రీవిలసితమూర్తి! నీకుఁ జెప్పెద వినుమా. 223

క. అనుపమవర్గత్రయసా, ధనమహితోద్యోగపరతఁ దనరుగృహస్థుం
డనఘ! యిహాముత్రలయం, దనవరతాభీష్టసిద్ధి నభిరమ్యుఁ డగున్. 224

సీ. ఒనరంగ బ్రాహ్మముహూర్తంబునందు మేల్కనుట ధర్మార్థచింతనము సేత
సంకల్పితస్నానసంధ్యాజపాగ్నిహోత్రాదినిత్యక్రియ లాచరించు
టాదిత్యునుదయాస్తమయములఁ జూడమి యనృతంబు పల్కమి యలుక లేమి
యపవాదపురుషవాక్యప్రలాపంబుల నుడుగుట నగ్న యై యున్నయన్య

ఆ. వనిత నైన నాత్మవనిత నైనను గనుఁ, గొనమి యంటరానివనితదర్శ
నంబు తదభిభాషణంబు మానుట సదా, చార మండ్రు బుధులు జనవరేణ్య! 225

ఆ. విష్ఠ యుమ్మిక వెంట్రు వెలిమిడి మూత్రంబు, బొగ్గు కేశచయము భూమిసురుల
చేను ప్రాఁత యైనచీర త్రాడూషర, స్థలము గాలఁ ద్రొక్కఁ దగదు పుత్ర! 226

తే. దర్పణాలోకనము దంతధావనంబు, వెండ్రుకలను గైసేయుట వినుము దేవ
తార్చనము లివి గృహికిఁ బూర్వాహ్ణమునసె, యాచరింపంగవలయుం గుణాభిరామ!

తే. వార్చి వాఙ్నియతితో వలను గలిగి, యుత్తరంబొండెఁ దూర్పొండెఁ జూచి
జానుమధ్యంబునందు హస్తంబు లుండఁ, గుడుచునది పవిత్రాన్నంబు గుణవరేణ్య.

ఆ. పసులమందలోన భవనతీర్థాశ్రమ, వర్త్మములను జేయ వలదు మూత్ర
మధికదోష మందు రనఘ! విణ్మూత్రవి, సర్జనంబు పవనజలములందు. 229

సీ. ఒడలికి నుపఘాత మొదవినప్పుడు దక్క దోసంబు సుమ్మన్నదోసగణన
మొంగిలితోఁ బల్క నేమియుఁ జదువ గో ధరణీసురాగ్నులఁ దనశిరంబు
నంట రవీందుతారావళిఁ గనుఁగొనఁ దగదు వర్జ్యములు ప్రత్యక్షలవణ
మును భిన్నభాజనంబును విశీర్ణాసనశయ్యలు తినుచుండి చనదు వార్వ

తే. నొక్కయెడ నైన గురులప్రత్యుద్గతియును, వందనము నర్చనంబును వలయు నాను
కూల్యమును జేయ వలయును గురునియెడ ది, గంబరత శయనింప నీరాదఁ గాదు.

చ. విను పయిఁచీర లేక సురవిప్రుల నర్చన సేయఁ జెల్ప భో
జన మొనరింపఁ గాదు దివసంబును రేయుఁ బురీషమూత్రస
ర్జనముఁ గుబేరదక్షిణదిశాముఖతం దగు నాచరింప మ
ర్త్యునికి నిజేచ్ఛఁ జేయ నగు రోగముఁ బొందినయప్డు దప్పనుల్. 231

సీ. తలతీఁట యిరుగేలఁ దగదు గోఁకఁగ నిమిత్తము లేక యూఁమఁదలఁ దడుపఁ దగదు
తల నున్నపూనియు దగ దంగమునఁ బూయఁ దగదు వేదం బనధ్యాయతిథులఁ

జదువంగ నొరుచీర జన్నిదంబు ధరింపఁ దగ దన్యుచెప్పులు దగదు తొడుగ
ఘూశాప్తమీపర్వములయందుఁ దగదు తైలాభ్యంగమును నంగ నానుభవము
ఆ. కాలు కాలఁ దొడయఁ గాదు మర్త్యం బాడ, నాడఁ జనదు గొండియంబు దగదు
వ్యసని మూర్ఖు మత్తు నధము హీనాంగు సొం, దర్యరహితుఁ జూచి తగదు తెగడ.
క. తెరు విచ్చి తొలఁగ వలయుం, బురుషుఁడు విప్రునకు ధరణిపుని కార్యుని కా
తురునకు గర్భిణి కంధుని, కురుభారవహునికి రిపున కున్మత్తునకున్. 233
క. గుడియును నగరునరులు వో,యెడి తెరువును రచ్చమ్రాఁకు నెక్కుడువిద్యం
గడ చనినయతని వినయం, బడరఁ బ్రదక్షిణము సేయునది నరుఁ డనఘా!. 234
క. శిరమున నగస్త్యుఁ డొండెను, సురనాథుం డొండె నుండ సుప్తిఁ గనఁ దగు
న్నరుఁ డుత్తరపశ్చిమముల, శిరముగ నిద్రించు టెగ్గు సేయుఁ గుమారా!. 235
సీ. స్నాతుఁడై మెయినీరు చేతఁ దొడయఁ జీర నార్ప నెంద్రుకలు విదుర్పఁ గూడ
దాలేపనంబు నీళ్ళోదకము స్నక ర్త్వ్యంబు రక్తాసితములు పీత
దళములు సైనవస్త్రము లధార్యములు చిరోషితములును బర్యుషితములును
శుష్కతరమ్ము లిక్షుక్షీరపిష్టశాకములును బలలవికార మైన
తే. యవియు నెల్లను విను మభోజ్యములు రేపు, మాపు గుడుచుట విధ్యుక్తమార్గ మనఘ
సవితృనుదయాస్తమయములశయన మెగ్గు,నిట్లు గూర్చుండు నెడ మేలు నెపుడువలయు!
మ. పరదారాగమనంబునం గలుగుపాపం బెక్కు డత్యంతదు
స్తరమాయుఃక్షయ మాచరించు నయం లేప్పాత్ర్యార్తము ల్సేసిన
న్హారియించు న్సురలోకము న్యశము నిత్యైశ్వర్యము న్గావున
న్నరుఁ డన్యాంగనపొంతఁ బోవమి గదు న్ధర్మంబు ధర్మాత్మకా!. 237
క. నిను నురువును దుర్గంధం,బును లేనిపవిత్రవారిఁ బూర్వముఖుం డొం
డె నుదఙ్ముఖుఁ డొండెను నై, యనఘ! యశబముగ వార్చునది కడు నియతిన్. 238
సీ. దంతతాడనమును దనుతాడనము చేత నిందబంబు సంధ్యల నిద్ర గుడుపు
సురతంబు చదువును దురితంబుఁ జేయుఁ బూర్వాహ్ణమధ్యాహ్నపరాహ్ణవేళ
లమర మనుష్యపితృర్చనలకు మేలు క్షౌరకార్యములకుఁ గరము లెస్స
ప్రాగుదఙ్ముఖతలు పరులకు నుపతాప మొనరించుపను లెడ్డు నుడుగ వలయు
తే. జంతుచయము నొప్పింపంగఁ జనదు కన్యఁ, గులజ యైనను రోగిణి గొనఁటిఁ జేనఁటిఁ
బరిణయం బగు టొప్పదు భార్యఁ బ్రీతి, నరసిరక్షించునది తగ దాత్మ నీకు. 239
ఆ. అంట రానిదాని నఖిలవర్ణులకును, ననఘ! నాల్గురాత్రు లంట రాదు
కొడుకు సమదినమునఁ గూఁతురు విషమది, నమునఁ బుట్టు నెంటఁగి నడువ వలయుఁ

ఆ. పంచపర్వములను బగలు సంగనం బొందు, నతని కుద్భవింతు రధికపాప
యుతులు సుతులు సంధ్య నుగ్మలి నాదటం, గూడె నేని యతండు పేడిం గాంచు.

వ. క్షౌరక్రియాంగనాసంగమావసాననమన శ్మశాన ప్రదేశంబుల సచేలస్నానంబు సేయుం
ట గురుద్విజరాజమంత్రిపతివ్రతాతపస్విలయందుం బరివాదపరిహాసంబులు పరిహ
రించుట యత్యున్నతాతినీచంబు లగుశయనాసనంబులు వర్జించుట ధవళాంబరకుసు
మానులేపనంబులు ధరియించుట మాంగళ్యవేషభూషణంబు లంగీకరించుట యాచా
రంబు లని మఱియును. 242

సీ. మత్తుం దున్మత్తుం దుర్వృత్తుం దసత్త్వంబు దుర్వినీతుండు చౌర్యదూషితుండు
లుబ్ధుం డతివ్యయలోలుండు శత్రుం డబద్ధుండు బంధకీభర్త హీనుం
డతిబలవంతుండు నతినిష్ఠురుండు నింద్యుం డనువీరితోడ సఖ్యంబు దగదు
తగు మహీపాలబాంధవబుధదీక్షితస్నాతకాద్యుత్తమజనులతోడ

తే. ఋత్విగాదుల నార్యుర నెఱిఁగి పూజ, సేయునది యాశ్రయించి విశిష్టభక్తి
నేఁడు గాల ముండిన వారి నెపుడు విడువ, కర్థి రక్షింప వలయు శక్త్యనుగుణముగ.

శా. అంగుష్ఠాంతరరేఖ యాచమనయోగ్య బ్రాహ్మ్యతీర్థంబు సు
మ్మంగుష్ఠంబునఁ బుట్టవ్రేలియెడఁ బిత్ర్యం బైనతీర్థంబు నా
నంగుళ్యగ్రము దైవతీర్థమునఁ బోల్పారుఁ బుషిప్రీతి యో
జం గావించుఁ గనిష్ఠి కాద్య మగుప్రాజాపత్యతీర్థం బనన్. 244

తే. దేవమునిపితృతతికిఁ దత్తీర్థములను, చేయునది కృత్యములు తప్పఁ జేయ వలవ
దాభ్యుదయికపితృక్రియ కర్హ మంత్రుడు, దివ్యమునులు ప్రాజాపత్యతీర్థ మనఘ!.

వ. హుతవహు నాహుతులం బూజించి గృహబలి యాచరించి వైశ్వదేవం బాచరించి
దేవతోద్దేశంబున వేళవేళ బలిదానం బాచరించి మఱియును. 246

చ. అనలము నోర నూఁదఁ దగ దగ్గియుం నీరును నొక్కమాటు తేఁ
జనదు విలంబనంబు నిజశౌచవిధానమునందుఁ గూడ దె
గ్గొనర గురుండు దేవతలు నుండఁగ నడ్డసఁ గాళ్ళు చాఁచు ట
ర్థి నిగుడఁ గ్రేపుఁ జన్గుడుపు ధేనువుఁ గొట్టుట తప్పు పుత్రకా!. 247

క. ఎచ్చట శ్రోత్రియుండును ధన, మిచ్చునతఁడు నీరు గలుగు నేఱును వెజ్జు
న్మచ్చికయును లేకుండును, నచ్చట వసియింప వలవ దభినుతచరితా!. 248

క. జితశత్రుండు బలవంతుండు, నతిధర్మపరుండు నైనయవనీశుకడ
న్మతిమంతుల కుండఁ దగుఁ గుపతికడ వసియించునతఁడు పడయునె సుఖముల్?

క. ఎందలిజను లవినీతిం, బొందక మత్సరముపొంత పోవక పరమా
నందమునఁ గూడి యుందురు, రం దుండుట పరమసుఖము నాపాదించున్. 250

క. ఎం తెల్లమందులును గల, వెందుఁ గృషీవలులు ధనికు లెందు ధరణి చె
న్నొందు బహుసస్యదాయిని, యందు న్నివసింపఁ దగు సుఖార్థులు పుత్రా!. 251

వ. అని చెప్పి యింక వర్జ్యావర్జ్యంబులు వర్జ్యంబులకుం బ్రతిక్రియలుం జెప్పెద నాకర్ణింపుము. 252

సీ. ఘృతయుక్తిఁ జిరపర్యుషిత మయ్యు భోజ్య మా నన్నంబు గోధూమయవలు సేరు
పునఁ జేయఁబడినవి విను ఘృతాక్తములు గాకున్న నవి ప్రాచి గావు మత్స్య
కూర్మశల్యశశకగోధాప్రజంబులు భక్షణార్హము లారఁబంది కోడి
యనుపయోగ్యంబౌషధార్థమై సేవింపనగుఁ బ్రోక్షితం బైనయామిషంబు

ఆ. పసిఁడి వెండి రాగి పవడంబు శంఖంబు, నీరుపాలు పెరుగు కూరగాయ
మౌక్తికంబు మణులు మనుజానియొద్ద లంబు, సేచనమున శుద్ధిఁజెందు ననఘ. 253

పాత్రాదిశుద్ధి.

తే. అరయ సుపవాతి వాటిల్లినట్టిచోట, నాజ్యతైలాభ్యుపేతభాండావలులకు
నేళ్లనీళులనొండె వేనీళ్ల నొండె, గడువ తాకఁ దోమిననొండెఁ గలుగు శుద్ధి. 254

క. విను శూర్పధాన్యకృష్ణా, జినముసలోలూఖలములు చీరలపెనుబ్రో
వును శుద్ధిఁ బొందుఁ బ్రోక్షణ,మున నిట్టుల నుష్ణతోయముల వల్కలముల్. 255

సీ. భసితోదకములఁ గార్పాసోద్భవంబులు దారుశృంగాస్థిదంతములు శుద్ధిఁ
బొందు మృద్భాండము ల్పునరగ్ని సంస్కృతి నతిశుద్ధిఁ దాల్చుఁ బణ్యంబు భైక్ష
మును గారుహస్తంబు వనితాముఖము నిజస్తన్యపానాసక్తతనయవతియు
దుర్గంధబుద్బుదదూష్యత బోరయుని యూటనీరును శుచు లుర్వి దహన

తే. మార్జనంబులఁ గాలక్రమమున గోచ,యంబు ప్రోక్షన వినుము గృహంబు మన్ను
గలయఁ బ్రోక్షనఁబూసిన నలికినను న,లంకరించిన శుద్ధి నుల్లాస మొందు. 256

తే. మనుజకృతతటాకాదుల మన్ను ముద్ద, లైదు పుచ్చక సుస్నాన మాచరింపఁ
జనదు దేవఖాతము లగుసరసులందు, బావులందును నదులందు వలదు వత్స!. 257

సీ. అన్నంబు గోవు మూర్కొన్నఁ గీటక మీఁగ వెండ్రుక లం దున్న విమలభూతి
యుంతజలప్రోక్షణ నతిశుద్ధ మగు భసితమునఁ గాంస్యంబు నామ్లమునఁ దామ్ర
మును క్షారమున సీసమును దగరంబు పైపై వారి చల్ల ద్రవనిచయములు
శుద్ధి వహించు రశ్మలు గజాగోవహ్ను లశ్వంబు మారుత మవని నీళ్ళ

తే. బిందువులు మక్షికలు గీటుఁ జెందియుఁనుట, విత్రతనె పొందు నెప్పుడువిను మహాశ్వ
వదనములు పక్షికులముఖవిదళితంబు, లై పడినఫలములు శుచు లంద్రు బుధులు.

క. ఇనశశికరపవనస్పర్శనముల నతిశుద్ధిఁ బొందు శయ్యాయానా
సనయానపాత్రమార్గము, లును దృణమును బణ్యములును లోకస్తుత్యా! 259

ఆ. అంటఁ గానిదాని నంత్యజుఁ బతితు శ,వంబుఁ బేడి నగ్నుఁ బరవధూప
రాయణుని నధర్మరతు మృతహారకుఁ, జూచి సేయ వలయు నాచమనము. 260

ఆ. కోడి నూరఁబందిఁ బేడిఁ జండాలుని, నక్కఁ గుక్కఁ గృతకసారిఁ బతితు
ననఘ! పిల్లి నెలుక నాశౌచి సూతిక, నంటినతఁడు నీట లాడ వలయు. 261

క. ఏనరుఁడు సదాచారవి,హీనుం డేనరుఁడు భూసురేంద్రత్యక్తుం
డేనరుఁడు ధర్మబాహ్యుం, డానరుఁ డఘభోక్త యగునరాధముఁడు సుమీ! 262

బ్రాహ్మణాదులయాశౌచప్రకారము.

వ. కావున నిత్యకర్మకలాపంబు ప్రయత్నంబున ననుష్ఠింపవలయు వాని ననుష్ఠింపవల
వనిదినంబులు మరణజన్మంబులందుఁ గల వాకర్ణింపుము. 263

క. పదిదినములు బ్రాహ్మణులకుఁ, బదియును మఱి రెండు ధరణిపాలురకు నొగి
న్పదియేను వైశ్యులకు ము,ప్పది శూద్రుల కఖిలకర్మబాహ్యత వలయున్. 264

సీ. ప్రథమచతుర్థసప్తమనవమదినంబు లస్థిసంచయమున కర్హములు చ
తుర్వర్ణులకును జతుర్థాహముల నగు నగ్నివిషంబుల నంబువులను
శస్త్రంబులను ననశనవిధిఁ బ్రాయోపవేశంబునను బరదేశమునను
సన్న్యాసమున బాల్యసమయమునను మృతు లైన సద్యశ్శౌచ మావహిల్లు

ఆ. ననఘ! మూఁడుదినము లాశౌచ మంద్రు గొం,దఱు మునీంద్రు లతులధర్మయుక్తి
నెన్ని నెలలబాలుఁ డీల్గె నన్నిదినంబు, లశుచిభావ మొందు విశదకీర్తి! 265

వ. తమతమసూతకదినంబులు చనిన నఖిలవర్ణులును సుస్నాతు లై నిజకర్మంబు లనుష్ఠిం
చునది యివ్విధంబున గృహస్థులు ధర్మార్థకామంబులు పరస్పరవిరోధులు గాకుండ
నవలంబించి సదాచారపరు లై యిహపరసుఖంబులు వడయుదురని మదాలస బహు
ప్రకారంబులఁ జెప్పిన కర్మకాండవిధంబు విని యలర్కుం డానందభరితుం డయ్యె
నని చెప్పి వెండియుఁ దండ్రికి జడుం డిట్లనియె. 266

అలర్కుఁడు రాజ్యభోగము లనుభవించుట.

ఉ. అంత మనోహరప్రకటయౌవనలీల యలర్కుఁ బొందె న
త్యంతమదోల్లసద్విభవ మైంద్రగజేంద్రముఁ బొందినట్లు స
త్కాంతికళావిలాసము సుధాకరుఁ బొందినయట్లుదాత్త వా
సంతికవిభ్రమంబు విలసత్సహకారముఁ బొందిన ట్లోగిన్. 267

వ. ఇట్లభినవయౌవనుం డై. 268

ఉ. దారపరిగ్రహంబును సుదారగుణైకపరిగ్రహంబు వై
రారిభయంకరోత్కటపరాక్రమకేలిపరిగ్రహంబుఁ బో
ల్పారఁగఁ దండ్రియాజ్ఞఁ దనయాదలఁ దాల్చి యలర్కుఁ డొప్పె నా
శారదనీరదేందువిలసద్యశుఁ డై బహుపుత్రవంతుఁ డై. 269

ఉ. అంత ఋతధ్వజుండును ననంతజరాగురుభారధుర్యతా
శ్రాంతి వహించి మేదినిభరంబు వహింపఁగ నోపటించి య
త్యంతగుణాభిరాముని నిజాత్మజుఁ బట్టము గట్టి ప్రీతితో
నింతియుఁ దానుఁ బేరడవి కేఁగి తపం బొనరించె వేడుకన్. 270

వ. అప్పుడు మదాలస మహనీయమంగళకరం బగునొక్క గాంగేయమయాంగుళీయకంబు కొడుకున కిచ్చి పరమహితంబు లగువాక్యంబుల నతని కిట్లనియె. 271

మదాలస యలర్కున కొకయుంగరం బిచ్చి హితోపదేశము సేయుట.

చ. అనఘ! మమత్వబద్ధుఁడు గృహస్థుఁడు సంతతసర్వదుఃఖభా
జన మటు గాన నెప్పుడు విషాదము బంధువియోగవిత్తనా
శనరిపుపీడలం గడు నసహ్యతరం బగు నేని యప్పుడీ
కనకమయాంగుళీయకము గ్రక్కున నేర్పడఁ బాపి యిందులోన్. 272

వ. సూక్ష్మాక్షరంబుల నేను లిఖియించి యిడినకనకమయశాసనపట్టిక పుచ్చికొని చదువుకొనునది యని యాదేశించి యతని నుచితాశీర్వాదంబుల నభినందించెఁ గువలయాశ్వుండు నట్లు పుత్త్రునికిం బూజ్యం బైనసామ్రాజ్యం బిచ్చి మదాలసాసమన్వితుం డై తపోవనంబు కరిగె నంత. 273

అలర్కుఁడు రాజ్యము సేయుట.

చ. అతులపటుప్రతాపమహిమార్కుఁ డలర్కుఁ డపారశౌర్య ని
ర్జితరిపువీరుఁ డార్యనుతశీలుఁడు పాలనకేళిలోలుఁ డై
యతిశయలీల నేలెఁ జతురబ్ధిపరీతమహీతలంబుఁ గ
ల్పితవివిధాధ్వరుం డగుచుఁ బ్రీతి ననేకసహస్రవర్షముల్. 274

వ. మఱియును. 275

ఉ. ధర్మమున న్ధనంబు సతతంబు ప్రవృద్ధము గా ధనంబున
న్ధర్మము తొంగలింప ధనధర్మవిరోధులు గానికామభో
గోర్ముల నొప్పుసంస్మృతిసుఖోదధిఁ దేలుచు నించు కేనియు
న్గర్మవిరక్తి లేక బహుకాల మలర్కుఁడు ప్రీతి నుండఁగన్. 276

చ. అనఘ! తదగ్రజుండు విపినాంతరవాసిసుబాహుఁ డయ్యల
ర్కునవిజితేంద్రియత్వమును గుప్సితరాజ్యమమత్వము న్ధనా
ర్జనకలితత్వము న్విని కరం బెద రోసి యహో! యితండు క
ర్మనిగళబద్ధుఁడై కడుఁ బ్రమత్తత నొందుటె యిట్లు మూఢతన్?. 277

వ. అని చింతించి. 278

చ. అతనిసమగ్రబోధమహిమాన్వితుఁ జేయునుపాయ మ్మహా
మతి మదిఁ గాంచి తద్రిపు నమందపరాక్రముఁ గాశిరాజు నా
తతచతురంగసైన్యఘనదర్పమహోజ్జ్వలుఁ గానఁ బోయి తా
నతివినయంబుతోడఁ బ్రియ మారఁగఁ జేరి సుబాహుఁ డిట్లనున్. 279

ఉ. శరణము గమ్ము నాకు నృపసత్తమ! నాయనుజుం డలర్కుఁ డు
ద్ధురుఁ డయి రాజ్య మంతయును దుర్వినయంబునఁ దాన కొన్నవాఁ
డరిమదభేది నా కొసఁగు మాతని నిర్జితుఁ జేసి నావుడు
న్జరుఁ బనిచె న్సుబాహుననుజన్మునిపాలికి నమ్మహీశుఁడున్. 280

క. పనిచిన నరిగి యలర్కునిఁ, గనిచరుఁ డోయవనినాథ! కాశీశ్వరుఁ డి
మ్మని యానతిచ్చెను సుబాహుని కి మ్మీరాజ్య ముడుగు ముందుదలంపుల్. 281

చ. అనిన నలర్కుఁ డల్కయును హాసము మోము నలంకరింపఁ గా
శినృపతిదూతతో తగవు సెప్పితి లెస్స సుబాహుఁ డేఁగుదెం
చి నను ధరిత్రి మైత్రి విలసిల్లఁగ వేఁడిన నిత్తుఁ గాక మీ
జనపతియాజ్ఞ కే వెఱచి శౌర్యము ధైర్యము దక్కి యిత్తునే? 282

వ. అనిన విని దూత చని యలర్కుపలుకులు కాశీశ్వరునికిం జెప్పిన సుబాహుండు బాహువీర్యమహాసియుం దగుమహీపతికి నోరు వేఁడికొనుటయు ధర్మంబు గా దని యూర కుండె నప్పుడు. 283

సీ. చతురంగబలపదాహతి నిల గంపింపఁ గాశీశ్వరుం డలర్కక్షితీశు
పైఁ జని సామాద్యుపాయప్రయోగసామగ్రిఁ దదీయసామంతదుర్గ
పాలాటవికబలావలుల నెల్లను వశగతులను గావించి యతనిపురము
చుట్టును విడిసిన స్రుక్కి తల్లడ మంది యతఁ డల్పబలుఁడును పరినిపీడ్య

తే. మానుఁడును నిస్సహాయుండు హీనధనుఁడు, నై విషాదంబు నార్తియు నాత్మఁ జాల
నగ్గలించినఁ దల్లిపల్కపుడు దలఁచి, యొనర నయ్యంగరంబునం దున్నయట్టి. 284

వ. పరిస్ఫుటాక్షరభాసురం బగుశాసనంబు పుచ్చికొని చూచి. 285

క. సంగంబు విడువ వలయును, సంగము విడువంగఁ గడు నశక్య మయినఁ జే
యంగ వలయు సత్సంగము, సంగరుజకు నౌషధంబు సజ్జన మిలన్. 286

క. కామము హేయము విడుపం, గా మదికిని శక్య మెట్లు గా కున్న మము
క్షామతి వలయుం గలవే, కామవ్యాధికి ముముక్షుఁ గడచినమందుల్. 287

క. అని పెక్కుమాఱు లతిముద,మున నాపద్యములు చదివె ముత్పులకంబు
ల్దనువునఁ బొడకొనంగా, మన మలర మదాలసాకుమారుఁడు తండ్రీ! 288

వ. అట్లు చదివి యమ్మహాత్ముండు శ్రేయంబు పురుషునకు ముముక్షుం బోలనొండు గలుగ దది యుత్తములసేవం గాని జనింపఁదనుచు మనమున నిశ్చయించి యప్పుడు రహస్యవృత్తిం జని. 289

అలర్క-దత్తాత్రేయసంవాదము.

క. ఆయుర్వీశుఁడు దత్తా, త్రేయుం గరుణావిధేయు దేవమునిగణ
ధ్యేయు నసంగత్వమహా, స్థేయు విషయరిపుబలావిజేయు నమేయున్. 290

వ. కని దండప్రణామం బాచరించి యంజలి యొనర్చి యార్తుం డగుచు ని ట్లనియె. 291

క. శరణార్థి నైననాకును, శరణ మగుము జన్మమరణజనితవ్యాధు
ల్వారియింపుము నాదుఃఖము, కరుణింపుము నన్నుఁ జూడు కామభరార్తున్. 292

తే. అనిన ముని యట్ల చేసెద నధిప! చెపుము, వగవఁ గత మేమి నీకు నెవ్వండ నేను
వనట యెవ్వని దగునొక్కొయని వివేక, దృష్టిఁ బరికింపు నిను నీవె తెలిసికొనుము.

క. అంగంబులు చింతింపు ద, దంగిం బరికింపు మది నిరంగునిఁ గనుఁగొ
మ్మంగీకృతనిజబుద్ధి న, సంగుఁడవై యెఱుఁగు మధిప సర్వాంగములన్. 294

క. అనిన నతఁడు నయ్యోగీం, ద్రుని కారుణ్యమునఁ ద్రివిధదుఃఖస్థాన
మ్మును నరసి యపుడెఁ గనుఁగొని, తనుదా నవ్వుచును ననియెఁ దత్త్వజ్ఞుం డై. 295

సీ. నేల నీ రనలంబు గాలి నభం బను నేనింటిపొడ వైనయీశరీర
మును మనంబును బుద్ధియును నహంకారంబు గా నేను నిత్యుండఁ గాన నెపుడు
శారీరమానసాధారము లౌసుఖదుఃఖము ల్నాకవి దూరతరము
లత్యంతసంబంధ మైనదేహము తదీయంబు గా దనిన నాగాశ్వరథధ

తే. నాదిసంబంధ మెక్కడియది విరోధి, యెవ్వఁ డింకఁ బరభ్రాంతి యేల యనుచుఁ
బరమవైరాగ్యసుజ్ఞానభరితవిమల, మానసుండై యలర్కుండు మఱియు ననఘ. 296

తే. ఆశసం బొక్కటియ యొ ట్లనేకఘటము
లందుఁ బెక్కయి తోఁచుఁ దా నట్ల యాత్మఁ
బొరఁడ సకలంబునందును నొగి వెలుంగుఁ
గానఁ గాశిపతియు నేను గాము వేఱు. 297

అలర్కుని యాత్మవివేకము.

చ. అని తెలివొంది యమ్మునివరాగ్రణికిం గడు భక్తి మ్రొక్కి యి
ట్లనియె నలర్కుఁ డేను సుగుణాకర! నీకృప సమ్యగాత్మద
ర్శనుఁడను వీతదుఃఖుఁ డను బ్రాజ్ఞుఁడ నైతి నసమ్యగాత్మద
ర్శను లగువారు దుఃఖజలరాశినిమగ్నులు గారె యెప్పుడున్? 298

వ. అని మఱియును. 299

క. ఎందెందుఁ గరము మమతం, బొంది పరగుచుండు నెపుడు పురుషుని మది దా
నందంద తెచ్చి యిచ్చు న, మందము లగువగల నదిక్రమక్రమయుక్తిన్. 300

తే. ఘనబిడాలంబుచేఁ బడి కాటుపడిన, యప్పుడు తనకుక్కుటంబునయందుఁ గలుగు
వంత గలుగునె మదిమమత్వంబులేని, యెలుకయందుఁ బిచ్చుకయందు నించుకైన.

క. కావున నే నిప్పుడు మమ, తావికలతఁ బడక ప్రకృతిదవుల నిలిచి స
ద్భావజ్ఞ దుఃఖి గాక సు, ఖావిష్టుఁడు గాక నీదయం బ్రతికితి నే. 302

వ. అనిన విని దత్తాత్రేయుం డిది నీచెప్పినయట్టిద యాకర్ణింపుము. 303

క. మమ యనుట దుఃఖమునకు న, మమ యనుటయ నిర్వృతికిని మార్గము లగుట
న్మమ యనుశాల్మలితూలం, బమలభవద్బోధపవనహతిఁ దూలె నృపా! 304

వ. అని మఱియును నయ్యోగీంద్రుఁ డహంకారాంకురోద్భవంబును మమకారస్కంధబంధురంబును గృహక్షేత్రోచ్చశాఖంబును బుత్త్రదారాదిపల్లవంబును ధనధాన్యమహాపత్త్రంబును బుణ్యాపుణ్యపుష్పంబును సుఖదుఃఖఫలభరితంబును విచికిత్సాళిమాలికాకలితంబును ననేకకాలప్రవర్ధితంబును నై యజ్ఞాన మనుకుదుట నెలకొని ముక్తిపదంబు బ్రుంగుడువడం బర్వి యున్న యిమ్మహాతరువునీడ నాశ్రయించి సంసారపథపరిశ్రాంతు లగు మిథ్యాజ్ఞానసుఖాధీనమానసులకు నాత్యంతికసుఖం బత్యంతదూరంబు. 305

సీ. విమలవిద్యాకుఠారము తత్త్వవిత్సాధుజనసంగపాషాణమునఁ గరంబు
వాఁడి గావించి యెవ్వరు నఱకంగ నేర్తురు వెస నమ్మహాతరువు వారు
నిష్కంటకంబును నీరజస్కంబునై రాజిల్లుచల్లని బ్రహ్మవనము
చొచ్చి నిత్యానందసుఖలీల నపునరావృత్తి నుండుదు రందు విను నృపాల!

తే. పంచభూతేంద్రియస్థూలసంచయంబు, పంచతన్మాత్రమయసూక్ష్మసంచయంబు
నరయ నీవును నేను గా మిరువురకును, నొనర నీవు గాంచినయాత్ముఁ డొక్కరుండు.

క. జననాయక! యౌదుంబర, మున మశకము నీట మత్స్యము నిషీక కుశక్
గనుఁగొన నొక్కఁడై వేఱై, చనుగతి దేహాత్ములందుఁ జర్చింపఁ దగున్. 307

వ. అనిన విని యలర్కుండు దేవా! భవత్ప్రసాదంబునం బ్రకృతిపురుషవివేకకరం బైన యీజ్ఞానంబు నాకు సంభవించె నింక నిర్గుణబ్రహ్మైకత్వంబునం బొందించుయోగం బెట్టి దెఱింగింపవే యనిన దత్తాత్రేయుం డి ట్లనియె. 308

అలర్కునికి దత్తాత్రేయుం డుపదేశించిన యోగమార్గము.

క. గురుఁడు శరీరమునందలి, పరమజ్ఞానమ్మునకు నుపద్రష్ట నరే
శ్వర! మోక్షార్థికి శ్రేయ, స్కరవిమలజ్ఞానపూర్వకము యోగంబున్. 309

క. ప్రాకృతగుణనివహముతో, నేకత్వము లేమియును మహీవల్లభ! బ్ర
హ్మైకత్వము గలుగుటయును, బ్రాకటముగ ముక్తి యండ్రు భవ్యవిచారా! 310

వ. ముక్తి పరమయోగంబునం గలుగు యోగంబు సంగత్యాగంబున సిద్ధించు సంగత్యాగంబున సంసారదుఃఖంబులకు విసుగుడుం బుట్టు వినుము దుఃఖంబు సంగోద్భవం బగుటం జేసి యోగి సంగంబు నుడుగ వలయు సంగరాహిత్యంబున మమత్వంబు చెడు నిర్మమత్వంబునం బరమసుఖ మైనవైరాగ్యంబు జనియించు వైరాగ్యంబున సకలదోషంబులుం గాన నగుం గావున. 311

క. జ్ఞానంబున వైరాగ్యము, మానుగ వైరాగ్యమున సమగ్రజ్ఞానం
బూను మది న్మోక్షార్థం, బైనది తాజ్ఞాన మన్య మజ్ఞాన మగున్. 312

మ. తనపూర్వార్జితపుణ్యపాపఫలము ల్దా నప్డు భోగించుట
న్వీను నిత్యోక్తము లైనకర్మము లోగి న్నిష్కాముఁడై సేయుట
న్దనుబంధంబును వెండిఁ బొందఁడు నిజాత్మజ్ఞానవంతుండు యో
గనిరూఢాత్ముఁ డైనయుత్తముఁ డలర్కక్ష్మాపచూడామణీ! 313

ప్రాణాయామాదిలక్షణము.

వ. అని చెప్పి యయ్యోగీశ్వరుండు నీకు యోగప్రకారంబుఁ జెప్పెద యోగికి మున్నాత్మజయంబు వలయుం దానికి నుపాయంబు వినుము ప్రాణాయామంబున దేహదోషంబు దహించునది. 314

తే. తామ్ర మాదిగఁ గలయట్టిధాతుచయముఁ, గొలిమినిడియూఁదఁగీడెల్లఁ బొలియునట్లు
ప్రాణపవననిగ్రహమునఁ గ్రాఁగిపోవు, ననఘ! యింద్రియజనితదోషాదు లెల్ల. 315

వ. ప్రాణాయామలక్షణం బెట్టి దనిన. 316

సీ. కనుమోడ్చి విచ్చుటయును నొక్కలఘువును ననుకోలఁదుల మాత్ర యమరు మాత్ర
లోగిన పండ్రెండు తద్ద్విగుణంబు త్రిగుణంబు గావింప నిశ్చలగతి యొనర్పఁ
బొలుచుఁ బ్రాణాయామములు లఘువును మధ్యమును నుత్తమంబును ననఁ ద్రివిధము
స్వేదంబు కంపవిషాదము లడఁగించి వశ్యము ల్గానట్టివాయువులను

తే. వశ్యములఁ జేయు రహి యోగివర్యులకును, వసుధలో సింహశార్దూలవారణములు
పరిచయంబున నెంతయు మరఁగి మార్ద, వంబు గైకొనువిధమున వసుమతీశ. 317

తే. మావటీఁ డల్ల నల్లన మదగజంబు, నిచ్చలోఁ గూడ నోజకుఁ దెచ్చునట్లు
యోగవిద్యాపరుండును నొయ్యనొయ్య, ననువుతోఁ గూడఁ బవనంబు నాఁగవలయు.

క. మరగినసింహము మృగములఁ, బొరిగొనుచును నరులఁ గాచుపోలికి నంతః
పరిచితపవనుఁడు నఘములఁ, బొరిగొనుచును నరులదేహములు రక్షించున్. 319

వ. కావున సదానుష్ఠానపరుండై యోగి ప్రాణాయామపరుండు గావలయు నని తదీయంబు లైనధ్వస్తిప్రాప్తిసంవిత్ప్రసాదంబు లనుచతురవస్థలప్రకారంబును నేర్పడం దెలిపి యిట్లు ప్రాణాయామలక్షణయుక్తుం డైనయతనికి విహితం బైనయోగంబుఁ జెప్పెద నాకర్ణింపుము పద్మస్వస్తికాద్యాసనమ్ములలోనం దన కభిమతం బైనయాసనంబున నాసీనుండై హృదయంబునం బ్రణవంబుఁ గదియించి వదనంబు సంవృతంబు గావించి శిరం బించుక నెగయించి దంతంబు లొండొంటిం బొంద నీక దెసలు చూడక నాసాగ్రంబున దృష్టి నిలిపి తమోరజంబు లడంచి నిర్మలత్వం బవలంబించి పవనం బాకంఠపూరితంబు గావించి. 320

తే. మనసుతోఁ గూడఁ గ్రమమున మారుతేంద్రి, యములఁ గూర్మంబులోనికంగములఁ దిగుచు
నట్లు తిగువఁ బ్రత్యాహార మవ్విధం బొ, నర్చి తత్త్వైకనిష్ఠ మనంబు నిలిపి. 321

క. తనయందు యోగి తన్నుం, గనుఁగొని ధారణ యొనర్పఁ గదలక యుండు
న్మన సొగిఁ బ్రాణాయామము, లనఘా! పండ్రెండు సేయునది ధారణకున్. 322

క. ధారణలు రెండు నివి యో, గారూఢులు యోగ మందు రఖిలాఘములు
న్దూరము లగుఁ గడు నియతా, హారులు దృఢయోగపరులు నగుయోగులకున్. 323

వ. ఇట్లు యోగం బతిప్రయత్నంబున సాధించిన యతండు యోగి యగు వినుము ప్రాణనియమంబు ప్రాణాయామంబు మనఃపవనేంద్రియములఁ బ్రత్యాహరించుటం బ్రత్యాహారంబును మనంబు గదల కుండ ధరించుట ధారణయు నగు ధారణాస్థానంబులు పది గల వాకర్ణింపుము. 324

క. మును నాభియు హృదయము నుర, మును గంఠము నాననమును ముక్కుతుదయు లో
చనములు బొమలనడుము తల, యును నట నూర్ధ్వమును నెలవు లొగి ధారణకున్.

చ. అనలము నీరు కూప మురగాలయ మున్నయెడ న్జతుష్పథ
మ్మున వెలి గల్గుచోటఁ బితృభూమి సరీసృపసంచరస్థలం
బున నది రచ్చకొట్టమున మ్రోఁత చెలంగెడిపట్టునం బొన
ర్చిన విఫలంబు యోగము విశీర్ణదలస్థలియందు నుందలోన్. 326

సీ. ఈకీడుచోటుల నేమి భావ్మని యోగయుతుఁ డగుసజ్ఞానయోగి కవఘు
యోగంబునకు విఘ్న మొనరించుదోషము లుదయించు వానిఁ జెప్పెద జడత్వ
మును బధిరత్వమ్ము మూకత్వమును విస్మృతియును నంధతయు వేఁకియు ననంగ
నట్లు ప్రమాదజ లైనయారుజలకు రయమునఁ దగుఁ బ్రతిక్రియ లొనర్పఁ

తే. గంప మడరు నపుడు ఘనగిరి మనమునఁ, జెవిటితనమునందుఁ జెవి సువాక్చ
యందు నీరువట్టునప్పుడు విను మామ్ర, ఫలము రసనఁ దాల్ప వలయు యోగి. 327

వ. మఱియును యోగీశ్వరుం డుష్ణంబునందు శీతంబును శీతంబునం దుష్ణమ్మును ధరించునది
యమానుష సత్త్వజాతబాధలు వొందదేని వాయువహ్నిధారణంబునం జేసి వానిం
జెఱచునది ధర్మార్థకామ మోక్షంబులకు సాధనంబగుట నవశ్యంబు శరీరంబు రక్షించు
నది మునిజనప్రవృత్తిలక్షణం బొరులకుఁ జెప్పుటం దనవిమలజ్ఞానంబు విలయంబుఁ
బొందుఁ గావునం దదీయప్రవృత్తిగోపనంబు సేయునది యని చెప్పి. 328

శా. ఆరోగ్యంబు ననిష్ఠురత్వము నలౌల్యంబు న్వపుఃకాంతియు
న్సౌరభ్యంబును సంస్వరత్వము మనస్సౌమ్యత్వము న్మూత్రవి
ట్చారాల్పత్వము నిర్మలత్వముఁ గృపాసంగిత్వము న్బ్రాప్తయో
గారంభుం డగుయోగికిం బ్రథమచిహ్నంబు ల్లక్ష్మీవల్లభా! 329

తే. భూతములు దాను నన్యోన్య భీతి లేక, యునికి శీతోష్ణబాధ దా నొంద కునికి
భువన మనురాగమునఁ దన్నుఁ బొంద కునికి, వెలయు నివి సిద్ధలక్షణములు నరేంద్ర!

యోగవిఘ్నకార్యములు.

ఆ. దానయజ్ఞదేవతాపూజనాతప, స్తంత్రకలితకామ్యజంబు లైన
కడిఁదియోగవిఘ్నకరము, లౌకర్మము, ల్పరిహరింప వలయుఁ బరమయోగి. 331

వ. మఱియును గటుకోదయంబు లైన ప్రాతిభశ్రావణదైవభ్రమావర్తంబు లనుపంచవిధోప
సర్గంబులు పరిహరించి నియతాహారుండును జితేంద్రియుండును బ్రహ్మప్రవణమన
స్కుండు నై యోగి సూక్ష్మం బగుధారణాసప్తకంబు ధరియించునది తద్విధం
బాకర్ణింపుము. 332

సీ. ధరణి మూర్ధంబున ధరియించి తన్మయత్వముఁ బొంది దానిగంధంబు విడుచు
నది యట్ల జలమును నగ్నియు వాయువు వాయుపథంబును వరుసఁ దాల్చి
జనసుత రసరూపసంస్పర్శశబ్దంబు లనుగుణంబులఁ ద్రోచునది క్రమమునఁ
దనమనంబును బుద్ధియును సర్వభూతచయంబు మనోబుద్ధులందుఁ జొనిపి

తే. ధారణాభ్యాసతత్పరత్వమునఁ జేసి, యమ్మనోబుద్ధిసౌక్ష్మ్య మొయ్యనఁ దొలంగు
నది గురూక్తిని ట్లతిసూక్ష్ము లైనయేఁడు, వృత్తుల విడిచినతఁడు నివృత్తిపరుఁడు. 333

వ. ఇట్టు సప్తధారణాభ్యాసంబున జేసి పృథివ్యాదులగంధాదిసూక్ష్మగుణంబులం దొఱంగి శుద్ధాత్ముం డగుయోగసిద్ధుం డణిమాద్యష్టైశ్వర్యసిద్ధిసంపన్నుండును షడ్భావవికారరహితుండును యోగాగ్నిదగ్ధదోషుండును నైయనలం బనలంబునందును జలంబునం దును నొందుచందంబునం దాను బరమాత్మైకత్వంబునం బొందు ననవుడు నలర్కుండు బ్రహ్మపదవర్తియైనయోగిచరిత్రంబు నా కెఱింగింపవే యనిన దత్తాత్రేయుం డిట్లనియె. 334

యోగిధర్మములు.

క. మానము నవమానంబును, మానవులఁ బ్రమోదఖేదమగ్నులఁ జేయుం
స్థానము యోగికి విష మవ, మానం బమృతంబు సుమ్ము మహితవిచారా! 335

వ. అని మఱియును. 336

తే. త్రావునుదకంబు వస్త్రపూతంబు నడుగు, వెట్టునెడ దృష్టిపూతంబు ప్రీతితోడఁ
బలుకు సత్యపూతంబును బరమ మైన, తలఁపు బుద్ధిపూతంబు గావలయు యతికి. 337

తే. సిద్ధి గోరుయోగికి విను శ్రాద్ధమునకు, దైవయాత్రామహోజనస్థానమునకు
నధ్వరాతిథ్యపూజల కతులితోత్స, వముల కెప్పుడు నరుగంగ వలవ దనఘ! 338

చ. మనుజులు దన్నుఁ జూచి యవమానపరాభవము ల్పొనర్చువ
ర్తనమున నట్టివేషమును దాల్చి సమస్తజనమ్ములు న్భుజిం
చిన మఱి యోగి బొగ్గుపొగ చీఁకిలి ముంగల లేనియిండ్లకుం
జనునది భిక్ష కెప్డు మును చన్నగృహంబుల కేఁగరా దొగిన్. 339

తే. వేదవేదాంగపారగవిప్రగృహము
లందు సంపాదితం బైనయట్టిభైక్ష
మనఘ! ప్రాణాగ్నిహోత్రంబు సాంగముగ నొ
నర్చి యొనరించునది భోజనంబు యోగి. 340

వ. అహింసాస్తేయబ్రహ్మచర్యాలోభత్యాగంబు లనునియమంబు లేను నంగీకరించి మనోదండవాగ్దండకర్మదండంబు లనుదండత్రయంబు ధరియించి త్రిదండి యన నతిశయిల్లి వివిధజ్ఞానంబులచిక్కునం బడక నిర్మలజ్ఞానవంతుండును సమలోష్టాశ్మకాంచనుండును సమస్తభూతదయాళుండును సతతధ్యానపరాయణుండు నైనయోగిపరబ్రహ్మానందభరితుం డగు నని చెప్పి యత్రిపుత్త్రుండు వెండియు నలర్కున కిట్లనియె. 341

క. విశ్వకరచరణకంధరు, విశ్వాననయనకర్ణు విశ్వాకారున్
విశ్వాత్ముఁ బొందుటకు యో, గీశ్వరుఁడు జపింప వలయు నెపుడు ప్రణవమున్,

మరణసూచకములగు స్వాప్నికాద్యరిష్టములు.

క. అని యోంకారము రూప,మ్మును సగుణత్వాగుణత్వములు తద్ధ్యాన
మ్మును నుచ్చారణవిధమును, నొనరంగాఁ జెప్పి వెండియును నిట్లనియెన్. 343

వ. కలలోనను బ్రత్యక్షంబునం గలుగునరిష్టంబులం జేసి యోగి మరణకాలం బెఱింగి యోగస్మరణపరుండైన నవ్విధు సిద్ధింప కున్న నయ్యోగం బతనికి మీఁదటిభవంబున సిద్ధించు. 344

క. కావున నరిష్టములు స,ద్భావంబున నెఱుఁగ వలయుఁ దత్త్వజ్ఞాన
శ్రీవిలసితుఁ డగుయోగికి, భూవర! యెఱిఁగింతు వినుము పొలుపుగ దానిన్. 345

క. దివిజపథంబున శుక్రుని, ధ్రువుని శశిచ్ఛాయ నయ్యరుంధతి నేమా
నవుఁ డోగిఁ గానఁ డతఁడు మృ,త్యువు నొకవత్సరముమీఁద నొందు నరేంద్రా! 346

క. కిరణరహితరవిబింబముఁ, గిరిణావృతవహ్నిఁ గనినఁ గీడును గలుగు
న్నరులకుఁ బదునొకఁడునెల, లరిగిన నటమీఁద మరణ మవనీనాథా!. 347

సీ. రజతసువర్ణమూత్రపురీషములు గల నైన దృష్టంబున నైనఁ గ్రక్కు
నాతఁడు పదినెల ల్ప్రేతపిశాచక నకవృక్షగంధర్వనగరవర్శి
తొమ్మిదినెల లతిస్థూలుండు బడుగును బడుగును దొడ్డ నెపంబు లేక
యైన నెన్మిదినెల లతిసాంద్రరేణుకర్దమమున బ్రుంగి పాదంబు ఖండ
తే. ములుగఁ గలఁ గన్నవాఁ డేడునెలలు గువ్వ, గ్రద్ధ వాయస మాదిగాఁ గలుగుపులుఁగు
లడరి నడుతలవ్రేసిన నమ్మనుష్యుఁ, డాఱునెలలు గాని మనఁ డుదాత్తపుణ్య! 348

తే. పాంసువృష్టిచేతను గాకపంక్తిచేత, మానవునితల పీడిత మైన మేని
నీడ యొండుచందం బైన నెలలు నాల్గు, గాని యాయువు గలుగదు వాని కనఘ!

సీ. ద్విత్రిమాసములలోఁ దెగు నరుఁ డపగత మేఘయామ్యమ్మున మెఱుఁగు నింద్ర
ధనువున నుదకంబు గనినఁ దైలాజ్యాంబుదర్పణాంతరమునఁ దనదురూపు
తలలేక తోఁచిన నెలఁ జచ్చు గొరియగ దురు శవగంధంబు బొరయఁ దనువు
నర్ధమాసాయుష్యుఁ డగును నీళ్లాడిన నతనికాళ్లును హృదయంబు మిగుల
తే. నెండినను నీరు ద్రావంగ నొసఁగి దాహ, మగ్గలించిన విను దశాహమునఁ దీఱు
ఋక్షకపియానగతుఁ డైన దక్షిణమున, కొనరఁ బాడుచుఁ జనఁ గలఁ గనియె నేని.

చ. ఇనుఁ డుదయంబు సేయ వఱ డెవ్వనికై రొదు రేఁగు నిష్ఠుర
ధ్వని నెలగంగ నెవ్వనికిఁ దద్దయుఁ నాఁకలి యుబ్బవిల్లు భో
జన మొనరించినప్డు నెద సాధ్వస మూరక పుట్టుచుండు న
వ్వని కొగి రేయునుం బగలు వాఁడు యమాలయగామి భూవరా! 351

ఉ. ఎవ్వఁడు పెల్చఁ బల్కులకు నెంతయు నస్ఫుటతారకంబులం
దెవ్వనిరూపు దోఁప దొగి నింద్రధనుర్గ్రహతారకోత్కరం
బెవ్వఁడు రాత్రియు న్బగలు నేర్పడఁ గాంచు స్రవించుచుండుఁ దా
నెవ్వనిసవ్యనేత్రమున నెప్పుడు నీరము వా రనాయుష్కుల్. 352

తే. నాసికాగ్రంబు వంగుట నాల్క నల్ల, నగుట వదనంబు గదు నెఱ్ఱ నగుట యుష్ట్ర
రాసభమ్ములు పూనినరథము నెక్కి, యమునిదెసఁ జనఁగలఁగంటయు నాయువడఁచు.

తే. కర్ణముల మ్రోఁత వ్రేళ్ళిడఁ గలుగదేని, నీల్గుఁ బాతఱఁ బడినఁ దన్నెగయకుండఁ
గప్పి రని మానవుఁడు గలఁ గనియెనేని, యదియ తుద వానిమనుగడ కగునరేంద్ర.

ఆ. ఊర్ధ్వదృష్టి యైన నోలిని బ్రచలిత, దృష్టి యైనవక్రదృష్టి యైనఁ
బురుషుఁ డేఁగు జమునిప్రోలికి బొద్దు లోఁ, తైన మొగము శుష్క మైన ననఘ!

క. తనకట్టినసితవస్త్రము, లనయము రక్తాసితంబు లైనపగిదిఁ దోఁ
చిన నిజభావప్రకృతులు, విను మగుడంబడిన నరుఁడు వీడ్కొను భవమున్. 356

వ. అని చెప్పి యయ్యరిష్టంబులు మహాత్ములైనయోగులు మొదలుగా నెల్లవారికి నెఱుంగ వలయు సంవత్సరాంతంబు ఫలదంబు లగునరిష్టంబులు పరీక్షించి కాలం బెఱింగి మరణంబునకు వెఱవక ధైర్యం బవలంబించి యోగం బనుష్ఠించుచు దివారాత్రంబులం దోఁచునరిష్టంబులు పరికించి యవి విఫలంబు లగునట్లుగా నయ్యవేళలందు యోగయుక్తుం డగుచుఁ గాలంబు గెలిచి మనంబు సుస్థిరంబు గావించి గుణత్రయవికృతు లడంచి యాత్ముని నాత్మయందు సంధించి తన్మయుం డై యోగి నిరాలంబంబును నతీంద్రియంబును నైననిర్వాణంబుం బొందు నని యివ్విధంబున యోగప్రకారం బెఱింగించి మఱియు నప్పరమయోగి యలర్కున కిట్లనియె. 357

బ్రహ్మప్రాప్త్యుపాయము.

క. ఇనశశికరయోగంబుల, నినశశికాంతోపలముల నెమ్మెయి ననలం
బును సలిలము నుద్భూతము, లౌనరఁగ నగు నివ్విధములు యోగికి నుపమల్. 358

చ. విను నకులంబు బల్లి కలవింకము మూషక మర్థితో గృహం
బున వసియించి తద్విభులు పోలె సుఖస్థితి నొందు నాగృహం
బున శోకహాని యైనఁ జనుఁ బొంద వాకింతయు వంత తద్గృహ
స్థులక్రియ యోగి కయ్యుపమ చొప్పడఁ జొప్పడు యోగసిద్ధియున్. 359

క. తన కున్నయదియె యిల్లుగఁ, దనయాఁకలి కొదవినదియ తగుభోజ్యముగాఁ
దనకుఁ గలయుద్ధియ ధనముగ, మనమున ముద మందుయోగి మమతఁ బొరయునే?

వ. అని యోగులకు సెఱుంగ వలయువాని నెఱింగించిన నలర్కుండు పరమహర్షరసభరిత
హృదయుండ గుచు నందంద మ్రొక్కి యయ్యోగీంద్రుని కిట్లనియె. 361

సీ. భాగ్యంబు గాదె సుబాహుకాశీశులు పురముపై వచ్చి సంగరమునేఁత?
సంగరంబున సర్వసైన్యబాంధవధనక్షయ మగు టధికభాగ్యంబు గాదె?
కడ లేనిభాగ్యంబు గాదె శాత్రవబాధఁ దలరి యే మిమ్మిట్లు గొలువ రాక?
మిముఁ గన్నమాత్రన విమలాత్మబోధంబు కలిమి నాకొంటిభాగ్యంబు గాదె?
తే. వేయుఁ జెప్పంగ నేటికి విను శుభోద, యమున నరున కనర్థసహస్రమైన
నది శుభము చేయుఁ గావున నాసుబాహు, కాశిపులు నాకుఁ గడు నుపకారులైరి.

చ. పరమమునీంద్ర! కాశిపసుబాహునిమిత్తమున న్నృపత్వసా
దరుచిరదీపదీప్తి నిని హతం బయి పోయె మదంతరంగమం
ధురమమతాంధతామసము తోన పదస్థుఁడ నైతి దుఃఖదు
స్తరగృహధర్మ మేఁ దొఱఁగెద న్త్రిజగన్నుత! మీయనుజ్ఞతోన్. 363
క. అనిన విని యట్ల చేయుము, చను మేఁ జెప్పినవిధంబు నద్బుద్ధిం జే
కొను మమతాహంకృతులకు, మన సీకుము మోక్షవృత్తి మఱవకు మనఘా! 364

అలర్కసుబాహుకాశీరాజసంవాదము.

మ. అని దీవించిన మ్రొక్కి పీడ్కొని ముదం బార న్సుబాహుండు గా
శినృపాలుండును నున్నచోటికిఁ గడు న్శీఘ్రంబు మై నేఁగి యి
ట్లనియె న్నవ్వుచు నయ్యలర్కుఁడు సముద్యద్జ్ఞానవైరాగ్యసం
జనితానందనిమగ్నచిత్తుఁ డగుచు న్సంప్రీతిఁ గాశీశుతోన్. 365
క. ఓకాశీశ్వర! రాజ్యము, గైకొను మిచ్చితి సుఖంపు కడువేడుకతో
నీకుఁ బ్రియ మెట్టు లట్టుల, ప్రాకటముగ నిమ్ము దగ సుబాహునకైనన్. 366
వ. అనిన విని నవ్వి యమ్మహీపతి యలర్కున కిట్లనియె. 367
ఉ. క్షత్త్రియుఁ డెందు నాజి వెలిగా నిజరాజ్యము వైరి కిచ్చునే
క్షత్త్రియధర్మవేది విటు గా దన కెట్టులు పల్కి తావక
క్షేత్రమునందు శాత్రవుని గెల్చి ధరిత్రి పరిగ్రహించి స
త్క్షత్త్రియుఁ డెల్లభోగములు గైకొనుఁ గా కిటు లేల గైకొనున్. 368
క. అనిన నలర్కుం డిట్లను, జనవర మును నామనంబుచందము నీ చె
ప్పినయట్ల యిపుడు శాంతిం, దనరెడు మఱుఁడఁబడె వినుము తత్కారణమున్. 369
ఉ. నీవు సమస్తసైన్యమహనీయుఁడవై చనుదెంచి మత్పుర
శ్రీవిభవంబు సైన్యము నశింపఁగఁ జేసిన వంత నేను దుః

ఖావిలబుద్ధి నై చని మహాత్ముని నత్రితనూజు బ్రహ్మవి
ద్యావిదుఁ గంటిఁ దత్కృపఁ జిదాత్మవివేకము నన్నుఁ బొందినన్. 370

చ. లలిఁ బ్రసరించునింద్రియముల న్గుదియించి సమస్తసంగముం
దొలఁగఁగఁ ద్రోచి బ్రహ్మమున త్రోవకుఁ దెచ్చి మనంబు నెంతయుం
న్గలిచినవాఁడ నెమ్మనము గెల్చిన సిద్ధికి వేఱ యత్నము
న్వలవదు సేయ నెవ్వరి కవార్యపరాక్రమధుర్య యెప్పైయిన్. 371

చ. అరయఁగ నీచరాచరములందు వసించి వెలుంగుచున్నయ
ప్పురుషుఁ డొకండ కాఁగ నిజబోధవినిర్మలదృష్టిఁ గాంచి త
త్పరమతి నైన నాకుఁ బరిపంథివె నీవు నరేంద్ర! యేను నీ
కు రిపుఁడనే సుబాహుఁ డనఘుం డపకారపరుండె నాయెడన్? 372

వ. అని నీకు శత్రుం డొరుండు గలండేని వెదకి కొను మనిన నయ్యలర్కునివచనంబు
లకు నన్నరేంద్రుండు ప్రహృష్టహృదయుం డయ్యె సుబాహుండుదిగ్గన లేచి హర్షించి
యయ్యనుజుం గౌఁగిలించుకొని దీవించి కాశీశు నాలోకించి యేను నిన్ను శరణంబుఁ
జొచ్చి యిటఁ దెచ్చినకార్యంబు నాకు సఫలం బయ్యె సుఖివి గమ్ము పోయి వచ్చెద
ననిన నమ్మహీపతి యి ట్లనియె. 373

ఉ. కారణ మేమి నీవు ననుఁ గానఁగ రాకకుఁ గార్యసిద్ధి ని
న్జేరినచంద మెట్లు దగఁ జెప్పు వినం గడువేడ్క యయ్యెడు
న్గోరినయట్లు రాజ్య మనఘుం డగునీయనుజన్ము నొర్చి పెం
పారఁగఁ గొంటి నైకొను ముదాత్తసుఖస్థితి నందు మిప్పురిన్. 374

కాశీరాజునకు సుబాహుఁడు చెప్పినస్వాగమనకారణములు.

వ. అనిన సుబాహుండు నవ్వుచు ని ట్లనియె. 375

క. జనవర! నీయొద్దకుఁ బ్రియ, మొనరఁగఁ జనుదెంచి యింత యుద్యోగం జే
నొనరించుటకు నిమిత్తము, విను చెప్పెద నేర్పడంగ విమలచరిత్రా! 376

సీ. మాతల్లి నన్నును మాతోడఁ బుట్టినవారిని నిద్దఱ గారవమున
బాల్యంబు మొదలుగా బ్రహ్మబోధకవాక్యనిచయంబు వీనుల నించి నించి
విమలతత్త్వజ్ఞానవిదులుగ నొనరించి యితని బోధింపక వితతకర్మ
కాండప్రవీణుని గావించుటయుఁ దత్త్వ మూఢుండు గార్హస్థ్యమోహితుండు

తే. సతతసంసారభోగసంగతుఁడు నై యితండు చెడుటకు నేను చిత్తంబునందుఁ
బెరువు నడుచుసార్థమున నొక్కరుని కొకటి యైన సహాచరు ల్వగచినయట్ల వగచి.

చ. ఘనతరదుఃఖహేతు వెడఁ గల్గినఁ గాని విరక్తి పుట్ట దీ
తని కని నిశ్చయించి యుచితంబుగ నే నిను నట్టు లాశ్రయిం
చిన నృపవర్య! యుద్యమముఁ జేసితి నెంతయు నిట్లు నీకతం
బునఁ బ్రతికె న్నప్రబోధమును భూతవిరక్తియుఁ గల్గి యీతఁడున్. 378

వ. అని మఱియును. 379

క. అనఘ! మదాలస కడుపున, జనియించియు యోగిమాతచను గుడిచియుఁ బె
ర్గినతనయు లితరవనితల, తనయులు చనుత్రోవఁ జనఁగఁ దగియెదువారే? 380

చ. అనియుఁ దలంచి యేను భవదాశ్రయపూర్వక మైనయుద్యమం
బొనరఁగ నిట్లు చేసితి నృపోత్తమ! నీమహనీయసంగమం
బున ఫలియించె నాతలఁపు వోయెద నీ వభివృద్ధి నెప్పుడు
న్దనరుచు నుండు మాత్మతనుతత్త్వవివేకనిబద్ధబుద్ధి వై. 381

తే. అనిన నాతఁడు నీ వలర్కునకు నకట, పూని యుపకృతి చేసితి గాన నాకు
వలదె యుపకృతి సేయ సత్ఫలము గాక, సాధుసంగతి విఫలమె బోధనిలయ. 382

వ. అనిన సుబాహుం డమ్మహీపతితోడ ధర్మార్థకామసక్తులై నసకలజనంబులు నశియించు
చుందురు పరమం బైనయది మోక్షంబ దానిం బడయునుపాయంబు నీకు సంక్షేప
రూపంబునం జెప్పెద మనస్కరించి విని యాలోచించి యెట్లు మేలట్లు ప్రవర్తింపుము.

సీ. ఇది మదీయం బని యేఁ గర్తనని తోఁచుఁ బొందకు భ్రమ నిజబోధ మెఱుఁగు
మే నెవ్వఁ డనో నాయ దెయ్యదియో యని యాలోచనము సేయు మనుదినంబు
నపరరాత్రముల బాహ్యాంతరగతసితి యరయు మవ్యక్తాద్య మైనభూత
సంఘాత మెల్లను సవికారమును నచేతనమును నగుట గన్గొనుము భూప

తే. యిట్టు లెంతయు నేర్పడ నెఱుఁగఁబడియె, నేని నిఖిలంబు నీచేత నెఱుఁగఁబడిన
యదియె యాత్మవిజ్ఞాన మనాత్మయందుఁ,గలిమి మూఢత్వముగ మదిఁ దెలిసికొనుము.

క. అని చెప్పి యాసుబాహుఁడు, చనియెం గాశీశ్వరుండు సంప్రీతి నల
ర్కునిఁ బూజించి రయంబునఁ, దనపురమున కేఁగె బలవితానముతోడన్. 385

అడవి నలర్కునకు యోగాతిశయమున వైరాగ్యము.

తే. అంత సంత్యక్తసంగుఁ డై యయ్యలర్కుఁ, డఖిలసామ్రాజ్యభారవహనసమర్థుఁ
బ్రథమపుత్త్రుఁ బరాక్రమమథితశత్త్రు, నర్థిఁ బట్టంబు గట్టి తా నడవి కరిగె. 386

వ. అరిగి పెద్దకాలంబునకు నిర్ద్వంద్వలక్షానసిద్ధుం డై యతండు ససురాసురమానుషం బైనజగం
బింతయుఁ బుత్త్రకళత్రభ్రాతృమిత్త్రాదిభవపాశబద్ధంబును నిరింద్రియాకృష్యమాణం

బును ననంతదుఃఖార్తంబును విచ్ఛిన్నదర్శనంబును నైయజ్ఞానపంకంబునం బడి వెడల
నేరమియును దాను దానివలన సముత్తీర్ణుం డగుటయుం గాంచి యొక్కపద్యం
బిట్లు పఠించె. 387

తే. అకట! యింతకాలము రాజ్య మర్థితోడ, నింపుతోఁ జేసితిని యిసీ యిట్టికీడు
గలదు నా కిప్పు డింతయుం గానఁబడియె, యోగసుఖమునకంటె లే దొండుసుఖము.

వ. అని ప్రమోదభరితుం డయ్యె. 389

ఉ. కావున నయ్యలర్కవిభుకైవడి నిర్మలినాత్మయోగము
న్నీవును ముక్తిసిద్ధికయి నిష్ఠ నొనర్పు నిరంతరంబుఁ దం
డ్రీ! విను మింకఁ గర్మములత్రిక్కున నేనును జిక్క మోక్షల
క్ష్మీవితతానుభూతి కయి చేసెదఁ గానకు నేఁగి యత్నమున్. 390

క. అని చెప్పి జనకుననుమతి, ననఘుం డాసుమతి చనియె నప్పుడు కాఁ గా
ననమునకు నజ్జయ్యన న, త్యనుపమవైరాగ్యసంవిదమలాత్ముఁ డై. 391

వ. అంత నవిద్యాతమోజాలబాలదివాకరుం డగునబ్బాలునిజనకుం డాభార్గవుండును
గృహస్థత్వంబు విడిచి వానప్రస్థయత్యాశ్రమంబులం గ్రమంబునం గైకొని యింద్రి
యంబుల గెల్చి మనోజయంబు నొంది పరమసిద్ధిం బొందె నని చెప్పి. 392

ఆశ్వాసాంతము.

ఉ. భద్రగుణాభిరామ రిపుభంజనభీమ! సమగ్రధైర్య హే
మాద్రిసదృక్ష! సంతతదయారసరమ్యకటాక్ష! కామినీ
భద్ర! నితాంతభక్తిసముపాసితరుద్ర! వితీర్ణికేళిక
ల్పద్రుమతుల్యభూఁభుజభాస్వర! వైభవనిర్జరేశ్వరా! 393

క. ప్రౌఢస్త్రీమకరాంకా!, గాఢభజనసుప్రసన్నగరుడవృషాంకా!
గూఢనయతత్త్వవేదీ!, వ్యూఢప్రతిపక్షబలసముత్కటభేదీ! 394

మాలిని. శ్రుతసకలపురాణా! శుద్ధధర్మప్రవీణా!
వితతగుణవరేణ్యా! వీరలోకాగ్రగణ్యా!
సతతవినయముద్రా! సత్యసంపత్సముద్రా!
పతిహితనయదక్షా! పద్మపత్త్రాయతాక్షా! 395

గద్యము. ఇది శ్రీమదుభయకవిమిత్ర తిక్కనసోమయాజిప్రసాదలబ్ధసరస్వతీపాత్ర
తిక్కనామాత్యపుత్త్ర మారయనామధేయప్రణీతం బైన మార్కండేయమహాపురాణం
బునందుఁ గువలయాశ్వుండు తండ్రినియోగంబున మునిజనరక్షణార్థం బవనీతలంబునం

బరిభ్రమించుటయు మాయావి యైనతాళకేతునిచేతఁ గువలయాశ్వుండు మృతుం డయ్యె నని విని మదాలస మరణప్రాప్త యగుటయుఁ గువలయాశ్వుండు సకలవనితాభోగపరాఙ్ముఖుం డగుటయు నశ్వతరోరగేశ్వరుండు మదాలసం గ్రమ్మఱం బడయుటయుఁ గువలయాశ్వమదాలసాపునస్సంగమంబును శత్రుజితుండు పరలోకగతుం డగుటయు విక్రాంతసుబాహుశత్రుమర్దనులజన్మంబును వారల మదాలస పరమయోగులుగాఁ బ్రబోధించుటయు నలర్కోత్పత్తియు నక్కుమారునికి నయ్యోగిమాత రాజధర్మంబులు వర్ణధర్మంబులు నాశ్రమధర్మంబులు నాచారవిధులుం జెప్పుటయుఁ గువలయాశ్వుండు మదాలసాసహితంబుగ వనంబున కరుగుటయు నలర్కుని రాజ్యభోగాసక్తియు సుబాహుం డలర్కునిపురంబుపైఁ గాశీశ్వరుం దెచ్చుటయు శత్రుపీడార్తుండై యలర్కుండు మాతృదత్తాంగుళీయకాంతర్గతశాసనలిఖితపద్యపఠనంబున విరక్తిం బొంది దత్తాత్రేయుఁ గానం జనుటయు నయ్యోగీశ్వరుం డలర్కునకుం బరమయోగం బుపదేశించుటయు నలర్కుండు పరమసిద్ధిం బొందుటయు జడుండు తండ్రి కింతయు నెఱింగించి తా నరణ్యంబున కరిగి యోగపరాయణుం డగుటయు నాభార్గవుండు పుత్త్రునిచేత నియుక్తుం డయి గృహస్థత్వంబు విడిచి చని యత్యాశ్రమంబు ధరియించుటయు నన్నది దృతీయాశ్వాసము.

శ్రీరస్తు.

మార్కండేయపురాణము

చతుర్థాశ్వాసము.

శ్రీకంఠరుచిరచరణా
బ్జాకరసంతతవిహారహారిమరాళా
లోకస్తుత్యసుశీలా!
నాకాధిపవిభవపూర్ణ నాగయగన్నా.

వ. పరమజ్ఞానపక్షులు జైమినిముని కిట్లనిరి నీయడిగిన విధంబంతయుఁ గొఱంత పడ
కుండఁ జెప్పితి మింక నేమివలయు నడుగు మనిన నాద్వైపాయనశిష్యుం డిట్లనియె.

సీ. అక్కట! యిట్లు తిర్యక్త్వంబు నొందియుఁ జనకప్రసాదసంజనితమహిమ
నిర్మలవిజ్ఞాననిర్ధూతమోహుల రగుట ధన్యులరు మీరనఘులార!
సకలధర్మాధర్మ సంశయార్థములు నిర్ణీతమ్ము లయ్యె మీచేత నాకు
వితతప్రవృత్తినివృత్తికర్మద్వయ ఫణితు లేర్పడఁ జెప్పఁబడియె లోక

తే. గణ్యుఁ డైనమార్కండేయుఁ కతనఁ బుణ్య, తముఁడ నైతి మీయట్టియుత్తములఁ జేర
నరయ సంసృతిభ్రాంతులు నల్ప భాగ్య, పరులు మిముబోంట్లసంగతిపడయఁ గలరె!

తే. ప్రవిమలజ్ఞానదృష్టిసంపన్నులైన, మీవలన నేఁ గృతార్థుఁడఁ గావలదె
యొఱుఁగ వేడ్కయై యడిగెద నేను మిమ్ము, నర్థి నెఱిఁగింప మీరర్హు లగుటచేత. 4

సీ. స్థావరజంగమాత్మక మైనయీజగం బింతయు మున్ను దా నెట్లు పుట్టె?
కాలాంతమున నది క్రమ్మఱ నెట్టు లయం బందు సురలు సంయములు పితరు
లును రాజులును నెట్లు జననంబు నొందిరి మన్వంతరమ్ములమాడ్కి యెట్టు
వంశంబులును నొగి వంశానుచారిత్రమును నెట్టివవి సృష్టివిలయసంఖ్య

తే. యెంత కల్పవిభాగంబు లేక్రమముల, క్షోణియునికి యెట్టిది తత్ప్రమాణ మెంత
వారినిధులును నేఱులు ధారుణీధ, రములు నడవులు నేప్రకారమున నుండు. 5

క్రోష్టుకిమార్కండేయసంవాదము.

వ. భూర్లోకాదిసమస్తలోకంబులు నేక్రమంబున నున్నవి రవిచంద్రాదిగ్రహనక్షత్రజ్యోతిర్గణంబులగతిప్రకారంబు లెట్టివి యింతయు నుపసంహృతంబైనం దుది శేషించి యుండునది యెయ్యది నాకు విన వేడ్క యయ్యెడు నెఱింగింప వలయు నన్న నప్పక్షివరులు ప్రహృష్టహృదయు లగుచు జైమినీ! నీచేసినప్రశ్నం బతిగహనంబు దానికిం జెప్పెదము వినుము తొల్లి క్రోష్టుకి యనుమునివరుండు నీవు మమ్మడిగిన యట్లు మార్కండేయు నడిగిన నమ్మహాముని యతని కిట్లనియె నవ్యక్తంబువలన నావిర్భవించిన మాత్రన చతుర్ముఖునిముఖంబుల నిప్పురాణజాతంబును వేదంబులు నుద్భవిల్లె వానిం దదీయమానసపుత్త్రు లగుసప్తమును లన్నలువవలనఁ బడసి రట్టిపురాణజాతంబు భృగువువలనం జ్యవనుం డెఱింగి కొందఱు మునులకుం జెప్పె నమ్మునులు దక్షునికి నుపదేశించి రాదక్షునిచేత నేమును వింటిమి తత్పురాణకథితం బై కలికల్మషంబు నడంపంజాలునట్టిభూతసర్గంబు నెఱింగించెద మాకర్ణింపుము. 6

క్రోష్టుకికి మార్కండేయుఁడు చెప్పినమహదాదిభూతసర్గము.

తే. అనఘ! యింతకుఁ గారణ మై ప్రధాన, మనఁగ నవ్యక్త మనఁగ నిత్యయును సదస
దాత్మికయు నతిసూక్ష్మయు నై వెలుఁగు, నండ్రు మూలప్రకృతి విమలాత్మవిదులు.

వ. ప్రకృతివలన మహత్తు పుట్టె మహత్తువలన నహంకారంబు పుట్టె సాత్త్వికంబు రాజసంబు తామసంబు ననం ద్రివిధం బై వైకారికతైజసభూతాదు లనుపేళ్లఁ బరగె నందు భూతాది యగుతామసాహంకారంబువలన శబ్దతన్మాత్రంబు దానివలన నాకాశంబు నాకాశంబువలన స్పర్శతన్మాత్రంబు దాన వాయువు వాయువువలన రూపతన్మాత్రంబు దాన నగ్ని యగ్నివలన రసతన్మాత్రంబు దాన జలంబు జలంబువలన గంధతన్మాత్రంబు దానం బృథివి యావిర్భవించె నిది భూతతన్మాత్రసర్గప్రకారంబు తైజసంబగురాజసాహంకారంబువలన శ్రోత్రత్వక్చక్షుర్జిహ్వాఘ్రాణంబు లనుబుద్ధీంద్రియంబులేదును వాక్పాణిపాదపాయూపస్థ లనుకర్మేంద్రియంబు లేనునుం బుట్టె వైకారికంబగుసాత్త్వికాహంకారమువలన నింద్రియాధిదేవతలతోఁ గూడ మనస్సు పుట్టె శాంతంబు ఘోరంబులు మూఢంబులు విశేషంబు లనునామంబులం బరగునిమ్మహ్యాదిభూతంబు లేదును నానావిధవీర్యంబులు పృథగ్భూతంబులు నగుటం జేసి యేకత్వంబు వెలిగాఁ బ్రజల సృజియింపం జాల విట్టిభూతసప్తకసంయోగంబున జలంబున నెసఁగు బుద్బుదంబును బోలె నొకయండం బుద్భవిల్లి క్రమంబునం బ్రవర్ధిలి యుదకంబు నందుండ నమ్మహాండంబునందు క్షేత్రజ్ఞుండు బ్రహ్మ యనుపేర శరీరియుం బ్రథమపురుషుండును నిఖిలభూతాదికర్తయు నై యుదయించె నతనిం బొదివినయుల్బంబు మేరు నగంబును జరాయువు పర్వతంబులును నయ్యుమ్మనీరు సముద్రంబులు నయ్యె

నొండొంటికిం బదేసిమడుంగు లెక్కడైనపయస్తేజోవాయువియదహంకారాదిమహ
దవ్యక్తంబు లనుసప్తావరణంబులచేత నయ్యండంబు పొదువంబడి యుండు నిట్లుబుద్ధి
పూర్వంబును క్షేత్రజ్ఞాధిష్ఠితంబును నై తొలుతఁ బ్రాకృతసర్గం బావహిల్లె ననిన
మార్కండేయునకుం గ్రోష్టుకి యిట్లనియె. 8

బ్రహ్మజన్మము.

క. ఇల మొదలుగఁ గలభూత, మ్ములు క్రమ్మఱఁ బ్రకృతినడఁగి పోయినతుది ని
మ్ముల నుండునట్టి దొక్కటి, కలదో లేదో యెఱుంగఁ గాఁ జెప్పు తగన్. 9

క. అనిన భృగుకులవరేణ్యుం, డనఘా! విను మెప్పుడు ప్రకృతియం దడఁగుఁ గ్రమ
మ్మున భూతంబులు ప్రాకృత, మనువిలయం బండ్రు దాని ననఘ! మునీంద్రుల్. 10

వ. అపుడు సకలవికారంబులు నడంగినం బ్రకృతియుఁ బురుషుండును సాధర్మ్యంబునం
బొందుదురు తమస్సత్త్వంబులొండొంటింజొచ్చియెక్కువతక్కువలు లేక యుండుఁ
దైలంబు తిలలయందును ఘృతంబు దుగ్ధంబులయందు నుండునట్లు రజంబు తమస్స
త్త్వాంతర్గతం బై యుండు నట్లుండ నయ్యాదిపురుషునికి నాయువు రెండు పరార్థం
బులు పగలు నంతియ రాత్రియుం జనునంత నహర్ముఖంబునం బ్రబుద్ధుండై సర్వ
హితుండును జగదాదియుం నచింత్యుండు నైనపరమాత్ముండు ప్రకృతిపురుషులం
బ్రవేశించి. 11

ఆ. మధుమదంబు మలయమారుతంబును వధూ, జనుల గలఁచుపగిది శాశ్వతుండు.
పరమయోగమూర్తి పరమాత్ముఁ డయ్యుద్ధ, అను గలంచుటయును నొనర నంత. 12

వ. క్షోభ్యమాణం బైనప్రధానంబువలన మున్ను నీ కేను జెప్పినవిధంబున బ్రహ్మ యండ
కోశస్థుం డై యావిర్భవించె నాకర్ణింపుము. 13

క. కలఁచినపరమాత్ముండును, గలఁపంగాఁబడినప్రకృతికర్త పురుషుఁడు
న్దలఁపఁగ నొక్కఁడ కా మదిఁ, దెలియుము సద్విమలతత్త్వదృష్టి మునీంద్రా !41

సీ. అనఘ జగద్యోని యగుపురుషుండు నిర్గుణుఁ డయ్యుఁ దా రజోగుణము నొంది
బ్రహ్మ యై పుట్టి సర్గంబులం దెప్పుడు నఖిలప్రజాసృష్టి యాచరించు
విమలసత్త్వోన్నతి విష్ణుఁ డై పుట్టి ధర్మంబున లోకసంరక్ష సేయు
వితతతమోగుణావృతి రుద్రుఁ డై పుట్టి జగము లన్నియు నుపసంహరించు

తే. బీజములు చేన వెదవెట్టి ప్రీతిఁ గాచి, పండుటయుఁ గోయువాలికునిభంగి నొకఁడ
కాలములు మూటికిని దానె కర్త యగుచు, బ్రహ్మవిష్ణురుద్రాఖ్యలఁ బరగు సాత్మ.

క. అనఘా! రజంబు సత్త్వం, బును దమమును ననఁగఁ గలవు మూఁడుగుణంబు
ల్వాను బ్రహ్మవిష్ణుశంకరు, లనఁగా దేవతలు మువ్వు రఖిలజగములన్. 16

క. ఇతరేతరమిథునత్వము, నితరేతరసంశ్రయంబు నితరేతరసం
గతియుం మెఱయ నాదేవ, త్రితయము విహరించు లీలఁ ద్రివిధావస్థన్. 17

చతుర్యుగమన్వంతరకాలసంఖ్యలు.

వ. ఇట్లు జగంబులకు నాద్యుం డై యావిర్భవించినహిరణ్యగర్భుండు భూపద్మకర్ణికాసీనుం డై యుండు నాచతుర్ముఖునకుం బరమాయువు నూఱేండ్లు తత్ప్రమాణంబు వినుము నిమిషంబులు పదియేను కాష్ఠ కాష్ఠలు ముప్పది కళ కళలు ముప్పది ముహూర్తంబు ముహూర్తంబులు ముప్పది యహోరాత్రం బహోరాత్రంబులు పదియేను పక్షంబు పక్షంబులు రెండు మాసంబులు మాసషట్కం బయనం బయనద్వయంబు సంవత్సరంబయనంబు రెండు దేవతలకు నొక్కయహోరాత్రం బట్టియహోరాత్రంబు లైన దివ్యాబ్దంబులు పండ్రెండువేలు చతుర్యుగం బనఁ బరగు నందుఁ గృతయుగంబునకు సంఖ్య నాలుగువేలు దానిసంధ్యయుం సంధ్యాంశంబును నన్నూఱేసి త్రేతాయుగంబునకు సంఖ్య మూఁడువేలు దానిసంధ్యయుం సంధ్యాంశంబును మున్నూఱేసి ద్వాపరయుగంబునకు సంఖ్య రెండువేలు దానిసంధ్యయుం సంధ్యాంశంబును నిన్నూఱేసి కలియుగంబునకు సంఖ్య వేయి దానిసంధ్యయు సంధ్యాంశంబు నూఱేసి యిట్టిదివ్యాబ్దద్వాదశసహస్రంబును గలయట్టిమహాయుగంబులు వేయి బ్రహ్మకు దినం బనం జను. 18

చ. మను వుదయింపఁగా మునులు మానుగ నిర్జరవల్లభుండు న
య్యనిమిషులు న్మనుప్రభృతు లైననృపాలురు గల్గి పెంపున
న్ఘనముగ నుందు రమ్మనువుకాలము వోయినఁ బోదు రందఱు
న్మనువులు పుట్టి యిట్లు పదునల్వురు సెల్లుదు రద్దినంబునన్. 19

క. పదునలువురు మనువులు భూ, విదితముగ మహాయుగములు వేయిటిలోన
న్మదమున నొక్కొకరుఁడు డె,బ్బదియొక్కయుగమున కనఘ! పతి యగు వరుసన్.

వ. ఆడెబ్బదియొక్కమహాయుగంబులకు ముప్పదికోట్లు నఱువదియేడులక్షలు నిరువదివేలు మానుషాబ్దంబు లగు నిది మన్వంతరంబులవిధంబు మఱియు నొక్కమన్వంతరంబున దివ్యాబ్దంబులసంఖ్య యెనిమిదిలక్షలు నేఁబదిరెండువే లగు వానిం జతుర్దశగుణితంబుఁ జేసిన బ్రహ్మకు దినం బద్దినాంతంబునఁ గలుగులయంబు బుధులు నైమిత్తికం బని చెప్పుదు రప్పు డేకార్ణవం బై యుండు నజ్జలంబులయందు నారాయణాభిధానుం డై బ్రహ్మ తేలుచు నహఃప్రమాణరాత్రి యెల్లను నిద్రించి వేగుటయుం జెప్పటి యట్ల ప్రజల సృజియించు నట్టియహోరాత్రంబులం గలవర్షశతంబునందు. 21

తే. అనఘ యేఁబదియేండ్లు పరార్థ మనఁగ, నొనరు నింతకు ముందు బ్రహ్మ కొకపరార్థ
మరిగె దానియంతమునఁ బాద్మాభిధాన, కల్ప మయ్యె నుత్తమగుణాకల్పవిభవ!. 22

వ. ద్వితీయపరార్థంబునం దిప్పుడు వరాహకల్పంబు వర్తించుచున్నది యనిన మార్కండేయునకుఁ గ్రోష్టుకి మహాత్మా! ప్రజాపతి ప్రజల నెట్లు సృజియించుం జెప్పవే

యనిన నమ్మునీంద్రుండు పాద్మాభిధానకల్పాంతప్రళయనిశావసానసమయంబున
మేలుకాంచి శూన్యం బైనలోకంబు నాలోకించి. 23

సీ. నారాయణుం డగునలువ సముద్యద్వరాహరూపముఁ దాల్చి రభసలీల
సామవార్లోకపర్యంతంబు దొట్టిన యంబుపూరముఁ జొచ్చి యతలమునకు
నరిగి ధరిత్రి దంష్ట్రాంకురాగ్రంబున మెల్లన జలములమీఁది కెత్తె
నందుఁ బేరోడయందట్లు దేలుచు నున్న దాని సమస్థలిఁగా నొనర్చి

తే. ప్రళయపవనానలాహతిఁ బడినయట్టి, కులనగములు నిజస్థానములను నిలిపి
యేడుదీవులు వార్ధులు నేర్పరించి, యఖిలజగములు తొల్లిటియట్ల యొనిచి. 24

సురనరతిర్యగాదినవవిధసర్గములు.

వ. సృష్టిచింతాపరుం డైనయన్నలువముందట నవిద్య తమంబు మోహంబు మహామో
హంబు తామిస్రసంబంధంబు ననుసంజ్ఞల నేనుదెఱంగులై తోఁచిన వానిం బ్రజా
పతి బహిరంతఃప్రకాశరహితంబులు ముఖ్యంబులు నగువృక్షంబులుగాఁ బ్రథమసర్గం
బును దిర్యక్స్రోతస్సు తోఁచిన దానం దమోమయంబులు నంతఃప్రకాశంబులు నగు
పశుప్రముఖతిర్యగ్జంతువులుగా ద్వితీయసర్గంబును నూర్ధ్వస్రోతస్సు దోఁచిన దాన
సాత్వికులు బహిరంతఃప్రకాశులు సుఖులు నగుదేవతలుగాఁ దృతీయసర్గంబును నర్వా
క్స్రోతస్సు దోఁచిన దానం దమోరజస్సముద్రిక్తులును బహుదుఃఖవరులును బహి
రంతఃప్రకాశులు నగుమనుష్యులుగాఁ జతుర్థసర్గంబును గా నిర్మించి యాతఁడు తిర్య
గ్దేవమనుష్యులకు వృత్తులుగా విపర్యయంబును శక్తియు సిద్ధియుఁ దుష్టియు నను
నాలుగు దెఱంగులుగఁ గల్పించి పంచమం బగునను గ్రహసర్గంబు నిర్మించె మానస
సర్వతృప్తు లగుసప్తమునుల నుత్పాదించి కౌమారం బనుషష్ఠసర్గంబు నిర్మించె నిట్లు
బ్రహ్మవలన బుద్ధిపూర్వకంబు లగువైకృతసర్గంబు లాఱును బ్రహ్మకంటె మున్ను
ప్రకృతివలనం బుట్టిన మహత్సర్గంబును భూతతన్మాత్రసర్గంబును నింద్రియసర్గంబు
ననం బ్రాకృతసర్గంబులు మూఁడునుగా నివ్విధంబునం గల్పాదియందు నవవిధసర్గం
బులయ్యె ననిన విని క్రోష్టుకి యిట్లనియె. 25

బ్రహ్మావయవములనుండి ప్రజలయుత్పత్తిప్రకారము.

క. మునివల్లభ! సంక్షేపం, బునఁ జెప్పితి నీవు సర్గములవిధములు నా
కొనరంగఁ బ్రజలపుట్టువు, వినిపింపుము విస్తరించి విమలచరిత్రా!. 26

వ. అనిన మార్కండేయుం డిట్లనియె. 27

సీ. ప్రజల సృజింపఁగ నజుఁడు దామసశరీరముఁ దాల్చుటయు జఘనమున నసుర
లావిర్భవించి రయ్యంగంబు నిశ యయ్యె దీపితసత్వాన్యదేహుఁ డగుడు
నాననంబునఁ బుట్టి రమరు లాగాత్ర మహ స్సయ్యె వెండియు నట్టియొడలఁ
గైకొని పితృభావకలితుఁ డై యుండ ను ద్భవమైరి పితరు లాతనువు సంధ్య

తే. యయ్యె నతులరజోమయం బైనయట్టి, మేను పూనుటయును దాన మానవులు జ
నించి రది జ్యోత్స్న యయ్యె నక్తంచరాదు, లోలి బలవంతు లయ్యెయక్కాలములను.

వ. మఱియుం బ్రజాపతి రజస్తమోమయం బగురూపంబు గైకొని నిబిడాంధకారం బగు
నిశాసమయంబున క్షుత్పిపాసాపీడితులును విరూపశ్మశ్రుముఖులు నగువారలం బుట్టిం
చిన వారిలోనం గొంద ఱీశరీరంబు రక్షించెద మని పలికి రాక్షసు లైరి కొందఱు
భక్షించెద మని పలికి యక్షు లై రయ్యిరు దెఱంగులవారిం జూచి విపరించి కోపించినం
దదీయకేశంబులు విశీర్ణంబు లై రాలిన సర్పణంబు నొంది సర్పంబు లయ్యె వానిం
గని క్రుద్ధుం డై కపిలవర్ణంబు లుగ్రంబులు పిశితాశనంబు లగుభూతంబుల నిర్మించె
మఱియు మృదువాగ్ధ్యానపరుం డగుచు నలువకుఁ గొందఱు పుట్టి వాగ్ధ్యానపరు లగుట
గంధర్వు లనం బరగి రిట్లష్టవిధదేవయోనులను మానవులను సృజియించి. 29

క. తనమహితవయశ్శక్తిని, వినుము వయస్సంతతులను విమలతరాస్యం
బున నజనివహము వక్షం, బున నవికులములను నజుఁడు పుట్టించెఁ దగన్. 30

తే. ఉభయపార్శ్వంబులను దనయుదరమునను, నజుఁడు పుట్టించె గోనివహంబు ననఘ!
యతనిచరణంబులందు హస్త్యశ్వగవయ, రాసభోష్ట్రంబులను మృగప్రకరములను.

తే. ఫలములను మూలములఁ గడుఁబొలుచునోష, ధులనుగల్పాదిఁదనరోమములసృజించి
కమలగర్భుండు త్రేతాముఖమున వాని, ననఘ! పశువుల యజ్ఞయోగ్యములఁ జేసె.

వ. బ్రహ్మ ఋగ్వేదంబును గాయత్రీఛందంబును రథంతరసామంబును నగ్నిష్టోమయా
గంబును బూర్వముఖంబున యజుర్వేదంబును త్రిష్టుప్ఛందంబును బృహత్సామంబు
నుక్థ్యయజ్ఞంబును దక్షిణముఖంబున సామవేదంబును జగతీఛ్ఛందంబును వైరూపాతి
రాత్రక్రతువులును బశ్చిమముఖంబున నథర్వవేదంబును ననుష్టుప్ఛందంబును నప్తో
ర్యామముఖంబును నుత్తరముఖంబున నిర్మించె మేఘంబును మెఱుంగును నశనియుం
రోహితంబును నింద్రధనువును బుట్టించె మఱియు ననేకప్రకారంబు లగుచరాచర
భూతంబుల నక్షత్రగ్రహతారకాప్సరోగణంబులను సృజించె నది పూర్వసృష్టి యం
దెయ్యది యెట్లు వర్తించు నట్లు వర్తింపం దొడంగె నివ్విధంబున వేదసూక్తంబు
లందు దేవర్షిప్రభృతులకు నామరూపక్రియాదు లేక్రమంబునం జెప్పంబడె నా
క్రమంబునం గావించె ననినం గ్రోష్టుకి యిట్లనియె. 33

మనుష్యదంపతివర్ణగుణక్రియాదులు.

క. జను లర్వాక్స్రోతస్సున, జనియించుటఁ జెప్పి తెట్లు జనులకు నొనరిం
చె నజుం డొగి వర్ణంబులు, మునివర! గుణములును గర్మములుఁ జెప్పు తగన్. 34

సీ. అనిన మార్కండేయుఁ డను వినిపించెద బ్రహ్మ సృష్టిక్రియాపరత నొంది
వక్త్రంబునందును వక్షంబునందును దొడలయందును దనయడుగులందు

నుద్భవింపఁగఁ జేసె నొగి వేయి వేయేసి మిథునము ల్మిగుల నామిథునములును
గ్రమమున బ్రాహ్మణక్షత్త్రియవిట్ఛూద్ర సంజ్ఞలఁ జెలువొంది సంతతంబు

తే. సురతములు సల్పుచుండ నాసుందరులకు, ఋతువు నెలనెల లేమి సంతతులు సాల
నొదవ కాయుఁరంతమున నొక్కొక్కరుచిర,మిథునముదయింపఁ జొచ్చెసమిద్ధపుణ్యా!.

వ. ఇట్లు ప్రజాపతివలనం దొలుత మానుషసృష్టి యయ్యె నంతఁ దదన్వయజాతులైన స్త్రీపురుషులచేత జగంబును వృద్ధిఁ బొందె నవ్విధం బాకర్ణింపుము. 36

ఉ. ఆతతసైజతృప్తిప్రమదాంబుధిఁ దేలుచు లీల శీతవా
తాతపబాధలం బడక యాసతులు న్పతులు న్నిజేచ్ఛ ధా
త్రీతల మెల్లఁ ద్రిమ్మరుచు దివ్యనదీహ్రదసింధుతీరసం
జాతవనప్రదేశములు శైలతటంబులు నునికిపట్టుగాన్. 37

క. విహరణపరులై పశుమృగ, విహగాదులవలన నింత వెఱ పెఱుఁగక ని
స్పృహులై సుఖులై యుండఁగ, బహుకాలము సనియె నంత ప్రజలు మనమునన్.

పట్టణగ్రామఘోషాదిపరిమాణము.

వ. శీతోష్ణాదిద్వంద్వంబులచేతం బీడితులై తమ కునికిపట్టులు విచారించి సహజంబు లగు గిరిదుర్గవనదుర్గజలదుర్గంబులందు నివాసంబులు గావించి చతుర్థం బగు కృత్రిమదుర్గంబునవల శాస్త్రోక్తప్రమాణవృత్తాయతప్రాకారపరిఖావృతంబులుగాఁ బురఖేట ఖర్వటద్రోణీముఖంబులు రచియించి పెనుబయల మంత్రిసామంతగుప్తముగా శాఖానగరంబును గృషీవలశూద్రబహుళంబుగా గ్రామంబును గోగజాకీర్ణగోపాలజనోపేతంబుగా ఘోషంబును గడిభూమిం బరదేశబాధకదుష్టజనప్రాయంబుగా దృశియును నని ట్లష్టవిధంబులై యుండ నిర్మించి యందు గృహంబులును శాలలుం గల్పించుకొని శీతాతపాదిబాధల జయించి క్షుత్పిపాసార్తులై జీవనోపాయంబు చింతించుచుండ. 39

శా. త్రేతాది న్బహువర్షము ల్గురియ ధాత్రిం బుట్టె మున్నోషధీ
వ్రాతంబు ల్దమయంతఁ బుష్పఫలసంప్రాప్తి న్లతాగుల్మభూ
జాతంబు ల్విలసిల్లె నిమ్నగతవాస్సంవృత్తిమై నీమహీ
జాతంబు ల్గడు నుద్భవిల్లెఁ బ్రజకు న్సమ్మోద మేపారఁగాన్. 40

క. దున్నక వెదపెట్టక యుం,త్పన్నము లై నట్టివిపులబహుసస్యముల
న్నున్నగఁ గైకొని జను ల,త్యున్నతితో నెలమి బ్రతుకుచుండఁగ నంతన్. 41

చ. మనమున రాగలోభములు మత్సరముల్గడు నగ్గలింప న
జ్జనులు గడు న్మమత్వమున సస్యములు న్నదులు న్నగంబులు
న్వనములు వేఱువేఱ బలవంతులు లుబ్ధులు నై కడంగి కై
కొనిరి తదీయదోషమునఁ గుంభిని యౌషధుల న్గ్రసించినన్. 42

తే. పటుబుభుక్షార్తులై జను ల్బ్రహ్మకడకు, నరిగి శరణంబు వేఁడిన నతఁడు మేరు
భూధరముఁ గ్రేపుఁ గావించి భూమి గోవుఁ, జేసి పితికిన నోషధు ల్చెలువు మిగిలె.

గ్రామ్యారణ్యౌషధులు.

వ. వాని వెదపెట్టినఁ దద్బీజంబులు మొలచి పండునట్లుగా నక్కడ నుంచి యోషధులకు వ్యర్థత్వంబు లేకుండఁ బ్రజాపతి గావించె నది మొదలుగా సస్యంబులు కృషిక్రియా ప్రభవంబులగు యవవ్రీహిగోధూమతిలప్రియంగుమాషముద్గంబు లాదిగా గ్రామ్యంబులు పదియేడును నీవారశ్యామాకగవేధుక లాదిగా నాటవికంబు లేడును నై ఫలించుచుండునవి యజ్ఞయోగ్యంబులై యతిశయిల్లు. 44

ఆ. సహజవృత్తి నెద్ది సమకూరఁ గృతయుంగ, మహితవేళ సహజమానవులకు
సత్యధర్మములును సస్యసమృద్ధియుఁ, గల్గుచుండు నంతఁ గ్రమముతోడ. 45

చ. తిరముగ రేయునుం బగలుఁ దృష్ణ జనింపఁగ గోరుకోర్కుల
న్దొరకొనుసిద్ధుల న్జనులు దుష్టి వహించుచు నిత్యయౌవన
స్ఫురణల నుల్లసిల్లుచు నసూయయు వైరము నింత లేక యొం
డొరువులఁ గూడి మందు రధమోత్తము లెవ్వరు గాక తుల్యులై. 46

ఉ. వారు చతుస్సహస్రమితవత్సరజీవులు దంపతిప్రజా
ధారులునై నిజేచ్ఛల ముదంబున నుండఁగఁ గాలదీర్ఘతన్
వారికిఁ గామ్యసిద్ధు లొగి వమ్మయి పోయినఁ గల్పభూజముల్
చేరి తదాశ్రమంబుల వసింప సుఖించుచు నుండి రుండఁగన్. 47

సీ. త్రేతాయుగంబు వర్తింపఁ దొడంగిన నజ్జను ల్వ్రీదరాగాత్ము లైరి
ఋతువు తత్సతులకుఁ బ్రతిమాసములు గల్గె బహుళంబు లయ్యె నపత్యచయము
లంతఁ గల్పతరువు లడఁగిన నజ్జను లన్యభూరుహముల నాశ్రయించి
యం దుద్భవించుమహాపీన్యమధురసం బున సతతము తృప్తిఁ బొందు చుండ
తే. మోహలోభము లమ్మనమున మునుఁగు వడిన, నివి మదీయమ్ము లని యమ్మహీజములఁ బ
రిగ్రహించి రాదోషపరిగ్రహమున, నవియు మాయంబు లగుటయు నజ్జనములు.

బ్రాహ్మణాదుల స్థానములు.

ఆ. ఒనర దేశములకు నుర్వులకును మేరు, లలవరించి యంత నవ్విరించి
వరుసతోడ సర్వవర్ణాశ్రమాచార, విధము లేర్పడంగ విస్తరించి. 49

వ. బ్రాహ్మణులకుఁ బ్రాజాపత్యలోకంబును క్షత్రియులకు నింద్రలోకంబును వైశ్యులకు వాయులోకంబును శూద్రులకు గంధర్వలోకంబును బ్రహ్మచారులకు నూర్ధ్వరేతస్కులగు నష్టాశీతిసహస్రమునులస్థానంబును గృహస్థులకుఁ బ్రాజాపత్యస్థానంబును వానప్రస్థులకు సప్తఋషిస్థానంబును సన్న్యాసులకు బ్రహ్మస్థానంబును బరమయోగు

లకు నమృతస్థానంబును నివాసంబులుగాఁ గల్పించె నని చెప్పి మార్కండేయుండు
క్రోష్టుకి నిన్నిసర్గంబులకు మున్ను నలువ సృజించినకౌమారసర్గంబు తెఱం గాక
ర్ణింపుము. 50

క. సనకసనందనముఖమును, జనులం గల్పాది నజుఁడు సంపాదించె
న్వీను వారు పరమయోగా, గ్రనిరూఢత్వమున నూర్ధ్వరేతసు లైనన్. 51

వ. బ్రహ్మకు మహారోషం బుద్భవించినయది.

ఏకాదశరుద్రసర్గము.

క. తెలిగన్నుకవిలకన్నును, వలిచన్నును దృఢవిశాలవక్షము నెఱివే
నలి కెంజడలును గలిగిన, వెలఁదియు మగవాఁడు నైనవేల్పు నిల్చెన్. 53

క. నిలిచినఁ గనుఁగొని యిమ్మెయిఁ, గలసినయయ్యొడలు రెండుగా విభజింప
న్వలయు నని యజుఁడు పలికినఁ, బొలుపుగ నవ్వేల్పు సతియుఁ బురుషుఁడు నయ్యెన్.

క. ఆపురుషుం డేకాదశ,రూపమ్ములు దాల్చె వారు రుద్రు లనంగా
దీపించి రంత నా స్త్రీ, రూపంబును నతఁడు పెక్కురూపులు సేసెన్. 55

వ. మఱియుం బ్రజాపతి. 56

క. విను భృగుఁ బులస్త్యుఁ బులహుని, నొనరఁగ నంగిరసు నత్రి నొగిఁ గ్రతువు వసి
ష్ఠుని దక్షు మరీచి సృజించె నవబ్రహ్మలుగ నజుఁడు చిత్తస్మరణన్. 57

వ. సంకల్పుఁడును ధర్ముఁడు నన పుత్త్రులఁ బుట్టించి యవ్విరించి మఱియును. 58

స్వాయంభువమనుసంభవము.

క. వినుము ప్రజాపాలనపరు, ననుపమసత్త్వాభిరాము నాత్మసమాను
న్ఘను నాస్వాయంభువుఁ డను, మనువు న్శతరూప యనుకుమారి సృజించెన్. 59

తే. వారు దంపతు లయి ప్రియవ్రతుఁడు సద్గు,ణాఢ్యుఁ డుత్తానపాదుండు ననఁగ బరగు
సుతయుగంబును నూతిప్రసూతు లనఁగఁ, గన్యకల నిద్దఱను నొగిఁ గాంచి రెలమి. 60

దక్షసర్గము.

ఆ. ఆప్రసూతి దక్షుఁ డాకూతి నింపార, రుచియుఁ బెండ్లియైరి రుచికిఁ బుట్టి
రనఘ! దక్షిణయును యజ్ఞుండు వారికి, యామనామధేయు లైనసుతులు. 61

వ. పన్నిద్దఱు పుట్టిరి మఱి దక్షునకుం బ్రసూతికి నిరువదినలువురు కూఁతులు పుట్టి రందు
ధర్మునికిఁ బదుమువ్వురును భృగునికి ఖ్యాతియు భవునికి సతియు మరీచికి సం
భూతియు నంగిరసునకు స్మృతియుఁ బులస్త్యునకుఁ బ్రీతియుఁ బులహునకు క్షమ
యుఁ గ్రతువునకు సంతతియు నత్రికి ననసూయయు వసిష్ఠునకు నూర్జయు నగ్నికి
స్వాహయుఁ బితరులకు స్వధయు ననం బదునొక్కండ్రను భార్యలుగా నిచ్చె నా
ధర్మునికిం గ్రమంబున శ్రద్ధయందుఁ గాముండును లక్ష్మియందు దర్పకుండును ధృతి

యందు నియముండును దుష్టియందు సంతోషుండును బుష్టియందు లోభుండును మేధయందు శ్రుతుండు క్రియయందు నయవినయదండులును బుద్ధియందు బోధుండును లజ్జయందు వినయుండును వపువందు వ్యవసాయుండును శాంతియందు క్షేముండును సిద్ధియందు సుఖుండును గీర్తియందు యశుండును బుట్టిరి. మఱి శ్రద్ధాపుత్రుం డైనకామునికి మతికి హర్షుండు పుట్టె నధర్మునికి హింసకు నన్బృతుం డను కొడుకును నిర్బుతి యనుకూఁతురుం బుట్టి దంపతు లైరి పదంపడి వారికి భయుండును మాయయుం నరకుండును వేదనయు ననుమిథునద్వయంబు పుట్టె నమ్మాయకు నరకునికి మృత్యువు పుట్టె మృత్యువునకు వ్యాధిజరాశోకతృష్ణాక్రోధులును భయునికి వేదనకు దుఃఖుండును బుట్టిరి వా రందఱు నూర్ధ్వరేతస్కు లైరి నిర్బుతికి నలక్ష్మి యనుకూఁతురు పుట్టె దానికి మృత్యువు భర్త యయ్యె నామృత్యువునకు నలక్ష్మికిం బదునలువురు నందనులు గ్రమంబున. 62

చ. కలిగి యలక్ష్మిఁ జేయుచును గ్రక్కున మృత్యువు నావహించుచు
న్నెలకొని నాశకాలమున నెట్టన మర్త్యులఁ జొచ్చి యింద్రియ
ములు పదియింటనున్న దినిఁ బొంది యహంకృతిఁ జెంది బుద్ధియం
దొలసి కడు న్విమోహమున నొంది యజస్రము సూక్ష్మమూర్తు లై. 63

క. పురుషుల నెలఁతల విషయా, తురులుగఁ గలఁచుచు ననేకదురితకరులు గాఁ
బురికొలుపుచు రాగాదులఁ, బరిభూతులఁ జేయుఁ జిట్టు ప్రసరింతు రిలన్. 64

దుస్సహోత్పత్తి.

వ. అని చెప్పి మార్కండేయుండు విను మధర్మునికి నధోముఖుండును దంష్ట్రాకరాళుండును నతిభైరవారావుండును నైనపుత్త్రుండు దుస్సహుం డనువాఁ డుద్భవించి క్షుత్పిపాసాపీడితుం డై భువనంబులు భక్షింపఁ దొడంగిన బ్రహ్మ యతని కి ట్లనియె.

క. ఓహో! దుస్సహ! యీయుం, త్సాహము వల దుడుగు మలుక శమ మొందుము నీ
కాహార మగునె జగములు?, మోహమున రజస్తమముల మునుఁగకు మనినన్. 66

వ. ద్రుహిణునకు దుస్సహుం డి ట్లనియె. 67

తే. నోరు వఱువట్లు వట్టెడు నీరువట్టు, నిలువ రాదు పేరాఁకట నిమిష మైన
నెట్లు తృప్తుండ నగుదు లా వెట్లు గాంతు, నెందు వసియింతు నేఁ జెప్పవే మహాత్మ!

వ. అనిన బ్రహ్మ యి ట్లనియె. 69

బ్రహ్మ దుస్సహున కాహారాదుల నేర్పఱుచుట.

తే. జనులయిండులు నీకు నాశ్రయము ధర్మ, నియతి లేనివారలు విను నీకు బలము
నిత్యకృత్యక్రియాహాని నీకుఁ బుష్టి, యంబరము నీకు లూతాచయమ్ము సుమ్ము. 70

వ. నీ కాహారం బాకర్ణింపుము. 71

సీ. శునకేక్షితాన్నంబు వినుము కేశకీటదుష్టమ్మును భిన్నభాండస్థమును వ
దనగవ్యారమున నూఁదినయదియును వేఁడి గానిది పక్వంబు గానియదియు
నవని సంస్కృతి లేనియదియు శీర్ణాసన మున నుండియును విదిక్సుఖత సంధ్య
లందును గీతవాద్యంబులు వించు రజస్వలఁ జూచుచు జనులు గుడుచు

ఆ. నోదనములు మఱియు నొండుపహతిఁ బొంది, నట్టిభోజ్యసంచయములఁ బ్రీతి
నధికతృప్తిసేయు నాహారములుగ నా, చేత నిపుడు నీకుఁ జెప్పఁబడియె. 72

క. శ్రుతిశాస్త్రపురాణవినిం, దితకర్మము లాచరించుధీరహితునిదు
ష్కృతఫలముల నోదుస్సహ!, సతతంబును దృప్తి నీకు సంపాద్య మగున్. 73

తే. పంక్తిభేదవృథాపాకపాకభేద, కరుల నన్యోన్యసంతతకలహపరుల
గోగజాశ్వచయాపోషకులును నైన, నరులయిండుల నెందులఁ దిరుగుచుండు. 74

శా. నక్షత్రగ్రహపీడ లొందిన నొగి స్నానావిధోత్పాతము
ల్ప్రక్షోభించిన శాంతి సేయనినరు ల్గాదంబరీస్త్రీమృగ
వ్యాపాసక్తులు కృత్రిమవ్రతులు మిథ్యాచారు లాత్మీయధ
ర్మక్షీణు ల్భవదీయశాసనమున న్బ్రాపింతు రత్యంతమున్. 75

క. విను వైశ్వదేవ మొనరిం, చినతుది నీపేరు సెప్పి చెలువుగ బలి యి
చ్చినవారిసదనములకు, న్జనకుము విహరింపు మితరజనసదనములన్. 76

క. పితృదేవతార్చకులు సం, తతశుచులు నలోలుపులు జితస్త్రీకులు సం
స్కృతరుచిరాన్నభుజులు నగు, నతిపుణ్యులసదనములకు నరుగకు మెపుడున్. 77

క. బాలస్త్రీవృద్ధస్వజ, నాలికి నేయిండ్ల నెయ్య మగ్గలము కుల
స్త్రీలెందు బహిర్గమనవి, లోలలు కా రట్టియిండ్లలోను జొరకుమీ. 78

ఉ. బొంకక జీవహింసకుఁ బోవక యేరికిఁ జిత్తతాప మే
వంకను జేయ కీసుడిగి వైరము లేక శమంబు దాల్చి ని
శ్శంకత నైజధర్మములు సల్పుచు నెమ్మది నుండునన్నిరా
తంకులపుణ్యమందిరవితానముపొంతకుఁ బోకు దుస్సహా! 79

క. పతిభక్తి గలిగి పోష్యులు, పతి గుడిచిన మఱియుఁ గుడిచి పతిశుశ్రూషా
స్వితయై దుష్టస్త్రీసం, గతి సేయనియతివఁ జేరఁగా వలదు సుమీ! 80

క. అనలం బాఱక సలిలం, బును నెపుడును గల్గి తల్పములు ఘానుని గ
న్గొన రానిచోట నుండుస, దనములు దుస్సహా! రమాసదనములు సుమ్మీ! 81

క. విను దుస్సహా! విలసచ్చం, దనవీణాముకురమధుఘృతప్రతతియు గో
వుకు దామ్రపాత్రములు గల, జనమందిరములకు నీకుఁ జన రాదు సుమీ! 82

తే. అర్థి చేర్పడఁగా విను మాఁడువారు, మువ్వురు మగవార లేవురు మూఁడుధేను
వులును రేపులె వెలుఁగును గలమనుష్య, ని ల్లధర్మతనూజ! నీ కిరవు సుమ్ము. 83

క. విను మేఁక గొఱియలు మొదవు, లెనుములు తురగములు గజము లిం దొకటియు రెం
డును మూఁడును నేనును నా,ఱును నేడును నుండునది గుఱుతు నీ కుండన్. 84

క. కొడవలి గొడ్డలి పీఁటము, లెడనెడ నెరయంగ వైచునిండ్లను మఱి యొ
క్కెడ ఱోలును రోఁకళ్లను, నిడినగృహంబులును నీకు నిరవులు నిలువన్. 85

క. ఏయిండ్లను గొలుచు పరకు, సేయరు భోజ్యములు లెక్క సేయరు ధనురా
ద్యాయుధములు వైకొన రీ, వాయిండులఁ గేలి సలుపు మనవరతంబున్. 86

వ. అని బహువిధముల దుస్సహుని శాసించి ద్రుహిణుం డంతర్హితుం డయ్యె నంత. 87

దుస్సహసంతానదురాచారప్రకారము.

తే. కలికిభార్యకుఁ బుట్టినకన్యఁ బెండి, లయ్యె నిర్మాష్టి యనుదాని నయ్యధర్ము
కొడుకు దుస్సహుఁ డుజ్జ్వలగుణవరేణ్య!, వారి కిరువురకును విను వరుసతోడ. 88

వ. దంతాకృష్టియు నుక్తియుఁ బరివర్తియు నంగధుక్కును శకునియు గండప్రాంతరతి
యును గర్భహాండును సస్యహాండు ననుకొడుకు లెనమండ్రును నియోజిక విరోధిని
స్వయంహారిక భ్రామణి ఋతుహారిక స్మృతిహారిక బీజహారిక విద్వేషిణి యనుకూఁతు
లెనమండ్రునుం బుట్టిరి వార లొనరించుపనులు చెప్పెద దంతాకృష్టి యనువాఁడు
సుఖసుప్తులైనబాలుర దంతపఙ్క్తియందు వసియించి. 89

చ. పలు గొఱుకంగఁ జేయుచును వార్చుమనంబున దుస్సహాగమం
బు లఘువిచార! తత్ప్రశమనార్థముగా వెలియావ లారద
మ్ములపయిఁ బాన్పునందుఁ గడుఁ బోల్పుగఁ జల్లి సువర్చలావధీ
కలితజలంబు లార్చునది గ్రక్కున బాలు సమంత్రకంబుగాన్. 90

తే. ఉక్తి యనువాఁడు నృశుభాశుభోక్తులందుఁ, బలుకుచుండుఁ దథాస్తుశబ్దంబు గాన
నశుభవాక్యంబు వలవ దెప్డైన నాఁడ, వినియు నొనరించునది విష్ణునుతి నరుఁడు.

తే. ఒక్కవనితగర్భంబు వేఱొక్కవనిత, గర్భమునయందుఁ బెట్టు నొక్కరుఁడు ద్రోచి
పట్టి యాడంగ వచ్చినయట్టికలుకు, వీఁడు వడఁ జేయుఁ బరివర్తి విను మునీంద్ర!

వ. ఇట్లు గర్భపాతవాక్యస్ఖలనంబులు నిరూపించి సితసర్షపధారణంబున రక్షోఘ్నమంత్ర
జపంబులను రక్ష యొనరించునది. 93

క. అంగధుఁ డందు మనుష్యుల, యంగము లదరంగఁ జేసి యశుభము శుభము
న్సంగతముఁ జేయుఁ గుశలుఁ డ,డంగము మర్దనము సేయ నశుభం బడఁగున్. 94

తే. శకుని యనువాఁడు మృగపక్షిసమితిఁ బొంది, తద్గతిస్వరచేష్టాప్రదర్శనముల
శుభము నశుభము సూచించు శుభము గాని, శకునమునఁ గార్యమునకును జనుమగుద.

వ. గండప్రాంతరతి యనువాఁడు నరులగండప్రాంతముల ముహూర్తార్థంబు వసియించి ప్రారంభంబులు వారించుచుండు వానినెఱింగి బ్రాహ్మణవచనంబున దేవతాస్తోత్రం బును గ్రహనక్షత్రపూజనలను గోమూత్రసర్షపస్నానంబునను శాంతియొనరించునది.

క. లలనాగర్భంబులఁ గల,కలలంబుల మ్రింగుచుండు గర్భహుఁ డనువాఁ డలయక ప్రశస్తమంత్ర, మ్ములు వ్రాసి ధరింప శాంతిఁ బొందును వాఁడున్. 97

తే. సస్యహుం డనువాఁడు సస్యములయేపుఁ, జెఱుచు వానికి రక్షగాఁ జేనిచుట్టుఁ జెప్పుటట్లలు గట్టి విశిష్టబలి యొ,సఁగి యొనర్పఁగ వలెఁ జుమ్ము చంద్రవినుతి. 98

క. విను పరధనపరదారల, నొనర నియోగించునది నియోజిక దానిం గనుఁగొనుమనుజుం డిదియే, ననుఁ బ్రేరేచునది యని మనమున నచలుఁడై. 99

ఆ. దానిమర్మ మెఱిఁగి తాను గామక్రోధ, లోభమోహములకు లోను గాక యేను దీనివశతఁ బో నని ధృతి వహి, స్తోత్రజపము సేయఁ దొలఁగ దదియు. 100

తే. సతికి మగనికిఁ దండ్రికి సుతులకును సు,హృజ్జనులకు విరోధిని యెపుడు వైర ముల నొనర్చును దానికిఁ బూజ యొసఁగి, వాదహాసాతిరేకము ల్వలయు మాన. 101

సీ. కలన ధాన్యములు గోవులపొదుఁగులఁ బాలు పాలవలన నెయ్యి ప్రతి నూలు ఘనకుసుంభమునఁ దొగరు పానసమున నన్నము తిలలందుఁ దైలము హరించు నతిసూక్ష్మరూపిణి యై స్వయంహారిక తత్ప్రతీకారంబు తనగృహమునఁ దైద్వారమున నొక్కభామినిరూపంబు వ్రాసి దానికి బలు ల్వరున నిచ్చి

ఆ. హోమములును దేవయోగ్యధూపంబులు, వేసి నరుఁడు శాంతిఁ జేసి పాల కడవ మొదలుగాఁగఁ గలుగునన్నిటికి వి,భూతిరక్ష యిడఁగఁ బోలు ననఘ! 102

ఉ. భ్రామణి త్రిప్ప మానవులఁ బన్నుగ నొక్కెడ నుండ నీక యు ద్దామత సూక్ష్మబుద్ధి గని తజ్జ్ఞు లొగిన్ శయనాసనంబులన్ ధామమునందు సర్షపవితానము గాపుగఁ జల్లి మమ్ము నో భ్రామణి! పొమ్ము మింక నని పల్కి పఠింతురు భూమిసూక్తముల్. 103

చ. అతిపటుతూర్ణమంబు బుతుహారిక దా హరియించు దేవతా యతననుతీరచైత్యసరిదద్రితటంబులయందు మంత్రసం యుతసలిలాభిషేకమును నుత్తమభేషజసేవనంబు న య్యతివ నొనర్పఁ బంపునది యార్యజనంబులు తత్ప్రశాంతికిన్. 104

ఆ. తలఁపు నరున కడఁచుఁ దా స్మృతిహారిక, యది వివిక్తమైనయట్టిచోవ సింపఁ దొలఁగి పోవు దంపతిప్రజబీజ, హరణనిపుణ బీజహారిక యగు. 105

వ. అదియును మేధ్యాన్నభోజనస్నానంబుల శాంతిఁ బొందు. 106

క. ద్వేషిణి పురుషుల జనవి, ద్వేషులఁ గావించు సత్కృతిలలు మధువు త
ద్వేష మడఁగ వేల్చునది సు, భాషిణి యగుమిత్రవింద భక్తిఁ దలఁచుచున్. 107

వ. అని చెప్పి మార్కండేయుండు వెండియు నిట్లను దుస్సహునికొడుకులకును గూఁతులకును ముప్పదితొమ్మండ్రు బిడ్డలు పుట్టిరి వారిం జెప్పెద వినుము దంతాకృష్టికి విజల్పకలహ యనుకూఁతులు నుక్తికిఁ గాలజిహ్వుఁడును బరివర్తికి విరూపుండును వికృతుండును నంగయుండ్కనకుఁ బిశునుండును శకునికి శ్యేనకాకకపోతగృధ్రోలూకంబులును గండప్రాంతరతికిఁ గాలాభిధాను లార్వురు పుత్త్రులును గర్భహానకు విఘ్నుండును మేహన యనుకన్యయును సస్యహునికి క్షుద్రకుఁడును జన్మించిరి మఱియు నియోజికకుఁ బ్రచోదిక లనుకూఁతులు నలువురును విరోధినికిఁ జోదకుఁడు గ్రాహకుఁడు తమఃప్రచ్ఛాదకుఁడు స్వయంహారికకు సర్వహారియు నర్థహారియు వీర్యహారియు భ్రామిణికిఁ గాకజంఘుండును ఋతుహారికకుఁ గుచహారిణియు వ్యంజనహారికయు జాతహారిణియు ననుముగ్వురు కూఁతులును స్మృతిహారికకుఁ బ్రచండుండును బీజహారికకు వాతరూపయు నరూపయు ననుకన్యలిద్దఱును విద్వేషిణికి నపకర్షప్రకాశకులును బుట్టిరి పాపస్వభావం బైనయీసంతానంబుచేత జగంబంతయు వ్యాప్తం బైయుండు నిది తామససర్గం బనంబడు నింకరుద్రసర్గంబు చెప్పెద వినుము. 108

రుద్రసర్గము.

సీ. అజుఁడు కల్పాదియం దాత్మసన్నిభు నొక, యాత్మజుఁ బడయంగ నాత్మఁ దలఁచు
చుండ నద్దేవునియుత్సంగమున నొక్క నీలలోహితుఁ డగుబాలుఁ డుదయ
మై రోదనము సేయ నతని నేమిటి కేడ్చె దనుఁడు బ్రహ్మకు నిట్టు లనియె నతఁడు
నాకొక్కపే రిమ్ము నావుడు నవ్వేధ రోదనం బునఁగుము రుద్రుఁ డనఁగ
తే. వెండియు ననిన నారుద్రుఁడు వెగచివెగచి,యేడుమాఱులు మఱియును నేడ్చుటయును
నెఱఁగి యతనికిఁ జతురాస్యుఁ డిచ్చెఁ బ్రీతి,నేడునామములు దగ మునీంద్ర!వినుము.

వ. భవుండు శర్వుం డీశానుండు పశుపతి భీముం డుగ్రుండు మహాదేవుండు ననఁగ నిట్లిచ్చిననామంబులఁ బరగిరుద్రుండు సూర్యాంబుమహీవహ్నివాయుగగనదీక్షితసోములన నెనిమిది మూర్తు లయ్యె నాసూర్యాదులకు సువర్చలయు నుమయు వికేశియు స్వధయు స్వాహాయు దిశలును దీక్షయు రోహిణియు వరుసను భార్యలై రాభార్యల వలన శనైశ్చరుండును శుక్రుండును లోహితాంగుండును మనోజవుండును స్కందుండును స్వర్గుండును సంతోషుండును బుధుండును ననుపుత్త్రులు పుట్టి రంత. 110

ఉ. దక్షునినందన స్సతి ముదంబున రుద్రుఁడు పెండ్లి యయ్యె నా
దక్షునిమీఁదికోపమునఁ దత్సతి దేహము నీఱు చేసి తా

నక్షయపుణ్య మేనకకు నాహిమవంతునకు జనించె నా
దక్షమఘారి యగ్గిరిసుత వ్వరియించెఁ గరంబు నెమ్మితోన్. 111

క. ఆనగజతోడఁ బుట్టిన, మైనాకుఁ డనంతరత్నమహిమాన్వితుఁ డం
బోనిధి కిష్టసఖుం డై, తా నంద వసించి యుండెఁ దద్దయు నెమ్మిన్. 112

భృగ్వాదిసంతతి.

క. ఖ్యాతికి భృగునకుఁ బుట్టిరి, ధాతయును విధాతయును నుదాత్తగుణగణో
పేత యగులక్ష్మియును న, న్నాతికి నారాయణుండు నాథుం డయ్యెన్. 113

క. మేరువుకన్యలఁ బెండిలి, యై రాయతినియతులను లతాంగుల నొగిఁ బెం
పారఁగ ధాత విధాత యు, దారుఁడు ప్రాణుండు పుట్టె ధాతకు నంతన్. 114

వ. విధాతకు మృకండుఁడు పుట్టె మృకండునకు మనస్వినికి నేను జన్మించితి నాకు ధూ
మ్రావతికి వేదశిరుండు పుట్టె ధాతృపుత్త్రుం డగుప్రాణునికి ద్యుతిమంతుండు ప్రభ
వించె ద్యుతిమంతునకు నజరుం డావిర్భవించె నిట్లు భృగునికి సంతానంబు బహు
ళం బయ్యె. 115

క. విను సంభూతిమరీచుల, కొనరంగాఁ బౌర్ణమాసుఁ డుదయించె నతం
డును విరజుండునుఁ బర్వతుఁ, డను తనయులఁ బడసె మునిజనాగ్రేసరులన్. 116

వ. స్మృతికి నంగిరసునకు బృహస్పతిప్రముఖు లైనపుత్త్రులు సినీవాలీకుహూరాకానుమతు
లనుకూఁతులు పుట్టి రనసూయకు నత్రికి సోముండు దత్తాత్రేయుండు దుర్వాసుం
డును నుద్భవించిరి ప్రీతికిం బులస్త్యునకు దంతోని యనువాఁడు జన్మించెఁ బులహు
నికి క్షమకుఁ గర్దముండును వరీయసుండును సహిష్ణుండును బ్రభవించిరి క్రతువునకు
సంతతికి వాలఖిల్యాభిధాను లైనమును లఱువదివేవు రుదయించిరి వసిష్ఠునకు నూర్జకు
రజుండును గాత్రుండును నూర్ధ్వబాహుండును సవనుండును ననఘుండును సుతపుం
డును శుక్రుండును ననుమను లావిర్భవించిరి. 117

తే. అజునియగ్రనందనుఁ డగునగ్ని దేవు, వలనఁ దద్భార్య యైనయాస్వాహ గనియె
సుతులఁ బావకపవమానశుచుల ముగుర, నధిక తేజుల నఖిలలోకాభినుతుల. 118

క. ఘను లగునమ్మువ్వురకును, విను నలువదియేగు రుద్భవించిరి సుతు లా
తనయులు దండ్రులు దాతయు,నొనరఁగ నేఁబండ్రువహ్ను లొకఁడు కొఱఁతగాన్.

వ. ప్రజాపతిచేత సృజియింపఁబడినయగ్నిష్వాత్తాదిపితరులవలనఁ దత్పత్ని యైనస్వధా
దేవి మేన వైధారిణియు ననుకూఁతులం బడసె వారు బ్రహ్మవాదిను లై చని రిది రుద్ర
సర్గప్రకారం బని చెప్పిన విని మార్కండేయునకుం గ్రోష్టుకి యి ట్లనియె. 120

మనుద్వీపవర్షాధిపతులవివరణము.

క. స్వాయంభువమనుజన్మము, ధీయుత యొఱఁగించి తీ వతివ్యక్తముగా
నాయనకాలంబున సుర, నాయకుఁడును సురలు మునులు నరపాలకులున్. 121

తే. ఎవ్వ రెవ్వ రెఱింగింపవే మహాత్మ!, చెవులు చిడిముడి పడియెడుఁ దివిరి వినఁగ
ననిన భృగువంశవర్ధనుం డైనయమ్ము, నీశ్వరుండును క్రోష్టుకి నిట్టు లనియె. 122

వ. స్వాయంభువుండును స్వారోచిషుండును నుత్తముండును దామసుండును రైవతుండును జాక్షుషుండును నన నింతకుము న్నార్వురు మనువు లరిగి రిప్పు డేడవమను వైన వైవస్వతునికాలంబు వర్తించుచున్నది యింక సావర్ణు లను వా రేవురును రౌచ్యుండు భౌత్యుండు నన నేడ్వురు మనువులు గానున్నవారు వినుము తొల్లి ప్రథమత్రేతాయుగంబున స్వాయంభువమనుపుత్త్రుం డైనప్రియవ్రతునకుఁ గర్దమప్రజాపతిపుత్త్రి యైనవీర యనుదానికి సమ్రాట్టును గుక్షియు ననుకూఁతు లిద్దఱును నాగ్నీధ్రుండు మేధాతిథియు వపుష్మంతుండును జ్యోతిష్మంతుండును ద్యుతిమంతుండును భవ్యుండును సవనుండు ననుకొడుకులు పుట్టినం బ్రియవ్రతుం డానందనులయందుఁ గ్రమంబున జంబూద్వీపంబునకు నాగ్నీధ్రుండును బ్లక్షద్వీపంబునకు మేధాతిథియును శాల్మలీద్వీపంబునకు వపుష్మంతుండును గుశద్వీపంబునకు జ్యోతిష్మంతుండును గ్రౌంచద్వీపంబునకు ద్యుతిమంతుండును శాకద్వీపంబునకు భవ్యుండును బుష్కరద్వీపంబునకు సవనుండును నధిపతులుగఁ గావించె నంత. 123

సీ. వినుము మహావీర్యుఁడును ధాతకియు నను పుత్త్రులఁ బడసి తాఁ బుష్కరంబు
వారిపేళ్ళను రెండువర్షము ల్గావించి యిచ్చె నా సవనుఁ డయ్యిరువురకును
నిరుపముఁ డగుభవ్యునికి జలదకుమార సుకుమారులును మణీచకుఁడు మఱియుఁ
దగుకుశోత్తరుఁడు మేధావియును మహాద్రుముండు పుట్టుటయుం నతండు వారి
తే. కేడువురకు శాకద్వీప మేడువర్ష, ములుగ నొనరించి యొసఁగిన వెలసె నవియుం
వారిపేళ్లను బహువిధవస్తుబహుళ, ములును విపులభోగాస్పదములును నగుచు. 124

వ. ద్యుతిమంతుండు శలుఁడు మనోనుగుం దుష్ణుండు ప్రధానుం డర్థకారకుండు ముని దుందుభి యనుసుతులకుఁ గ్రౌంచద్వీప మేడువర్షములుగ నేర్పరించె నవి తదీయనామాంకితంబులై పరఁగె జ్యోతిష్మంతుండును గుశద్వీపంబు సప్తవర్షంబులు చేసి యుద్భిదుఁడు వైణవుఁడు సురథుఁడు లంబనుఁడు ధృతి ప్రభాకరుఁడు కపిలుఁడు ననుపుత్త్రసప్తకంబున కొసంగిన నవ్వర్షంబులు తదీయనామంబుల నతిశయిల్లె వపుష్మంతుఁడు శాల్మలిద్వీపంబును శ్వేతుండు హరితుఁడు జీమూతుఁడు రోహితుఁడు వైద్యుతుఁడు మానసుఁడు మహీధ్రుఁడు ననుపుత్త్రులకు నేడుభాగములుగా విభాగించి యిచ్చె నవ్వర్షంబులు తదభిధానఖ్యాతంబు లయ్యె మఱియును. 125

క. వినుతప్లక్షద్వీపం, బును మేధాతిథి యొనర్చెఁ బుత్త్రులపేళ్ళం
దనరంగ సప్తవర్షము, లనుపమగుణ! వినుము తెలియ నవ్వర్షంబుల్. 126

వ. శాంతభయంబును శిశిరంబును సుఖోదయంబును నానందంబును శివంబును క్షేమకం
బును ధ్రువంబును ననం బరఁగు ప్లక్షద్వీపంబు తుద శాకద్వీపంబు మొదలుగాఁగల
యేను దీవులును సర్వవర్ణాశ్రమాచారధర్మంబులు గలిగి యుండు జంబూద్వీపాధిపతి
యైనయాగ్నీధ్రునికి నాభి కింపురుషుండు వారివర్షుం డిలావృతుండు రమ్యుండు
హిరణ్యుండు కురుండు భద్రాశ్వుండు కేతుమాలుండు నన దొమ్మండ్రు పుత్త్రు
లుదయించి రందుఁ గింపురుషుఁ డాదిగా నెనమండ్ర హిమవదుత్తరభాగవర్షంబుల
కధిపతులం గావించిన నవి వారిపేళ్ళం బ్రసిద్ధంబు లయ్యె నవ్వర్షంబులందు. 127

తే. జరయుఁ దెవులును వగయును జోరయు ననఘ!, సుఖము లెప్పుడుఁ జుబ్బనచూఱలెల్ల
వారు సములె చతుర్యుగావస్థ చెంద, దందుఁ బుణ్యపాపములు లే వమితపుణ్య!.

తే. హిమనగేంద్రదక్షిణవర్ష మేలునాభి, యాత్మనందను ఋషభుని నధిపుఁ జేసి
యరిగెఁ గానకు నతఁడు నిజాత్మజన్ముఁ, డైనభరతుఁ బట్టము గట్టి యడవి కరిగె.

వ. ఆభరతునిపేర నివ్వర్షంబు భారతవర్షం బనం బొగడొందె భరతుండును నిజనంద
నుం డగుసుమతి నధిపతిం గావించి తపంబునకుఁ జనియె నివ్విధంబున స్వాయంభువ
మన్వంతరంబునం బ్రియవ్రతునిపుత్త్రులుం బౌత్త్రులును సప్తద్వీపంబులును బాలించి
రని చెప్పిన మార్కండేయునకుఁ గ్రోష్టుకి యి ట్లనియె. 130

బంబూద్వీపవర్ణనము

తే. ఎన్ని దీవులు జలనిధు లెన్ని నగము, లెన్ని వర్షంబు లెన్ని యిం దేఱు లెన్ని
యిలకుఁ జక్రవాళాద్రికిఁ గొలఁది యెంత, యినసుధాకరగతు లివి యెట్లు చెల్లు?

ఆ. విస్తరింపు నాకు విన వేడ్కయయ్యెడు, ననిన భార్గవుండు విను మునీంద్ర!
మున్ను నీకుఁ జెప్పినన్నియ దీవులు, గాని వేఱ లేవు మాననీయ! 132

వ. పృథివి పంచాశత్కోటియోజనవిస్తార యై యుండు నందు. 133

తే. వినుము లక్షయోజనముల విస్తృతులఁ బ్రదీప్త మై యొప్పు నేరేడుదీవిఁ దొట్టి
యొక్కటొకటికి రెట్టియై యుండుఁ బ్లక్ష, మాదిగాఁ గలయద్దీవు లాఱు ననఘ!

క. వితతలవణేక్షుమదిరా, ఘృతదధిదుగ్ధాంబుపూర్తి కీర్త్యము లై యీ
క్షితి నొలిఁ గలుగు జలనిధు, లతివిమలత నొకటి కొకటి యవి యినుమడి యై. 135

వ. లవణజలనిధివలయవలయితం బగుజంబూద్వీపంబు వినుము. 136

సీ. హిమవంతమును నట హేమకూటంబును నిషధంబు మేరువు నీలగిరియు
శ్వేతాచలంబును శృంగవంతంబును నవి వర్షశైలంబు లయ్యె నడిమి
నిషధనీలంబులనిడుపు లొక్కొకలక్ష యవల రెండును మఱి యివల రెండు
నొలిన పదియేసివేలయోజనములు తక్కువ లై యుండు నొక్కటొకటి

తే. విను మహాత్మ రెండువేలయోజనముల, పొడవు వెడల్పు గల్గి పూర్వపశ్చి
మాంబునిధులఁ గలసి యయ్యిరుమూఁడుకొం, డలును రత్నరుచుల వెలుఁగుచుండు.

వ. ఇప్పర్వతత్రితయంబులమధ్యంబునం జంద్రార్ధాకారంబై యిలావృతవర్షంబు శోభిల్లుఁ దానితూర్పున భద్రాశ్వవర్షంబును బశ్చిమంబునం గేతుమాలవర్షంబును నతిశయిల్లు దానిదక్షిణంబున హరివర్షకింపురుషవర్షభారతవర్షంబులు నొప్పు నుత్తరంబున రమ్యకహిరణ్యకవర్షంబులు పొలుచు నయ్యిలావృతవర్షంబునడుమ నెనుబదినాలుగువేలుయోజనంబులతనర్పును ముప్పదిరెండువేలయోజనంబులు మీఁదివిస్తారంబును బదాఱువేలయోజనంబులపాఁతును నంతియ క్రిందివెడల్పునుం గలిగి శరావంబుచందంబున సుందరంబై హేమనగంబు దేజరిల్లుచుండు. 138

క. అక్కనకశిఖరి యెనిమిది, దిక్కుల నింద్రాదినిఖిలదిక్పతిపురము
ల్లెక్కలి యగువిభవంబుల, నక్కజ మయి వెలుఁగుచుండు ననుపమచరితా! 139

వ. చతుర్దశయోజనోత్సేధంబైనయమ్మేరుమధ్యంబున బ్రహ్మపురము శోభిల్లుచుండు.

క. సితపీతాసితరక్త, ద్యుతు లమరఁగఁ గనకశిఖరితూర్పు మొదలుగాఁ
జతురాశల ధరణీంద్ర, వతపిట్యాచ్ఛద్రావనీశవర్ణాఖ్యలతోన్. 141

తే. అయుతయోజనోత్సేధంబులై సురాద్రి, నాల్గుదిక్కుల విష్కంభనగము లొప్పు
మందరంబును నొగి గంధమాదనంబు, విపులమును సుపార్శ్వంబును విమలపుణ్యా.

క. విను మేకాదశశతయో, జనదీర్ఘము లేతదీయశైలాగ్రములం
దనరుచుఁ బడగలక్రియఁ గడ, పనగము నేరేడు రావి వటమును వెలయున్. 143

ఉ. ఆరమణీయజంబువునయం దనిశంబును భూరిసింధుర
స్ఫారఫలంబు లన్నగముపైఁ బడి వ్రయ్యఁగఁ దద్రసంబు సొం
పార మహాప్రవాహనది యై దివిజాద్రి ప్రదక్షిణించి య
న్నేరెడుమ్రానిమూలమున నెక్కొని యుండు జగత్పవిత్రమై. 144

క. జంబూనదీజలస్ప, ర్శంబున సంజనిత మగుట జాంబూనదనా
మంబు ప్రసిద్ధముగ సువర్ణంబునకుం గలిగె మునిజనస్తవనీయా! 145

వ. దక్షిణోత్తరంబులు నిడుపులై నిషధనీలనగంబులఁ గదిసి మేరువుతూర్పున జఠరదేవకూటంబులును బశ్చిమంబున నిషధపారియాత్రకంబులుం బోలుచు నిషధనీలాచలంబులంతియ నిడుపు గలిగి పూర్వాపరాంబునిధులు చొచ్చి యక్కనకగిరిదక్షిణంబునం గైలాసహిమవంతంబులు నుత్తరంబున శృంగవంతంబును జారుధియును నను పర్వతంబులు నతిశయిల్లు నియ్యెనిమిదియును మర్యాదావనీధరంబు లని బుధులు సెప్పుదురు మఱియును హిమాలయహేమకూటంబు లాదిగాఁ గలవర్షశైలంబులనడిమిదక్షిణో

త్తరవిస్తారంబులు తొమ్మిదేసివేలయోజనంబులు నిలావృతవర్షవిస్తారంబు చతుర్దశ
సహస్రయోజనంబులు నై యుండు. 146

క. నారాయణుండు కూర్మము, నారయ మత్స్యంబు కిటియు నశ్వశిరుఁడు నై
ధారుణిచెలఁగుల నుండును, భారతకురుకేతుమాలభద్రాశ్వములన్. 147

తే. అనఘ! యీ నాల్గువర్షములందు నొగిని, వినుము నక్షత్రవిన్యాసమునను సకల
విషయములును నేర్పడియుండువివిధభంగి, గ్రహములొనరించుజాడలు గ్రందుకొనఁగ.

మేరువుచతుర్దిశల నుండుపర్వతాదులు.

వ. అని చెప్పి మేరువుచతుర్దిశలం జెలువొందుమందరాదిమహీధరంబులయందుం గల
వనంబులు గొలంకులుఁ జెప్పెద నాకర్ణింపుము. 149

తే. ప్రథమదిక్శైలమునఁ జైత్రరథము దక్షి,ణాలయంబున నందన మపరభూధ
రమున వైభ్రాజ మొగి నుత్తరంపుఁగొండ, యందు సావిత్ర మనువన మతిశయిల్లు.

క. అరుణోదమానసమ్ములు, నరయఁగ శీతోదమును మహాభద్రము న
న్సరసిరుహాకరములు మం, దరముఖచతురద్రిసానుతటముల నమరున్. 151

వ. మఱియు మేరుమహీధరంబుతూర్పున శీతాంతము సుకుంజము కంకవంతంబు మణి
శైలంబు సుమేషంబు ననునివి మొదలుగాఁ గలనగంబులు దక్షిణంబునం ద్రికూట
రుచకపతంగప్రభృతిపర్వతంబులు పశ్చిమంబున సువర్ణశిరవైడూర్యప్రముఖశిలో
చ్చయంబులు నుత్తరంబున శంఖకూటబుషభహంసనాభాదిమహీధరంబులును శో
భిల్లు చుండు. 152

చ. అనుపమరత్నదీప్తినివహస్ఫురితోన్నతశృంగదీప్తుల
న్వనరుహకైరవోత్పలనివాసమనోజ్ఞసరోవరంబుల
న్వనతరువల్లరీకుసుమవైభవసంపదసొంపున న్గడు
న్దనరుచు నుండు సంతతము తద్గిరులందు రమింతు రుత్తముల్. 153

చ. హిమకుధరోత్తరస్థితమహీధరమధ్యమునందుఁ బొల్చు దే
శము లభిరమ్యము ల్దివిజసాధ్యవియచ్చరసిద్ధకిన్నరా
శ్రమములు సర్వకాలబహుసౌఖ్యకరంబులు క్షుత్తృషామయ
శ్రమరహితమ్ము లుల్లసితసౌరభసంగిసమీరహృద్యముల్. 154

క. స్వర్గభువనమ్ముకంటె ని,రర్గళసుగుణముల కాశ్రయము లై భౌమ
స్వర్గము లనంగ నొప్పు ని,సర్గసుఖములను దదీయశైలాంతరముల్. 155

తే. అందు లేకుండుఁ బుణ్యపాపార్జనములు, పుణ్యఫలభోగులై మండ్రు పురుషు లెల్ల
భారతాదిచతుర్దికాపత్రమేరు, కర్ణికాస్థితి నిట్టి భూకమల మమరు. 156

చ. హిమగిరిదక్షిణంబున మునీశ్వర! పొల్పగు భారతాఖ్యవ
ర్షము విను కర్మభూమి యది సంతతము న్స్వపుణ్యపాపక
ర్మము లొనరించి యద్దివిజమానవనారకతిర్యగాదిజ
న్మములను నాకమోక్షములు మానుగఁ బొందుదు రందు నన్నరుల్. 157

వ. అని వెండియు మార్కండేయుండు. 158

గంగావతరణము.

సీ. మునిజనవల్లభ! వినుము ధ్రువాధార మైనవిష్ణుపదంబునందుఁ బుట్టి
గంగ నాఁగఁ ద్రిపథగామిని యైనయద్దేవి ము న్నమృతాంశుదివ్యతనువు
నం దొంది కడువృద్ధిఁ బొంది పవిత్రయై వడి వచ్చి మేరుపర్వతముమీఁదఁ
బడి నాల్గుతెఱఁగులై పరగి యగ్గిరితూర్పు నందు సుందర మగుమందరమున
తే. కొగి నరిగి సీత యను పేర నెగడి చైత్ర, రథవనము నరుణోదసరస్సుఁ జొచ్చి
యన్యనగములపైఁ బడి యవని కరిగి, జలధిఁ గూడె భద్రాశ్వవర్షంబునందు. 159

వ. ఆమేరువుదక్షిణంబునందు. 160

ఆ. అలక నంద నాఁగ నాగంగ గంధమా, దనముమీఁది కేఁగి దానిమీఁది
వనము గొలను దఱిసి వడిఁ ద్రిశిఖరిగిరి, మీఁది కేఁగి గిరులమీఁదుగాఁగ. 161

క. హిమగిరిమీఁదం జను నెడ, హిమగిరితనయేశుఁ డైనయీశానుం డిం
దుమణిమయమకుటరుచిరో, త్తమాంగమున గంగఁ దాల్చెఁ దాల్చి ముదమునన్.

వ. భగీరథతపస్సమారాధనప్రసన్నుండై భవానీవిభుండు హిమవంతంబుమీఁద నాగంగ
విడిచిన నది యేడుప్రవాహంబు లయ్యె నందు మూఁడుప్రవాహంబులు పూర్వము
ఖంబులు మూఁడుప్రవాహంబులు పశ్చిమముఖంబులు నైచని యుదధిం కలసె నేక
ప్రవాహరూపంబున భగీరథురథంబు ననుగమించి దక్షిణముఖంబై చని. 163

క. జలచరలోచన ఫేనో,జ్జ్వలహాస మరాళయాన చక్రస్తనమం
డల వీచీభ్రూవిభ్రమ, పులినజఘన గంగ వనధిఁ బొలుపుగఁ గూడెన్. 164

చ. కనకగిరీంద్రపశ్చిమముఖంబున నవ్విపులాద్రిమీఁదికి
న్జని వెస నమ్మహానది సుచక్షువు నా విలసిల్లి తద్వనం
బును గొలను న్వడిం దఱిసి పోయి నగంబు లతిక్రమించి త
ద్వననిధిఁ గేతుమాల మనువర్షమునం దొగిఁ గూడి రూఢిగన్. 165

చ. పరగి సురాచలోత్తరసుపార్శ్వనగంబున కేఁగి తత్సరో
వరము వనంబు సొచ్చి జనవందితయై యట శంఖకూటభూ
ధరముఖభూరిభూధరకదంబపదంబున డిగ్గి గంగ యు
త్తరకురుభూముల న్జలధిఁ దాఁ గలసె న్విను భద్రసోమ నాన్. 166

తే. అనఘ కింపురుషాదివర్షాష్టకమున, నెంతయును నొప్పఁ గులగిరు లేడు నేసి
నిర్మలోదకబహునదీనివహ మమరు, వ్యాధు లాధులు పాపము లందు లేవు. 167

వ. అనిన విని క్రోష్టుకి యి ట్లనియె. 168

భారతవర్షవిషయము.

క. యతివర! జంబూద్వీపస్థితి యంతయు నేర్పడఁగఁ జెప్పితి దగ భా
రతవర్షం బెట్టిది? సన్మతి దాని నెఱుఁగఁ జెప్పు మానుగ నాకున్. 169

వ. అనిన మార్కండేయుండు. 170

తే. పరమ యీభారతాహ్వయవర్షమునకుఁ, గలవు సెప్పెద నవభేదములు మునీంద్ర!
సాగరాంతరితంబులై జనుల కరుగ, రాని నెనిమిదిదీవులు వాని వినుము. 171

వ. ఇంద్రద్వీపంబును గేతుమంతంబును దామ్రవర్ణంబును గభస్తిమంతంబును నాగద్వీపంబును సౌమ్యంబును గాంధర్వంబును వారుణంబును నన దక్షిణోత్తరంబుల వేయేసి యోజనమ్ముల నిడుపై యుండు నందుఁ దూర్పుదీవులు కిరాతబహుళమ్ములు పడమటిదీవులు యవనసమన్వితమ్ములై యతిశయిల్లుచుండు బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రసమృద్ధంబును సాగరపరివృతంబును బుణ్యపాపార్జనస్థానంబును నై యనఘుం బైన యీభారతవర్షంబునందు. 172

క. వినుము మహేంద్రము మలయమ్మును సహ్యము శుక్తిమంతమును ఋక్షనగ
మ్మును వింధ్యపారియాత్రములును నన నేడు మిగులం బొలుచును గులగిరుల్. 173

వ. మఱియును. 174

సీ. లలితంబు లైనకోలాహలమందర వైభ్రాజదర్దురవైద్యుతములు
శాంతంబు లైనతుంగప్రస్థమైనాక సురసపాండురపుష్పగిరులుఁ గరము
పొలు పైనరైవతార్బుదఋశ్యమూకగోధనకూటశైలంబులును సమున్న
తము లైనయాజయంతంబు గోమంతంబు భాసురం బైనశ్రీపర్వతంబు

తే. వినుత మైనచకోరంబు నన మహాద్రు, లమరు మఱియు ననేకంబు లల్పనగము
లమ్మహాచలమ్ములచుట్టు నతిశయిల్లు, జనపదంబు లార్యములు మ్లేచ్ఛములు ననఁగ.

వ. ఇంక మహానదులవిధంబు వినుము గంగ సరస్వతి చంద్రభాగ యమున శతద్రువు శరావతి కుహువు గోమతి బాహుద దృషద్వతి విపాశ దేవిక గండకి కౌశికి యను నేఱులు హిమవత్పాదంబునం బ్రభవించె వేదస్మృతి వేత్రవతి ధాతుఘ్ని మండల సీరావతి విదిశ చర్మణ్వతి వేదవతి వేణ్యా క్షిప్ర యవంతి యనుసింధువులు పారియాత్రాచలంబున నుదయించె శోణము మహానదము రుక్మద సురథ క్రియ మందాకిని దశార్ణ చిత్రకూట చిత్రోత్పల తమస కరతోయ పిశాచిక పిప్పల శ్రోణి విపాశ వంజాల సుమేరుజ ముక్తిమతి ముద్గలి యనుతరంగిణులు ఋక్షవంతంబున నావిర్భ

వించె సువాహిని పయోష్ణి నిర్వింధ్య నిషధావతి వైతరణి సినీవాలి కుముద్వతి మహాగౌరి దుర్గ యంతశ్శిర యనుమహావాహినులు వింధ్యంబునం బుట్టె గోదావరి భీమరథి కృష్ణవేణి తుంగభద్ర సుప్రయోగ కావేరి యనునదులు సహ్యపర్వతంబున నుద్భవించెఁ గృతమాల తామ్రపర్ణి పుష్పజాతి యుత్పలావతి యను నీనదులు మలయాచలంబున నుదయించెఁ బితృసోమ ఋషికుల్య యిల లాంగూలిని వంశకర యను స్రోతస్వినులు మహేంద్రంబున జనించె ఋషికుల్య కుమారి మందగ మందవాహిని పలాశిని యనుతటినులు శుక్తిమంతంబున నవతరించె నని చెప్పి. 176

క. విను గంగ లన సరస్వతు, లనఁగాఁ బెంపొంది యిమ్మహానదు లెల్ల
న్వననిధిఁ గూడి సకలజగ,మునకుం దల్లు లయి పాపములఁ బొలియించున్. 177

వ. మఱియును క్షుద్రనదులు పెక్కుగల వవి వర్షకాలతోయంబులును సర్వకాలతోయంబులును గల్గియుండు నని వెండియు. 178

క. సురుచిర మగుసహ్యనగో,త్తరమున విలసిల్లుచుండుఁ దద్దయు గోదా
వరి తత్ప్రదేశము మనో,హరము పవిత్రము మునీంద్ర! యఖిలధరిత్రిన్. 179

తే. మత్స్య మశ్వంబు కూటంబు మఱియుఁ గుల్య, కుంతలంబులు గాశియుఁ గోసలంబు
నాదిగా మధ్యదేశంబునందుఁ బొలుచు, జనపదంబులు సతతంబు మునివరేణ్య! 180

వ. ఆమధ్యదేశంబునకు నుదీచ్యంబులై భార్గవపురంబును బాహ్లీక వాట ధానాభీర గాంధార సింధు సౌవీర మద్ర కేకయ కాంభోజ దరద బర్బర చీన కాశ్మీర హుహూకాదులును బ్రాచ్యంబులై యంతర్గిరి మలద మలవర్జిక ప్రాగ్జ్యోతిష విదేహ తామ్రలిప్తక మల్ల మాగధాదులును దాక్షిణాత్యంబులై పాండ్య కేరళ చోళ కుల్య మహారాష్ట్ర మహిష కళింగ విదర్భ కుంత లాంధ్రాదులును బ్రతీచ్యంబులై సూర్యారక పుళింద సారస్వత సౌరాష్ట్రావంతాదిజనపదంబు లభిరమ్యంబు లగు మఱియు వింధ్యాదిపర్వతాశ్రయంబులయందుఁ గురుష్మేల కోత్తమార్ణ దశార్ణ భోజ కిష్కింధక కోసల నూపుర తుంబుర నైషధ వీరహోత్ర నీహార త్రిగర్తాదిదేశంబులు సమస్తవస్తు సంపద్భరితంబులై యుండు జలనిధివలయవలయితపూర్వదక్షిణాపరం బైన యిట్టిభారతవర్షంబునకు నుత్తరంబున హిమవంతంబు కార్ముకంబునకు గొనయంబును బోలె శోభిల్లు. 181

చ. పరమమునీంద్ర! యంతకును భారతవర్షము బీజ మిందయి
న్నరులు శుభక్రియాపరత నాకసుఖానుభవంబు బ్రహ్మతా
మరవిభుతామరత్వములు మానుగఁ గాంతురు సేయు నేల తా
నరయఁగఁ గర్మభూమి యిది యన్యము లన్నియు భోగదేశముల్. 182

శ్రీకూర్మసంస్థానవర్ణనము.

మ. అనినం గ్రోష్టుకి సంతల్లి మునిముఖ్యా! చెప్పితి విట్టు లిం
పొనర న్భారతవర్షభంగి వినఁగా నుల్లంబున న్వేడ్క యిం

కను సంధిల్లెడుఁ జెప్పవే కమలభవుఁ గంజాక్షుఁ డింద్రుండుఁ దా
నని ము న్నానతి యిచ్చి తె ట్లచటఁ దా నద్దేవుఁ డుండు న్దగన్. 183

వ. అని యడిగిన భృగుపౌత్రుం డి ట్లనియె. 184

సీ. హరి కూర్మరూపంబు ధరియించి భారతవర్షంబునందు సంవ్యాప్తి నొందెఁ
బ్రాగ్వదనుండు నపరపుచ్ఛుఁడును దక్షిణోత్తరపార్శ్వుండు నొగిని శాంతవ
హాశాదివిదిగన్వితాంఘ్రిచతుష్కుండు నై యుండుఁ గృత్తిక యాది గాఁగ
నక్రమతంబుమధ్యంబున నుండి వక్త్రంబును మొదలుగా దక్షిణముగ

తే. ననఘ తన్నవాంగమ్ములయందు మూఁడు, నేసి తారలు నడుమ వసించు నెపుడు
తత్తదంగదేశస్థితతారకముల, ఫలమునుం గ్రహఫలములు వలయు నెఱుఁగ. 185

క. విను నక్షత్రగ్రహవశ, మున దేశంబులకు నశుభమును శుభమును బై
కొనుఁ దత్పీడల విబుధులు, కని శాంతి యొనర్పవలయుఁ గ్రక్కున ననఘా! 186

తే. పుణ్యవంతుల గ్రహపీడ పొందఁ జాల, దతనిపశుమిత్రబంధుభార్యాత్మజులకు
భయము పుట్టించు మునివర! భాగ్యహీనుఁ, డైనపాపాత్ము నడుగక యలఁచుచుండు.

వ. కావున నక్షత్రగ్రహపీడ లెఱింగి బుద్ధిపరుం డగునరుండు వానికి శాంతి సేయవలయు.

తే. అనఘ! నక్షత్రముల నెల్ల నాశ్రయించి, యుండుదురు దేవతలు వారి కొగి విశిష్ట
పూజ లొనరింపఁ బీడలు పొంద వధిక, మైనశుభమును వా రిత్తురు మానవులకు.

వ. కూర్మమధ్యంబు మొదలుగా నున్నకృత్తికాది సప్తవింశతినక్షత్రంబులయందుఁ దొమ్మి
దేసిపాదంబుల కొక్కరాశిగా వృషభాదిరాసులు పండ్రెండు నక్రమతంబునవయ
వంబులం బ్రదక్షిణించి యుండు నిట్లు నక్షత్రంబులందు రాసులును రాసులయందు
గ్రహంబులును వసియించుం గావున గ్రహనక్షత్రపీడలం జేసి దేశపీడ లౌట నిశ్చ
యించి స్నానదానజపహోమాదుల శాంతి సేయునది యిది జగత్కారణం బైన
నారాయణుండు కూర్మరూపంబున నున్న విధం బని చెప్పి మఱియును. 190

క. నన్నాఱును మున్నాఱును, నిన్నాఱును నూఱు నేఁడు లీవర్షమున
న్నన్నుత నాలుగుయుగముల, కిన్నరులకుఁ గలుగునాయు విద్ధచరిత్రా! 191

వ. అని భారతవర్షప్రకారంబుఁ జెప్పి మార్కండేయుండు. 192

భద్రాశ్వవర్షవర్ణనము.

సీ. భద్రాశ్వవర్షప్రభావంబు వినుము శైవాలనీలశ్వేతవర్ణపర్ణ
శాలాగ్రములు శాలజంబులు నన నేను కులశిలోచ్చయములు వెలుఁగుచుండు
క్షుద్రాచలంబులు గొలఁదికి మేయేసి పడసినదేశము ల్బహుసహస్ర
సంఖ్యలఁ బొలుపారు శంఖావతియు శీత యును భద్ర యనునదు లొప్పుచుండు

తే. జనులు శంఖహేమసదృశతనుద్యుతి, భాస్వరులును బుణ్యపరులు సములు
సకలసుగుణయుతులు శతసమాయుషులు నై, యుండ్రు మునివరేణ్య! మనుజు లెల్ల.

వ. అందు జనార్దనుం డశ్వశిరుండును జతుర్భుజుండును నై. 194

క. విలసిల్లు నమ్మహాత్ముని, తల హృదయము లింగ మంఘ్రితలములు హస్త
మ్ములు కన్నులు నను సెలవుల, నెలకొను విను కృత్తికాదినిఖిలర్క్షములున్. 195

కేతుమాలవర్షవర్ణనము.

క. విమలము కృష్ణము విశో, కమును జయంతంబు హరినగము ననఘ! విశా
లము వర్ధమానమును నా, నమరు గిరులు కేతుమాల మనువర్షమునన్. 196

చ. మఱియు ననేకభూధరసమాజములందుఁ గడు న్వెలుంగు న
త్తెఱఁగున నుల్లసిల్లు బహుదేశసహస్రములందు సంపద
న్మెఱయుచు నుండుఁ గామిని సుమేధయుఁ జక్షువునాఁగ నేఱు లే
ర్తెఱ జనులెల్ల నెప్పుడు తదీయజలంబులు ద్రావి తృప్తులై. 197

గీ. బ్రతుకుదురు నూఱులేసియబ్దంబులందు, హరివరాహరూపంబున నమరునతని
పాదవదనహృదయపుచ్ఛపార్శ్వములఁ గ్ర, మమునఁ గృత్తికాముఖతారకములువోలుచు.

కురువర్షవర్ణనము.

మ. కురువర్షంబు మనోహరంబు సుమనోగుచ్ఛమ్ముల న్సత్ఫలో
త్కరగుచ్ఛంబుల నొప్పి కల్పతరుసంతానంబు లిష్టాగము
ల్గురియ న్వస్త్రవిభూషణాదు లొగిఁ గైకొంచు న్మనుష్యు ల్సుఖిం
తురు దా రందు సుగంధబంధురమరుత్పుష్టప్రమోదాత్ములై. 199

క. మిథునములై పుట్టి జనులు, మిథోనురాగములఁ జాల మెఱసి బహుమనో
రథసుఖము లనుభవించుచు, రథాంగమిథునములమాడ్కి రమియింతు రొగిన్. 200

గీ. అమరలోకపరిచ్యుతు లైనవారు, వచ్చి జన్మింతు రాకురువర్షభూమి
వినుము వారికిఁ బదునాల్గువేలమీఁద, నయిదునూఱులు వర్షము లాయు వనఘ! 201

సీ. సురుచిరశశికాంతసూర్యకాంతాచలమ్ములు రెండు వెల్గు నాభూమి వాని
మధ్యంబునందు నిర్మలజలౌఘిని భద్ర సోమతరంగిణి సొంపు మిగులు
నన్నపర్వతములు నమృతకల్పము లైన ఫలముల విలసిల్లు బహువనములు
క్షీరవాహినులకు ఘృతవాహినీదధి కుల్యలకును నందుఁ గొలఁది లేదు

ఆ. మహితమత్స్యరూపమహనీయుఁ డగువిష్ణు, నవవిధంబు లయినయవయవములఁ
దారకములు జనపదంబులు నెప్పటి, యట్ల పొలుచు మునివరాగ్రగణ్య! 202

కింపురుషవర్షవర్ణనము.

వ. కింపురుషవర్షంబున బురుషులు పండితులు దశసహస్రవర్షంబు లాయువు గల్గి

రుజాశోకభయంబులం బొరయక మనోహరేక్షురసాహారంబునం దృప్తు లగుచుండు
రందు. 203

క. లలనలు శోభిల్లుదు రు, త్పలగంధులు దళితకమలదళనయనలు న
స్ఖలితనవయౌవనులు ను, జ్జ్వలమృదులాంగులును బూర్ణచంద్రముఖులు నై. 204

హరివర్షవర్ణనము.

మ. హరివర్షంబు సుఖాస్పదం బయ్యుం దద్వర్షాయుష్కు లామర్త్యు లి
క్షురసాస్వాదనతృప్తు లామయజరాశోకవ్యపేతాత్ము లు
ర్వరజాంబూనదరుగ్విడంబితతనూవర్ణు లనోజాకృతు
ల్సురలోకచ్యుతు లందుఁ బుట్టుదురు సంశుద్ధస్వభావాత్మకుల్. 205

ఇలావృతవర్షవర్ణనము.

చ. అలఘుసుమేరుదీపిత మిలావృతవర్షము చంద్రసూర్యదీ
ప్తులు గ్రహతారకద్యుతులు దోఁప వొకప్పుడు నందు సుందరో
జ్జ్వలకమలప్రభాంగులును వారిరుహాయతపత్రనేత్రలు
న్జలరుహగంధులు న్విపులసౌఖ్యసమేతులు సూవె తజ్జనుల్. 206

క. జంబూఫలరస మాహా, రంబుగ సజ్జనము లెలమి బ్రదుకుదు రనురా
గంబు మనంబులఁ గరము భృ, శంబుగఁ బదుమూఁడువేలు సంవత్సరముల్. 207

రమ్యకవర్షవర్ణనము.

ఉ. రమ్యకవర్ష మెంతయును రమ్యము తజ్జను లెన్నఁడు న్జరా
గమ్యులు గారు నిర్మలులు గామసుఖప్రియు లుజ్జ్వలాకృతు
ల్సౌమ్యు లనేకపాదఫలసంస్కృతసారరసైకభోజను
ల్గ్రామ్యము లొల్ల రుండుదు రకల్మషులై పదివేలువర్షముల్. 208

హిరణ్మయవర్షవర్ణనము.

క. అనఘ! హిరణ్మయవర్షం, బున హైరణ్వతి యనంగఁ బొలుచు నొకమహా
ధుని మధురవారిపూర్ణయుఁ, గనకకమలకమ్రకాంతకమనీయయు నై. 209

క. అనుపమబలులును తేజో, ధనులును దీర్ఘాయువులును ధనికులుఁ బ్రియద
ర్శనులును సత్త్వాధికులును, ననామయులుఁ బుణ్యపరులు నందలిజనముల్. 210

స్వారోచిషమనుచరిత్రము.

క. అనిచెప్పిన వినిక్రోష్టుకి, మనమునఁ గడు సంతసిల్లి మార్కండేయుం
గనుఁగొని యే నడిగినవిధ, మనఘా! యేర్పడఁగఁ జెప్పి తంతయుఁ బ్రీతిన్. 211

వ. స్వాయంభువమన్వంతరం బేమనువు వర్తించె నతనికాలంబునం గలదేవతలు ఋషులు రాజులు నెవ్వ రెవ్వ రెఱింగింపవే యనిన మృకండునందనుం డతనితో స్వారోచిషమన్వంతరప్రకారంబుఁ జెప్పెద నాకర్ణింపుము. 212

సిద్ధప్రసాదమునఁ బ్రవరుఁ డనువిప్రుఁడు హిమవంతమున కేగుట.

క. వరణాతటినీతటమున, నరుణాస్పద మనుపురంబునం దతులగుణో
త్తరుఁడు గలఁ డొక్కధరణీ,సురవరుఁ డశ్వినులకంటెఁ సుందరుఁ డెందున్. 213

చ. అతిసుకుమారమూర్తి ప్రవరాఖ్యుఁ డుదాత్తుఁడు వేదపారగుం
డతిథిజనార్చనాభిరతుఁడై చరియించుచు శైలకాననా
చితవకళావనీతలవిశేషము లెల్లను బ్రీతిఁ గన్గొన
న్మతిఁ గడుఁ గోరుచుండ నొకనాఁ డొకయౌషధసిద్ధుఁ డింటికిన్. 214

ఉ. వచ్చిన నాద్విజుం డతని వందనపూజల హృష్టచిత్తుఁ గాఁ
జెచ్చెరఁ జేసి యిమ్మహి విశేషపుఁజోద్యము లేవి చూచి తీ
వచ్చుగఁ జెప్పవే యనిన నౌషధసిద్ధుఁ డనేకదేశముల్
గ్రచ్చఱ నేను ద్రిమ్మరితిఁ గాంచితి నం దొగిఁ జెక్కుచోద్యముల్. 215

వ. అని చెప్పిన నవ్విప్రుండు భూసురవరుం దప్పక చూచి నవ్వుచు. 216

ఉ. వాయపురజ్జు లేల మునివల్లభ! వృద్ధుఁడ వొండెఁ గావు లేఁ
బ్రాయపువాఁడ వద్రివనరమ్యము లైనయనేకదేశము
లీయంత! యల్పకాలమునఁ ద్రిమ్మర శక్యమె? నీకు నెమ్మెయి
న్వేయఁను నేల నమ్మ నెద నీపలు కన్న మునీంద్రుఁ డిట్లనున్. 217

ఉ. ఏ నొకసిద్ధుఁడ న్వినుము మహీసురశేఖర! ధాత్రి యంతయు
న్మానుగఁ బాదలేప మనుమందుప్రభావమునం జరించితి
న్దానిఁ బదంబులందుఁ దగఁ దాల్చిన నెంతయు నిర్జితశ్రముం
డై నరుఁ డేఁగు యోజనసహస్రము నాపగలింటిలోపలన్. 218

చ. అనవుడు నాద్విజుండు ప్రియ మారఁగ సిద్ధునిమాట యూఁది యి
ట్లను ధరఁ జూచువేడ్క హృదయంబునఁ బాయదు నాకుఁ బాదలే
పనపరమౌషధంబు మునిపాలక! యిచ్చి కృతార్థుఁ జేయవే
నను నని వేఁడుకొన్న మునినాయకుఁ డాతని కిచ్చె నిచ్చినన్. 219

క. ఆదివ్యౌషధముం దన, పాదంబులయందుఁ దాల్చి పవనరయమున
న్భూదేవుఁ డుదఙ్ముఖుఁడై, మోదంబున హిమనగేంద్రమునకుం జనియెన్. 220

క. చని బహులతుహినమహితం, బును నానారత్నరశ్మిపుంజస్ఫురితం
బును సిద్ధసాధ్యదివిజాం, గనాస్పదము నైనయన్నగము విలసనమున్. 221

గీ. ప్రీతిఁ దగిలి చూచుచు సంచరించుచునతని, చరణతలములమంచెల్లఁ గరఁగి పాఱు
తుహినజలముల కొంతయుఁ దొప్పఁదోఁగి, శీఘ్రగమనసత్వంబును జెడియె ననఘ!
వ. దానిం దలంపక యగ్గిరీంద్రవిభవవిలసనాలోకనకుతూహలి యై యతండు. 223
సీ. సురసిద్ధసాధ్యకిన్నరమనోహరకేళివిలసితకందరవిభ్రమములు
కలకంఠకులకంఠకలరవరంజితవివిధతరూద్యానవిలసనములు
హంసరథాంగవిహారోల్లసన్నవనీరజాకరరామణీయకములు
త్రిదివనితంబినీక్రీడాభిరమ్యలతాగృహమహితసౌందర్యములును
ఆ. దగిలి చూచి చూచి తలయూఁచి తలయూఁచి, మెచ్చి మెచ్చి విప్రుఁ డిచ్చఁ దనివి
చనక యింక నెల్లి చనుదెంచి యేర్పడఁ, జూతు నిన్నగంబుసొంపుఁ బెంపు. 224
క. అని తలఁచి నిజగృహమునకుఁ, జనఁ గడఁగుటయుం బదములు జడభావం బొం
దిన నద్ధరణీదేవుఁడు, దనమది వెఱఁ గంది యివ్విధం బేమియొకో. 225
క. హిమవారిఁ గరఁగి మత్పా, దములం బూసినసదౌషధము వోవుటఁ జో
ద్యము గదిరె నిప్డు దక్కట, గమనరయం బుడిగె ననుచుఁ గడుదుఃఖితుఁడై. 226
ఆ. ఇంత దూర మైనయిగ్గిరీంద్రమునకు, నేల నన్ను దైవ మిట్టు తెచ్చె
నెవ్విధమున నింక నేనింటి కేఁగుదు, నేమి సేయువాఁడ నేది తెరువు ? 227
గీ. నిత్యనైమిత్తికము లైననిఖిలకర్మ, ములకు నాఱడి యిట్టులు పుట్టె వెడఁగ
నైతి నింటికిఁ జనునుపాయంబు వేఁడి, కొనఁగ నిచ్చట నొకతపోధనుఁడు లేఁడె.

ప్రవరవరూథినీసంవాదము.

చ. అని కడు వంతఁ గూరుచు హిమాద్రితటంబున సంచరించువి
ప్రుని మకరాంకసన్నిభు వరూథిని నాఁ జనునొక్కయప్సరో
గన లలితాంగకాంతిజితకాంచనవిభ్రమచంచదబ్జలో
చన కలహంసయాన కని సంభ్రమసంచలితాంతరంగ యై. 229
ఉ. ఈసుకుమారుఁ డెవ్వఁడొకొ యిందుల కెందులనుండి వచ్చెనో
భాసురరూపకాంతిజితభావజచంద్రుఁ డితండు రాగలీ
లాసరసత్వ మొప్పఁ గడు లాలసుఁ డై ననుఁ జూచెనేని నేఁ
జేసినపుణ్య మెవ్వరును జేయరు కాముని దక్క నేలుదున్. 230
వ. అని మఱియును. 231
ఉ. వీనిసురూపవిభ్రమము వీనితనూద్గతచారుకాంతియుం
వీనిమృదూల్లసద్గతియు వీనివినిర్మలదృగ్విలాసము

స్వనిముఖాంబుజద్యుతియుఁ జేర్కొఁ గనుంగొన నింత యొప్పునే!
మానవదేవకిన్నరకుమారులఁ జూడనె? వారు నిట్టిరే? 232

గీ. ఈకుమారునిమీఁద నాహృదయ మిప్పు, డధికరాగరసోద్రిక్త మైనమాడ్కి-
నితనిమనము నాయందు నతులరాగ, లలిత మగునేని యది జన్మఫలము కాదె?

క. అని మనమునఁ దలపోయుచు, మనసిజశరనికరదళితమానస యగుచు
న్గని యవ్వనితామణి వి, ప్రునిముందట నిల్చె రత్నపుత్త్రికవోలెన్. 234

వ. నిలిచినం జూచి యవ్విప్రుండు దాని డాయం జని నీ వెవ్వతె? విచట నేకతంబ యేల యున్నదాన? వని యడిగి తన తెఱం గంతయు నెఱింగించిన నత్తలోదరి యిట్లనియె.

క. మునితనయ! విను వరూథిని, యనునచ్చరలేమ ననఘ! యనుపమబహుర
త్ననికాంతకాంతిసంపద, నొనరినయిగ్గిరిఁ జరించు చుండుదు నెపుడున్. 236

క. నీవిలసనంబు గనుఁగొన్ని, భావజునలరంపవెల్లిపాల్పడిలి ననుం
గావుము సుందరమూర్తీ!, నావుడు నతఁ డిట్టు లనియె నలినాననకున్. 237

గీ. నిత్యకృత్యము ల్సలుపంగ నిజగృహమున, కిపుడ యరుగంగ వలయు నా కిందువదన!
చనునుపాయ మేయది? సెప్పు నను సముద్ధ, రింపు నిత్యక్రియాహాని పెంపు నడఁచు.

వ. అనిన నయ్యింతి యి ట్లనియె. 239

మ. ధరణీదేవకుమార! యిట్లనకు ముద్యత్ప్రీతి నన్బాసి నీ
కరుగంగాఁ దగు నెట్లు మేలె యతిరమ్యంబై వసింపంగ ని
గ్గిరికంటె న్భవదీయగేహ మెలమి న్క్రీడింపు నాతో మనో
హరకేళీగతి నొందఁ బోకుము సుహృద్వ్యామోహ ముప్పొంగఁగాన్. 240

సీ. భక్ష్యభోజ్యలేహ్యపానీయములు రత్నమండనములు వస్త్రమాల్యములును
గర్పూరచందనకస్తూరికాదులు నే నర్థి నీఁ గొని యింపు మిగులఁ
గా సుఖించుచు లీల గంధర్వకిన్నర వేణువీణాగీతవివిధగతులు
వినుచు మందానిలం బనుభవించుచు నిమ్మహాశైలసానుపర్యంకతలము

తే. నందు రమియింపు భవదీయమందిరమునఁ, గలుగునే యిట్టిదివ్యభోగంబు? లనుచు
రాగసాగరమగ్నయై రాజవదన, కదిసి భూసురవరుఁ జక్కఁ గౌఁగిలించె. 241

వ. ఇట్లు దన్ను నయ్యంగన గాఢాలింగనంబు సేయుటయును. 242

గీ. అంట కంటకు నన్ను మృగాక్షి! నీకు, సదృశుఁ డగువాని నన్యుని వెదకికొనుము
నిన్ను నొక్కటి యడుగంగ నీవు వేఱ, యొకటి గోరి నను న్బొంద నుచిత మగునె?

సీ. అనలునియందు రేపును మాపు వేల్వంగఁ బసుహవ్యములఁ జేసి పడయవచ్చు
పుణ్యలోకంబులు పొలఁతి! నీ వెఱుఁగ వీత్రిజగంబు హవ్యప్రతిష్ఠితంబు

యనిన నాయింతి నాయందు నిగ్గిరియందు నీకుఁ బ్రియం బేల నెలవు కొనదు?
విద్యాధరాదుల విడిచి మనుష్యుల కడ కేలయరుగంగఁ గడఁగె? దనిన

తే. వినుము దర్భలు నరణులు వేదికలును, నగ్నులును నాకుఁ గరము ప్రియం బొనర్చుఁ
గాని యొండందుఁ బ్రియ మెదఁ గలుగ దనిన, నవ్వరూథిని యిట్లను నతనితోడ.

ఆ. అఖిలధర్మవేది వైననీసుగుణాష్టకంబు ముఖ్యగుణము గాదె కరుణ
దానిఁ బూన వలదె తథ్యము నాయందు, దయకు సరియె యొండుధర్మ మనఘ!

క. దయఁ బోల వధ్వరంబులు, దయఁ బోలవు వివిధభూరిదానచయంబు
ల్దయఁ బోలవు జపతపములు, దయ తలపోయంగ విశిష్టతమధర్మ మిలన్. 246

క. నినుఁ బాసి నిముస మైనను, విను జీవము పట్టఁ జాల విప్రోత్తమ! నే
నన్నృతంబు వలుక నిజ మిది, ననుఁ బ్రీతి వరింపు కరుణ నాన్ను మనంబున్. 247

వ. నీకు నిజగృహంబునకు నవశ్యంబు నరుగ వలయు నేని కొండొకకాలంబు నాతోడ నిష్టోపభోగంబు లనుభవించి మఱి యరుగు మనిన నాబ్రాహ్మణుం డిట్లనియె. 248

గీ. విప్రవర్యులు భోగము ల్వేడ్కసేయ,రిడుమ లిహమునఁ బడి కాంతు రెలమిఁ బరము
నందు సుఖ మన్న నింతి మత్ప్రాణదాన, మిహపరోపభోగంబు లీడేర్చు నీకు. 249

వ. నీచేత నిరాకృతనైతినేని పంచత్వంబు నొందుదు నీవునుం బాపంబునం బడుదు వనిన నమ్మహీదేవుండు. 250

క. పరవనితారతి కీ దని, గురు లెఱిఁగింతు రటుగానఁ గోమలి! మది నా
కు రతి జనింపదు నీదెస, నిరతము నాదెస భజింపు నీవును విరతిన్. 251

ప్రవరుఁ డగ్నిప్రసాదంబున నిజగృహంబున కేఁగుట.

సీ. అని యమ్మహాభాగుఁ డాచమన మొనర్చి నియతుండు శుచియు నై నిలిచి గార్హ
పత్యాగ్నిఁ దనమది భావించి వందన మొనరించి యిట్లను ననిలమిత్ర!
నీయంద యాహవనీయాగ్నియును దక్షిణాగ్నియుఁ బ్రభవించె నఖిలదేవ
తలకును దృప్తి నీవలన సిద్ధించును సకలలోకముల కాశ్రయము నీవ

ఆ. నిత్యసత్యమూర్తి! నీప్రసాదంబున, నినుఁడు గ్రుంక కుండ నిపుడ యింటి
కరుగువాఁడఁ గాక యాగమోదితకర్మ,జాత నైష్ఠికుండ నైతి నేని. 252

క. పరదారపరధనరతి, పరత్వ మెన్నఁడును నాకుఁ బాటిల్లనియా
స్థిరసత్యమహిమ నతిస,త్వరితగమనసిద్ధి గలుగ వలయుం హుతవహా! 253

వ. అని యభ్యర్థించిన నగ్నిదేవుం డవ్విప్రునిశరీరంబునందు సన్నిహితుండయ్యె నతండును బ్రభామండలమధ్యగతుండై మూర్తిమంతుం డైనహుతవహుండునుంబోలెఁ దత్ప్రదేశంబు వెలింగించుచునద్దివ్యాంగన యంతరంగంబున నంతకంతకు ననురాగం బతిశయిలి

శోభిల్ల నగ్నిప్రసాదంబున జెప్పటియట్ల శీఘ్రగమనంబు వడసి నిజగృహంబున కరిగి నిత్యక్రియాకలాపంబులు నిర్వర్తించెనని మార్కండేయుండు క్రోష్టుకికిం జెప్పినవిధంబునం జెప్పి. 254

చ. నిరఘచరిత్ర ! వారిరుహనేత్ర ! సమంచితసర్వలక్షణ
స్ఫురదురుగాత్ర ! సూరిజనభూరుహచైత్ర ! సమస్తయాచకో
త్కరనుతిపాత్ర ! శాత్రవనికాయభయంకరజైత్రయాత్ర ! పం
కరుహభవాంఘ్రిజాన్వయశిఖామణి ! భూవిలసన్నభోమణీ ! 255

క. మేచచమూపాగ్రజ ! స
త్యాచారమహత్త్వపాండవాగ్రజ ! విలస
చ్చాపగాతనూభవ !
యాచకనికురుంబనూతనార్కప్రభవా ! 256

మాలిని. మదవదరివిదారీ ! మానినీమానహారీ !
సదయవదనపద్మా ! శౌర్యసారైకసద్మా !
విదితవివిధకర్మా ! విస్ఫురద్దానధర్మా !
మదనసదృశమూర్తీ ! మంగళాచారవర్తీ. 257

గద్యము. ఇది శ్రీమదుభయకవిమిత్ర తిక్కనసోమయాజిప్రసాదలబ్ధసరస్వతీపాత్ర తిక్కనామాత్యపుత్ర మారయనామధేయప్రణీతం బైనమార్కండేయమహాపురాణంబునందు మహదాదిభూతసంభవంబును నండోత్పత్తియు బ్రహ్మజన్మంబును జతుర్యుగమన్వంతరకాలసంఖ్యలును సురాసురయక్షపితృమనుష్యరాక్షససర్వభూతసంభవంబును జరాచరభూతానుభవంబును మిథునరూపమనుష్యప్రవర్తనంబును నేకాదశరుద్రసర్గంబును స్వాయంభువమనుప్రభవంబును దక్షసర్గంబును దుస్సహోత్పత్తియుఁ దత్సంతానదురాచారప్రకారంబును రుద్రసర్గంబును వహ్నులజన్మంబును స్వాయంభువమనుపుత్రులైనయాగ్నీధ్రాదులు పుట్టుటయు సప్తద్వీపవిభాగంబును జంబూద్వీపప్రకారంబును బ్రవరుం డనువిప్రునిచరితంబును వరూథిని యతనిం జూచి కామించుటయు నమ్మహీదేవుండు దానిం బరిగ్రహింపక యగ్నిప్రసాదంబున శీఘ్రగమనంబు వడసి నిజగృహంబున కరుగుటయు ననునది చతుర్థాశ్వాసము.

శ్రీ ర స్తు.

మార్కండేయపురాణము

పంచమాశ్వాసము.

శ్రీరుద్రదేవనృపతి
స్ఫారదయాలబ్ధవిభవ! శౌర్యేంద్రభవా!
మారాస్త్రదళితచేతో
నారీజనసుప్రసన్న! నాగయగన్నా! 1

వ. పరమజ్ఞానచక్షు లైనపక్షు లాజైమిని కిట్లనిరి వరూథిని యటమీఁద నెట్లు వర్తించె
నని క్రోష్టుకి యడిగిన మార్కండేయుండు. 2

ప్రవరవిరహము సహింపఁజాలక వరూథిని విలపించుట.

ఉ. ఆకమలాక్షిచిత్తమున నాద్విజరాజకుమారుచారుది
వ్యాకృతి నిల్చి ప్రీతివగ లంతకు నంతకు నగ్గలించి చీ
కాకు పడంగఁ జేయఁ గుసుమాయుధునేటుల కంత యోర్వఁగా
లేక నితాంతవేదనఁ జలించుచు నెంతయు వెచ్చ నూర్చుచున్. 3

క. గిరికందరములు గలయం, దిరుగుచు దుఃఖాంబురాశిఁ దేలుచు విప్రుం
డరిగినవలనికిఁ జూడ్కులు, పొరి నిగిడించుచును బువ్వుఁబోఁడి యలంతన్. 4

గీ. అకట! మందభాగ్య నైతి నా కెమ్మెయిఁ, గలుగు నక్కుమారుఁ గలయుపుణ్య?
మేమి సేయుదాన? నీకామతాప మే, నెట్లు నిస్తరింతు? నెందుఁ జొత్తు? 5

వ. అనుచు మదనవేదనాభరంబున దురపిల్లుచు నమ్మదిరాక్షి యద్దినశేషంబును రాత్రి
యుం గడపి మఱునాఁ డక్కుమారుం డెప్పటియట్ల యరుగుదెంచునో యనుకుతూ
హలంబునం దుహినగిరికందరోద్యానంబునందు. 6

సీ. విరులగుత్తులమీఁద గురువులు వాఱుచు ముద్దిచ్చుతేఁటుల మొరపములకు
చిగురుజొంపములలోఁ జిట్టుముట్టాడుచుఁ గెరలుకోయిలలసుస్వరములకును
నెలమావిలతలపైఁ గలఁ గొనఁ దారుచుఁ జెలఁగుచిల్కలకల్కిపలుకులకును

నలరులసెత్తావి నెలమిగాఁ జిలుకుచు నుడియుమందానిలుసొంపునకును
తే. గళవళించుచుఁ గెందమ్మికొలఁకులందుఁ, గేలి యొనరించుజక్కవమేలిలీలఁ
గోర్కు లంతంతకును నెడఁ గొనలు నిగుడ, మదనమార్గణవిదళితహృదయ యగుచు.

గీ. అడవిఁ గాసినవెన్నల యయ్యె నాకు, జవ్వనం బక్కుమారుతో సరసలీల
భావజోపభోగంబులఁ బడయ నైతి, నీనితాంతతాపంబు నన్నేల నైఁచు! 8

ఉ. ఎక్కడినుండి వచ్చె నతఁ డీతుహినాద్రికి వేడ్క నూని? యే
నక్కట! యక్కుమారురుచిరాకృతి యాదట నేల చూచితిన్?
మక్కువ యేల నాటె మది? మన్మథుఁ డేల సహించు నన్ను? వాఁ
డెక్కడ వచ్చు నింక? నది యేల పొసంగు? దురాశ యేటికిన్. 9

కలి యనుగంధర్వుఁడు ప్రవరవేషుఁడై వరూథినిమోసగించుట.

వ. అని వితర్కించుచుం జేడియ విరహాతురయై తిరుగుచుండం దొల్లి యక్కామినిం గామించి దానిచేత నిరాకృతుం డైనవాఁడు కలి యనునొక్కగంధర్వుం డయ్యవస్థ నున్నయాయంగనఁ గనుంగొని దివ్యజ్ఞానంబునఁ దద్వృత్తాంతం బంతయు నెఱింగి పొంగి. 10

క. తను నేఁ గోరిన నొల్లక, మనసిజశరనికరదళితమానసఁ జేసె
న్నను విప్రుఁ గూర్చి కమలా, నన యక్కట! యిట్లు నేఁడు నావలె నుండెన్. 11

గీ. అమ్మహీసురురూప మొప్పారఁ దాల్చి, యిమ్మృగాక్షితో భోగింతు నిం పెలర్ప
నని మనంబున గంధర్వుఁ డలరి విప్రమూర్తిఁ గైకొని యబ్బాలమ్రోల లీల. 12

చ. మెలఁగుచు నున్న వానిఁ గని మెత్తక యెప్పటిభూసురుండ కాఁ
దలఁచి విలోచనద్యుతివితానవిరాజితవక్త్రపద్మ యై
లలిఁ గడు డాసి యేమిటి కలంచెద విమ్మెయి? నంగజాగ్ని నే
నలిగిన నిన్నుఁ గష్టుఁ డనరే నరు? లక్కట! పాప మొందదే? 13

క. నిను నిత్యకర్మలోపం, బునకంటెఁ గుమార! యఘము పొందుం జుమ్మీ
మనసిజుబారికి నను ద్రోసిన మత్త్రాణైకధర్మశీలివి గమ్మీ. 14

వ. అనిన నవ్విప్రరూపగంధర్వుండు. 15

గీ. ఏమి సేయుదు తరళాక్షి! యేను? చెపుమ, నీవు నిట్లని పలికెదు నిత్యకర్మ
హాని నాకుఁ బాటిల్లదే? యైన నొకటి, నీకుఁ జెప్పెద నేర్పడ నెమ్మి వినుము. 16

వ. సంభోగసమయంబున నిమీలితాక్షి వై నన్నుం జూడక యుండ వలయు నట్లైన నీకు నాకును సంగమం బగు నట్లు గాకున్నఁ గాదనిన వరూథిని దాని కొడంబడియె నంత. 17

స్వరోచిర్జననము.

శా. ఆగంధర్వుఁడు నప్సరోంగనయు నత్యాసక్తిమైఁ గూడి హై
మాగస్ఫారదరీగృహాంతరలతాంతాగారభాస్వత్తటీ
భాగీరథ్యురుసైకతస్థలజలప్రాంతప్రదేశంబుల
న్భోగింపంగఁ దొడంగి రంగజసుఖాంభోరాశినిర్మగ్నులై. 18

వ. ఇట్లయ్యిరువురు మనోహారంబు లగుమనోభవసుఖంబు లనుభవించుచుండ. 19

క. సురతసమయమున నాసుం,దరి నయనాబ్జములు మోడ్చి దహనశిఖావి
స్ఫురితశరీరుం డగునా, ధరణిసురకుమారు నాత్మఁ దలఁచెను నెమ్మిన్. 20

వ. కాలక్రమంబున నబ్బాలికారత్నంబు గర్భిణి యైన దానిం బ్రియవచనంబుల నూఱ
డించి యాపె యనుప విప్రరూపగంధర్వుండు నిజేచ్ఛ నరిగె నంత. 21

చ. స్వరుచిసముద్గమస్ఫురణ సర్వదిగంతరము ల్వెలుంగ భా
సురతరమూర్తియై వెలయుసూర్యునిమాడ్కి సుతుండు ప్రీతి న
త్తరుణికి నుద్భవించి సముదాత్తతనుద్యుతిజాలసంపద
న్సురుచిరుఁ డై స్వరోచి యనుసుందరనామము దాల్చె నెంతయున్. 22

చ. కళ లభివృద్ధి బొందుశశికైవడిఁ దద్దయు సద్గుణంబుల
న్వెలుఁగుచు నాఁడునాఁటి కభివృద్ధి వహించి మనోజ్ఞయౌవనో
జ్జ్వలుఁడును నస్త్రవిద్యను విశారదుఁడు న్బలభాసితుండు నై
పొలుపుగ మందరాద్రితటభూముల నాతఁడు కేలి సల్పుచున్. 23

ఇందీవరాక్షమనోరమాశాపమోచనము.

క. ఒకనాఁడు గనియె నొకక, న్యక నధికభయార్తచిత్తయై కావు నను
న్బ్రకటదయ ననుచుఁ దనయొ, ద్దకు వడిఁ బఱతెంచుదానిఁ దరళతరాక్షిన్. 24

క. కని యోడకుమీ యబ్జా,నన! యిట కీ వేల వచ్చి? తనవుడు నది యి
ట్లను నూర్పులు గ్రందుకొన, న్దనులత వడఁకంగ గద్గదస్వర మెసఁగన్. 25

వ. మహాత్మా! యేను మరుదశ్వపుత్రికి నిందీవరాక్షుండనుగంధర్వునకుం బ్రభవించినదాన
నాపేరు మనోరమ మందారవిద్యాధరపుత్రి విభావరియును బారం· దనమునికూఁ
తురు కళావతియును నాసఖులు వారును నేనునుం గూడి యొక్కనాఁడు కైలా
సంబునకు వినోదార్థం బరిగి తదీయతటంబునందు. 26

తే. ఉగ్రతపమున నెంతయు నొడలు డస్సి, యడరునాఁకట మలయుచు మెడ మలంచి
చాలఁ గన్నులఁ గ్రుస్సి తేజం బడంగి, యున్నమునిఁ గని నవ్విన నన్నుఁ జూచి. 27

ఆ. అలుక వొడమి కంపితాధరపల్లవుఁ, డగుచుఁ బెలుచ నిట్టు లనియె నతఁడు
నన్నుఁ జూచి నీవు నవ్వితి గావున, నసురకరగృహీత వగుము తరుణి! 28

చ. అని నను నమ్మునీంద్రుఁ డదయ న్శపియించిన రేఁగి మత్సఖు
ల్చనుసె శపింప నక్కట! విచారవిహీనుఁడ వైతి వో తపం
బును బొలియించి తించుకయుఁ బుద్ధిశమంబు భజింప లేవ క్రో
ధను లగువారు బ్రాహ్మణులె? దాంతులు శాంతులు వారి మెత్తురే? 29

క. అని తన్నధిక్కరించిన, విని ముని యొక్కర్తు కుష్ఠవిద్ధాంగి యొక
ర్తు నితాంతక్షయబాధిత,యుఁను గా నిద్దఱ శపించె నుగ్రపుటలుకన్. 30

తే. ఆలతాంగుల నారుజ లపుడ పొందె
ననఘ! మూఁడు ప్రొద్దులఁగోలె నసుర యొకఁడు
ఘోరమూర్తియై నన్నుఁ బట్టికొనఁగ వెనుకఁ
దగులుచున్నాఁడు దారుణధ్వని సెలంగ. 31

వ. అస్త్రహృదయం బనువిద్య యే నెఱుంగుదు దాని నీ కిచ్చెదఁ దత్ప్రభావంబున నీరా
క్షసు జయించి నన్ను రక్షింపు మీవిద్య తొల్లి పినాకపాణి యగురుద్రుండు స్వాయం
భువ మనువున కిచ్చె నతండు వసిష్ఠున కిచ్చె న మ్మునివరుండు మన్మాతామహుం డైన
చిత్రాయుధున కిచ్చె నమ్మహితాత్ముండు వివాహసమయంబున మదీయజనకున కరణం
బుగా నిచ్చె మాతండ్రి నన్ను నావిద్యయందు విశారదం గావించె సకలరిపునాశకరం
బైనయస్త్రహృదయంబును వేగ పరిగ్రహింపు మనిన నట్లకాక యని యవ్వరూథినీ
నందనుండు జలోపస్పర్శనం బాచరించి శుచి యైన నతనికి నక్కన్యకారత్నంబు సర
హస్యంబుగ సకలాస్త్రసంప్రయోగనివర్తనవిధంబు లుపదేశించిన యనంతరంబ. 32

చ. అనుపమనీలనీరదనిభాకృతియుం స్ఫుటగర్జనారవం
బును మెఱయంగ నే కదిసి పొల్తుక! యెవ్వఁడు గావ నోపు? నే
నిను నిదె మ్రింగెదం దొలఁగి నీ వెటఁ బోయెద? వంచు నింతిఁ బ
ట్టిన సురవైరిఁ జూచి తనడెందమునం గడు నల్కఁ బుట్టినన్. 33

వ. వరూథినీనందనుం డంతర్గతంబున. 34

క. కరుణము పుట్టఁగ నమ్మెయి, శరణం బొచ్చిన లతాంగి సాధ్వస మెల్ల
న్వారియింతును బొలియింతును, సురవిద్విషు నురల కెలమిసొం పొనరింతున్. 35

చ. అని భ్రుకుటీభయంకరతరాస్యుఁడు రోషవిఘూర్ణితాత్మకుం
డును నయి చండబాణము గడు న్వెసఁ జూడ్కులఁ దాల్చి చొన్పె న
ద్దనుజుని మేన దానఁ బటుతాపము పుట్టినఁ దల్లడిల్లి య
వ్వనరుహలోచన న్విడిచి వాఁడు కరంబులు మోడ్చి యి ట్లనున్. 36

ఆ. బ్రహ్మమిత్రుఁ డనఁగ బరగినమునివరు, శాప మిపుడు తద్ద శాంతిఁ బొంద
నాకు హితులు లేరు నీకంటె నెవ్వరు, ననిన నిట్టు లనియె నతఁడు ప్రీతి. 37

వ. అమ్మునీశ్వరుం డేమినిమిత్తంబున నీకిట్టిశాప మిచ్చెనని యడిగిన రాక్షసుం డి
ట్లనియె. 38

ఇందీవరాక్షుఁడు శాపవిముక్తుఁడై స్వరోచితో నిజశాపకారణము సెప్పుట.

క. ఘనుఁ డైన బ్రహ్మమిత్రుం, డనఘా! యష్టాంగ మైన యాయుర్వేదం
బున నిపుణుండై యుండును, విను మే నిందీవరాక్షవిదితాహ్వయుఁడన్. 39

వ. ఈయిందీవరాక్షికి జనకుండ గంధర్వుండ. 40

క. నలనాభాఖ్యతనూజుఁడ, నలఘుమతీ! బ్రహ్మమిత్రు నాయుర్వేదం
బలవఱుప వలయు నా కని, పలుమఱు నే నడిగి త్రోపువడి చలము మెయిన్. 41

వ. అంతర్ధానగతుండనై యుండి యతండు శిష్యుల కుపదేశించుసమయంబున నయ్యాయు
ర్వేదవిద్య యెనిమిదినెల లభ్యసించి హర్షించి యతనిముందటి కరిగి యందంద నగు
చున్న నన్ను భావించి దివ్యబోధంబున నంతయుం గాంచి మునివరుండు కోపించి.

ఆ. కటము లదర మేను కంపింప నతిపరు,షాక్షరముల నిట్టు లనియె నోరి!
దితిజమాయ ని ట్లదృశ్యుండ వై విద్య, యపహరించి తగునె యపహసింప? 43

వ. సప్తరాత్రంబుల రాక్షసుండవై యుండు మని శపించిన. 44

క. వడవడ వడఁకుచు నమ్ముని,యడుగులకుం జక్కఁ జాఁగి యర్థించిన న
ప్పుడు శాంతిఁ బొంది యెదఁ గృప, గడలుకొనఁగ నిట్టు లనియెఁ గమనీయయశా!

సీ. వినవయ్య గంధర్వవీర! నాపలు కవశ్యము తప్ప దిపుడు నీ వసుర వయ్యుఁ
గ్రమ్మఱ నిజమూర్తిఁ గైకొనియెదు దైత్యభావంబుచే స్మృతిఁ బాసి యెపుడు
కుపితుండవై నీకుమారితు నంగద ప్రియంగ నదరి యొక్కరునిదివ్యాస్త్రవహ్ని
నెరియుఁ దప్పుడు మది నెఱుక వొడమ నిర్మలాకృతి వగు దని యానతిచ్చె

తే. నమ్మునీంద్రుండు గావున నధిపపుణ్య, మూర్తి! నీచేత నే నిట్లు మోక్షితుండ
నైతి శాపంబువలన మహాత్మ! నీకు, వలతుఁ జేయంగఁ బ్రీతి నాపలుకు వినుము.

స్వరోచి యిందీవరాక్షునికూఁతు రగుమనోరమను బెండ్లియాడుట.

క. ఆయుర్వేదముతోడన, యీయిందీవరదళాక్షి నిచ్చెద నీకున్
ధీయుత! పరిగ్రహింపుము, నీయుపకృతి కొండు సేయ నేర్తునె చెపుమా? 47

క. అని గంధర్వుఁడు తొల్లిటి, తనదివ్యాకృతి ధరించి ధవళాంబరచం
దనకుసుమరత్నహారా, ద్యనుపమశృంగారభాసి యై కడు నెలమిన్. 48

వ. స్వరోచికి నాయుర్వేదవిద్య నిచ్చి యక్కన్యక నీయ నుపక్రమించిన నది తండ్రి
కి ట్లనియె. 49

చ. మన కుపకారి యైనసుకుమారుని నీతనిఁ జూచినప్డ నా
మనమున రాగ మైనయది మానుగ నైనను దండ్రి! నాకతం
బునఁ బటురోగదుఃఖములఁ బొందుచు నెచ్చెలు లిట్టు లుండఁగా
మనసిజభోగలీలలకు మానస మెమ్మెయి నాకు నూల్కొనున్? 50

వ. అనిన వరూథినీతనయుం డయ్యింతి కి ట్లనియె. 51

క. ఆయుర్వేదము పెంపున, నీయిద్దఱుసఖుల రోగనిర్ముక్తలఁ గాఁ
జేయుదు నమ్ముము విడువుము, తోయదనదళనయన! వగపుతో సంశయమున్. 52

తే. అనుడు రాగంబు నొందినయ త్తనూజ, నక్కుమారుని కిడి వివాహంబు సేసి
దివ్యగతి నేఁగె నంత నిందీవరాక్షుఁ, డనఘ! గంధర్వపురమున కతిముదమున. 53

ఆ. ఎలమిమై స్వరోచి యిట్లు మనోరమఁ, బెండ్లి యై కరంబు ప్రీతితోడ
సతియుఁ దాను దానిసఖు లున్నయుద్యాన, వనమునకును నేఁగి వారిఁ గాంచి. 54

మనోరమసఖులకు శాపవిముక్తి.

వ. రోగఘ్నంబు లైనదివ్యౌషధంబు లుపయోగింప నిచ్చి యక్కన్యకలరోగంబుల
నపనయించిన నయ్యిందుముఖులు నిజకాంతివిలసనంబున సమ్మహీధరంబు దిగంతరం
బులు వెలిఁగించుచు నొప్పి రం దొక్కకన్యక యతని కి ట్లనియె. 55

విభావరి కలావతులు స్వరోచికిఁ దమవృత్తాంతము చెప్పుట.

తే. అనఘ! మందారవిద్యాధరాత్మజన్మ, నే విభావరి యనుదాన నెలమి నీకు
నెల్లభూతభాషలు మది నెఱుఁగునట్టి, విద్యయును నన్ను నిచ్చెద వేగ గొనుము. 56

ఆ. అనిన నాస్వరోచి యట్ల కా కనవుడు, నాద్వితీయకన్య యతని కనియెఁ
బారుఁ డనఁగఁ బరగు బ్రహ్మర్షి మజ్జనకుండు సకలవేదకోవిదుండు. 57

చ. అలికులకీరకోకిలకలారవరమ్యమహీజరాజిచేఁ
బొలుపగునమ్మునీశ్వరుతపోవనభూమికి వచ్చెఁ బుంజిక
స్థల యనునప్సరోంగన ముదంబున దానివిలాసలీలఁ జూ
డ్కులు పురికొన్నఁ బైఁ బడి కడు న్దమకంబునఁ దాను నింతియున్. 58

ఆ. ఎలమిఁ గామభోగములు సల్పి నను గాంచి, బహుమృగప్రచారభయద మైన
యడవి డిగ్గ విడిచి యరిగి రయ్యిరువురు, నరుగుటయును నేను నంత ననఘ! 59

ఆ. అమృతకరునికళల నాప్యాయమానాత్మ, నగుచు రాత్రు లెల్ల నతిశయిల్లి
యనుదినంబు చాల నభివృద్ధి నొందితి, సోఁకి తండ్రిప్రీతి నేఁగుదెంచి. 60

వ. నన్నుం దోడ్కొని చని చంద్రకళావర్ధిత నగుటం గళావతి యనునామంబు నా
కొనరించె నంత నొక్కనాఁడు దేవాది యనుగంధర్వుండు. 61

క. తనకు నను నీనియలుకం, గనలుచుఁ జనుదెంచి మత్తకరివిధమున మ
జ్జనకుని వధియించిన నే,మనమున నిర్వేద మొంది మరణోద్యమమున్. 62

ఉ. పూనిన శంభుపత్ని యతిభూరిదయామతి సుప్రసన్న యై
మానిని! యేల యీతెగువ? మానుము నెవ్వగఁ దక్క భర్త తే
జోనిధి యాస్వరోచి యగుఁ జుమ్ము ధ్రువంబుగ నీకుఁ బెన్నిధు
ల్మానుగఁ బెంపొనర్చుచు సమస్తధనంబులు నిచ్చునట్లుగన్. 63

తే. పద్మినీనామవిఖ్యాతపరమవిద్య, నీకు నిచ్చెదఁ గొమ్మని నెమ్మి నిచ్చి
యరిగె నద్దేవి గావున నాస్వరోచి, వగుదు నీవు కుమార! తేజోభిరామ! 64

క. ఈయొదలును నావిద్దెయుఁ, నీయదిగా నిశ్చయించి నెమ్మి ప్రసాద
శ్రీ యుల్లసిల్లఁ గైకొన,వే యిచ్చితి నేను నీకు నెంతయుఁ బ్రీతిన్. 65

స్వరోచి కళావతీవిభావరులఁ బెండ్లియాడుట.

ఆ. అనిన నట్లకాక యని యాస్వరోచివి,భుండు దేవదుందుభులు చెలంగఁ
దివుట నాకళావతీవిభావరుల వి,వాహ మయ్యె నధికవైభవమున. 66

వ. ఇవ్విధంబున నవ్వరూథినీనందనుం డక్కన్నియల ముగ్వురం బరిణయం బై పర
మానురాగంబున. 67

క. మందరభూభృత్సుందర, కందరమందారకల్పకచ్ఛాయల నా
సుందరులతో నమందా,నందమున ననేకవిహరణములు సలుపుచున్. 68

సీ. పద్మినీవిద్యాప్రభావంబు పెంపున వశవర్తులై నిధు ల్వలసినపుడు
మధురసంబులు నతిమధురాన్నములు మృదులాంబరసురభిమాల్యానులేప
నములు సువర్ణమయము లైనశయ్యాసనములు నానాభోజనములు నొసఁగ
నింతులుఁ దాను నింపు సొంపార భోగించుచు మందరగిరిమనోజ్ఞ

తే. సానుతలమునఁ బొలుచునుద్యానవనవి,హారములు సల్పునవ్విభు నర్థిఁ జూచి
యొక్కకమలాకరంబులో నున్నహంసి, యెలమి జక్కవలేమతో నిట్టు లనియె. 69

స్వరోచింగుఱించి కలహంసీచక్రవాకీసంవాదము.

క. ఇతఁ డెంత ధన్యుఁ డగునే, యతులితయౌవనుఁడు సుందరాంగుఁడు నై యీ
యతివలఁ దాను సుఖస్థితిఁ, జతురవిహారములు వేడ్క సలుపం గనుటన్. 70

వ. అని మఱియును. 71

ఆ. మగఁడు గలసి నేని మగువ దాఁ గలయదు, మగువ గలసి నేని మగఁడు గలయఁ
దెలమి నొండొరువుల నిరువురమనములఁ, గలుపుఁ బూర్వసుకృతఫలము సుమ్ము. 72

క. ఇతనికిఁ గడుఁ బ్రియ లీసతు, లితఁడును నీసుందరులకు నెంతయు నుఁ బ్రియుం
డితరేతరానురాగం, బతిశయ మగుచుండుఁ జూవె యతిధన్యులకున్. 73

వ. అనిన నాయంచలేమవచనంబు లాదరింపక రథాంగవనిత యి ట్లనియె. 74

ఉ. నాన యొకింతలేక తననాథులయొద్దన యొక్కనాతియుం
దాను రమించు నీతఁ డొకధన్యుఁడె? యొక్కని కర్థిఁ గూర్తురే
మానుగఁ బల్వు రంగనలు మానిని! కావున నీలతాంగులు
న్వీనికిఁ గారు ప్రేయసులు వీఁడును గాఁడు ప్రియుండు వారికిన్. 75

క. పరిజనులయందు విభునకు, నరయంగ వినోదమాత్ర మనురాగ మెద
న్బొరసినయట్టులఁ బలువురు, తరుణులయెడ రాగ మొకఁడు దాల్చుట తరుణీ! 76

ఉ. ఈవిధుఁ డీలతాంగులకు నెంతయునుం బ్రియుఁడే యటేనిఁ దా
జీవము లేమృగాక్షి విడిచె న్బ్రియుఁ డొందు వధూటిఁ జెందిన
న్గావున విన్ము విద్య వెలగా విలువంబడి వీర లిప్డు డా
జీవని కాప్రకారమునఁ జేరినవారలు చూవె వీనికిన్. 77

క. విను కలహంసి! యొక్కని, మన మొక్కతెయందు నొకతెమన మొక్కనియం
దు నిలుచుఁ దిరమయి యది వల,పనఁగాఁ దగుఁ బ్రియము పలువురందుఁ గలుగునే?

తే. ఏను గడు ధన్యురాల నియ్యెల మదీయ,విభుఁడు కడుధన్యుఁ డని పల్కి విహగిపల్కు
లఖిలభూతభాషావిదుం డైనయట్టి, యాస్వరోచివిభుఁడు విని యాత్మలోన. 79

క. దానం గడు వగ సిగ్గున, మానుచుఁ జని యన్నగమున నొకనాఁ డేఁడు
ల్నానావిధసుఖలీల, న్మానుగఁ గ్రీడించు చొక్కనాఁ డొక్కయెడన్. 80

స్వరోచింగుఱించి మృగదంపతులసంవాదము.

చ. కనకమయాంగదీప్తు లెసఁగంగ సమున్నతశృంగరంగదా
ననరుచు లుల్లసిల్ల నయనద్యుతిజాలము పర్వఁ జాల నిం
పొనర మృగీతతు ల్బలసి యుండఁగ నున్నకురంగవల్లభు
న్గనియె వనాంతరంబున సుఖస్థితి నింతులతోఁ జరించుచున్. 81

తే. మనములలరఁ జూడ్కులఁ గడు మ్రాలఁ జెవులు,వ్రాల హరిణాంగనలు రాగలోలలగుచు
జేరి హరిణేంద్రు నెమ్మోము మూరుకొనుచు, నట్టు నాకుచు నున్న నాహరిణవిభుఁడు.

ఆ. ఏస్వరోచిఁ గా నొకింతయుం జే లజ్జ, విడవ నట్టి త్రోవ విడుతు వినుఁడు
లజ్జమాతుఁ గడుఁ దొలంగుఁడు తొలఁగుఁడు, విగతలజ్జమతులవెనుకఁ జనుఁడు. 83

క. పలువురు లలనలు దనకుం,గలుగుట భోగేచ్ఛ ధర్మకర్మము లెల్ల
న్వొలిసెను వీనికి ధనములు,లలనావర్గంబు కామలంపటుఁ దగుటన్. 84

ఆ. ఇట్టి యితనిమాడ్కి నెవ్వఁడు వర్తించు, నతఁడు పుణ్యలోకగతుఁడు గాఁడు
గాన నిట్టివానిఁ గామింపఁ డేను స్వ,రోచి నడుచునట్టి త్రోవ నడువ. 85

స్వరోచికి మువ్వురుపుత్త్రులు పుట్టుట.

వ. అని పలుకుహారిణంబుచేత నాహరిణాంగనలు త్రోపు వడి చని రవ్వచనంబులు వరూథినీతనయుండు విని తనమనంబున నే నింత కుత్సితుండ నగుదునే? చక్రవాకియు నీమృగంబు నాచరితం బిట్లు గర్హింతురే? యింక నవశ్యంబును సర్వసంగపరిత్యాగంబు సేయుదు నని యప్పటికిం దలంచి యెప్పటియట్ల మనోభవాధీనమానసుండై యయ్యంగనలతోడ నాఱునూఱుసంవత్సరంబులు విషయసుఖంబు లనుభవించి మనోరమయందు విజయుండును విభావరియందు మేరునందుఁడునుఁ గలావతియందుఁ బ్రభాసుండు ననుపుత్త్రులం బడసి పద్మినీవిద్యాప్రభావంబునం దూర్పున విజయునికి విజయం బనునగరంబును నుత్తరంబున మేరునందునికి నందవతి యనుపురంబును దక్షిణంబునం బ్రభాసునికిఁ దాళం బనుపట్టణంబును నిర్మించి యందు వారల నునిచి యాస్వరోచి యొక్కనాఁడు మృగయావినోదార్థంబు ధనుర్ధరుండై యొక్కరుండును వనంబున కరిగి యనతిదూరంబున నొక్కవరాహంబుఁ గని దాని నేయం దలంచి గుణంబు సారించి శరంబు సంధించినతఱి నొక్కమృగాంగన రయంబున నతని డాయం జనుదెంచి యి ట్లనియె. 86

స్వారోచిషమనుజననము.

క. నను నేయుము మీశరంబున, ననఘ! ప్రసన్నుఁడవు నాకు నగుము వరాహం
బు నకారణంబు చంపకు, మనిన వరూథినితనూజుఁ డామృగి కనియెన్. 87

సీ. ఒడల రోగంబు లే దొల్లఁబా టెట్లు నీ కయ్యెఁ బ్రాణము? లన్న హారిణి యనియె
నన్యాంగనాసక్తుఁ డగువాని మనమున వలచిన మరణంబు వెలిగ నాకు
నొండౌషధంబున నుడుగునే యెదతాప మనిన ని ట్లనియెఁ దా నమ్మహాత్ముఁ
డెవ్వనియందు నీహృదయంబు దగిలిన దతఁ డెట్టివాఁడు లోలాక్షి! చెపుమ

ఆ. యనిన నిన్నె వలచి తనఘ! నీచేతన, మనముఁ గోలుపడితి మనసిజాగ్ని
సొరియఁ జాలఁ జంపవే వేగ నన్ను నీ,పటునిశాతశరముపాలు పఱిచి. 88

వ. అనిన హారిణికి నతం డి ట్లనియె. 89

క. మనుజుఁడ నే నీవు మృగివి, విను నీకును నాకు నెట్లు విషయైకసుఖం
బొనరు ననిన మృగి యి ట్లను, నను నాలింగన మొనర్పు నా కదె చాలున్. 90

ఆ. అనిన నాస్వరోచి యాలింగనము చేసె, నాతురంగవనిత నవియుం దివ్య
వనిత యయ్యెఁ జోద్యపడి యతఁ డెవ్వతె, వింతి! చెప్పు మనిన నిందువదన. 91

వ. ప్రేమలజ్జాభరానతవదన యగుచు నల్లన ని ట్లనియె. 92

క. క్షితిరక్షాదక్షుం డగు, సుతు మనువుం బడయ నన్ను సురవరులు జగ
ద్ధితముగఁ బ్రార్థించిన వ,చ్చితి నే వనదేవతను విశిష్టచరిత్రా!. 93

వ. దేవవచనంబున నాయందు నపత్యంబు వడయు మనిన నతం డయ్యంగన నంగీకరించె
నంత నయ్యిరువురకును. 94

చ. అతులితసర్వలక్షణసమంచితమూర్తియు నుజ్జ్వలప్రభా
న్వితుఁడును నైనపుత్త్రుఁడు జనించెను మ్రోసె నిలింపవాద్యము
ల్వితతసుగంధమారుతము వీచె దిశల్విమలంబు లయ్యె నం
చితముగఁ బుష్పవృష్టి గురిసె న్వెస నృత్యము చేసి రచ్చరల్. 95

క. అతనితనుద్యుతి కత్య, ద్భుత మంది మది న్స్వరోచి ద్యుతిమన్నామం
బతనికి నొనరించెను దగ, నతఁడును భుజబలపరాక్రమాఢ్యుం డై. 96

వ. స్వరోచిరపత్యంబగుటం జేసి స్వారోచిషుం డనం బరగె నంత నొకనాఁడు గిరినిర్ఝర
మనోహరప్రదేశంబుల విహరించుచు నాస్వరోచిర్విభుండు హంసమిథునంబు గనియె
నంత నాహంస హంసి కి ట్లనియె. 97

క. బహుకాలము నీతోడను, విహరించితి నిలువఁబడియె విషయసుఖైక
స్పృహ యిప్పుడు గడు ముదిసితి, నిహభోగము లింక నుడుగు టెంతయు నొప్పున్.

వ. అనిన హంసి యి ట్లనియె. 99

క. భోగము లెప్పుడు వలయును, భోగాత్మక మిజ్జగంబు భూదేవవరు
లర్థార్థముగాఁ దపములు, యాగంబులు సేయుచునికి యాత్మ నెఱుఁగవే?. 100

సీ. అనిన రాయంచ యి ట్లను విను భోగైకసక్తులు సంతతసంగపరులు
నగువారిమతి పరమార్థదర్శిని యెన్నఁ దగుఁ? జెప్పుమా వార లర్థబంధు
పుత్త్రమిత్త్రకళత్త్రములయందు సక్తులై విపులభవాంబుధి వెడల లేక
బహుళపంకపతితవనగజములు వోలెఁ గదల నేరక పొలియుందురుగాక

ఆ. సంకలితచిత్తు నంగనారాగాంధు, నీస్వరోచిఁ జూచితే శుభాంగి!
పుత్త్రపౌత్త్రవృద్ధిఁ బొంది నేఁడును విషయోపభోగనిరతి నున్నవాఁడు. 101

స్వరోచి పరలోకగతుఁ డగుట.

వ. కామినీపరతంత్రుఁ డైనయాస్వరోచి నాతు సదృశుండు గాఁడు నేను వివేకంబునం
జేసి భోగంబులు పరిహరించితి ననిన హంసవచనంబులు విని యాస్వరోచి జాలో

ద్వేగుండై భార్యాసహితంబు వనంబునకుం జని ఘోరతపంబొనరించి నిష్కల్మష
త్వంబునొంది యమరలోకంబున కరిగె నంత. 102

స్వారోచిషమన్వంతరంబున దేవేంద్రాద్యధికారిపురుషులవివరణము.

క. మనువుం గా స్వారోచిషు, వనరుహగర్భుం డొనర్చె వరగుణ! విను మ
మ్మనుకాలంబునఁ బరగిన, యనిమిషులను మునుల నింద్రు నవనీశ్వరులన్. 103

వ. పారావతులు తుషితు లనునామంబుల దేవతలు పరగిరి విపశ్చితుం డింద్రుండై
నెగడె నూర్జుండు స్తంభుండు ప్రాణుండు దత్తోళి ఋషభుండు నీవారుండు నరివం
తుండు ననువారలు సప్తఋషులై యవతరిల్లిరి చైత్రుండును కింపురుషుండు నాదిగాఁ
గల మనుపుత్త్రు లేడ్వురును రాజులై రమ్మన్వంతరంబు గలయంతకాలంబును దత్సం
తానజాతులైన నృపతులు ధరణిం బాలించి రని చెప్పి మార్కండేయుండు. 104

ఉపజాతి. స్వరోచిజన్మంబును వర్తనంబున్, స్వారోచిషాద్యప్రభవంబు విన్నన్
నరుండు నిత్యోన్నతి నవ్యకీర్తి, శ్రీరమ్యుఁ డై ధాత్రిఁ బ్రసిద్ధి కెక్కున్. 105

పద్మాదినిధిమహిమానువర్ణనము.

తే. అనఘ!పద్మిని యనువిద్య నాశ్రయించి, యుండు నెనిమిదినిధు లని విండుఁ దత్స్వ
రూపములచంద మెట్టు లేరూపునను ధ, నావలులు మానవులకు లభ్యత వహించు.

వ. అనిన మార్కండేయుండు. 107

సీ. విను పద్మినీనామవిద్యకు శ్రీ యధిదేవత నిధుల కద్దేవి యూఁత
యనఘ! పద్మము మహాపద్మసంజ్ఞము మకరకచ్ఛపములు మఱి ముకుంద
మును గుందమును నీలమును శంఖమును ననునభిధానములచేత నతిశయిల్లు
దానిచే వీక్షితుం డైనమానవుఁ డిల విత్తసంపన్నత వెలయుఁ జుమ్ము

తే. పద్మనిధిచేతఁ జూడంగఁబడిననరుని, మూఁడుతరములవిభవంబు మూరిఁబోవు
నది ప్రశస్తసాత్త్వికనిధి యగుట నతఁడు, సాత్త్వికుండును దాక్షిణ్యసంభరితుఁడు.

తే. అగుచుఁ గాంచనరజతతామ్రాదిధాతు, వులు పరిగ్రహించుఁ దివిరి విలుచు నమ్ము
యజ్ఞములు సేయుఁ జేయించు నర్థ మిచ్చు,గుళ్లు చెఱువులు కట్టించుఁ గొమరుమిగుల.

వ. మఱియు సత్త్వాధారం బైనమహాపద్మనిధిచేత నీక్షితుం డైనవాఁడు సత్త్వాధికుండై
పద్మరాగాదిరత్నంబులు దంతంబులును బరిగ్రహించు మౌక్తికప్రవాళాదిక్రయ
విక్రయంబులు నొనరించు యోగీశ్వరులకు ధనం బిచ్చి వారి నారాధించు నవ్విభవం
బతనికి నేడుతరంబు లెడతెగ కుండు. 110

క. తామసము మకరనిధి యది, యేమనుజునిఁ జూచె నాతఁ డెంతయును భువి
న్దామసుఁడును దుశ్శీలుఁడు, నైపైమఱువులును విండ్లు నమ్ములు గదలున్. 111

చ. ఎలమిఁ బరిగ్రహించుఁ బృథివీశులతోఁ దగఁ జెల్మి సేయు శూ
రులకు ధనంబు లిచ్చుఁ గడురూఢిగఁ గైదువు లమ్ము విల్చు న
గ్గల మగువిత్తవాంఛఁ జని కయ్యమునం జెనటాఱు నుండ దా
కలిమియు వానితోన తెగుఁ గాని తనూజులకు న్మునీశ్వరా! 112

తే. తామసంబు కచ్ఛపనిధి తదభివీక్షితుండు తామసుఁ డై కడుదుష్టజనుల
తోడ బేహార మెప్పుడు నాడు నొకని, నమ్మఁ డొకపటిఁ గూర్చును సొమ్ము దివిరి.

క. కుడిచిన నోరులకుఁ బెట్టినఁ, జెడు సొమ్మని మనమునందుఁ జింతించుఁ గడుం
జెడ కుండఁ బాఁతు నిల నీ, జడునిధనము లతనితోనె చనుచుండుఁ దగన్. 114

చ. వినుము రజోగుణాత్మకము విశ్రుత మైనలసన్ముకుందనా
మనిధి తదీక్ష్యమాణుఁ డగుమర్త్యుఁడు రాజసుఁ డై పరిగ్రహిం
చు ననఘ! గీతవాద్యముఖసుస్థిరవిద్యలు వందిగాయకా
ర్థినటవిటోత్కరంబుల కతిప్రమదంబున నిచ్చు నర్థముల్. 115

క. బహుసుఖము లనుభవించును, బహుకులటలఁ గలయు మఱియు బహువిధవనితా
స్పృహియై చరించు వినుమ, మ్మహితవిభవ మొక్కపురుషమాత్రమునఁ జనున్.

సీ. మహితరజస్తమోమయము కుందం బను నిధి యది చూచిన నిఖిలధాతు
రత్నధాన్యాదిసంగ్రహమును దత్క్రియ విక్రయంబులు గల్గి వెలయు మనుజుఁ
డవమాన మించుక యైన సహింపఁడు పొగడిన హర్షించి తగఁగ నిచ్చు
బంధుల రక్షించు బహుభార్యుఁడును బహుపుత్త్రవంతుం డై పొలుచు నతని
తే. యేడుతరములు వర్తిందు రూడిగాఁగ, నమ్మహానిధి యష్టభోగాన్వితులును
నధికదీర్ఘాయువులు సుహృదవనపరులు, నగుదు రావంశజులు సుగుణాభిరామ! 117

సీ. సత్త్వతమోగుణాస్పదనీలనిధిసంగతుం డగునరుఁడు సద్గుణయుతుండు
ధాన్యకార్పాసవస్త్రఫలపుష్పసపరిగ్రహాయుక్తుఁడును దరుకాష్ఠశుక్తి
శంఖమౌక్తికజలసంభవాదిక్రయవిక్రయవ్యాపారవిశ్రుతుండు
బహుతటాకారామపద్మినీనిర్మాణఘననదీబంధనదక్షుఁడు నగుచుఁ
తే. చందనాంబరమాల్యభూషణవిశిష్ట, భోగలీలలఁ బొంపిరివోవు చుండు
నతఁడు మూఁడుతరములుండు నవ్విభవ మ, ఖండితం బయి విమలవిఖ్యాతచరిత!

చ. అనఘ! తమోరజోగుణసమన్వితశంఖనిధీక్షితుండు త
ద్ఘనగుణబద్ధుఁ డై కుడుచుఁ గట్టుఁ దొడుం దనయిచ్చ నొక్కఁడు
న్దనయసతీస్నుషాదులకుఁ దా నిడఁ డెన్నఁడుఁ గూడు చీర యే
జనులకుఁ బెట్టఁ డన్నరునిసంపద యాతనితోన వమ్మగున్. 119

వ. అని యిట్లు నరులధనంబున కధిదేవత లైననిధులవిధం బెఱింగించి మఱియును. 120

క. ఒక్కనిధి నరునిఁ జూచిన, నొక్కనిధిగుణంబు లొందు నొగి మిశ్రములై
పెక్కునిధులు చూచినఁ గడు, నక్కజమునఁ బొందు నతని నయ్యైగుణముల్. 121

క. అని నిధిలక్షణములు చెప్పిన విని క్రోష్టుకి! మునీంద్ర! ప్రియ మెసఁగంగా
మనువుల నిరువురఁ జెప్పితి, వినిపింపు తృతీయమనువువిధ మేర్పడఁగన్. 122

ఉత్తమమన్వంతరమహిమాభివర్ణనము

క. ఉత్తానపాదునకు న,త్యుత్తమ యగుసురుచికిం బ్రియుం డగుపుత్త్రుం
డుత్తమనామాఖ్యాతుఁ డు, దాత్తభుజావీర్యశౌర్యధౌరేయుండున్. 123

చ. అమితతనుప్రభామహిమ నర్కుఁ డనంగ నితాంతకాంతి న
య్యమృతకరుండు నాఁగ భువనావనధర్మకళాప్రవీణతన్
యముఁ డన శత్రుమిత్రసముఁడై పొగడొందినయన్నరేంద్రుఁ డు
త్తమచరితుండు భూరిగుణధాముఁడు వంశవివర్ధనార్థమై. 124

క. సురపతి శచి ననురక్తిం, బరిణయ మైనట్లు వేడ్క బహుళ యనుతలో
దరిఁ బెండ్లియై మనం బా, తరుణివిలాసంబునందు తద్దఁ దగిలినన్. 125

సీ. ఇందుండు రోహిణియందు సంతతనిర్భరానురాగారూఢుఁ డైనమాడ్కి
నాకృశోదరియందు యాసక్తుఁ డై యెప్డు మనమున నతఁ డొందుపనులు మఱచి
తనివోక చూడ్కు లాతన్వి సౌందర్యరసామృతం బాదట నాని సొగయుఁ
దరలాక్షితనులతఁ దనసుందరాంగంబు సోఁకించి సంస్పర్శసుఖముఁ బొందుఁ
ఆ. బొలఁతిచెవుల కింపు దళుకొత్త సరసోక్తు, లాడుఁ దివిరి ప్రియము లాచరించుఁ
గళలయందుఁ బ్రీతి గడలుకొనంగ న, మ్మగువవిభ్రమమునఁ దగిలి యిట్లు. 126

మ. అనుకూలుం డయి సంచరింప మది నయ్యబ్జాక్షి యొక్కింత యై
కొని తద్భూపతి నాదరింపదు గడుం గోపించుఁ దా నాతఁ డి
చ్చినమాల్యాభరణంబు లొల్లదు దనుం జేపట్టి బల్మి న్భుజిం
ప నియోగించిన మున్కుచుక్ గుడుచు నల్పం బైనయాహారమున్. 127

క. క్షితిపతి ప్రభూతరాగా, న్వితుఁ డై తన ననుసరింప విపరీతమతి
న్ప్రతికూల యగుచు నవమా, నితుఁగాఁ బతిఁ జేయు నతివ నీచచరిత్రయై. 128

వ. అంత నొక్కనాఁ డమ్మహీకాంతుండు. 129

క. వారవనితలును రాజకు, మారులునుం దాను నెలమి మధుపానరతిం
గూరి మధురగీతము లిం, పారఁగ గాయకులు పాడ నారామమునన్. 130

క. ప్రీతి వినోదించుచు నా, భూతలపతి మధురశీధుపూర్ణచషక మ
న్నాతికి నిచ్చిన నందక, యాతని దెసఁ జూడ కుండె నందఱు చూడన్. 131

ఉత్తముఁడు ప్రతికూల యగుతనభార్య నడవి కంపుట

వ. ఇట్లు మానిని త న్నవమానించిన సిగ్గుపడి కోపించి కుంభనిక్షిప్తం బైనయురగంబును బోలె నిట్టూర్పు నిగిడించి దౌవారికు రావించి యత్యంతదుష్టస్వాంత యైనయిక్కాంతం గొనిపోయి విజనం బైనవిపినంబున విడిచి ర మ్మిదియ నిశ్చయం బిట్లు సేయుము మని పంచిన వాఁడును గాంచనరథం బెక్కించుకొని చని యక్కమలాక్షి నొక్కవనాంతరంబున విడిచి వచ్చిన నచ్చెలువ యబ్భూపతి యిట్లు పరిత్యజించుట తనకుఁ బరమానుగ్రహంబు సేయుట గాఁ దలంచి సంతసిల్లె నంత. 132

తే. ఆలతాతన్వియందు దృఢానురాగుఁ, డగుట నన్యదారపరిగ్రహంబు సేయ
నొల్లఁ డారాజవర్యుఁ డయ్యువిదఁ దలఁచి, వగలఁ బొగులంగ నొకవిప్రవరుఁడు వచ్చి.

ఉత్తముఁడు రాక్షసాపహృత యగుబ్రాహ్మణునిభార్యను దెచ్చి యిచ్చుట.

ఉ. ఆవిభుఁ గాంచి శోకమున నార్తుఁడనై చనుదెంచితిన్ ధరి
త్రీవర! యేమి చెప్పుదు విధివ్యవసాయము? రాత్రి నిద్ర యేఁ
బోవఁగ నాదుభార్యఁ గొనిపోయినవాఁ డొకఁ డెవ్వఁడో యతం
డేవిధమో యెఱుంగఁ దలుపిమ్ముగఁ బెట్టినయట్ల యుండఁగాన్. 134

ఆ. ఎదురు పుట్టకుండఁ బుడమిజనంబులఁ, గావఁ బ్రోవ దిక్కు నీవె కాన
యరసి నాకుఁ దెచ్చి యయ్యింతి నీఁదగు, ననిన నిట్టు లనియె మనుజవిభుఁడు. 135

క. ఎవ్వండు పట్టికొనియెనొ, యవ్వెలఁదుక యెచట నున్నయదియొ యెఱుఁగ కే
నెవ్వని దండింతును సతి, నెవ్విధమున దెత్తుఁ జెప్పు మీద్యచరిత్రా. 136

వ. అనిన నవ్విప్రుం డిట్లనియె. 137

తే. నీవు మాధర్మములలోన నృపవరేణ్య!, కూలి యాఱవభాగంబు గొనుచు మమ్ముఁ
గావఁ బూనినకతమునఁ గాదె యొండు, చింత యెఱుఁగక రేలు నిద్రింతు మేము.

వ. అనిన నన్నరేంద్రుండు. 139

క. ఎట్టిది నీసతిరూపం?, బెట్టిది ప్రాయంబు? భూసురేశ్వర ! శీలం
బెట్టిది? నిక్కము చెపుమా, యెట్టయినను వెదకి తెచ్చి యిచ్చెద ననినన్. 140

తే. నిడుదపొడవును మిడిగ్రుడ్లు బడువుటొడలు, గుంతమోమును గుఱుకేలుఁ గుండకడుపు
మిట్టపండ్లును నెంతయుఁ బెట్టిదంపుఁ, బలుకులును దురాచారంబు బరికితలయు.

తే. కలికి జవ్వన ముడిపోయి కడుఁ గురూప, యై మదీయభామిని యుండు నధిప! యట్టి
దైన నయ్యింతి నొక్కయెగ్గాడ దాని, కింపు మిగులంగ వర్తింతు నిది నిజంబు. 142

వ. అని చెప్పిన విని యమ్మహీపతి గర్హించుచు. 143

క. చాలుం జెప్పకు నీ కా,యా లేటికి మేదినీసురాధిప! యే నాం
డాలిం జేసెదఁ జేకొను, మాలు సుఖార్థంబొ వేదనార్థమొ చెపుమా. 144

తే. సతికి రూ పెంత కలిగినఁ జాలు విప్ర,వర్య! శీలంబ యెక్కుడు వలయుఁ గలుగఁ
గాన రూపును శీలంబు లేనియట్టి, వెలఁది వేయువిధంబుల విడువ వలయు. 145

వ. అనిన నాభూదేవుండు భూపతితో భర్తకు భార్య రక్షణీయ యందు భర్త ప్రజారూపంబునం బ్రభవించుఁ బ్రజారక్షణం బతనికిఁ దన్నుఁ దా రక్షించుకొనుట యని వేదంబులు చెప్పుభార్య యన్యలభ్య యైన వర్ణసంకరంబగు సాంకరదోషంబున స్వర్గంబువలనం బాసి పితృవర్గం బధోగతిం బడు నభార్యుండ నగు నాకు నిత్యకర్మహాని వాటిల్లుఁ దాన నరకప్రాప్తి యగు మఱి యయ్యింతియందు సంతతి యుద్భవించిన నది నిజధర్మంబున నాఱవభాగంబు నీ కొసంగు నింతయు నీ కెఱింగించితి నెత్తెఱంగున నైన నత్తెఱవ నరసి యావలయు ననిన నవ్విప్రవచనంబులు విని యన్నరేంద్రుండు సర్వసాధనసనాథం బైన ఘువారథం బెక్కి చని పృథివీవలయం బెల్లం బరిభ్రమించుచు మహారణ్యంబున నొక్కతపోవనంబు గని యరదంబు డిగ్గి దానిం బ్రవేశించి యందు. 146

తే. కుశకృతాసనాసీనుని విశదతేజు, నొక్కమునిఁ గాంచె నమ్మునియును నరేంద్రుఁ
గని సముత్థితుఁడై కడువినయ మెసఁగఁ, గుశల మడిగి శిష్యునిఁ గనుఁగొని ముదమున.

క. ఇతనికిఁ దె మ్మర్ఘ్య మ్మన, నతఁ డల్లన గురునితో మహాత్మా! యర్ఘ్యం
బితనికి దాతవ్యం బే?, మతిఁ బరికించి నను బనుపు మహితవిచారా! 148

క. అనిన ముని చిత్తమున న, జ్జనపతివృత్తాంత మెఱిఁగి సమ్మదముదితా
ననసంభాషణముల నా, తనికిని గావించి యనియెఁ దద్దయుఁ బ్రీతిన్. 149

ఆ. ఏల వచ్చి తిచటి? కెవ్వరి వెదకెదు, త్తానపాదతనయ! మాననీయ!
యేను నిన్ను నాత్మ నెఱుఁగుదుఁ జెప్పుమా, యనిన నతని కిట్టు లనియె నృపతి. 150

క. ఒకవిప్రునిసతి నెవ్వఁడొ, యొకరుఁడు గొని చనిన దాని నొగి నన్వేషిం
చుచుఁ దూహాలమున మునినా, యక! వచ్చితి నివ్వనమున కది య ట్లుండెన్. 151

క. ఏ నొక్కటి నిన్నడిగెద, మానుగ నా కెఱుఁగఁ జెప్పు మహితదయాధీ
నా! నావుడుఁ జెప్పం దగు, నేనిం జెప్పెద నరేంద్ర! యేమి యడుగుమీ. 152

ఆ. నన్నుఁ గాంచి మున్న మన్ననమై నర్ఘ్య, మీఁ గడంగి యేల యీవు పిదప?
ననిన మునివరేణ్యుఁ డప్పుడ శిష్యు ని,మ్మంటి నీకు నర్ఘ్య మనుఁడు నతఁడు. 153

వ. మత్ప్రసాదంబున నతీతానాగతవర్తమానదర్శి యగుటం జేసి విచారించి పనుపు మనిన నేనునుం బ్రబోధితుండనై మనంబున నీవు స్వాయంభువకులజుండ వర్ఘ్యార్హుండ వగు

దైనను నీకు నిట్టి దర్శనయోగ్యత లే కుండుట యెఱింగి యర్ఘ్యం బీనైతి ననిన
నమ్మహీశ్వరుండు. 144

తే. అర్ఘ్యమునకు నర్హుఁడఁ గానియంతపాప, మేమి చేసితి చెప్పుమా యెఱుక మాలి?
యనిన మునియును మఱచితే మనుజనాథ, విడువకే నీవు బల్మి నట్టడవిలోన. 155

తే. దాని విడిచిన యప్పుడ ధర్మకర్మ, వితతి యెల్లను నీచేత విడువఁబడియె
నొక్కపక్షము గర్మవియుక్తుఁ డైన, యతని ముట్టఁగ రా దండ్రు మహాత్ము లనఘ! 156

క. ప్రతికూలయు దుశ్శీలయు, సతతంబును నైనఁ బత్నిఁ జనదు విడువఁగాఁ
బతికిఁ దగు దానిఁ బ్రోవను, చిత మగుచందమునఁ గూడుఁ జీరయు నిడుచున్. 157

వ. ఇట్టి నిజధర్మంబు నీవు తప్పితేని నిన్ను నెవ్వరు శిక్షింతు? రనిన నాత్తానపాది సిగ్గునం
దలవంచి మునీంద్రా! యింక నీ చెప్పినట్ల చేసెదనివ్వి ప్రుని వెలంది నెవ్వండు గొనిపోయె?
నది యెక్కడ నున్నది? యెఱింగింపవే యనిన నతండు. 158

తే. అద్రిసుతుఁడు బలాకనామాసురేంద్రుఁ, డవ్వనిత నుత్పలావతకాఖ్యవనము
నందుఁ గొనివచ్చియిడినవాఁ డచటికరుగు, మనిన నతఁడమ్మునికి మ్రొక్కి యరదమెక్కి.

సీ. ఆవిపినంబున కతిరయంబునఁ జని యావిప్రు చెప్పిన యట్టివికృత
రూపంబుతో నున్నయాశాత్రిఁ గని చెల్వ యావనంబునకు నీ వెట్లు వచ్చి?
తెలిఁగింపు వైశాలియింతివే నావుడు నగుదు నే నతిరాత్రుఁ డనుమునీంద్రు
సుత నింటిలో సుఖసుప్త నైయుండఁగఁ బతిపితృభ్రాతలఁ బాపి నన్ను
ఆ. నధిప! విను బలాకుఁ డనురాక్షసుఁడు రాత్రి, యపహరించి యీవనాంతమునకుఁ
జేర్చె శోకవహ్ని పేర్చుచు నిందున్న, దాన బంధుజనులఁ దలఁచి తలఁచి. 160

క. ననుఁ దెచ్చినకారణ మో, జనవల్లభ! యెఱుఁగ నన్నిశాచరుఁడు రయం
బున మ్రింగఁడు నాతో నిం, పొనరఁగ భోగింపఁ డనిన నుర్వీశుఁ డనున్. 161

క. నిను వెదకఁగ నీవిభుఁడం, పున వచ్చినవాఁడ నెందుఁ బోయె నిశాటుం
డనిన నది యిట్టు లను ని, వ్వనాంతమున నున్నవాఁడు వాఁడు నరేంద్రా! 162

మాలిని. దనుజభటవరీతు న్దైత్యు నారాజు గాంచె
న్వినయనిభృతు లొప్ప న్వేగ వాఁడు న్నిరంబుల్
జనపతిచరణాంభోజాతము ల్సేర్చి చిత్తం
బునఁ బ్రమదరసం బుప్పొంగ నత్యంతభక్తిన్. 163

స్రగ్విణి. నీవు నాయింటికి న్నెమ్మి నేతెంచుటన్
దేవ! ధన్యుండ నైతి న్నను న్భృత్యునిం

గా విచారింపు మే కార్య మైనం దగఁ
భూవరా! పంపు మేఁ బొల్పుగాఁ జేసెదన్. 164

వ. ఆర్ఘ్యంబు పరిగ్రహింపు మీఁదుచిరాసనంబున నాసీనుండవగుమనిన నన్నరపతి యిట్లనియె.

చ. చెలువుగ నాకు సర్వమును జేసినవాఁడవు నీవు చెప్పుమా
విలసితరూపకాంతిగుణవిశ్రుత గాదు పరిగ్రహింప నాఁ
కలి యుడుగంగఁ దత్పిశితఖాదన మేల యొనర్ప? వేల పే
రలుక మహీసురోత్తమునియంగనఁ దెచ్చితి రాక్షసేశ్వరా?. 166

వ. అనిన నతండు. 167

తే. జనుల భక్షించుకష్టరాక్షసుల మేము, గాము పురుషులు పడఁతులు గడఁగి సేయు
కర్మములయందు వికలత గలిగినప్డు, డాఫలంబులఁ దృప్తుల మగుదు మధిప!. 168

తే. పరులు గోపించినప్పుడు నరవరేణ్య! తత్స్వభావంబు లగుశాంతిదాంతిగుణము
లేము హరియించెదము గాని హీనవృత్తిఁ, దినము నరమాంస మన్యదైతేయులట్ల. 169

తే. అచ్చరలకంటె నొప్పెడునసురసుదతు, లధిప! పెక్కండ్రు గలరు నా కకట! మనుజ
వనితయం దేల రతి పుట్టు? ననిన వెండి, యేల తెచ్చితి ద్విజకాంత? నెఱుఁగఁ జెపుమ.

చ. అనుటయు రాక్షసుండు మనుజాధిప! యాద్విజుఁ డధ్వరంబులం
దనిశము ఋత్విజుం డయి మహాసురనాశకరోగ్రమంత్రము
ల్దనహృదయంబున న్జపము తత్పరుఁడై యొనరించుచున్కి మా
కు నచటఁ జేర రాక యలఘుక్షుధ నార్తులమై మనంబునన్. 171

వ. ఉచ్చాటనమంత్రకర్మపరుం డైనయావిప్రునితోడం బగ గొని. 172

ఆ. అలుకఁ పురుషుఁ డధ్వరాదిక్రియా, బాహ్యుఁ డౌట యెఱిఁగి బ్రాహ్మణునివ
ధూటిఁ దెచ్చి యతనిఁ ద్రోచితిఁ గర్మవై, కల్యదురితమున నకల్మషాత్మ! 173

వ. అనిన నతివిషణ్ణుండై యంతర్గతంబున విప్రునికర్మవైకల్యం బుగ్గడించి వీఁడు నన్ను నిందించుచున్నవాఁ డమ్మునిపతియుం నర్ఘ్యంబునకు నర్హుండవు గావని గర్హించె నపత్నీకత్వంబున నింత నికృష్టుండ నగుదునే యని వగచుచున్న జగతీపతికి నద్దనుజుండు మ్రొక్కి కృతాంజలియై దేవ! భవద్దేశనివాసి యైననాయట్టిభృత్యుఁడు గలుగ నీకింత చింతింప నేల? యేమిపని చేయుందు? పనుపు మనిన నన్నరేంద్రుఁ డసురేంద్రున కిట్లనియె.

క. నరులనిజభావగుణములు, హరింతు నని పల్కెదీవు ప్రార్థింపుదు ని
న్గర మర్థిని హరియింపుము, ధరణీసురధర్మపత్నిదౌశ్శీల్యంబున్. 175

ఆ. అట్లు సేసి లేని యభ్యాగతుఁడ నైన, నాకు సర్వమును మనఃప్రియంబు
చేసినట్లు యిదియుం శీలసమన్విత, యై నిశాచరడ నరుగు ననిన. 176

మ. తనమాయ న్దనుజుండు విప్రవనితాంతస్సంప్రదేశంబు చే
సి నృపాక్షి న్నిజశక్తి నాసుదతిదాక్షిణ్యం బొగి న్మ్రింగ మ్రిం
గిన నక్కాంత సుశీలయై వినయలక్ష్మీస్ఫూర్తి శోభిల్ల ని
ట్లనియె న్స్ఫురితతోద నిర్భరగరీయఃప్రౌఢవాక్యంబులన్. 177

సీ. పరికింప నాకర్మపరిపాక మెట్టిదో పతిఁ బాసి యడవులపాలు పడితి
దనుజుండు దయ మాలి ననుఁ బట్టికొని యిట్టు దెచ్చెఁ బాపపువిధి దెచ్చెఁ గాక
యేతెరు వైతినో యనని పురపురఁ బొక్కుచుండరె బంధు లక్కటకట!
యొరులకుఁ దొలుమేన నుసుకులఁ బెట్టినదాని కిప్పా టేల మాను రాక?
ఆ. యేమి సేయుందాన? నేగతిఁ బోదు? నిం, కేవిధమున భర్త కెలమి మిగులఁ
బరిచరింపఁ గాంతు భక్తిమై? మజ్జన్మ, మిటుల పోవునో కదే నరేంద్ర!. 178

చ. అన విని రాక్షసుండు వసుధాధిప! యీయెలనాగ నీదుపం
పునఁ బతి యింటికిం గొనిపోయెద నేఁ గరణీయ మెద్దియై
నను నొనరించెదం బనుపు నావుడు నిప్పని చేఁత సర్వము
న్దనుజవరేణ్య! నీవు ప్రమదంబునఁ జేయుట నాకుఁ జెచ్చెరన్. 179

వ. ఇమ్మానిని ననిచి రమ్ము పని గలయప్పుడు నిన్నుం దలంచెద వచ్చునది యనిన నద్దనుజ
వరుం డట్ల కాక యని సుశీలయుం శుద్ధాంతరంగయుం నైనయాద్విజాంగన నెత్తికొని
తదీయగృహంబునకుం జనియె నిట్లు మహీపతి యయ్యింతి నటఁ బుచ్చి యంతర్గ
తంబున. 180

ఉత్తముండు త్రికాలజ్ఞమునివలన బహులావృత్తాంతము నెఱుంగుట.

సీ. భర్తృసౌభాగ్యుండవు గావని నన్నుఁ గడుఁ గష్టముగఁ దూఱుఁ బలికె నమ్మునివరుండు
బ్రాహ్మణుఁ బిలిచి యీరాక్షసుండును బత్ని లేనివాఁ డెంతయు హీనుఁ డనియె
నేమి సేయుందు? భార్య నే నేల విడిచితి? నెక్కడఁ గాంతు? నిం కేది తెఱఁగు?
పరమప్రబోధసంపన్ను నమ్మునిఁ బోయి యడిగెదఁ గాక యయ్యతివవృత్త
ఆ. మని మునీంద్రుకడకుఁ జని మ్రొక్కి యవ్విప్రు, కాంతఁ గనుట దనుజుకడకుఁ జనుట
దాను బనుప దానిదాక్షిణ్య మడఁచి నాఁ, డపుడు భర్తయొద్ద కనుపఁ బోక. 181

వ. చెప్పి యాభూభుజుండు నిజాగమనకార్యం బెఱింగించిన నత్తపోధనుండు. 182

క. జననాథ! నన్ను నడుగఁగఁ, జనుదెంచినకార్య మేను సర్వంబు మనం
బున దివ్యదృష్టి నెఱుఁగుదు, విను సెప్పెద నీకుఁ దగునె విడువఁగ భార్యన్. 183

ఉ. ఆరయ సర్వకర్మముల కర్హులు గారు తలంచి చూడఁగా
దారవిహీను లైనవసుధాసురభూవరవైశ్యశూద్రుల

స్వారలు పత్ని! స్మృతి నవశ్యముఁ బాయఁగ రానియట్లు వి
స్ఫారయశోవరేణ్య! పతిఁ బాయఁగ రాదు తదీయభర్తకున్. 184

గీ. కారణము పత్ని ధర్మార్థకామములకుఁ, గానఁ దత్త్యజనంబున మానవేంద్ర!
వినుము నిఖిలధర్మంబులు విడిచి తకట!, యింత యొప్పమి సేయుందే యెఱుకమాలి.

చ. అని ముని పల్కిన న్విని జనాధిపుఁ డూర్పులు సందడింప నె
మ్మనము చలింపఁగా నకట! మత్సుకృతం బిటు లుండ నేమి సే
య నగు? నను న్దొఱంగు నొకొ యంగన యన్వెఱ నెట్టు సేసిన
న్మన మెఱియంగ నైఁతు సుజనస్తుత! యిచ్చకు రాఁ జరించుచున్. 186

క. అనుకూలుండ నై సతతము, గనుసన్నన యేను మెలఁగఁ గా దాక్షిణ్యం
బునఁ దాఁ బ్రతికూల యయిన, విను మెంతయు విసిగి దాని విడిచితి నడవిన్. 187

ఉ. ఎక్కడఁ బోయెనో యడవి నింతి మహోగ్రమృగాసురాళిచేఁ
జిక్కి నశించెనో యనినఁ జిక్కి నశింపదు సచ్చరిత్రయై
యక్కమలాక్షి యున్నది ధరాధిపవర్య! రసాతలంబునం
దక్కడ కెట్టు లేఁగె నొకొ యంగన యన్న మునీంద్రుఁ డిట్లనున్. 188

వ. వినోదార్థంబు భూతలంబునకు వచ్చి. 189

గీ. అడవిఁ గ్రుమ్మరుచున్న యయ్యబలఁ గాంచి, పాలపోతుఁ డనియెడుసర్పరాజు
సానురాగుఁడై తనదుమాయాబలమునఁ, బట్టుకొని పోయెఁ బన్నగభవనమునకు. 190

వ. కొనిపోయిన నాదండశూకేంద్రనందన యగునంద యాసుందరీరత్నంబు నాలోకించి
యిది మాతల్లికి సవతి గాకుండ వలయు నని తలంచి యంతఃపురంబున నొక్కయేకాంత
మందిరంబున నునిచి దాఁచిన నాపాఁపఁ డేఁడు కూఁతుం బిలిచి యచ్చెలువ యేది చెప్పు
మనిన నుత్తరం బీమికిం గోపించి మూకత్వంబు నొందు మని దాని శపియించె నిట్టి
అంగన భవదీయపత్ని సర్పపతిచేత నీతయై తత్తనయచేత రక్షితయై యున్నయది
యనిన నమ్మహీశ్వరుండు వార్షించి యిట్లనియె. 191

గీ. ప్రాణములకంటె నెక్కుడ దప్పుడఁతిమీఁదఁ, బ్రీతి బాహుడెందమున నస్నాతి నన్ను
నొల్ల కెపుడు దుశ్శీలయై యుండు దీని, కేమి కారణ? మెఱిఁగింపవే మునీంద్ర!.

వ. అని యడిగిన నతం డిట్లనియె. 193

చ. పరిణయవేళ నిన్ను రవిభౌమశనైశ్చరులు న్భవత్సతిన్.
సురగురుదైత్యమంత్రులును జూచుటఁ జేసి నరేంద్ర! నీకు న
త్తరుణిమనోహరాకృతి ముదం బొనరించుచు నుండెఁ జూడ్కి క
త్తరుణికి నీదుమూర్తి ప్రమదం బొనరింపమి నట్టి దయ్యెడిన్. 194

క. అని చెప్పి మేదినీశ్వర!, చనుము సతియును నీవుఁ గూడి సద్ధర్మమున
జ్జనపాలనమ్ము సేయుము, ఘనముగ నొనరింపు విహితకర్మము లెల్లన్. 195

గీ. అనిన మునికి మ్రొక్కి యరదంబు పైన నెక్కి, నిజపురమున కేఁగె నృపతి యంతఁ
గడు సుశీల యైనకాంతతోఁ గూడి సౌఖ్యమున నున్న విప్రుఁ డధిపుఁ గాంచి.

వ. ఇట్లనియె. 197

చ. నిరుపమధర్మవేది వయి నీ విటు నాసతిఁ దెచ్చి యిచ్చుట
న్నృపవరేణ్య! యేను గడుఁ బుణ్యచరిత్రుఁడ నైతి నావుడు
న్నరపతి భార్య నాకు సదనంబున నిప్పుడు లేమిఁ జేసి భూ
సురవర! నిత్యకర్మబహుశోభనహీనత నేను బొందితిన్. 198

సీ. అనుడు భూసురవరుఁ డధిప! నీకాంత గాంతారాంతరశ్వాపదములు మ్రింగ
కున్నె నీ కిది చాలు నొండుకన్యకఁ బెండ్లి గా వేల? యన్న నాభూవరుండు
మృగబాధఁ బొరయ దామృగనేత్ర సుచరిత్ర యై యున్న దదియును నైనఁ దెచ్చి
కొనఁ బోల దది ప్రతికూలత్వమునఁ బోరుచుండు నాతో నెప్డు నోర్వఁ జాల
తే. నాలు పోరిన మనవచ్చు నయ్య? దుఃఖమునకొ సుఖమునకొ నరులమనువు చెపుమ
యనిన బ్రాహ్మణుఁ డుపకారి యైననీకు, హితము సేయంగఁ గంటి నరేంద్ర! వినుము.

గీ. మైత్రియును నానుకూల్యంబు మచ్చికయును, గలిగి యకాంతనిన్నెప్డు గలసియుండ
మిత్రకాముకు లొనరించుమిత్రవింద, యెట్టి దట్టిది గావింతు నే నరేంద్ర! 200

వ. అయ్యింతి యెక్కడ నున్నది వేగ రావింపు మనిన పార్థించి యన్నరవరుం డప్పుడ
మిత్రకామేష్టికిం దగినసంభారంబులు సమకట్టి తెప్పించిన నవ్విప్రవర్యుండు నియ
తుం డై యాభూపతిభార్య యనుకూలయును సుశీలయుఁ గా వలయు నని సంకల్పించి
యాశతపత్రనేత్రయందు మైత్రి నారోపించి యపుడ మిత్రకామేష్టి యొనరించి
రాజు నాలోకించి. 201

క. రావింపుము సతి రయమున, భూవర! యిష్టోపభోగములు హర్షరస
శ్రీ వెలయ ననుభవింపుము, కావింపుము క్రతువు లధికగౌరవ మెసఁగన్. 202

గీ. అనిన విస్మయస్మేరాక్షుఁ డై విభుండు, తలఁచె సత్యవాగ్ధుర్యు నాదనుజవర్యు
నతఁడు రయమున వచ్చి భూపతికి మ్రొక్కి, యేమి పని యొనరింతు నరేంద్ర! చెపుమ.

చ. అనుడు విభుండు దైత్యునకు నంతయుఁ జేర్పడఁ జెప్పెఁ జెప్పినం
జని యతలంబుఁ జొచ్చి నృపసత్తముదేవి నతండు దెచ్చెఁ దా

చ్చినఁ బతిఁ జూచి కంపమును సిగ్గును శైత్యము నగ్గలింప నం
గన గరుణం బ్రసన్నుఁడవు గమ్ము నరేశ్వర ! నాకు నావుడున్. 204

క. ఏ నీ కెపుడుఁ బ్రసన్నుఁడఁ, గానే తరళాక్షి! క్రొత్తగా నిటు పలుకం
గా నేల? యనుచు విభుఁ డ,మ్మానిని వెసఁ గౌఁగిలించె మదనాతురుఁ డై. 205

వ. ఇట్లు దన్నుఁ గౌఁగిలించుకొని ప్రసన్నుం డయి యున్న యతనికయ్యింతి యిట్లనియె.

క. చిత్తము నీకుఁ బ్రసాదా, యత్తం బై యున్న దేని యడిగెద విను రా
జోత్తమ! యొక్కటి నినుఁ దలఁ, కొత్తక యది సేయు మనుడు నుర్వీశుండున్.

క. ఏ నీకు దక్క యుండం,గా ని ట్లన నేల? యెంత కడిఁది యయిన న
బ్జానన! చేసెద నీప్సిత, మైనది నిశ్శంక మడుగు మనుటయుం నది యిట్లున్. 208

సురథ చేసినసారస్వతేష్టిచే నంద యను నాగకన్యమూఁగతనముమానుట.

చ. జనవర! నానిమిత్తమున సర్వపరాత్మజ తండ్రి త న్నపిం
చిన విను మూకభావమును జెందిన దాలలితాంగి నాకు న
చ్చినచెలి వాగ్విభూతి విలసిల్లఁగ దానికిఁ జేఁత నాదునె
మ్మనమున కిం పెలర్పఁగ సమస్తము నీ వొనరించిన ట్లగున్. 209

గీ. అనుఁడు విప్రునిఁ జూచి యమ్మనుజవిభుఁడు, వాగ్విభవ మెట్లు గల్గు నవ్వనిత కనిన
నేను సారస్వతేష్టివిధానమున భ,వద్వధూటీసఖికి నిత్తు వాగ్విభూతి. 210

వ. అని యప్పుడు సారస్వతేష్టి యొనరించి యమ్మహీసురుండు సారస్వతసూక్తంబులు
జపియించె నంత గర్గుం డనుముని రసాతలంబున కరిగి యురగపతినందన కంత వృ
త్తాంతంబును జెప్పిన విని. 211

క. ఆనంద దనమనమ్మున, నానందముఁ బొంది నావయస్యావిభుఁడే
మానుగ నా కుపకారము, దా నొనరించె నని మెచ్చి తద్దయుఁ బ్రీతిన్. 212

గీ. అపుడ కదలి యప్పురమున కరుగుదెంచి, యాత్మసఖిఁ గాంచి కౌఁగిట నర్థిఁ జేర్చి
యధిపు నందంద దీవించి యాభుజంగి, యాసనాసీన యై యిట్టు లనియె ననఘ!

క. కర ముపకారము నాకుం, దిరముగ నొనరించి తీ వతిప్రియమున భూ
వర! యేను మెచ్చి వచ్చితి, వర మిచ్చెద నీకు విను దివాకరమూర్తీ! 214

ఉ. నీతనయుండు సర్వధరణీపరిపాలనకేళిదక్షుఁ డై
యాతతధర్మకర్మరతుఁ డై మహనీయతరాస్త్రశస్త్రవి
ద్యాలివిదగ్ధుఁ డై భుజబలాధికుఁ డై పెను పొందు దీధితి
ద్యోతితచక్రవిక్రమమహోద్ధతి నప్రతిమానుఁ డై మహిన్. 215

వ. అతఁడు మహనీయుఁ డైనమను వై నెగడు నని వరం బిచ్చి యచ్చెలువ నచ్చెలిం గౌఁగిలించుకొని నిజభవనంబున కరిగి యంత నమ్మహీకాంతుం డక్కాంతారత్నంబుతో నితాంతప్రమోదంబున మనోభవసుఖంబు లనుభవించుచుఁ బ్రజాపాలనంబు సేయుచుండఁ బెద్దకాలంబు సనుటయు. 216

ఉత్తమమనుజననము.

క. పూర్ణిమ నుదయం బగుసం, పూర్ణసుధాంశుఁడును బోలెఁ బుత్రుండు దిశా
పూర్ణద్యుతి యై యావర, వర్ణినికిం బుట్టె సురలు వర్ణన సేయన్. 217

వ. అప్పుడు. 218

గీ. మొరసె దివ్యతూర్యములు పుష్పవర్షంబు, గురిసె జనులు ప్రమదభరితు లైరి
సకలమునులు నెలమిఁ జనుదెంచి యుజ్జ్వలా, కారుఁ డైనయక్కుమారుఁ జూచి.

క. ఉత్తమ మగువంశంబున, నుత్తమకాలమున నీతఁ డుత్తమతనుఁ డై
యుత్తమనృపతికిఁ బుట్టుట, నుత్తముఁ డనుపేరఁ బరఁగు నుర్వి నని మునుల్. 220

క. చని రంతఁ బెరిఁగి యుత్తముఁ, డనఘుఁడు మను వయ్యె నుత్తమాఖ్యానంబు
న్వినినను జదివిన వనితా, తనయోపేతు లయి మండ్రు ధరణీజనముల్. 221

వ. ఆయుత్తమమన్వంతరంబున దేవతలు స్వధాములు సత్యులు శివులు ప్రతర్దనులు వశవర్తులు నన నేనుగణంబు లై వర్తిల్లిరి సుశాంతి యనువాఁడు శతక్రతువు లొనరించి యింద్రుం డై పరగె నిప్పుడు నిలాతలంబున నుపసర్గదోషంబులు చెడ శాంతుండును దేవకాంతుండును నైనసుశాంతి మాకు శాంతి యావలయు నని నిగమసూక్తంబులు పఠింతురు సుతేజసుఁడును సుతపుఁడును నాదిగాఁ గలవసిష్ఠపుత్త్రులేడ్వురును సప్తఋషు లై చరించిరి మనువునకు బలపరాక్రమవంతు లైనయజాదులు పెక్కండ్రు కొడుకులు పుట్టిరి తత్సంతానజాతు లగుభూపతు లనేకు లమ్మనువుకాలంబు డెబ్బదియొక్కమహాయుగంబులును మహీవలయంబు పరిపాలించి రిది తృతీయమన్వంతరప్రకారం బింక వియోనిజాతుం డైనచతుర్థమను వగుతామసుజన్మంబు ప్రభావంబును జెప్పెద నాకర్ణింపుము. 222

తామసమన్వంతరమహిమానువర్ణనము.

చ. అతులితభూరిబాహుబలుఁ డాహవకేళిజితారి సంతత
క్రతువిభవాభిరాముఁడు సురాష్ట్రుఁడు నాఁ గలఁ డొక్కమేదినీ
పతి యతఁ డాయువెక్కుడుగ బ్రాహ్మణవర్గముచేతఁ గాంచి యం
చితగతి నూర్వు రంగనలఁ జెల్వుగఁ బెండిలి యయ్యె వారలన్. 223

గీ. వంధ్య వైరి కాలవశమున నంత న, వ్వనితలును నమాత్యులును సమస్త
బంధుజనులు దెగిరి బలహీనుఁ డయ్యె న, వ్విభుఁడు భృత్యతతియుం విడిచె నతని.

క. అతిదుఃఖితుఁ డగుచా భూ,పతిఁ ద్రోచి విమర్దుఁ డనునృపతి రాజ్యం బు
ద్ధతిఁ గొనియె నతఁడు రాజ్య,చ్యుతుఁ డై యొక్కరుఁడు నరిగె నుగ్రాటవికిన్. 225

సీ. అరిగి వితస్త నాఁ బరగుమహానదితటమున నుండి నిదాఘవేళ
నగ్ని నల్గడ మండ నర్కునిఁ జూచుచు వర్షకాలమున దుర్వారవృష్టి
పైఁ బెల్లు గురియంగ బయల నిలిచి హిమసమయంబులం దుదకములు సొచ్చి
యతినిష్ఠతో నిరాహారుఁ డై తపము నిరంతరమును జేయ నంత వర్ష
తే. కాలమున నీలనీరదజాల మడరి, నింగియును దిక్కులును గడు నిండఁ బర్వి
నిమిష మైనను నిలువక నిగ్రహముగఁ, గుండ గూల్చినక్రియ వాన గురియఁ జొచ్చె.

వ. అట్టిసమయంబున. 227

క. ఇది పూర్వం బిది దక్షిణ, మిది పశ్చిమ మిది యుదీచి యిది దివి యనితోఁ
చద యించుకయును సాంద్రాం,బుదపటలము కరము భువనపూర్ణం బైనన్. 228

వ. అంత. 229

ఆ. రెండుదరులు ముంచి యొండొండ వెల్లువ, యగ్గలింప నురువు లడలుదేర
నతిరయమునఁ బఱచునయ్యేటి పట్టొడ్డి, పోయె దవ్వుగాఁగ భూవిభుండు. 230

వ. అట్లు పోవుచు నప్పుడమిఱేఁ డయ్యేటినీటిలో నీఁదుచు నొక్కపిడిదుప్పి చేరిన దానితోఁక పట్టికొనియె నది యీడ్చుకొని పోవ నప్పెనుఁజీకటి దిక్కు దెస యెఱుంగక యిట్టట్టునుం దిగిచి యెట్టకేలకు దరి యెక్కిన నతండు మఱియును దానితోఁక విడువక చని మనోహరం బగునంబు గని యన్నిబిడాంధకారనీరంధ్రం బగుదానిలోనికి నమ్మృగి తపఃకృశుండును మహాభాగుండును నగునతనిఁ దిగిచికొని చనునప్పుడు. 231

చ. కర మనురాగ మ్లమునఁ గ్రమ్మఁగ నమ్మృగిపుచ్ఛమూలము
న్గరమున నంటుచు న్నృపతి కామవికారము నొందె వీఁకఁ ద
త్పరమతి యై తనుం దివుచుపార్థివుచిత్త మెఱింగి యేల నీ
కరమునఁ బుచ్ఛమూల మిటు కాయ్యనఁ బట్టెదు మేదినీశ్వరా!. 232

వ. అనుచుం దదీయసంస్పర్శనసుఖంబు నొంది. 233

క. ఏ నీ కగవ్య నే య, స్థానంబున మనసు పుట్టఁ దగునే యోధా
శ్రీనాయక! యీకార్యము, గా దేరదు నీదకోఁకలు తప్పెం జుమీ. 234

సురాష్ట్రునికి మృగి చెప్పినతనపూర్వజన్మవృత్తాంతము.

గీ. ఎట్టు లంటేని మనుజేంద్ర! యిట్టిమనకు, లోలుఁ డనెడిమహాత్ముండు లోభమనను
విఘ్న మొనరించె మదిఁ గిన్కవెలయ ననిన, నమ్మృగికి నవ్విభుం డిట్టు లనియె ననఘ!

గీ. ఇట్టు లన్ననీ వెవ్వతె? వెట్టుపలికె, దవు మనుష్యభాషలు? లోలుఁ డెవఁ? డతండు
నీకు నాకును సంగతి లేక యుండ, విఘ్న మివ్వ డొనర్చినవిధముఁ జెపుమ. 236

గీ. అనిన మృగి యిట్టులను విను మనుజనాథ!, యగుదు నేనూర్వరాంద్రలో నగ్రమహిషి
నుత్పలావతి యనియెడునువిద నార్యుఁ, డైనదృఢధన్వభూకాంతుర ననిన నతఁడు.

క. అక్కట! సాధ్వివి సువ్రత, వెక్కుడు ధర్మములు సేయు దెపుడు నియతితో
నిక్కడుభవముఁ బొందఁగ, దక్కఁగ నీవేమి దుష్కృతముఁ జేసితివో! 238

వ. అనిన నమ్మృగి యిట్లనియె. 239

సీ. మాతండ్రియింట నేఁ బ్రీతిఁ గొండికనాఁడు చెలులతో నాడుచు నెలమి నొక్క
యారామమునకుఁ గ్రీడార్థంబు చని మృగి మృగమును గని యందు మృగవధూటి
కెలదీఁగఁ గొని వెస నెత్తి వ్రేసిన నది బెదరి పాఱుటయుఁ దప్పి యొకఁడు గనలి
గర్వించి మే మెఱుంగక వ్రేసి దుశ్శీల వై నామనోరథ మఫలితముగఁ
ఆ. దగునె సేయ? ననినఁ దన్మానుషోక్తులు, విని భయంబుఁ బొంది యనఘ! యిట్టి
భవము నీకు నెట్టు పాటిల్లె? నెవ్వఁడ, నీవు? సెప్పు మనిన నిట్టు లనియె. 240

వ. ఏను నివృత్తచక్షుం డనుసంయమిపుత్రుండ సుతపుం డనువాఁడ నీమృగియందు బద్ధానురాగుండ నై మృగరూపంబు ధరియించి దీనివెనుక వచ్చితి నావలన నిదియుం నెఱుకువ గలిగి యున్నతఱి నీ విట్లు చేసితి దుష్టచిత్తవైన నీకు శాపం బిచ్చెద ననిన వడవడ వడఁకుచు నజ్ఞానంబున నాచేసినయపరాధంబు సైఁపు శపియింపకు మనిన మునివరుండు నన్ను వరియింపు మట్లైన నిన్ను శపింప ననవుడు నేను నవ్వుచు నిట్లంటి.

క. మృగిఁ గా నేను మునీశ్వర! మృగరూపము దాల్చి యడవి మెలఁగెడునీకు
న్మృగవనితలు ప్రాఁతే యని, తెగడిన నతఁ డుగ్రకోపదీప్తాననుఁ డై. 242

క. మృగిఁ గా నే నని నన్నుం, దెగడితి గావేని యింకఁ దెల్లముగా నీ
వగము మృగి వని నిరాకృతి, దగఁ దాల్చి శపించె నన్ను ధరణీనాథా! 243

సీ. అట్లు శపించిన నమ్మునీశ్వరునకుఁ బ్రణమిల్లి సైరింపు బాలఁ గానె?
జనకుఁడు వెలిగాఁగఁ దనయంతఁ గన్నెకుఁ బతి వరియించుట పాడియగునె?
యెఱుఁగవే స్త్రీధర్మ మిట్లేల కోపింప? నని పెక్కుమార్లు ప్రార్థనముఁ జేయ
నను జూచి యో చెల్వ! నాపలు కిట్టిదో యట్టిది నీవు జన్మాంతరమున

తే. నగుడు మృగివి జాతిస్మర వైతివదియ,గర్భమున లోలుఁడనువాఁడు ఘనుఁడు సిద్ధ
వర్యసంయమిపుత్త్రుండు వచ్చి పొందు, నవుడు నీకు మనుష్యవాక్యములు గల్గు.

క. ఆమ్ముని పుట్టుటయుఁ మృగీ, త్వమ్ము విడిచి నీవు సనుము వనితా! శుభలో
కమ్ముల కాలోలుండును, బమ్మినతేజంబు దెసలఁ బరగఁగ నంతన్. 245

క. అనుపమభుజబలవిక్రము, ఘనుఁ డగుమను వై ధరిత్రిఁ గడుఁ బేర్చి రణం
బునఁ బితృశత్త్రులఁ బోరిగొని, జనులం బాలించు ధర్మసంపద వెలయన్. 246

వ. అని యమ్మునీంద్రుండనుగ్రహించి చనియె నది కారణంబుగా నేను దిర్యక్త్వంబునం
బొంది భవత్కరస్పర్శనంబున నిపుడ గర్భంబు ధరియించితి నిట్లగుటం జేసి నీతో
నిప్పుడు. 247

క. ఏ నీ కగమ్య నేయ,స్థానంబున మనసు పుట్టఁ దగునే యంటి
న్దాను రతివిఘ్ను ముదరము, లోనుండుట మనకు నిట్లు లోలుఁడు సేసెన్. 248

తామసమనుమహిమాభివర్ణనము.

వ. అని యిట్లు మృగాంగన చెప్పిన విని యన్నరేంద్రుండు పరమానందంబునం బొందె
నంత. 249

ఉ. ఆమృగికి న్సుతుండు సముదంచితతేజుఁడు సర్వలక్షణ
శ్రీమహితుండు పుట్టుటయుఁ బ్రీతి వహించె సురాష్ట్రభూవిభుం
డామృగి దేహము న్విడిచె నప్పుడు శాపవిముక్తయై ముని
స్తోమము వచ్చె నాసుతునిఁ జూడఁ బ్రమోదముఁ బొందె భూతముల్. 250

వ. అప్పుడు. 251

గీ. ఘనతమంబు జగంబులఁ గప్పియున్న,వేళఁ దామసయోని నావిర్భవించెఁ
గాన నితఁడు తామసుఁ డనఁగాఁ బ్రసిద్ధుఁ,డైమహావృద్ధిఁ బెనుపొందు ననిరి మునులు.

చ. జనకుఁడు పెంపఁగాఁ బెరిఁగి సౌమ్యుఁడు తామసుఁ డిద్ధబుద్ధియై
జనకునితోడ నీవు మునిసత్తమ! యెవ్వఁడ? వెట్టు లేను నీ
తనయుఁడ నైతి? మజ్జనని దా నది యెవ్వరు? నీకు నేల యీ
వనమున కేఁగుదే? యనుడు వానికి సర్వము తండ్రి చెప్పినన్. 253

చ. విని చని యప్పుభానుని త్రివేదమయుం దగఁ గొల్చి తత్కృప
న్వినుతమహాస్త్రశస్త్రముల విశ్రుతుఁడై జనకుండ్రిఁ దొల్లి యో
ర్చినరిపులం బరాజితులఁ జేసి మదం బఱఁ బట్టి తెచ్చి పెం
పు సెయ వారల న్విడిచి పుచ్చెఁ గృతజ్ఞజనకుండు పంపఁగాన్. 254

గీ. అట్లు తామసుండు నమితపరాక్రమ, విదితుఁడై స్వధర్మస్థితిని [illegible]
దనువు విడిచి యతనితండ్రి నిజార్జిత, పుణ్యలోకమునకుఁ [illegible] 255

క. తనభుజవీర్యము శౌర్యము, తనరఁగ జగ మెల్ల గెలిచి తామసుఁడు మహా
త్మను వయ్యె వినుము తదంతరమునఁ గలయనిమిషుల నింద్రు మునులనృపతులన్. 256

వ. సత్యసుధీస్వరూపహర్యాదయు లను నామంబుల సుర లిరువదియేడుగణంబు లైరి శత
యజ్ఞోపలక్షణుం డైనశిబి యింద్రుం డయ్యె జ్యోతిర్ధాముండును బృథుండును గావ్యుం
డును చైత్రుండును నాదిగా సప్తము లైరి నరుండును ఖ్యాతికరుం డును శాంతియు
భయుండును జాలసంఘుండు నాదిగాఁ దామసమనువునకుం బెక్కండ్రు కొడుకులు
పుట్టి రాజులై రిది చతుర్థమన్వంతరం బింకఁ బంచమమను వైన రైవతునిజన్మప్రకా
రంబు చెప్పెద వినుమని మార్కండేయుండు క్రోష్టుకి కిట్లనియె. 257

రైవతమన్వంతరమహిమానువర్ణనము

క. ఋతవంతుం డనుసంయమి, సుతహీనత్వమున నుండ సుతుఁ డొక్కఁడు రే
వతి యను నక్షత్రముతుది, నతనికి జన్మించుటయును నతఁడు ముదమునన్. 258

గీ. జాతకర్మకృత్యంబులు సలిపి సుతునిఁ, జెలిచి యుపనీతుఁ గావించి పెండ్లి చేసె
నాసుతుండును దుశ్శీలుఁ డయ్యె బాల్య, మాది గాఁగ సమస్తగుణాభిరామ! 259

వ. ఆసుపుత్త్రజన్మదోషంబునం జేసి. 260

గీ. ఆమునీంద్రుండు దీర్ఘరోగాభిభూతుఁ, డయ్యెఁ దత్సతి కుష్ఠరోగార్త యయ్యె
నాదురాచారుఁడును దనయాలి విడిచి, యొక్కమునియాలిఁ గొనిపోయె నోటలేక.

వ. దానికి ఋతవంతుండు విషణ్ణస్వాంతుండై యిట్లనియె. 262

క. పుత్త్రుఁడు పుట్టమి మేలు కు, పుత్త్రుఁడు జన్మించుకంటెఁ బురుషునకును దు
ష్పుత్త్రుఁడు దహించు నిజచారిత్రాగ్ని దండ్రిమనము రేయును బగలున్. 263

గీ. స్వర్గమున నున్నపితృమాతృవంశపాత్ర, గణము నెల్లను బహునరకములఁ ద్రోచు
నఖిలబంధుల కపకార మాచరించు, దుస్సుతుఁడు వానిజన్మంబు దుస్సహంబు. 264

క. అనఘులు పరహితచరితులు, జనసంభావ్యులును బుణ్యచరితులు నగునం
దనులను బడయుదు రెవ్వరు, దనరఁగ వా రందు నందు ధన్యులు గారే? 265

వ. అని యిట్లు మునివర్యుం డతినికృష్టుం డైనపుత్త్రుని దౌశ్శీల్యంబు తనహృదయంబు దహింప
వృద్ధగర్గుం డనుతపోధనుతోడ మహాత్మా! యేను సువ్రతుండనై వేదంబు లధిగమించి
నిఖిలవిద్య లభ్యసించి దారపరిగ్రహం బొనరించి శ్రౌతస్మార్తకర్మకలాపంబు లనుష్ఠించు
చుఁ బున్నామనరకభయంబునం జేసి గర్భాధానవిధానంబున నీకొడుకుం బడసితి వీఁడును

దుశ్శీలత్వంబున నాకును దుఃఖావహుం డగుట మదీయదోషంబుననో మాతృదోషం
బుననో యెట్లైతోఁగింపవే యనిన గర్గుం డి ట్లనియె.

ఋతవాగ్గర్గులసంవాదము.

సీ. ఇది మునివల్లభ! యెవ్వరిదోషంబుగాదు మీలోన విను కారణంబు
రేవతికడపట నావిర్భవించె నీపుత్రకుం డాకీడుప్రాదుకతన
దౌశ్శీల్య మొందె నాతని నని చెప్పిన ఋతవాగుఁ డతిరోష మెద జనింప
నాయొక్క కొడుకున కీయశుభముఁ జేసె వెలయఁగా రేవతి వెలిపు లేక
తే. యట్లు లైన నారేవతి యతిరయమున,నిపుడు పడుఁగాత యని శాప మిచ్చుటయును
జోద్యముగ లోక మెల్లను జూచుచుండఁ,బడియె రేవతి కుముదాఖ్యపర్వతమున.

క. రేవతి యిట్లాయిఁ బడుటయు, నావిపినము వెలుఁగు చుండె నాదీప్తులచే
రేవతి పడుటఁ గుముదగిరి, రైవత మనఁ బరఁగె నిద్ధరావలయమునన్. 268

సీ. ఆరేవతీదేవిచారుతనుప్రభ రమయణీకమలాకరమునఁ బొంది
కడుఁ బొలుపారెడుకన్యకయగుటయుఁ బ్రముచుఁ డన్వాంయమి ప్రమదమెసఁగ
రేవతినామంబు నావెలఁదికి నిడి యాత్మాశ్రమోద్భూత యగుటఁ జేసి
తనయగాఁ గైకొని పెరిచి మనోహర యౌవనోద్భాసిని యైనఁ జూచి
తే. నాతి కెవ్వఁడొకో తగువాఁడు దనుచుఁ, దత్స్వరూపుఁ డైనవరు నెందుఁ దడవి కాన
కగ్నిశాలకు నరిగి యయ్యగ్ని నడిగె, దీని కెవ్వఁడు విభుఁ డగుఁ దెలియఁ జెపుము.

వ. అని యడిగిన నయ్యగ్ని దేవుండు. 270

క. దుర్గమశత్రుక్షితియ, మర్దనకేళీకథాసమగ్రబలోద్య
ద్దోర్దర్పగరిష్ఠుం డగు, దుర్గముఁ డనునృపతి భర్త తోయజముఖికిన్. 271

వ. అని యమ్మునీంద్రునికిం జెప్పినయనంతరంబ. 272

మ. దమితారాతి ప్రియవ్రతోజ్జ్వలకులోత్తంసైకతేజుండు వి
క్రమశీలక్షితిపాలశేఖరునకు న్గాళిందికి న్బుత్త్రుఁ డు
త్తమచారిత్త్రుఁడు దుర్గముండు మృగయార్థం బేఁగి యత్యుగ్రదు
ర్గమునం గ్రుమ్మరుచుం దదాశ్రమముఁ జేరం బోయి సంప్రీతితోన్. 273

వ. దానిం బ్రవేశించి యం దమ్మునీంద్రునిం గానక. 274

క. రేవతిఁ గని యానృపతి ప్రియా! వచ్చితి మ్రొక్క పోవ నమ్మునిపతికి
న్నీవు నిజంబుగఁ జెప్పుము,యావిమలాత్ముఁ డెటఁ బోయెనని యడుగుటయున్.

గీ. అగ్నిశాలలోపల నున్నయమ్మునీంద్రుఁ,డతఁడు రేవతిఁ బిలిచిననాప్రియోక్తి
విని ముదంబున వెలువడి యనుపమాన,రాజ్యచిహ్నాభిరాము దుర్గమునిఁ గనియె.276

ప్రముచదుర్గమసంవాదము.

చ. కనిన నరేంద్రుఁ డమ్మునికి గౌరవ మొప్పఁగ మ్రొక్కి గౌతమం
డను ప్రియశిష్యు నర్ఘ్యము రయంబున నమ్ముని తేరఁ బంచి నీ
వనఘ ! సమంచితార్ఘ్యమున కర్హుఁడ వెన్నఁడు రాసివింద వ
ల్లునికి విశేషపూజఁదగు లోకముచొప్పన మాకుఁ జేయఁగన్. 277

గీ. అనిన నల్లుండ నే నెట్టు లైతినొక్కొ!,యనుచుఁ బలుకక యతఁ డర్ఘ్యమందికొనియె
నుచిత మగుపీఠమునఁ బ్రీతి నునిచి యన్న,రేశ్వరునను మునీశ్వరుం డిట్టు లనియె.

క. నరనాథ ! నీకుఁ గుశలమె, పరిజనులకు భూజనులకు బంధుజనులకు
న్పురజనులకు భద్రమె భూ,సురవరులకు మంత్రులకును శుభమే యెపుడున్. 279

గీ. ఇచట నున్ననీభార్యకు నెంతయును శు,భంబు భూనాథ ! తక్కినభార్య లెల్లఁ
గుశలినులె యన్న మీకృపఁ గుశల మెపుడు,భ్రాంతిగాదు జగత్త్రయారాధ్యచరణ!.

క. కడు వెఱఁ గయ్యెడు నాకి,క్కడ నెయ్యది భార్య? యనుచుఁ గాంతిమహిమ నొ
ప్పెడురేవతి నీప్రియ యగు, పడఁతుక గా దెట్లు? ధరణిపాల ! యెఱుఁగవే? 281

వ. అనిన నన్నరేంద్రుండు మునీంద్రా ! సుభద్ర శాంతతనయ కావేరితనయ సురాష్ట్రజ
సుజాత కదంబ వరూథిని నందిని యనుమదీయభార్యల నెఱుంగుదుం గాని రేవతి
నెఱుంగ నది యెక్కడియదియో యనిన నమ్మునివరుం డిట్లనియె. 282

క. ఇప్పుడు ప్రియ యని పిలువవె, యిప్పడఁతుక నింత మఱతురే భూపాలా !
తప్పక ప్రియ యని పిలిచిన,యప్పడఁ యది నీకు భార్య యనుమానంబే ? 283

వ. అనిన నమ్మనుజేంద్రుండు. 284

ఉ. ఏ నతిదుష్టభావమున నీలలితాంగిఁ బ్రియాసమాఖ్య నా
హ్వానముఁ జేయఁ బల్కితి యథార్థమ యల్గకు మయ్య ! యన్న నా
జ్ఞాని నరేంద్ర ! నీపలుకు సత్యము దుష్టముగాదు భావ మీ
మానిని కీవ భర్త వని మా కనలుండును జెప్పె నేర్పడన్. 285

ఉ. నీవును వచ్చి తిప్డు ధరణీవర ! యిం కనుమాన మేల ? నీ
కీవనజాక్షిఁ బ్రీతిమెయి నిచ్చెదఁ జేకొను మన్నఁ బ్రేమ ల
జ్జావనతాననుం డయి ధరాధిపుఁ డూరక యుండె నమ్మద
శ్రీ వెలయ న్వివాహ మొనరింప మునీశ్వరుఁ డుత్సహించినన్. 286

ప్రముచునకు రేవతికిని సంవాదము.

వ. అమ్మునీంద్రుముందట నిలిచి రేవతీకన్య కరంబులు మొగిచి తండ్రీ! నీవు నాయందు గృప
గలవేని రేవతీనక్షత్రంబునందు నన్ను వివాహంబు జేయుము ప్రసన్నుండ వగు

మనిన నిక్కం డారేవతీనక్షత్రంబు చంద్రునితోడఁ గూడి యుండుపథంబున నుండ దదియేల? వైవాహికంబు లగునక్షత్రంబులు పెక్కు గలవనిన నయ్యంతి యానక్షత్రంబు లేమిం జేసి కదా యిపుడు కాలంబు వికలం బైనది వికలకాలంబున నా కెట్లు వివాహం బగు ననిన నమ్మహాత్ముం డి ట్లనియె. 287

మ. ఋతవాక్కుం డను మిత్రశాపమునఁ దా నిమ్మేదినిం గూలి రే
వతి య ట్లున్నది యున్నరేశ్వరునకు న్వాత్సల్య మొప్పంగ ని
చ్చితి ని న్నే నని పల్కితి న్వరణయత్నేల్లాందఁగాఁ బ్రీతి నీ
మతి లే దెంతయుఁ సంకటం బొదవె భామా! నిన్ను నే మందు నే?. 288

వ. అనిన నక్కన్నియ యి ట్లనియె. 289

క. ఋతవన్మునివరుఁ డొక్కఁడ, యతులతపముఁ జేసెఁ గాని యక్కట! మాతం
డ్రితపము తక్కువయె య, ప్రతిమగుణా! యేను బ్రహ్మబంధుసుత నే? 290

గీ. అనిన ముని తపోవిరహితుఁ డైన బ్రహ్మ, బంధుకూఁతురవే నీవు పంకజాస్య!
నాతనూజవు గాక కన్యాలలామ!, యేమి సేయంగ నే నుత్సహింతుఁ జెపుమ. 291

రేవతీదుర్దమవివాహము.

వ. అనిన రేవతి తండ్రీ! నీవు తపస్సత్యసంపన్నుండ వగుదేని రేవతీతారం దారాపథంబున నారోపించి నన్నుం బరిణయంబు సేయుము మనిన నతం డట్ల చేసెద సంతసిల్లు మని నిజతపఃప్రభావంబునం జేసి పూర్వస్థానంబున రేవతిం బ్రతిష్ఠించి విధ్యుక్తప్రకారంబునం గూఁతునకు వివాహం బొనరించి యల్లుని నాలోకించి నీకు వరం బిచ్చెద నెయ్యది దుర్లభం బది యడుగు మనిన దుర్దముం డి ట్లనియె. 292

క. మన్వంతరాధిపతియును, నన్వయదీపకుఁడు భుజబలాధికుఁడును దే
జోన్వితుఁడును గాంభీర్యో, దన్వంతుఁడు నైనతనయుఁ దయనిమ్మనఘా! 293

వ. అనిన మునివరుండు. 294

క. నీకోరినయట్టుల ధ, ర్మాకల్పుఁ డనల్పశౌర్యుఁ డాత్మజుఁడు శుభ
శ్లోకుఁ డుదయించు మను వై, లోకప్రతిపాలనైకలోలత వెలయన్. 295

రైవతమనుజననము.

చ. అనిన మునీంద్రు వీడ్కొని బలాంతకుమాడ్కి మృగాక్షి వేడ్కఁ దో
డ్కొని పురి కేఁగె నానృపతికుంజరుఁ డప్పుడ యంత రేవతీ
వనిత తనూజుఁ గాంచె బలవంతుఁ బ్రశాంతు యశోలతాంతభా
జనహారిదంతు దాంతు భుజశౌర్యసమావృతజైత్రకాంతుసిన్. 296

రైవతమన్వంతరమున నింద్రాదుల వివరణము.

వ. ఇట్లు రేవతికి రైవతుం డనుమనువు పుట్టె నామన్వంతరంబున దేవత లొక్కొక్క గణంబు పదునలువురేసిగా సుమేధసులు భూతరజులు వైకుంఠు లమితాభాను లన నాలుగుగణంబులై రా దేవతలకుఁ బ్రభువు శతయజ్ఞుండు నైనవిభుం డనువాఁ డింద్రుం డయ్యె హిరణ్యరోముండును వేదశ్రీయును నూర్ధ్వబాహుండును వేదబాహుండును సుధాముండును బర్జన్యుండును వసిష్ఠుండు ననువారు సప్తఋషులైరి బలుండు బంధుండు స్వయంభావ్యుండు సత్యకుండును నాదిగా రైవతునికిఁ బెక్కండ్రు కొడుకులు పుట్టి రాజులైరిది రైవతమన్వంతరప్రకారం బని చెప్పి మార్కండేయుండు క్రోష్టుకికి షష్ఠమను వైనచాక్షుషునిజన్మంబు వినుము బ్రహ్మచక్షుస్సువలన మున్ను జన్మించి చాక్షుషుం డనం బరగి యాశరీరంబు విడిచి మర్త్యభువనంబునందు. 297

చాక్షుషమనుజన్మవృత్తాంతము.

సీ. ఒకపుణ్యకాంతకు నుదయించి వాఁడు జాతిస్మరుం డయి వాసి దివుటతోడ
నక్కున మోమునఁ జిక్కఁగఁ జేర్చుచు నుత్సంగతలమున నునిచి జనని
ముద్దాడుచుండఁగాఁ బెద్దయెలుంగున నవ్విన వెఱచి యన్నళినవదన
కన్నులు దెఱవనికడుబాలుఁడవు నవ్వు టిది యేమి యద్భుత మిపుడు కుఱ్ఱ!
తే. యనుడు నోతల్లి! యిదె పిల్లి నన్నుఁ దినఁగ, వేఁచినదిదేనిఁ బొడఁగాననే యదృశ్య
మూర్తియై జాతహారిణి మఱియు నున్న, దేల ముద్దాడె దింతయుఁ? దెలియఁగ నీవు.

చాక్షుషమన్వంతరమహిమానువర్ణనము.

వ. ఇది కారణంబుగా నపహసించితి నని మఱియును. 299

క. తనకొఱకు నీబిడాలియు, ననవరతాసక్తి జాతహారిణియును గా
చినయది నీవును నీకై, నను ముద్దాడెదవు ఫలము నాదెసఁ బడయన్. 300

వ. ఇంతియ కాని నే నెవ్వండ నగుటయు నెఱుంగవు నీకు నుపకృతి నాచేత నేమియుం జేయంబడ దేను బుట్టి యాఱేడుదినంబు లింతలోన నీవు వార్ధరసాతిరేకంబునం బొంగి పులకించుచుఁ గన్నులఁ బ్రమదజలకణంబు లురల నన్నుం గౌఁగిలించుకొనుచు నాతండ్రి నాకుఱ్ఱ యని ముద్దాడుచు నిట్లేమిటికి ముద్దు వెట్టెద వనినం గొడుకునకుఁ దల్లి యిట్లనియె. 301

క. ఉపకారము కోరకయే, నపరిమితప్రీతితోడ ననుదినమును ని
న్నుపలాలించుచుఁ బెంచుట, విపరీతపుఁగొడుక వైతి వేయును నేలా?. 302

గీ ఏను ముద్దాడ నీయెడ కేం పొనర్పు, దేని ముద్దాడ నేల? నీ వేల నాకు?
కట్టు పడితేమి? విడిచితి నేను నిన్ను, ననుచు దిగ్గన లేచి పేరలుకఁ జూచి.

క. కడవం గఱచినవాఁ డీ,వడు చనుచుం బురిటియిల్లు వడఁతుక వెడలె
న్వెడలిన జితేంద్రియుండును, గడు నిర్మలమతియు బోధకలితాత్ముఁడున్. 304

గీ. అయినయబ్బాలు గ్రక్కున నదిమి పొదివి
యెత్తికొని జాతహారిణి యేఁగె సత్వ
రమున విక్రాంతుఁ డనురాజు రమణి యపుడు
కొడుకుఁ గని యుండఁ దచ్ఛయ్య నిడి ముదమున. 305

వ. అక్కు డక్కుడమి నొసికొడుకుం గొని చని యొండొకగృహంబునం బెట్టి తృతీయుం
డగునాగృహపతిశిశువు నపహరించుకొని చని జాతహారిణి భక్షించె జాతహారిణికి
నివ్విధంబు జీవిక యై యుండునంత విక్రాంతమహీకాంతుండు నందనునికి రాజార్హ
సంస్కారంబులు సేయించి యానందుం డనునామం బొనరించె నక్కుమారుండును
క్రమంబునం బితృసంవర్ధితుం డై పెరిఁగిన. 306

గురువునకు నానందునకును సంవాదము.

గీ. నృపతనూజుని గురుఁ డుపనీతుఁ జేసి, జనని కభివాదనము సేయు మనిన నవ్వి
కన్నతల్లియొ చెప్పుమా గారవమున, నన్నుఁ బెంచినతల్లియో నాకు వంద్య? 307

వ. అనిన గురుండు చారుపుత్త్రియు విక్రాంతునిదేవియు నైనయీహైమిని నీకుం దల్లి
గాదె? యనుడు నానందుండు గురున కిట్లనియె. 308

క. ఇదె మది విశాలగ్రామంబున బోధుం డనఁగఁ బరగుభూసురునకు నం
దనుఁ డగుచైత్రుని కియ్యమ, జనయిత్రి మునీంద్ర! యితరజననిసుతుఁడ నేన్. 309

. అనిన గురుఁ డిట్టు లనుఁ జైత్రుఁ డనఁగ నెవ్వఁ?, డతని కెట్టులు హైమినియంట యయ్యె?
ఇచట నీవు పుట్టితె? మాకు నేర్పడంగఁ, జెప్పు మానంద! యిది కడుఁ జిత్ర మనిన.

క. ఆనమిత్రుం డనుమనుజేం, ద్రుసతిను గిరిభద్రను సుతుఁడ నై జన్మిం
చిననన్ను జాతహారిణి, యనఘా! యెత్తుకొని వచ్చి హైమినియొద్దన్. 311

గీ. పెట్టి యాహైమినికి మున్ను పుట్టినట్టి, పట్టిఁ గొనిపోయి బోధుఁ డన్ బ్రాహ్మణునిగృ
హంబునం దిడి యది యాగృహస్థుశిశువు, నపహరించి భక్షించె విప్రాగ్రగణ్య! 312

వ. అని చెప్పి. 313

గీ. హైమినీతనూజుఁ డవ్విప్రు సేయుసం,స్కారములఁ బవిత్రగాత్రుఁ డయ్యెఁ
సంస్కృతుండ నైతి సత్కర్మజాతంబు, నాకు నీవు సేఁత లోకవంద్య!. 314

వ. నీవచనంబుఁ జేయ వలయు నాకుం దల్లి యెవ్వ? రనిన గురుండు. 315

గీ. విను కుమార! మోహమునఁ జేసి బుద్ధి భ్రమించినట్లు యున్న దించుకయును
తెలుఁగ కున్నవాఁడ నీప్రశ్న మెంతయుఁ, గహన మేర్పరింప గడిఁది యనిన. 316

వ. అబ్బాలుండు. 317

సీ. ఎవ్వఁ డెవ్వనిపుత్త్రుఁ? డెవ్వఁ డెవ్వనిబంధుఁ?, డేల యీభ్రమ? సన్మునీంద్ర! చెపుమ
జన్మంబు జనులకు సంబంధ మింతియ, యదియుఁ మృత్యువుచేత నడఁగి పోవు
జన్మించునతనికి సకలబాంధవులతోఁ, బాయంగరానిసంబంధ మొకటి
సతతంబు గలుగు నాసంబంధ మాదిగా, సర్వంబు దేహావసాన మైనఁ

తే. బోలియుఁ గావున సంసారమున జనించు, వారి కెవ్వరు బంధులు లేరు బుద్ధి
భ్రమయ నీ కేల? నాకు నీభవమునందుఁ, దండ్రు లిరువురై రిరువురు తల్లు లైరి. 318

గీ. అన్యదేహసంబంధమునందు వేఱ, జనకజనయిత్రు లగుట కాశ్చర్యమేమి
యిట్టియే నింక నిం దుండ నేఁగి తపము, విపినమున నాచరించెద విప్రవర్య! 319

వ. విశాలగ్రామంబున నున్న చైత్రునిం దెచ్చికొనుం డని చెప్పిన నతనిపలుకులు విని యారాజు భార్యాసహితంబు బంధులుం దానును విస్మయంబు నొంది యక్కుమారుని వలన మమత్వంబు దక్కి యతండు వనంబునకుం జనుట కొడంబడి నిజపుత్త్రుం బుత్త్రబుద్ధిం బెనిచినధాత్రీదేవుని సమ్మానించి యాపుత్త్రునిం దెచ్చుకొని రాజ్యయోగ్యునిం గావించె నంత. 320

చాక్షుషుండు మనువగుటయు; ఆమన్వంతరమున దేవేంద్రాదుల వివరణము.

గీ. బాలుఁ డానందుఁ డొక్కఁడు లీల నడవి, కరిగి నరిగి ముక్తివిరోధులై నకర్మ
ములు నశింపఁగఁ దపము నిశ్చలతఁ జేయుచుండ వచ్చి యిట్లనియెఁ బయోజభవుఁడు.

గీ. ఏమి కోరి చేసె దీతపం? బెఱిఁగింపు, మనిన బ్రహ్మ కిట్టు లనియె బాలుఁ
డాత్మశుద్ధి గోరి యాచరించెదఁ గర్మ, పాశగాఢబంధనాశముగను. 322

గీ. అనినఁ బద్మగర్భుఁ డతనితో హీనాధ, కారుఁ డగును గర్మి కాఁడు ముక్తి
కర్హుఁ డెట్లు ముక్తి యభిలషించెదు? మనుత్వంబు నీవు దాల్ప వలసియుండు. 323

వ. షష్ఠమను వై వర్తింపుము తపం బుజ్జగింపుము మఱి ముక్తిసుఖం బనుభవింపు మని కమలభవుండు నియోగించిన నమ్మహీపతి యట్లకాక యని దపోనివృత్తుం డగుసమయంబునం బ్రజాపతి యతనిం జాక్షుషుం డని పూర్వజన్మనామధేయుం గావించి చనియె నిట్లు ప్రఖ్యాతుం డై చాక్షుషుండు. 324

క. ఉగ్రుఁ డనురాజుకూఁతు సమగ్రవిలాసాభిరామ నంబుజముఖిఁ గం
బుగ్రీవ విదర్భం బాణిగ్రహణముఁ జేసె నతఁడు నెయ్యి మెలర్పన్. 325

క. చాక్షుషమనుకాలంబున, నక్షీణగుణాభిరాము లగుసురల సహా
స్రాక్షుని ఋషులను బాలన, దక్షుల భూపతులఁ జెప్పెదను విను మనఘా!. 326

వ. ఆప్యులును బ్రభూతులును భవ్యులును భృగులును లేఖులు ననునాకౌకగణ మెనమండ్రేసి కాదేవత లేనుగణంబులైరి నూఱుక్రతువులు చేసినమనోజవుం డను వాఁ డింద్రుఁ డయ్యె సుమేధుండును విరజుండును హవిష్మంతుండు నున్నతుఁడును మధువు సహిష్ణుండును విమలుండును సప్తర్షు లైరి చాక్షుషునకు శతద్యుమ్నప్రముఖు లైనపుత్త్రులు పెక్కండ్రు ప్రభవించి మహీపతు లైరి చాక్షుషం డనుమనువుజన్మంబును జరిత్రంబును జెప్పితిఁ గ్రోష్టుకీ! యిప్పుడు వైవస్వతుం డనుసప్తమమనువు కాలము వర్తించుచున్నది యతనిజననంబు నామన్వంతరంబునఁ గలదేవతాదులను జెప్పెద నాకర్ణింపు మని మార్కండేయుం డిట్లనియె. 327

వైవస్వతమనుమహిమానువర్ణనము.

సీ. విశ్వనుతుం డగు విశ్వకర్మతనూజ యైనసంజ్ఞాదేవి యందుఁ బడసెఁ
దనయుని వివస్వంతుఁ డనుపమవిజ్ఞానవందు నిర్మలయశోవంతు మనువు
నతఁడు వైవస్వతుం డనుపేరఁ బరఁగెన, ద్దేవి దివాకరుదీప్తిఁ జూచి
కనుఁగవ మోడ్చిన నినుఁ డల్గియిప్పుడు, నను గని దృఙ్నిమీలనముఁ జేసి
ఆ. తట్లు గాన నీకు నఖిలజనైకసం, యమనుఁ డైనసుతుఁడు యముఁడు పుట్టు
ననుచు వెఱచి చూడ్కి యతిచంచలంబుగఁ, జేయుటయును దరణి చెలువతోడ.

క. ననుఁ జూచి యిపుడు నీదృష్టి నితాంతవిలోల యయ్యెఁ జేడియ! యటు గా
వున నీకు విలోల యయిన, తనయ మహానది జనించుఁ దథ్యం బరయన్. 329

తే. అంతఁ బతిశాపమునఁ జేసి యాలతాంగి, కవతరించిరి యముఁడును యమున యనఁగఁ
బరగునదియును మఱియు నాభామ భాను, వేఁడిమికి నోర్వ కెంతయు విహ్వలించి.

ఉ. ఏమి యొనర్తు? నింకఁ దెఱఁ గెయ్యది దీనికి? నెందుఁ జొత్తు? ను
ద్దామము లైనయారుచులదాప మొకింతయు సైఁపఁ జాల నే
భూమికిఁ బోదుఁ? బోయిన విభుం డెద నల్గఁడె? యంచు నింతి చిం
తామథితాంతరంగ యయితాఁ దలఁచె న్జనఁ దండ్రియింటికిన్. 331

తే. తలఁచి నిజతనుచ్ఛాయ నా వెలఁదిఁ గొత్త, లలన నిర్మించి యిట్లను లలన! నీవు
బిడ్డలందును రవియందుఁ బ్రియము గల్గి, నడువు సతతంబు నే నెట్లు నడతు నట్ల.

క. నను నెఱిఁగి చనిన నాతెఱఁ, గినుఁ డడిగిన విస్తరించి యొఱిఁగింపకుమీ
వనితా! నీ వాతనితో, ననుమానము వలదు సంజ్ఞ యగుదన యనుమీ. 333

వ. అనిన ఛాయాదేవి యిట్లనియె. 334

తే. బెట్టు గోపించి ననుఁ దల పట్టి తిగిచి, కమలమిత్రుండు శాప మీఁ గడఁగునపుడు
గాని యీవిధ మెఱిఁగించుదానఁ గాను, నావుడును సంజ్ఞ పితృసదనమున కరిగి.

వ. నిర్మలధర్మకర్ముం డగువిశ్వకర్మం గని మ్రొక్కిన నతండును బహుమానపూర్వ
కంబుగాఁ గూతుం జూచె నంత. 336

సీ. అనవద్యచరిత్ర యై యచట నుండఁగఁ దండ్రి కొంతకాలమునకుఁ గూఁతుఁ జూచి
వనజాక్షి ననుఁ జూచుచునికి దినంబులు, విను మొక్కనిమిష మై చనియె నాకు
నైనను బంధుగృహంబున సతులకుఁ బెద్దకాలం బునికి పెంపు గాదు
మగువలు మానుగా మగనియొద్దనె యునికి బంధుల కెల్లను బ్రమదకరము

తే. కరుణ ననుఁ జూచి తేనును దగినకగవు, తెల్ల నడపిలెఁ దడయక యేఁగు మింకఁ
ద్రిభువనాధిపుఁ డైననీవిభునికడకు, వలసినప్పుడు మముఁ జూడ వత్తు గాని. 337

తే. అనుడు నౌఁగాక యని తండ్రి కధికభక్తి, తోడఁ బ్రణమిల్లి వీడ్కొని తోయజాక్షి
యుష్ణభానుని వేఁడిమి కోర్వ లేక, తలరి యుత్తరకురుదేశములకు నరిగె. 338

క. చని బడబారూపము నై, కొని యచ్చో విశ్వకర్మకూఁతురు తప మ
ర్థి నొనర్చుచుండె నట రవి, తనపూర్వాంగనయ కాఁగఁ దలఁచి మునీంద్రా!. 339

వ. ఛాయాదేవియందు నిరువురు కొడుకుల నొక్కకూఁతునుం బడసె నంత నద్దేవియు,

క. తనబిడ్డల సంభావిం, చిన క్రియ సంభావనంబు సేయక యుపలా
లనలీలాదుల సంజ్ఞాం, గనబిడ్డలవలన నెరవ కాఁ జరియించున్. 341

యమునికి ఛాయాసంజ్ఞ శాపమిచ్చుట.

క. మను వది యెఱిఁగియు నేమియు, ననక ప్రశాంతిమెయి నుండ యముఁ డుత్కటకో
పనుఁ డై యాసతిఁ దన్నఁగఁ, దనపాదం బెత్తి మానెఁ దద్దయు శాంతిన్. 342

వ. ఇట్లు యముండు తన్నం దన్న నడు గెత్తిన నలిగి కన్నుల నిప్పు లురలఁ గటంబు
లదర నతని నవలోకించి. 343

క. గురుపత్ని నైననన్నుం, గర మవినీతిమెయిఁ దన్నఁగా నెత్తినసీ
చరణంబు రయంబునఁ దెగి, ధరఁ బడుఁ గా కని శపించెఁ దద్దయు నలుకన్. 344

క. ఛాయాసంజ్ఞ శపించిన, నాయముఁడు భయంబుఁ బొంది యర్యముకడకుం
బోయి వినయావనమ్రుం, డై యి ట్లని విన్నవించె నాతనితోడన్. 345

తే. తండ్రి! యిది యొకయత్యద్భుతంబు వినుము, దయ యొకింతయు లేక యుగ్రప్రవృత్తి
శాప మిచ్చె నెక్కడ నైన జనని ప్రజల, కింత కీడొనరింపఁగ నెత్తికొనునె? 346

తే. నాకు నిది తల్లిగా దని నాకు మనువు, చెప్పుచున్నాఁడు నావుడు నప్పయోజ
బాంధవుం డాత్మనందనుపలుకు దాను, దెలియ విని యపు డద్దేవిఁ బిలువఁ బనిచి.

క. ఆవనితతోడ సంజ్ఞా, దేవి యెచటి కరిగె నాకుఁ దెలియం జెపుమా
నావుడు నదియు నకంపిత, భావంబున ననియెఁ గమలబంధునితోడన్. 348

క. ఏ విశ్వకర్మకూఁతుర, నీవనితను సంజ్ఞ యనఁగ నెగడినదాన
న్నావలన నీ వపత్య, శ్రీవడయవె సంశయంబుఁ జెందఁగ నేలా. 349

ఆ. అనిన మఱియుఁ దఱిమి యడిగిన నక్కాంత, నిజముఁ జెప్ప కున్న నీరజాప్తుఁ
డలిగి శాప మిత్తు ననిన నాకృత్రిమ, సంజ్ఞ చెప్పె సంజ్ఞ చనిన తెఱఁగు. 350

ఉ. చెప్పిన నద్దివాకరుఁడు చిత్తమునం బ్రియతోడివేడ్కఁ దా
నప్పుడ విశ్వకర్మనిలయంబున కేఁగిన నా ప్రజావిభుం
డప్పరమేశ్వరుం ద్రిభువనార్చితు దేవమయాత్ము భక్తి పెం
పొప్ప నభీష్టపూజలఁ బ్రియోక్తులఁ దుష్టుని చేసెఁ జేసినన్. 351

చ. ఇనుఁడు మహాత్మ! నీతనయ యెయ్యది? యన్న నతండు దేవ! నీ
యనుమతితోడ వచ్చితెఁ బ్రియంబునఁ దా నని చెప్పి మద్గృహం
బున వసియింప నే వలదు పొమ్మని యంపఁగ నేఁగుడెంచె న
వ్వనజదళాక్షి నావుడు దివాకరుఁ డప్డు ప్రబుద్ధచిత్తుఁ డై. 352

వ. ఉత్తరకురుభూములందు బడబారూపధారిణి యై సంజ్ఞాదేవి తనమనంబున నాభర్త సౌమ్యమూర్తియై వచ్చి నన్నుఁ బొందవలయు నని తపంబు సేయుచుండుట యెఱింగి వెలుంగుఱేఁడు విశ్వకర్మ నాలోకించి మదీయతేజశ్శాతనం బొనరింపు మనిన నతండు గీర్వాణస్తూయమానుం డగుమార్తాండుని తేజంబు గరసానం బట్టి తెచ్చిన నచ్చెరువంది దేవదేవర్షిగణంబులు తపను నిట్లు స్తుతింపం దొడంగిరి. 353

సీ. ఋగ్యజుస్సామాద్యనేకవేదైకవిస్ఫూర్తివి నిర్మలబోధమూర్తి
వత్యంతనిత్యసత్యానందరూపుఁడ వఘతమోహరణచండాంశుదీప్తుఁ
డవు గరిష్ఠుండవు దివిజవరిష్ఠుండ వాశ్రితజనభర్త వాదికర్త
వమృతమయాత్ముఁడ వఖిలభూతాత్ముఁడ వపగతత్రిగుణుండ వధికగుణుఁడ
తే. వైననీకు మ్రొక్కెదము బ్రహ్మాండభరిత, బహుళతిమిరనివారణప్రౌఢతేజ
సతతవికసితజనవిలోచనపయోజ, ధిక్కృతేందుతారాయూథ! దివసనాథ! 354

ఉ. నా కివి యేల నాక విని నవ్వక నిచ్చలు నీకె యర్ఘ్యముల్
కైకొనుమండ్రు మానవులు కైకొను నీకరుణావిలోకన
శ్రీకి నివాసమై వెలయఁ జేయుము మమ్ము సమస్తలోకశో
భాకర! యోదివాకర! ప్రభాకర! భక్తజనప్రభాకరా! 355

చ. సలిలము లాదిగాఁ గలుగుసర్వపదార్థములు న్భవత్కరం
బులు వెడసోఁకినం గరము భ్రాంతతఁ బొందుఁ ద్రిలోకవర్తనం
బులును సమస్తకర్మములు బొల్పుగ నీ వుదయింప కుండిన
న్నిలుచుఁ జరాచరాత్ముఁడవు నీవు దివాకర! భక్తశంకరా!. 356

తే. దినములకు సంధ్యలకును రాత్రికిని దేవ!, చంద్రికకుఁ గారణము నీవ సర్వమును మ
హాత్మ! నీచేత సంవ్యాప్తమై వెలుంగు, బ్రహ్మరుద్రాచ్యుతాకార! ప్రణవసార!

వ. అని మఱియును సురమునిగణంబులు బహుప్రకారంబులం బ్రస్తుతించి దేవా! మాకుఁ బ్రసన్నుండవు గమ్ము నీరూపంబు తేజోమయంబు గావింపుము జగంబులు వెలిఁగింపుమని విన్నవించినం గరుణించి తేజోరాశియగుదేవుఁడు నిజతేజంబు సథంబునం బరగించె నివ్విశ్వకర్మ తనతర్చినభాను తేజోరజంబు పంచదశభాగంబులు గావించి వానివలన శర్వునకు శూలంబును విష్ణునకుఁ జక్రంబును వసువులకు శంకునామాయుధంబులును వహ్నికి శక్తియుఁ గుబేరునికి శిబికయు మఱి దేవయక్షగంధర్వసిద్ధవిద్యాధరులకు మహోగ్రంబు లైనశస్త్రంబులును రచియించె నంత వివస్వంతుండు పదియాఱవభాగం బగునిజతేజంబు తీర్చి యుత్తరకురుదేశములకుం జని బడబారూపధారిణి యైనహృదయేశ్వరిం గని. 358

సీ. తురగరూపము దాల్చి తోఁక యల్లార్చుచుఁ గర్ణము ల్నిఱుపుచుఁ గడుఁ జెలంగి
హేషించుచును రవి యేఁగిన నత్తురంగాంగన మది నీతఁ డన్యపురుషుఁ
డనుశంకఁ బూనుచు నభిముఖత్వముఁ బొంద మోములు రెండును మూర్కొనుటయుం
నాసికాసంగతి నాసత్యు లశ్వవక్త్రులు పుట్టి రిరువురు కొడుకు లపుడు
తే. శుక్లపాతాంతమున నొక్కసుతుఁడు పటుతు, రంగమారూఢుఁడును దనుత్రాణధరుఁడు
బాణపూర్ణతూణీరకృపాణకార్ము, కోజ్జ్వలుఁడు నైనరేవంతుఁ డుదయ మయ్యె.

క. అంత నిజదేహము విప, స్వంతుఁడు దాల్చుటయుఁ జూచి సంజ్ఞ మనమున
స్సంతుష్టయై నిజాకృతి, యెంతయు వెసఁ దాల్చెఁ బ్రియుని కిం పెసలారన్.

సీ. తనదేవిఁ దోడ్కొని చనియె భానుఁడు నిజస్థానమ్మునకుఁ బ్రమోదమున నంత
నద్దేవితొలుపట్టి యైనవైవస్వతుఁ డమలతేజుఁడు మను వయ్యె వినుము
రెండవుకొడుకు యముండు శాపంబున నర్ధపదోపేతుఁ డగుచుఁ దరణి
క్రిములు తత్పాదమాంసము గొని భూస్థలిఁ బడినను శాపంబు వాయు ననియె

ఆ. నదియుఁ జెల్లె నాతఁ డరిమిత్రులందు స, ధర్మదృష్టి యైన దక్షిణమున
కధిపుఁ గా నొనర్చె నతని గళిందాంత, రమున నేఁటి గాఁగ యమునఁ జేసె. 361

క. అశ్వినులు వెజ్జులుగ హరి, దశ్వుం డమరుల నొనర్చె నారేవంతు
న్విశ్వనుతుని గుహ్యకనిక, రేశ్వరుఁ గావించె నో మునీశ్వరవర్యా! 362

క. ఛాయాప్రథమతనూజుఁడు, ధీయుత! సావర్ణినామధేయుఁడు మనువై
యాయుర్వ్యిఁ బరగు విదిత, న్యాయుఁడు బలి యింద్రుఁ డైననాఁడు మునీంద్రా!

తే. అతని తమ్ము శనైశ్చరునర్కుఁ డునిచె, గ్రహము గావించి గ్రహములకడను మఱియుఁ
దపతి యనుకన్యఁ దదనుజఁ దపనుఁ డిచ్చి, సంవరణనృపోత్తమునకు సన్మునీంద్ర!

వ. ఇది వైవస్వతమనూత్పత్తిప్రకారం బీమన్వంతరంబున దేవత లాదిత్యులు వసువులు రుద్రులు సాధ్యులు విశ్వులు మరుత్తులు భృగువులు నంగిరసులు నన నెనిమిదిగణంబులై వర్ధిల్లుచున్నవారు వీరిలోఁ నాదిత్యవసురుద్రులు కశ్యపపుత్రులు సాధ్యవిశ్వమరుత్తులు ధర్మాత్మజులు భృగువులు భృగుతనయు లంగిరసు లంగిరస్సంభవు లింతయు మరీచిప్రజాపతిసంతతి యగుటం జేసి మారీచసర్గం బనం బరగు నిప్పు డోజస్వి యనువాఁ డింద్రుఁడు విను మతీతానాగతవర్తమాను లగు నింద్రు లందఱు తుల్యలక్షణులు సహస్రాక్షులు వజ్రధరులు గజారూఢులు శతక్రతువులు సమగ్రతేజులు సమస్తలోకాధిపత్యగుణాన్వితుల యని మఱియు మార్కండేయుండు భూమి భూర్లోకం బంతరిక్షంబు భువర్లోకంబు స్వర్లోకంబు దివ్యలోకం బవి త్రిలోకంబులు ననం బడు నత్రి వసిష్ఠుండు కాశ్యపుఁడు గౌతముఁడు భరద్వాజుండు విశ్వామిత్రుండు జమదగ్ని యనువారు సప్తమును లిక్ష్వాకుఁడు నాభాగుఁడు దృష్టుండు సంయాతి కరుషుఁడు పృషద్రుఁడు వసుమంతుండు నరిష్యంతుండు వృషధుండు ననుతొమ్మండ్రు వైవస్వతమనుతనూభవు లని చెప్పి. 365

క. అతులిత మగునీవైవ, స్వతమన్వంతరము వినినఁ జదివినఁ బాప
చ్యుతులై మనుజులు గాంతురు, ప్రతిదినము ననంతపుణ్యఫలభోగంబుల్. 366

వ. అనినం గ్రోష్టుకి యిట్లనియె. 367

సావర్ణిమన్వంతరమహిమాభివర్ణనము.

సీ. స్వాయంభువాదికసప్తమనువులయం దంతరంబునఁ గలయనిమిషులను
మునులను రాజుల మునినాథ! చెప్పితి కల్పంబునం దింకఁ గలుగుమనువు
లెవ్వరు దివిజమునీంద్రాదులును జెప్పు? మనిన మార్కండేయుఁ డనఘ! వినుము
ఛాయాగ్రతనయుండు సావర్ణి మనుతుల్యుఁ డని చెప్పనే నీకు నప్పు డతఁడ

తే. యష్టముఁ డయినమను వగు నమ్మహాత్ము, కాలమున దీప్తిమంతుండు గాలవుండు
రాముఁడును ఋశ్యశృంగుఁడు ద్రౌణి కృపుఁడు, సత్యవతితనయుండును సప్తమునులు.

వ. మఱియు సుతపు లమితాభులు ముఖ్యులు నన దేవతలు మూఁడు గణంబులై యుండుదు
రందు ధవుండు శుక్రుండు ద్యుతి జ్యోతి ప్రభాకరుండు ప్రసాదుండు ధర్ముండు
తేజోరాశి శతక్రతుండు నాదిగా సుతపోగణం బిరువండ్రును ప్రభువిభువిభాసప్ర
భృతు లమితాభగణం బిరువండ్రును దముఁడు దాంతుఁడు సోముఁడును జిత్రుండును
మొదలై నముఖ్యగణం బిరువండ్రును నై యా మన్వంతరంబున నధిపతులై యతిశయిల్లు
దురు వీర లందఱు మరీచి తనయుం డగుకశ్యపప్రజాపతిపుత్త్రు లని చెప్పి. 369

క. మురరిపుచే నియమితుఁ డై
యురగనివాసమున నిప్పు డున్ననిశాటే
శ్వరుఁడు బలి యింద్రుఁ డగుఁ ద
త్సురగణమున కధిపుఁ డై విశుద్ధచరిత్రా! 370

తే. విశ్వనిర్మోహసత్యవాగ్విరజు లనఁగ
జిష్ణుఁ డంబరీషుండు నజితులు కౌర్వ
యుతులు సావర్ణి కుదయించి యుర్వి కెల్ల
రాజు లగుదురు సుగుణవిరాజమాన! 371

వ. ఇది సావర్ణిమన్వంతరంబువిధం బని మార్కండేయుండు క్రోష్టుకి కెఱింగించిన
తెఱంగెఱిఁగించి. 372

ఆశ్వాసాంతము.

ఉ. శ్రీ శ్రితవక్ష! ఫుల్లసరసీజనిభాక్ష! సమస్తబంధు మి
త్రాశ్రితకల్పవృక్ష! మహితాంధ్రనరేంద్రదయాకటాక్ష! కాం
తాశ్రితసర్వవాగ్విభవదక్ష! నివారితవైరిపక్ష! భూ
విశ్రుతకీర్తివర్ధన! వివేకవిచక్షణ! పుణ్యవీక్షణా! 373

క. శ్రీమేచయదండాధిప!
సౌమిత్రిసమగ్రవినయజనితానంద
శ్రీమహితరామచంద్రా!
రామాజనరాగజలధిరాకాచంద్రా! 374

మాలిని. అతులితభుజవీర్యా! హారిహేమాద్రిధైర్యా
కృతబుధజనకార్యా! శ్రీశృంగారవర్యా!
వితతవినయధుర్యా! విద్విషద్భూరికార్యా!
కలితజితదివిజార్యా! మానవాకారసూర్యా! 375

గద్యము. ఇది శ్రీమదుభయకవిమిత్ర తిక్కనసోమయాజిప్రసాదలబ్ధసరస్వతీపాత్ర తిక్కనామాత్యపుత్ర మారయనామధేయప్రణీతం బైనమార్కండేయమహాపురాణంబునందు విరహాతురయైనవరూధినిం గలి యనుగంధర్వుండు వరించుటయు స్వారోచిస్సంభవంబును దత్కథావృత్తాంతంబును స్వారోచిషజన్మంబును బ్రజాపతి యతని మనువుఁ గావించుటయు నిధిప్రకారంబులు సెప్పుటయు నుత్తానపాదపుత్రుం డగు నుత్తమునిచరిత్రంబును నాతనికి నాగకన్యాప్రసాదంబున నుత్తమమనువునుత్పత్తియు సురాష్ట్రోపాఖ్యానంబు నతండు మృగియందుఁ దామసుఁ డను మనువుఁ గాంచుటయు ఋతవంతుకాలంబున రేవతి కుముదపర్వతంబుమీఁదఁ బడుటయుఁ దదీయకాంతి నుద్భవించిన రేవతికన్యకకు దుర్గముం డను రాజునకు రైవతుం డను మను వావిర్భవించుటయుఁ జాక్షుషమనువుజన్మంబును సూర్యునికి సంజ్ఞాదేవియందు వైవస్వతమనువును యముండును యమున యనుకూఁతురును ఛాయాదేవివలన సావర్ణిమనువును శనైశ్చరుండును దపతి యనుకన్యకయుఁ బ్రభవించుటయు భానుతేజంబు విశ్వకర్మ త్రచ్చుటయుఁ దురంగరూపధరులైన సంజ్ఞార్కులకు నశ్వినులును రేవంతుండునుం బుట్టుటయు సావర్ణిమన్వంతరకథయు నన్నది పంచమాశ్వాసము.

శ్రీ

మార్కండేయపురాణము.

షష్ఠాశ్వాసము.

కాకతినృపరాజ్య
ప్రాకారాయితభుజాపరాక్రమగణ్యా!
లోకజనస్తుతపుణ్యా!
కాకుత్థ్సప్రతిమరూప! గన్నచమూపా!

వ. పరమజ్ఞానచక్షు లైనపక్షు లాజైమినికిట్లనియె వెండియు మార్కండేయుండు క్రోష్టుకిం గనుంగొని. 2

క. ఎనిమిదియగుమను వయ్యెన, తనయుండు సావర్ణి యని కదా చెప్పితి న
మ్మను వుద్భవ మైనవిధము, వినిపించెద విస్తరించి విమలచరిత్రా! 3

సప్తశతీప్రారంభము.

వ. స్వారోచిషమన్వంతరంబునఁ జైత్రుం డనుధాత్రీపతివంశంబునం దావిర్భవించి సుర
థుం డనం బ్రసిద్ధుం డైనమహీపతి మహనీయం బైనమహీరాజ్యంబు సేయుచు. 4

క. లీలమెయిం దనబిడ్డలఁ, బాలించువిధమున ధరణిప్రజలఁ గడు నెమ్మిం
బాలించుచుండ కూరులు, కోలావిధ్వంసు లనఁగఁ గొందఱు శత్రుల్. 5

ఆ. ఆతనిమీఁద నెత్తి! రతులబలుం డైన, యతని కావిరోధివితతితోడ
నయ్యో సమర మల్పు లైనను దా శత్రు, వరుల నోర్వ లేక సురథుఁ డోడి. 6

చ. పురమున కేఁగి తొంటిక్రియ భూపరిపాలన మాచరింప న
య్యరివరు లుక్కు మీఱి వెస నాతనిదేశము నాక్రమించిన
న్గర మవినీతులు న్ఖలులుఁ గష్టులు నై పురిలో నమాత్యు ల
ద్ధరణిపురాజ్యము న్బలముఁ దద్ధనముం గొని రంత నుద్ధతిన్. 7

క. అపహృతరాజ్యుం డై యా, నృపతి హయము నెక్కి వేఁటనెపమున నరిగెన్
ఒకరీతిం దగుడు, త్వపినమునకుఁ జనియె నొకఁడు విను మునిముఖ్యా! 8

మ. చనియె న్దా సురథుండు శాంతమృగసంచారాతిరమ్యంబు శి
ష్యనితాంతాధ్యయనాభిశోభితము నుద్యద్ధోమధూమావృతం
బును నై యొప్పు తదాశ్రమంబునకు దపంబు న్సుమేధం దపో
ధనవర్యుం గని మ్రొక్కి తా నతనిచేతం బూజలం బ్రీతుం డై. 9

ఉ. అచ్చటఁ గొంతకాలము ప్రియంబున నుండి నరేంద్రుఁ డొక్కనాఁ
డిచ్చఁ జరించుచు న్మమత యెంతయుఁ జిత్తము చేర్పడ న్గడు
వెచ్చనియూర్పు లొక్కమొగి వెల్వడ మోమున దైన్య మొందఁగా
మ్రుచ్చిలి వందుచు న్వగల మొత్త మెదం గలఁపంగ నాత్మలోన్. 10

సీ. తాతలచేఁ బాలితం బైనమత్పురం బిటు గోలుపోదునే హీనవృత్తి?
దుర్వృత్తు లైనశత్రులు పాడి దప్పక యేలుచున్నారొకో యిప్పు డకట!
యే నెక్కు పట్టంపుటేనుఁగు పాటులుపడియెనో పగఱచేఁ బడి యెఱుంగ
నొకటఁ గొలంత లేకుండు నాయనుచరు లహితుల కనుచరు లైరి నేఁడు
తే. పెక్కు లిడుమలు పడి కూడఁ బెట్టినట్టి, యగణితం బైనయస్మదీయార్థ మెల్ల
నప్రయోజనవ్యయశీలు లైన యరులు, వ్యయము సేయరె యింతకు వమ్ముగాఁగ? 11

సురథునకు సమాధి యను వైశ్యునికి సంవాదము.

క. అని మఱియును ఘనచింతా, వనిపాతితుఁ డగుచు మనుజవిభుఁడు మునితపో
వనమునఁ జేరువఁ దిరుగుచుఁ, గనియె నొకవణిజు విషాదకలుషమనస్కున్. 12

మ. కని నీ వెవ్వఁడ? వేల వచ్చి తిట? శోకవ్యాకులత్వంబుఁ బొం
ద నిమిత్తం బది యేమి? చెప్పు మని యాధాత్రీశుఁ డింపారఁ బ
ల్కిన నప్పల్కులు విని రాజుతోడ నయశ్రీధుర్యుఁ డై యాతఁ డి
ట్లను నాపేరు సమాధి యే ధనికవైశ్యామ్నాయసంజాతుఁడన్. 13

క. కడు లోభంబున నాలుం, గొడుకులు నాయర్థ మెల్లఁ గొని వెడలఁగ న
న్నడిచిన బంధువుల విడిచి, యడవికి వచ్చితి నరేంద్ర! యార్తి నడలుచున్. 14

ఆ. ఇట్టు లేను వనట నెరిసెద నిపుడు నీ, కేమి చెప్ప మేదినీశ! వినుము
తనయదారబంధుజనముల కుశలాకుశలము తెలియఁగ లేక సంతతంబు. 15

క. నాపుత్త్రకు లెప్పుడు స, ద్వ్యాపారప్రవణు లైనవారో కారో!
యేపగిది నున్నవారో! యోపార్థివ! సుఖులొ దుఃఖులో యే నెఱుఁగన్. 16

వ. అని వగచిన నన్నరేంద్రుం డిట్లనియె. 17

క. తనయాదులు ధనకాంక్ష, న్నిను వెడలఁగ నడిచి యుండ నీమనమున నా
తనయాదులదెస మోహం, బనుబద్ధము సేయ నేల యమలవిచారా! 18

తే. అనిన వైశ్యుండు నీచెప్పినంతపట్టు, నిది యథార్థమ్ము సుమ్ము నరేంద్రచంద్ర!
యేమి సేయుదు? నామనం బించుకైన, నిష్ఠురత్వంబు నొంద దాసీచులందు. 19

క. ధనలోభంబున జనకుం, డను మోహము విడిచి నను నిరాకృతుఁ గావిం
చినఁ బుత్త్రులందు నెయ్యము, ఘనమైనది యేమి సెప్పఁ గమనీయయశా! 20

వ. ఇది యంతయు నే నెఱుంగనే యెఱింగియు నిది యేమియో దుర్గుణానుబంధు లగుబంధులయందు నామనంబు ప్రేమఁ బెనఁగొనియెడు నేమి సేయుదు వారలం దలంచి నిట్టూర్పు నిగిడెడు డెందంబు గలంగెను వగలు నివ్వటిల్లెడుఁ బ్రీతిరహితులైనవారివలన నైష్ఠుర్యంబు దలకొనదయ్యెడు నని చెప్పినంత నారాజవైశ్యు లిరువురుం గూడి చని యాసంయమికి నమస్కరించి సముచితప్రకారంబున నతనిచేత సమ్మానితులై కూర్చుండి యిష్టకథాపరు లగుచున్న యవసరంబున నమ్మునిపతికి నమ్మహీపతి యిట్లనియె. 21

సీ. అర్థి నే నొకటి ని న్నడిగెద నాకు నీ వెఱిఁగింపవయ్య! మునీంద్రవర్య!
యుపగతరాజ్యుండ నయ్యు నభిజ్ఞుండ నైనను గిప్పు డజ్ఞాని కట్లు
రాజ్యాంగములయందు రమణ మమత్వంబు ప్రబలమై పాటునఁ బఱఁగ నీక
డెందంబు నెవ్వఁగ గొందలపెట్టెడు నకట! యీవైశ్యుండు నాలు సుతులు
తే. చెలులు చుట్టలు దను విడిచినను దాను, వారి విషువంగఁ జాలక వగచుచున్న
వాఁడు నెయ్యంబు మనమున నాటమైన, దివ్విధం బింతయును నిది యేమియొక్కొ!

ఆ. అనఘ! దృష్టదోష మైనయీవిషయంబు, లందు మమత చాల నగ్గలించి
యెదను గలఁచ నిట్టులే మిద్దఱము నిది, యేమి వనట నెఱిగియుం దెఱుక గలిగి. 23

క. అలఘుతరజ్ఞానసమేతుల మయ్యును మేము మోహదుష్టమతులముగ్
బలవదవివేకతిమిరాం, ధులమును నగుట యిది యేమి దురితధ్వంసీ! 24

తే. అనిన నమ్ముని యిట్లను నవనిలోడ, విషయగోచరజ్ఞానంబు వినుము జంతు
ఫలకు నెల్లను నెప్పుడుఁ గలిగి యుండు, విషయములు జాతిజాతికి వేఱువేఱ. 25

వ. ఎట్లంటేని వినుము. 26

తే. పగలు గానవు భువిఁ గొన్ని ప్రాణులధిప!, రేయి గానవు మఱికొన్ని రేయుఁ బగలు
గాన వొకకొన్ని యెపుడు సమానమైన, దృష్టి గలిగి జంతువులు వర్తించుఁ గొన్ని.

క. జ్ఞానులు నిక్కం బగుదురు, మానవులు మహీతలేశ! మనుజుల యేలా
జ్ఞానము గలయవి గావే, మానుగ మృగపక్షిపశుసమాజము లెల్లన్? 28

క. మానవులకుఁ గలవిషయ, జ్ఞానము పశువులకుఁ బక్షిసమితికిఁ గల ద
జ్ఞానము మానవులకు ధా, త్రీనాయక! కలిమి మనకుఁ దెల్లము గాదే? 29

చ. పులుఁగులఁ జూడమే యెడఁద బోధము గల్గియు మోహమెట్టిదో
సొలయక యాఁకట న్నలియుచు న్గని మేఁపఁగఁ దెచ్చి తెచ్చి చం

చులు వెదలించి పిల్లలకుఁ జొన్పెడు మక్కువ నింత కెక్కుడోఁ
దలఁపఁగఁ బుత్త్రులందు వసుధావర! మోహము మర్త్యకోటికిన్. 30

సురథసమాధులకు మేధస్సుమహాముని చెప్పిన మహామాయాప్రభావము.

వ. పుత్త్రమోహంబు ప్రత్యుపకారార్థంబు గాదది సహజంబ యె ట్లనిన సంసారస్థితి కారణి యైనమహామాయాప్రభావంబునం జేసి మమతావర్తం బగు మోహజలగర్తం బున నెల్లవారునుం బడినవారు గావున దీని కింత విస్మయం బంద వల దె ట్లనిన వినుము. 31

సీ. ఏమహామాయచే నీచరాచరబహుభూతజాలంబులు పుట్టుచుండు
నేమహామాయచే నెల్లలోకంబులు మోహసాగరమున మునుఁగుచుండు
నేమహామాయచే నెట్టివిద్వాంసుల బుద్ధు లెఱుంగమి బ్రుంగుచుండు
నేమహామాయచే నింతయుఁ గ్రమ్మఱ నవసానవేళల నణఁగుచుండు
తే. నామహామాయ సుమ్ము మహానుభావుఁ, డన సమస్తజగత్కర్త యనఁగ నాది
దేవుఁ డన వెలింగెడు విష్ణుదేవుయోగ, నిద్ర యైనమహామాయ భద్రమూర్తి. 32
క. ఆపరమేశ్వరి విద్యా,రూపమునఁ బ్రసన్న యై నరులబంధములం
బాపి సనాతనముక్తి, శ్రీపరిణామైక్యయుతులఁ జేయు నరేంద్రా! 33

వ. అని చెప్పిన నన్నరేంద్రుం డమ్మునీంద్రా! నీవు మహామాయ యని చెప్పి తది యెవ్వ? రది యెట్లు పుట్టె? దాని స్వరూపంబు ప్రభావంబు చరితంబును నెట్టివి? విన వేడ్క యయ్యెడు నెఱింగింపు మనవుడు నమ్మునీశ్వరుం డాదేవి నిత్యయుం జగన్మూర్తియుం సర్వవ్యాపినియు నై యుండియు నున్నను దదుత్పత్తివిధంబులు పెక్కు తెఱంగులు గల వాకర్ణింపుము. 34

క. సురకార్యసిద్ధికై యా,పరమేశ్వరి నిత్య యయ్యుఁ బ్రభవముఁ బొందుం
గరుణమెయి నెప్పు డప్పుడు, పరగు సముత్పన్న యనఁగ భవ్యవిభూతిన్. 35

సీ. లోకంబు లన్నియు నేకార్ణవం బైనఁ గల్పాంతమునఁ బొందుగా ననల్ప
ఫణివరతల్పంబుపైఁ బరమానంద యోగనిద్రాత్ముఁ డై యున్నవిష్ణు
కర్ణమలమ్మున ఘనసత్త్వు లధికులు మధుకైటభాసురు లహితబలులు
ప్రభవించి తన్నాభిపద్మస్థుఁ డైనచ,తుర్ముఖుఁ జంప నుద్యుక్తులగుచు
ఆ. సంచలించి యావిరించి యుండ గ్రన,క్తంచరులను నిద్రఁ దగిలినట్టి
యసురదమనశౌర్యు నాజనార్దనుఁ జూచి, యచలితాంతరంగుఁ డై యతండు 36
క. హరిచారువిలోచనసర, సిరుహమును నిలయముగను వసించి సమస్తే
శ్వరి యైనయోగనిద్రను, హరిబోధార్థముగ నిట్టు లభినుతించెన్. 37

మధుకైటభులవలన వెఱచి బ్రహ్మ యొనర్చిన యోగనిద్రాస్తుతి.

క. జననస్థితిలయకారిణి, యును విశ్వేశ్వరియుం నై సముజ్జ్వలతేజో
ఘనుఁ డగువిష్ణునిఁ బొందిన, యనుపమ యగుయోగనిద్ర నర్థి నుతింతున్. 38

క. స్వధ యన స్వాహా యనఁగా, సుధ యనఁగా దేవి! నీవ సుమ్ము త్రిమాత్రా
విధియును ద్రిభువనలీలా,మధురవు సనాతనార్ధమాత్రాత్మికవున్. 39

సీ. నీవ సావిత్రివి నీవ సంధ్యవు దేవి! నీవ తల్లివి సుమ్ము నిఖిలమునకు
నీవ సర్వంబును నిర్మింతు సతతంబు నీవ యీవిశ్వంబు నెమ్మిఁ దాల్తు
లీల నింతయుం నీవ పాలింతు కరుణచే సకలంబుఁ దుది నీవ సంహరింతు
సృష్టిరూపవును సుస్థితిరూపవును నీవ సంహృతి రూపవు జనని! నీవ
తే. శ్రీయు బుద్ధియు ధృతియును హ్రీయు నీవ, పుష్టియును శాంతియును నీవ తుష్టి నీవ
యీశ్వరియుం నీవ జగములకెల్ల మోహ,రాత్రి కాలరాత్రివి మహారాత్రి నీవ. 40

క. నీవ మహావిద్యవు మఱి, నీవ మహామాయ వమరనికరస్తుత్యా!
నీవ మహామేధవు మఱి, నీవ మహాస్మృతివి! దేవి! నిత్యానందా! 41

క. దేవీ! మహేశ్వరీ! త్రిగుణావస్థలు నీవె కావె యఖిలంబునకు
గావింతు మహాదేవీ!, దేవేంద్రప్రముఖనిఖిలదేవస్తుత్యా! 42

చ. కరముల శూలము న్గదయుం ఖడ్గము చక్రము విల్లు శంఖము
న్పరిఘము బాణము న్వెలుఁగఁ బ్రస్ఫురితాకృతిఁ దాల్చి లోకసుం
దరి వయి దేవి! నీవు సతతంబును నొప్పుదు తల్లి! శాంకరీ!
చరణనఖాంతసంపిహితసర్వదిగీశ్వరరత్నశేఖరా! 43

తే. సదసదాత్మక మైనయాసకలవస్తుసముదయమునకుఁ గలయట్టిసహజశక్తి
నీవ యిట్టినీమహిమ వర్ణింప నొకఁడు, శక్తుఁడే సర్వశబ్దార్థజాతమూర్తి! 44

క. లోకజనస్థితిలయకర, నైకవిధగుఁ డగువిష్ణు నటు మేల్కొననఁగా
నీ కున్నసీమహత్త్వం, బేకవి వర్ణింప నేర్చు నింద్రాదినుతా! 45

క. దేవీ! నీమహిమను గా,దే విష్ణుఁడు నేను బార్వతీపతియును నీ
శ్రీ విభవంబులు గాంచుట?, గావున ని న్నెవ్వఁ డోపుఁ గడఁగి నుతింపన్. 46

వ. అని యిట్లు నుదారంబు లైననిజప్రభావంబులం బ్రశంసించి ప్రజాపతి దేవీ! యీదుర్ధర్షు లయినమధుకైటభుల సమ్మోహితులం గావింపు మఖిలలోకప్రభుం డగు నచ్యుతుం బ్రబోధంబు నొందించి యీయసురవీరుల వధియింపవలయుఁ నవబోధం బద్దేవునకు నావహింపు మని ప్రార్థించినం దామసమూర్తి యైనయోగనిద్రాదేవి యట్లనేయం దలంచి. 47

క. హరినయనవదననాసా,కరహృదయోరస్స్థలముల గ్రక్కునఁ దాన
న్పరమేశ్వరుఁ బాసి నిలిచెఁ, బరముం డవ్యక్తభవుఁడు బ్రహ్మ గనుఁగొనన్. 48

వ. అంత. 49

విష్ణునకును మధుకైటభులకును యుద్ధము.

శా. నిద్రాజాడ్యము దన్నుఁ బాసినఁ గడు న్వే లేచి యాచంచదు
న్నిద్రాబ్జాక్షుఁ డధోక్షజుండు గనియె న్విస్ఫారదోర్వీర్యశౌ
ర్యోద్రిక్తాత్ముల రౌద్రవక్త్రుల నమర్షోగ్రాత్ముల న్నీలగో
త్రాద్రిప్రాంశుకరాళవిగ్రహుల బ్రహ్మధ్వంసనోద్యుక్తులన్. 50

క. మధుకైటభులను దనుజుల, నధికబలులఁ గాంచి విష్ణుఁ డతులితబాహా
యుద్ధుఁ డై వారలతో బహు, విధముల వడిఁ బెనఁగె నేనువే లబ్దంబుల్. 51

తే. అలఁత వైముఖ్యమునుబొంద కట్లు పోరు, వారిఁ గని హరి మాయి యై వరము వేఁడుఁ
డే నొసంగెద నన వార లిరువు రొకని,నొకఁడు వీక్షించి యుపహాస ముత్కటముగ.

క. ఆమధుకైటభులును మా,యా మోహితు లగుటఁ జేసి యతులితబలలీ
లామత్తు లై జనార్దన!, యే మిచ్చెద మడుగు నీకు నేవర మైనన్. 53

తే. అనిన విష్ణుండు ప్రీతుల రై తిరేసి, యొండువరము మి మ్మడుగంగ నొల్ల నసుర
లార! నాచేత వధ్యుల రగుఁడు మీర, లనిన లోక మేకార్ణవ మగుటఁ జూచి. 54

వ. పంచనం జావు దప్పించుకొనం దలంచి యానక్తంచరులు నక్తంచరారాతి కిట్లనిరి.

క. మెచ్చితిమి నీరణంబున, కిచ్చెదము వరంబు దప్ప కిమ్మహి నుదకం
బెచ్చట లే దచ్చట మముఁ, జెచ్చెర వధియింపు మనిన జృంభించి వెసన్. 56

ఆ. అట్లు కాక యని నిజాంకతలమ్మున, నునిచి చక్రి నలువ యొల్లసిల్ల
ననలకణకరాళ మైనచక్రమున న,ద్దనుజవరులతలలు దునిమి వైచె. 57

వ. నరేంద్రా! వాండ్ర మేదస్సుచేఁ గోవిందుండు గల్పించెఁ గావున నీవసుంధర మేదిని నాఁ బ్రసిద్ధ యయ్యె నామధుకైటభుల సంహరించి విష్ణుండు వినష్టఘోరభయుం నొ నర్చినఁ జతుర్ముఖుండు వివిధప్రజల సృజింపం బూర్వసర్గములందువలెఁ గేశవుండు పాలించె. 58

క. చతురాననుచే నిటు సం,స్తుత యై యుదయించె దేవి తొల్లి త్రిలోక
స్థితికొఱకు వినుము క్రమ్మఱ, క్షితిపతి! యద్దేవిమహిమఁ జెప్పెద నీకున్. 59

తపము చేయు దితికి సుపార్శ్వమహర్షి శాప మిచ్చుట.

క. మును దేవాసురయుద్ధ,మ్మున సురపతి సురలఁ గూడి పుత్రులఁ జంపం
జని దితి యి ట్లనియెం దన,జననిం గని యంబ! నన్ను సవతి తనూజుల్. 60

వ. అపుత్త్రం జేసి రిట్టినావైరులకుఁ బ్రతీకార మెట్లు సేయుదు ననఁ దల్లి యింద్రాది నిర్జరులఁ బోరం బరిమార్పఁ జాలుకొడుకుఁ బడయఁ దపం బొనరింపు మన మాతకుం గృతప్రణామ యై తీవ్రమతి నవలంబించి కాన కేఁగి భార్గవుం డగుసుపార్శ్వ

నాశ్రమమునఁదరి సర్వసత్త్వరూపధారిణి యై వేల్పులుం దాప మొంద నియమనిష్ఠితయై పిదప మహిషీరూపముం దాల్చి పంచాగ్నిహోత్రమధ్యమున నుండి జగత్త్రయసంక్షోభంబుగాఁ దపం బొనరింప సుపార్శ్వమహర్షి యుఁ దత్తపస్సంక్షోభితుఁడై కినుక గ్రుడ్లెఱ్ఱచేసి నీచేష్టితమునకుఁ దగ నిట్టికొడుకు మహావీర్యుఁడు మహిషుండు పొడము నని శపించె ననంతరము పితామహుఁడు తపఃపరితోషితుం డై వచ్చి. 61

ఆ. మహిషముఖమె యైన మానినీ! నరశరీ, రార్ధధరత నిష్టుఁ డగుచు నీకు
నమరసహితుఁ డైనయమరాధిపతి నోర్చు, నని సుపార్శ్వనియమి ననునయించి. 62

బ్రహ్మ యనుగ్రహమున దితికి మహిషాసురజననము.

వ. ఆమె తపంబు మాన్పి నిజలోకమున కరిగె నంత మహిషాసురుఁడు పరమేష్ఠివచనానుసారముగ జన్మించి శుక్లపక్షనక్షత్రేశుఁడువోలె వృద్ధి నొందిన నావిద్యున్మాలిపుత్త్రునకు విప్రచిత్తి యనునందనుం డుదయించె నామహోద్ధతి యగుమహిషువరదానము విని యేతెంచి దైత్యదానవులు బలసి వినయంబున మహిషుతో నిట్లని రీత్రిదివాధిపత్యము మనయది విష్ణుబలావలంబంబున సురలు హరించి రట్లె నీవును నీప్రభావము ప్రకటంబుగా సపరివారుఁ డగు దేవరాజు బవరంబునం గీటడంపు మన నాదైత్యులతో మహిషుఁ డమరులతోఁ దుర మొనరించుతలంపునఁ ద్రిదివమునకు బయలుదేఱె నంత. 63

మ. తమసైన్యముల కింద్రుఁడు న్మహిషుఁడు న్దర్పమ్ముమై నాధిప
త్యములం బూనఁగ దేవదైత్యులకు యుద్ధం బయ్యె నూఱేండ్లు పూ
ర్ణముగాఁ దొల్లి తదాహవాంతరమునన్ దైతేయదుర్దాంతవి
క్రమపాండిత్యపటుత్వ మేఁచిన దివౌకస్సైన్య మోడె న్గడున్. 64

దేవతలచే మహిషాసురునిదౌర్జన్యంబు విని శివకేశవులు కోపించుట.

మ. మహిషుం డిట్లు సురావళిం గెలిచి సామర్థ్యంబుమై నింద్రుఁ డై
న హతభ్రష్టసమస్తసైన్యు లయి దైన్యం బొంది బృందారకుల్
ద్రుహిణుం దోడ్కొని యొక్కచోన హరిరుద్రుల్ ప్రీతితో నున్నఁ ద
న్మహితస్థానము చేరి వారిఁ గని నానాస్తోత్రవాచాలురై. 65

వ. దండప్రణామంబు లాచరించి దుష్టచేష్టితుం డైనమహిషాసురుండు దమ్ముం బరిభవించినవిధం బంతయు సవిస్తరముగా నయ్యిరువురకు విన్నవించువారై దేవత లిట్లనిరి.

తే. అవధరింపుఁడు నిఖిలలోకాధినాథు,లార! మావిన్నపము బలోదారుఁడైన
మహిషుఁ డెప్పుడు మదమున మసరుకవిసి, కలఁచుచున్నాఁడు త్రిభువనకమలవనము.

క. మహిషునికుచ్ఛ్రితమును బర, మహిషులఁ జెఱ పట్టుటయును మత్తిల్లి మరు
న్మహిజములు గూల్చుటయుఁ జేర్చి వారిం దోలుటయుం వానిఁ జెప్పుము మాకున్.

శా. తేజస్ఫూర్తి దినాధినాథుఁ డయి కాంతిం జందురుం డై ప్రతా
పాజేయత్వమునం గృశానుఁ డయి ఘోరైశ్వర్యశౌర్యోన్నతిం
దా జిష్ణుం డయి దర్ప మొప్పఁ గొనియెం దత్పదమ్ము ల్బల
భ్రాజిష్ణుం డసురేశ్వరుం డసురు లుబ్బ న్లోకసంహారుఁ డై. 69

వ. మఱియును. 70

సీ. అవలీల నంతకు నతిదీనుఁ గావించి బలిమిఁ గోణాధిపు భంగపెట్టి
పరిగొని వరుణునిఁ బరిభూతి నొందించి కడిమిమైఁ బవనుని గాసి చేసి
మత్తిల్లి విత్తేశు మానం బడంగించి గండున నీశానుఁ గష్టపఱిచి
యేఁచి గంధర్వేశు హీనదశకుఁ దెచ్చి యలుకమై సాధ్యుఁ దలఁగఁ ద్రోచి
తే. యప్పురంబులు వడిఁ దాన యాక్రమించి, గరుడసిద్ధవిద్యాధరఖచరనాగ
వరుల నుద్వృత్తిసతతంబుఁ బఱపి వనులు, గొనుచునున్నాఁడు మహిషుండు క్రొవ్వుమిగిలి.

చ. అలఘుపరాక్రముండును దురాత్ముఁడు నై మహిషాసురుండు దో
ర్బలమున నాకముం గొనినఁ బాడఱి పోయి ధరిత్రి సిద్ధమ
ర్త్యులక్రియ నున్నవారము సురోత్తములార! భవత్పదాంబుజ
మ్ములు శరణంబుఁ జొచ్చితిమి బుద్ధి దలంపుఁడు దైత్యనాశమున్. 72

క. అని నాకౌకసు లెఱిఁగింప, విన విని మధుసూదనుండు శ్రీకంఠుండు
న్గనిరి వికటభ్రూభ్రుకుటి, ఘననిటలస్వేదబిందుకలితాననులై. 73

హరిహరాదుల తేజఃపుంజములవలన నావిర్భవించిన దేవికి దేవతలు యుద్ధోపకరణము లిచ్చుట.

వ. ఇట్లు రోషసంఘూర్ణితుం డగువిష్ణువక్త్రంబున మహాతేజం బుద్భవించె బ్రహ్మశంకరశ
క్రాదిసకలదేవశరీరంబులయందుఁ దీవ్రతేజంబులు నిర్గమించె నత్తేజంబు లన్నియు
నేకత్వంబు నొంది మహాపర్వతంబునుం బోలె నభంబు దాఁకి దిగంతరంబులు వెలిఁ
గించుచు నక్కజం బై యుండె నంతం దదీయతేజోరాశివలన రుద్రతేజంబున ము
ఖంబును యమతేజంబునం గేశసంచయంబును విష్ణుతేజంబున భుజంబులును జంద్ర
తేజంబునం గుచంబులును నింద్రతేజంబున మధ్యంబును వరుణతేజంబున జంఘలు
తొడలును భూమితేజంబున జఘనంబును విరించితేజంబునం జరణంబులును దరణి
తేజంబునఁ బాదాంగుళిసముదయంబును వసుతేజంబునం గరాంగుళిసముదయంబును
గుబేరుతేజంబున నాసికయుఁ బ్రాజాపత్యతేజంబున దంతపఙ్క్తియు నగ్నితేజంబున
నేత్రత్రయంబును నుభయసంధ్యాతేజంబున బొమలును బవనతేజంబునం జెవులునుం

గా నొక్కదివ్యనారీరూపం బై నిలిచిన మహిషభయభీతు లగు దేవతలు సూచి హర్షించి రద్దేవికిం దమయాయుధంబులవలన నాయుధంబులు పుట్టించి శూలి త్రిశూలంబును చక్రి చక్రంబును జలధిపతి శంఖంబును వహ్ని శక్తియు వాయుదేవుఁడు బాణాసనాక్షయతూణీరంబులు వజ్రి వజ్రంబును నైరావణంబు ఘంటయుఁ దండధరుండు కాలదండంబును బ్రజాపతి యక్షమాలయుఁ గమండలువును బ్రభాకరుండు రోమకూపంబులం బ్రజ్వరిల్లునిజరశ్మికలాపంబును గాలుండు ఖడ్గఖేటంబులను విశ్వకర్మ వివిధదివ్యాస్త్రంబులు నభేద్యకవచంబును బరశువు నిచ్చిరి మఱియు. 74

క. క్షీరోదధి నిర్మలతర,హారకటకకుండలాంగదాంబరమణిమం
జీరార్ధచంద్రవిపుల,స్ఫారాభరణములు ధవళపద్మము నిచ్చెన్. 75

తే. హిమనగేంద్రుండు సింహము నిచ్చె వాహనముగ మధుపూర్ణపానపాత్రముఁ గుబేరుఁ
డిచ్చె బహుఫణిమణిఘృణి మెసఁగఁ గరము, చెలువ మగుఫణిహారంబు శేషుఁ డిచ్చె.

వ. అంత. 77

మ. సురదత్తాయుధరత్నభూషణపరిస్ఫూర్జత్ప్రభాజాలవి
స్ఫురదుద్యద్భుజదివ్యదేహనిబిడాంశుల్ పర్వ భూమిన్నభో
తర మెల్ల న్వెలిఁగింప నత్యధికరౌద్రస్ఫూర్తి నద్దేవి ని
ష్ఠురహాసోద్భటసింహనాదము జగత్క్షోభంబుగాఁ జేసినన్. 78

ఉ. ధరణీచక్రము దిర్దిరం దిరిగెఁ బాతాళంబు ఘూర్ణిల్లె భూ
ధరవర్గంబు చలించె బెల్కుఱె దిశాదంతావళశ్రేణి మ్రొ
గ్గె రవీందుగ్రహతారకావళులు మ్రగ్గెన్ మ్రోసె బ్రహ్మాండము
ల్వరఁగఁ బ్రిందలివండుగాఁ గలఁగె నాశ్చర్యం బుదగ్రంబుగాన్. 79

వ. అప్పుడు దేవత లాసింహవాహనం జూచి హర్షించి జయజయశబ్దంబు లొనరించిరి భక్తివినమ్రు లగుచు సకలమునులును బ్రస్తుతించి రంత సమస్తసైన్యంబులు సన్నద్ధంబులు గావించి వివిధాయుధంబులు ధరియించి సుధాశనులు మహాదేవిం బురస్కరించుకొని మహిషునిమీఁదికి నురవణించిన. 80

క. కని యాదనుజుం డేమీ, యనిమిష లోకయోధుదాని నక్కట! నాతో
నని సేయఁ దెచ్చినారే?, యనుచుం బటురోషభీషణాకారుం డై. 81

వ. సమరోత్సాహంబు మెఱసి సకలసైన్యంబులు ముంగల నడువ నపుడ వెడలి. 82

సీ. అతిరథసాంఘ్రివిన్యాసనిర్భరభరంబున నేల పాతాళమునకు డిందఁ
ప్రత్యగ్రబహురత్నబహుళదీప్తిచ్ఛటారంగత్కిరీటంబు నింగి మెఱయ
శస్త్రాస్త్రజాలప్రసారణపటుదోస్సహస్రంబు దిక్కుల నవలఁ ద్రోవ
నుజ్జ్వలదుర్నిరీక్ష్యోగ్రదేహద్యుతిపుంజంబు బ్రహ్మాండపూరితముగ

తే. నతులహుంకారసింహనాదాట్టహాస,ములు సెలంగఁగఁ దనరౌద్రమూర్తి మెఱయ
వచ్చునద్దేవిఁ దీవ్రదుర్వారశౌర్య, ఘనుఁడు మహిషాసురేంద్రుండు గనియె నంత.

మహిషాసురసేనాపతు లగుచక్షురాదులకు దేవికిని యుద్ధము.

క. ఆదేవితోడ యుద్ధం, బాదానవయోధవీరు లతులితభుజద
ర్పోద్ధారులై యొనర్చిరి, రోదోంతర మస్త్రశస్త్రరోచుల వెలుఁగన్. 84

క. మహిషాసురసేనాపతి, యహితులఁ దలపడియెఁ జక్షురాఖ్యుం డలుక
న్మహనీయచతుర్విధబల, సహితుండును బ్రకటశౌర్యసంపన్నుఁడు నై. 85

క. అఱువదివేలరథము లే, డ్తెఱ నడల నుదగ్రుఁ డడరె దేవిపయిం దా
నుఱక రథకోటితో వడిఁ, దఱిమె మహాహనుఁడు శౌర్యదర్ప మెలర్పన్. 86

వ. మఱియు నేఁబదిలక్షలరథంబులతో నసిరోముండును గాలుండును నఱువదిలక్షల
రథంబులతోడ బాష్కలుండును గోటిస్యందనంబులతోడ నుగ్రదర్శనుండును నే
నూఱుకోట్ల తేరులతో బిడాలుండును ననుమహాసురు లమ్మహాదేవిం జుట్టుముట్టి
ఘోర యుద్ధంబు సేయుచుండ. 87

మత్తకోకిల. కోటికోటిసహస్రసంఖ్యలు కుంజరంబులుఁ దేరులు
న్ఘోటకంబులుఁ దోడ రాఁ బటుఘోరవిక్రముఁ డై మరు
త్కోటి వెల్ల లులాయదైత్యుఁడు దోలి శాంభవిమీఁది దోః
పాటవం బెసఁగంగఁ దోమరబాణశక్తికృపాణముల్. 88

తే. ఆదిగాఁ బరగించె బెక్కాయుధములు, గొంద ఱసురులు శక్తులఁ గొంద ఱుగ్ర
పాశములఁ గొంద ఱద్దేవిఁ బరఘములను, గడఁగి నొప్పించి పరిమార్పఁ గడఁగుటయును.

శా. చండక్రోధ మెలర్పఁ జండిక వెస న్శస్త్రాస్త్రవర్షంబున
న్ఖండించె న్దనుజాస్త్రశస్త్రములు తద్గాత్రంబులం బ్రస్ఫుర
త్కాండవ్రాతము నించి నొంచె మునిసంఘంబు ల్నుతింపంగ ను
ద్దండోద్యద్భుజదండలీల మెఱయ న్దర్పంబు శోభిల్లఁగన్. 90

క. దేవీవాహనసింహం, బావిర్భూతోగ్రదోష మై యప్పుడు ర
క్షోవీరసైన్యములఁ బటు,పావకుఁ డడవిం జరించుభంగిఁ జరించెన్. 91

చ. సమరముఁ జేయుచుం జెలఁగి శాంభవి యూర్పు లొగి న్నిగుడ్ప న
య్యమకడ నుప్పతిల్లి ప్రమథాళి యనేకసహస్రసంఖ్య ల
య్యమరవిరోధిసైన్యము రయంబున నాశముఁ బొందఁ జేసెఁ దీ
వ్రము లగుభిండివాలకరవాలపరశ్వధపట్టిసాదులన్. 92

గీ. చేసె నద్దేవి గణములు చెలఁగి శంఖ, పటహభేరీమృదంగాదిబహువిధముల
వాద్యములు మొరయించి రాధ్వనులు నిఖిల,దిశలయందును నభమున దీటుకొనియె.

సీ. ఘోరత్రిశూలవిహారంబు క్షోభిల్లఁ జెలఁగి దైతేయులఁ జీరి చీరి
చండగదాదండసారణోద్ధతి యొప్ప ముసుమిడి దనుజుల మోఁది మోఁది
యాఖీలఖడ్గవిద్యాకుశలత్వంబు మెఱయ రాక్షసకోటి నఱకి నఱకి
పటుశరాసనకళాభైరవత్వము గడుఁ గొమరుగ నసురులఁ గూల్చి కూల్చి
ఆ. యుగ్రపాశబంధనోదగ్రవృత్తి న, క్తంచరాళితలలు దెంచి తెంచి
కసిమసంగి తీవ్రగతి నమ్మహాకాళి, లీల నసమసమరకేళి సలిపె. 94

వ. అట్లమ్మహాకాళి వివిధప్రకారంబుల రణవిహారం బొనరింప వైరులు తదీయచండఘంటానాదంబున గుండియ లవిసి కూలువారును ఖడ్గప్రహారంబుల నిఱుపఱియలై పడువారును గదాఘాతంబున నెత్తురు గ్రక్కుచుఁ ద్రెళ్ళువారును శూలానలం బురంబు ప్రచ్చిన నేలం బడి పొరలువారును శరపరంపరలు శరీరంబులఁ దగిలిన నొఱలువారును బ్రాణంబులు విడుచువారును దలలు తెగిన నాయుధంబులు విడువక నిలు నిలు మని యదల్చుచు నద్దేవిపైఁ గవిసి కయ్యంబులు సేసి పడువారును ద్రుటితహస్తులు ఛిన్నగ్రీవులు భగ్నశిరస్కులును గృత్తకరచరణులును విదారితమధ్యభాగులు నై నశించి రంబరంబు బహుతరకబంధబంధురం బయ్యెఁ బతితంబులైనకరితురంగభటసముదయాంగంబులను భయంకరంబులై రక్తనదీప్రవాహంబులను సమరాంగణంబు ఘోరత్వంబు నొందె నివ్విధంబున నయ్యంబిక యొకక్షణంబునం దృణదారుసంచయంబులు భస్మంబు గావించువహ్నియుంబోలె మహిషాసురచతురంగబలంబులను సంక్షయంబు నొందించె నద్దేవి సింహంబును బ్రమథగణంబులును సముద్భటరూపంబున నిశాటసైన్యపాటనపాటవంబున దీపించె నప్పుడు దివిజులు బహువిధంబులం బ్రస్తుతించుచు నప్పరమేశ్వరిమీఁదఁ బుష్పవృష్టి గురిసి రంత. 95

చక్షురుఁడు మొదలగుమహిషాసురసేనాపతుల సంహారము.

మ. దనుజానీకము వ్రగ్గినన్ గని భుజాదర్పంబునం జక్షురుం
డనుసేనాపతి కోపఘూర్ణితముఖుం డై తాఁకి యద్దేవి ను
గ్రనిశాతాశుగవర్షధారల వడిన్ గప్పె న్మహాభ్రంబు పే
ర్చి నిలింపాచలతుంగశృంగ మతివృష్టిన్ గప్పుచందంబునన్. 96

ఉ. భైరవి యేచి యద్దనుజబాణము లన్నియు నుగ్గు సేసి త
త్సారథిఁ గూల్చి యశ్వములఁ జంపి వడిన్ విలు ద్రుంచి కేతువు
న్దేరును లీలమై నఱకి తీవ్రశరంబుల వానిమేను దు
ర్వారరయం బెలర్పఁ బలువ్రయ్యలు గా వెస నేసె నేసినన్. 97

తే. విరథుఁడై చక్షురుండు దోర్వీర్య మెసఁగ, వాలుఁ బలుకయుఁ గొని శీఘ్రలీల గదిసి
యార్చి సింహంబుశిరముఁ జండాసి నవ్వ, బాహువును వ్రయ్య నేసి కోపమున మఱియు,

క. శూలంబు పుచ్చుకొని య,క్కాళిధనువు దునిమె వాఁడు గ్రక్కున నది తే
జోలంకృతరవిబింబము, వోలెఁ జదలనుండి యపుడు పుడమిం బడియెన్. 99

వ. ఇట్లు వచ్చుటయుం వేఁటొక్కఁడి త్తె. 100

క. కాని దేవి శరావళి న, ద్దనుజానిశూలంబు నఱికి తను వెల్లను దు
త్తునియలు గా రయమున జే,సిన నాసేనాని విగతజీవుం డయ్యెన్. 101

సీ. సామజారూఢుఁ డై చామరుం డనుదనుజుండు చండికమీఁదఁ జండశక్తి
నిగిడింప నద్దేవి నిష్ఠురహుంకార మొనరించుటయుం నది యుడిగి మడిఁగి
మేదినిఁ బడియె నమ్మేటిరక్కసుఁడు త్రిశూలంబు వైచె నాఖీలలీల
దానిఁ దుత్తునియలు గా జేసె నంబిక, జృంభించి యద్దేవిసింహ మెసఁగి
తే. కుంభికుంభస్థలం బెక్కి ఘోరబాహు, రణము గావించి వానివారణముఁ ద్రుంచె
దేవతలు చూచుచుండ నద్దేవి దోఃప్రహారమున మస్తకము వెసఁ జేరి చంపె. 102

సీ. తరుశిలాప్రహతి నుదగ్రు ఖండించెఁ గరాళుని బిడికిటఁ గూలఁ బొడిచె
గద నుద్ధతుని నేలఁ గలిపె బాష్కలుఁ బటు భిండివాలమ్మునఁ బిలుకుమార్చె
నుగ్రశరముల నుదగ్రవీర్యుని ద్రుంచె నుగ్రాస్యు నొకకోల నుక్కడంచె
ఘనశూలమునఁ ద్రినేత్రునిఁ జంపె గరవాల ధార బిడాలుకంధరము నఱకె
తే. భల్లమున మహాహను గతప్రాణుఁ జేసె నారసంబున దుర్ధరునామ మడఁచె
దుర్ముఖుని శితాస్త్రంబునఁ ద్రుంచె నిట్లు, మారిమసఁగి దైతేయుల బారిసమరె. 103

దేవి మహిషాసురుని వధించుట.

వ. ఇవ్విధంబున నమ్మహాదేవిచేత నిజసైన్యంబు నిరవశేషం బైన విజృంభించి యమ్మహి
షాసురేంద్రుండు మహిషం బైనరూపంబుఁ గైకొని తదీయగణంబుమీఁదఁ గవిసి.

ఉ. కొందఱఁ జండతుండహతిఁ గొందఱఁ గ్రూరఖురాగ్రఘట్టన
న్గొందఱ దీర్ఘవాలమునఁ గొందఱ దీర్ఘవిషాణలీలల
న్గొందఱఁ దీవ్రవేగమునఁ గొందఱ నుగ్రమహారవంబున
న్మ్రందఁగఁ జేయుచు న్ప్రమథమండలి నెల్లను ద్రుంచి యుద్ధతిన్. 105

క. ఆదేవిమృగేంద్రమునకు, నాదికొనినమహిషుఁ డాది యయ్యంబిక క్రో
ధోదగ్రమూర్తి యగుటయు, నాదనుజుఁడు క్రోధఘూర్ణితారుణముఖుఁ డై. 106

సీ. గగనంబు గడచినఘనఘోరదేహంబు తాఁకునఁ దారకోత్కరము రాలఁ
బెందూళి యెసఁగ నందంద కాల్ద్రవ్వ నుగ్రత మహీతలము గ్రక్కదలుచుండ
గోరాడి బలువిడిఁ గొమ్ములఁ జదిమిన శైలము ల్వినువీధిఁ దూలి పోవ
వాలగుచ్ఛంబున వడి నాహతంబులై వనధులు పిండలివండు గాఁగఁ

తే. చండనిశ్వాసహతిఁ గులక్ష్మాధరములు, మూర్తములు గాఁగ మిడుఁగుర్లసోన గన్నుఁ
గడల నడరఁగ జగము లాకంప మొందఁ, దీవ్రముగ నమ్మహిషు నద్దేవి గాంచె.

మ. పటురోషంబున వానిఁ జంపఁగ మహాపాశంబు పై వైచి యు-
త్కటసత్వంబున నంటఁ గట్టుడుఁ దదాకారంబు వోఁ బెట్టి యు-
ద్భటసింహాకృతి దాల్చె దానవుఁడు తత్కంఠంబుఁ జండాసిచేఁ
ద్రుటితం బయ్యె సురారి తాఁ బురుషుఁడై తోఁచె న్గృపాణంబుతోన్. 108

క. కరవాలచర్మయుతముగ, శరముల నప్పురుషు నఱకెఁ శాంభవి వాఁ డు-
ద్ధురసింధురమై సింహముఁ, గరమున వడిఁ బట్టి తిగిచె గర్వస్ఫూర్తిన్. 109

చ. తిగిచినఁ గాళియుం గజము దీర్ఘకరంబు గరాసిఁ ద్రుంచెఁ దా-
మగుడఁ గ నమ్మహాసురుఁడు మాహిషరూపముఁ దాల్చి లోకము-
ల్బెగడఁగ రోఁజుచు న్జెలఁగి పేర్చినఁ జండిక చూచి రౌద్రము-
న్నగవును మోమునం బెనఁగొన న్మధుపానము లీలఁ జేయుచున్. 110

తే. చెలఁగి యార్చిన మహిషుఁడుఁ జలముబలము, మెఱయుశృంగాగ్రములమహామేదినీధ-
రములు పెఱికి యద్దేవిపై రభసలీల, వైచె వైచిన శరతతి వానిఁ దునిమి. 111

వ. మధుపానరాగస్ఫురితనయన యగుచు ససంపూర్ణమధురాక్షరంబుగా నిట్లనియె.

క. ఏ నీమధురాసవరస, మానినయందాఁక నెట్టులైనను మూఢా-
త్మా! నలువునఁ జెలఁగుము నా, చే నీ వీల్గుటయు సురలు చెలఁగుదురు వెసన్. 113

మ. అని యద్దేవి రయంబున న్నెగసి దైత్యాధీశకంఠంబు పె-
ల్చనఁ బాదంబునఁ జిక్కఁ ద్రొక్కి పటులీల న్శూలనిర్భిన్నుఁగా-
త్రునిఁ గావించిన వాఁడు లావునఁ గడుం ద్రోపాడి మోమెత్తి తాఁ-
బెనఁగం జొచ్చినఁ ద్రుంచె వానిశిర మాభీలాసిధారన్వెసన్. 114

సురలొనర్చినమహిషాసురమర్దనీస్తుతి.

వ. ఇవ్విధంబున నమ్మహిషాసురుం డామహాదేవిచేత హతుం డైన హాహారవంబులు సెలంగె సకలదైత్యసైన్యంబు నశించె సమస్తసురగణంబులు హర్షించె మహర్షులమ్మహాదేవిం బ్రస్తుతించిరి గంధర్వగీతంబులు నప్సరోంగనానర్తనంబులును బ్రవర్తిల్లె మందమారుతంబులు వీతెంచె దివాకరుండు తేజోరమ్యుం డై వెలింగె వహ్నులు శాంతంబు లై ప్రజ్వలించె దిగ్గజంబులు మృదుమనోహరస్వనంబులు నిగిడించె నంత. 115

చ. అతులభుజాబలోగ్రుఁడు దురాత్ముఁడుఁ డామహిషుండు దేవిచే
హతుఁ డగుడుఁ శతక్రతుముఖామరు లుత్కటహర్షలీలఁ బ్రో-
న్నతపులకాంచితాంగులు వినమ్రశిరస్కులు నై వెలింగి య-
ద్దితిసుతరాజసంహార నుతింపఁ దొడఁగి రనేకభంగులన్. 116

చ. అరయఁగ సర్వనిర్జరగణాతతశక్తిసమూహమూర్తి వై
పరఁగెడు నేమహేశ్వరిప్రభావమున జ్జగము ల్భరించు న
ప్పరమవధూటి కంబికకుఁ బన్నగ మ్రొక్కెద మేము భక్తి నా
సురమునిపూజ్య దేవి బహుశోభనము ల్దయ మాకు నీవుతన్. 117

ఉ. శ్రీవనితావిభుండు సరసీరుహగర్భుఁడు శంకరుండు నే
దేవిప్రభావము న్బలముఁ దేజము నిట్లని చెప్ప నేర రా
దేవి సమస్తదానవులఁ ద్రెక్కొని లోకము లెల్ల నెప్పుడు
న్గావఁగ బుద్ధి సేయుతను గారుణికత్వధురీణచిత్త యై. 118

క. నీరూప మచింత్యం బమ, రారిక్షయకారి నీమహత్త్వము మఱి నీ
చారిత్రము లద్భుతములు, ఘోరాజులు మాకుఁ బొగడుకొలఁదియె దేవీ! 119

సీ. దివిజులఁ బితరులఁ దృప్తిఁ బొందింపఁగ స్వాహావు నిర్మలస్వధవు నైతి
మోక్షార్థు లగుమహామునులచే నెపుడు భావింపఁగాఁ బడునాత్మవిద్య వైతి
వామ్నాయముల కెల్ల నైతివి నిధివి జీవస్థితికై దేవి! వార్త వైతి
సకలశాస్త్రంబులసారంబ వైతివి భవవారిధికి యానపాత్ర మైతి
తే. హరిభుజాంతరవాసిని యైనలక్ష్మి, వైతి శివునకు సామేన వైతి వీవ
జగములకుఁ గారణము నీవ త్రిగుణమూర్తి, నీవ మూలప్రకృతి వీవ నిర్మలాంగి!

ఉ. భూరిసముద్యదిందురుచిఁ బోల్చి పటుభ్రుకుటీకరాళ మై
దారుణకోపతీవ్ర మగుతావకవక్త్రము చూచినప్డ యా
సైరిభదానవుండు వెసఁ జావమి చోద్యము గాదె భైరవీ!
యేరికిఁ బ్రాణము ల్నిలుచు నే కుపితాంతకదర్శనంబునన్?. 121

చ. సుజనులయందు లక్ష్మి యయి సూరిజనంబులయందు బుద్ధి యై
కుజనులయం దలక్ష్మి యయి గోత్రపవిత్రులయందు లజ్జ యై
ద్విజవరులందు శాంతి యయి విస్ఫురణం జెలు వొందుదేవి కే
ము జయజయధ్వను ల్సెలఁగ మ్రొక్కెద మర్థిఁ ద్రిలోకరక్షకై. 122

మ. మము రక్షింపుము దేవి! నీకరమున న్మానై పెలుం గొందుచ
క్రమున న్గార్ముకశింజినీరవమున న్ఖడ్గంబున న్శాతశూ
లమున న్సంతతఘంటికాధ్వనిఁ గృపోల్లాసంబు శోభిల్ల ని
త్యముఁ బూర్వాపరదక్షిణోత్తరదిగంతస్థప్రదేశమ్ములన్. 123

వ. అని మఱియు ననేకప్రకారంబులం బ్రస్తుతించి దేవత లమ్మహాదేవిం జందనానులేపన
దివ్యకుసుమధూపదీపార్పణంబులం బరమభక్తి నర్చించి దండప్రణామంబు లాచరించి

నం బ్రసాదసుముఖియై శాంభవి నిలింపుల నిరీక్షించి మీ కభిమతం బైనవరం బడుగుఁ డిచ్చెద దుష్కరం బైన నెద్దియేనియుం జేయ వలయుదానిఁ జేసెదం జెప్పుఁడనిన ననిమిషులు మహేశ్వరీ! భువనకంటకుఁ డగునప్పదియశత్రు మహిష వధియించితివి నీచేత సర్వంబునుం జేయంబడియె నొక్కకొఱంతయుం లేదు వరం బిచ్చెద వేని మాచేత నెపుడు సంస్మృత వైతివప్పుడు మాయాపద లెల్ల హరింపుము.

క. విను నీ స్తవమున నేనరుఁ, డనిశము వినుతించు నతని కతులధనసతీ
తనయవిభవవృద్ధికి నో, జనని! మా కెట్టు లట్ల సంముఖ వగుమీ. 125

తే. అనిన సురలకుఁ గరుణించి యట్ల కాక, యని రయమున నంతర్హిత యయ్యె దేవి
దేవదేవతేజముల నద్దేవి లోకహితముగా జనించినవిధ మిది నరేంద్ర! 126

వ. శుంభనిశుంభాదిదుష్టజనుల భంజింపను జగంబుల రక్షింపను దివిజులకు నుపకారం బాచరింపను దలంచి యమ్మహామాయ తొల్లి గౌరీపరమేశ్వరిశరీరకోశంబునం దావిర్భవించినవిధంబు నీకుం జెప్పెద నాకర్ణింపు మని సురథునికి నమ్మహాముని యిట్లనియె. 127

శుంభనిశుంభులు పుట్టి విజృంభించుట.

సీ. శుంభుండు దొల్లి నిశుంభుండు ననుమహా, సురులు దోర్దర్పవిస్ఫురణ మూఁడు
లోకంబులును దామ కైకొని యజ్ఞభా,గములు హరించుచు నమృతకరర
వీంద్రాగ్ని యమజలాధీశమారుతకుబే,రాద్యధికారంబు లాక్రమించి
వర్తించుచుండ గీర్వాణు లవ్విధమున, భ్రష్టరాజ్యులును బరాజితులును

ఆ. నధికదుఃఖితులును నై యమ్మహామాయఁ, దలఁచి తన్నుఁ దారు దలఁచినపుడ
యాపదలు హరింతు నని దేవి తమకు ము, న్నరుణ నొసఁగినట్టివరము దలఁచి. 128

వ. హిమవంతంబున కరిగి విష్ణుమాయ యైనయమ్మహాదేవి నిట్లని స్తుతించిరి. 129

దేవతలు చేసినదేవీస్తుతి.

తే. దేవి కళ్యాణి శివ మహాదేవి ప్రకృతి,భద్ర చంద్రరూపిణి జ్యోత్స్న రౌద్ర ధాత్రి
సిద్ధి నైరృతి శర్వాణి బుద్ధి యనఁగ,గీర్తి యగుగౌరి కేమొ మ్రొక్కెదము భక్తి.

తే. దుర్గ మూర్తి మహాలక్ష్మి దుర్గపార, సార సర్వకారిణి నిత్య సౌమ్య కృష్ణ
భూతియతిరౌద్ర ధూమ్రవిఖ్యాతియనఁగ,గీర్త్యయగుగౌరికేమొమ్రొక్కెదము భక్తి.

తే. అరయ సర్వభూతమ్ములయందు విష్ణు, మాయ యనఁగ నేదేవి యా మహిమఁ దనరు
నామహాదేవి కనుగక యనుదినంబు,మ్రొక్కెదము మ్రొక్కెదము భక్తిమోసు లెత్త.

సీ. అఖిలభూతంబులయందును నేదేవి, శక్తినిద్రాక్షుధాశాంతిశుద్ధి
బుద్ధిరూపంబులఁ బుష్టితృష్ణాకాంతి, మాతృరూపంబుల బ్రీతితుష్టి

మేధాక్షమాధృతిస్మృతిరూపములఁ బ్రజ్ఞా,శ్రుతిచేత నావృత్తిరూపములను
ఛాయాచితిస్థితిశ్రద్ధాత్రపారూప,ములను మాయారూపమునను శ్రీస్వ
తే. రూపమునను హింసారతిరూపములను
బాయ కుండు నాదేవికిఁ బరమభక్తి
మ్రొక్కెదము మేము తలలపై మోడ్పుఁ గేలు
గదియఁ జేర్చి మేము మ్రొక్కెదము మఱియు. 133

ఉ. దానవభర్తృప్రతాపు లగుదైత్యులవేఁడిమిఁ గుందినప్పు డే
దేవికి మేము మ్రొక్కెదమతిస్థిరభక్తిఁ బ్రశంస చేసి యా
దేవి దయార్ద్రభావమున డగ్గఱ మాకుఁ బ్రసన్నయై ప్రమో
దావహలీలఁ దాల్చి వెస నాపద లెల్లను బాపుఁ గావుతన్. 134

వ. అనుచు ననేకప్రకారంబుల ననిమిషు లభినందించుచున్నంత. 135

కౌశికి గౌరీకాయకోశమునుండి యావిర్భవించి గౌర్యాజ్ఞ చే హిమవంతమున కేఁగుట.

క. స్నానార్థము పార్వతి గం,గానదికి న్వెడలి సురలఁ గనుఁగొని మీ చే
మానుగఁ బొగడఁగఁ బడియెదు, నానెలఁతుక యెవ్వ రిచట ననియె నరేంద్రా!
తే. అనుడు నద్దేవితనుకోశమున జనించి, యప్పు డొకదేవి సురలతో ననియె సురలు!
నన్ను వినుతించెదరు శరణంబుఁ జొచ్చి, యుగ్రశుంభనిశుంభుల నోర్వ లేక. 137

వ. అనియె నప్పార్వతిశరీరకోశంబున సముద్భూత యగుట నయ్యంబిక కౌశికి యను పేరం బ్రఖ్యాత యయ్యె నప్పుడు గౌరియుం గృష్ణయై కాళికాభిధానంబున హిమాచలంబున నెలకొనియె నంత. 138

హిమవత్పర్వతంబునఁ జండముండులు దేవిం గాంచుట.

తే. ఘనులు శుంభనిశుంభులయనుచరులు ప్ర, చండబలశౌర్యధుర్యులు చండముండు
లతిమనోహరాకారసమగ్రదివ్య, తేజముల నొప్పుకౌశికీదేవిఁ గాంచి. 139

శుంభునియొద్ద జండముండులదుర్మంత్రము.

మ. చని శుంభుం గని మ్రొక్కి దేవ! హిమవచ్ఛైలంబునం దొక్కచం
ద్రనిభాస్యం గనుఁగొంటి మామకహితసౌందర్యంబు నాకాంతిసొం
పును నావిభ్రమభంగియుం గలుగునే పూఁబోఁడులం దెందు? నా
వనితారత్నము చూడ నీక తగు భాస్వల్లీలమై దేవిగాన్. 140

వ. త్రిలోకంబులం గలగజతురంగాదిసకలరత్నంబులకును నీగృహం బాకరంబు గాదె? పురందరువలన నైరావణోచ్చైశ్శ్రవఃపారిజాతంబులును బ్రహ్మవలన హంసయుక్తం

బగుదివ్యవిమానంబును గుబేరువలన మహాపద్మనిధియును నబ్ధివలన నమ్లానకమలమాలి
కయుఁ వరుణునివలనం గాంచనదండం బగుమహనీయచ్ఛత్త్రంబును బ్రజాపతివలన
రథోత్తమంబును మృత్యువువలన నుత్క్రాంతిద యనుశక్తియు నగ్నివలన నీలకౌశేయ
వసనంబులు నాదిగాఁ గలసమస్తవస్తురత్నంబులును బరాక్రమంబునం బురుషరత్నంబ
వైననీ వాక్రమించుటకు మెఱుంగు వెట్టిన ట్లుండు నీ స్త్రీరత్నంబు పరిగ్రహింపు మని
చెప్పినఁ జండముండాసురులవచనంబులు విని శుంభుండు సుగ్రీవుం డనుదూతం బిలిచి
నీ వద్దేవికడ కరిగి యది యెట్లు ప్రీతచిత్త యై చనుదెంచు నట్లు నాపలుకులుగాఁ
జెప్పి తోడ్కొని రమ్మని పంపిన మహాప్రసాదం బని వాఁడు హిమవంతంబునకుం
బోయి యక్కౌశికిం గని మధురవాక్యంబుల నిట్లనియె. 141

దేవి యెదుట సుగ్రీవుఁ డనుశుంభదూత చెప్పిన రాయబారము.

శా. దేవీ! శుంభునిదూత. నే నతఁడు పుత్తెంచె న్నినుం గోరి బా
హావీర్యోత్కటశౌర్యనిర్జితసమస్తాదిత్యదిక్పాలచూ
డావిన్యస్తనిజైకశాసనుఁడు గాఢశ్రీశుఁ డై యొప్పునా
దేవద్విట్పతివాక్యరీతి విను మర్థి న్జెప్పెద న్నీకుఁ గన్. 142

సీ. నాయధీనంబులు నాకాదిలోకము లతివ! మద్వశవర్తు లమరు లెల్ల
యాగభాగము లెన్ని యన్నియు నస్మదీయములు సమస్తరత్నములు నిధులు
మామకంబులు వార్ధిమథనోద్భవము లైనగజరత్నహయరత్నకల్పకములు
కప్ప మిచ్చి సురేంద్రుఁ డెప్పుడు సేవించుఁ దగ నన్ను దివిజగంధర్వపన్న

ఆ. గాదులందుఁ గలుగునఖిలరత్నములు నా, యందు నున్నయవి మహావిభూతిఁ
ద్రిభువనముల నీవు దేవి! యువతిరత్న, భూత! రమ్ము రత్నభుజుల మగుట. 143

ఉ. క్రమ్మఱ నేఁగుదెంచి యనురాగ మెలర్పఁగ నన్ను నొందెదే నా
తమ్ము నిశుంభు నొందెదేఁ బ్రమదం బెసఁగ న్వరియించి లీలసౌ
ఖ్యమ్ముల కెల్ల నీవ కుదురై యసమానవిభూతిఁ బ్రీతితో
నిమ్ముల సర్వలోకములు నేలుచు నుండుట యెంత యొప్పునో! 144

వ. ఇంతయు నీవు మనంబున నాలోచించి మత్పరిగ్రహంబు నొందుట మేలని శుంభుండు
నీకుం జెప్పు మనినవచనంబు లివి యనవుడు జగదేకధారిణియు భద్రయు దుర్గయు
ననం బరఁగునప్పరమేశ్వరి గంభీరాంతస్స్మితమధురవచన యగుచు దూత కిట్లనియె.

ఉ. నీవచనంబు దద్దయును నిక్కము బొంకెదునట్టివాఁడవే
నీవు? త్రిలోకభర్త మహనీయుఁడు శుంభుఁడు కేవలుండె? ద
ర్పావహుఁ డాని శుంభుఁడును నట్టిఁడ యల్పులె వార లైన ము
న్నే కను మోస పోయి మది నిట్లని యొక్కప్రతిజ్ఞఁ జేసితిన్. 146

క. ఎవ్వఁడు జయించు నన్నని, నెవ్వఁడు మద్దర్ప మడఁచు నేడ్తెఱమెయి నా
కెవ్వఁడు జగమునఁ బ్రతిబలుఁ, డవ్వీరుని కేను భార్య నగుదు న్బ్రీతిన్. 147

ఉ. కావున శుంభుఁ డొండె భుజగర్వ మెలర్ప నిశుంభుఁ డొండె నో
రీ! వెస వచ్చి నన్గెలిచి ప్రీతిమెయి న్వరియించుఁ గాక తా
నావుడు దూత యొల్లి యిటు నాయెదుర న్మదలీలఁ బల్కెదే
దేవి! జగంబునం గలఁడె ధీరత నెవ్వఁడు వారి మార్కొనన్? 148

వ. మఱియు వారలకుం గలదైత్యవీరులకు సమరంబున నెదుర దేవతలుం జాల రనిన నబలవైననీచాలమి చెప్ప నేల. 149

చ. సురపతిఁ దొట్టి దేవతలు శుంభనిశుంభముఖోగ్రదానవే
శ్వరులకుఁ బాఱి చుండుదురు సంగరభూముల నాఁడుదాన వీ
వరయఁగ నట్టిదోర్బలపరాక్రమభీకరు లైనవారి ను
ద్ధురగతి నెట్టు మార్కొనియెదో కడు వింతలు పుట్టె నీతలన్. 150

క. చనుదెమ్ము నాపలుకె విని, దనుజేంద్రులకడకు రాక తక్కిన నెట్లుం
జనుదెంచెదవు సుమీ పడి, దనుజులు తల వట్టి యీడ్వ దైన్యముతోడన్. 151

తే. అనిన నద్దేవి నీచెప్పినట్టు లాను, రారు లోనరింపఁ జాలెడువార దానఁ
గొఱఁత లే దేమి సేయుదు నెఱుఁగ కిట్టి, ప్రతిన పట్టితి నే విచారంబుఁ దక్క.

దేవి ధూమ్రలోచనుని వానిసైన్యమును సంహరించుట

వ. నీవు పోయి నాచెప్పినవిధం బంతయు మాయసురేంద్రున కెఱింగింపు మతం డెయ్యది కర్జం బది యొనర్చుం గాక యనిన దూత సముత్థితామర్షుం డగుచుం జని శుంభునకు సవిస్తరంబుగా నద్దేవివచనంబులు విన్నవించిన నానక్తంచరవరుండు కోపించి ధూమ్రలోచనుం బిలిచి నీవు దనుజసైన్యసహితంబు రయంబున నరిగి యాదుష్టవధూటిం దల వట్టి యీడ్చికొని రమ్ము దాని కడ్డము పడ నెవ్వరు వచ్చిన సమయింపు మనిన నమ్మహాసురుండు షష్టిసహస్రాసురవీరపరివృతుం డై యేఁగి తుహినాచలంబున నున్నయద్దేవిం గని యెలుంగెత్తి దేవీ! వేగ శుంభనిశుంభులపాలికి రమ్ము ప్రియంబున రాక తక్కినం గచాకర్షణం బాచరించి నిన్ను నవశ్యముం గొనిపోదు ననిన నద్దేవి యిట్లనియె.

క. బలియుఁడు పంపఁగ వచ్చిన, బలవంతుఁడ వీవు దనుజబలయుతుఁడవు నీ
బలిమిమెయిం గొని పోవుదు, ఖలుఁడవు నిన్నేమి సేయఁగలనే నబలన్. 154

చ. అనవుడు ధూమ్రలోచనమహాసురుఁ డంబికఁ బట్ట నగ్గలిం
చినఁ బటుహుంకృతిం దనుజుఁ జెచ్చెర నంబిక నీఱు సేసెఁ జే
సినఁ గని వానిసైన్యము విశృంఖలవిక్రమలీల దేవిపై
సునిశితబాణశక్తి శరశుప్రజవర్షము పర్వఁ జేసినన్. 155

సీ. చటులసటాటోపపటుశరకోపవిస్ఫురణంబు లెసఁగ నిష్ఠురరవంబు
చెలఁగంగ నద్దేవిసింహంబు దైత్యసైన్యముమీఁదఁ జండరయమున నుఱికి
కరతాడనంబులఁ జరణతాడనముల ముఖతాడనంబుల నఖవిదార
ణంబుల సమరాంగణంబున దానవాంగములు దుత్తునియలు తుమురు పొడియుం
తే. బ్రయ్యలై కూలుచుండ దుర్వారలీలఁ, గెరలి నెత్తురు గ్రోలుచుఁ గేలి సలిపి
వ్రేలుమిడి నబ్బలము లెల్ల నేలఁ గలపె, బహువిధోగ్రవధక్రియాపాటవమున. 156

వ. అంత. 157

క. అంతయుఁ జంభుఁడు విని నే, త్రాంతంబులఁ గెంపు మెఱయ నవుడు గఱచుచున్
స్వాంతము నితాంతరోషా, క్రాంతముగాఁ జండముండఘనదానవులన్. 158

ఆ. పిలిచి మీరు సకలబలసమన్వితులరై, యరిగి దుష్టయైనయవ్వధూటి
నలవు చలము మెఱయఁ దలపట్టి యీడ్చి తెం,డొండె నంటఁగట్టి తెండు పొండు.

క. మొనసి యని చేసె నేనియుం, సునిశితశస్త్రాస్త్రతతులసొంపునఁ దద్వా
హనముఁ బొలియించి చండికఁ, దునియలు గావింపుఁ డధికదోర్బలలీలన్. 160

కాళి చండముండుల ఖండించుట.

మ. అని దైత్యేంద్రుఁడు పంచిన న్గడఁకతో నాచండముండాసురు
ల్ఘనశస్త్రాస్త్రకరాళహస్తు లయి నాగస్యందనాశ్వాధిరూ
ఢనిశాటోగ్రబలంబుతోడ నవగాఢస్ఫూర్తిమై నేఁగి కాం
చనచంచన్మణిరమ్యశృంగవిలసచ్ఛైలేంద్రసానుస్థితిన్. 161

చ. చిఱునగ వెంతయు న్నెఱయ సింహముపైఁ జెలువొందుదేవి నే
ర్పెఱఁ గని చండముండముఖదేవవిరోధులు చుట్టుముట్టి యం
దఱును గడంగి పట్టికొనఁ దద్దయు డాసినఁ జూడ్కులన్నిడుం
గుఱు లెసఁగంగ వక్త్రమునఁ గోపముఁ జండిక దాల్చెఁ దాల్చినన్. 162

సీ. ఆకోపమునఁ జేసి యంబికవదనమప్పుడు నీలవర్ణవిస్ఫురణ నొందె
వికటభయంకరభ్రుకుటికమైన, ఫాలభాగంబునఁ గాళి యనఁగ
నొకదేవి ఖడ్గబాణోగ్రవిచిత్రఖట్వాంగధారిణియును జిహ్వాగ్రలిహ్యా
మానాధరోష్ఠయు నానిమ్నతామ్రకరాళనేత్రయును శార్దూలచర్మ
తే. వస్త్రయును శిరోమాలికావరవిభూషి, తయును శుష్కమాంసాంగియు దారుణాస్య
మండలయు నై జనించి యజాండభాండ, మనియ నార్చుచు దైత్యసైన్యంబుఁ జొచ్చె.

వ. కరాళవక్త్ర యగునమ్మహాకాళి రౌద్రప్రభావంబునం గసిమసంగి కవిసి కాలుబలంబుల
మావంతులతో జోదులతోఁ బార్శ్వఘంటలతోడ నేనుంగుల రావుతులతో గుఱ్ఱంబుల

నొక్కకేలన ద్రుమ్మరించి యొత్తి వదనగహ్వరంబున వైచికొని సితనిశితదశనంబులం
బెలుచ నమలి మ్రింగుచు నట్లు రథికరథ్యసారథిసహితంబు లగురథంబుల రదనాంకుర
చూర్ణితంబులు గావించి భక్షించుచుఁ గొన్ని కొందఱం దలలు పెఱికియుఁ గొందఱ
మెడలు నులిమియుఁ గొందఱం జరణంబులఁ జమరియుఁ గొందఱఁ బడఁ దాఁకియుఁ
బలువిఱుంగుల నుఱుముసేయుచుం బ్రతివీరులు ప్రయోగించువివిధాస్త్రశస్త్రవ్రాతం
బులు నోరఁ గఱచి త్రెక్కొనుచు మఱియుం ఖడ్గఖండనఖట్వాంగతాడనదంతఖాదనం
బులం జతురంగంబులం బొలియించుచు నత్యంతఘోరం బగువిహారంబు సలుపుచుండ
నేకక్షణంబునం దమసేన యంతయు నశించినం గోపించి చండుండు ప్రచండభీమ
కాండంబుల నాభీమాక్షిం గప్పె ముండాసురుండు ప్రదీప్తంబు లగుచక్రంబులు
నిగిడింప నద్దేవి యాననకుహరంబుఁ బ్రవేశించుచుం బ్రభామండలమండితబహు
మార్తాండమండలంబుల విడంబించె నప్పు డాభైరవి సింహనాదాట్టహాసంబులు చెలంగ
దంతదీప్తులు వెలుంగ సింగంబుమీఁదనుండి లంఘించి వెండ్రుక లొడిసిపట్టి తిగిచి
మండలాగ్రంబునం జండముండులశిరంబులు ఖండించి యార్చిన హతావశిష్టంబు
లగుతదీయసైన్యంబులు భయంబునం గలంగి తొలంగం బాఱె నాకాళి యద్దనుజమ
స్తకంబులు పుచ్చుకొని నవ్వుచు నంబికకడ కరిగి సమరమఖంబునకుఁ బశువు లైన
చండముండులు వీరె నాచేత నిహతు లైరి యింక శుంభనిశుంభులం దెగటార్చుట నీపని
యనిన నప్పరమేశ్వరి హర్షించి మృదుమధురవాక్యంబులం జండికతోడ దేవీ! నీవు
చండముండులం జంపితివి గానఁ జాముండాభిధానంబున జగంబులఁ బ్రఖ్యాత వగు
దనియె నంత. 164

తే. చండముండదానవులును సర్వసైన్య, ములును జండికచే నట్లు వొలియుటయును
శుంభుఁ డతికోపసంరంభజృంభితాంత, రంగుఁ డై యుద్ధదండనాయకులఁ జూచి.

శుంభనిశుంభులు యుద్ధసన్నద్ధులగుట.

వ. షడశీతిభేదదైత్యకులసంభవులును జతురశీతిభేదకంబుకులసంభవులును బంచాశత్కో
ట్యర్బుదాసురకులసంభవులును శతకోటిభేదధూమ్రకులసంభవులును గాలకులు దౌ
ర్హృదులుమౌర్యులుగాలకేయులును నైనరాక్షసులెల్ల నాయాజ్ఞ దప్పక యిప్పుడు.

సీ. సమరంబునకుఁ గడు సన్నద్ధు లై వేగ తమతమసర్వసైన్యములతోడఁ
జనుదెంచునది యని దనుజేశ్వరుఁడు చెప్పి నానాసహస్రసేనాసమేతుఁ
డై ఘోరరణకుతూహలమున వెడలె నుద్ధతలీల జగములు తల్లడిల్ల
నమ్మోహరము గాంచి యంబిక మెయిపెంచి, నిజశింజినీధ్వని నింగి నించె
తే. సింగ మత్యుగ్రనాదంబు సేసె దేవి, గంటమ్రోఁత యారవముల రెంటి మ్రింగెఁ
గాళియును వివృతాననోద్గతకరాళ, రావమున దిక్తటంబుల వ్రచ్చెఁ గెరలి. 167

క. ఘోరతర మగుతన్నాదం, బాకర్ణించి నలుదెసల నదరి కుపితులై
యాకాళిసింహంబును, నాకాళిం జెరలఁ జేసి రమ్ములవెల్లిన్. 168

సప్తమాతృక లావిర్భవించుట.

క. ఆసమయంబున దేవి మ, హాసురులం జంప సురల ననుపమవిజయో
ద్భాసితులఁ జేయ శివప, ద్మాసనగుహచక్రివాసవాదులశక్తుల్. 169

క. వారలతనువుల వెలువడి, వారలచిహ్నములు దాల్చి వారలబలతే
జోరూపంబులతో నా, భైరవికడ నిలిచె దనుజభంజనరీతిన్. 170

సీ. ఆఁబోతు నెక్కి శూలాయుధశశిఫణిభూష మహేశ్వరి పొలుపు మిగిలె
హంసవిమానస్థ యై యక్షసూత్రకమండలుపాణి బ్రహ్మాణి మెఱసెఁ
గేల శక్తి ధరించి లీల మయూరసమారూఢ కౌమారి యతిశయిల్లె
నైరావణంబుపై నైంద్రి చేఁ గులిశంబు దనర వేగన్నులు దాల్చి యొప్పె
తే. గరుడిమీఁద వైష్ణవి గదాఖడ్గశంఖ,చక్రములు కరంబుల నుండఁ జాల నమరె
నఖసటాస్ఫూర్తిఁ జెలువొందె నారసింహి, రౌద్రదంష్ట్రాస్ఫురుచులవారాహి వెలిఁగె.

క. హరుఁ డయ్యేడ్వురచేతం, బరివృతుఁడై యుద్ధ దసురబలముల నెల్లం
బొరిగొను మని చండికకుం, గర మనురాగమునఁ జెప్పెఁ గ్రక్కున నంతన్. 172

చండికాదేవి సమరసన్నద్ధయై రాక్షససైన్యమును జెండాడుట

సీ. నిష్ఠురబహుశివానినదంబు చెలఁగంగ నాచండితనువునం దధికభీష
ణాకార యొకశక్తి యావిర్భవించి యాశంభుతో శుంభనిశుంభఘోర
దైతేయులొద్దకు దూతవై చని యిట్టు లనుము నీ వసురలు వినుచు నుండ
భువనత్రయంబును బురుహూతునకు నిచ్చి యమరులహవ్యభాగములు విడిచి
ఆ. బ్రతుక వలతు రేని పాతాళమునకుఁ బొం, డొల్ల కని యొనర్తు రుక్కు గలిగె
నేని యనిమి నడుపుఁ డిపుడు మీమాంసము, ల్దిని మదీయశివలు తృప్తిఁ బొందు.

వ. అని పంచిన శివుండు దూతయై చనియె నది నిమిత్తంబుగా నద్దేవి శివదూతి యను నామంబునం బ్రఖ్యాతి యయ్యె నయ్యసురేశ్వరుం డప్పరమేశ్వరుండు చెప్పినవచనంబులు విని సరకు గొనక కోపాటోపంబున నురవణించి యాకాత్యాయనిమీఁద నిశితశరశక్తివృష్టి గురిసిన నద్దేవి కోపించి గొనయంబు సారించి ప్రచండకోదండప్రవిముక్తకాండంబుల నవ్వర్షం బవలీల నడంగించె నప్పు డద్దేవిముందట నిలిచి కాళికాదేవి త్రిశూలదళనంబులను ఖట్వాంగప్రహారంబులను బ్రతిబలంబులు బడలుపడం బఱపె బ్రహ్మాణి కమండలుజలక్షేపణంబున నసురుల నిహతతేజోవీర్యులం గావించె మాహేశ్వరి త్రిశూలంబును వైష్ణవి చక్రంబును గౌమారి శక్తియు నైంద్రివజ్రం

బునునడరించి యవక్రవిక్రమక్రియాపాటవంబులు చూపిన నమ్మహాసురులు కీలాల
వర్షధార లెసంగ మహీతలంబున శతసహస్రసంఖ్యులు గూలిరి మఱియును. 174

క. దారుణశితదంష్ట్రాంకుర, దారణముల ఘోరచక్రదళనమ్ముల వి
స్ఫారితతుండనిహతుల, వారాహి సురారివీరవర్గముఁ దునిమెన్. 175

క. ఘోరనినదంబు దళవ, స్ఫూరిత మై చెలఁగ సమరభూమి నసురలం
గ్రూరనఖంబుల బలువిడిఁ, జీరుచు నమలుచును నారసింహి చరించెన్. 176

ఉ. చండతరాట్టహాసము దిశాతటము ల్వగులింప నార్చి యుం
ద్దండరయంబున న్గవిసి దానవుల న్శివదూతి గూల్చుచు
న్గండలు మ్రింగుచు న్నెరలి కయ్యము సేయఁ దొడంగె నిట్టు లొం
డొండ చెలంగి మాతృగణ ముగ్రత దైత్యులఁ బిల్కుమార్పఁగన్. 177

ఉ. మాతృగణంబుతో ల్లలకు మార్కొన నోడి సురారిసైనిక
వ్రాతము పాఱిన న్గని పరాక్రమదుర్దముఁ డుగ్రవీర్యవి
ఖ్యాతుఁడు రక్తబీజుఁడు సగర్వముగా గద చే నమర్చి రౌ
ద్రాతిశయం బెలర్ప వెస నైంద్రిఁ గడు న్వడిఁ దాఁకెఁ దాఁకినన్. 178

సీ. జృంభించి మాహేంద్రి దంభోళి నాదైత్య వీరునిఁ గడు బెటు వ్రేయుటయును
క్షతమునఁ దొరఁగినవితతశోణితబిందుతతు లెన్ని యన్నింటఁ దత్క్షణంబ
యాకారభూరిశౌర్యంబుల రక్తబీజునియట్టిదనుజులు ఘనులు పుట్టి
మాతృగణంబుతో మహితహేతివ్రాత సంపాతభీషణసమరకేళి

తే. సేయ మఱియును దనుజునిశిరము వజ్రహతముగా నైంద్రి యేయుచు నగ్గలముగ
నెత్తు రొలికిన రక్కసిమొత్తములు సహస్రసంఖ్యము లం దుదయంబు లయ్యె. 179

వ. అయినం గని కోపించి యొక్కట నుపవసించి. 180

సీ. ఆరక్తబీజుఁ జక్రాహతి నొంచె వైష్ణవి యపు డైంద్రి వజ్రమున వేసె
బ్రహ్మాణి నొప్పించె బ్రహ్మదండమున నలి గాఁగ గద మోఁదె నారసింహి
మనశక్తి భిన్నాంగుఁ గావించెఁ గౌమారి లీల మాహేశ్వరి శూలదళిత
వక్షుని గాఁ జేసె వారాహి ఖడ్గతాడితుఁ గా నొనర్చె నద్దితిజుఁ డించు

తే. కయుఁ జలింపక పటుగదాఘాతమున రయమున నొప్పించి యందఱ నార్చి పేర్చె
మాతృగణము సక్రోధ మై మఱియుం వాని, పైఁ ద్రిశూలశక్త్యాదులు పఱపుటయును.

ఉ. రక్కసుభూరిదేహమున రక్తకణౌఘము గ్రమ్మి చూడఁగా
నక్కజ మై ధరం దొరఁగె నందు జనించి యనేకదైత్యు లే
చిక్కునఁ దార నై జగము దీటుకొనం గడు నిండఁ బర్విన
స్వక్కస మంది యెంతయును విహ్వలు లైరి నిలింపు లందఱున్. 182

వ. అట్లు విష్ణ్వాదులగు నమరుల నాలోకించి యాచండిక మహాకాళితో దేవీ! నీవు వద
నంబు విస్తీర్ణంబు గావించి మదీయశస్త్రపాతసంభూతం బగు రక్తబీజదైతేయవ్రా
తంబునల్ల రయంబున భక్షింపు మీరాక్షసుం డంతం బరిక్షీణశోణితుం డై సంక్ష
యంబునొందు నని చెప్పి యప్పరమేశ్వరి త్రిశూలంబున నక్కుమ్భీలదానవుం బొ
డిచినం దదంగంబునం గీలాలపూరంబు దొరంగినం గోపించి వాఁడునుం గదాదండం
బునం గదిసి వేసినఁ జండికకు వేదనఁ జేయం జాల దయ్యె నప్పుడు. 183

లయగ్రాహి. శూలతనుకాళియు విశాలలయకాలఘన నీలరుచిజాలములు నాలిగొన నేత్ర
జ్వాలలను శూలకరవాలఘృణిమాలికలు నోరఁ దన మ్రోల శిఖిపోలిక వెలుంగన్
దూలి పదతాలహతిఁ జాల దివి గూలఁ గడు వ్రాలి మదలీల నవలీల వికళత్కీ
లాల మొగిఁ గ్రోలుచుఁ గరాలగతిఁ గ్రాలుచును గాళి దనుజాళి వెసనాలమున మ్రింగెన్.

ఉ. కాళి కరాళ మైనముఖగహ్వరము న్నను విచ్చి యిట్టు లా
భీలత రక్తబీజు మెయిఁ బిల్లగఁ గ్రమ్మినరక్త మంతయు
న్గ్రోలఁగ దేవి వెండియును గ్రూరతరాయుధరాజిఁ గ్రమ్మ న
స్రాలె నరక్తదేహుఁ డయి కుంభిని నద్దనుజుండు భూవరా! 185

ఆ. రక్తబీజుఁ డిట్లు రణమునఁ గూలిన, నతులహర్షభరితు లైరి సురలు
నర్తనంబుఁ జేసె నలి మాతృగణ మసృ, క్పానజనితమదవికారలీల. 186

వ. అని చెప్పిన విని సురథుండు మునీశ్వరున కిట్లనియె. 187

శాంభవి నిశుంభుని వధించుట.

తే. నీవు చెప్పినయమ్మహాదేవిచరిత, మును మహత్త్వము విస్మయ మొనరఁ జేసె
నట్లు రక్తబీజుఁడు హతుఁ డైన శుంభుఁ, డును నిశుంభుఁడు నె ట్లైరి మునివరేణ్య.

చ. అనిన మునీంద్రుఁ డిట్టు లను నట్లు రణావని రక్తబీజుఁడు
న్ఘనచతురంగసైన్యమును గ్రాఁగిన శుంభనిశుంభు లుగ్రశో
కను లయి రా నిశుంభుఁ డతిఘోరవసైన్యసమేతుఁ డై రయం
బునఁ గవిసె న్పరాక్రమము పొంపిరి వోవఁగ దేవిపై వడిన్. 189

తే. అతనిముందటఁ బార్శ్వంబునందుఁ బిఱుఁద
నొక్కయమ్మడిఁ బెక్కండ్రు రుక్కు మిగిలి
యురువడించిరి దేవిపై నుగ్రదనుజు
లాదవుఁ బేరల్కఁ జెదవు లొండొండ యదర. 190

వ. అప్పుడు. 191

మహాస్రగ్ధర. వాలియింతు ద్దేవి నందు న్భుజబలపటువిస్ఫూర్తిమై దాఁకె శుంభుం
డలుకం దన్భ్రాతృవర్గం బదరఁ గవిసె నిట్లన్నయం దమ్ముఁడు న్ని

శ్చలమేఘవృందలీల న్శరసముదయవర్షంబున న్గప్పిన న్దే
వి లసత్కోదండముక్తావిరతశరము లావృష్టి గ్రుంగంగఁ జేసెన్. 192

ఉ. చేసి నిశాతబాణములఁ జెచ్చెర వారల నొవ్వఁ జేసిన
న్గాసిలి యానిశుంభుఁ డతిగర్వమున న్గరవాలచర్మరు
గ్భాసితపాణి యై కదిసి భైరవసింహముమస్తకంబు దా
త్రేసిన దేవియుం దునియ వేసె నని న్వెస ఖడ్గచర్మముల్. 193

క. వాలుం బలుకయుఁ దునుమై, రాలినఁ బలుశక్తి వైచె రాక్షసవరుఁ డా
ఖీలముగ దానిఁ బటుదో, ర్లీలం జక్రమున దేవి రెండుగ నఱకెన్. 194

ఉ. శూలముఁ ద్రిప్పి యార్చుచు నిశుంభుఁడు వైచిన దానిఁ జూర్ణమై
తూలఁగఁ జేసె దేవి నిజదోర్గపటుముష్టిహతి న్నిశాటుఁ డా
ఖీలముగాఁ జెలంగి గద బెట్టడరించినఁ జండికాభుజా
శూలముచేత నగ్గదయు సొంపఱె నీఱయి పోయె భూవరా! 195

మాలిని. అలుకఁ బరశుహస్తుం డై కడు న్వేఁక ధాత్రీ
తల మద్రువఁగ నుద్యద్రౌద్రత న్వచ్చుదైత్యు
న్బలువడిఁ బడ నేసె న్భైరవాటోపలీల
న్జెలఁగి నిశితబాణశ్రేణి నద్దేవి యంతన్. 196

సీ. దర్పదుర్దముఁ డైనతమ్ముఁ డిమ్మెయి రణస్థలమున సోలినఁ దద్ద యలిగి
శుంభుండు చండికసొం బడఁగింపఁగఁ జూచి రథం బెక్కి సునిశితోజ్జ్వ
లాయుధస్ఫురితబాహాష్టకం బాకాశ మంతయుఁ గప్పి భయంకరముగఁ
జనుదేరఁ గని దేవి సకలారిసైన్యతేజఃప్రాణములు మ్రింగఁ జాలునట్టి
తే. శంఖరవమున శింజినీస్వనమునను బ్ర,చండఘంటాస్వనంబున సకలదిశలు
చెవుడు పడఁ జేసె వాహనసింహ మడరి, చెలఁగె గజములు మదమఱి చేష్ట లుడుగ.

వ. అప్పుడు. 198

క. కాళి యెగసి యిరుగేలను, నేలయు నింగియును వ్రేయ నిష్ఠురరవ మా
ఖీలముగఁ జెలఁగె ముందరి, కోలాహలరవము లెల్లఁ గుంఠితములుగన్. 199

తే. చేసె శివదూతి తీవ్రాట్టహాస మప్పు, డారవంబును విని శుంభుఁ డధికరోష
దీప్తుఁ డగుటయు నంబికాదేవి వాని, నట దురాత్మక నిలు నిలు మని యదల్చె.

వ. అప్పు డంబరంబుననుండి యమరు లద్దేవిం గెలు గెలు మని దీవించి రా నక్తంచరవరుం డనలజ్వాలాకరాళ యగుశక్తి నిగిడించిన నంబిక మహోల్కాభాతిం బొడి సేసిన సంరంభజృంభితుం డై శుంభుండు త్రిభువనకుహరంబు నిండి నిజసింహనాదంబున ఘూర్ణిల్ల విలయసమయనిర్ఘాతఘోరంబుగా నార్చె నంత. 201

తే. శతసహస్రసంఖ్య లమితశరము లుగ్రలీలఁ దనుమాడుచును రణకేళి సలిపి
రసురనాథుఁడు దేవియు నంత దేవి, శుంభునుర ముచ్చిపో వైచె శూలమెత్తి. 202

తే. వైచుటయు రక్కసుఁడు నేలవ్రాలి సొగసె, మున్ను దివ్యాస్త్రహతిమూర్ఛ మునిఁగినట్టి
యానిశుంభుఁడు దెప్పిఱి యంత నొంచె, సింహమును దేవిఁ గాళిని శితశరముల.

శా. శుంభుం డంతట మూర్ఛదేఱి బదివే ల్బుంభద్భుజంబు ల్రణా
రంభస్ఫూర్తి యెలర్పఁ దాల్చి బహుచక్రశ్రేణి నద్దేవి సం
రంభం బేదఁగఁ గప్పినం బటుశరవ్రాతంబునం జక్రము
ల్సంభిన్నంబులు చేసి తద్విశిఖము ల్ఖండించెఁ గాండంబులన్. 204

ఉ. అంత నిశుంభుఁ డెంతయు రయంబునఁ జండికఁ జంపుకోప మ
త్యంతము గాఁగ వ్రేసె గద నాగద దేవి కృపాణిఁ ద్రుంచె వాఁ
డంతటఁ బోక చే నతిభయంకరశూలము దాల్చివచ్చు దు
ర్దాంతతఁ జూచి శూలమున వ్రచ్చె సురేశ్వరి వానివక్షమున్. 205

వ. అట్లు భిన్నవక్షుం డై పడిన నిశుంభునిహృదయంబుననుండి మహాబలపరాక్రమధురంధరుం డొక్కపురుషుండు నిలు నిలు మని యదల్చుచు వెలువడినం జూచి యొత్తిలి నవ్వుచు నంబిక వానిశిరంబు గరవాలంబున నఱికిన నతండు పుడమిం బడియె నప్పుడు సింహఘోరనఖరదంష్ట్రాంకురవిదారణవిహరణంబులను కాళికకరాళకరవాలవిదళనఖేలనంబులను శివదూతినిశాతహేతిపాతవినోదంబులను గౌమారిశితభయంకరశక్తిప్రహారవిహారంబులను మాహేశ్వరిమహితత్రిశూలాభీలహననలీలలను వారాహిప్రచండతుండఖండనహేళనంబులను వైష్ణవినిర్వక్రచక్రవిక్రమక్రీడలను మాహేంద్రిమహనీయకులిశధారాసికర్తనమర్దనంబులను బ్రహ్మాణిమంత్రపూతకమండలుజలక్షేపణాటోపంబులను సంగరాంగణంబునం గపాలంబులు పగిలియు ఫాలంబులు నొగిలియుఁ గరంబులు త్రెస్సియు నురంబులు ప్రస్సియు మెడలు దునిసియుఁ దొడలు మురిసియుఁ గండలు రాలియుఁ గుండెలు గూలియు రూపు లడంగియు నేపులు మడంగియు నేకక్షణంబున నాక్షణదాచరప్రకరంబు సంక్షయంబు నొందె నట్టియెడ శుంభుండు ప్రాణసదృశుం డగుతమ్ముండు నిశుంభుండును సకలసైన్యంబులు సమసినం జూచి కోపించి యంబికకు నిట్లనియె. 206

క. ఒరులభుజబలముఁ బ్రాపున, దుర మొనరించెదవు గాక దోర్బలలీలా
స్ఫురణము నీ కెక్కడి దు, ర్ధర మగుగర్వంబు విడువు తోయజవదనా! 207

శాంభవి శుంభుం జంపుట.

తే. అనిన దేవి జగత్త్రితయంబునందు, నే నొకర్తన కాని నా కితర మైన
మూర్తియొం దెపుడు లేదు మూర్ఖ! చూడు, మద్విభూతులు నాయందు మగుడఁజొచ్చె.

వ. అనిపలికిన బ్రహ్మాణీప్రముఖదేవీసముదయం బంబికదేహంబునందు లయంబు నొందినం జండిక యొక్కరితయ నిలిచి యే మదీయవిభూతిం జేసి పెక్కురూపంబులు ధరియించితి నిప్పు డన్నియు నుపసంహరించి నేనొక్కర్తనై యున్నదాన దానవాధమా! నీవింక నెందుఁ బోయెదు సుస్థిరుండ వగు మనియె నంత నయ్యిరువురకును దేవదానవులు చూచుచుండం ద్రిభువనదారుణం బైనరణం బయ్యె నవ్విధం బాకర్ణింపుము.

సీ. అంబిక వెస నేయు నమితదివ్యాస్త్రంబు లణఁచె శుంభుండు ప్రత్యస్త్రనిహతి
నతఁ డడరించు నానాస్త్రశస్త్రములు హుంకారరవంబునఁ గ్రాఁచె దేవి
కెరలి యద్దనుజుండు శరశతోత్కరముల నప్పరమేశ్వరిఁ గప్పెఁ గడిసి
కోపించి చండిక ఘోరంబు లైనబాణంబుల వానివి ల్లఱికి వైచె
తే. ధనువుఁ దునిమిన నసుర యుదగ్రశక్తిఁ, బుచ్చుకొనుటయుఁ బటుచక్రమున రయమున
దానిఁ దునుమాడె భైరవి దానవుండు, గనలి యనిమిషేశ్వరిఁ బోరిగొనఁ గడంగి.

మ. శతచంద్రోజ్జ్వలఖడ్గపాణి యయి రక్షస్సేనతోఁ జుట్టిన
న్దితిజుం గన్గొని యగ్గి యంబిక వెస న్తీవ్రాశుగశ్రేణి నం
చితఖడ్గంబును జర్మముం దునిమి వజ్రాతముం గూల్చి యు
ద్ధతి సూతుం దెగటార్చి తేరు తుమురై ధాత్రిం బడ న్వేసినన్. 211

ఉ. దారుణముద్గరంబు గొని దైత్యుఁడు డాసిన దాని దేవి వి
స్ఫారశరంబుల న్నఱికె బల్విడి శుంభుఁడు దీప్రముష్టి నా
భైరవివక్షముం బొడువ బాహుతలంబున వ్రేసె వానివి
స్తారభుజాంతరంబు వడిఁ జండిక వేటున వాఁ డచేష్టుఁ డై. 212

మ. పడి యాలోనన లేచి శుంభుఁడు బృహద్బాహాబలం బేర్పడం
గడు వేగంబున దేవిఁ బట్టుకొనుపీఁక న్మీఁదికి న్దాఁటిన
న్వడి దోశ్శక్తు లెలర్పఁ బోరి రసమానస్ఫూర్తు లంతంత నే
వడర న్జండికయు న్సురాహితుఁడు లోకాశ్చర్యసంపాదు లై. 213

ఆ. దనుజరాజుతోడఁ దడవుగా నభమున, లీల మల్లయుద్ధకేలి సలిపి
దేవి వానిఁ బట్టి త్రిప్పి రయంబున, నెత్తి వైచె వీఁక నిల చలింప. 214

క. తెప్పుం దయ్యును దనుజుఁడు, లుప్తభుజాబల మెలర్ప లోన న్ముష్టి
ప్రాప్తిం జండికఁ బోరిగొన, సప్తార్చిప్రతిమకోపసంరంభుం డై. 215

వ. సింహనాదంబు సేయుచుం గవిసిన నమ్మహాభైరవి రూక్షేక్షణంబుల వాని నిరీక్షించి.

క. శూలమున నురము వ్రచ్చినఁ, గూలె గతాసుఁ డయి దైత్యకుంజరుఁ డంత
న్శైలారణ్యాబ్ధిద్వీ,పాలంకృత యైన నేల యల్లల్లాడెన్. 217

వ. ఇవ్విధంబున త్రిభువనకంటకుం డగుశుంభుండు చండిక చేతనిహతుం డైన సకలజగం
బులు స్వస్థత్వంబు నొందె నదులు మార్గవాహిత్వంబు భజించె నంబరం బమలత్వంబు
నంగీకరించె వాయువులు సుగంధబంధురంబు లై సుడిసె దేవతలుమునులునంబరమానం
దంబునం దేలిరి దివ్యదుందుభులు మొరసె గంధర్వగీతంబులు నప్సరోంగనానర్తనం
బులు వర్తిల్లెం బ్రభాకరుండు ప్రచురప్రభం బ్రజ్వరిల్లె వహ్నులు శాంతత్వంబున
వెలింగె దిగ్గజంబులు మనోహరస్వరంబులు నిగిడించె నంత. 218

దేవతలు నారాయణిని స్తుతించుట.

క. పరమేశ్వరి శుంభుని నిటు, పొరిగొనిన వికాసివక్త్రపులకితతను సుం
దరు లగుచు నింద్రశిఖిముఖ, సుర లందఱు దేవిఁ బొగడఁ జొచ్చిరి భక్తిన్. 219

క. శరణార్థులహృదయార్తులు, హరింతు జగములకుఁ దల్లి వై యుండుదు నీ
వరయఁ జరాచరముల కీశ్వరి వఖిలము గావుమీ ప్రసన్నదయ శివా! 220

క. ధరణీరూపంబున నీ, వరయఁగ నాధారభూత వై త్రిజగముల
ధరియింతు జలాకారత, స్థిరముగ నింతయును దనుపు సేయుదు తల్లీ!. 221

తే. దేవి! వైష్ణవశక్తివి నీ వనంత, వీర్యమహనీయమూర్తి వీవిశ్వమునకు
బీజ మైనమహామాయ వీజగములు, మోహజలధి నీమహిమను మునుఁగుచుండు.

వ. దేవీ! సమస్తవిద్యలును సకలవనితలును నిఖిలజగంబులును నీభేదంబులు నీచేతన చేసి
సర్వంబును సంవ్యాప్తం బై యున్న యది నీవు సర్వభూతాత్మికవు సర్వజనహృదయంబు
లందును బుద్ధిరూపంబున నున్నదానవు భుక్తిముక్తిప్రదాయినివి నిన్ను సంస్తుతింపం
దగుపరమోక్తు లెక్కడివి? నీమహిమ యెవ్వ రెఱుంగుదు? రని మఱియును. 223

దండకము. శ్రీవిష్ణుశక్తీ! జగన్మూలశక్తీ! త్రిశక్తీ! మహాశక్తీ! నారాయణీ! దేవి! మా మ్రొ
క్కు గైకొమ్ము కాష్ఠాదికాలస్వరూపంబులం జేసి పాకంబు గావించి లోకంబుల
న్మ్రింగునారాయణీ! దేవి! మా మ్రొక్కు గైకొమ్ము సర్గస్థితిధ్వంసనంబు ల్సొనర్ప
న్నిమిత్తంబ త్రైగుణ్యమూర్తీ! జగద్గీతసత్కీర్తి! నారాయణీ! దేవి! మా మ్రొక్కు గై
కొమ్ము రమ్యాక్షసూత్రాదిచిహ్నంబులం దాల్చి హంసంబు పై నీవు బ్రహ్మాణి వై యొప్పు
నారాయణీ! దేవి! మా మ్రొక్కు గైకొమ్ము వాలుం ద్రిశూలంబుఁ గేలన్ వెలుంగంగ బా
లేందుగోచుల్జటాలంకృతిం జేసి మాహేశ్వరీమూర్తిఁ బెంపారి యాబోతుమీఁద
న్వెలుంగొందునారాయణీ! దేవి! మా మ్రొక్కు గైకొమ్ము హస్తంబుల న్చక్రశంఖాదిలోక
ప్రశస్తాయుధమ్ము ల్తెఱుంగారఁగా వైష్ణవీరూపలీల న్విహారంబు గైకొన్ననారా
యణీ! దేవి! మా మ్రొక్కు గైకొమ్ము రాజన్మయూరంబుఁ దేజంబుతో నెక్కి చేశక్తి
శోభిల్లఁ గౌమారి వై యొప్పునారాయణీ! దేవి! మా మ్రొక్కు గైకొమ్ము వారాహి వై

యేకదంష్ట్రంబున న్నీవు ధాత్రీతలం బెత్తి శ్రీనారసింహాకృతిన్ దైత్యులం ద్రుంచి
లోకైకరక్షావిధి న్ధన్యవై నట్టినారాయణీ! దేవి! మామ్రొక్కు గైకొమ్ము చూడాకిరీ
టంబు దోర్వజ్రము న్ప్రజ్వరిల్లంగ వేగన్నులుం గ్రాల వృత్రాదివీరారులం ద్రుంచి
మాహేంద్రివై యున్ననారాయణీ! దేవి! మామ్రొక్కు గైకొమ్ము శ్రీకంఠదూతీ! శివా!
ఘోరనాదంబు మ్రోయంగ దైతేయులం జంపి యుగ్రాజిఁ దెల్వారు నారాయణీ! దేవి!
మామ్రొక్కు గైకొమ్ము దంష్ట్రాకరాళాననంబు న్శిరోమాలికాదిక్షితాలంబును న్దేజ
రిల్లంగ సంగ్రామరంగంబునం జండముండాదులం గిట్టి చెండాడి చాముండవై
మేదిని న్బెంపున న్మించునారాయణీ! దేవి! మామ్రొక్కు గైకొమ్ము లక్ష్మీస్వధాపుష్టిలజ్జా
మహారాత్రివిద్యాదిరూపంబుల న్బూజ్యవై యుందు మేధావిభూతీ! శివా! వాణి! శర్వా
ణి! నారాయణీ! దేవి! మామ్రొక్కు గైకొమ్ము సర్వంబునం బాణిపాదాస్యము ల్గల్గి
సర్వంబున న్శీర్షనేత్రాంగము ల్గల్గి సర్వంబున న్నాసికాకర్ణము ల్గల్గి సర్వంబు
నీవైన సర్వేశ్వరీ! సర్వశక్త్యాత్మికా! సర్వరూపా! మహాదుర్గ! మామ్రొక్కు గైకొమ్ము
మమ్మర్థి రక్షింపు ముక్కన్నులం జాలఁ జెన్నొందు నీమోము కాత్యాయనీ! మమ్ము
నేభీతియుం బొందకుండంగ రక్షించు రక్షోగణాఖీల మై నీదుశూలంబు శ్రీభద్ర
కాళీ! మముం దాన రక్షించు నాదంబున న్దిక్కు లల్లార్చు నీఘంట దోషంబులం
దోలి మమ్మెప్డు రక్షించు నక్తంచరశ్రేణిరక్తంబునం దోఁగి కెంజాయ రంజిల్లునీ
వాలు మమ్మేలుచు న్మేలు గావించు రోగంబులం బాచి రాగంబుతో నీవు మాకుం
బ్రసాదింపు సంతుష్టవై యిష్టకామంబు లేప్రొద్దు దేవీ! నిను న్భక్తి సేవించుసద్భక్త
సంఘంబు లెన్నండు నేదుఃఖము ల్బొంద కేబాధలం జెంద కానందలీల న్సుఖంబుం
దఁ గాంచు న్నమస్తైకభద్రా! నమస్తైకపుణ్యా! నమస్తే నమస్తే నమః.

ఉ. ధర్మవిరోధులైన బహుదైత్యులఁ జంప ననేకరూపము
ల్నేర్మిమెయి న్ధరించి యిటు భీమరణం బొనరించి గెల్చితీ
నిర్మలమూర్తివై నెగడ నేర్చిరి యెవ్వతె నీవుదక్క దుః
ఖోర్మికరాళసంసృతిపయోనిధిబాడబమూర్తి! యంబికా! 225

సీ. సకలవిద్యాశాస్త్రసరసకావ్యంబుల యం దెల్ల నీవు చెల్వొంది యుందు
దమితమమత్వగర్తమహాతమంబునఁ ద్రిప్పు దీవిశ్వంబు దేవి! నీవ
యెచట రాక్షసగణం బెచట సర్పోత్కరం బెచట శాత్రవచయం బెచట నబ్ధి
యెచట దావానలం బెచటఁ దస్కరకోటి యతిభీతిఁ బుట్టించు నచట నుండి
తే. విశ్వమును నీవ రక్షింతు విశ్వమునకు, నీశ్వరివి నీవ విశ్వంబు నీవ తాల్తు
నీవు విశ్వేశవంద్యవు నీకు భక్తిఁ, బ్రణతు లగువారు విశ్వేశపదవిఁ గంద్రు. 226

ఉ. భీతుల మైనమమ్ముఁ గృపపెంపున నిప్పుడు గాచినట్లు సం
ప్రీతిఁ బ్రసన్నవై యసురబృందముఁ త్రుంచుచుఁ గావు మమ్ము నీ
భూతి వెలుంగ నెప్పుడును బూని జగంబులఁ గల్గు మేఘజో
త్పాతమహోపసర్గదురితంబు లడంపుము తల్లి! శాంభవీ! 227

తే. విశ్వవిశ్వార్తిహారిణి! విశ్వవంద్య! సుప్రసన్నవై యనుకంప సొంపు మీఱ
నెప్పుడును భక్తసంస్తుత్యవీ త్రిలోక,వాసు లగువారి కెల్లను వరద వగుము. 228

చ. అనవుడు దేవి! నేవరద నైతి నభీష్టవరంబు లిచ్చెద
న్గొనుఁడు నిలింపులార! మదిఁ గోరుఁడు నావుడు వారు సర్వలో
కనిఖిలకాలబాధ లాగిఁ త్రుంచుట యస్మదరాతివర్గనా
శన మనిశంబుఁ జేయుటయుఁ శాంభవి! మా కవి చాలు నిష్టముల్. 229

దేవతలకు దేవి తనభవిష్య దవతారములఁ జెప్పుట.

వ. అని దేవతలు వేఁడిన నమ్మహాదేవి యిట్లనియె నీవైవస్వతమన్వంతరంబునం దిరువది యెనిమిదియవమహాయుగంబున శుంభనిశుంభులు గ్రమ్మఱ నుద్భవింతురు నేను నందగోపకులంబున యశోదాగర్భంబున నావిర్భవించి యారాక్షసులను సమయించి వింధ్యాచలంబున వసియింతు నది నిమిత్తంబుగా వింధ్యవాసిని యనం బరఁగుదు మఱియు రౌద్రం బగురూపంబున నవనీతలంబున నవతరించి వైప్రచిత్తాదిదైత్యులం బెక్కండ్ర భక్షింతునప్పుడు మదీయదంతంబులు దాడిమీకుసుమంబులుంబోలె రక్తంబులగు నది నిమిత్తంగా మర్త్యామర్త్యలోకవాసులు నన్ను రక్తదంతియని కీర్తింపుదురు శతవర్షావగ్రహంబునం జేసి జగంబులు నిర్జలంబులై యున్న మహామునులు భయంబంది నన్నభినందించిన నయోనిజనై భూమియందుం బ్రభవించి శతనేత్రంబుల నమ్మునుల నాలోకించి వారిచే శతాక్షీనామప్రశంసావిశేషంబు నొంది యశేషలోకంబు నస్మచ్ఛరీరసంభూత శాకాహారంబుల భరియించి శాకంభరి యనుపేరం బరగుదు దుర్గముం డనుదుష్టాసురుం జంపి దుర్గాభిధానంబు గైకొందు భీమవేషంబున హిమవంతంబున నెలకొని సంయమిత్రాణార్థంబు పూర్వగీర్వాణవ్రాతంబు నడంచి భీమాఖ్యాయంబు నంగీకరింతు సకలలోకాపకారి యగువరుణుం డనువాని భ్రమరాకారంబునం బరిమార్చి భ్రామరీసమాఖ్యం బ్రఖ్యాతి వహింతు నివ్విధంబున నేను మఱియును దనుజబాధ లెప్పుడు వర్తిల్లు నప్పుడెల్లను జన్మించి యద్దనుజుల భక్షించి భువనంబులు రక్షింపఁ గలదాననని చెప్పి యప్పరమేశ్వరి సురేశ్వరులం గరుణావలోకనంబుల నాలోకించి. 230

క. నను నీ స్తవమున నెవ్వం, డనుదినమును భక్తితో సమాహితమతియై
వినుతించు నతని యాపద, లనయంబును నే నసంశయంబుగఁ త్రుంతున్. 231

సప్తశతీపఠనఫలశ్రుతి.

సీ. మధుకైటభాసురమథనప్రకారంబు మహిషభంజనకథావిహారణంబు
శుంభనిశుంభవిశుంభనక్రీడయుఁ నాదుమాహాత్మ్యంబు నాదరంబు
తోఁ జెవ్వ రొగి నష్టమీనవమీచతుర్దశులఁ గీర్తింతురు దవిలి భక్తి
వారి నఘంబులు చేర వాపదలు పొందవు దరిద్రత్వంబు దనుక దరిభ
తే. యమును దస్కరభయమును నగ్నిభయము,శస్త్రభయరాజభయములు జలభయంబు
భూతభయమును బాయు నెప్పుడు నచేక, భూరిసంపద లుడుగక పొందు చుండు.

క. విన వలయుఁ జదువ వలయు, న్గొనియాడఁ గ వలయు భక్తికొనలు నిగుడఁ గా
ననిశము మన్మాహాత్మ్యం, బనుపమశుభలాభములకు నది తెరు వగుటన్. 233

క. వినుము మహామారీసం, జనితం బగుదారుణోపసర్గవికారం
బును ద్రివిధోత్పాతభయం, బును మన్మాహాత్మ్యపఠనమున శమియించున్. 234

సీ. ఎచట నామాహాత్మ్య మెప్పుడు పఠియింతు రచటు నానిలయ మే నచటు విడువ
నగ్నికార్యమహోత్సవారంభబలిదాన సమయంబులందు మచ్చరిత మర్థిఁ
జదువుట వినుట ప్రశస్త మెఱింగి యైన నెఱుఁగక యైనను నెవ్వ రేని
బలిపూజనహోమములు మదర్థములు గాఁ జేయరే యని ప్రతీక్షింతుఁ బ్రీతి
తే. నట్లు గానఁ బ్రావృట్ఛరదాగమముల,నధికభక్తి మహాపూజ యాచరించి
నన్ను సేవించుమనుజుండు నాప్రసాద,మున ధనము ధాన్యమును గల్గి మూరిఁబోవు.

శా. నామాహాత్మ్యము విన్నమానవులకు న్సమ్యక్శుభోత్పత్తి సం
గ్రామాజేయపరాక్రమంబు ప్రతిపక్షవ్రాతనాశంబు సు
శ్రీమాంగళ్యము గల్గు వంశములు సచ్ఛీలమ్ములన్ సమ్మద
శ్రీ మించ న్విలసిల్లుఁ బుత్త్రుఁడు గుణశ్రేష్ఠుండు పుట్టు న్గడున్. 236

తే. శాంతికర్మంబులందు దుస్స్వప్నదర్శ,నంబులందును గ్రహపీడనంబులందు
వేడ్క నాదుమాహాత్మ్యంబు వినఁగవలయు,సంక్షయము నొందు సర్వోపసర్గములును.

క. బాలగ్రహములు సోఁకిన, బాలురకును శాంతి యొనరు బహుజనములకు
జ్జాల స్నేహమున మ్మై, త్రీలక్ష్మి ఘటించు మచ్చరిత్రము విన్నన్. 238

ఆ. దుశ్చరిత్రు లెల్ల దుర్బలు లగుదురు, భూతములు పిశాచములును రాక్ష
సావలియును నాశమందు మన్మాహాత్మ్య,పఠనగౌరవమున భవ్యులార ! 239

వ. ఉత్తమంబు లగుగంధపశుపుష్పార్ఘ్యధూపదీపంబులను విప్రభోజనంబులను హోమం
బులను ప్రేక్షణీయంబులను మఱియు వివిధోపభోగంబులం జేసి యేఁడుగాలంబు
నాకుం బ్రీతి యొనర్చు మదీయజన్మకీర్తనసమరప్రవర్తనాత్మకమైనచరితంబు నిత్యం

బును సత్పదుచ్చరితము శ్రుతమును గావించిన నది దురితంబు లపహరించు నారో
గ్యంబు నావహించు భూతభయంబువలన రక్షించు వైరిపీడ యడంచు మీరును
మహామునులును బ్రహ్మయుం జేసినస్తోత్రంబులును సమస్తశుభంబుల నిచ్చు నని
వెండియును. 240

సీ. కార్చిచ్చు వొదివినఁ గరిసింహశార్దూల తస్కరశాత్రవు ల్దగిలి పట్టు
కొన్నను రాజులు కోపించి చంపఁ బుచ్చినఁ జెఱఁ బెట్టిన వనధినడుమఁ
గలమెక్కి చనఁ జెడుగాలి బెట్టడిచిన బవరంబులోనఁ గైదువులు మీఁదఁ
దఱచుగాఁ బడినను దలముక్క లగువగ లొందవిన నేకీడు నొందక న్ని

ఆ. సంకటములవలనఁ బయ్యన నటు వాసి, బ్రదుకుదురు ముదమునఁ ద్రిదశులార
నన్ను నాత్మ నిలిపి నాదుమాహాత్మ్యంబు, నర్థిఁ జపముఁ జేయునట్టిజనులు. 241

క. పెనుఁబాము గఱచినను బగ, గొని పెను తవిలినను ద్రాఁచుగుఱి మచ్చరిత
మ్మును దలఁచినవరు విడుచు, న్జను దవ్వగ వైరిదస్యుశార్దూలతతుల్. 242

క. అని ప్రీతిఁ జెప్పి యంబిక, యనిమిషవరు లెల్లఁ జూడ నంతర్ధానం
బును బొందె మేదినీశ్వర, యనుపమసంతోషభరితులై సుర లంతన్. 243

క. తమతమపురములకుం జని, తమతమయధికారముల యథాస్థితి రక్షా
క్షము లగుచుండిరి సతతము, తమతమక్రతుభాగములు ముదంబునఁ గొనుచున్ 244

ఆ. అవనినాథ యిట్టు లాదేవి తా నిత్య, యయ్యు జన్మలీల లాదరించు
జగము లర్థిఁ గాచు జగముల నిర్మించు, మోహమున జగములు మునుఁగఁ జేయు.

క. మానుగ సంపదయును విజ్ఞానము దయ సేయు దేవి సద్భక్తి మది
న్పూని తనుఁ గొలిచి కోరిన, మానవులకుఁ బ్రీతితోడ మానవనాథా! 246

వ. మహాకాళియు మహాదేవియు మహామారియు ననురూపంబుల బ్రహ్మాండం బంతయు
నద్దేవి తాన యభివ్యాపించి యుండుఁ గాళియుఁ గౌమారియు సృష్టియు భవయు
నజయు ననునామంబుల దాన వరగు నాసనాతని దాన సకలభూతంబులకు సంస్థితి
యొనర్చు లక్ష్మి యనఁ దాన మనుష్యులకు సమృద్ధి యొసంగు వినాశసమయంబున
నలక్ష్మి యనం దాన యవతరించు. 247

తే. పుష్పగంధధూపాదిసంపూజితయును,సంస్తుతయు నైనయద్దేవి జనుల కొసఁగు
ధనము ధాన్యంబు పుత్త్రులు ధర్మమార్గ, కలితశుభబుద్ధియును రాజగణవరేణ్య! 248

క. దేవీమాహాత్మ్యం బిది, భూవర! చెప్పితి సమస్తమును నీ కిట్లా
దేవి యవిద్యయు విద్యయు, నా విను తా విష్ణుమాయ నాఁగా నొప్పున్. 249

క. ఆవిష్ణుమాయచేత మహీవల్లభ! యెట్లు నీవు నీవైశ్యుండు
న్గోవిదు లగునితరులు మో, హావిలమతు లట్లు లెష్ట నటు గాన వడిన్. 250

క. నరవర! నీ వత్సరమే, శ్వరిశరణము సొరుము దన్ను సద్భక్తిధురం
ధరులై కొలిచిన దయ నన్నరులకు నాదేవి యొసఁగు నానాశుభముల్.

క. అని చెప్పిన మునివాక్యము, విని సురథుఁడు మ్రొక్కి యతని వీడ్కొని చనియెన్
దనరాజ్యము గోల్పడుటను, ఘనమమతం జిత్త మెరియఁ గాఁ దపమునకున్.

వ. సద్బుద్ధి యగు వైశ్యుండును నతనితోడన వెడలె నిట్టిరువురుం జని యంబికాదర్శ
నార్థం బొకయేటితటంబున నిలిచి. 253

చ. అతులితభక్తి మంటఁ దగ నంబికమూర్తి యొనర్చి దేవికి
వ్రతతజపోపవాసములఁ జందనపుష్పసుపూజల న్నిజ
క్షతజవిమిశ్రితాన్నబలికల్పనల న్గడుఁ బ్రీతి సల్పుచున్
క్షితిపవణిగ్వరు లిద్దఱుఁ జేసిరి పాయక మూఁడువర్షముల్. 254

ఉ. వారితపంబు పెంపునకు వత్సలయై పొడచూపె నింపు పెం
పారఁగ దేవి మీరొకఁ బ్రార్థ్యము లెయ్యవి వేఁడుఁ డిచ్చెద
న్సారగుణాఢ్యులార! యనిన న్నరనాథుఁడు వేఁడె రాజ్యము
న్వైరిజయంబు మీఁదటిభవంబున భ్రంశము లేనిరాజ్యమున్. 255

తే. ఏను నాయది యనుసంగ మెడలఁజేయు, నిర్మలజ్ఞాన మడిగె వణిగ్వరుండు
లలితకారుణ్యలతిక పల్లవము లెసఁగ, మనుజవిభుఁ జూచి మున్నిట్టు లనియె దేవి.

ఆ. మనుజనాథ! కొన్నిదినముల నీరిపు, ప్రతతి నోర్చి రాజ్యపదవి నుండు
వొడలు దొఱఁగి రవికి నుదయించి సావర్ణి, మనుత నొంది రాజ్యఘనుఁడ వగుము.

క. ఓవైశ్యోత్తమ! మనమున
నీ వర్థిం గోరినట్లు నిత్యజ్ఞాన
శ్రీవిభవము నీ కిచ్చితిఁ
గైవల్యానందచిత్సుఖస్థితికొఱకున్. 258

వ. అని దేవి యయ్యిరువురకును భుక్తిముక్తిప్రదంబు లగువరంబులు ప్రసాదించి వారలు
ప్రస్తుతించుచుండ నంతర్హిత యయ్యె నంత. 259

క. పరమేశ్వరివరమున నిటు
సురథుఁడు సావర్ణి యనఁగ శోభిల్లి దివా
కరునకు జనించి మను వై
పరగంగలఁ డింక నతఁడు పరమమునీంద్రా! 260

వ. అని మార్కండేయుండు క్రోష్టుకి కెఱింగించిన తెఱంగు చెప్పి. 261

చ. కలియుగకర్ణ! కీర్తిలతికావృతదిగ్గజకర్ణ! భూరిదో
ర్బలవిభవావధీరితసుపర్ణ! వివర్ధితలబ్ధవర్ణ! ని

ర్మలనిజధర్మపూర్ణ! నయమార్గసమార్జితసత్సువర్ణ! శా
వ్యలలితబద్ధనామగుణవైభవ! హృత్కమలస్ఫురద్భవా! 262

క. భూదేవకదంబాశీ
ర్వాదసదామహితమందిరద్వార! మృషా
వాదవిదూర! నిరంతర
భూదానాద్యఖిలదానపుణ్యవిహారా! 263

మాలిని. పరజనహితకారీ! బంధులోకోపకారీ!
సరసజనవరేణ్యా! సంతతాగణ్యపుణ్యా!
హరిపదనిహితాత్మా! హరిధర్మైకవర్త్మా!
పరుషవచనదూరా! భారతీకంఠహారా! 264

గద్యము. ఇది శ్రీమదుభయకవిమిత్ర తిక్కనసోమయాజిప్రసాదలబ్ధసరస్వతీపాత్ర తిక్కనామాత్యపుత్ర మారయనామధేయప్రణీతం బైన మార్కండేయమహాపురాణంబునందు సురథవైశ్యులపహృతవిభవులై మేధ యనుమునియాశ్రమంబున కరుగుటయు నయ్యిరువురకు నమ్మునివరుండు సంసారమోహంబునకుం గారణంబు మహామాయాప్రభావం బని యెఱింగించుటయు బ్రహ్మ యోగనిద్రాదేవిం బ్రస్తుతించుటయు మధుకైటభులవధంబును సకలదేవతేజంబునం జండిక యుద్భవించుటయు మహిషాసురవధంబును దేవతలు హిమవంతంబునకుం జని దేవిం బ్రస్తుతించుటయుం గౌరివచనంబునం దచ్ఛరీరంబునం గౌశికి యను దేవి యావిర్భవించుటయు శుంభనిశుంభదూతాగమనంబును ధూమ్రలోచనువధమును చండముండాసురవధంబును రక్తబీజవధంబును శుంభనిశుంభవధంబును దేవతాస్తోత్రంబును దేవి దేవతలకు నభీష్టవరంబు లిచ్చుటయు దేవీమాహాత్మ్యప్రశంసయుం సురథవైశ్యులతపంబును దేవీప్రసాదంబున సురథుండు రాజ్యంబు వడసి దేహాంతరంబున నాదిత్యునకు సావర్ణిమనువై జన్మించుటయు వైశ్యుండు పరమజ్ఞానంబు వడసి సుఖి యగుటయు నన్నది షష్ఠాశ్వాసము.

శ్రీరస్తు.

మార్కండేయపురాణము

సప్తమాశ్వాసము.

శ్రీవిభ్రాజితవైశ్రవ
ణావాసస్పర్ధినిజగృహామితవిభవా!
భావస్ఫురితభవానీ
శ్రీవనితాధీశ! గన్నసేనాధీశా! 1

వ. పరమజ్ఞానచక్షు లైనపక్షు లాజైమిని కిట్లనియె మఱియు మార్కండేయుండు క్రోష్టుకితోడ. 2

దక్షసావర్ణిమన్వాదివర్ణనము.

ఆ. మునివరేణ్య! దక్షతనయుండు సావర్ణి, యనునతండు నవమమనువు గాఁగ
నతనికాలమునను నమరులు నింద్రుండు, మునులు నృపులు నెవ్వ రనిన వినుము. 3

వ. పారులు మరీచిగర్భులు సుధర్ములు నన నొక్కొక్కగణంబు పన్నిద్దఱేసిగా దేవతలు మూఁడుగణంబులై వర్తిల్లుదురు కార్తికేయుం డగుషడాననుం డింద్రచిహ్నంబులతో నద్భుతుం డనునామంబున దేవేంద్రుం డగు మేధాతిథి వసువు సత్యుఁడు జ్యోతిష్మంతుఁడు ద్యుతిమంతుఁడు సవనుఁడు హవ్యవాహనుండు ననువారు సప్తమును లగుదురు ధృతకేతుండును దృష్టకేతుండు పంచహస్తుండు నిరామయుండు పృథుశ్రవుం డర్చిష్మంతుండు భూరిద్యుమ్నుండు బృహద్భయుండు ననుమనుపుత్త్రులు రాజులై వర్తిల్లుదు రని చెప్పి మఱియును. 4

సీ. పదియవమను వైనబ్రహ్మసావర్ణినాఁ డమరులు వినుము సుఖాసనులు ని
రుద్ధు లనంగ నూర్వురు నూర్వు రొక్కొక్క గణము లై వర్తింపఁ గలరు శాంతి
యను నాతఁ డింద్రుండు మును లేడ్వురును హవిష్మంతుఁ డాపోమూర్తి సత్యుఁ డొగిన
యప్రతిముఁడు వసిష్ఠాఖ్యుఁడు సుకృతి నాభాగుఁడు మఱి మహాప్రభవు లైన
తే. మనుజపతులు భూరిద్యుమ్నుఁడునుజయద్రథుండువృషభుండు నుత్తమౌజుండునునన
మిత్రుఁడునుసుపార్శ్వుండుసుక్షేత్రుఁడనఘు,నులుశతానీకభూరిసైన్యులును ననఘ!

వ. ఏకాదశమను వైనధర్మసావర్ణికాలంబున దేవతలు విహంగములు కామగులు నిర్మాణరతులు రన నొక్కొక్కగణంబు ముప్పండ్రుగా మూఁడుగణంబు లై వర్తింతురు

వృషాఖ్యుం డింద్రుం డగు హవిష్మంతుండు వరిష్ఠుండు ఋష్టి యారుణి నిశ్చరుఁడు ననఘుఁడు వృష్టియు సప్తమును లగుదురు సర్వత్రగుఁడు సుశర్మ దేవానీకుఁడు పురూద్వహుఁడు హేమధన్వుఁడు దృఢాయువు విరాధుండు ననునమ్మనుపుత్త్రులు ధాత్రీపతు లగుదు రని చెప్పి మార్కండేయుండు ద్వాదశం బైనరుద్రసావర్ణిమన్వంతరంబున బృందారకులు సుకర్ములును మనసులు హరితులు రోహితులు సుదారులు ననఁ నొక్కొక్కగణంబు పదుండ్రుగా నేనుగణంబు లైరి ఋతధాముం డనువాఁ డింద్రుం డయ్యె ద్యుతియుఁ దపస్వియు సుతపుఁడును దపోమూర్తియుఁ దపోధనుఁడును దపోనిధియుఁ దపోధృతియు ననువారు సప్తము లైరి వేదవంతుండు నుపదేవుండు దేవశ్రేష్ఠుండు విదూరథుండు మిత్రవంతుండు మిత్రదూరుండు ననుమనుపుత్త్రులు మహీపతు లై వర్తింపంగల రని మఱియు. 6

రౌచ్యమనుజన్మప్రకారము.

సీ. ప్రకటత్రయోదశరౌచ్యమన్వంతరంబున నిలింపులు సుధర్ములు సుకర్ము
లును సుశర్ములు నన ననఘ! మూఁడుగణంబు, లగుదురు దేవేంద్రుఁ డగు బృహస్ప
తి యనంగ నవ్యయధృతిమన్నిరుత్సుక నిర్మోహసుతపులు నిష్ప్రకంప
తత్త్వదర్శులు సప్తము లగ్గలంబు భూపాలనము సేయుపుణ్యాన్నృపులు
తే. చిత్రసేనుఁడు దృఢుఁడు విచిత్రసిక్థ, యనయభృత్సునేత్రసురథు లాదిగాఁగ
మనుతనూజులు వీరలు మునివరేణ్య!, యని మృకండనందనుఁ డిట్టు లనియె మఱియు.

వ. ఆరౌచ్యునిజన్మప్రకారం బాకర్ణింపుము. 8

క. జితమమతాహంకారుఁడు, సతతశమాఢ్యుండు రుచిప్రజానాథుఁ డహ
ర్పతి గ్రుంకినచోట సుఖ, స్థితి శయించుచును దొల్లి క్షితిఁ జరియించెన్. 9

వ. అనగ్ని యనికేతనుండు ననంగుఁడు నై యిట్లు చరియించునతనిం గని తత్పితృ
వరు లి ట్లనిరి. 10

పితృరుచిసంవాదము.

చ. తనరుచు నాకలోకసుఖదం బగుదారపరిగ్రహంబు సే
యనికత మేమి? బంధమున కాస్పదమా యది? యంద సంతతం
బును మునిదేవపిత్రతిథిపూజ లొనర్చుచుఁ బుణ్యలోకము
ల్గను గృహమేధి సర్వసుఖకారిణి వత్స! గృహస్థవృత్తి దాన్. 11

క. దారపరిగ్రహ మొల్లక, యూరక సత్సుతులఁ బడయ కర్చనముల బృం
దారకపితృతతిఁ దనుపక, కోరుదు నీ వెట్లు సుగతి గుణరత్ననిధీ! 12

వ. అనినఁ బితరులకు రుచి యి ట్లనియె. 13

క. అతిదుఃఖము నఘము నధో, గతియుం బరిగ్రహమువలనఁ గరము కలిమి దు
న్మతిఁ గని మును దారస్వీకృతి యే నొనరింప నైతిఁ గృతమతులారా ! 14

ఆ. అఖిలకరణనిగ్రహమునఁ జేయఁగఁబడు, నాత్మసంయమము మహాత్ములార !
యతులముక్తిహేతు వాసంయమము పరి, గ్రహమువలన ముక్తి గాన రాదు 15

ఆ. వినుఁ డనేకజన్మజనిత మై బహుకర్మ, పుంజకర్దమమున బ్రుంగు నట్టి
యాత్మ నిర్జితేంద్రియాదులచేఁ గడు, గంగఁబడు మహాత్మసంగవారి. 16

వ. అనినం బితృదేవతలు నియతేంద్రియు లగువారలకు నాత్మప్రక్షాళనంబు యుక్తం బగు నైనను నీవు ప్రవర్తించునిమ్మార్గంబు గర్మలోపంబు నాపాదించు ఋణంబు లేనుం ద్రోచినం గాని యశుభంబు ద్రోపు వడదు పర్తుంపు గాక విహితకర్మంబు లాచరించిన బంధంబు రాదు ప్రాజ్ఞులు పూర్వకర్మకృతం బైనసుఖదుఃఖజాతంబు భోగంబున నాశంబు నొందించి యాత్మప్రక్షాళనంబు సేయుదు రనినఁ బితరులం జూచి కర్మమార్గం బవిద్య యని వేదంబుల వినంబడు మీ రిట్లందు నన్ను నియోగించెద రనిన వార లది నిజంబు కర్మం బవిద్య యనం దగు నైనను విద్యాప్రాప్తికిం గర్మంబు కారణంబు గావున నీవు విధ్యుక్తప్రకారంబున దారపరిగ్రహంబు సేయుము జన్మంబు విఫలంబు గావింపకుము లౌకికం బనుష్ఠింపు మనిన నతం డిట్లనియె. 17

ఆ. ఏను జాల వృద్ధు నెవ్వఁడు నా కిచ్చు, గన్య నిచ్చు ? నెట్లు గలుగుఁ బెండ్లి ?
కరము పేద నైనవరునకు నెందు భా, ర్యాపరిగ్రహంబు భరము గాదె? 18

క. అనినఁ బితృదేవతలు మా, కును నీకును నరకగతి యగుం జుమ్మీ నీ
మనమున మావచనంబులు, గొనియాడక విడిచి తేనిఁ గులజలధిశశీ ! 19

క. అని చెప్పి యతఁడు చూడఁగ, మునిసత్తమ ! వా రదృశ్యమూర్తు లయిరి పె
ల్చనఁ గరువలిచే నాఱిన, ఘనదీపంబులును బోలె గ్రక్కున నంతన్. 20

ఉ. ఆరుచి పైతృకోక్తి హృదయంబున కార్తియొనర్ప నెల్లెడ
న్ధారుణిఁ గన్యకన్వెదకి తా నొకచోటను గాన లేక లో
నారట మగ్గలింప వెగడందుచు నిం కెటఁ బోదు నేను ? నా
కోరిక దైవ మెట్లు సమకూర్పఁగఁ జేసెను ? నేమి సేయుదున్ ? 21

ఉ. అక్కట మత్పితృప్రభృతి కభ్యుదయంబుగ దారసంగ్రహం
బెక్కడ గల్గు నాకుఁ దగ నిప్పుడ ? యంచు విషాదవేదనం
బొక్కుచు నారుచిప్రభుఁడు బుద్ధిఁ దలంచెఁ దపంబు సేసి యే
నక్కమలాసనుం గొలుతు నాదటతో నని నిశ్చితాత్ముఁ డై. 22

క. అతినియమవ్రతనిష్ఠా, న్వితుఁ డై దారుణతపంబు విడువక చేసె
న్ధృతియుతుఁడు రుచిప్రభుఁ డా, శతధృతి మది నిలిపి దివ్యశతవర్షంబుల్. 23

తపఃప్రసన్నుఁ డైన బ్రహ్మవలన రుచి యిష్టార్థములఁ బడయుట.

వ. అంత లోకపితామహుం డైన బ్రహ్మదేవుండు ప్రత్యక్షం బై భవదీప్సితం బెయ్యది యెఱింగింపు మనిన నతండు ప్రణమిల్లి పితృవచనంబునఁ దనచేయం దలంచిన కార్యంబు విన్నవించిన విని విరించి రుచి నాలోకించి నీవు ప్రజాపతిత్వంబు నంగీకరించి సకలప్రజలం బుత్త్రుల నుత్పాదింపుము నిఖిలకర్మకలాపంబు నిర్వర్తించి కృతాధికారత్వంబు భజించి తుదిం బరమసిద్ధిం బొందుము పితృవాక్యంబు తప్పక దారపరిగ్రహం బొనరింపుము నీకుం గన్యాలాభంబును బితృప్రసాదంబున సిద్ధించు నత్యంతనియతిం బితృపూజనంబు గావించి పితరులం బ్రార్థింపు మనిన నమ్మహాత్ముం డట్ల కాక యని యొక్క మహానదియందు వివిక్తం బగుపులినతలంబున వసియించి పితృదేవతలకు మ్రొక్కి తర్పణంబు చేసి వివిధస్తవనంబులఁ బితృదేవతల నిట్లు స్తుతింపం దొడంగె. 24

రుచి దేవతల స్తుతించుట.

క. దేవతలును మునులును నా,నావిధపూజనము లొగి నొనర్పఁగ శ్రాద్ధ
శ్రీవిభవాన్వితు లగుపితృ,దేవతలకు మ్రొక్కెదం బ్రదీపితభక్తిన్. 25

చ. అరుదుగ భుక్తిముక్తులకు నర్థులు సాఁచుచు సిద్ధసాధ్యకిం
పురుషవియచ్చరు ల్నరులు భూసురభూవరవైశ్యశూద్రు లా
దరమున శ్రాద్ధకాలమునఁ దప్పక పూజలు ప్రీతితోడ నె
వ్వరికి నొనర్తు రట్టిపితృవర్యులకే నతిభక్తి మ్రొక్కెదన్. 26

ఆ. తిలల గంధపుష్పముల ధూపదీపోప, హారముల నిరంతరాతిభక్తి
భుజగదనుజవరులు పూజింప నొప్పారు, పితృగణంబులకును వినతి యొనర్తు. 27

క. అమరత్వమ్మును నింద్ర,త్వమునుం బ్రహ్మత్వమును ముదంబున బహుకా
మములు దయ నొసఁగుపితృవ,ర్గమునకు వందన మొనర్తుఁ బ్రకటితభక్తిన్. 28

సీ. వెలుఁగుహుతాగ్నిలో వేల్చుహవిస్సుల నెవ్వారి కగుఁ దృప్తి యెవ్వ రెపుడు
విప్రదేహస్థులై వేడ్క భుజింతు రెవ్వరు పిండవిధిఁ బ్రీతిభరితు లగుదు
రెలమి నెవ్వరు కృష్ణతిలలను ఖడ్గమాంసములను బరమహర్షము వహింతు
రెవ్వరు తగుకాల మెడపక యిడుకాలశాకసంసేవ నుత్సవము దాల్తు
తే. రెవ్వ రర్థి వహింతు రహీనధవళ, తరవిమానములందు సంతతవిభూతి
నట్టి పితృవరు లన్నతోయములఁ దృప్తి,కలితు లగుచుఁ బ్రసన్నతఁ గాంత్రు నాకు.

తే. భూసురుల కిందువర్ణులు భూపతులకు, జలజమిత్రవర్ణులు వణిజాలకుఁ గనక
వర్ణు లొగి శూద్రులకు నీలవర్ణు లగుచు, వెలుఁగుపితరుల కొనరింతు వినతిభక్తి. 30
29

వ. ఈశ్రాద్ధంబున నాచేత సంతర్పితు లైనపితృవరులం దగ్నిష్వాత్తాదులు తూర్పున బర్హిషదులు దక్షిణంబున నాజ్యపులు పశ్చిమంబున సోమపు లుత్తరంబునఁ బితృపతి యగుయముండు సర్వదిక్కుల నున్నభూతపిశాచభయంబులు వొందకుండ నెప్పుడు రక్షించునది యని మఱియు ననేకప్రకారంబులం బ్రస్తుతించిన రుచికిం బ్రసన్ను లై పితృదేవతలు వరం బిచ్చెదము వేఁడు మనిన నతండు లజ్జావనతాననుం డగుచు ని ట్లనియె. 31

క. పితృదేవతలార! ప్రజాపతి నన్నుం బ్రజాపతిత్వపదవీ విభ్రా
జితుఁడ వగు మనినఁ గోరెద, సుతుసిం గనుదాని దివ్యసుందరిఁ బత్నిన్. 32

పితృదేవతలు రుచికి వరమిచ్చుట

ఆ. అనిన నపుడు నీకు నతిమనోహర యగు, భార్య గలుగు నందుఁ బడయు దీవు
సుతుని రుచిమునీంద్ర! యతఁడు మన్వంతర, ప్రభుత నొంది పరగు రౌచ్యుఁ డనఁగ.

క. అతని కుదయింతు రవనీపతు లగుసుతు లతులబలులు పలువు రొగిఁ బ్రజా
ప్రతతుల నిర్మించు ప్రజాపతి వై తుది నీవు సిద్ధిఁ బ్రాపింపు రుచీ! 34

వ. అని యతనికి వరం బిచ్చి పితరులు మఱియు ని ట్లనిరి. 35

చ. అనుపమభక్తి నీవు ప్రియ మారఁగ మాకు నొనర్చినట్టి యీ
స్తుతి మముఁ బ్రస్తుతించు మనుజుండు కృతార్థుఁడు వాని కెందరో
గతియును పుత్రపౌత్రఘనకాంచనసంపదయు న్స్వబోధము
న్సతతము నిత్తు మెంతయుఁ బ్రసన్నమనస్కుల మై మునీశ్వరా! 36

ఆ. శ్రాద్ధమున భుజించు సద్ద్విజవర్యుల, యెదుర నుండి యెవ్వఁ డీస్తవంబు
పరమభక్తితోడఁ బఠియించు నాశ్రాద్ధ, మక్షయంబు మాకు నమితపుణ్య! 37

తే. వేదహీనదత్తం బైన విధివిహీన, మైనఁ గాలంబు మఱి హీనమైన శ్రాద్ధ
ముపహతం బైనఁ గుద్రవ్యయుక్త మైన, సద్గుణం బగు నీస్తోత్రజపము పేర్మి. 38

వ. ఏతత్స్తోత్రపఠనంబునం జేసి మాకు హేమంతంబునం బండ్రెండేండ్లును శిశిరంబున నిరువదినాలుగుసంవత్సరంబులును వసంతగ్రీష్మంబులఁ బదాఱేసిహాయనంబులును వర్షాగమంబున ననంతకాలంబును శరత్సమయంబునఁ బంచదశాబ్దంబులును దృప్తి యగుం గావున శ్రాద్ధంబున భుజించువిప్రులకు నీస్తవంబు నీ వెప్పుడు వినిపించునది యని చెప్పి పితృదేవత లంతర్హితు లైరంత నమ్మహానదీమధ్యంబున నుండి వెడలి ప్రమ్లోచన యనునప్సరోంగన రుచిసమీపంబునకుం జని వినయావనత యగుచు మధురవాక్యంబుల ని ట్లనియె. 39

రుచి మాలిని యనుకన్యకం బెండ్లాడుట.

తే. మునిజనాధిప! విను ప్రమ్లోచన యనంగఁ, బరఁగునప్సరోంగన నేను వరుణపుత్రుఁ
డైనపుష్కరునకుఁ బుట్టినట్టి నాకుఁ, దనయఁ గన్యకారత్నంబు వనజముఖిని. 40

క. ఆర్యోత్తమ! నీ కిచ్చెద, భార్యంగా స్వీకరింపు బాహుబలశ్రీ
ధుర్యుఁడు మను వగుతనయుండు, సూర్యనిభుఁడు పుట్టు నీకు సురుచిరయశుఁడై.
చ. అనవుడు నట్ల కాక యని యారుచి పల్కినఁ బ్రీతి నప్సరో
గన దనుఁ బిల్చిన న్జలము గ్రక్కున వెల్వడి వచ్చి యాఁ గన్న మా
లిని యనుకన్యకం బ్రమదలీలఁ గరగ్రహణం బొనర్చె నా
ముని విధిపూర్వకంబుగ సముత్సుకుఁడై వెస నానదీతటిన్. 42

రుచికి మాలినియందు రౌచ్యమనువు పుట్టుట.

క. రుచ్యాఖ్యానుగుణంబుగ, రౌచ్యుం డన మహిత నామరమ్యత మెఱయు
న్బ్రఖ్యాత్ముం డగుసుతుఁడు గు,ణాచ్యుతుఁ డుదయించి పరగె నవని న్మనువై. 43

భౌత్యమనుజన్మప్రకారము

వ. ఇది రౌచ్యమనుజన్మప్రకారం బని చెప్పి మార్కండేయుండు క్రోష్టుకి కింకఁ జతు
ర్దశమను వైన భౌత్యునియుత్పత్తిప్రకారంబు వివరించెద విను మంగిరశ్శిష్యుం డుగ్ర
కోపనుండు భూతి యనునొక్కమహాముని కలం డతనిమాహాత్మ్యం బాకర్ణింపుము.
సీ. పవనుఁడు భయపడుఁ బటుగతిఁ జరియింప సూర్యుండు వేఁడిమిఁ జూపనోడు
శీతాంశు లడరింప భీతిల్లు శశి వాన లొసఁగ హరి గురియింప వెఱచు
ఋతువులక్రమ మేది యెల్లమ్రాఁకుల నిండ నెపుడు పుష్పఫలంబు లిచ్చుఁ దరులు
వలసినచోటన జల ముప్పతిలు నేరి దలఁచిన నవి యెల్లఁ గలుగుచుండు
తే. భూరిదారుణకోపవిస్ఫూర్తి భువనములకు నెల్ల భయంకరమూర్తి యైన
యమ్మహాత్మునితీవ్రశాపాగ్నిఁ జేసి, శాంతిగుణవిభూషణ! తదాశ్రమమునందు. 45
ఉ. ఆతఁ డపుత్త్రుఁడై వగచి యాత్మజుఁ గోరి తపం బొనర్తు శీ
తాతపవాతపీడితుఁడనై యని బుద్ధిఁ దలంచి నిశ్చలుం
డై తప మాచరింపఁ బవనార్కశశాంకులు నొంప నోడిన
న్భూతి యపీడ్యమానుఁ డయి పో విడిచె న్దపము న్సుతేచ్ఛయున్. 46

గురువునగ్ని నశించుటచే శాంతి యనునతఁడు చింతాకులుఁ డగుట.

వ. అంత నొక్కనాఁ డతనిసహోదరుం డగుసువర్చసుండు చనుదెంచి యజ్ఞంబునకుఁ దన్ను నిమంత్రితుఁ గావించిన నాభూతి శాంతి యనువానిం దనశిష్యునిఁ బిలిచి యేను మదీయభ్రాతృముఖంబున కరిగెద నీవు రేయునుం బవలును నేమఱక నిద్రవోక యెప్పుడు నాచేతం జేయంబడునిత్యకృత్యంబు లయ్యైప్రకారంబుల ననుష్ఠించునది యని నియోగించి చనియె నతండును భయభక్తియుక్తుం డగుచు సతతంబును సమిత్కుశఫలాదులు గొని వచ్చి గురుండు నియమించినట్టివిహితకర్మంబులు సలుపుచుండ నగ్ని

హోత్రకుండంబునం దనలం బాఱినం జూచి శాంతి నితాంతచింతాక్రాంతుండై తల్ల
డిల్లుచు నంతర్గతంబున. 47

సీ. ఏమి సేయుందు? గురుఁ డేఁగుదెంచిన దీని నే మని చెప్పుదు? నెందుఁ జొత్తు?
శమితానలం బైనసదనంబు గని ముని యెట్టిశాపము నాకు నిచ్చు నొక్కొ?
యెం దగ్ని యిడుదు నేఁ గుండంబులోన నట్లైన నీఱుగఁ జూచు నతఁడు నన్ను
నతనికోపమునకు నమరుల గడుఁ దల్లడింతురు నరుఁడ నే నెంతవాఁడ?

ఆ. ననుచు బహువిధముల వనరి భయం బంది, యనుపమానబుద్ధి యైనశాంతి
దీని కింక నొండు తెఱఁగు లేదు త్రిలోక, వరదు నగ్నిదేవు శరణుఁ జొత్తు. 48

క. అని యేకచిత్తుఁ డై మేదిని జానులు మోపి భక్తిదీపితమతి ని
ట్లని స్తుతియింపఁ దొడంగెను, మునిశిష్యుఁడు గరయుగంబు మోడ్చి హుతవహున్.

శాంతి యగ్నిదేవుని స్తుతించుట.

శా. భూతాధారుఁడ వై మహాధ్వరకళాపూజ్యుండ వై యాగమ
వ్రాతస్తుత్యుఁడ వై సురార్చితుఁడ వై బ్రహ్మణ్యదేవుండ వై
శ్రౌతస్మార్తశుభక్రియాధిపతి వై శాంతాంతరంగోజ్జ్వల
జ్యోతీరూపుఁడ వై వెలుంగు నిను సంస్తోత్రం బొనర్తున్ శిఖీ!. 50

క. దేవతలకు నీవ ముఖము, దేవతలకు నీవ బ్రదుకు తెరువు హుతవహా!
దేవతల కెల్ల నాత్మవు, నీవ సకలదేవతలును నీప్రాణంబుల్. 51

శా. నీయం దెప్పుడు వేల్చుహవ్యము లొగి న్మేఘమ్ము లై వర్షము
న్జేయ న్మేదిని నోషధు ల్గలుగుఁ దత్సేవ న్జనశ్రేణి దీ
ర్ఘాయుర్వృద్ధి వహించి యధ్వరము లుద్యత్ప్రీతిఁ గావింపఁగా
నాయజ్ఞంబులఁ దృప్తిఁ బొందుదురు నాకాధీశ్వరు ల్పావకా! 52

క. జలముల నీవ సృజించితి, జలముల యగ్నియగు నీకు జనన మొనర్చెన్
జలములు నీచేఁ బక్వమ్ములగుచుఁ బ్రాణులకుఁ జేయుఁ బుష్టి హుతవహా! 53

వ. నీవు దేవతలయందుఁ దేజోరూపంబు నురగులయందు విషరూపంబును బక్షులయందు వాయురూపంబును మనుష్యులయందుఁ గ్రోధరూపంబును మృగాదులయందు మోహరూపంబును మహీరుహంబులయందుఁ గాఠిన్యరూపంబును జలంబులందు ద్రవరూపంబును ననిలంబునందు జవరూపంబును జేసి సర్వంబు నభివ్యాపించి యుండుదు సర్వభూతమ్ములయందు నగ్నిత్వంబునఁ జరింతువు సర్వంబును నీచేత సృష్టం బైనది కవివరులు నిన్ను మూఁడువిధంబులు నెనిమిదివిధంబులుం గావించి యజ్ఞవాహుం గావించిరి నీవు లేనియాక్షణంబ నిఖిలంబు నశించు మహాత్ములు భవదీయదర్శనంబున నిజకర్మవిహితగతులు వడయుదురు నీజిహ్వ లైహికభయంబులు చెందకుండ మమ్మనుదినంబు

రక్షించుచుండెదు మని మఱియు ననేకప్రకారంబులం బ్రస్తుతించిన నగ్నిదేవుండు దనశరీరంబు శిఖాజాలంబులం బ్రజ్వరిల్లం బ్రసన్నత్వంబు నొంది కృతప్రణాముం డగునతనికి న్జలదనినదగంభీరస్వరంబున ని ట్లనియె. 54

క. శాంతీ! నీస్తుతులకు నే, నెంతయుఁ బ్రీతుండ నైతి నిచ్చెద వర మ
త్యంతహితము నీ కయ్యది, సంతసమున దాని నడుగు సౌజన్యనిధీ! 55

అగ్నిదేవుఁడు సంతుష్టుఁ డై శాంతికి వరమిచ్చుట.

చ. అనవుడు నాతఁ డేను భవదాకృతిఁ గన్గొనఁ గంటి మంటి నా
మనమున వంత యంతయును మానెఁ గృతార్థుఁడ నైతిఁ జెప్పెద
న్వినుము మహాత్మ! మద్గురుఁడు నెమ్మి ననుం దనయాశ్రమంబునం
దునిచి సహోదరాధ్వర మహోత్సవదర్శనలాలసాత్ముఁ డై. 56

ఆ. చనిన మదపరాధమున భవద్విరహిత, మయ్యె ధిష్ణ్య మిప్పు డందు నీవు
హవ్యవాహ! తొంటియట్ల వెలుంగఁగ, వలయు గురుఁడు సూచి యెలమిఁ బొంద.

సీ. వెండియు నీవు నా కొండువరంబు ప్రసాదించెదేని యస్మద్గురునకు
సత్పుత్త్రు నొకనిఁ బ్రసాదింపు తనయుని యం దెట్టు లట్టు నాయందు నిఖిల
సత్త్వంబులందు నాసంయమిహృదయంబు మార్దవం బొనరింపు మైత్రి వెలయ
నీస్తోత్రమున నిన్ను నెవ్వఁడు కీర్తించు నతనికి వరదుండ వగుము దేవ!

తే. యనిన ననలుండు నీవు న న్నడిగినట్టి, వరము లన్నియు నిచ్చితిఁ గరుణ నీకు
ననఘ! యీ స్తవంబున నను వినుతి సేయు, నతని కీప్సితవివిధపుణ్యములు గలుగు.

ఆ. పూర్ణిమాదిపర్వములయందు బహువిధ, సవనతీర్థహోమసమయములను
భక్తి నీ స్తవంబు పఠియించునరులకు, నఘము లాఁగు శుభము లావహిల్లు. 59

క. అని చెప్పి యతఁడు చూడఁగ, ననలుఁడు హతదీపభంగి నంతర్ధానం
బునఁ బొందె శాంతి యంతం, దనమనమున సంతసంబు దనరారంగన్. 60

ఆ. గురుగృహంబుఁ జూచి కుండంబులోఁ దొంటి, యట్ల వెలుఁగుచున్న యనలుఁ జూచి
పూర్ణచంద్రుమాడ్కిఁ బొల్పారె నతఁడు హృ, ద్యామృతంబు వొంగి యవల వెడల.

వ. అయ్యవసరంబున. 62

భూతి శాంతికృత్యమునకు సంతోషించుట.

క. అనుజునియాగము చెల్లినఁ, దనయాశ్రమమునకు వచ్చెఁ దద్దయు ముదం
బున భూతి మ్రొక్కి యతనికి, నొనరించెను శాంతి సవినయోచితపూజల్. 63

ఉ. డెందమునం బ్రమోదము ఘటిల్లఁగ నమ్ముని శిష్యుఁ జూచి నీ
యందును సర్వభూతములయందును నిప్పుడు సౌహృదంబు నా
యందుఁ గుమార! నిశ్చలిత మైనది యీవిధ మేమి యొక్కొ య

స్పందితపుణ్యా! యే తెఱఁగఁ జయ్యెనఁ జెప్పుము నాకు నావుడున్. 64

చ. అనలవినాశ మాదిగ యథార్థము సర్వము శాంతి సెప్పిన
స్విని ప్రమదాశ్రు లాస్యమున వెల్లి గొనం బులకాంకురంబులన్
దను వమరంగ నమ్ముని ముదంబునఁ గౌఁగిటఁ జక్కఁ జేర్చి శి
ష్యుని నొగి సాంగవేదవిభవోజ్జ్వలుఁ గా నొనరించెఁ బ్రీతిచేన్. 65

భౌత్యమనుజననము.

వ. ఇట్లు హుతాశనవరప్రసాదంబునం జేసి. 66

క. భూతికి భౌత్యుం డనఁగఁ బ్రభూతవిభూతిప్రభావభూరిభుజబల
స్ఫీతుఁ డుదయించె మనువై, యాతనికాలమునఁ గలసురాదుల వినుమా. 67

భౌత్యమన్వంతరమునందలి యింద్రాదుల వివరణము.

వ. చాక్షుషులు కనిష్ఠులు పవిత్రులు భ్రాజితులు ధారావృకులు నన దేవత లేనుగణం
బులును శుచి యనువాఁ డింద్రుండును నాగ్నీధ్రాగ్నిబాహుశుచిముక్తమాధవశుక్రా
జితులనువారు సప్తమునులును గురుగభీరబ్రధ్నభరతానుగ్రహాభిమానిమత్ప్రవీరవిష్ణు
సంక్రందనతేజస్విసుబలాభిధానులగుమనుపుత్త్రులు ధాత్రీశులై వర్తింపఁ గలవారు
స్వాయంభువస్వారోచిషోత్తమతామసరైవత చాక్షుషవైవస్వతసూర్యసావర్ణిబ్రహ్మ
సావర్ణిధర్మసావర్ణి రుద్రసావర్ణి దక్షసావర్ణి రౌచ్యభౌత్యు లనుసీమనువులజన్మప్ర
కారంబు వినిననరునకుఁ గ్రమంబున ధర్మకామార్థజ్ఞానవృద్ధ్యారోగ్యబలగుణవత్పు
త్త్రపౌత్త్రమాహాత్మ్యశుభవిజయజ్ఞాతిప్రాధాన్యరిపువినాశదేవతాప్రసాదాద్యైశ్వర్యం
బులు గలుగు మన్వంతరదేవతలను దేవేంద్రుని సప్తమునులను రాజులను సావధాను
లై యాకర్ణించుమహాత్ములు సర్వపాపవిముక్తులు సర్వశుభయుక్తులు సర్వకాలకుశల
సమన్వితులు నగుదు రింద్రులుపదునలువురు గలయంతకాలంబును బుణ్యలోకసుఖం
బు లనుభవింతు రనిన మార్కండేయమహామునికిం గ్రోష్టుకి యిట్లనియె. 68

మహారాజవంశవర్ణనము.

తే. వింటి మన్వంతరస్థితివిలసనములు, క్రమముతో నీవు చెప్పఁగ నమితపుణ్య!
వినఁగఁ వేడ్కయయ్యెడు నాకు విస్తరింపు, నలువనుండి వచ్చినరాజకులమునెల్ల. 69

క. అనిన మృకండతనూజుం, డను విను చెప్పెదఁ జతుర్ముఖాద్యమయి జగ
మ్మునకు మొదలైననృపతుల, జననముఁ జరితంబు నీకు సౌజన్యనిధీ!. 70

సీ. ఎందేనియుం మనువు నిక్ష్వాకుఁడు ను ననరణ్యుండు నొగి భగీరథుఁడు నాది
గా ననేకులు ధరిత్రీనాథు లధికవిభూతిసమేతులు భూరిబలులు
ధార్మికు లక్షరతత్పరు ల్శూరులు పరమవిజ్ఞానులు భవ్యయశులు
జనియించి రేవంశమునయందు బహుసహస్రవిధేవవంశము ల్సంభవించె

తే. నత్రి మొదలు దిగ్గనమాడ్కి నర్థిఁ, మనుజు లేయంశమున పెంపు విని సమస్త
దురితనిర్ముక్తు లగుదురు ధరణి నట్టి, విమలవంశంబు చెప్పెద విను మునీంద్ర! 71

సూర్యుని జనన ప్రకారము.

వ. ప్రజాపతి ప్రజల సృజియింపం దలంచి దక్షిణాంగుష్ఠంబున దక్షుని వామాంగుష్ఠంబునం దదీయభార్యను నుత్పాదించిన నాదక్షుని కదితి యనుకన్యక యుదయించె దానియందుం గశ్యపుం డొకయండంబు పుట్టించె నయ్యండంబు బ్రహ్మస్వరూపంబును సకలజగత్పరాయణంబును నుత్పత్తిస్థితివిలయకారణంబు నయి వెలుంగుచు. 72

తే. సర్వభూతమయాత్ముండు శాశ్వతుండు, నఖిలభువనైకమూర్తియు నవ్యయుండు
నైనభాస్వంతుఁ డాదిత్యుఁ డయ్యెఁ దొల్లి, యదితిచేత నారాధితుం డగుటఁ జేసి. 73

సీ. అనినఁ గ్రోష్టుకి యిట్టు లనియె వివస్వంతు నాకార మెట్టి దయ్యాదిదేవుఁ
డనఘ! కశ్యపునకు నాత్మజుం డై యెట్టి కారణంబునఁ బుట్టెఁ గశ్యపుండు
నదితియు నెట్లయి నతని నారాధించి రతఁడు వారల కేమి యానతిచ్చె
నవతరించినయమ్మహాత్ముమాహాత్మ్యంబు విధ మెట్టి దెఱిఁగింపు వినఁగ వేడ్క
తే. యగుచు నున్నది మునినాథ! యనుడు నమ్మృ
కండతనయుండు వినుము మార్తాండుఁ డాది
నుద్భవించినవిధము నీ దున్నరూపు
నయఁ జెప్పెద సంతతాతులితపుణ్య! 74

వ. ఇంతయును నిష్ప్రభంబు నిరాలోకంబును నై యుండ నొక్క మహాండం బావిర్భవించె నందుఁ బ్రపితామహుండును బహుగుణనిధియు బ్రహ్మయు స్రష్టయు నై తాన కలిగె నతనిముఖంబున మహానాదంబుతో నోంకారం బుద్భవించె దానివలన భూరాదివ్యాహృతులు మూఁడు నుద్భవించె నని సూర్యుని సూక్ష్మరూపంబులు మహోజనస్తపస్సత్యంబు లనునాలుగు స్థూలరూపంబులు నిత్యం బగుదివాకరునియందు దివ్యదురూపంబులు నుత్పత్తివిలయంబులయందుఁ గలుగుచు నడంగుచు నుండు మున్నేను జెప్పినయోంకారం బద్దేహం బగు బ్రహ్మ తను వని వెండియు. 75

సీ. నయనతోయ్యమున నంబుజాప్తుని రజోవృతము నై వెడలె ఋగ్వేద మనఘ!
దక్షిణాస్యమున రక్తద్యుతి సత్త్వసముద్రిక్త మై యజు వుద్భవించె
చరమముఖంబున సామంబు తెలుపయి పుట్టెఁ దమోగుణస్ఫూర్తి మెఱయ
నుత్తరాననమున నుద్భవించె నథర్వ మసిత మై సత్త్వతమోతిశయిత
తే. నమరు నీ నాల్గు శ్రుతులును నాద్యమైన, యట్టిప్రణవంబు తేజోమహత్త్వమునను
ఋగ్యజుస్సామతేజంబు లేకభావ, మొంది త్రిగుణమయస్థితి నుల్లసిల్లు. 76

తే. కెలంకులందును మీఁదను గ్రింద దీప్తు, లెసఁగ మండలీభూతమై యివ్విధమున

వేదములమూఁటితేజంబు నాదిపరము, తేజమునఁజేసి యనఘ! యాదిత్యుఁ డయ్యె. 77

వ. ఇట్లు విశ్వంబునకుఁ గారణం బై యవ్యయుం డైనభాస్వంతుండు ఋగ్యజుస్సామం
బులగుణంబులం జేసి క్రమంబునం బూర్వాహ్ణమధ్యాహ్నాపరాహ్ణంబులయందు శాంతిక
పౌష్టికాభిచారికంబు లంగీకరించి సర్వంబును దపింపఁ జేసి సృష్టియందు బ్రహ్మయుం
స్థితియందు విష్ణుండును సంహారంబున రుద్రుండు నై వెలుంగుచుఁ ద్రివేదమయుం
డును ద్రిగుణాత్మకుండును ద్రిపురుషమూర్తియు నని జగంబులు గీర్తింప నొప్పు వివ
స్వంతుండు నుగ్రతేజంబున నజాండం బంతయు సంతప్యమానం బగుటం జూచి
సృష్టిరక్షాపరుం డగుకమలభవుండు చింతాక్రాంతత్వంబు నొంది. 78

బ్రహ్మ సూర్యునిఁ బ్రార్థించుట.

ఉ. ఏను సృజించుప్రాణిచయ మింతయు నొక్కట నాశ మొందెడు
న్భానునితీవ్రతేజముప్రభావముచే వెస నింకెను న్జగం
బీనరులు న్జగంబుల విహీనత నొందఁగ నేటిసృష్టియం
చానలినోద్భవుండు హృదయంబున భాస్కరు నిల్పి భక్తితోన్. 79

వ. ఇట్లు స్తుతింపఁ దొడంగె. 80

తే. యోగిజనము లెవ్వనిఁ బరజ్యోతి గాఁగఁ, దలఁతు రఖిలమయాత్ముఁ డై వెలుఁగు నెవ్వఁ
డరయ సకలంబు నెవ్వనియందుఁ గలుగు, నట్టిరవికి మ్రొక్కెద నే సమగ్రభక్తి. 81

ఉ. ఏమహితాత్ముఁ డెప్పుడును నెంతయు వెల్గుచు నుండు ఋగ్యజు
స్సామమయైకమూర్తి రుచిసంపద నేనిగమాత్ముఁ డర్థమా
త్రామయసూక్ష్మతన్వెలుఁగుఁ దద్దయు నేత్రిగుణాత్ముఁ డోంకృతి
శ్రీమయలీల సంతతముఁ జెల్వగు నారవి కేను మ్రొక్కెదన్. 82

క. శ్రుతిరూపుఁడు గ్రతురూపుఁడు, నతులబ్రహ్మైకరూపుఁ డాత్మవిదారా
ధితరూపుఁ డాద్యుఁ డవ్యయుఁ, డతితేజుం డగుదినేశు నభినందింతున్. 83

క. అపరిమిత మైననీయుం, గ్రపువేఁడిమిఁ బ్రాణు లెల్లఁ గ్రాఁగుదుఁ దేజం
బుపసంహరింపు సృష్టికి, విపరీతము పుట్టకుండ విశ్వమయాత్మా!. 84

బ్రహ్మకృత సురాసురనరతిర్యగాది సృష్టిప్రకారము.

వ. అని సర్గోద్యుక్తుం డగుబ్రహ్మ బహువిధంబులం బ్రస్తుతించినఁ బ్రభాకరుండు నిజ
పరమతీవ్రతేజం బుపసంహరించి యల్పప్రభాసమన్వితుం డయ్యె నంతఁ బ్రజాపతి
పూర్వకల్పంబునం దెట్టులట్లసర్వంబునుం గల్పించె సర్వలోకంబులు సర్వద్వీపంబులు
సర్వసముద్రంబులు సర్వవర్ణంబులు సర్వాశ్రమంబులు సర్వధర్మంబులు వేదసూక్త
క్రమంబున నావిర్భవించె నావిరించికి మరీచి జన్మించె మరీచికిఁ గశ్యపుఁడు పుట్టెఁ

కశ్యపునకు దక్షునికూఁతులం పదుమువ్వురు భార్యలైరి వారిలో నదితికి దేవతలు దితికి దైత్యులు దనువునకు దానవులు వినతకు ననూరుగరుత్మంతులు ఖసకు యక్షరాక్షసులు కద్రువకు నురగేంద్రులు నావిర్భవించిరి క్రోధకు ఋషిగణాప్సరోగణంబులు నిరకు నైరావతాదిగజంబులును బ్రభవించె మునికి గంధర్వు లావిర్భవించిరి తామ్రకు శ్యేనీప్రముఖకన్యలు పుట్టిరి వారిసంతతి శ్యేనభాసశుకాదిఖగము లయ్యె నిలకు వృక్షంబులు ప్రభవఁ బక్షిగణంబులును బుట్టె నిట్లు రెండవసర్గం బై కశ్యపప్రజాపతి సంతానంబు జగద్భరితం బయ్యె నందు. 85

తే. సురలు సత్త్వరజస్తమస్స్ఫురణ నొంది, యధికులై యందఱకు ముఖ్యులైరి వారి
నజుఁడు భువనత్రయమునకు నధిపతులను, యజ్ఞభుజులను గావించె నాదరమున. 86

ఉ. దాని సహింప కెంతయును దర్ప మెలర్పఁగ దైత్యదానవు
ల్వాని సురావలిం దొడరి భూరిరణం బొనరించి గెల్చి కౌ
ర్యానుగుణంబు గా.జగము లన్నియుఁ జేకొని యాగభాగము
ల్మానుగఁ దార కైకొని రమందభుజాబలజృంభణంబునన్. 87

వ. అంత. 88

క. దితి దనుతనయులచేఁ దన, సుతు లపహృతరాజ్యు లగుటఁ జూచి యదితి దా
మతి వారి నవిచ్ఛిన్న, క్రతుభాగులఁ జేయఁ దలఁచి కడు భక్తిమెయిన్. 89

అదితి సూర్యుని స్తుతించుట.

మహాస్రగ్ధర. సవిత్రుం దేజోభిరాము న్సకలమునిజనస్తవ్యుఁ బ్రత్యక్షమూర్తిన్
దివిజేంద్రారాధనీయు న్దినకరుఁ ద్రిజగదీశు న్విశ్వవంద్యున్
రవి నారాధింపఁ జొచ్చె న్మతి నదితి ప్రయత్నంబుతోడ న్నిరాహా
రవిధిస్వీకారనానావ్రతనియమధురారమ్య యై సంతతంబున్. 90

వ. అట్లారాధించుచు. 91

క. పరమం బై సూక్ష్మం బై, పరిపూర్ణం బై సుషుమ్నఁ బ్రభవం బై సు
స్థిర మైన బ్రహ్మతేజము, ధరియించిననీకు మ్రొక్కెదను నే ద్యుమణీ! 92

క. జగముల కుపకారంబుగఁ, దగుతఱి నుదయించుచున్న తావకవిలస
న్నిగమమయతీవ్రమూర్తికి, గగనమణికి మ్రొక్కెద న్ప్రకాశితభక్తిన్. 93

క. ఘనవర్షార్థము రసమోచనముం జేయుచును సకలజగమున కాప్యా
యనకర మగురూపము గల,ఘనాత్ముఁ డగునీకు వినతి గావింతు రవీ! 94

మ. అని యద్దేవి నిరంతరంబును నిరాహారత్వముం బూని కీ
ర్తనముం జేయుచు భక్తితోడఁ దను నారాధింప నయ్యుగ్రద

ర్భనుఁ దుష్టాంశుఁడు పెద్దకాలమునకుం బ్రత్యక్షమై నిల్చె న
వ్వనితారత్నముముందర న్వితతభాస్వద్దీధితు ల్పర్వఁగన్. 95

సీ. నిలిచినఁ గనుఁగొని నిర్జరజనని భయం బంది దేవ! నభంబునందు
వెలుఁ గొందుచున్నని న్వీక్షింప నాకు శక్యము గానిమాడ్కి భూగతుఁడ వైనఁ
గానఁ జాలక యున్న దానఁ బ్రసన్నుఁడ వగుచు భవద్రూప మస్మదీయ
లోచనమ్ముల కిట్టు గోచరమ్ముగఁ జేయుఁ మఱిదయ ననుఁ జూడు మధికభక్తి
తే. భరిత సైననాతనయులఁ బ్రమదలీలఁ, గావు మఖిలలోకంబులు గలుగఁ జేయ
వాని రక్షింప నడఁగింప వలఁతి వీవ, కాని నీకంటె నన్యుండు గలుగఁ డెందు. 96

తే. బ్రహ్మకేశవరుద్రరూపములు నీవ, యింద్రపావక యమజలధీశపవన
ధనదరూపము నీవ చంద్రధరమేది,నీంద్ర భూవార్థిరూపము లీవె తరణి. 97

క. యోగములను సతతాంత, ర్యాగములను నిను భజింతు రవనిసుపర్వ
ల్యోగులు త్రిదివాక్షయసుఖ, భోగంబులకై సమస్తభువనస్తుత్యా! 98

సూర్యుఁ డదితికిఁ బ్రసన్నుఁడై వర మిచ్చుట.

చ. అని వినుతించిన న్దపనుఁ డాపటుతేజముఁ బాసి తప్తతా
మ్రనిభవిభాతిభూతి దనరంగఁ బ్రసన్నత నొంది పల్మఱు
న్దన కభివందనంబు ప్రమదంబునఁ జేయునిలింపమాతఁ గ
న్గొని భవదంతరంగమునఁ గోరిక యెయ్యది సెప్పు మేర్పడన్. 99

ఆ. అనిన నదితి జాను లవనీతలంబున, మోపి శిరము వాల్చి మ్రొక్కి దేవ!
యవధరింపుము మస్మదాత్మజు ల్గడు బలవంతు లైనదైత్యవరులచేత. 100

వ. త్రిలోకరాజ్యంబును యజ్ఞభాగంబులుం గోల్పడి దీను లై యున్నవారు గావునం బ్రసన్నుండ వై నీవంశంబునం దద్భ్రాతృత్వం బంగీకరించి నాకు జన్మించి దైత్యదానవనాశం బాపాదించి నానందనులకుం ద్రిలోకాధిపత్యంబును గ్రతుభాగభోక్తృత్వంబును బ్రసాదింపు మనినం బ్రభాకరుండు గరుణించి యద్దేవికి నవ్వరం బిచ్చి యంతర్ధానగతుం డయ్యె నదితియుం దపోనివృత్త యయ్యె నంత. 101

తే. సూర్యకరసహస్రములో సుషుమ్న యనఁగ, నెగడు రశ్మి నిలింపజనిత్రియుదర
మునఁ బ్రవేశించె దాని నమ్ముదితఁ దాల్చెఁ, గృచ్ఛ్రచాంద్రాయణాదికక్లేశనియతి. 102

మార్తాండునియావిర్భావము-తద్దర్శనమున దైత్యదానవులు భస్మ మగుటయు.

వ. ఇట్లు నిత్యోపవాసవ్రతపరాయణ యై దివ్యగర్భధారిణి యైనయదితి నాలోకించి కోపించి కశ్యపుఁ డిట్లనియె. 103

సీ. ఏల యీగర్భాండ మిట్లు మారణ మొందఁ జేసెదు నిత్యోపవాసవృత్తి
ననపుడు నద్దేవి యలుఁగకు మిది మారితము గాదు చూడు మద్దామశత్రు
సంక్షయకారి యై జన్మించు నని పల్కి పలిమాటఁ గోపంబు పట్ట లేక
యప్పుడ యద్దేవతారణి జాజ్వల్యమాన తేజోరూప మైనయండ
తే. మూఁడి పడఁ జేసెఁ గశ్యపుఁ డుద్యదర్క, ధామనిభ మై వెలింగెడుదానిఁ గాంచి
మ్రొక్కి ఋగ్వేదమంత్ర సమాక్రమమున, నభినుతింపఁగ నంత నయ్యండ మనఘ!

ఆ. ప్రకటదివ్యమూర్తి పద్మపత్త్రద్యుతి, స్ఫురితవర్ణుఁ డైనపురుషుఁ డయ్యెఁ
దేజమున సమస్తదిశలు వెలుంగఁగ, నపుడు దివ్యవాణి యంబరమున. 105

వ. నిలిచి మేఘగంభీరస్వనంబునం గశ్యపు నుద్దేశించి మహాత్మా! నీ వదితితోడ నీయండం
బేల మారితంబు గావించెద వని పలికి తని కారణంబుగా నీపుత్త్రుండు మార్తాండుం
డనునామంబునం బరఁగు సూర్యాధికారంబును జేయు శత్రుక్షయంబును గావించు
నని చెప్పిన నశరీరిణివచనంబులు విని. 106

స్రగ్ధర. ఆనందం బంతరంగం బయి మనముల నిండార నింద్రాదిదివ్యుల్
నానాసైన్యస్ఫురద్దానవుల ననికి సన్నద్ధు లై పిల్చి రా దై
త్యానీకంబు న్మహోత్సాహమున వెడలె దేవాసురశ్రేణి కయ్యం
దా నంతం గయ్యె ముద్యత్స్ఫుటతరశరజాతప్రథ ల్మింటఁ బర్వన్. 107

క. ఆతుములరణాంతరమున, నాతతమార్తాండతనుభవైకమరీచి
వ్రాతహతిఁ జేసి భస్మీ, భూతు లయిరి దైత్యదనుజపుంగవు లెల్లన్. 108

శా. ఆమార్తాండు సమస్తదైత్యదనుజవ్యాపాదనప్రౌఢుఁ దీ
వ్రామేయారుణదేహదీప్తివిసరవ్యాప్తాఖిలాశాంతు సం
గ్రామోద్యద్విజయాభిరాము బహుమాంగళ్యప్రదుఁ ఋగ్యజు
స్సామాలంకరణోజ్జ్వలు న్దినమణి న్సద్భక్తచూడామణిన్. 109

క. ముదమునఁ గీర్తించుచు న, య్యదితిం గొనియాడుచుం బ్రియం బెలరారం
ద్రిదశులు గైకొని రొగిఁ దమ, పదములఁ గ్రతుభాగములఁ బ్రభాకరుకరుణన్.

చ. అతులకదంబపుష్పసదృశాంశులు గ్రిందను మీఁదఁ బర్వఁగా
హుతవహచారుపిండతులితోజ్జ్వల మైన యవిస్ఫుటాకృతి
న్నతదళబాంధవుండు గగనంబున నుండి నిజాధికార ము
న్నతి నొనరించె లోకము లనారతము న్దను భక్తిఁ గొల్వఁగన్. 111

కురుదేశమునఁ దపనతాపిత యై సంజ్ఞ బడబారూపమునఁ దపము చేయుట.

వ. అంత విశ్వకర్మ ప్రజాపతి తనకూఁతు సంజ్ఞ యనుకన్యక నావివస్వంతునకుం బ్రణయుం
డై ప్రార్థించి పత్నిం గావించె నద్దేవికి వైవస్వతమనువును యముండును యమున
యుం బ్రభవించి రాసంజ్ఞకథావృత్తాంతం బంతయు మున్న యేను నీకుం జెప్పితి
విను మట్లు పితృసదనంబునకు సంజ్ఞ చనుటయు ఛాయావధూటివలన నెఱింగి మార్తాం
డుండు రోషంబున మండుచు మామయింటికిం జనిన నతండు నతని నభ్యర్చించి సాం
త్వనవచనంబుల ననునయించి యి ట్లనియె. 112

ఉ. కోపము సంహరింపు విను గోపతి! నీపటుతేజ మోర్వఁగా
నోపక పోయి పేరడవి నున్నది సంజ్ఞ మనోహరోల్లస
ద్రూపము దాల్చి నీవు తనుఁ దోకొని పోవుట గోరి ఘోరని
ష్ఠాపరతంత్ర యై తగిలి సంతతముం దప మాచరించుచున్. 113

క. తతధృతివాక్యంబును నా,మతమును నీ కించు కేని మానుగ విను దీ
పిత మగునీరూపము శో,భితమును శాంతంబు గాఁగఁ బ్రీతి నొనర్తున్. 114

విశ్వకర్మ సూర్యతేజము నల్పము చేయుట.

తే. అనిన నొడఁబడి వెలుఁగుఱేఁ డట్ల సేయుఁ, మని యనుజ్ఞ యిచ్చుటయును నాక్షణంబ
విశ్వకర్మ శాకాహ్వయద్వీపమునకుఁ, జని దినాధీశ్వరునిఁ జక్రమున నమర్చి. 115

క. అతిరయమునఁ దిరుగునహ,ర్పతితేజము దరువఁ దరువ బలవద్భ్రమణో
గ్రత నాకంపించె జగ,త్త్రితయము త్రుటితాంశుపవనతీవ్రత్వమునన్. 116

వ. అప్పుడు. 117

సీ. సకలరత్నాకరశైలాటవులతోన మేదినీచక్రంబు మీఁది కెగసె
నఖిలగ్రహేందుతారాన్వితంబుగ నింగి కూలి యెంతయుఁ సమాకులత నొందె
వనధులు పిండలివండుగాఁ గలఁగి ఘూర్ణిల్లుచు జగ మెల్ల వెల్లి గొనియెఁ
గులధరణీధరమ్ములు సానుబంధముల్వదలి నుగ్గై పడిఁ బుడమిఁ బడియెఁ

తే. జేజరిల్లుధ్రువాధారధిష్ణ్యతతులు, బహుసహస్రసంఖ్యలఁ బరిభ్రామ్యదరుణ
రశ్మిజాలరయంబున రాలఁ దొడఁగెఁ, దునియ లై మేఘపఙ్క్తులు దూలఁ జొచ్చె.

బ్రహ్మాదులు సూర్యుని స్తుతించుట.

వ. ఇవ్విధంబునం ద్రిభువనంబులు ప్రభాకరభ్రమణరయంబున విభ్రాజితం బైన నప్పుడు
భయం బంది బ్రహ్మాదిదేవతలయ్యాదిదేవుని ననేకప్రకారంబుల స్తుతించి రింద్రుండు

జయజయధ్వను లొనరించె వసిష్ఠాత్రిప్రభృతి సప్తఋషులును వాలఖిల్యప్రభృతిమహా
మునులును బహువిధస్తోత్రంబులను ఋగ్యజుర్వేదసూత్రంబులనుం బ్రశంసించిరి సిద్ధ
విద్యాధరగరుడయక్షరాక్షసోరగపతు లంజలిపుటంబులు నిటలంబులం గదియించి
యందంద వందనం బాచరించిరి విఖ్యమానుం డగుమార్తాండుసమీపంబున నుండి
గాంధర్వవిద్యావిశారదు లగుతుంబురునారదాదిగంధర్వులు మధురగీతంబులు విస్త
రించి రప్సరోంగనలును రంగంబుగా లలితనర్తనంబులు ప్రవర్తించిరి వీణావేణుపణవ
శంఖకాహళఘంటాపటహమృదంగాదివాద్యంబులు హృద్యంబులుగా మొరయించి
రి తెఱంగునం గోలాహలంబులై నానానాదంబులై చెలంగుచుండ నద్దివిజవర్గ యెల్ల
నల్లన తేజోవర్ధనుఁ ద్రచ్చుచు నిట్లు స్తుతియింపం దొడంగె. 119

క. వనరుహభవరుద్రజనార్దనవినుతుఁడు కాలకర్తృతామహనీయుం
డును నగునినుతనుతిఖనము, వినునరుఁ డినలోకసౌఖ్యవిభవము నొందున్. 120

వ. అని వెండియుం. 121

చ. కనదరుణాంబుజాతనవకాంతి నుదంచితభూరిచారుకాం
చనరుచిఁ దప్తతామ్రవిలసద్ద్యుతి నూత్నలసత్ప్రవాళదీ
ప్తి నిజతనూద్గతాంశుతతి దిక్కులఁ బర్వ వెలుంగ నొప్పునీ
దినమణికి న్నభోమణికి దేవశిరోమణి కేను మ్రొక్కెదన్. 122

చ. ఘనసిబిడాంధకారరిపుఖండనచండమయూఖరాజిచే
ననుదినము న్ప్రభాతములయం దమృతాంశు మరీచి వేఁడిగా
వనజము లుల్లసిల్లఁగఁ దోవల్ మొగుడ న్ప్రథమాద్రిఁ బొల్చునీ
దినమణికి న్నభోమణికి దేవశిరోమణి కేను మ్రొక్కెదన్. 123

చ. అనుపమవేగసప్తహయసముదంచితవాహనవాహ్యమానకాం
చనరథచక్రసంకషణచారుసుమేరునగేంద్రసానుసం
జనితసువర్ణరేణుచయసంతతభూషితదీప్తి యైన యీ
దినమణికి న్నభోమణికి దేవశిరోమణి కేను మ్రొక్కెదన్. 124

వ. అని మఱియును. 125

చ. దినకర! యుష్మదీయతనుతేజము ద్రచ్చెద భక్తి నీకు వం
దన మొనరించుచు న్బహువిధంబుల నిన్ను నుతించుచు న్దయ
న్నను శుభదృష్టిఁ జూడుము సనాతన! కారుణికాగ్రగణ్య! య
త్యనుపమపుణ్య! సర్వనిగమాత్మక! నన్ను ననుగ్రహింపుమీ. 126

చెక్కినసూర్యుని తేజముచే శూలాదులు నిర్మించుటయు - నాసత్య రేవంతులు పుట్టుటయు.

వ. అని బహువిధంబులఁ బ్రస్తుతించి విశ్వకర్మప్రజాపతి ప్రభాకరు తేజం బతనిమండలం
బున షోడశాంశంబు దక్కం బదియేను భాగంబులు వోవం ద్రచ్చి యాతేజఃఖండం
బుల విష్ణునికి సుదర్శనంబును జంద్రమౌళికి శూలంబును గుబేరునకు శిబికయుఁ గాలు
నకు దండంబును సేనానికి శక్తియు దేవగణంబుల కనేకాయుధంబులును గావించె
నంత. 127

ఉ. ఆతతవేదమూర్తి యగునాదిననాయకుఁ డట్లు మామచే
శాతితతేజుఁ డై కుసుమసాయకసన్నిభసౌకుమార్యము
న్ఖ్యాతిగఁ దాల్చి యాత్మసతిపాలికి నేఁగెఁ దురంగరూపముం
బ్రీతి ధరించి వారి కనపేతగుణుల్జనియించి రశ్వినుల్. 128

వ. సంభోగసమయాంతరంబున రేవంతుండు జనియించె నంత నిజరూపవంతుం డై కాం
తాసహితంబుగ గగనంబునకుం జని పూర్వప్రకారంబునం బ్రవర్తిల్లుచుండ ఛాయా
తనయుం డగుసావర్ణి యష్టమమనుత్వంబు గోరి మేరునగరంబున నిప్పుడు దపంబు సే
యుచున్నవాఁ డని చెప్పి మార్కండేయుండు. 129

తే. సవితృసంతతిజన్మంబు చరితమును మహాత్ముఁ డైనయాసవితృమహత్త్వమును బ
ఠించినను విన్న మనుజుల కందితోరు,యశము చేకురు నాపద లడఁగి పోవు. 130

క. ఇనునిమహత్త్వము వినిన, జ్జనుల కహోరాత్రకృతవిషమకిల్బిషము
ల్మునివర! శాంతిం బొందును, ఘనరుజలు సదౌషధమునఁ గ్రాఁగువిధమునన్. 131

రాజ్యవర్ధనరాజచరిత్రము.

మ. అనినం గ్రోష్టుకి సంతసిల్లి మునివర్యా! సూర్యజన్మంబు పెం
పును దత్సంతతిసంభవంబును భవత్పుణ్యోక్తుల న్వింటి నిం
కను గౌతూహల మయ్యెడు న్వినఁ ద్రిలోకస్తుత్యుఁ డైనట్టియ
ర్కునిమాహాత్మ్యముఁ జెప్పవే మధురవాక్పూర్ణామృతం బారఁగన్. 132

వ. అనిన భృగువంశ్యవర్యుం డి ట్లనియె. 133

తే. యమునితనయుండు లోకవిఖ్యాతయశుఁడు రాజ్యవర్ధనుఁ డనియెడురాజు ధర్మ
పరతఁ జేకొని పాలించె ధరణితలము వివిధదానాధ్వరక్రియాప్రవణుఁ డగుచు.

వ. అమ్మహీపతిరాజ్యంబునం బ్రజ లాధివ్యాధులం బొందక క్షామడాంబరబాధలం జెం
దక ధనధాన్యాదిసమస్తసంపదం బొంపిరివోవుచు నంతంతకు వర్ధిల్లుచుండి రంత.135

సీ. అతఁడు విధూరథుం డనుమహీపతిసుత శుభలక్షణాన్విత సుందరాంగి
మానిని యను పేరిమానిని వరియించి యయ్యింతియందు బద్ధానురాగుఁ

దైశల నైనను నన్యకాంతలఁ గోర శాస్త్రధర్మములకు హాని గాని
క్రమమున వివిధసౌఖ్యము లొందుచుండఁగ సప్తసహస్రవర్షము లొక్క
ఆ. దినము చనినభంగిఁ జనుటయు నొకనాఁడు, పౌరజానపదులు భూరమణులు
సచివవరులు నాప్తజనులును దగువారు, నర్థిఁ గొలువ నున్నయవసరమున. 136

ఆ. మానినీవధూటి మగని కభ్యంగము, చేయువేళ నశ్రుశీకరంబు
లతనిమేన నించె నతఁ డిది యేమి యో, యనుచు మగిడి యాలతాంగిఁ జూచి.

మానినీరాజ్యవర్ధన సంవాదము.

క. పొలఁతి! యిది యేమి కావుడు, బలుకక యతఁ డెన్నియేని భంగుల మఱియు
న్నలుమాఱు నడుగ నాతని, తల నొకనర యున్నఁ జూపి తరలాక్షి యనున్. 138

చ. నరవర! నీదుమస్తకమున న్నర దోఁచిన దింతకంటె నా
కరయ విషాదహేతు వగునట్టిది యెయ్యది? యంచు బాష్పము
ల్దొరఁగఁగ గద్గదం బడర దుఃఖిత యైనలతాంగిఁ జూచి తా
దరహసితాననుం డయి ముదంబున నమ్మనుజేంద్రుఁ డిట్లనున్. 139

క. పౌరులు భూమిజనులు ధా, త్రీరమణులు బలసి యుండ ధృతి దొలఁగి వగం
గూరి కనునీరు నింపఁగ, నీరజదళనేత్ర! తగునె నీపెంపునకున్. 140

ఆ. సకలజంతువులకు జన్మవర్ధనపరిణామగుణచయంబు సైజ మగుట
యెఱిఁగి యెఱిఁగి యింత యేటికి శోకింప?, విను లతాంగి! నాదువిధము దెలియ.

సీ. చదివితి వేదముల్ శస్త్రాస్త్రవిద్యల నారూఢిఁ బొందితి నాహవమున
వైరుల నోర్చితి వసుధ నిర్వక్రంబు గాఁగఁ బాలించితిఁ గ్రతువు లెన్ని
యేని యొనర్చితి నీప్సితార్థంబులఁ బరితుష్టిఁ జేసితి బ్రాహ్మణులకు
మానిని! నీతో నమానుషభోగంబు లనుభవించితి నెయ్య మతిశయిల్ల
తే. సకలపురుషార్థములు నాకు సంభవించె, నింక ముదిమికి శంకింప నేల చెపుమ?
వలులు పలితంబులును బెక్కు గలుగుఁ గాత, వాని కుచితంపువిధ మిప్పుడే యొనర్తు.

వ. బాల్యకౌమారయౌవనవార్ధకావస్థలం దత్తదుచితప్రవృత్తిం బ్రవర్తించుట యుత్తమ
క్షత్త్రియులకు విధివిహితకృత్యంబు మత్పూర్వులు నిట్ల వర్తించిరి యిప్పుడు నామ
నంబు తపంబున కౌత్సుక్యం బొందుచున్నయది యిప్పలితాంకురదర్శనంబును నాకు
నభ్యుదయకారణం బయ్యె నీ వింక నొవ్వఁగ దక్కుమని యక్కాంతారత్నంబు
నూఱడించుచున్న యన్నరపతివచనములు విని సచివులు పౌరులు శోకాక్రాంతస్వాంతు
లగుచు నమ్మహీకాంతున కిట్లనిరి. 143

రాజ్యవర్ధనభూపతికిఁ బౌరులకును సంవాదము.

సీ. ఆరయ దేవికిఁ గారణం బేమి యీవగపు మాయది గాక వసుమతీశ!
విపినంబునకుఁ దపోవృత్తి నీ వరిగినఁ బైన సర్వక్రియాహాని గాదె?
యేసువేలేఁడులు నిల యేలి వడసిన సుకృత మిప్పుడు విడఁ జూడఁ దగునె?
ప్రజలఁ బాలించుధర్మ ముపదాఱవపాలుఁ బోలునే వని సేయఁ బోవుతపము!
తే. నింతయును నాత్మనూహించి యాతపంబు,మాను మని యందఱును బలుమాఱు ప్రార్థ
నంబు సేయుండు నానరనాథవరుఁడు, గారవంబున వారలఁ గలయఁ జూచి. 144

ఉ. ఏలితి లీల నీవసుధ నింతయు సప్తసహస్ర వర్షము
లోలిఁగ సత్క్షాత్త్రమునఁ బుత్త్రులఁ గాంచితి నెల్లవారలు
న్నేలన మంటి నింక నిటమీఁదటఁ బొందుతపోనివాసము
న్నోలునె కాలపాకమున బుద్ధియె యీరక యుంకి యేటికిన్?. 145

క. జనులార! మచ్ఛరంబున, జనియించిన యీపలితము సమవర్తికిఁ గ
ట్టనుఁ గైనదూత గా మదిఁ, గనుఁగొనుఁ దప్పగుట నిజము గాదె తలంపన్. 146

ఉ. కావున నైహికం బగుసుఖంబుఁ దొఱంగి తనూజు రాజ్యల
క్ష్మీవిభుఁ గాఁగఁ బ్రీతి నభిషిక్తుని జేసి ప్రబుద్ధబుద్ధి నై
యే విపినాంతరంబునకు నేఁగి కృతాంతునిదూత లెప్డు నా
పై వడి వత్తు రంతకుఁ దపం బొనరించెద నప్రమత్తతన్. 147

మ. అని దైవజ్ఞులఁ జూచి పుత్త్రకుని రాజ్యశ్రీవిభుం జేయఁగా
దినలగ్నంబులు చెప్పుఁ డన్నవిని ధాత్రీనాథునుద్యోగ మె
ల్లను దెల్లంబుగ వారెఱింగి వగ లుల్లమ్ముల్ గలంపంగ నే
మనియుం జెప్పఁగ నేర కప్పుడు సముద్యద్బాష్పదీనాస్యులై. 148

వ. అమ్మహీపతి నవలోకించి. 149

క. జనవల్లభ! నీవాక్యము, విని మాహృదయములు శోకవికలము లగుట
న్దినలగ్నస్థితి దోఁపద, యని పలికిన నచట నున్నయఖిలజనంబుల్. 150

ఆ. ఏకవాక్యముగ ననేకవిధమ్ములఁ, బ్రార్థనమ్ము చేసి రమ్మహీశుఁ
డచలితప్రయత్నుఁ డగుట గనుంగొని, యేమి సేయువార మింక ననుచు. 151

రాజ్యవర్ధనునియాయుర్వృద్ధికై పౌరులుసూర్యునారాధించుట.

వ. అన్నరేంద్రచంద్రునిమీఁదియమందప్రీతి నందఱుం బెద్దయుం బ్రొద్దు విచారించి యత్యంతనియతి భాస్వంతు నారాధించి యమ్మహీకాంతు నధికాయుష్మంతునిం గావింతమని నిశ్చయించి యద్దినాథు నుద్దేశించి. 152

సీ. వేదసూక్తముల వినుతించువారును మౌనవ్రతంబులు పూనువారు
పుష్పగంధములఁ బూజించువారును విధివిహితంబుగ వేల్చువారు
జలమధ్యముల జపములు సేయువారలు నుపవాసనియతిపై నుండువారు
నవిరతధ్యానపరాయణు లగువారు నుచితోపహారంబు లొసఁగువారు
ఆ. నై సమస్తజనులు నన్యోన్యవిధంబుల నధికభక్తియుక్తి ననుదినంబుఁ
దపనుఁ గొల్వఁ దా నుదాముఁ డన్గంధర్వుఁ, డేఁగుదెంచి వారి కిట్టు లనియె. 153
క. నరులార! కమలమిత్రుని, వరదుం గాఁ గోరి కొల్వ వలతుర యేని
శ్వర వే నిద యొకటిఁ గింతెదఁ, బరమహితముఁ గోరి యొల్ల ఫలంగులఁ జెలియన్. 154
వ. ఆగురువిశాలం బను నామంబునం బ్రసిద్ధం బైనవనంబు సిద్ధనిషేవితం బగుచు నుల్ల
సిల్లునవ్వనంబునం గామరూపం బనుమహాపర్వతంబు గల దందుఁ జని భానుని నారా
ధించిన మనోరథంబు సఫలం బగు ననుటయు వార లట్లు కాక యని యచటి కరిగి
భాస్కరాయతనంబుఁ గని తత్సమీపంబునం దప్రమత్తులు నియతాహారులు నై
యక్షతపుష్పగంధధూపదీపాద్యుపచారములను జపహోమాన్నహోమంబులను వివ
స్వంతు నారాధించుచు నిట్లని స్తుతియించిరి. 155

బ్రాహ్మణబృందము సూర్యుని స్తుతించుట.

సీ. ఆదిత్యు సూర్యుని నర్యముఁ బూషు స్వభాను దివాకరు భాను సవితృ
నక్షరుఁ బరముఁ సితాసితవర్ణుని భాస్కరు దుష్ప్రేక్ష్యుఁ బంకజాప్తు
రవిఁ బ్రళయాంతకు రక్తపీతుని దీప్తదీధితి నవితర్క్యు దీర్ఘరూపు
యాజ్ఞాగ్నిహోత్రవేదావస్థితుని యోగి నిత్యు ననంతుని నిగమవేద్యు
తే. నాద్యు మిత్రుని నఖిలలోకైకరక్షు, వ్యక్తు గుణయుక్తుఁ బరమదయానురక్తు
శాంతు నిన్నుఁ బ్రభాకరు శరణు వేఁడి, సంతతము నినుఁ గొల్తుమే మనంతభక్తి. 156
క. సురదనుజఖచరకిన్నర, గరుడోరగసిద్ధతారకాగ్రహములయుం
దరయంగ నధికతేజ, స్స్ఫురితుం డగుదేవు శరణుఁ జొచ్చెద మర్థిన్. 157
తే. గగనమునుండి నిజమయూఖములఁ జేసి, యవనితలమును దిశలును నంతరిక్ష
మును వెలింగించుచును వ్యాప్తమూర్తిఁ దాల్చి, పరగుదేవుని గొలుతుము శరణు వేఁడి.
ఆ. అరయ బ్రహ్మ యన మహాదేవుఁ డన విష్ణుఁ, డనఁ బ్రజాపతి యన ననిలుఁ డనఁగ
నంబరం బనంగ నమరుఁ దా నే దేవుఁ, డట్టిభానుఁ గొల్తు మర్థితోడ. 159
తే. అని యనేకవిధంబుల నఖిలజనులు, ప్రస్తుతించుచు నిశ్చలభక్తిపరత
ననుదినంబును గొలువంగ నాత్మ మెచ్చి, మూఁడు నెలలకు వరదుఁ డై వేఁడివెలుఁగు.
చ. అమితనిజాంగకాంతి వియదంతర మంతయుఁ గప్ప నాత్మబిం
బముదెసనుండి సౌమ్య మగుభావము గైకొని వారియగ్రభా

గమునకు వచ్చి నిల్చుటయు గాత్రములం బులకాంకురంబు నే
త్రములఁ బ్రమోదబాష్పములదండడి గ్రందుకొనంగ నందఱున్. 161

వ. భక్తినమ్రు లగుచు నమ్మార్తాండునికి నందఱు నమస్కరించి ముకుళితాంజలులైనం
జూచి యద్దేవుండు. 162

ఆదిత్యునివలనఁ బౌరజను లిష్టార్థములఁ బడయుట.

క. నావలన మీకు నిందఱు, కేవరములు వడయఁగా నభీష్టము చెపుఁడా
నావుడు సజ్జనులు ప్రమోదావిష్టమనస్కు లగుచు నందఱు భక్తిన్. 163

వ. మస్తకన్యస్తహస్తు లగుచు నిట్లనిరి. 164

క. ముదియక సంతతవిజయా,స్పదుఁడై సుఖలీల నీప్రసాదమున భువిం
బదివేలవత్సరంబులు, బ్రదుకంగా వలయు మానృపాలుఁడు తరణీ!. 165

చ. అనవుడు నవ్వరం బొసఁగి యంబుజమిత్రుఁ డదృశ్యుఁడైన న
జ్జనులు మనంబు లుత్సవరసంబునఁ దేలఁగ నేఁగి మానినీ
వనితయుఁ దాను నున్నజనవల్లభునిం దగఁ గాంచి తారు వో
యినవిధము న్రవిం గొలిచి యిష్టవరోన్నతి గన్నచందమున్. 166

క. మానుగఁ జెప్పిన విని య, మ్మానిని యానంద మొందె మానవనాథుం
డాననము వంచి యొకపడిఁ, దా నూరక పలుక కుండెఁ దద్దనయుఁ జింతన్. 167

రాజ్యవర్ధనునికి మానినికి నాయుర్వృద్ధినిమిత్తముగు సంవాదము.

క. చింతాక్రాంతుం డగునృప, కాంతున కత్యంత యేమి కారణ మధిపా!
సంతోషవేళ వికల, స్వాంతుఁడ వై యిట్టు లున్నవాఁడ? వనుటయున్. 168

సీ. మానవనాథుఁ డమ్మానిని వీక్షించి యక్కటా! వీర లాయాస మంది
యినుఁ బ్రసన్నుని జేసి యిది యేమి వేఁడిరి పదివేలువర్షము ల్బ్రదికి యుండి
మిత్రబాంధవపుత్రపౌత్రకళత్రాదు లందఱు దివమున కరుగఁ జూచి
యే నతిదీనత నేకాకినై మను మనికియుఁ దా నొకమనికి యగునె?

తే. యిట్టిజీవన మిది గాల్పనే యనేక,దుఃఖములె కాక యిందు సంతోష మెద్ది?
యింతయును నాత్మ నరయక యింతి? నీవు, మేలు మే లని పల్కెదు బేల వగుచు.

తే. అనిన నద్దేవి యనియె మీయానతిచ్చి, నట్టు లంతయు నిజము హార్దాబ్ధిఁ దేలి
యరయ కంటి దివాకరువరము దప్పు, డింక నిటమీఁదఁ గర్తవ్య మేమి చెపుమ. 170

వ. అనిన నమ్మహీవల్లభుండు వల్లభ కిట్లనియె. 171

క. పౌరులు భృత్యులు నా కుప, కారం బొనరించి యుండఁగా నక్కట! నే
వారలకు మే లొనర్పక, యూరక భోగములఁ దగిలి యుండం దగునే? 172

సీ. కావున నిప్పుడ కదలి యే నమ్మహీధరమున కరిగి యత్యంతభక్తి
భానునిగుఱించి తపం బాచరింపఁగ నతఁడు ప్రసన్నుఁడై యరుగుదెంచి
మానిని! నీకును మనభృత్యతతికిఁ బౌరులకును బుత్త్రపౌత్త్రులకుఁ గూడఁ
బదివేలువర్షము ల్బ్రదుకంగ వరము నా కిచ్చినయట్టుల నిచ్చె నేని
ఆ. యింపు సొంపు మిగుల నిందఱతోఁ గూడ, నఖిలరాజ్యసుఖము లనుభవింతు
నట్లు గాక యున్ననచ్చోన నిలిచి యత్యుగ్రకిరణుఁ గొల్తు నుగ్రనియతి. 173

భాస్కరు నారాధించి రాజ్యవర్ధనుఁడు తనజనులను దీర్ఘాయుష్మంతులఁ జేయుట.

చ. అన విని యింతి! నీ వరుగ నక్కట! యిక్కడ నేను నిల్తునే?
యనుచు ధరాధినాథుఁడు ప్రియం దగఁ దోడ్కొని వేడ్క నత్తపో
వనమున కేఁగి యందు దినవల్లభు వేసమయాత్మ నిత్య నా
త్మ నిలిపి భక్తియుక్తి సతతంబు తపం బొనరించు చుండఁగన్. 174

ఉ. మానవతీవరేణ్య యగుమానినియుం బ్రియుతోడ నెందును
న్యానకు సంచలింపక దివాకరునంద మనంబు నిల్పి త
ద్ధ్యానపరాయణత్వమునఁ దాను దపం బొనరించె నాత్మలో
నూనినభక్తిసంతతము నన్నతిఁ బొందఁగ మేను డయ్యఁగన్. 175

క. భూరమణుఁడు సతియుం నిరాహారు లగుచు నిట్లు సార్ధహాయనము మహా
ఘోర మగుతప మొనర్చిన, వారికిఁ బ్రత్యక్ష మై దివాకరుఁడు దయన్. 176

క. కర మెలమిఁ గోరినట్టుల, వరము ప్రసాదించి చనిన వనితయుఁ బతియు
న్బరమానందముఁ బొందుచు, నఁగిరి తనపురికి భూసురాన్వయముఖ్యా! 177

మ. చని యాభూపతి తాను భార్యయుఁ బ్రజాసందోహము న్బుత్త్రపౌ
త్త్రనికాయంబును బంధువర్గము నమాత్యశ్రేణియు న్నిత్యశో
భనలీల న్విగతామయత్వము జరాభారవ్యపేతక్రమం
బును నొప్ప న్బదివేలువర్షములు పెంపుం బొంది పాల్చెం గడున్. 178

మ. క్రతువు ల్సేయుచు విప్రవర్గముఁ గృతార్థత్వంబునొందించుచు
న్బ్రతిపక్షావళి నోర్చుచు న్సుకృతము ల్సాధించుచు న్మానినీ
సతియుం దాను నసూనయోగవిలసత్సౌఖ్యంబుల న్బొందుచు
న్క్షితి యేలెం దగ రాజ్యవర్ధననృపశ్రేష్ఠుండు సద్వృత్తుఁడై. 179

వ. అమ్మహీపతిచరిత్రంబు సమస్తంబు సవిస్తరంబుగా విని భృగువంశవరేణ్యుం డగు
ప్రమతి విస్మయావిష్టహృదయుం డై యి ట్లనియె. 180

తే. ఇనునిమహిమసొం పిటు లుండు నే? తలంప, నధికభక్తిమై నమ్మహాత్ముఁ గొలిచి
యాయురారోగ్యసత్త్వమహత్త్వరాజ్య, వర్ధనుం డయ్యె నారాజ్యవర్ధనుండు. 181

వ. అని కొనియాడె నని చెప్పి మఱియు మార్కండేయుండు. 182

ఆ. ఆదిదేవుఁ డైనయాదిత్యుమాహాత్మ్య, మెవ్వ రధికభక్తి యొసఁగ విందు
రట్టియుత్తములకు నాయురారోగ్యాది, సకలకామములును సంభవించు. 183

వైవస్వతమనుసంతతికథనప్రారంభము.

వ. ఈదృగ్విధప్రభావుం డగువిభాకరునకు సర్వార్థప్రదర్శనుం డైనవైవస్వతుండు సప్తమ
మను వై జన్మించె నతనికిఁ బుత్త్రు లిక్ష్వాకుండును నరిష్యంతుండును గరూషుండును
పృషధ్రుండును నాభాగుండును ధృష్టుండు నను వార లావిర్భవించి శస్త్రాస్త్రపార
గులును వివిధవిద్యావిశారదులును బలపరాక్రమవంతులును వినిర్మలస్వాంతులును
దిగ్భరితకీర్తులును సౌమ్యమూర్తులును బ్రత్యేకరాజ్యరక్షాదక్షులును వినిర్జితప్రతిపక్షు
లును ననం జాలి యుల్లసిల్లి రమ్మనువు వెండియు సుగుణసుందరుం డగునందనుం
బడయం దలంచి మిత్త్రావరుణుల నుద్దేశించి యొక్కయధ్వరం బాచరించిన నందు
హోతృక్రియావైకల్యంబునం జేసి యిలాభిధాన యొక్కకన్య ప్రభవించినం జూచి
యతండు మిత్త్రావరుణులం దలంచి ప్రస్తవపూర్వకంబుగా నిట్లనియె. 184

మ. కడుభక్తిన్ మిముఁ గొల్చి మీదయఁ ద్రిలోకఖ్యాతు సత్పుత్త్రు నేఁ
బడయం గోరఁగఁ గూఁతు రిప్పు డుదయింపం బాడియే యిప్పు డీ
పడఁతిం బుత్త్రునిఁ జేసి మీ దగుకృపాప్రావీణ్యముం బెంపు నే
ర్పడ నాకోరిక మీఱఁబోవఁగఁ గృతార్థత్వంబు నొందింపరే. 185

వ. అని ప్రార్థించినం బ్రసన్నులై వా రట్లనుగ్రహించిన. 186

క. ఇల యనునభిధానంబునఁ, బొలిచిన యక్కన్య యపుడు పురుషుం డై తా
నిలుఁ డన సుద్యుమ్నుం డన, వెలసె న్ధారుణి ననంతవిశ్రుత మహిమన్. 187

క ఆసుద్యుమ్నుఁడు మృగయా, వ్యాసక్తి నుమేశుఁ డున్నవనమధ్యమునం
దాసవ యెఱుఁగక తిరుగఁగ, నాసురముగ నలిగి రుద్రుఁ డాతనితోడన్. 188

తే. మగువ వై యుండి పడసిన మగతనంబు
మెఱయ నిటు వచ్చినాఁడవే మేలు మేలు
దుర్మదాంధ! యీమద మేల తొంటియట్ల
పొలఁతి వగుమన్న నతఁ డప్డు పొలఁతి యయ్యె. 189

ఉ. ఆయిలయందు సోమసుతుఁ డైనబుధుండు పురూరవు న్గుణ
శ్రీయుతుఁ జక్రవర్తి నధరీకృతభాస్కరతేజుఁ గాంచెఁ దా
నాయిల యశ్వమేధసవనాచరణంబునఁ బుంస్త్వవిస్ఫుర

శ్చాయము దాల్చి విస్మయముగా నిలుచి డై విలసిల్లెఁ గ్రమ్మఱన్. 190

తే. తనయుం డమ్మహీపతికి సుత్పలుండు గయుఁడు
వినతుఁడును నాఁగ మువ్వు రావిర్భవించి
బహువిధాధ్వరకర్తలు బాహువీర్య
యుతులు నైలీలఁ బాలించి రుర్వి యెల్ల. 191

సీ. ఇంతి యై యున్న నాఁ డిలుఁడు గాంచిన సూనుఁడాపురూరవుఁ డంత నరుగుదెంచి
ధర కొంత పంచి యీఁ దగు నాకు నావుడు నవ్వసిష్ఠుండును నట్ల చేయు
మని బుద్ధిగా నొత్తి తనకుఁ జెప్పిన విని యిలుఁ డట్ల కా కని యిచ్చగించి
యఖిలసుఖాస్పదం బగు ప్రతిష్ఠానపురంబున కాతని రాజుఁ జేసి

తే. నందు సుఖలీల నతఁడు రాజ్యంబు సేయుచుండె ననఘ! యయ్యిలుని సముద్భవప్ర
కార మిట్టిది యని చెప్పి గారవమున, నమ్మహాముని క్రోష్టుకి కనియె మఱియు. 192

వృషధ్రుని గోవును జంపుటచే శాపము కలుగుట.

క. మనుతనయుండు వృషధ్రుం, డనయము మృగయాభిరక్తి నటవీస్థలిం
జని యందుఁ గలయఁ గ్రుమ్మరి, ఘనాతపనిపీడ్యమానగాత్రుం డగుచున్. 193

క. మృగము దన కొకటి యేని యు, నగపడమింజేసి యార్తి నత్యంతము నొ
వ్వగ మిగుల నొక్కరుండును, మగుడం గా వచ్చి వచ్చి మార్గము త్రోవన్. 194

వ. ఒక్కమునిహోమధేనువుం గని గవయం బనుబుద్ధిఁ జేసి యేసిన బాణహతి గతప్రాణ
యైన దాని నిరీక్షించి తద్రక్షకుం డగుబాభ్రవ్యుం డనుమునికుమారుండు నిజాం
తామర్షకలుషితస్వాంతుండును నారక్తనేత్రుండును బ్రస్వేదపరిషిక్తగాత్రుండును
నై యున్నం జూచి వృషధ్రుం డిట్లనియె. 195

తే. కారణం బేమి యింత యాగ్రహముఁ బొందఁ?
గరుణమైఁ బ్రసన్నుండవు గమ్ము శూద్రుఁ
డైనఁ గాకుండు క్షత్రియుఁ డైన వైశ్యుఁ
డైన నిట్లు తీవ్రక్రోధుఁ డౌనె చెపుమ. 196

తే. పరమపావన మై యొప్పుబ్రాహ్మణాన్వయమున నెట్టులు పుట్టితో యకట! శూద్ర
జాతి వగుదు నీ వనుడు రోషప్రపూర్ణ,మాణమానసుఁ డగుచు నమ్మౌనిసుతుఁడు.

వ. అన్నరేంద్రున కిట్లనియె. 198

తే. గురునిధేనువు వధియించి కొంత లేక, నన్ను శూద్రుఁడ వనుచు బన్నములు పలికి
తట్లు గావున నీవు విద్యాప్రభావ, మడఁగి శూద్రుఁడవే యగు మని శపించె. 199

వ. అట్లు శపియించిన. 200

క. అతఁ డతిరోషోద్ధతుఁడై, ప్రతిశాపం బిచ్చె నంత బాభ్రవ్యుఁడు నా
క్షితిపతిఁ బోఁయింపుదు నని, యతిరోషనుఁ డైన నెఱిఁగి యాక్షణమాత్రన్. 201

వ. తజ్జనకుం డైనయగ్నిశూలిసంయమి యెఱిఁగి యుద్ధేశువును వధించె నేని తనకర్తంబు
నం దాన నిహతుం డయ్యెడు నజ్ఞానంబునం జేసిన నతని మూర్ఖత్వంబు విచారించి
సహించుట లెస్స గావున శాపం బప్రదేయం బని బోధించుచున్న నమ్మహీపాలకుండు
మునిబాలకునకు సవినయంబుగా నిట్లనియె. 202

క. నీగురునిహోమధేనువు, నే గవయం బని తలంచి యేసితిఁ గరుణా
సాగర! కరుణింపుము మది? నేగతి మోసంబు లేద యెవ్వరి కైనన్? 203

సీ. అని యిట్లు నిభృతుఁ డై కూడినవాక్యంబు విని కరుణించి యమ్మునికుమారుఁ
డానరేంద్రునిఁ జూచి యే నెట్లు పలికితి నది యట్లు కాక తప్పదు మహీశ!
యెన్నఁడుఁ గావున నిచ్చినశాపంబు కుదియింప నెమ్మెయిఁ గొలఁది గాదు
కర మల్గి యిప్పు డీ కడఁగినశాపంబు సంహరించితి నని పలికె నంత
తే. నతనిఁ దోడ్కొని మౌని నిజాశ్రమమున
కరిగె శూద్రత్వముం బొంది నానృపసుతుఁ
డనఘు గారూషుఁ డనఁగఁ బ్రఖ్యాతుఁ డైన
మనుతనూభవుఁ డేవ్వరుఁ గనియె సుతుల. 204

కన్యకై నాభాగునకు వైశ్యునకును సంవాదము.

వ. వారలును గారూషు లను పేర నారూఢు లై తత్సంతానంబు శతసహస్రసంఖ్యలం
బ్రవర్తిల్లె మఱియును మనుపుత్త్రుం డైనధృష్టునకు సమాచరితజనానురాగుండు నాభా
గుం డనుతనయుం డుదయించి యాత్మయౌవనోల్లాసభాసమానుండు వివిధవిహారపరా
యణుండు నై చరియించుచు నొక్కనాఁ డొక్కవణిక్కన్య ననన్యసామాన్యరూపా
భిశోభిత యగుదాని నభివీక్షించి తదాసక్తచిత్తుం డై చేతోజాతశరాహతి కోర్వక
యేకాంతంబున నక్కాంతగృహంబునకుం జని తజ్జనకున కి ట్లనియె. 205

తే. చారుతరరూపమహిమఁ బెంపారునీతనూజఁ గనుఁగొని యేను మనోజబాణ
దళితహృదయుండ నైతి సంతసము మిగుల, నత్తలోదరి నాకు నిమ్మనుడు నతఁడు.

తే. ఇల సమస్తంబు నేలురాజులరు మీర,లధిప! యే మరి యప్పన మచ్చి భృత్య
మాత్ర వర్తించు పేదకోమటుల మిట్టి, మనకు సంబంధ మెమ్మెయి నొనరుఁ జెపుమ.

వ. అనిన నాభాగుండు. 208

క. కలవారు పేదవా రనఁ, గలదే భోగముల సరియ కాక తలఁప దే
హుల కెల్ల నేల చెప్పెదు?, వలదని పరిహార మిట్లు వైశ్యవరేణ్యా! 209

సీ. నావుడు వైశ్యుండు నాభాగుఁ గనుఁగొని యేను స్వతంత్రుండనే కుమార!
నీవును నాయట్ల కావున మన కెల్ల నొడయండు మీతండ్రి యున్నవాఁడు
చని యమ్మహారాజు ననుమతి వడసి రమ్మట్లైన సుత నిత్తు ననుడు నాతఁ
డీపని గురునకే నేమని చెప్పుదు మానుము నీవెడమాట లనిన

ఆ. నపుడు నగరి కరిగి యవ్వణిజుండు భూ, విభున కంత తెఱఁగు విన్నవించెఁ
బలియుఁ బుద్ధిఁ జెప్పఁ బనిచె రుచీకాది, భూమిసురుల నంతఁ బుత్త్రుకడకు. 210

తండ్రియానతి నిరాకరించి నాభాగుఁడు కోమటికన్నెం బెండ్లాడుట.

ఉ. ఆయవనీసురుల్ నృపవరాత్మజుపాలికిఁ బోయి క్షత్త్రియ
న్యాయము దప్పి మున్న వణిగన్వయకన్య వరింపఁ గూడునే
ధీయుత! నీవు నీదుమది దీనికిఁ బ్రేమునఁ జేయం జేని భూ
నాయకపుత్త్రిఁ బెండ్లి యయిన న్జను దీనిఁ దగ న్వరింపఁగన్. 211

మ. అని విప్రుల్ దగ నాడిన న్ననలి నేత్రాంతంబులం గెంపు గ
ప్ప నిశాతాసి కరంబున న్వెలుఁగ నాభాగుండు నవ్వైశ్యనం
దన కెంగేలు దెమల్చి యెవ్వఁ డయిన న్దప్పించిన న్వానిఁ జ
య్యన రా నిమ్మిదె యేను రాక్షసవివాహస్ఫూర్తిమై నేఁగెదన్. 212

వ. అని పలికి యవ్వనితామణిం దోడ్కొని చనుటయు. 213

చ. మదగజహస్తలగ్నలతమాడ్కిఁ గుమారునిచే గృహీత యై
నదళితపద్మపత్త్రనయనం జననందనుఁ డాది వైశ్యుఁ డా
త్రిదశకఁ జయ్యనం జని పలెం గని యంతయుఁ జెప్పెఁ జెప్పినం
త దనతురంగమాదిపృతనాతతిఁ బంపె నతం డుదగ్రుఁ డై. 214

చ. పనిచినయబ్బలంబులఁ గృపాణవిదారణమారణక్రియా
ఘనభుజలీలఁ గూల్చుటయు గ్రక్కున నెక్కుడువిక్రమం బెల
ర్ప నిఖిలసైన్య యుక్తుఁ డయి రాజశిఖామణి దాను వీఁక మైఁ
జని నిజనందనుం బొదివి శస్త్రపరంపరఁ గప్పె నుగ్రుఁ డై. 215

ఉ. కప్పిన నస్త్రశస్త్రముల ఖడ్గమునం దునుమాడి పీనుఁగుం
గుప్పలు గాఁ గఁ గండ లొగిఁ గొండలు గా రుధిరంపుటేర్లు గా
నిప్పులు కన్నులం దొరఁగ నిర్భరబాహుపరాక్రమంబు పెం
పొప్పఁగ నక్కుమారవరుఁ డుక్కున సేనలఁ ద్రుంచెఁ ద్రుంచినన్. 216

పరివ్రాజుఁ డనుముని ధృష్టనాభాగుల యుద్ధ ముడిగించుట.

చ. జనకుఁడు పుత్త్రబాహుబలసంపదకు న్వాఁటఁ గంది యుండ న
న్నని యొకరుండు భూవరునిముందటికి న్దివినుండి వచ్చి యి
ట్లనియె నరేంద్ర నీఁ దలిదురాత్ముఁడు కయ్యము నీవు మాను వై
శ్యునితనయ న్వరించినయశోధనుఁ డీతఁడు నీకు యోగ్యుఁడే?

వ. బ్రాహ్మణక్షత్త్రియవైశ్యులు నిజవర్ణంబులకన్నియల మున్ను పరిగ్రహించి మఱి తమ తమనిగుణకులంబులయంగనల వరియించుట శాస్త్రచోదితం బట్లు గాక తొలుత హీన జాతి యగునాఁతిం బెండ్లి యయినయుత్తమవర్ణుం డాహీనజాతి యగుం గావున నిప్పు డింతకు వైశ్యాపరిగ్రహంబునం జేసి వణిజుం డయ్యె శుద్ధక్షత్త్రియుండ వైన నీ కతనితోడియుద్ధం బనర్హం బని యమ్మునివరుం డరుగుటయు. 218

వైశ్యకన్యం బెండ్లాడుటచే నాభాగుఁడు వైశ్యుఁ డగుట.

క. తనయునితో సంగరమున, వినివర్తితుఁ డయ్యె నిట్లు విభుఁ డానృప నం
దనుఁడును గోమటికన్నియ, ననురక్తిం బెండ్లి యయ్యె నంత మునీంద్రా! 219

వ. వణిక్కన్యాస్వీకారంబున వైశ్యత్వంబు నొంది తండ్రికడకుం జని నరేంద్రా! నాకెయ్యది కర్తవ్యంబు నిర్దేశింపు మనిన నిమ్మహీపతి ధర్మాధికరణనియుక్తు లైనబాభ్రవ్యాది మునీంద్రులు నీ కెయ్యది ధర్మంబు గావించి రనియ నాచెప్పుట యనిన నత్తపోధను లతనికిం బాశుపాల్యకృషివాణిజ్యంబులు ధర్మకర్మంబు లని చెప్పి రారాజనందనుండునుం దదుపదేశమార్గంబున వర్తించుచుండె నంత. 220

తే. అతని కుదయించె లోకవిశ్రుతుఁడు శౌర్య, ఖని భనందాఖ్యుఁ డాపుత్త్రు జనని పిలిచి
నీవు గోపాలుఁడవు గమ్ము నెమ్మితోడ, ననినఁ దల్లికిఁ బ్రణమిల్లి యాతఁ డరిగె. 221

నీపుఁ డనురాజర్షి వలన భనందుఁ డస్త్రము లెల్ల నార్జించి చేసిన శత్రువధాదికము.

సీ. హిమనగంబునఁ దపం బెలమిఁ జేసెడునీపురాజర్షి వరుఁ గని ప్రణతుఁ డైన
నతఁడు నీరాకకుఁ గత మేమి యెఱిఁగింపు ధర్మజ్ఞ! యన్న మాతల్లి నన్ను
గోపాలకుండ వైదీపింపు మనవుడు గో వెప్పు డొకొ సమకూరు నాకుఁ
బ్రబలదాయాదులు పాలించుచున్న యీ గోరూప యగుభూమిఁ గొన వశంబె
తే. యని తలఁచి వచ్చితిని నిను నాశ్రయింప, నను నృపాలునిఁ జేయవే మునివరేణ్య!
నుతగుణాకర! కరుణామనోజ్ఞ! నీవు, పనిచినట్ల చేసెద నతిభక్తితోడ. 222

చ. అని యెఱిఁగించిన న్విని దయామతి నమ్ముని యస్త్రవిద్య లె
ల్ల నొసఁగిన న్భనందుఁడు చెలంగుచు నిశ్చలభక్తియుక్తి నా
తనికి నమస్కరించి ప్రమదంబున వీడ్కొని యేఁగి శౌర్యధు
ర్యునిఁ దమపిన్నతండ్రితనయుం వసురాతుని గాంచి యిట్లనున్. 223

క. పితృపైతామహ మగునీ, క్షితి యంతయుఁ జిక్క సగము చెచ్చెర నా కి
మ్మితరునిఁ గా ననుఁ జూడకు, ధృతి నీ వని బిగిసి తేని తెగి రమ్మనికిన్. 224

క. అనవుడు వసురాతుఁడు వై, శ్యునికొడుకవు భూమి యేల యోగ్యుఁడవే నీ?
వనుచుఁ గడు నలిగి సంగర, మునకు వెడలె సకలసైన్యములు తో నసువన్. 225

మ. వసురాతుండు భనందుఁడు న్భుజబలావష్టంభము న్విక్రమో
ల్లసనంబుం జలముం బలంబు రణలీలాస్ఫూర్తియుం జాల నొ
ప్పెసఁగం బోరిరి చూచుఖేచరుల కెం పెక్కంగ దివ్యాస్త్రశ
స్త్రసముద్భూతమహోగ్రదీప్తు లఖిలాశాభిత్తులం బర్వఁగన్. 226

తే. భూరిదివ్యాస్త్రవైభవస్ఫూర్తి మెఱయఁ,గా భనందుఁడు వసురాతుఁ గదనమందు
సానుజుని నోర్చి సకలరాజ్యమును లీలఁ, గొని ముదంబునఁ జని జనకునకు మ్రొక్కి.

క. దాయాదుల నే సమర, న్యాయంబున గెలిచి కొంటి నవనీరాజ్య
శ్రీ యెల్ల దీనిఁ జేకొను, మాయతభుజశౌర్య! యనుడు నతఁ డాత్మజునిన్. 228

చ. కనుఁగొని ప్రీతి ని ట్లనియెఁ గాంత వినంగ భనంద! యిప్పు డే
మనుజవిభుత్వముం దొఱఁగి మానుగ వైశ్యత నొందినాఁడ మ
జ్జనకుని యాజ్ఞఁ జేసి నృపసత్తమ! యట్లును గాక నీవు నీ
యనుజుల నోర్చి కొన్నమహితావనిరాజ్యము నాకు నేటికిన్? 229

నాభాగునితో సుప్రభ చెప్పినతనజనకునిపూర్వజన్మవృత్తాంతము.

క. అనుపతిపలుకులు సుప్రభ, విని నవ్వుచు నతని కనియె విను వైశ్యత్వం
బునఁ బొంద వీవు వైశ్యుని, తనయును గా నేను నివ్విధం బెట్లన్నన్. 230

క. ఘనుఁడు సుదేవుం డనునొక, జనపతి యింతులును దాను సఖుఁ డగుధూమ్రా
శ్వునిసుతుఁడు నలుఁడుతోడం, జనుదేరఁగ లీలఁ గేలి సలిపెడు వేడ్కన్. 231

వ. ఆమ్రవనంబునకుం జని మధుపానమదాయత్తచిత్తులై విహరించుచుండ నన్నలుం
డవ్విపినంబునం దపోవృత్తిఁ జరియించు ప్రమతి యనుమునిభార్యం గనుంగొని. 232

తే. కామరాగాంధచిత్తుఁడై కదిసి బలిమిఁ, బట్టికొనుటయుఁ దలఁకి యాపద్మనయన
యంత కంటకు మొఱి దురాత్మ! యేను, భూసురాంగన నసుదు వాపోవుటయును.

వ. ప్రమతి యయ్యెలుంగు విని కలతెంచి. 234

తే. నలునిచేఁ బట్టువడి మదనాగకరగృ, హీత యగుకల్పలతమాడ్కి నెంతయును భ
యమున నల్లాడుచున్నట్టి యతివఁ గాంచి, కనలి యాసుదేవునకు ని ట్లనియె ననఘ!
సీ. పరదారహరణైకపరుని నిక్కృష్టాత్ము ధరణీశ! దండింపఁ దగదె నీకు ?
ననవుడు నవ్వుచు నతఁ డేను వైశ్యుండ రక్షణక్షముఁ డైన రాజు కడకుఁ
జను మని గేలి చేసినఁ గ్రుద్ధుఁ డై ముని యధిప! నీపలికినయట్ల కరముఁ
గుచ్ఛితం బైనట్టికోమటికులమున జన్మింపు మీ వని శాప మిచ్చి
ఆ. కన్నుఁగడల నశ్రుకణములు రాలంగ, నలునిఁ జూచి యోరి నాదుభార్య
బలిమిఁ బట్టికొనినపాపాత్ముఁడవు గాన, నిమిషమాత్రమునను నీఱు గమ్ము. 236

నలుని శాపాగ్నిదగ్ధుఁ గావించి యాచించుసుదేవునిఁ బ్రమతి రక్షించుట.

వ. అని శపించిన నలుండు నిజశరీరజనితానలంబున భస్మం బగుటయు సుదేవుండు భయంబునం దల్లడిల్లి భార్గవునకుం బ్రణమిల్లి మహాత్మా! మదిరాపానమదాతిరేకంబునం జేసి నాపలికినపలుకు సహింపుము కోపం బుపసంహరింపుము నీయిచ్చినశాపంబు గ్రమ్మఱింపు మని ప్రార్థించిన న మ్మునివరుండు ప్రసన్నుం డై యతని కి ట్లనియె. 237
క. నీ కైననలునితోడన, యాకె మదీయాగ్రరోష మవనీశ్వర! నీ
వేఱిఁడితనమున వచ్చిన, కాఱియ పడ కేల పోవఁగా నగు నీకున్? 238
వ. నావచనంబు తప్ప దవశ్యంబును నీవు వైశ్యుండ వై పుట్టు దాపుట్టువునందు నీకూఁతును క్షత్త్రియుం డెవ్వఁడు బలిమిం బరిగ్రహించు నప్పుడె వైశ్యత్వంబును బాసి శుద్ధక్షత్త్రియుండ వగుదు వని యనుగ్రహించె నదికారణంబుగా సుదేవుండు మజ్జనకుండు వైశ్యుం డై జన్మించె నాజన్మప్రకారం బాకర్ణింపుము. 239

నాభాగునికి సుప్రభ చెప్పినతనపూర్వజన్మవృత్తాంతము.

ఆ. అధిప తొల్లి సురథుఁ డనియెడి రాజర్షి, గంధమాదనమునఁ గరము నెమ్మి
నుండె నియతభోజియును నసంగుండు నై, ప్రీతి దపమునందుఁ బ్రిదుల నీక. 240
వ. అ ట్లుండ నొక్కనాఁడు. 241
ఉ. శ్యేనముఖంబునం బ్రిదిలి చెచ్చెర మేదినిఁ బడ్డశారిక
న్మౌనివరుండు గన్గొని సమగ్రకృపారతిఁ జొక్కి తేఱుచో
నేను దదంగయష్టి జనియించినఁ జూచి మదిం గృపాక్రియా
ధీరుఁడ నైనచో నిది మదీయజనూద్భవ యయ్యెఁ గావునన్. 242
క. ఈరమణి కృపావతి యను, పేరం బరగు నని పలికి ప్రేమముతోడ
న్గారా మారఁగఁ బెనిచిన, నారాజర్షీంద్రుచేత నభివర్ధిత నై. 243

వ. వయోరూపగుణంబుల నాకు సదృశులైనసఖులతోడం గూడి యాడుచు నొక్కనాఁ డగస్త్యమునితనయుం డైనజాతాగస్త్యునాశ్రమంబునకుఁ జని విహరించుచున్నంత. 244

చ. వినుము నరేంద్ర! నాసఖులు వేడ్క విశృంఖలలీల నవ్వన
మ్మున విహరింపఁ జొచ్చినఁ దపోధనసత్తముఁ డాగ్రహించి న
న్ననుఁగొని నీవయస్యలవికారమున న్జనియింపు వైశ్యవై
వనజదళాక్షి నీ వని యవారణ నమ్ముని శాపమిచ్చినన్. 245

వ. కళవళించి యే నమ్మహామునికి నమస్కరించి యంజలి యొనరించి యి ట్లంటి. 246

క. మునివల్లభ! యే నొకయెం, గ్గొనరించినయదియుఁ గలదె యొరు లపరాధం
బొనరించి యుండ నీకుం, జనునే శపియింప నన్ను శాంతిప్రవణా!. 247

వ. అనిన నతం డిట్లనియె. 248

ఆ. పంచగవ్యపూర్ణభాండంబు మధుకణ, స్పర్శనమున నశుచిభావ మొందు
నట్లు దోషరహిత వయ్యును దుష్టసంగతి లతాంగి! దోషకలిత వైతి. 249

వ. అని మఱియును బ్రణత నై యేను బ్రార్థించిన నమ్మునీంద్రుం డడు. 250

సీ. తరుణి! నావచనంబు తప్పదు కోమటిపొలఁతి వై పుట్టుదు పుట్టి రాజ్య
మునకు నైయని నేయఁ దనయుండి నెపుడు నియోగింతు ని న్నపు డొందుఁ జామ్మి
జాతిస్మరత్వంబు క్షత్రియజాతుల రగుదురు నీవు నీమగఁడు నంత
నని నా కనుగ్రహ మొనరించె నామునివరుఁ డివ్విధంబున వైశ్య నైతిఁ
తే. దండ్రియును నేను నవ్వణిక్త్వమును దొఱఁగి,యత్తపోధనులయనుగ్రహమున నిపుడు
క్షత్త్రజాతుల మైతిమి గానఁ బొసె, వైశ్యభావంబు నీకును వసుమతీశ! 251

క. అనిన సతిపలుకు లేర్పడ, విని నాభాగుండు కొడుకు వీక్షించి భవ
జ్జననివచనములు నిజ మ్మై, నను జెప్పెద నీకు విను జనస్తుతచరితా! 252

ఆ. తండ్రియాజ్ఞ నేను దలకొని రాజ్యంబు, విడిచి యిట్లు వైశ్యవృత్తి నున్న
వాఁడ నొల్ల నింక వసుధాధిపత్యంబు, నకును దఱమ కుడుగు నరపరేణ్యా! 253

వ. సకలమహారాజ్యంబును నేను నీ కిచ్చితి నుపభోగింపు మొల్ల నైతి నేని విడిచి పొమ్మనిన నెట్టకేలకు నొడంబడి తండ్రిచేత ననుజ్ఞాతుం డై పూజ్యం బగుసామ్రాజ్యంబు గైకొని దారపరిగ్రహం బొనరించి ధర్మమార్గంబునం బ్రజాపరిపాలనంబుఁ జేయుచు వివిధాధ్వరంబు లాచరించుచుఁ జతురుదధివలయితవసుంధరావలయంబునకుం దానొక్కరుండ యధీశ్వరుం డైన నమ్మహారాజునకు వత్సంధ్రుం డనుపుత్త్రుం డుద్భవించె నవ్వీరుండు విదూరథుం డనురాజుకూఁతు సునంద యనుకన్యం గుణంభుం డనుదను

జాండు పట్టుకొని చనిన నద్దానవుం దెగటార్చి దాని వరియించె ననిన విని క్రోష్టుకి తద్వృత్తాంతం బంతయు నాకెఱింగింపవే యనిన మార్కండేయుండు. 254

విదూరథునితో సువ్రతుఁ డనుముని చెప్పిన కుజంభముసలవృత్తాంతము.

సీ. వినుము విదూరథుం డను పృథివీశుండు సుమతిసునీతులు సుతులు దాను
నడవికి మృగయార్థ మరిగి యం దొక్కెడ ధర నోరు దెఱచినకరణిఁ జూడ
ఘన మైనవివరంబు గని భయం బడరంగ నిది యేమియో యని మదిఁ దలంచి
పాతాళబిలముగా భావించి యాక్రొత్తగహ్వరం బిల నెట్టు గలిగె నొక్కొ!
గీ. యనుచు నన్నరేంద్రుఁ డయ్యెడ సువ్రతుఁ, డనుమునీంద్రుఁ గాంచి యనఘ! పుడమి
కడుపులోఁతు చూపువడువున నిట్లున్న, దీని తెఱఁగు నాకుఁ దెలియఁ జెపుమ. 255

చ. అనిన మునీంద్రుఁ డిట్లను జనాధిప! యిత్తెఱఁ గీ వెఱుంగవే?
విను దనుజుం డొకం డతులవీర్యఘనుం డతలస్థుఁ డై కుజం
భనపరతం గుజంభుఁ డనుభైరవనామము దాల్చి భూతల
మ్మునఁ ద్రిదివంబునందుఁ గలభూరిసువస్తువు లాహరించుచున్. 256

వ. విశ్వకర్మ నిర్మించినసునందం బనుముసలంబు పుచ్చుకొని దాన నరిభంజనం బొనరించుచుఁ బాతాళంబుననుండి భూమికిఁ దూఁటులు పుచ్చి రాక్షసులకు వెలువడ ననేకద్వారమ్ములు గావించుచుండు నిమ్మహావివరం బమ్మహాసురునిచేతం జేయఁబడినది యని చెప్పి. 257

క. క్రతువిధ్వంసియుఁ ద్రిదశ, స్థితినాశకరుండు నైనదితిజుని ముసలా
స్త్రహస్తుని ఖండింపక, క్షితివర! భూరాజ్య మెట్లు చేసెదు చెపుమా? 258

ఆ. అతలమునకు నరిగి యమ్ముసలాయుధు, నతులశౌర్యధుర్యు నతిరయమున
నాజి నోర్చి యేలు మఖిలంబు నీపర,మేశ్వరత్వ మెల్ల నెఱుక పడఁగ. 259

వ. వానికిఁ బరమసాధనం బైనముసలంబుబలాబలంబులతెఱం గెఱింగించెద విను మది వనితాకరస్పర్శంబున నొక్కదినంబు నిర్వీర్యత్వంబు నొంది మఱునాఁడు వీర్యవంతం బగు నద్దురాచారుం డవ్విధం బెఱుంగఁ డింతయు నెఱింగించితి నెట్లు వోలు నట్లనుష్ఠింపు మని యమ్మునివరుండు చనియె నంత నమ్మహీపతియుఁ బురంబున కరిగి.

ఆ. ఆత్మమంత్రివరుల నందఱఁ బిలిపించి, తాను వినినతెఱఁగు దప్పకుండ
నాకుజంభువిధము నమ్ముసలప్రభా,వంబు తెలియఁ జెప్పె వారి కపుడు. 261

కుజంభుని వధింప నేఁగినవిదూరథసుతులచట బద్ధులగుట.

క. ఆవసుధాపతితనయ ము,దావతి తండ్రికడ నుండి తద్విధ మెల్లన్
దా వినియె నంత నొకనాఁ, డావెలఁదుక సఖులు దాను నారామమునన్. 262

వ. విహరించుచుండఁ గుజంభుండు చనుదెంచి దానిం బట్టికొని చనుట విని కోపించి యన్నరవరుండు కొడుకుల నాలోకించి మీరు సమస్తసైన్యసమన్వితులరై యరిగి నిర్వింధ్యాతటగర్తముఖంబునం బాతాళంబునకు డిగ్గి యన్నిశాటునిం గీటడఁగించి ముదావతిం దోడ్కొని రండని పనుచుటయు. 263

చ. సుమతియు నాసునీతియును శూరత సొంపెసలార సర్వసై
న్యములును దోడ రా నరిగి యవ్వివరంబున నారసాతలం
బు ముద మెలర్పఁ జొచ్చి వడిఁ బోరికి పేర్చి కుజంభుతోడ ఖ
డ్గముసలశూలశక్తిపరిఘప్రదరప్రముఖాయుధంబులన్. 264

చ. దనుజుఁడు రాజనందనులదర్పము సైఁపక రోషదీప్తుఁడై
తనఘనమాయఁ బేర్చి వెసఁ దద్బలముం దెగటార్చి యార్చి వా
రి నణఁగఁ బట్టి విక్రమధురీణత బద్ధులఁ జేసెఁ జేసినన్
విని మదిలో విదూరథుఁడు వెన్బడి దానవు నోర్వఁ జాలమిన్. 265

క. దనుజు దునిమి యెవ్వఁడు నా, తనయుల విడిపించు నట్టిధరణీశ్వరనం
దనునకు నిచ్చెద నాసుత, నని పురిలోఁ జాటఁ బనిచె నతఁ డార్తుండై. 266

వ. ఇట్లు చాటం బనిచి తనబిడ్డలచెఱలు దలఁగునట్టివీరుం డెవ్వఁడును లేకున్న నిరాశుండై యుండె నంత భనందసుతుండు వత్సంధ్రుం డంతయు విని యతనికడ కరుగుదెంచి యే నద్దానవు నిర్జించి నీకొడుకులం గూఁతుం దెచ్చెద నన్నుఁ బనుపు మనిన నవ్విదూరథుండు హర్షించి నిజమిత్రపుత్రుం డైనయాశౌర్యధుర్యునిం గౌఁగిలించుకొని దీవించి వీడుకొలిపిన నతండు. 267

తే. అతినిశాతఖడ్గంబు బాణాసనంబు, లలితగోధాంగుళిత్రాణములు ధరించి
యమ్మహాముఖబిలమున నతలమునకు, నమితసైన్యముతోఁ జని యార్చుటయును.

వత్సంధ్రుండు కుజంభుని వధించుట.

క. దారుణ మగుతన్నాదం, బారాక్షసవరుఁడు విని మహాక్రుద్ధుండై
బోరన వెడలె బలమ్ముల,తో రణకౌతుక మెలర్ప దోర్దర్పమునన్. 269

శా. ఆవత్సంధ్రుఁడునుం గుజంభుఁడును శౌర్యస్ఫూర్తియు న్సంగర
ప్రావీణ్యంబుఁ బరస్పరాంగదళనప్రాథత్వము న్మీరఁగా

హేవష్టంభము లుల్లసిల్లఁగ నితాంతామర్షులై దండధరా
కావాసంబు చలింపఁ బోరిరి గుణవ్యాపారఘోరంబుగాన్. 270

వ. ఇవ్విధంబున నయ్యోద్ధలు ఘోరయుద్ధం బొనరించి రప్పు డద్దనుజుండు నరేంద్రనందనుచేత నొచ్చి కోపించి యక్షతగంధపుష్పధూపార్చితం బై యంతఃపురంబున నున్న ముసలంబునకుం జని యంతకుమున్న యమ్మహనీయసాధనప్రభావంబు ముదావతి యెఱింగినయది గావునఁ బూజావ్యాజంబున నిచ్చలుం దనకరంబున నంటుటం జేసి నిర్వీర్యత్వంబు నొందినదానిం బుచ్చికొని వచ్చి యరిబలంబుమీఁదం బ్రయోగించినం దదీయపాతంబులు వ్యర్థంబు లగుటయుం. 271

క. వివిధాస్త్రశస్త్రముల న, య్యవనీశకుమారుతోడ నసుర గడంకం
బవర మొనరించె నయ్యుం, దువదనచే ముసల మట్లు దుర్బల మైనన్. 272

వ. అంత. 273

మ. అవనీనాథతనూజుఁ డద్దనుజు శస్త్రాస్త్రావలిం ద్రుంచిన
న్నివిడారాతి కృపాణముం గొని మదోద్రేకం బెలర్పంగఁ బైఁ
గవియం జూచి భనందనందనుఁ డుదగ్రక్రోధుఁ డై వానియ
క్కు వెస న్వ్రియ్యఁగ నేసె నుజ్జ్వలశిఖాఘోరానలాస్త్రంబునన్. 274

మహాస్రగ్ధర. అనిలాస్త్రం బట్లు వక్షం బవియఁ గొనిన వీతాసుఁ డై యాజిఁ గూలెన్
దనుజేంద్రున డప్పు దత్యుత్సవమున ఫణభృద్ధామముల్లాసి యయ్యె
న్దనర న్గీర్వాణవాద్యధ్వనులు చెలఁగె గంధర్వగీతంబు లింపొం
ద నవోద్యత్పుష్పవృష్టి న్ధరణిపసుతమూర్ధస్థలం బొప్పె నంతన్. 275

క. ఆవత్సంధ్రనృపుఁడు త, ద్భూవరుపుత్త్రులను గూఁతు భూరిప్రియసం
భావన బంధచ్యుతులం, గావించె భుజంగవరులు గడు వెఱఁగందన్. 276

వ. అప్పు డశేషోరగేశ్వరుం డైనశేషుండు కుజంభునిముసలంబు పుచ్చికొని ముదావతి నిత్యంబును మనంబునం దన్ను నారాధించుచు సునందస్పర్శనం బాచరించుటం జేసి ప్రసన్నుం డై దానికి సునంద యనునామం బొనరించె నంత నారాజపుత్త్రుండు భ్రాతృసహితంబుగా సునందం దోడ్కొని తదీయజనకునికడ కరిగి యతనికి నమస్కరించి యిట్లనియె. 277

క. జనవల్లభ! భవదాజ్ఞం, జని యద్దానవుని దునిమి శౌర్య మెసఁగ నీ
తనయుఁ గూఁతుం దెచ్చితి, నొనరింపుము ప్రీతి యెద్ది యుచితము దానిన్. 278

వత్సంధ్రుఁడు విదూరథపుత్త్రిక యగుముదావతిని బెండ్లాడుట.

సీ. అనిన విదూరథుం డానందరసభరితాత్ముఁ డై వత్సంధ్రు నాదరమునఁ
గనుఁగొని వత్స! నీయనుపమశౌర్యంబు గొనియాడ నేరికిఁ గొలఁది యగునె ?

యమరాదులకు నెల్ల నక్కుఁగొల్పిన కుజంభు భయంకరుఁ జంపి నాఁడు
బిడ్డలఁ దెచ్చినవెం దల్పమే యిట్టిఘను నిన్ను నల్లుఁడు గాఁగఁ బడసి
తే. యేఁ గృతార్థుండ నైతి నరేంద్రతనయ, మత్తనూజ ముదావతి మదగజేంద్ర
యాన నిచ్చితి నీకు నయ్యతివఁ బెండ్లి, గమ్ము నను సత్యవాక్యుని గా నొనర్పు. 279

ఆ. అనిన నక్కుమారుఁ డధిప నీవనిచిన, కరణి నడచువాఁడఁ గాక యిప్పు
డేను గార్యకర్త నే? యనుటయును బెంపార నప్పు డవ్విదూరఘుండును. 280

వ. శుభముహూర్తంబున వత్సంధ్రముదావతీవివాహంబు చేసిన ధనందనందనుండు
పరమానందంబున సునందాసహితంబుగా నిజపురంబున కరిగి. 281

క. అతిముదమునఁ దాను ముదావతియును లలి నుపవనముల వనజాకరతీ
రతలమ్ములఁ గృత్రిమపర్వతముల మణిరుచిరహర్మ్యరమ్యస్థలులన్. 282

వ. మనోహరవిహారంబు లొనరించుచుండి రంతఁ బెద్దకాలంబున ధనందుండు జరా
క్రాంతుండై వత్సంధ్రు నఖిలమహీరాజ్యభారధౌరేయుం గావించి తాను దపో
వనంబునకుఁ జనుటయు. 283

శా. ఆవత్సంధ్రమహీశ్వరుం డతులరాజ్యశ్రీధురం దాల్చి తే
జోవిభ్రాజితమూర్తియై సమధికస్ఫూర్తిం బ్రజాపాలన
ప్రావీణ్యంబున నొప్పెఁ దద్వసుమతీభాగంబు శోభిల్లెఁ జో
రావగ్రాహవిరోధిడాంబరభయవ్యాధివ్యపేతస్థితిన్. 284

ఆశ్వాసాంతము.

ఉ. వారవిలాసినీవదనవారిజమిత్ర! సమగ్రవిద్విష
ద్భూరుహవీతిహోత్ర! గుణభూషణభూషితగాత్ర! నిర్మలా
చారపవిత్ర! సూరిజనచైత్ర! వివర్ధితగోత్ర! భూమి పం
కేరుహకేళిలాలసితకీర్తిరమేశ్వర! ప్రాజితేశ్వరా! 285

క. శరనిధిసమగాంభీర్యా, మరుదగనిభధైర్య! సతతమహితౌదార్యా
సురపురసదృశకాకతి, నరపాలకకటకపాలనస్థిరశౌర్యా! 286

మాలినీ. నిరతగుణ[illegible]రీణా! నీతివిద్యాప్రవీణా!
పరభయదకృపాణా! భామినీపంచబాణా!
స్ఫురితవివిధపుణ్యా! సూరిలోకాగ్రగణ్యా!
దలితరిపుశరణ్యా! దానకేళీవరేణ్యా! 287

గద్యము. ఇది శ్రీమదుభయకవిమిత్ర తిక్కనసోమయాజిప్రసాదలబ్ధసరస్వతీపాత్ర తిక్కనామాత్యపుత్ర మారయనామధేయప్రణీతం బైనమార్కండేయమహాపురాణంబునందు దక్షసావర్ణి ధర్మసావర్ణి రుద్రసావర్ణి మనువుల సంభవంబులు రౌచ్యమనూత్పత్తియుఁ భౌత్యమనుజన్మంబును సూర్యుని ప్రభవంబును ప్రభావంబును రాజ్యవర్ధనాఖ్యానంబునునిలునిపుట్టుటయుఁ బురూరవస్సంభవంబును బృషధ్రుండు శూద్రత్వంబు నొందుటయు ధృష్టపుత్రుండగునాభాగునకు వైశ్యకన్యకకు భనందనుం డుదయించుటయుఁ దచ్చరిత్రంబును వత్సంధ్రచరిత్రంబును నను నది సప్తమాశ్వాసము.

శ్రీ

మార్కండేయపురాణము.

అష్టమాశ్వాసము.

శ్రీకంఠాకుంఠితకరు
ణాకల్పలతాప్రభూతనానార్థఫల
స్వీకారధన్య బుధమా
న్యా ! కాంతివిజితసువర్ణ ! నాగయగన్నా !. 1

వ. పరమజ్ఞానచక్షులైనపక్షు లాజైమిని కిట్లనియె నిట్లు మార్కండేయుండు క్రోష్టుకిం
జెప్పినవిధం బాకర్ణింపుము. 2

వత్సంధ్రసంతతి.

క. ఆనరపతికి సునందకు, భూనుతచరితులు ప్రతాపభూయిష్ఠులు స
త్త్వాఢ్యులు పదుండ్రు పుట్టిరి, నానాసంగ్రామకేళినైపుణరూఢుల్. 3

వ. ప్రాంశుండును శూరుండును సుచక్రుండును విక్రముండును క్రముండును బలియుం
డును బలాంకుండును జండుండును బ్రచండుండు నను నీపదుండ్రయందు నగ్రజుం
డైన ప్రాంశుండు తనకుం దమ్ములు భృత్యులు వోలె విధేయులై వర్తింప రాజై పూ
జ్యంబగు రాజ్యంబు సేయుచు మహీసురోత్తములకు మహనీయవసురాసు లొసంగి
మహికి వసుంధరాభిధానంబు సార్థంబు గావించుచుం బ్రజల నౌరసు లగుపుత్త్రుల
యట్ల పరిపాలించుచు. 4

తే. శతసహస్రసంఖ్యల నతం డతులవైభవంబు మెఱయంగఁ జేసె నధ్వరచయంబు
సంఖ్య యెవరికి నెఱుఁగంగ శక్య మట్టి, ప్రాంశునకుఁ బ్రజాని జనించె భవ్యయశుఁడు.

ఉ. మానుగ నింద్రుఁ డెవ్వనిసమంచితయాగములందు భాగము
ల్దానును వేల్పులు న్గని ముదంబునఁ దేలుచు శౌర్యలీల నే

కోసలశాతమరాహితుల ను గ్రక్కడఁచె న్బలజంభదైత్యుల
న్వాని మహాజి నట్టినృపపుంగవుఁ డైనప్రజాలికి న్నుతుల్. 6

ఖనిత్రచరిత్రము.

క. మునులు ఖనిత్రుం డాదిగ, జనించి రేవురు సమగ్రశౌర్యోజ్జ్వలు లం
దనుపమశుభచారిత్రుఁడ, ఖనిత్రుఁడు ధరిత్రి యేలెఁ గడుఁ జెంపారన్. 7

చ. నిరుపమసచ్చరిత్రుఁడు ఖనిత్రుఁడు సర్వజనైకమిత్రుఁ డై
ధరణిజితోగ్రశత్రుఁ డతిదాంతుఁడు శాంతుఁడు సత్యవంతుఁ డా
దరనయధర్మవంతుఁడు వదాన్యుఁడు మాన్యుఁడు ధన్యుఁ డంతరం
గరహితమన్యుఁ డై కరము గారవ మారఁగ నేల యేలుతన్. 8

సీ. అఖిలభూతములకు నానంద మగుఁ గాత శత్రునకును మైత్రి సలుపుఁ గాత
సకలజీవులకు శాశ్వతసుఖం బగుఁ గాత సాధులు వ్యాధులు నడఁగుఁ గాత
వసుధామరులకు శివంబు చేకుఱుఁ గాత ధాత్రీశులకు మనఃప్రీతి గాత
సర్వవర్ణులకును సంతతంబును నభివృద్ధి గాత సుకర్మసిద్ధి గాత

తే. నను చు జనులార! మీయందుఁ దనయులందు, నట్ట హితబుద్ధి నడతు మీరట్లు నడువుఁ
డెల్లవారలయందును నెపుడు పరమ, హితము చెప్పితి నాపలు కెలమి వినుఁడు. 9

తే. అహిత మొకని కించుక యెవ్వఁ డాచరించు, నజ్ఞుఁడై వాని దక్ష్పలమపుడ పొందు
నింత యెఱింగి జంతువులయం దెల్ల నెపుడు, మహితమతిమంతులరు గండు మనుజులార!

క. అని యిట్లు ఖనిత్రుఁ డఖిల, జనములకును హితము గోరి సతతంబు ప్రియ
మ్మును జెప్పుచు సద్గుణములఁ, దనరుచు మహానీయ ధర్మతత్పరుఁ డయ్యెన్. 11

క. ఆరాజు నిజానుజుల ను, దారభుజావీర్యవిక్రమాఢ్యుల మునుల
గౌరి సుదావసు సునయుం, మహారథుఁ బూర్వాది దిశల కధిపులఁ జేసెన్. 12

వ. అందు శౌరికి నత్రికులోద్భవుం డైనసువహోత్రుండు సుదావసునకు గౌతమాన్వయ
జుం డైనకుశావర్తుండును సునయునకుఁ గాశ్యపుఁ డైనప్రమతియు మహారథునికి
వాసిష్ఠుం డైనపురోధసుండును బురోహితు లై వర్తింపనన్నలువురు తమతమరాష్ట్రం
బులందు రాజ్యసుఖంబు లనుభవించుచుండిరి ఖనిత్రుం డాభ్రాతృవర్గంబునకు నఖిల
ధాత్రీపతులకు నధిపతి యై పరమానురాగంబునఁ బ్రజాపాలనంబు సేయుచున్నంత
నొక్కనాఁ డేకాంతంబున శౌరికి విశ్వవేది యను మంత్రి యిట్లనియె. 13

విశ్వవేదిదుర్మంత్రమువలన శౌరి మొదలగువారు నశించుట.

సీ. ఎవ్వని కీయిల యొంతయుఁ జేకుఱు వసుధేశు లెల్లను వశ్యులగుదు
రతఁడు రా జతనిసంతతిపరంపర కంత నారాజ్య మలవడి యతిశయిల్లు
నమ్మహీపతిభ్రాతృ లత్యల్పవిషయాధిపతు లైనఁ దత్పుత్త్రపౌత్త్రు లల్పు
లగుచుఁ గాలంబు వో నంత కంతకుఁ బేద లై కృషీవలవృత్తి యాశ్రయింతు
తే. రుర్వి యేలునాతఁ డుద్ధరింపఁడు నెయ్యు, మెసఁగ భ్రాతృజనము నింత దెలియ
జేర కునికి యధిప! నీమోస భ్రాతృపుత్త్రులకు నేల మీఁదఁ గలుగుఁ బొందు. 14

క. వారలకొడుకులు దమలో, నారయ లాఁతు లయి పోదు రంతట నోధా
త్రీరమణ! భ్రాతృసంతతు, లేరూపునఁ గూడి నడుచు నే సప్రీతిన్. 15

వ. కావున నల్పరాజ్యపదస్థుం డగు నీవు వృథాసంతోషం బేల వహించెదు సకలరా
జ్యంబు నిన్నుఁ బొందునట్లుగా విచారింపుము విచారింపవై తేని మంత్రుల మైన మా
ప్రయోజనంబు నీ కేటికి ? మాచేతం గార్యజాతం బంతయు ఫలితం బైనఁ బితృపై
తామహం బైనరాజ్యం బంతయు ననుభవింపు మనిన నతం డిట్లనియె. 16

క. అతఁ డన్న యేము దమ్ముల, మతులితమగుధరణివలయ మతఁడును మామా
క్షితిభాగము లేమును సుస్థితి నేలుచు నునికి సేయుఁ జిత్తప్రీతిన్. 17

వ. అది యెట్లం టేని వినుము. 18

క. ఏవురము సోదరుల మే, మేవురకును వేఱ వేఱ యీయొక్కధరన్
శ్రీవిభవైశ్వర్యోన్నతు, లేవిధమునఁ గలుగ నేర్చు నీతలఁ పేలా. 19

వ. అనుడు విశ్వవేది యమాత్యుం డిట్లనియె. 20

ఆ. అధిప మీర లేవు రైన నెగ్గేమి మీ, యన్న మీపదంబులంద నిలిపి
యందఱకును నీవ యధిపతి వై బాహు, లీల మెఱయ నేల యేలు మనిన. 21

వ. శౌరి యిట్లనియె. 22

క. తనయుని కంటెను నను న,మ్మను జేంద్రుఁడు గరము నెమ్మి మన్నించు మన
మ్మున నట్టి యగ్రజన్ముని, యనుపమరాజ్యమున కలుగ నగు నే నాకున్. 23

వ. అనిన వేద్యవిదుం డగుసచివుం డతని కాలోకించి. 24

తే. నీవు రాజ్య మంతయుఁ గాని నెమ్మి నగ్ర,జుని సమగ్రధనంబులఁ దనుప రాదె
వినుము రాజ్యకాముకులకు మనుజనాథ, వర్య! యన్న తమ్ముం డనువావి గలదె? 25

చ. అనవుడు నట్లు కాక యని యానరనాయకుఁ డాత్మ సమ్మతిం
చిన నెడ విశ్వవేది వికసిల్లుచు నాతని భ్రాతృపుత్త్రుల

మ్మనఁగొని తత్పురోహితుల మువ్వురనుం బిలిపించి యేకత
మ్మున నిజకార్య మంతయును బొచ్చెము లేక యెఱింగించి చెప్పిరన్. 26

వ. ఆమువ్వురు పురోహితులం దనపురోహితుంగూర్చి ఖనిత్రునకు నాభిచారంబు వేల్వం బంచి యావిశ్వవేది యమ్మహీశ్వరుభృత్యామాత్యులందు సామదానాదులం జేసి భేదం బాపాదించి దండనీతిస్ఫురణంబు మెఱయ సంగరోద్యోగంబునుం జేసె నంత. 27

చ. తలఁగొని విశ్వవేదికృతిఁ దద్దయు నుద్ధతులై పురోహితు
ల్నలువురు నాభిచారిక మనారతము న్బహుమంత్రతంత్రసం
కలితముగా నొనర్ప ఘనగాత్రభయంకరవక్త్రశక్తులు
జ్జ్వలతరనేత్రశూలరుచిజాలకరాళకరోగ్రమూర్తులై. 28

సీ. కృత్యాచతుష్టయం బత్యద్భుతంబుగ నుద్భూతమై కడు నుగ్రగతి ఖ
నిత్రుపాలికిఁ జనినిర్దోషుఁ డైనయాతనివినిర్మలగుణోత్కరముచేత
హతిఁ బొంది మరలి రయమునఁ బురోహితవితతిపై నావిశ్వవేదిమీఁదఁ
బడిన నందఱు వెస భస్మమై రవ్విధం బచ్చెరు వందించె నఖిలజగము

ఆ. నంత నమ్మహీశుఁ డాపురోహిత వరు, లొక్కమాఱె మంత్రియుతము గాఁగ
విగతజీవు లగుట విని కడు వెఱఁగంది, యిట్టు లగుట కకట! యేమి కతమొ? 29

తమ్ములు మొదలగువారు నశించుటచే దుఃఖితుఁడై ఖనిత్రుఁడు దివి కేఁగుట

క. అని మదిలోన ఖనిత్రుఁడు, వనరుచు నుండఁగ మునీంద్రవంద్యుఁడు విజ్ఞా
ననిధి వసిష్ఠుం డేతెం, చిన నతనికి వందనంబుఁ జేసె వినీతిన్. 30

వ. అన్నరేంద్రుండు మునీంద్రా! మదీయభ్రాతృవరుల మంత్రిపురోహితు లొక్కమాఱె యేమికారణంబున మరణప్రాప్తులైరి యెఱింగింపవే యనిన నత్తపోధనోత్తముండు తద్వృత్తాంతంబు సవిస్తరముగాఁ జెప్పిన విని విషణ్ణత్వంబు నొంది తన్నుఁ దాన నిందించుకొనుచు నతం డిట్లనియె. 31

క. అనుపగతపుణ్యగతిఁ గ్రో,ధను నై వోపహతు నల్పభాగ్యుని దోషా
త్ముని నఖిలలోకగర్హి,తు, నను నిప్పి యేమి చెప్ప నానాఘమయున్? 32

తే. నాకతంబున సమసిరి నలువు రవని, సురవరేణ్యులు కటకటా! ధరణిఁ బాప
కర్ముఁ డెవ్వఁడు గలఁడు నాకంటె? నింక, నేమి సేయుదు దైవమ! యెందుఁ జొత్తు?

తే. ఈయిలను నొక్కపురుషుఁడ, నై యేను జనియించు టున్న నాద్విజులకు రా
నీయొదరిటు పాపంబునఁ, బోయితి నీకష్టతరపుఁ బుట్టువు కతనన్. 34

చ. చెనఁటినృపాన్వయోద్భవము సీ! యిది గాల్పవె పాపహేతు వై
తనరెడు రాజ్య మేల? వసుధామరవర్యులు నాదుతమ్ముల
న్ఘనతరరాజ్యవర్ధనులు గా నొనరింపఁ గడంగి నాకతం
బున మృతులైరి పాపమునఁ బోయితి వేయును జెప్ప నేటికిన్. 35

వ. అని విషాదవేదనాధూయమానమానసుం డై యప్పుడు ఖనిత్రధాత్రీపతి నిజప్రథమపుత్రు నిఖిలరాజ్యాభిషిక్తునిం గావించి మువ్వురు భార్యలుం దానును వనంబునకుం జని వానప్రస్థవిధానంబున నొక్కయాశ్రమంబున వసియించి నిఖిలేంద్రియంబుల నిగ్రహించి మున్నూటయేఁబది సంవత్సరంబులు దారుణం బగుతపం బొనరించి శరీరం బుజ్జగించి ధర్మపత్నీసహితం బక్షయపుణ్యలోకప్రాప్తుం డయ్యె నని చెప్పి మార్కండేయుండు. 36

క. వినుము ఖనిత్రచరిత్రము, వినినఁ బఠించినను జనులు వీతాఘులు శాం
తినిరూఢులు శ్రీమంతులు, ననుపమశుభయుతులు సుఖులు నగుదురు ధరణిన్. 37

వ. అని చెప్పి మఱియును. 38

క్షుపచరితము.

చ. నృపకులశేఖరుం డగుఖనిత్రతనూజుఁడు నీతిసత్యధ
ర్మపరుఁడు దానశీలుఁడు సమస్తమహాధ్వరకేళిశాలి గూ
క్షుపుఁ డరిమిత్రతుల్యుఁ డయి సుస్థితి రాజ్యము సేయఁగాఁ ద్రివి
ష్టపపదు లేఁగుదెంచి మునిసత్తమ! యిట్లని రానరేంద్రుతోన్. 39

క. క్షుపుఁ డనువిరించిసూనుఁడు, విపులాధీశుఁ డయి తొల్లి విమలచరిత్రన్
విపులయశుఁ డయ్యె నట్టుల, నృప! నీవును నతనిచరిత నెగడుము పుడమిన్. 40

ఆ. అనుడు క్షుపచరిత్ర విన వేడ్కయయ్యెడు, నమ్మహాత్ము నడచినట్ల నాకు
నడువ శక్య మేని నడచెదఁ జెప్పుఁడా, యనిన నతని కిట్టు లనిరి సురలు. 41

క. భూమిసురస్వీకృత యగు, భూమికి గోచయము మేఁత పాలమునకును నా
భూమీశ్వరుఁ డరి గొనఁడు మహాసుఖము లొనర్చె నాతఁ డగణితములుగన్. 42

వ. అనిన విని క్షుపుఁడు. 43

తే. అమ్మహాత్ముఁ డొనర్చినయట్లొనర్ప, నలవి యగునె మాదృశు లగునల్పజనుల
కయిన నవధరింపుఁడు మదీయప్రతిజ్ఞ, నమరులార! యాక్షుపుని నేననుకరింతు. 44

వ. ఎట్టనిన వివిందుఁడు విపులాతలంబునం గలయం జరించుచు శమ్యామాత్రక్షేత్రంబున మూఁడేసి యజ్ఞంబులు చేసెద నాత్మపుత్రునియట్ల గోబ్రాహ్మణుల నిమిత్తంబరి గొనద నని ప్రతిజ్ఞ చేసి యవ్విధంబున వర్తించుచు మహనీయరాజ్యంబు చేసె. 45

తే. అట్టిభూపునకుఁ బ్రమథకు నాత్మజుండు వీరుఁ డుదయించెఁ భువనైకవీరుఁ డతులి
తప్రతాపానలచ్ఛటాదహ్యమాన, వైరిరాజన్యసైన్యకాంతారచయుఁడు. 46

క. వీరునకు విదర్భక్షో,ణీరమణతనూజ నందినికిఁ నుదయించె
న్భూరిగుణుండు వివింశుం, డారాజగణితబలాఢ్యుఁ డై యిల యేలెన్. 47

చ. ఇలఁ దలిరోన వాన గురియించు సురేంద్రుఁడు సస్యవృద్ధి య
య్యిల యొసరించు సస్యము లనేక ఫలంబుల నిచ్చుఁ దత్ఫల
ములు విలసిల్లు భూరిరసపూర్తిరసం బది పుష్టికారి యై
పొలుచు ముదంబుఁ జేయ దొగిఁ బుష్టి వివింశునిపాలనోన్నతిన్. 48

క. ఘనుఁడు వివింశుండు సుహృ,జ్జనులం దగఁ బ్రోచి పెక్కుజన్నంబు లొన
ర్చి నరేంద్రులనోర్చి రణం,బున మృతుఁ డై చనియె నింద్రభువనమ్మునకున్. 49

వివింశపుత్త్రుఁ డగు ఖనిత్రుని చరిత్రము.

వ. ఆవివింశపుత్త్రుండు ఖనిత్రుం డనుధాత్రీపతి యొనర్చు నధ్వరములందు 50

క. సతతము నత్యాశ్చర్యా,న్వితు లై గంధర్వులీఖనిత్రసమానము
న్నతుఁ డీయుగమున లేఁ డని, యతిముదమునఁ బాడుదురు జనాహ్లాదముగన్. 51

సీ. పదివేలక్రతువు లాపార్థివుం డొనరించి యఖిలధాత్రియును బ్రాహ్మణుల కిచ్చి
తపమాన నగణితద్రవ్యము పార్జించి భూరిధనంబు విప్రులకుఁ బెట్టి
మహి వారిచేతఁ గ్రమ్మఱ పిల్చికొని కడు ముదమున డెబ్బదిమూఁడువేలు
నేడునూఱులువదియేడుయాగమ్ములు ఘనదక్షిణాసమగ్రములు గాఁగఁ

తే. జేసి పుత్త్రుండు లేమికిఁ జింత నొంది, యతఁడు మృగమాంసమునఁ బితృయాగమాత్త
జార్థముగఁ జేయఁ దలఁచి హయంబు నెక్కి, లలితగోధాంగుళిత్రాణములు వహించి.

ఖనిత్రమృగ సంవాదము.

క. శరములు శరాసనమ్మును, ధరియించి నృపుం డొకండు దారుణవిపినాం
తరమున కరిగిన నొకమృగ, మరుదుగ నవ్విభునిఁ జేర నరిగి యిటు లనున్. 53

ఆ. మనుజనాథ! వేగ నను సమయించి నీ,యభిమతం బొనర్పు మనిన నృపుఁడు
మృత్యుభీతి నెల్లమృగములు పాఱఁగ, నేఁ జావఁ దివిర దీవు? చెపుమ. 54

క. అనిన మృగంబి ట్లను నే, ననపత్యుండఁ బుత్రహీనుఁ డగువాఁడు వృథా
జనుఁడు వానిప్రాణము, లునికికి నేఁ గాన నొక ప్రయోజన మధిపా!. 55

క. అని యమ్మృగంబు సెప్పిన, యనంతరమ యతనిఁ జేర నవ్వమృగము న
య్యన వచ్చి యోనరేశ్వర, విను మీమృగము పనిలేదు వేగమ నన్నున్. 56

ఆ. పటుశిలీముఖమునఁ బడ నేసి నాదుక్రవ్యమున నిష్టకర్మ మాచరింపు
ననుఁ గృతార్థుఁ గాఁగ నొనరింపు నీయుప,కార మెఱుక పఱుపు ధారుణీశ! 57

క. పుత్రునిఁ బడయఁ దలంపునఁ, బితృధ్వర మాచరింపఁ బ్రియమం దెద వీ
పుత్రరహితపలలమున, న్ధాత్రీశ్వర! పడసె దెట్లు తద్వాంఛితమున్? 58

వ. వినుము దుర్గంధంబు నణంప సుగంధంబు వలయునట్లు నిష్పాద్యం బగుకర్మం బెట్టిది
దానికిఁ దగినట్టిద్రవ్యంబు గొన వలయుంట నిశ్చితం బనిన మృగంబునకు వివింశ
జుం డిట్లనియె. 59

ఆ. ఈమృగంబు నాకు నెఱిఁగించెఁ బుత్త్రహీ,నత విరక్తికారణముగ నాకు
నీవు చెప్పు మేది నీప్రాణములయందు, నొల్లఁ బాటు నీకు నొలయఁ జేసె. 60

వ. అని యడిగిన నామృగంబు. 61

క. పలువురు గొడుకులు కూఁతులు, గలుగుటఁ దచ్చింత నొంది ఘనదుఃఖదవా
నలపటుతరకీలాసం,వలితుఁడ నై యెరియుచున్నవాఁడ నరేంద్రా! 62

వ. అదియెట్లంటేని. 63

సీ. సకలంబునకు మృగజాతి సుసాధ్యము నత్యంతభీతయుఁ నగుటఁ జేసి
బిడ్డలపైఁ జేర్చు ప్రేముడి పెల్లున వగలకు నేఁ గొలువగుచు సింహ
శార్దూలవృకమనుష్యప్రకరమ్ములచే నెప్పు డెయ్యెడ వీరి కేమి
పాటిల్లునో యని భయ మందు చుండుదు నేము చెప్ప నపత్యహితముఁ గోరి
తే. సారమేయాదిక్రూరసత్త్వచయము, లెల్లఁ దెగి పాఱు గావలదే ధరిత్రి
పులులు మేయుంగవాదులు పొలిసి పోలె?,తనయులకు మేఁత సొంపారు నని తలంతు.

చ. నరవర! నాయపత్యములు నర్దెసల న్వెస మేయఁ జన్న నేఁ
బురపురఁ బొక్కుదు న్వలల బోనుల వాగురల న్మహావనాం
తరములఁ జిక్కునో శ్వవృకదంష్ట్రిలపా లయి పోవునో ధను
ర్ధరమృగయోగ్రబాణములతాఁకునఁ గూలునో యంచు వానికిన్. 65

ఉ. ఒక్కటి మున్ను వచ్చుటయుఁ నున్నవి రామికి బెగ్గడిల్లుదు
న్మక్కువ మన్కిపట్టునకు మాపున నన్నియుఁ వచ్చె నేని నే
నక్కలితేఱి తక్కుశల మారయ నుంపుదు రేయి వేగిన
న్బెక్కువగ ల్మరిం బొడమి బిడ్డలసేమము వార్త భూవరా! 66

చ. పగలును రేయి నెవ్వగలపాలయి సంతతి కేడ్పు నేమ మె
ట్లగునొకొ యంచు నక్కటపుటక్కిలిఁ గుందుచున్నవాఁడ సా
రగుణవరేణ్య! నామది విరక్తికిఁ గారణ మీయవస్థ యా
శుగము మదీయదేహమునఁ జొన్పుకమున స్పృహఁ జేయుఁ మీయెడన్. 67

వ. ఏ నత్యంతదుఃఖావిష్టుండ నయ్యును నాయంతన ప్రాణంబులు విడువమికిఁ గార ణంబు విను మాతృఘాతుకు లగువా రసూర్యంబు లను లోకంబులకుం బోదురు యజ్ఞోపయుక్తం బగుపశువులు పుణ్యలోకంబులకుం బోవుఁ గావున నీ వనుగ్రహించి మదీయమాంసంబునం బితృయజ్ఞం బాచరించి పుత్రలాభసంపన్నుండ వగు మనిన నయ్యపుత్రమృగంబు రాజున కిట్లనియె. 68

తే. సుతులు పెక్కండ్రు గలవానిసుకృతి నీమృగేంద్రు వధియింపఁగాదు నరేంద్ర! పుత్ర
హీనతాదుఃఖతాపాగ్ని నెరియు నేను, నీకు నగుదు హంతవ్యుఁడ నిశ్చయముగ. 69

వ. అనిన నయ్యపుత్రమృగంబును సపుత్రమృగం బాలోకించి. 70

క. ఏకశరీరుండవు నీ, వేకము దుఃఖంబు సుకృతి వీవు మృగేంద్రా!
నాకొడుకు లనేకమ్ము ల,నేకమ్ములు దుఃఖములును నే నధముండన్. 71

వ. ఎట్లంటేని మొదల నేకశరీరుండనై యున్న యప్పుడు నాదుఃఖం బేకంబ మఱియు భార్యామమత్వంబునం జేసి దుఃఖద్వయం బయ్యెఁ గ్రమంబున నపత్యమ్ము లావిర్భవించిన నయ్యపత్యదేహమ్ము లెన్ని యన్నిదుఃఖమ్ము లుద్భవించి నన్నిప్పు డలంచుచున్నవి నీ వనతిదుఃఖాత్ముండ వగుటం గృతార్థజన్ముండవు నే నిహపరవిరోధిసంతానరక్షణపోషణార్థం బత్యంతచింతాతురుండ నగుచున్నవాఁడఁ జింతాతురునకు నరకంబు ధ్రువం బనిన మృగేంద్రునకు నరేంద్రుం డిట్లనియె. 72

క. తనయవిహీనుఁడు ధన్యుఁడొ, తనయులు గలయతఁడు ధన్యతముఁడో యెఱుఁగ
న్దనయార్థాధ్వర మిప్పుడు, ఘనుఁడో లాయతమ నన్నుఁగా ననుఁ జేసెన్. 73

క. సంతానము దేహుల కత్యంతము దుఃఖములఁ జేయు నది నిజమైన
న్సంతానము చేత నపక్రాంతము లగు ఋణము లండ్రు కర్మవిధిజ్ఞుల్. 74

క. కావునఁ బుత్రార్థముగా, జీవవధం బింక నేను జేయక మత్పూ
ర్వావనిపతులవిధంబునఁ, గావించెద నుగ్రతపము గడఁగి మృగేంద్రా! 75

వ. అని చెప్పి యప్పుడు. 76

చ. వితతయశోభిరాముఁడు విదింశతనూజుఁడు వేడ్కఁ నేఁగి గో
మతి యను నేటిపొంత నియమస్థితుఁడై మఘవుం గుఱించి యు
గ్రతపము సేయుచు న్సమధికస్థిరభక్తి నొనర్చు నుత్తమ
స్తుతులకు మెచ్చి వచ్చి బలసూదనుఁ డానృపసూతి కిట్లనున్. 77

చ. జనవర! నీతపంబునకు సంస్తవనమ్మున కేను మెచ్చితి
న్నను భవదీప్సితం బడుగు నావుడు నాతఁడు పుత్త్రు నాకు ని
మ్మనుపమశస్త్రశాస్త్రవిదు నద్భుతకర్మ గరిష్ఠు ధర్మవ
ర్తను ననిన న్పురందరుఁడు తద్వర మిచ్చి నిజేచ్ఛ నేఁగినన్. 78

మ. అనురాగంబునఁ దేలుచుం బురికి నుద్యద్వేగుఁడై యేఁగి యా
జనపాలుండు ప్రజానురంజనకరస్వామ్యోన్నతిం బొల్చుచు
న్దనయు న్శక్రవరప్రసాదమున మార్తాండోజ్జ్వలుం గాంచి యా
తనికిం జేసె బలాశ్వనామము జగత్ఖ్యాతంబుగాఁ బ్రీతితోన్. 79

వ. అట్లు నామకరణంబు గావించి నందను నఖిలాస్త్రశస్త్రవిద్యావిశారదుం గావించి
ఖనిత్రుండు సురలోకప్రాప్తుం డయ్యె నంత. 80

కరంధముఁ డనునామాంతరము గలబాలాశ్వునివృత్తాంతము

క. ఘనుఁడు బలాశ్వుఁడు నిజశాసనమున భూజనుల నిలిపె శౌర్య మెసఁగ న
ప్పనములు వారలచేతం, గొనుచుఁ బ్రజాపాలనమునఁ గుశలుం డైనన్. 81

క. అలుక నతని దాయాదులు, చులుకన భూప్రజల నొంపఁ జొచ్చిన వారు
న్దలరి యరి యప్పనంబుల, నిలుపలికిం బెట్ట కడని కింతయుఁ గలఁకన్. 82

క. బలువిడి మఱియును నాశత్రులు దేశం బెల్లఁ గొనిన దోర్బల మఱి వి
హ్వలుఁడై నిజపురిలోనన, బలాశ్వుఁ డొదుఁగుటయుఁ గూడి పగతురు కడిమిన్.

మ. చతురంగధ్వజినీపదప్రచలితక్ష్మాచక్రులై విక్రమో
న్నతి నవ్వీటిపయి న్నిరుల్విడిసిన న్సంక్షీణసైన్యార్థుఁడై
యతిభీతి న్శరణంబు వేఁడుచు వగ న్హస్తాంబు లాస్యంబుఁ జే
ర్చి తతోచ్ఛ్వాసము లబ్బలాశ్వుఁ డొనరించె న్శోకసంవిగ్నుఁడై. 84

ఉ. అంతఁ దదీయపాణివివరాంతరమం దతివిస్మయంబుగా
దంతితురంగసైనికరథప్రతతు ల్గతసంఖ్య లంబరం
బంతయు నిండి క్రిక్కిఱియునట్లుగ వ్రేల్మిడి నుద్భవించిన
న్సంతస మంది యానృపతిసత్తముఁ డప్పుడ దీప్తమూర్తి యై. 85

స్రగ్ధర. ఉత్సాహాడంబరం బత్యుపచితముగ శత్రూత్కరప్రాజ్యరాజ్యా
దిత్సావిష్టాంతరంగద్విగుణితరణ ముద్విస్ఫురద్వీరశృంగా
రోత్సేకానాసవక్త్రం బుదితసకలచంద్రోపమశ్రీ వహింపం
దత్సైన్యశ్రేణిలో నుద్ధతిఁ బురి వెడలెఁ న్ధారుణీనాథుఁ డంతన్. 86

క. వెడలి విరోధుల ననిమొనఁ, బొడిచి గెలిచి వారి నతులభుజవిక్రము మే
ర్పడఁ దన కరిగాపులుగాఁ, గడుకొని యేలం బొనర్చె గర్వ మెలర్పన్. 87

క. కరయుం గధమనంబున నరి, వరవీరనిరాసనోగ్రబలము గలుగుటం
బరఁగె బలాశ్వుం డప్పుడు, కరంధముం డనఁగ లోకకన్యాచరిత్రా! 88

ఆ. అమలధర్మనియతుఁ డైనయన్నరపతి, యట్టు లార్తుఁ డైన నరివిశాల
కారి యైనబలముఁ గల్పించె నతనిధర్మంబు దాని దాన మగుడఁ గడఁగె. 89

బలాశ్వునకు వీర యనుదానియందు అవేక్షితుఁడు పుట్టుట.

వ. వీర్యచంద్రుం డనురాజుకూఁతురు వీర యనుసుందరి ప్రియంబున స్వయంవరంబునం
గరంధముని వరించిన నయ్యింతియుం దతం డొక్కకొడుకుం బడసి దైవజ్ఞులం
బిలిపించి మత్పుత్రుండు జన్మించిననక్షత్రలగ్నంబులు ప్రశస్తంబు లై శుభగ్రహ
దృష్టి గలిగి యున్నయవియొ పాపగ్రహంబులలో బాలు నేగ్రహంబును జూడఁడు
గదా యని యడిగిన వార లిట్లనిరి. 90

సీ. క్షత్రవరేణ్య! నీపుత్రునక్షత్రలగ్నము లెంతయును బ్రశస్తముల గురుఁడు
శుక్రుండు నేడవచో నుండి శశి చతుర్థస్థుఁ డై బుధుఁ డుపాంతమున నిలిచి
యొగిని వీక్షించెద రుష్ణాంశుభౌమార్కసుతులు వీక్షింపరు వితతపుణ్యుఁ
డైనకుమారున కసిన నాజోస్యులఁ గనుగొని హర్షించి మనుజవిభుఁడు

తే. సురగురుం డాదిగాఁ గలశుభులచేత, వీఁ డవేక్షింపఁబడియెనుఁ బోఁడి గాఁగ
ననిరి పలుమాఱు మీర లిట్లనుట నాదు, సుతుఁ డవేక్షితుఁ డను పేర నతిశయిల్లు. 91

అవేక్షితుని బెక్కురాజకన్యలు వరించుట.

వ. అని కరంధముండు సుతునికి నామకరణం బొనరించె నంత నక్కుమారుం డఖిలవేద
వేదాంతపారగుం డైనకణ్వపుత్రుం డాచార్యుండుగా నఖిలాస్త్రశస్త్రవిద్యావైశా
రద్యం బంగీకరించి. 92

చ. అతులితరూపవిస్ఫురణ నశ్వినులే సరి కాంతిసంపద
న్నితకరుఁ డే సదృక్షుఁడు వినిర్మలతేజమునం బతంగుఁ డే
శ్రుతి ధృతిఁ గాంచనాచలమె పాటి మతి న్సురమంత్రియే సముం
డితని కనంగ ధాత్రి నుతి కెక్కె నయుత్తము నయ్యవేక్షితున్. 93

వ. స్వయంవరంబునందు హేమవర్మతనూజ యగు వరయును సుదేవతనయ యగుగౌరి
యును బలినందన యగుభద్రయు వీరాత్మజ యగులీలావతియు వీరభద్రపుత్రిక యగు
దారికయు భీమప్రసూతి యగుమాల్యవతియు వైదర్భనృపప్రభవ యగుకుముద్వతి
యుం బ్రియంబునఁ దార వరియించి రన్నరవరాన్వయదీపకుఁ డగునక్కుమారుండు
వెండియుం. 94

క. విలసితబహుస్వయంవర,ముల భుజబలలీల వెలయ మూఁగినన్నృపుల
గ్గెలిచి వరియించె బలిమిని, బలువురు కన్నియలఁ గమలపత్రనయనలన్. 95

అవేక్షితుఁడు విశాలాస్వయంవరమున నెదిర్చి రాజుల నోడించుట.

వ. మఱియు నొక్కనాఁ డక్కుమారుఁడు విదిశాపురంబునకరిగి విశాలభూపాలతనయ యైనవిశాల యనుదాని స్వయంవరంబున సకలదేశమ్ములరాజులం బరాజితులం గావించి బలిమిని వరించిన నమ్మహీపతులు వివర్ణవదనులు విషణ్ణహృదయులు నగుచు నొండొరులం గనుంగొని యిట్లనిరి. 96

పరాజితులగు రాజు లవేక్షితునితో యుద్ధసన్నద్ధులగుట.

ఉ. ఈనరనాథనందనుఁ డహీనపరాక్రమలీల నందఱ
న్హీనులఁ జేసి చేకొనియె నీమృగలోచన నిప్పు డిస్సిరో!
యీనగుఁబాటు మేలె మన మిర్వ్యోడ నుత్కటశౌర్యధర్మము
ల్పూనక యుంటి మేని మనపుట్టువు నక్కట రాచపుట్టువే ? 97

క. వందిజనసూతమాగధ, బృందంబులు మనలఁ బొగడుబిరుదాంకములు
స్పందితభుజాబలుని రిపు,నిం దునిమి యొనర్చ వలయు నిక్కంబులు గాన్. 98

మ. అనిన న్రాజులు రాజపుత్రులు ముమూర్షామర్ష సంగ్రామహ
ర్ష నిరూఢాత్మకు లై మహోగ్రవివిధాంచద్దీపికాలోల్లస
ద్ఘనదోర్దండవిలాసు లై పటుతురంగస్యందనారూఢు లై
యనలోద్దీప్తపదాతిపాదజపరాగాక్రామితాశాకు లై. 99

క. అక్షీణశౌర్యధుర్యు న,వేక్షితునిం జుట్టిముట్టి యిట్లలముగ బా
ణక్షురికాశక్తిగదా, కౌక్షేయాద్యాయుధములఁ గడు నొంచుటయున్. 100

శత్రురాజులు నవేక్షితుఁడును స్వయంవరనిమిత్తము ద్వంద్వయుద్ధము చేయుట.

క. పెక్కండ్రు నరేంద్రులతో, నుక్కన నారాజతనయుఁ డొక్కఁడు ధైర్యం
బెక్కఁగఁ జల మెక్కఁగ నస, మెక్కఁగ నని చేసె నప్పు డెసకం బెసఁగన్. 101

క. ఆనరనాయకు లేసిన, నానానిశితాస్త్రతతుల నడుమన తునియం
గా నేసె నవేక్షితుఁ డా,స్సైనికు లావీరు నిశితశరముల మఱియున్. 102

వ. నొప్పించిన న్ననలి కరికలభంబులపయిం గవియుకేసరికిశోరంబునుం బోలె నక్కుమారుండు కోపించి నిశితవిశిఖపరంపరలు పరగించిన. 103

సీ. కంఠదోరంతరకరపాదఖండన, క్రీడఁ గాల్బలముల గీఁటడంచి
దంతకుంభాస్యహస్త ప్రవిదారణ, కేళి నేనుంగుల నేలఁ గలిపి
పదముఖకంధరాపార్శ్వవిపాటనపరిణతి హయముల బారిసమరి,
రథ్యసారథికేతురథికాంగనిర్దళనప్రౌఢిఁ దేరులు నజ్జుసేసి
తే. రక్తనదుల మాంసరాసుల మస్తిష్క, కర్దమముల భూతకలలములను
ఘోర మైనసమరధారుణిఁ బొలుపార, నేకవీరుఁడై యవేక్షితుండు. 104

చ. వితతపరాక్రమోన్నతుఁ డవేక్షితుఁ డిట్లు రణంబున న్విజృం
భితుఁ డగుచు న్మహీపతులు పెల్కుఱి పాఱఁ దొడంగిన న్ద్విపా
స్వితులుఁ గులీనులు న్రణవిశిక్షితబుద్ధులు భూరిశౌర్యగ
ర్వితులును మైనసప్తశతవీరనృపాలురు దాఁకి రాతనిన్. 105

వ. ఇట్లు పెక్కండ్రురాజులు మీఱి యొక్కమాఱు తన్నుం బొదివిన నొదివినకోపంబున
నాభూపాలనందనుం డొక్కరుండ డీకొని యుద్ధంబు సేయుచు ననేకశస్త్రాస్త్రంబు
లడరించి యవ్వీరుల కవచకార్ముకకంకపత్త్రాదులు ఖండించిన నమ్మేటిమగలు కోపించి
యప్పాటన యతనిం జుట్టుముట్టిన. 106

అధర్మయుద్ధమునఁబరరాజు లవేక్షితునకు బంధాదు లొనరించుట

ఆ. ఒకఁడు విల్లు ద్రుంచె నొకఁడు సారథిఁ గూల్చె
నొకఁడు పడగఁ దునిమె నుక్కు మిగిలి
యతనిహరులఁ గొంద ఱరదంబుఁ గొందఱు
మఱువుఁ గొంద ఱేచి నఱికి రపుడు. 107

క. లీలం గొందఱు పటుశరజాలంబుల నొంచి రతనిఁ జల మెడపక య
వ్వాలుమగఁడు పలుకయుఁ గరవాలుం గొనుటయు నొకండు వడిఁ దునుమాడెన్.

క. వాలి వోవనిమగఁటిమి నబ్బలియుఁడు గద గొనిన దానిఁ బఱియలుగా ను
జ్జ్వలశరముల నొకఁ డేసె, న్నలువురు నృపు లతని మఱియుఁ బటువిశిఖములన్.

తే. పాడి మాలి నొప్పించినఁ బడియెఁ బుడిమి, నాకరంధమనందనుం డంతఁ జెలఁగి
ధర్మ మేది విశాలాదిధరణిపాలు, రదయు లై యక్కుమారుని నంటఁ గట్టి. 110

వ. విదిశాపురంబునకుం గొనిపోయిరి విశాలుం డాస్వయంవరస్థలంబున నిలిచి తానును
బురోహితుండును గూఁతునకు ననేకరాజకుమారులం జూపె నది యెవ్వరి వరియింప
కున్న నమ్మహీపతి దైవజ్ఞులం జూచి నేఁడు వివాహవిఘ్నకరం బైనయుద్ధంబు ప్రవ
ర్తిల్లె నీదినం బొప్పదింకఁ బరిణయోత్సవం బొనర్ప నెన్నండు మే లనిన వారు విచా

రించి కతిపయదినానంతరంబునం బ్రశస్తలగ్నయుక్తం బగుదినంబు గలదు నాఁడీ కన్యకవివాహంబు సేయు మనిన నట్ల కాక యని యతం డాయుత్సవంబుఁ జాలించి చనియె నంత నక్కడఁ గరంధముండు ధర్మపత్నీసహితుండై యనేకవీరావనీశ్వరులు గొలువం బేరోలగంబున నుండి నిజనందనుం డధర్మయుద్ధపరు లైనపరులచేతఁ బట్టువడి బద్ధుండగుట విని పెద్దయుం బ్రొద్దు చింతించుచున్నసమయంబున దీని కెంతయుఁ జింతింప నేల యనువారును బెక్కం డ్రొక్కని నిట్లు చేసినయాపాపాత్ముల నిపుడ పొరిగొనవలయు ననువారును రయంబునం జతురంగంబుల సన్నద్ధంబు గావింప నియోగింపుఁ డనువారును నింతకు మూలం బైనవిశాలుం డెగటార్పక కోపంబు దీఱ దనువారును మనకుమారుండు తగవు దప్పి స్వయంవరంబున బలదర్పితుం డై కన్నియం బలిమిం బట్టుకొని యాగడంబుఁ జేసిన వార లేల సహింతు రనువారును గా మఱియు ననేకు లనేకప్రకారంబులం బల్కు పల్కు లాకర్ణించి వీరవంశప్రసూతయు వీరపత్నియు వీరమాతయు నగువీరమహాదేవి హర్షించి పతి నాలోకించి సకలభూపతులు విన నిట్లనియె. 111

కరంధముఁడు భార్యాప్రేరితుఁడై యవేక్షితు విడిపించుట.

క. నానారాజకుమారుల, మానధనుల నోర్చి మత్కుమారుఁడు కన్యం
దాను బలిమి స్వీకరించిన, యానిరుపమశక్తి యెంత యతిశయ మగునో! 112

ఆ. అవనిపతులు బలియు రండఱు నొక్కనిఁ, దన్నుఁ బొదివికొనినఁ దలఁక కదరి
పోటు లాడి నాదుపుత్రుండు పడుట దాఁ, గీర్తికరము గాని కీడు గాదు. 113

క. మది నీతి గణింపక యున్మదచేతోరౌద్రరసమగ్రతఁ గడు బె
ట్టిదుఁడై సింహముక్రియ రిపువిదళనముం జేఁత సువ్వె వీరగుణ మిలన్. 114

ఉ. భూతలనాథనందనులు భూరిబలాఢ్యులు సూచుచుండఁగా
నాతనయుండు విక్రమగుణస్ఫురణోజ్జ్వలుఁడై స్వయంవరో
పేతనరేంద్రకన్యకల నెంతయు బల్మిఁ బరిగ్రహించు టొ
గ్గే! తగ వేది వేఁడుకొనునే నృపసూతి జఘన్యచాద్వరన్ ? 115

చ. వినుఁడు నరేంద్రులార! పటువిక్రముఁడైనకుమారుబంధనం
బున కయి వంత నొందకుఁడు భూరిభవద్భుజదండవిస్ఫుర
త్సునిశిత హేతిఘాతములఁ జూర్ణము సేయుఁడు వీరవిద్విష
జ్జనవరమూర్ధరత్నవిలసన్మకుటోజ్జ్వలమస్తకస్థలుల్. 116

క. కరితురగరథపదాతులఁ, బరవసముగ నిపుడ పన్నుఁ బంపుఁ డెడఁదఁ బ
ల్వురతోడివిగ్రహం బతిభర మని తలఁపకుఁడు వినుఁడు పార్థివు లెల్లన్. 117

తే. అల్పు లగుమేదినీశ్వరులం దొనర్చు, నల్పవిక్రమమున శూరుఁ డైనవాని
కెవ్వనికిఁ గల్గుఁ బెంపు మహీశులారా!, వినుతబలవిక్రమాధికుఁ డెనసినట్లు. 118

క. కావున నాప్రల్లదు లగు, భూవరుల జయించి వారిభూసామ్రాజ్య
శ్రీవిభవము గైకొనుఁడు మ,హీవల్లభులార! వెడలుఁ డెక్కుఁడు రథముల్. 119

వ. అని యమ్మహాదేవి తెంపుసొంపు పొంపిరివోవం బల్కినం గరంధముండు సకలరాజ్య
సమేతంబుగ సమరసన్నద్ధుం డై పుత్రశత్రుధాత్రీపతులపయిం జనియె వారు నవార్య
శౌర్యధుర్యు లై యతనితోడ మూఁడుదినంబులు దారుణం బగురణం బొనరించి రంత
విశాలుండు నిజపక్షక్షత్రియప్రకరం బపక్రాంతం బగుట గనుంగొని. 120

క. వినయముఁ బ్రియము భయంబును, మనమున ముప్పిరి గొనంగ మహితార్ఘ్యముఁ ద
త్తనయునిఁ దనకూఁతుం గొని, చనియెఁ గరంధమునికడకు సంభ్రమ మెసఁగన్.

క. చని ప్రీతచిత్తుఁ డగున, జ్జనపతిఁ బూజించి యావిశాలుఁడు వినయం
బొనర నవేక్షితుఁ గనుఁగొని, యనఘా! యక్కన్యఁ బరిణయం బగు మనుడున్.

—— { వివాహనిమిత్తము వైశాలినీవిశాల కరంధమావేక్షితుల సంవాదము. } ——

వ. అక్కుమారుం డిట్లనియె. 123

ఉ. ఈనలినాక్షి చూడ నని నెంతయు వైరుల కోడి యే నిసీ!
దీని వరింతు నే మగుడ దీని నె కాదు వరింప నొల్ల నిం
కే నెలఁత న్నిజం బిది యహీనపరాక్రముఁ డైనవానికిం
దీని నరేంద్ర! యిమ్మిదియు నెమ్మి వరింపఁగ నిమ్ము తద్విభున్. 124

వ. అనిన విశాలుండు కూఁతు నాలోకించి. 125

క. పొలఁతీ! యీరాకొమరుని, పలుకులు వింటే? దురాశ పడకు మొరుని నీ
వలసినరాజకొమారుని, నెలమి న్వరియింపు మతని కిచ్చెద నిన్నున్. 126

ఆ. అనిన మోముఁదమ్మి యల్లన వ్రాల నా,బాల యిట్టు లను విశాలుతోడఁ
బలువు రొకనిగెలుపుగెలుపులందోడిన, వాఁడు గాఁ డితండు వారి కాజి. 127

మ. బలుసింగంబు బహుద్విపప్రకరము న్భంజించుచందంబున
న్బలవద్వైరినృపాలపాటనకళాపారీణతం బొల్చు నీ
బలియుం డుత్కటశౌర్యవిక్రమయశోభ్రాజిష్ణుఁ డై యాజిఁ దే
వలుఁ డే? యొరికి ధర్మయుద్ధమున గెల్వ న్వచ్చునే యాతనిన్? 128

క. కొమరారునీకుమారుసు, కుమారరూపంబె గాదు గురుధైర్యము శౌ
ర్యమును బరాక్రమము నౌ, క్కొమొగి న్నామనము నాఁచు కొనియెం దండ్రీ.!

ఆ. వేయు నేమి చెప్ప? వేఁడికొ మ్మీరాజు, తనయుఁ నాకుఁ గాఁగ ధరణినాథ!
యొరుని నింక నేను వరియింప నిది నిక్క, మనిన నవ్విశాలుఁ డతనిఁ జూచి. 130

చ. మనసిజతుల్యసుందర! కుమారవరేణ్య! మదీయపుత్రి ప
ల్కినపలుకు ల్మనోజ్ఞములు కీర్త్యము లారయ నీసమానుఁ డెం
దును నిల లేమి నిశ్చయము దోర్బలశౌర్యఘనుండ వీవు నా
తనయ వరింపవే కులము ధన్యముగా నొనరింపవే దయన్. 131

క. అనిన నవేక్షితుఁ డే నీ, వసితన కా దధిప! యొండువనిత వరింప
న్జన నిజ మీపలుకు లనవుడుఁ, దనయునకుఁ గరంధముండు దా నిట్లనియెన్. 132

క. ఈనృపతికి సంతోషము, గా నీధవళాయతాక్షిఁ దగ నబ్జసమ
త్యాననఁ బ్రేమార్ద్రీకృత, మానస వరియింతు గాక మనసిజమూర్తీ! 133

తే. అనిన నాతండు దేవ! నీయాజ్ఞ కే నొ, నర్ప నింతకు ముంద రెన్నఁడు నవజ్ఞ
యిట్టి దేనైన నానతి యిమ్ము సేయఁ, దగనిపని నన్నుఁ బనుపకు ధర్మవేది! 134

వ. అనిన నక్కుమారునివచనంబులు విని విశాలుండు వైశాలిని నాలోకించి వల్లీ! నీ వింక
నీతనితగులంబు విడువు మనేకరాజకుమారు లున్నవా రందు నీ కభిమతుఁ డైనవాని
వరియింపు మనిన నక్కుమారీరత్నంబు. 135

తే. నిన్ను వేఁడెద వర మిమ్ము నెమ్మి నాకు, నన్ను నితఁ డిప్పు డొల్లకయున్న మీఁది
భవమునం దిక్కుమారుఁడె వరుఁడు గాఁగ, దారుణాటవిఁ జేయుదుఁ దండ్రి! తపము.

తే. అనియె నంతఁ గరంధముం డావిశాలు, తోడినెయ్యంబు మనమునఁ దొంగలింప
నప్పురంబున దివసత్రయంబు నిలిచి, వేడ్కఁ గొడుకుఁ దోడ్కొని తనవీటి కరిగె.

వైశాలిని యరణ్యమునఁ దపము సేయుట.

వ. స్వయంవరోత్సవదర్శనాగతు లైనరాజకుమారులు తమతమపురమ్ములకుం జని రంత
వైశాలినీకన్యక సకలబాంధవులం బరిత్యజించి యరణ్యంబున కరిగి పరమవైరాగ్యా
యత్తయు నిరాహారయు నై దారుణం బగుతపం బొనరించు చుండ మాసత్రయం
బతిక్రమించిన. 138

క. అతులనిరాహారతపో, వ్రతదారుణనియతి నొడలు వట్టి నరము లు
న్నత మై తోఁపఁగ మరణే, ప్సితమతి నయ్యబల దొట్టి పెద్దయు నార్తిన్. 139

దేవదూత వైశాలిని మరణోద్యమమును నివారించుట.

తే. తనువు దొఱఁగంగఁ దలఁచిన దరుణి తెగువ, సుర లెఱింగి చయ్యన నొకచరునిఁ బనిచి
రతఁడు చని యంతరిక్షంబునందు నిలిచి, శోకకృశోదరిఁ గాంచి యిట్లనియెఁ బ్రీతి.

ఆ. దేవదూత నేను దేవతల్ ప్రార్థించి, యర్థి నీకుఁ జెప్పు మన్నకార్య
మబల! వినుము దేహ మతిదుర్లభము దీని, విడువఁ దగవు గాదు వితతపుణ్య! 141

వ. సప్తద్వీపశోభితావనీచక్రసంవహనసమర్థుం డగుచక్రవర్తికిం దల్లివవు దమ్మహాత్ముండు నిజభుజవిక్రమంబున నిఖిలరిపుభంజనం బొనరించుచు దస్యుప్రముఖదుష్టజననిగ్రహం బాచరించుచుఁ దమతమధర్మంబులు తప్పక వర్తిల్లునట్లుగా మహీజనమ్ములం బాలించుచు శతసహస్రసంఖ్యము లశ్వమేధాదిమహాధ్వరమ్ములు సేయుం ననిన నయ్యింతి యల్లన ని ట్లనియె. 142

క. త్రిదివమునుండి వచ్చిన, త్రిదశచరుఁడ వగుదు వీవు తెల్లము సుగుణా
స్పదమూర్తిరి సంతానాభ్యుదయము నా కెట్లు గలుగు పురుషుఁడు లేమిన్. 143

చ. తరణిసిభుం డవేక్షితుఁడు దక్కఁగ నే వినుమీ భవంబున
న్వరుని వరింప సింక నని పట్టితిఁ దండ్రికడం బ్రతిజ్ఞ యూ
పురుషవరుండు నుం బ్రతినఁ బూనినవాఁడు కరంధమక్షితీ
శ్వరుకడ నన్వరింప నని సంతతి యెమ్మెయి నాకుఁ గల్గెడిన్. 144

ఆ. అనిన దేవదూతుఁ డను నీబహూక్తు లే, మిటికి నీకుఁ జెపుమ మీననేత్ర!
తనయుఁ డుద్భవించుఁ దపము పెంపున సమ, స్తమును సిద్ధిఁ బొందు దైవయుక్తి.

వ. నీ వీవనంబున వసించి కృశం బైనశరీరంబు పుష్టంబు గావించుకొమ్మని చెప్పి దేవదూత సనియె నాసుందరి తపం బుడిగి రుచిరాహారమ్ముల దేహపోషణ మొనరించుచుండె నక్కడ నవేక్షితునితల్లి యొకపుణ్యదివసంబునం గొడుకు రావించి తండ్రీ యేను మీతండ్రిచేత ననుజ్ఞాత నై దుష్కరం బగుకిమిచ్ఛకవ్రతంబు దొడంగినదాన నీవు నిర్వహింప వలయు ననిన నా కొండుధనంబు లేమి శరీరంబు నిష్పాదించి యైన నీవ్రతంబు పారంబు నొందించెద నిశ్చింతంబుగ నమ్మింపు మనిన నద్దేవియు. 146

కిమిచ్ఛకవ్రతమిషమున నవేక్షితునకుఁ బెండ్లిపూనికి పుట్టించుట.

ఆ. నియతి నుపవసించి నిధులకు నధిపతి, యైనధనదు ముందు నధికభక్తిఁ
బూజఁ జేసి నిధులఁ బూజించి లక్ష్మికిఁ, బొలుపు మిగుల నగ్రపూజ సేసి. 147

సీ. ఆద్దేవి భక్తిఁ దదారాధనము సేయుచుండఁ గరంధముం డొకవివిక్త
తలమునఁ గూర్చున్నతఱి నాప్తమంత్రులతని డాయ నరిగి యి ట్లనిరి నెమ్మి

ధరణీశ! మఱియు నెంతయు నిష్ఠ నీకును గొడుకు లెక్కుఁ డుండ నాకొడుకు నారి
పరిణయింపనని యున్నవాఁడు మీకుల మింకఁ జెగ నోపుఁ బృథివిని దిక్కు లేక

తే. యుండ నోపు నకట! పితృపిండవిధులు, నిలువఁబడ నోపు నిది గడుఁ జెగులు పుట్టె
నిట్లు గాకుండఁ బ్రార్థింపవే కుమార, వరుని భార్యాపరిగ్రహపరుని గాను. 148

వ. అనుసమయంబున భవనద్వారముననుండి పురోహితుఁ డర్థిజనుల నుద్దేశించి కరంధ
మమహిషి కిమిచ్ఛకవ్రతంబు సలుపుచున్నయది మీ కెవ్వరికి నేమి యిచ్ఛ దాని
నడుగుఁ డనియె నవ్వచనంబు విని యవేక్షితుం డచ్చటికిం జని. 149

ఆ. అస్మదీయజనని యర్థిఁ గిమిచ్ఛక, వ్రతము సల్పుచున్న దతిశయముగఁ
బ్రీతి నడుగుఁ డెవ్వరికి నేమియిచ్ఛ మీ, రర్థులార! యిత్తు నదియె నేను. 150

చ. అనిన తనూజుమాట విని హర్షమున న్వెస నేఁగి భూవిభుం
డనుపమసత్యవాణి యగు మన్వయవర్ధన! యర్థి నేను నా
కు నొసఁగు మీప్సితం బనుడుఁ గొడుకు భవత్ప్రియ మేమి నావుడు
న్ననుమనిసుందరాననము మానుగఁ జూపుము నాకుఁ బుత్రకా! 151

చ. అనిన నవేక్షితుండు వసుధాధిప! నీకు సుతుండ నేన యే
నును విను బ్రహ్మచర్యము మనోజ్ఞముగాఁ గయికొన్నవాఁడఁ బౌ
త్రునివదనంబు చూపఁ గడుదుర్లభ మెమ్మెయి నొందు వేఁడు మిం
పొనరఁగ నిత్తు నావుడు నృపోత్తముఁ డాతనితోడ నిట్లనున్. 152

తే. తల్లివ్రతము చెల్లింపఁగఁ దలఁపు పట్టి, యేమి యడిగిన నిచ్చెద నే నటంటి
విచ్చు నాకొంపు నందు లే దిందుఁ గాని, ప్రతిన నెరపు మవశ్యంబుఁ బౌత్రు నొసఁగి

వ. అకారణబ్రహ్మచర్యంబు పాపహేతువు దానిఁ బరిత్యజింపు మీబహుభావలతోడి
ప్రయోజనం బేమి నామనోరథంబు సఫలంబుఁ జేసి సత్యప్రతిజ్ఞుండ వగు మనినం
బుత్రుం డిట్లనియె. 154

తే. స్వీకృతప్రతిజ్ఞుఁడ నగునాకు నధిపఁ, యిపుడు నీకు నభీప్సితం బి దవశ్య
మగుట సంకటప్రాప్తుండ నైతి సత్య, సంగిఁ గానఁ జేసెద దారసంగ్రహంబు. 155

వ. తండ్రీ! యేను నీచేత సత్యపాశబద్ధుండ నైతి నింక నీచెప్పినయట్ల చేసెద ననితల్లి
వ్రతంబు సగుణంబుగావించె నని మార్కండేయుండు. 156

దృఢకేశుం జంపి యడవియం దవేక్షితుండు వైశాలిని బ్రోచుట.

క. అంత నొకనాఁ డవేక్షితుఁ, డెంతయుఁ గుతుకమున వేఁట యేఁగి మృగములం
గాంతారాంతరమున నత్యంతాసక్తిమెయి నేసి యాడుచు నొకచోన్. 157

తే. నన్ను రక్షింపు మని కరుణముగఁ బెక్కు, మాఱులాక్రోశ మొనరించుమగువయెలుఁగు
విని యతం డోడ కోడకు మని హయంబు, నచ్చటికిఁ దోలికొని వెస నరుగునపుడు.

క. ఘనుఁడు దృఢకేశుఁ డనియెడు, దనుజునిచేఁ బట్టువడినదాన ధరిత్రిం
దనరుకరంధమసుతుసతి, నని మఱియును నవ్వధూటి యాక్రందించెన్. 159

వ. అప్పు డద్దానవుండు. 160

మ. ధరణీవల్లభ యక్షకింపురుషగంధర్వాదు లెవ్వారి సం
గరరంగంబున మార్కొన న్వెఱతు రట్ట న్మృత్యువు న్విక్రమ
స్ఫురణ న్గాలుని మీఱు నెవ్వఁడు రిపుక్షోణీశ్వరశ్రేణికి
న్దర నే నట్టికరంధమాత్మజుని కాంతం బట్టికొంచేఁగెదన్. 161

వ. అనుపలుకు లాలించి యవేక్షితుండు వెఱఁగుపడి మద్భార్య యివ్వనంబునం దెక్కడి
యది దనుజమాయ గా నోపు దానికేమి పోయి యెఱింగెదం గాక యని యతిత్వ
రితంబునం జని యాసురకరగృహీత యై యాక్రోశించు చున్నకన్యకం గని దాని
నాశ్వాసించుచు. 162

క. వినుతప్రతాపవినతా, వనివిభుఁడు గరంధముండు వసుమతి యేల
న్వనితాహరణము చేసితి, దనుజాధమ! పొలిసి తనుచుఁ దద్దయుఁ నలుకన్. 163

సీ. చనుదెంచునృపవరు ఘనధనుర్ధరుఁ గని యెంతయు నార్తి నయ్యిందువదన
రాజేంద్రుఁ డైనకరంధముకోడల నలఘువిక్రమయుతుం డగునవేక్షి
తునిభార్య నీదురాత్మునిచేత నేను సనాథ నయ్యును నిట్లనాథ మాడ్కి
నడవిలోపలఁ బట్టువడి తల్లడిలుచున్నదాన రక్షింపవే దయ దలిర్ప

తే. ననిన నిది నాకు నా కెట్టు లయ్యె నొక్క
రాజునకుఁ గోడ లగుట యేక్రమమొ యనుచు
దగిలి యాత్మస్వ చెఱ మున్ను దలఁగి యింత
తెఱఁగు నెఱిఁగెదఁ గా కంత దీనిచేత. 164

వ. అదియునుం గాక క్షత్రియునకు శస్త్రధారణం బార్తత్రాణకారణంబు గాదె యని
తలంచి యవేక్షితుం డారాక్షసు నిరీక్షించి. 165

తే. బ్రదుక వలతేని వేగ యీపడఁతి విడిచి, యరుగు మోరిదురాత్మ! నీయాత్మ నొందు
తలఁపు గలదేని చక్కనై నిలువు మనుడు, బాల విడిచి నిశాటుఁ డాభీలలీల. 166

ఉ. దండము బాహుదండమునఁ దాల్చి నృపాలతనూజుమీఁద ను
ద్దండరయంబున న్గదియ దైత్యుని నాతఁడు గప్పె విస్ఫుర
త్కాండపరంపరం గెరలి దానవుఁడు న్బొలుపార వైచె నా
దండము చండశంతుసహితం బగుదానిఁ గుమారుపై వడిన్. 167

శా. ఆదండంబు నిశాతబాణములఁ దున్మాడెం గుమారోత్తముం
డాదైత్యుం డొకశూలముం బెటికిఁ బ్రామర్షుఁ డై వైచిన
న్వే దానిం దిలమాత్రఖండములు గావించె న్నరేంద్రాత్మజుం
డాదైతేయుఁడు గప్పె నావిభుని సాంద్రాశ్మోగ్రవర్షంబునన్. 168

తే. నిశితశరముల నాశిలానీక మెల్లఁ, జూర్ణముగఁ జేసె భూపాలసుతుఁడు మఱియు
దనుజుఁ డెయ్యది యడరించె దానినెల్లఁ, దూఁపుగములఁ దోడ్తోడన తునియ వైచె.

ఉ. రక్కసుఁ డట్లు సాధనపరంపర వమ్మయి పోయిన న్దిశ
ల్పిక్కటిలంగ నార్చుచును భీమగతి న్వడి ముష్టిఁ జాఁచి పే
రుక్కున డాసిన న్నరవరోత్తమనందనుఁ డొక్కతూఁపున
న్గ్రిక్కున నమ్మహాసురశిరంబు ధరం బడ నేసె నేసినన్. 170

దేవత లవేక్షితునకు వర మొసంగుట.

మ. సుర లగ్గించుచు సంభ్రమోద మెదల న్సొంపార నవ్వీరుతో
వర మే మిచ్చెద మేమి? వేఁడు మనిన న్వాఁ డిందు సత్పుత్త్రు నొ
క్కరు నత్యద్భుతశౌర్యవీర్యఘను నాకు న్బ్రీతిమై నన్న నా
సుర లీకన్యకయందు నీకు జనియించు న్పుత్త్రుఁ డుద్యద్గుణా! 171

ఆ. అతఁడు చక్రవర్తి యగు నని చెప్పిన, ననియె నాకరంధమాత్మజుండు
జనకుచేత నేను సత్యబద్ధుండ నై, కొడుకు మిమ్ము వేఁడుకొంటి వినుఁడు. 172

వ. ఖండనంబునఁ బగతుర గోడి పాఱి భార్యాపరిగ్రహం బింక నొల్ల నని విశాలరాజ
తనూజ నేను బరిత్యజించితి నిదియును నిన్నుఁ దక్క నన్యసంగమంబు పరిత్యజించిన
యది యట్టివైశాలినిం బరిగ్రహింపక యిపు డీయన్యనారీపరిగ్రహం బెట్లు సేయుదు
ననిన నద్దేవత లిట్లనిరి. 173

క. ఇదియ కదా నీచెప్పిన, యది నీసద్భార్య నీకు నై చేసెఁ దపం
బొదవఁగ నీకును దీనికి, నుదయించును సుతుఁడు సత్త్వయుతుఁడు కుమారా! 174

వైశాలిని యవేక్షితునకు నిజవృత్తాంతముఁ జెప్పుట.

వ. అని చెప్పి బృందారకు లరిగినం గరంధమనందనుం డాసుందరిం జూచి నీవిధం బంతయు
నిదియేమి? నాకెఱింగింపు మనిన నది యిట్లనియె. 175

ఉ. నన్నుఁ బరిత్యజించి నృపనందన! నీ వటు చన్న నంత నే
ను న్నిఖిలాప్తబంధువులను న్విడఁబాసి యరణ్యభూమికిం

గ్రన్నన వచ్చి యేను దొఱఁగం జని తీవ్రతపస్సమాధినై
నున్న సుధాశను ల్వనుప నొక్కచరుం దరుదెంచి ప్రీతితోన్. 176

ఆ. ఇట్టు తగుజె యింతి ! యీయేడుదీవులు, నేలుచక్రవర్తి యాద్యకీర్తి
పుణ్యమూర్తి సుతుఁడు పుట్టు నీ కిది దేవ, వాక్య మొదలు విడువ వలవ దనిన.

క. అనిమిషులదూతపలుకులు, విని సంతస మంది తపము విడిచితి నంత
న్నినుఁ బొందఁగఁ గాంతును నే,నని మనమున నూఱడిల్లి యంగజమూర్తీ! 178

అవేక్షితునితో వైశాలిని నాగలోకవృత్తాంతము చెప్పుట.

వ. అంత నపరదినంబున నేను గంగకుఁ జని యొక్కమడువున నీరాడుచున్నంత నొక్క వృద్ధనాగేంద్రుండు రసాతలంబునకు నన్నుఁ దిగిచికొని పోయిన నందలినాగపతులు నాగాంగనలు నాగకుమారులు సహస్రసంఖ్యలు నాకడకు నరుగుదెంచి బహువిధంబులఁ బ్రశంసించి పూజించి సవినయంబుగా నిట్లనిరి. 179

క. నీ పుత్రున కపరాధం, బీపవనాశను లొనర్తు రిందఱుఁ గ్రుద్ధుం
డై పోరిగొన కుండఁగ నీ, వాపురుషవరేణ్యుఁ మాన్పవమ్మ కడుఁ గృపన్. 180

మ. అని ప్రార్థించిన నట్ల చేసెదఁ బ్రియం బారంగ మీకంటి న
న్న నహీంద్రుల్బహురత్నభూషణము లున్వస్త్రంబుల న్సాంద్రచం
దనమాల్యంబుల వేడ్క నన్నుఁ జెలు వొందం బ్రీతిఁ గైసేసి యం
త నిజావాసము వెల్వరించిన నరేంద్రా ! వచ్చి నే నిచ్చటన్. 181

చ. అనుపమరూపకాంతిమహిమాతిశయంబునఁ దొంటియట్ల నా
తనులత యొప్ప భూషణవితానరుచిం జెలువారుచున్న నీ
దనుజుఁడు చూచి చాఁ దలఁచి దర్పితుఁడై ననుఁ బట్టుకొన్నఁ గా
చినభవదీయబాహుబలజృంభణ మేఁ బొగడంగ నేర్తునే?

క. నాకుఁ బ్రియుండ వగుము గుణాకర ! వరియింపు నన్ను నతులభుజబల
శ్రీకరకమనీయత నిల, నీ కెన నృపసుతుఁడు లేఁడు నిక్కం బరయన్. 183

క. అనినయొలనాగమాటలు, విని పితృవచనములు దలఁచి విమలవిచారుం
డనఘుం డవేక్షితుం డా, వనితకు నిట్లనియె గారవంపు బలుకులన్. 184

ఆ. సానురాగహృదయ వైనని న్నృపుడు నే, రిపుజితుండ నై పరిత్యజించి
నాఁడ నిపుడు శత్రునాశావసరమునఁ, బ్రాప్త వైతి సేయుంభాతి యెది? 185

ఆ. అనిన నింతి యిట్టు లనియె మత్పాణిగ్రహమ్ము సేయుఁ డీవనాంతరమునఁ
గాముకలితు లైనభామినీపురుషుల, సంగమంబు పొలుచు సగుణ మగుచు. 186

గంధర్వుఁ డవేక్షితునకు వైశాలినీ జన్మరహస్యము దెలుపుట.

క. అనిన నతఁ డిట్టు లయ్యెడు, విను పాణిగ్రహణ మిపుడు విధియుక్తముగా
నొనరింప వలయుఁ దన్వీ!, యనునెడ గంధర్వనాథుఁ డధికవిభూతిన్. 187

వ. అనేకగంధర్వాప్సరఃపరివృతుం డై యరుగుదెంచి యవేక్షితుం గాంచి మహాత్మా! యీమానిని నాకూఁతురు దీనిపేరు భామిని యిది బాల్యంబున నగస్త్యాశ్రమమునకుం జని విహరించుచున్న నమ్ముని మనుష్యయోనిం బుట్టు మని శపియించిన నే నిట్లంటి.

క. మునివల్లభ! యిది యవివేకిని యెంతయుం బాల దీనిఁ గృపఁ జూడు మన
మ్మున నెంపు దప్ప దీనికి, ననుగ్రహము సేయు మనిన నతఁ డి ట్లనియెన్. 189

క. బాల యని తలఁచి కాదే, యాలలనకు నల్పశాప మిచ్చితి ననిన
న్నాలఁగ వగచితి నేను వి,శాలున కిది పుట్టెఁ దపసిశాపమున నృపా! 190

వైశాలిన్యవేక్షితుల వివాహము.

వ. అని చెప్పి గంధర్వవిభుం డిది నాపుత్త్రి గానఁ జనుదెంచితి దీనిఁ బరిగ్రహింపుము నీకుం జక్రవర్తియగుపుత్త్రుం డుద్భవించు ననిన నవేక్షితుండు తుంబురుండు హోత గా సుముహూర్తంబున భామినిపాణిగ్రహణమహోత్సవం బంగీకరించె నప్పుడు గంధర్వగీతంబులు నప్సరోనర్తనంబులుం బ్రవర్తిల్లెఁ బుష్పవర్షంబులు గురిసె దేవతూర్యంబులు మనోహరమ్ములై ప్రవర్తిల్లె నంత. 191

క. గంధర్వలోకమున కా, గంధర్వవిభుండు చనియె గంధర్వులతో
బంధురవిభూతిఁ గూఁతుఁ గ,రంధమసుతుఁ దోడుకొని కరము ప్రియ మొదవన్.

వైశాలినియు నవేక్షితుఁడును గంధర్వలోకమునకేఁగి విహరించుట.

తే. ఇట్లు గంధర్వపురమున నెలమి నేఁగి, యానవీనపుదంపతు లాత్మ వేడ్క
లగ్గలింపఁ గోర్కులు తొలఁకాడ నదరి, తమకములు దీర బహువిహారములఁ దగిలి.

సీ. కమనీయకాంచన కాంతిసురమ్యహర్మ్యపరిష్ఠలుల నొక్కొక్కమాటు
కోకపికమధుపమంజులవిహారోల్లసదుపవనాంతముల నొక్కొక్కమాటు
కలహంసశారసకలరవాంచితసరిదురుపులినముల నొక్కొక్కమాటు
శృంగసంగతరత్నరంగదుత్తుంగశైలోపకంఠముల నొక్కొక్కమాటు
తే. లిపుట నొక్కొక్కమాటు పద్మినులపొంత
నద్రి నొక్కొక్కమాటు గుహాంతరములఁ

క్రీడి నొక్కొక్కమాటు కృత్రిమనగముల
బహువినోదము లొలిపిరి పతియు సతియు.

క. అడిసిగ్గులు తమకంబులు, నుడి వోవఁగఁ గేలికడఁక లాడవఁగఁ జేయువు
లుడఁబడ మఱపులు దెలుపులు, నడరి రతిక్రీడ సలిపి రతివయుఁ బతియున్.

క. కిన్నరగంధర్వులు రుచి, రాన్నస్రక్చందనాంబరాభరణాదు
లున్నఁగఁ దమ కొసఁగఁగ సం, పన్నము లగుభోగములకుఁ బాత్రము లగుచున్.

వ. కరంధమరాజనందనుండు గంధర్వరాజనందనయు నిట్లు మనోహరమ్ము లగుమనోభవ
విహారమ్ముల సుఖయించుచుండి రంతఁ గొంతకాలంబునకు. 197

మరుత్తుజననము.

క. గంధర్వరాజనందన, సంధుక్షితతేజుఁ బ్రబలు సత్సుతుఁ గనిన
న్గంధర్వలోక ముత్సవ, బంధుర మై యొప్పె నభము ప్రవిమల మయ్యెన్. 198

సీ. ఎలమి నవేక్షితుఁ డెంతయు రంజిల్లెఁ గిన్నరగంధర్వగీతతతులు
పణవవీణావేణుపటహమృదంగానకాదివాదంబులు నతిశయిల్లె
నప్సరోవనితలయాటలు విలసిల్లె వెసఁ బుష్పవర్షంబు విస్తరిల్లె
నవిరళమృదుగంధపవనంబు శోభిలె దిక్కులన్నియుఁ గడుఁ దేజరిల్లె
తే. నపుడు గంధర్వనగర మత్యంతరమ్య, మయ్యె సురసిద్ధసాధ్యవిద్యాధరాహి
గరుడఖేచరయక్షకింపురుషవరుల, సంకులమ్మున సంయమిసంకులమున. 199

వ. అట్టిసమయంబునఁ దుంబురుం డాబాలునికి జాతకర్మహోమాదిసముచితక్రియాకలా
పంబు నిర్వర్తించి స్వస్తివచనపూర్వకంబుగా నిట్లని స్తుతియించె. 200

క. నీవు మహనీయుఁడవు తే, జోవీర్యధనుండ వురుయశుండవు భూభృ
ద్దేవుఁడవు చక్రవర్తివి, శ్రీవిలసితుఁడవు కుమార జితరిపువీరా! 201

క. శతమఖముఖనిఖిలసుర, ప్రతిపక్షనిరాసనిపుణ! భవదీయభుజా
తతబలకార్యంబులు ప్ర, స్తుతించెదరు వివిధయజ్ఞ సుకృతప్రవణా! 202

వ. అని మఱియును రజోరహితంబుగా నలన వీచుచున్న ప్రాఙ్మరుత్తు నీకు శుభంబును
దక్షిణామరుత్తు నీకు విమలత్వంబును బశ్చిమమరుత్తు నీకు భుజవీర్యంబును నుత్తరమ
రుత్తు నీకు బలంబును నొసంగుం గాత యని దీవించినయనంతరం బాకాశంబున నుండి
యశరీరవాణి యెల్లవారు వినుచుండ నీగురుం డైనతుంబురుండు కుమారునికి మరుత్తులు
శుభం బొసంగు నని పెక్కుమాఱులు పలికె నది కారణంబుగా నితండు మరుత్తనా
మంబునం బ్రఖ్యాతుం డగు మహీపతు లెల్ల నీతనిశాసనంబు శిరంబుల ధరియింతు
రీవీరుండు సకలరాజచూడామణి యగు నీమహాత్ముండు భుజవీర్యపరాక్రమంబులం

పరచక్రపతుల నాక్రమించి సప్తద్వీపాలంకృతం బగుమహాచక్రంబు దాన
యేలి చక్రవర్తి యగు నీమహనీయమూర్తి యజ్ఞకర్తలైనమహీభర్తలలో నగ్రే
సరుం డై వర్తిల్లు నని చెప్పినవచనంబు లాకర్ణించి నాకౌకసులు గంధర్వులు నవేక్షి
తుండును భామినియుం బరమానందంబు నొంది యావాక్యంబులు బహువిధంబులం
బ్రస్తుతించి రంత. 203

పుత్రాదులతో నవేక్షితుఁడు నిజనగరమున కేఁగి తండ్రిం దనుపుట.

సీ. అన్యపాత్ముఁడు నిజాత్ముఁ గాని తాను వనితయుం గంధర్వపతులు గొలువ
తనపురంబున కేఁగి మనుజేంద్రపరివృతుం డైనతండ్రికి వినయమున మ్రొక్కి
యధిప! నీతోఁ బల్కినట్టుల చేసితి, నిదె చూడు పౌత్రునివదన మర్థి
నని సుతు నుత్సంగమున నిడి పడసిన వృత్తాంత మంతయుం విన్నవించు
ఆ. టయుఁ గరంధముండు నయనంబు లుత్కటా, నందవారిబిందుసుందరములు
గా ననూనభాగ్యకలితుండ నైతి నే, నంచు బాలుఁ గౌఁగిలించె వేడ్క. 204

తే. అతఁడు మనువుని మఱియుఁ నందంద ప్రీతి,యదర నాలింగనము చేసి యర్ఘ్యపాద్య
గంధపుష్పాదిపూజలఁ గరము నెమ్మి, నఖిలగంధర్వులకుఁ బ్రియ మాచరించె. 205

ఉ. పౌరులు మానవేంద్రునకుఁ బౌత్రుఁడు గల్గి మిన్ను మోసి సొం
పారఁగఁ జేసి రుత్సవము లప్డు పురం బభిరామ మయ్యె శృం
గారము లొప్పఁ జేసి పురకాంతలు మంగళగీతవాద్యము
లొప్పరున మ్రోయ నృత్యము లపూర్వముగా నొనరించి రెంతయున్. 206

క. భూసురుల రత్నకాంచన, వాసోలంకారధేనువసుధాదాన
శ్రీసొంపున సంపన్నుల, జేసెఁ గరంధముఁడు ప్రీతచిత్తుం డగుచున్. 207

వ. అంత 208

మ. సితపక్షంబున నాఁడునాఁటికిఁ గడుం జెన్నొందుశీతాంశుని
ట్లతిలావణ్యవిలాసభాసురతనుం డై తల్లికిం దండ్రికి
న్నతతాహ్లాద మొనర్చుచుం బెరిఁగి యాచార్యోపదేశంబునం
జతురుం డయ్యె మరుత్తుఁ డాగమముల న్శాస్త్రమ్ముల న్విద్యలన్. 209

తే. అభిమతముగ ధనుర్వేద మధిగమించి, ప్రీతి దివ్యాస్త్రచయము పరిగ్రహించె
నఖిలశస్త్రవిద్యలు వేడ్క నభ్యసించెఁ, గ్రమముతో మరుత్తుండు భార్గవునివలన.

వ. అంత. 211

క. తనకూఁతు రెఱుఁగు డాహి, త్రునిజననము నతఁడు శౌర్యదోర్వీర్యములు
న్విని నిర్భరహర్షరస, మ్మున దేశవిశాలరాజపుంగవుఁడు మదిన్. 212

కరంధముఁడు మరుత్తునకుఁ బట్టాభిషేక మొనర్చి యడవికేఁగుట.

వ. అంతఁ గరంధముం డరణ్యంబున కరుగం దలంచి యొక్కనాఁ డవీక్షితుం బిలిచి
యిట్లనియె. 213

చ. వినుము కుమార! యెంతయును వృద్ధుఁడ నైతి నరణ్యభూమికి
న్జనియెద నేఁ గృతార్థుఁడన సర్వమునందును నీకుఁ బట్టబం
ధన మొనరించునీకొలఁ దక్కను నొందు గొఱంత లేదు నా
కనుపమ మైనరాజ్యముఁ బ్రియంబునఁ గైకొను మీవు నావుడున్. 214

ఉ. ఆనతవక్త్రుఁ డై యనియె నాతఁడు రాజ్యము సేయ నొల్లఁ దం
డ్రీ! నెఱ నాఁడియున్నయది యీధర కన్య నొనర్చు రాజుగా
హీనత నొంది నీకతన నేఁ జెఱఁ బాసినయప్డు పౌరుష
శ్రీ ననుఁ బాసెఁ బౌరుషగరిష్ఠుఁడు గాక ధరిత్రి యేలు నే? 215

క. ఏపురుషునియాపద లెడఁ, బాపంబడు నొరులచేతఁ బరికింపంగా
నాపురుషుఁడు దా స్త్రీధ, ర్మోపేతుఁడు నిష్ప్రభావుఁ డుర్వీనాథా! 216

వ. కావున నీచేత మోక్షితుండ నై స్త్రీసమానధర్ముండ నైన నేను మహీభర్త నగుదు నే?
స్త్రీకి శూరుం డగుపురుషుండు గదా భర్త యగు ననినఁ దండ్రి యి ట్లనియె. 217

తే. కొడుకునకుఁ దండ్రి తండ్రికిఁ గొడుకు వేఱు, గామి యది పరమార్థంబు గానఁ దండ్రి
నైననాచేత మోక్షితుఁ డైతి గాక, యొరునిచే ముక్తుఁ డైతివే యురుగుణాఢ్య? 218

క. అనినం దండ్రికి సుతుఁ డి, ట్లను నీచెప్పినది నిక్క మగు నైనను నా
మన సొడఁబడ దే నీచే, విని మోక్షితుఁ డగుట నాకు వ్రీడన సేయున్. 219

తే. ఒనరఁ దండ్రిచే లక్ష్మిఁ గైకొనునతండు, తండ్రిచేఁ గ్లేశములఁ బాసి తనరునతఁడు
తండ్రిచేతన వెలయు నతఁడు మదీయ, కులమునందును లేకుండ వలయుఁ దండ్రి!

వ. అని పెక్కుభంగులఁ జెప్పినకొడుకు నొడఁబఱుప నేరక మరుత్తునిం బిలిచి నీవు మహీరాజ్యంబు గైకొను మనిన నతండు తండ్రి పంపున నొడంబడియె నంత నామనుజేంద్రుండు మనుమనికిం బట్టంబు గట్టి భార్యాసమన్వితుం డై వనంబునకుం జని వేయి వత్సరంబులు ఘోరతపంబుఁ జేసి శరీరంబు విడిచి సురలోకప్రాప్తుం డయ్యెఁ దదీయపత్ని వీరమహాదేవి మఱియుం శతవర్షంబులు ఫలమూలకృతాహారయై పతిసాలోక్యంబు గోరి భార్గవుం డైనయౌర్వాశ్రమంబున మునిశుశ్రూష సేయుచుం దపోవృత్తినుండె నని చెప్పిన విని క్రోష్టికి మార్కండేయుం డి ట్లనియె. 221

మరుత్తచక్రవర్తిచరిత్ర.

చ. అనుపమధర్మమూర్తియు నయాదరవర్తియుఁ జక్రవర్తియు
న్ఘనభుజవీర్యుఁడు న్రిపువినాశకరోద్భటశౌర్యుఁడు న్జగ
జ్జనమతకీర్తిధుర్యుఁడును శాంతుఁడు దాంతుఁడు నైనయమ్మరు
త్తునిచరితం బొగి న్వినఁ గుతూహల మయ్యెడు నాకుఁ జెప్పవే. 222

చ. అనుడు మృకండుసూనుఁడు మహాత్మ! పితామహుచేత నమ్మరు
త్తనృపతి వేడ్కఁ బెంపెసఁగఁ దా పృథురాజ్యపదస్థుఁ డై మహీ
జనములఁ గాచుచు న్సవనసంపద నొందుచు నెల్లదీవులం
దనఘునచక్ర మప్రతిహతం బగు చుండఁగ నత్యుదగ్రతన్. 223

క. తనరథగతి యాకాశం,బునఁ బాతాళమున నుదకములయందును నెం
దు నకుంఠిత మై మెఱయఁగ, ననఘుండు మరుత్తుఁ డేలె నఖిలావనియున్. 224

తే. ఇతరవర్ణులు నమ్మేదినీశువలన, నధికధనములు వడసి నిరంతరంబు
నాస్థతో నిష్టపూర్తము లాదిగాఁగఁ, గలుగుధర్మము ల్సేసిరి గారవమున. 225

సీ. ఆంగిరసుండు బృహస్పతితోఁబుట్టు వతులతపోవిభవాధికుండు
సంవర్తుఁ డనియెడుసంయమి తనకు ఋత్విజుఁ డయి ముంజవద్దివ్యనగము
శిఖరంబు నిజశక్తి క్షితిఁ బడఁ జేసి యందపరిమితం బైనయర్థసంచ
యమ్ముఁ జూపినఁ గొని యమ్మరుత్తుఁడు హేమకుట్టిమస్థలములఁ గొమరు మిగుల
తే. హర్మ్యశాలాదినానాగృహముల బహువిధోపకరణములను మహాయూపములను
గనకమయములఁ గావించి క్రతువు లోలిఁ, జేసి దివిజులఁ దృప్తులఁ జేసె నర్థి. 226

వ. ఇట్లు మరుత్తుండు సోమంబున నింద్రాదిదేవతలను సమగ్రదక్షిణల మహీదేవతలను
దృప్తి నొందించి సువర్ణమయంబు లగుప్రాసాదాదిసమస్తవస్తువులును బ్రాహ్మణుల
కొసంగి మహోత్కృష్టుం డై మహీపాలనంబు సేయుచుండ నొకతపోధనుండు చను
దెంచి యానరపతిం గాంచి యేను భవత్పితామహుకడనుండి వచ్చితి నాయన్న
నీకుం జెప్పు మనినవాక్యంబు లాకర్ణింపుము. 227

మరుత్తునితో ముని చెప్పిన నాయన్నసందేశము.

ఆ. ధరణి ధర్మయుక్తిఁ దగఁగఁ బాలించి నీ, తాత చనియె దివిజధామమునకుఁ
దపము సేయుచున్నదాన నార్వాశ్రమ, స్థలమునందు శాంతి దనర నేను. 228

తే. పుడమి పాలించి చనినమీపూర్వనృపుల, యందు మున్నెతరమున నైన నుర్వి
నెన్నఁడును బుట్ట దేకీడు నెచట నకట!, నీతరంబున నొకకీడు నేఁడు పుట్టె. 229

క. సురుచిరభోగాసక్తిం, బొరసి రయి సతతాధ్వరేచ్ఛ పొందిరయి యకటా!
చరనయసారథుఁడవైనీ, వరయువు దుష్టులు నదుష్టు లగువారి నిలన్. 230

వ. అది యెట్లంటేని. 231

సీ. అధికదర్పోన్నతి నహిలోకమునుండి చనుదెంచి ఘోరభుజంగములు
మునుల వినిర్మలమూర్తుల నేడ్వురఁ గఱచి వేగమ మృత్యుగతులఁ జేసి
విలసజ్జలాశయములు నిజస్వేదమూత్రపురీషముల దూషితములు సేసెఁ
గడఁగి హవిస్సులు గాసి చేసినవాని సమయింప సంయము లశక్తులైన
తే. వారు దండింప నొడయలు గారు నీవ, యొడయఁడవు నృపోత్తమ! ధర్మయుక్తి నంత
దాఁక నభిషేకజలము లౌదలను రావు, రాజు మరుఁ డంతదాఁక భోగైకపరుఁడు.

క. ఆట మీఁద ధరణిపాలన, పటుకర్మములందుఁ దగిలి బహుదుఃఖము లం
దుట గాక యతని కత్యు, త్కటభోగపరత్వ మొందు గలదె నరేంద్రా! 233

క. మహివల్లభునకు దేహ, గ్రహణము భోగములకొఱకుఁ గాదు ధరిత్రీ
వహననిజధర్మపాలన, బహుదుఃఖనిరంతరానుభవమునకు నృపా! 234

క. ఇహలోకమున మహీపతి, బహుదుఃఖము లనుభవించి పరలోకమున
న్పృహలుకాల మప్సరోవర, మహిళాసంభోగసౌఖ్యమహనీయుఁ డగున్. 235

వ. కావున నింతయు విచారించి రాజ్యభోగంబులు పరిత్యజించి ధరణీపాలనక్లేశంబు లంగీకరింపు మచారుండ వగుటం జేసి భుజంగకృతద్విజమరణంబు గాన నేర వైతి వేయును జెప్పనేల దుష్టనిగ్రహం బొనరించి శిష్టప్రతిపాలనంబునం దదీయధర్మంబునందాఱవభాగం బందుము రక్షింపక యుపేక్షించితేని దుష్టకృతదురితం బంతయు నిన్నుఁ బొందు నిది యసందిగ్ధం బని నిజపితృజనని చెప్పఁ బనిచినవిధంబు సమస్తంబును జెప్పితి నిందు నీమనంబున కెయ్యది రుచి దానిన చేయుం డనిన మునివచనంబులు విని మరుత్తుండు లజ్జాయత్తచిత్తుం డగుచుఁ దన్నుం దాన నిందించుకొని నిట్టూర్పునిగిడించి యప్పుడు. 236

మరుత్తుఁడు సంవర్తాస్త్రముచే నాగలోకముఁ దపింపఁ జేయుట.

క. ధనువును దివ్యాస్త్రంబులు, గొని యార్వునియాశ్రమమునకుం గదు వేగ
మ్మున నేఁగి పితామహికిని, మునులకుఁ బ్రణమిల్లి రాజ్యముఖ్యుం డిదురన్. 237

ఉ. పాములచేతఁ జచ్చి భువిఁ బడ్డమునీంద్రులఁ గాంచి పార్థివ
గ్రామణి యుల్ల ముమ్మలికఁ గాలఁగఁ బల్మఱుఁ దన్ను దిట్టుకొం

చేమఱి యింతపాపమునకే పాలవైతివె ! దుష్టపన్నగ
స్తోమము నాభుజాబలముసొంపునఁ బెంపుఱ నేపు డించెదన్. 238

చ. అని పటుకోపపావకశిఖారుణితాంబకదీప్తవక్త్రుఁడై
యనిమిషయక్షకిన్నరవియచ్చరమానవులార ! చూడుఁడీ
యనుపమపుణ్యమూర్తుల మహాత్ముల నిమ్మునుల న్విషాగ్నిఁ ద్రుం
చినయహికోటి నెల్ల నిటు చేసెదనో భుజవీర్యసంపదన్. 239

క. అని పలికి మరుత్తుఁడు రయమున సంవర్తకమహాస్త్రముం దొడి పవనా
శననాశమునకు నై యేసిన నది దుర్వారవహ్ని శిఖ లెగయంగన్. 240

శా. పాతాళం బఖిలంబునుం బరగి సర్పశ్రేణుల న్సర్వలో
కాతంకంబుగఁ గాల్పఁ జొచ్చుటయు హాహారావము ల్సేయుచు
న్భీతిం దల్లులఁ దండ్రుల న్దనయుల న్వే చీరుచు న్బన్నగ
వ్రాతమ్ము ల్దహనార్చుల న్బడగలు న్వాలంబులు న్వ్రాలఁగన్. 241

క. కరమార్తిఁ బొంది వస్త్రాభరణంబులు దిగ్గవిడిచి పాతాళముఁ బె
చ్చెర వెడలి మరుత్తజనని, శరణము వేఁడుచు రయమునఁ జనిరి మునీంద్రా ! 242

ఉ. చని యాభామినిఁ గాంచి యార్తి యడర న్సర్పంబు లందంద వం
దనము ల్సేసి సగద్గదస్వనముల న్దల్లీ ! దయ న్మాకు ని
చ్చినయానాఁటివరంబు నేఁడు మదిలోఁ జింతింపు యుష్మత్సుతా
స్త్రనితాంతాగ్ని నశింప కుండఁగ వెస న్రక్షింపు మమ్మందఱిన్. 243

క. ఘోరాస్త్రానలమున విపు, లోరగలోకంబు గాల్ప కుండఁగఁ దల్లీ !
వారింపుము నీపుత్త్రకు, నేరూపున నైనఁ గావు మీయహికులమున్. 244

క. స్ఫురితామర్షోద్దీపిత, మరుత్తఘోరాస్త్రవహ్ని మాఁడెడుమాకు
న్గరుణింపు నీవు దక్కఁగ, శరణం బగువారు లేరు సాధుచరిత్రా ! 245

వ. అనినయయ్యురగంబులవచనంబులు విని వారికిం దొల్లి తనయిచ్చినవరంబునుం దలంచి సంభ్రమంబునం బతి నాలోకించి పాతాళంబునకు నన్నుం దోడ్కొని పోయి ప్రార్థించిన వీరి కభయం బిచ్చినదాన నాపలుకు నసత్యంబు గాకుండ నీకొడుకు వారింపు మనిన నవేక్షితుం డత్యపరాధం బొనర్చిన యాదర్వీకరంబులందు భవన్నందను కోపంబు దుర్వారం బై యున్నయది యెట్లు మాన్పింప వచ్చునని తలంచెద నని నదందశూకంబులు తల్లడిల్లి మహాత్మా! యట్లనకుము శరణాగతులము మాకుం బ్రసన్నుండ వగుము క్షత్త్రియులశస్త్రధారణం బార్తత్రాణకారణంబు గాదె యని ప్రార్థించిన నతండు. 246

క. శరణాగతార్తదర్వీ, కరదీనోక్తుల మనంబు గడుఁ గరుణారస
భరిత మయిన నిట్లనియెను, ధరణీనాయకుఁడు ప్రీతిఁ దనసతితోడన్. 247

క. తరుణీ! యేసీపంపున, మరుత్తు వారింతుఁ గాతు మానుగ నరో
త్కరము నవశ్యమ్మును విను, శరణాగతులం ద్యజింపఁ జన దెవ్వరికిన్. 248

భామినివాక్యమున నవేక్షితుండు పాముల రక్షింపఁ బ్రతిజ్ఞ చేయుట.

క. ఏను నావచనంబుననీ, తనయుం డత్యుగ్ర మైనతనయస్త్రము చ
య్యాన సంహరింపకున్నను, ఘనదివ్యాస్త్రహతి దానిఁ గ్రాతుం దరుణీ! 249

మ. అని రాజన్యవరుం డవేక్షితుఁడు పూజ్యుం డైనచాపంబు న
స్త్రనికాయంబును దాల్చి తాను సతియుం బ్రాఁగెల్లనౌర్వాశ్రమ
మ్మునకుం బోయి మహోగ్రకార్ముకరుచిస్ఫూర్జద్భుజుం దామ్రలో
చను దివ్యాస్త్రసముద్గతానలశిఖాసంవ్యాప్తరోదోంతరున్. 250

తే. దారుణానలాస్త్రంబు పాతాళమునకు, నుగ్రమూర్తియై చొనుపుచు నున్నవాని
నమ్మరుత్తుని గని డాయ నరిగి యిట్టు, లనియె నల్పస్వరమున వీరాత్మజుండు. 251

పాములకై మరుత్తావేక్షితుల సంవాదము.

క. చనునయ్య యింత కోప, మ్మున బటుసాహసము సేయ భూపోత్తమ! నీ
కనురూపం బే యిది స,య్యాన నీ వుపసంహరింపు మస్త్రానలమున్. 252

క. అనినట్టితండ్రి పలుకులు, విని తప్పక చూచి చేత విల్లుండఁగ న
జ్జనపతి సగౌరవంబుగ, జననికి జనకునకు మ్రొక్కి చండస్ఫూర్తిన్. 253

శా. ఏమీ యస్త్రము సంహరింపఁ దగునంటే తండ్రి! మద్వీర్యము
న్సామర్థ్యంబు తృణీకరించి యిటు లీసర్పులు న్సభ్యుల
న్సామర్థ్యాత్మకు లై యకారణము యీవ్యాళాధముల్ గ్రూరు లు
ద్దామక్రోధులు చంపి యుండఁగను నీత ప్పేను సైరింతు నే?. 254

క. కావున నీబ్రహ్మఘ్నుల, కై వసుధాధీశ! యడ్డ మాడకు మింక
న్నీ వించుక యుండుఁగను నే, నేవిధమున ననిన నయ్యవేక్షితుఁ డనియెన్. 255

క. ఈమునివర్యులఁ జంపిన, పాములు నరకంబునందుఁ బడుఁగా కవి నీ
కేమి వెస నస్త్ర ముడుపుము, నామాట ప్రియంబుతో నొనర్పుము పుత్రా! 256

ఆ. అనిన నమ్మరుత్తుఁ డతిపాపు లగువీరి, నిగ్రహింప కున్న నిరయమునకు
నేను బోదుఁ గాక యీపాము లేఁగునే?,దండ ముడుగు మనుట దగునె తండ్రి! 257

వ. అని మఱియు నత్యంతాపరాధు లైనయాదుష్టోరగమ్ములకు నే నుపశమింప మదీయ

ధర్మంబు విడిచి నీవంపుడు నే నొనరింప ననినం గరంధమనందనుండు కటకటంబడి కొడుకున కిట్లనియె. 258

చ. వల దని యెంత చెప్పినను వారక మచ్ఛరణాగతాహుల
న్బొలియఁగఁ జేయఁ జూచె దది పొల్లగఁ జేసెద నస్త్రవేది వీ
విల నరయంగ నొక్కరుఁడ వే? వివిధాస్త్రములే నెఱుంగనే?
నిలుచునె నీదురాగ్రహము నేర్పును నాయెదుర న్దురాత్మకా! 259

సీ. అని కడుఁ గోపించి యయ్యవేక్షితుండు దామ్రాత్ముఁడై యుగ్రశరాసనమునఁ
బటుతరానలశిఖాభయద కాలాస్త్రంబు సంధించుటయు నిల సంచలించె
నయ్యస్త్రఘోరత్వ మమ్మరుత్తుఁడు సూచి యిట్లనుఁ దండ్రితో నేను దుష్ట
దమనార్థ మిమ్మహాస్త్రము ప్రయోగించితిఁ గాని నీపై నేయఁ గడఁగ నీవు
ఆ. ధర్మపద మొకింత దప్పనినామీఁద, నీశరంబు దొడుగ నేల చెపుమ?
ప్రజలఁ బాడితోడఁ బరిపాలనము సేయుం, నన్నుఁ జంపఁ గారణంబు గలదె? 260

తే. అనిన నయ్యవేక్షితుండు భయార్తరక్ష, యేను గావింపఁ బూనితి దాని కీవు
గడఁగి విఘ్నం బొనర్చితి గాన నీకు, బ్రదికి పోవంగ రాదు నాయెదుర నింక. 261

క. నను నీవొండె శరానల, మున నీఱుగఁ జేసి సర్పములఁ ద్రుంపు వెస
న్నిను నే నొండె శరానల,మున నీఱుగఁ జేసి సర్పములఁ గాతు వెసన్. 262

క. అతిభీతుఁ డైనశరణా, గతు నార్తుని శత్రు నైనఁ గడుకొని కరుణా
న్వితుఁడై రక్షింపనిదు,ర్మతి యగుకుత్సితుని బ్రతుకు బ్రతుకే తలఁపన్ ? 263

ఆ. క్షత్రియుండ నాకు శరణాగతాతురో, రగవితాన మది దురాత్మ! తదప
కారకారి వీవు కావున వధ్యుండ, వనినఁ దండ్రి కిట్టు లనియెఁ గొడుకు. 264

క. తనబాంధవుండు మిత్రుఁడు, జనకుఁడు గురుఁడనక కడఁగి చంప వలయు భూ
జనపరిరక్షావిఘ్నం, బొనరించిన నీతి యోఁది యుర్వీశునకున్. 265

క. కావున నిన్నువధించెద, నీ వలుగకుమీ నరేంద్ర! నృపధర్మం బేఁ
గావించెదఁ గాని యమ, ర్షావేశము లే దొకింత యైనను నాకున్. 266

వ. అని యిట్లు తండ్రియుం గొడుకును నొండొరులం జంపు తెంపుసొంపునం బ్రచండమూర్తు లై యున్న నయ్యిరువురకడకు నతిసంభ్రమంబున నరుదెంచి యౌర్వాది మునిజనంబులు వారల వారించిన నత్తపోధనుల నాలోకించి మరుత్తుండు మహీపతి నైన నాకు నీదుష్టోరగంబుల దండించుట నిజధర్మంబు గాదే! యిందు నాచేసినయపరాధంబు గలదే? యనిన నవేక్షితుం డిట్లనియె. 267

చ. శర ణని వచ్చి చొచ్చిరి భుజంగవరు ల్కరుణాత్ములార! నా
శరయఁగ రక్షితవ్యులు తదార్తులఁ జంపుమదాత్మజుండు ని

ష్ఠురుఁ డపరాధి కాఁడే? యనుడు మును లార్జితధర్ము లైనయ
య్యిరువురఁ జూచి మీరు వినుఁడీ భుజగంబులపల్కు లేర్పడన్. 268

సీ. దుష్టపన్నగవిషనష్టచేతను లైనయిమ్మహామునుల నీక్షణంబ
యుజ్జీవితులఁ గాఁగ నొనరింతు మనియెద రిదె తల్లడిల్లి యహీంద్రు లెల్లఁ
గావున నింక విగ్రహము మీ కేటికి వలదు మానుఁడు ప్రసన్నులరు గండు
సత్యప్రతిజ్ఞులు సద్ధర్మపరులు మీ రిరువురు నిఖిలరాజేంద్రులం[దు]
ఆ. ననిరి వీర యప్పు డయ్యవేక్షితుఁ డాసి, నీసుతుండు గరము నెమ్మి నాదు
పనుపుఁ జేసి పాఁపపడుపుఁ గీటడఁప నుద్యమము చేత సఫల మయ్యె ననఘ 269

వ. మృతు లైనమునిపతులు సంజీవితు లగుటం జేసి నీసుతుండును కృతార్థుండు భవదీయ
శరణాగతులు వీతభయు లివ్వారు లైరి కావున నీవును ధన్యుండవ యని కొడుకును
దీవించె నంత నాభామిని తనయుతకు నమస్కరించి యురగులరక్షణార్థంబు పతి
కిం దనని యోగించిన తెఱఁ గంతయు నెఱిఁగించి దేవీ! నీప్రసాదంబున నీపుత్త్రపౌత్త్రు
లకు శోభనంబు దొరఁకొనియె నని పలికిన నయ్యిరువురుం దమదివ్యాస్త్రంబు లుపసం
హరించిరి తదనంతరంబ. 270

ఆ. విషహారంబు లైనవివిధదివ్యౌషధ, ములఁ భుజంగవరులు మునులఁ బరమ
శాంతిఘనుల నపుడు సంజీవితులఁ జేసి, చనిరి భుజగభువనమునకు నెలమి. 271

చ. ఘనుఁడు మరుత్తుఁ డప్పు డధికప్రమదంబున వచ్చి తండ్రికి
న్వినయ మెలర్ప మ్రొక్కుటయు వేడుక గ్రక్కునఁ గౌఁగిలించి య
జ్జనపతి పుత్త్ర! సత్యజయసంపదయు న్బహుపుత్త్రపౌత్త్రవ
ర్ధనమును నాయురాప్తియును రాజ్యవిభూతియు నీకుఁ గావుతన్. 272

చ. అని సుతుఁ బెక్కుదీవనల నవ్విభుఁ డెంతయుఁ గారవించి య
మ్మునులకుఁ దల్లికిం దగఁగ మ్రొక్కి క్రమమ్మున వారి నెల్ల వీ
డ్కొని బహురత్ననూత్నరుచిగుచ్ఛమనోజ్ఞరథమ్ము నెక్కి నం
దనుఁడును దాను నాలును ముదం బెసఁగ న్జని రంత వీటికిన్. 273

వ. ఇట్లు ప్రవేశంబు సేసి. 274

మహాస్రగ్ధర. భవనప్రాసాదహర్మ్యోపరితలవిలసద్బాలికాలోచనోద్య
ద్ధవళాంశుశ్రేణితోడ న్దనపయి సితముక్తాసమేతాక్షత ల్వా
ర్వ వరిష్ఠుం డామరుత్తావనిపతి చనియె న్వైభవ మ్ముల్లసిల్ల
న్వివిధాలంకారశోభావిభవవిరచనావిస్ఫురద్రాజవీథిన్. 275

తే. పురమువిభవంబు సూచుచు భూరితరవి, భూతి నల్లల్లఁ జని రాజపుంగవుండు
నగరుసొచ్చె సమస్తజనంబు చంద్రు, నుదయమునను జలధులట్లు లుబ్బుఁ జెంద. 276

ప. అంత నిఖిలరాజోత్తముం డగుమరుత్తుండు మహీమాయత్తుం డై మహీరాజ్యంబు
సేయుచు విదర్భరాజనందన యైనవైదర్భియుఁ సువీరపుత్త్రి యైనప్రభావతియును
మాగధతనయ యైనసుకేశియుఁ గేకయసుత యైనకైకేయియు సురంధ్రమహీపతిత
నయ యైనసౌరంధ్రియుఁ సింధునృపతిప్రభవ యైనవపుష్మతియు చేదిపతితనయ యగు
సుశోభనయుఁ నను కన్యల వివాహం బై వారియందు నరిష్యంతాదు లైనకొడుకులం
బదునెనమండ్రఁ బడసి సంవత్సరంపరాభివృద్ధి నొంది. 277

సీ. చెలువొందు నేడుదీవులయందుఁ దనచక్ర మప్రతిహతవృత్తి నతిశయిల్లఁ
గొమరారుమూఁడులోకములందు నెప్పుడు తనరథం బతిరయోద్ధతిఁ జరింపఁ
బొలుచుచతుర్దశభువనంబులందును దనచారుకీర్తి నర్తన మొనర్ప
విలసిల్లుబ్రహ్మాండవివరంబునం దెల్లఁ దనతీవ్రతేజంబు దనరి వెలుఁగ
తే. లోనిశత్రులు వెలిశత్రులును నిజప్ర, శాంతివిక్రాంతివిస్ఫూర్తి శాంతిఁ బొంద
లీలఁ జతురంతధాత్రిఁ బాలించుచుండె, సతతకీర్తి మరుత్తాఖ్యచక్రవర్తి. 278

క. అనఘుం డైనమరుత్తుని, జననము చరితంబు వినినజనులకుఁ గలుగున్
ధనధాన్యపుత్త్రపౌత్త్రా, ద్యనుపమవిభవములు నిర్భరానందంబున్. 279

వ. అని చెప్పి మార్కండేయుండు క్రోష్టుకీ! సూర్యప్రభవంబు లైనరాజవంశంబులు
వంశానుచరితంబులును లౌకికవైదికపారమార్థికంబు లైనయర్థజాతంబులు నీయడిగిన
విధంబునం బరిపాటిఁ దేటపడ నెఱింగించితి నేతత్పురాణకథ లాకర్ణించితే? భవదీయ
హృదయంబు పరమజ్ఞానదీప్తం బైనయదియే? సమస్తసంశయమ్ములు నివృత్తమ్ము
లయ్యెనే? యనవుడు నతండు. 280

చ. అనుపమభార్గవాన్వయసుధాంబుధిచంద్ర! మహామునీంద్ర! స
ర్వనిగమసారబోధజనిరంజితచిత్తపవిత్రవృత్తవం
దన! నతిసంశ్రితార్థిజనతాహరిచందన! శ్రీమృకండునం
దన! సకలంబు నాకు విదితంబు కృతార్థుఁడ నైతి నీకృపన్. 281

ఆ. అనఘ! నీప్రసాదమున నిమ్మహాపురా, ణార్థజాత మెల్ల నర్థి నాదు
సంశయంబుఁ బాపె సర్వంబు నెఱిఁగితి, వినుతదివ్యబోధఘనుఁడ నైతి. 282

వ. అని క్రోష్టుకి ప్రహృష్టహృదయుం డై మార్కండేయుం బహువిధంబులం బ్రస్తుతించి
నమస్కరించి వీడ్కొని నిజాశ్రమంబున కరిగి పరమానందంబునం దప మాచరించు
చుండె నని పరమజ్ఞానచక్షు లైనపక్షులు పారాశర్యశిష్యుం డైనజైమినికి మార్కం
డేయపురాణకథావృత్తాంతం బెఱింగించి యిట్లనియె. 283

ఫ ల శ్రు తి

క. శ్రీమార్కండేయపురా, ణామృతరససేవఁ జేసి యజరామరు లై
ధీమంతులు గాంతు రొగి, న్భోగస్వర్గాపవర్గపదసుఖలీలన్. 284

సీ. అతిభక్తితో నిమ్మహాపురాణము సభాస్థలమున జెప్పుడుఁ జదువువారు
వినియెడువారును గొనియాడువారును, వ్రాయువారలును దీర్ఘాయురర్థ
బహుపుత్రధనధాన్యమహిమఁ బ్రసిద్ధులై, పెను పొందుదురు వారి కనుదినంబు
నతులతపఃప్రభావాన్వితుం డైనమార్కండేయసంయమి కరుణఁ జేసి
తే. సర్వతీర్థఫలములును సర్వదాన, ఫలములును సర్వమఖఫలమ్ములును గలుగుఁ
బాయు నాపద లెల్ల శుభమ్ము లొలయు, ననుపమజ్ఞాన ముదయించు మునివరేణ్య!
క. అని చెప్పిన విని జైమిని, మన మానందమునఁ దేల మధురోక్తుల నిం
పొనరఁగ నాద్విజవరులకు, వినుతి గడు జేసి యధికవినయము తోడన్. 286
వ. ఇట్లు భవదీయవాగ్దేవతాప్రసాదంబున మార్కండేయకథితమహాపురాణజాతార్థం
బంతయు విని కృతార్థుండ నైతి నని యాపుణ్యపక్షుల దీవించి వీడ్కొని నిజాశ్ర
మంబునకుం జని పరమానందభరితుం డగుచు నుండె. 287

ఆశ్వాసాంతము.

చ. సరలకళాచతుర్ముఖ! యశశ్శ్రితదిఙ్ముఖ! బాహుదండవి
స్ఫురదురుశక్తిషణ్ముఖ! వచోవిలసన్ముఖ! వైరిభీమకం
గరముఖ! నిత్యపోషణవికాసిసుహృన్ముఖ! కాకతిక్షితీ
శ్వరపురపాలనప్రకటశౌర్యవిశేషణ! వంశభూషణా!. 288
క. శ్రీకీర్తివిజయనిత్యా! లోకజనస్తుత్య! మర్త్యలోకాదిత్యా!
స్వీకృతసంతతసత్యా! శ్రీకంఠశ్రీశభృత్య! శ్రీకరకృత్యా!. 289
మాలిని. ప్రలలితబుధకామా! భామినీచిత్తధామా!
కులజలనిధిసోమా! కోవిదస్తుత్యనామా!
బలవదహితభీమా! బాహువీర్యాభిరామా!
విలసితగుణధామా! విస్ఫురత్కీర్తిదామా!. 290
గద్యము. ఇది శ్రీమదుభయకవిమిత్ర తిక్కనసోమయాజిప్రసాదలబ్ధసరస్వతీపాత్ర
తిక్కనామాత్యపుత్ర మారయనామధేయప్రణీతం బైనమార్కండేయ మహాపురా
ణంబునందు బ్రాంసుచరితంబును ఖనిత్రచరిత్రంబును క్షుపోపాఖ్యానంబును వీరనృప
సంభవంబును వివింశోపాఖ్యానంబును ఖనిత్రనేత్రచరితంబును గరంధమోపాఖ్యా
నంబును నవేక్షితచరితంబును మరుత్తోపాఖ్యానంబును నను కథలం గలయష్టమాశ్వా
సంబు సర్వంబును సంపూర్ణము.

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

Cl. No. 294.5925 Acc. No. 29105
M25M

DATE DUE

DURATION OF LOAN—Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

UNIVERSITY OF HYDERABAD, LIBRARY

T Acc. No. 29105

Call No. 294.5925 M32M

Author మాలక

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

Help to keep the book fresh and clean